# పదునైన ఆయుధం...
# ప్రాణానికి ఔషధం...

### చరిత్రాత్మక వైద్య నిపుణులు డా. పిగిలం శ్యామా ప్రసాద్ జీవిత చరిత్ర



డా. అరవింద్ యాదవ్

# పదునైన ఆయుధం... ప్రాణానికి ఔషధం...

**చరిత్రాత్మక వైద్య నిపుణులు డా. పిగిలం శ్యామా ప్రసాద్ జీవిత చరిత్ర**

**మొదటి ముద్రణ:**
ఏప్రిల్, 2022

© **కాపీరైట్స్:**
డా. అరవింద్ యాదవ్

**పబ్లిషర్:**
డా. అరవింద్ యాదవ్

**బుక్ డిజైనింగ్:**
వెన్నా కాశిరెడ్డి
సుమతీ డిజైన్స్, డి.డి. కాలనీ, హైదరాబాద్.
సెల్: 9652 320 538
sumathidesigns311@gmail.com

**ప్రింటింగ్:**
సాయి రత్న ప్రింట్స్,
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500082
సెల్: 9701 466 492

**పుస్తకం వెల:**
రూ. 710/-



## దివంగత మిత్రుడు హరిహరన్‌కు అంకితం..

హైస్కూలు రోజుల్లో హరిహరన్‌తో స్నేహం మొదలైంది. ఇద్దరిదీ ఒకే తరగతి.. కానీ మా గదులు, విభాగాలు వేరు. క్రికెట్ ఆట మా ఇద్దరినీ కలిపింది. స్కూల్ రోజుల నుంచే మా స్నేహబంధం రోజురోజుకూ బలపడుతూ వచ్చింది. ఉన్నట్టుండి ఇంటర్‌లో ఒకరికొకరం దూరంగా వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని డిగ్రీ కాలేజీ మా ఇద్దరినీ మళ్లీ క్లాస్‌మేట్స్‌గా కలిపేలా చేసింది. ఇద్దరం కలిసి ఎన్నో విషయాలను పంచుకునే వాళ్లం. ప్రేమ, స్నేహం, సంబంధాలు, సమాజం, జీవితం, తత్వజ్ఞానం, ఆటలు, రాజకీయాలు, వర్తమానం, భవిష్యత్.. ఇలా కాదేదీ అనర్హం అనే రీతిలో ప్రతి అంశంపై మాట్లాడుకునే వాళ్లం. అతనికి నేనొక ప్రియమైన, నిజమైన స్నేహితుడిని. కాలేజీ రోజుల్లోనే సైన్యంలో చేరడం కోసం సవాళ్లకు సిద్ధమయ్యాడు హరిహరన్. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షకు తీవ్రంగా కష్టపడ్డాడు. ఆ కష్టానికి తగ్గ ఫలితం కూడా వచ్చింది. సైన్యంలో అధికారిగా నియమించబడ్డాడు. దేశ సంక్షేమం కోసం తనను తాను అంకితం చేసుకున్నాడు.

నేను డిగ్రీ పూర్తి చేసిన తరువాత లెక్చరర్‌గా స్థిరపడ్డాను. గచ్చిబౌలిలోని కేంద్రీయ విద్యాలయంలో లెక్చరర్‌గా ఏడాదిపాటు సేవలందించిన తర్వాత జర్నలిజం రంగాన్ని ఎంచుకున్నాను. మా కెరీర్‌లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, మేము మాత్రం టచ్‌లోనే ఉండేవాళ్లం. వృత్తిపరంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేశాం. హరిహరన్ కొన్ని నెలలు దేశ రక్షణ కోసం కార్గిల్‌లో విధులు నిర్వహించాడు. తను సెలవులకి హైదరాబాద్ వచ్చినప్పుడల్లా మేమిద్దరం కలిసేవాళ్లం. ఒకప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ.. గంటల తరబడి

మాట్లాడుకునేవాళ్లం. ఉన్నట్టుండి నా గుండె బద్దలయ్యే వార్త ఒకటి చెప్పుకున్నాడు. తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు చెప్పగానే నా నోట మాట రాలేదు. ఆ క్షణంలో ఎలా స్పందించాలో కూడా తెలియలేదు నాకు. మెదడు మొద్దుబారినట్టు అనిపించింది. మరింత బాధాకరమైన విషయం ఏంటంటే.. తనలోని క్యాన్సర్ గురించి చెప్పే నాటికే అతను అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాడు. గడిచే క్షణాలన్నీ హరిహరన్‌ను నాకు దూరం చేస్తాయని గుర్తొచ్చే ప్రతిక్షణం నా హృదయం ద్రవించిపోయేది. మంచి ఎత్తు, బలిష్టమైన శరీరం, ఎప్పుడూ ఫిట్‌గా ఉండే హరిహరన్‌కు క్యాన్సర్ రావడం ఏంటి అనే ప్రశ్న నన్ను దహించివేసేది. చికిత్స సమయంలో కూడా హరిహరన్, నేనూ చాలాసార్లు కలిశాం. తను త్వరలో ఈ లోకాన్ని వీడతాడని తెలిసి అప్రయత్నంగానే కంటి నుంచి ధారలు కారేవి. తుది శ్వాస విడిచే వరకు తోడై ఉంటానని చెప్పడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నాది. కాని, ఆ సమయంలో హరిహరన్ ఓ మాట చెప్పాడు. చనిపోయే సమయంలో తన పట్ల సానుభూతిని చూడలేనని, తాను మరణించిన బాధను ఎవరి కళ్లలోనూ చూడదలచుకోలేదని చెప్పాడు. బంధువులు, స్నేహితులు తన ముందే ఏడుస్తుంటే ఆ బాధ భరించలేనని చివరి మాటగా చెప్పుకున్నాడు. చివరికి హరిహరన్ కోరుకున్నట్లే జరిగింది. ఆయన తుది శ్వాస విడిచే సమయానికి వైద్యులు, నర్సులు తప్ప ఎవరూ లేరు. అతని పరిచయస్తులు, కుటుంబ సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. తాను ఓ ఒంటరిగా కన్నుమూశాడు. అలా నా ప్రియమైన స్నేహితుడిని కోల్పోయాను. అలాంటి స్నేహితుడు ఉండడం నిజంగా నాకు దొరికిన వరం. హరిహరన్ మృతితో ఒక విశ్వసనీయమైన స్నేహితుడిని కోల్పోయాను. ఈ జగత్తులో.. తనకున్న పరిచయాల్లో.. నన్ను ఒక నిజమైన స్నేహితుడిగా భావించాడు. అందుకే, హరిహరన్ నా జ్ఞాపకాల్లో సదా బందీ అయిపోయాడు. ఇప్పటికీ తనను చాలా చాలా మిస్ అవుతున్నాను. కాలం గడిచేకొద్దీ చాలా మంది స్నేహితులు ఎదురయ్యారు. కానీ హరిహరన్ లాంటి వ్యక్తి మాత్రం ఇప్పటి వరకు నాకు తారస పడలేదు. మిస్ యూ ఫ్రెండ్.

# ప్రత్యేక కృతజ్ఞతలు

గిన్ని రమేష్ బాబు

అడబాల రాము

వెన్నా కాశిరెడ్డి

మిట్టగడపల రత్న కుమార్

రత్నపురపు శ్రీనివాస్ (రత్నశ్రీ)

# విషయ సూచిక


1. నిశ్శబ్ద విప్లవం: గ్రామీణ యాదవ జాతిలో ఉద్భవించిన శస్త్ర వైద్య కిరణం 01

2. ద్రవిడ నేలపై హిందుత్వ ఉన్నతికై పోరాటం 36

3. తండ్రి సిద్ధాంతాలే ప్రేరణగా వైద్యవృత్తి చేపడతానని శ్యామా ప్రసాద్ ప్రమాణం 63

4. సహోదరులలో మేరునగధీరుడు శ్యామా ప్రసాద్ 92

5. చికిత్సలలో మెళకువలు, వైద్యశాస్త్రంపై తిరుగులేని పట్టు కోసం అధ్యయనం 106

6. జనరల్ సర్జరీపై తిరుగులేని పట్టు 138

7. ఆపరేషన్ థియటర్లో నిలిచిన ఎన్నో ప్రాణాలు 195

8. దేవ గురువు సత్యసాయి బోధనలే ప్రేరణగా సేవ 217

9. వైద్య సేవల అభివృద్ధి కోసమే జీవితం అంకితం 243

## ఒక వైద్యుడి జీవిత విశేషాలు కాదు, నూరేళ్ల తెలుగు చరిత్రకు ప్రతిబింబం



డాక్టర్ శ్యామా ప్రసాద్ పిలిగం జీవిత చరిత్రగా వెలువడిన ఈ పుస్తకం దాదాపు నూరేళ్ల తెలుగు చరిత్రకు అద్దంపడుతోంది. ఎన్టీఆర్ ఆరోగ్యశాస్త్రాల విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్యామా ప్రసాద్, ఆయన తండ్రి డాక్టర్ పి.సుందరయ్యగారి జీవితవిశేషాలు మాత్రమే ఉంటాయనుకున్న గ్రంథంలో తెలుగునాట చెరగని ముద్రవేసిన ఎన్నెన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలను కళ్లకుకట్టారు రచయిత అరవింద్ యాదవ్. ఆధునిక ప్రపంచాన్ని కుదిపేసిన రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో పుట్టారు డాక్టర్ సుందరయ్య. డాక్టర్‌గా కొన్ని వేల మందికే తెలిసిన ఆయన రాజకీయ విశ్వాసాలు, ఆచరణ వంటి విశేషాలతోపాటు నెల్లూరు జిల్లా నుంచి నాటి మద్రాసు మహానగరానికి, అక్కడి నుంచి వృత్తిలో భాగంగా ఉత్తరాంధ్ర నగరం విశాఖపట్నం వరకూ సాగిన ఆయన ప్రయాణం పాఠకులకు సమకాలీన విషయాల అవగాహనకు ఉపకరిస్తుంది.

డా.శ్యామా ప్రసాద్ బయోగ్రఫీ తెలుగు అనువాదానికి పరిచయ వాక్యాలు రాయాలని మిత్రుడు డాక్టర్ అరవింద్ యాదవ్ గారు అడగగానే అందుకు వెంటనే ఒప్పుకున్నాను. పేరుప్రఖ్యాతులున్న వైద్యుల కుటుంబంలో పుట్టిన శ్యామా ప్రసాద్ గారి గురించి ఎంత ఉందో అంత కన్నా ఎక్కువ వివరాలు ఆయన తండ్రి సుందరయ్యగారి గురించి రాయడం ఈ పుస్తకానికి అదనపు విలువనిచ్చింది. తెలుగు సమాజం తెలుసుకోవాల్సిన అనేక ముఖ్య చారిత్రక ఘట్టాలను ఈ గ్రంథం పూసగుచ్చినట్టు చెప్పింది. ఉమ్మడి మద్రాసు ప్రావిన్స్ రాజధాని చెన్నపట్నానికి సమీపాన ఉన్న జిల్లాగా నెల్లూరు మిగిలిన కోస్తా, రాయలసీమ జిల్లాల కన్నా అనేక రంగాల్లో తన ఆధిపత్యం స్వాతంత్ర్యం వచ్చాక కూడా కొన్ని దశాబ్దాలు కొనసాగించింది. ఈ సాగరతీర జిల్లా మూలాలున్న పొట్టి శ్రీరాములు గారు మొదటి తెలుగు రాష్ట్ర ఆవిర్భావానికి కారకుడైన విషయం నేడు చరిత్రలో భాగం. 1953 అక్టోబర్ ఒకటిన ఆంధ్ర రాష్ట్ర

పుట్టుకకు ముందు మూడొందల సంవత్సరాల నుంచే మద్రాసు నగరంలో తెలుగువారి ఉనికి, వారి కీర్తి అందరికీ తెలిసినవే. తెలుగువారికి అన్ని విధాలా పనికొచ్చే అచ్చ తెలుగు సంస్కృతికి కేంద్రమైన 'సొంత' నగరం ఏదీ లేని రోజుల్లో – చెన్నపట్నమే చదువు, వ్యాపారాలు, ఇతర అవసరాలకు దిక్కయిన రోజుల గురించి అరవింద్ గారు చక్కగా వివరించారు. ఇంజనీరింగ్‌లో డిప్లమా సైతం చెన్నై గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో చదివే అవకాశాలున్న కాలం గురించి చెబితే విన్నాను. ఈ బయోగ్రఫీ చదివాక ఇతర విషయాలూ తెలిశాయి. వైద్యవిద్య కోసం మద్రాసు వెళ్లిన పిలిగం సుందరయ్యగారు అక్కడ గడిపిన రోజులు పుస్తకంలో ఆకట్టుకునే అంశాలు. ఈ తరం వారికి ఎన్నెన్నో ఆసక్తికరవిషయాలు ఇలా మధ్యమధ్యలో చెబుతూ అరవింద్ గారు ఈ పుస్తకాన్ని రూపొందించారు. దీన్ని చదువుతుంటే – కొత్త దారిన నడుస్తున్నట్టనిపించింది.

ఈ పుస్తకం చదువుతున్నంత సేపూ నెల్లూరు, మద్రాసు, విశాఖపట్నం ప్రాంతాలలో తిరుగుతున్న భావం కలుగుతుంది. సామాజికంగా, విద్యపరంగా వెనుకబడిన కులంలో పుట్టినాగాని డాక్టర్ కావాలనే ఆకాంక్ష సుందరయ్యగారిని ఎలా ముందుకు నడిపించిందీ ఈ గ్రంథం ఓ బయోపిక్ మాదిరిగా చూపిస్తుంది. ఆయన కుటుంబ సభ్యుడైన శ్యామా ప్రసాద్‌గారు వైద్యరంగంలో అత్యున్నత స్థాయికి చిహ్నంగా భావించే వైద్య, ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఎదడానికి ఉన్న సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషించడం ఈ పుస్తకం ప్రత్యేకత. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో బాగా అభివృద్ధి చెందిన జనం ఉన్న జిల్లాగా బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకున్న నెల్లూరులో సైతం ప్రజలు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు చదువుకుని పైకి రావడానికి నూరేళ్ల క్రితం ఎంత కష్టమో శ్యామా ప్రసాద్ గారి కుటుంబ నేపథ్యం వెల్లడిస్తోంది. ఈ సందర్భంగా పాత విషయం ఒకటి గుర్తుకొచ్చింది. నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా అని పేరు పెట్టాలని 2008లో నిర్ణయం తీసుకున్నారు. చివరికి పాత పేరు తీసేయకుండా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (ఎస్పీఎస్ నెల్లూరు) అని ఖాయం చేశారు. దీనికి కారణం – మంచి బియ్యానికి, చదువుకున్న మేధావులు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి గొప్ప రాజకీయ నాయకులకు పుట్టినిల్లయిన నెల్లూరు బ్రాండ్ వాల్యూను కొనసాగించాలనే

ఉద్దేశమని దాదాపు 14 ఏళ్ల కిందట ప్రభుత్వం వివరించింది. 1960ల నుంచి 1980ల వరకూ నెల్లూరు జిల్లా అంటే ప్రాజెక్టుల నిర్మాణరంగంలో కీలకపాత్ర పోషించే కాంట్రాక్టర్లు మాత్రమే గుర్తొచ్చేవారు. తర్వాత కాలంలో ఇతర జిల్లాల నుంచి చట్టసభలకు ఎన్నికయ్యే రాజకీయ నాయకులు, హైదరాబాద్ నగరం చుట్టూ ఔషధాల పరిశ్రమ అభివృద్ధికి కారకులైన నెల్లూరువాసులు ఈ జిల్లా పేరుప్రఖ్యాతులు విస్తరించడానికి కారకులయ్యారు. అయితే, ఇలా నెల్లూరు నేల నుంచి పైకొచ్చిన ప్రముఖుల్లో కేవలం రెడ్డి కులస్తులే కాదు, బీసీ కుటుంబ నేపథ్యం ఉన్నవారు కూడా ఉన్నారని డాక్టర్ సుందరయ్య, శ్యామా ప్రసాద్ గారితో పాటు ఇతర నగరాలకు వెళ్లి రాజకీయంగా ఎదుగుతున్న నాయకులు కూడా నేడు నిరూపిస్తున్నారు. డాక్టర్ అరవింద్ యాదవ్ ఎంతో పరిశోధనతో అనేక విషయాలు సేకరించి రాసిన ఈ విలువైన పుస్తకం నెల్లూరు జిల్లా, ఇద్దరు మంచి వైద్యుల గురించేగాక తెలుగు, తమిళ ప్రాంతాలు, డెబ్బయి ఏళ్లనాటి రాజకీయ, సామాజిక విషయాల ప్రాధాన్యం వివరిస్తోంది. ఒక డాక్టర్ జీవిత విశేషాల పేరుతో రచయిత ఆధునిక తెలుగు సమాజం పునాదులను క్లుప్తంగా చెప్పిన తీరు ఆసక్తిదాయకం. నెల్లూరులో మొదలైన ప్రయాణం విశాఖపట్నంలో ఆగకుండా విజయవాడకు ఎలా చేరుకుందో తెలుసుకోవాలంటే అరవింద్ యాదవ్ గారు రాసిన ఈ పుస్తకం చదవాల్సిందే.

**నాంచారయ్య మెరుగుమాల**

**సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ మరియు పొలిటికల్ అనలిస్ట్**

**ఉప్పరపల్లి, హైదరాబాద్**

**మార్చి 3, 2022.**

## శుభాశీస్సులు



'ఏ మాస్టర్ సర్జన్ ఇన్ లవ్ విత్ హ్యూమానిటీ' అనే పుస్తకం విఖ్యాత వైద్య వృత్తి నిపుణులైన డాక్టర్ పిగిలం శ్యామా ప్రసాద్ S/O డాక్టర్ సుందరయ్య గారి జీవిత చరిత్ర. ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్‌గా తెలుగు రాష్ట్ర ప్రజలకు సుపరిచితులు. దేశంలోని ప్రముఖ వైద్యులకు సైతం పరిచయమున్న పేరు. ఓ ఉపాధ్యాయుడిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య విద్య విభాగానికి మాజీ డైరెక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ పరిచయం అక్కర్లేని పేరే అయినప్పటికీ.. ఆయన గురించి క్లుప్తంగా చెప్పాలంటే తన తోబుట్టువులలో ఈయనే పెద్దవ్యక్తి, తెలివైన వ్యక్తి కూడా. 1977లో శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో MBBS పూర్తి చేశారు. మెడిసిన్‌లో చేరినప్పుడే జనరల్ సర్జన్ కావాలనే లక్ష్యం పెట్టుకున్నారు. దాని తగ్గట్టుగా 1978లో శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీలో ఎం.ఎస్. కోర్సులో చేరారు. 1982లో 'మాస్టర్స్ ఆఫ్ సర్జరీ' పట్టా సంపాదించారు. అంతటితో ఆగకుండా సర్జరీలో సూపర్ స్పెషాలిటీ కోర్స్ చేయాలనుకున్నారు. అందుకోసం సర్జరీల్లోనే ప్రత్యేక కోర్సుగా పేరున్న 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియే' కోసం ప్రవేశ పరీక్ష రాశారు. ఆ తరువాత ఆంధ్రా మెడికల్ కాలేజీలో పీడియాట్రిక్ సర్జరీలో ఎం.సి.హెచ్‌గా జాయిన్ అయ్యారు. ఈ కోర్సు చేస్తున్నప్పుడు ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో మాత్రమే శిక్షణ తీసుకోడానికి పరిమితం కాకుండా.. దేశంలోని ప్రముఖ ఆస్పత్రుల్లోని ప్రముఖ సర్జన్ల వద్ద కూడా ట్రైనింగ్ తీసుకున్నారు. వారి నుంచి ఎన్నో మెళకువలు నేర్చుకున్నారు. మద్రాస్, బెంగళూరు, ఢిల్లీ, ఛండీగఢ్, బాంబే, కోల్‌కతా, హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాల్లోని వైద్య నిపుణుల వద్ద ఎంతో విలువైన జ్ఞానాన్ని కూడా ఆర్జించారు. ఈ శిక్షణలో నైపుణ్యాలతో పాటు ఎంతటి క్లిష్టమైన ఆపరేషన్‌నైనా సమర్థంగా నిర్వహించగల నేర్పుని, విశ్వాసాన్ని కూడా సంపాదించారు. విశాఖపట్నం తిరిగి వచ్చాక పెద్ద పెద్ద, సంక్లిష్టమైన

సర్జరీలను సైతం అలవోకగా నిర్వహించారు. 1989లో మాస్టర్ ఆఫ్ చిరుర్గియే డిగ్రీని కూడా అందుకున్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ 2014లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి “ఎంబిఎ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్” డిగ్రీని పొందారు. అంతేకాదు, రొమ్ము క్యాన్సర్‌పై హ్యూమన్ జెనెటిక్స్‌లో పరిశోధనకు 2019లో పీహెచ్‌డీ కూడా ప్రదానం చేశారు. ఇక సర్వీస్ మొదలైనప్పటి నుంచి కొన్ని వేల మంది రోగులకు సేవలు అందించారు. వేల సంఖ్యలో సర్జరీలు చేసి, రోగుల జబ్బులను నయం చేశారు. అలా ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టారు. అంతేకాదు, వైద్య విద్యార్థులకు సర్జరీల్లో మెళకువలు నేర్పించి, ఎంతోమందిని నిపుణులైన సర్జన్లుగా తయారుచేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన సెమినార్లు, వర్క్ షాపులకు వెళ్లి తన అనుభవాన్ని ప్రముఖ సర్జన్లు, ఫిజిషియన్లతో పంచుకున్నారు. సర్జన్‌గా ఉంటూనే అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు కూడా భుజాన మోశారు. అందులో భాగంగా కింగ్ జార్జ్ హాస్పిటల్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. శ్యామా ప్రసాద్ చేసిన మరో ముఖ్యమైన పని.. మనిషి రోగాలు, నయం చేసే పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించడం. సమాజసేవకు అంకితం అవ్వాలనే స్ఫూర్తిని నింపుతూ ఎంతో మందిని చైతన్యపరిచారు. అంతేకాదు, అన్నింటికంటే ముఖ్యంగా కొన్ని వందల మంది పేదలకు అన్ని విధాలుగా సాయం అందించారు. రోగులకు తక్కువ ధరకే మందులు అందించేందుకు ‘జీవంధార’ అనే పథకాన్ని ప్రారంభించారు. రోగులకు, వారి కుటుంబ సభ్యులకు తక్కువ ధరకు, నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ‘సుభోజనం’ పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించారు. వ్యాధి మిత్ర అనే పేరుతో ఒక ప్రత్యేకమైన పథకాన్ని సైతం ప్రారంభించారు. వ్యాధి మిత్ర పథకం అమలు కోసం కొందరు యువకులను నియమించి, వారి ద్వారా రోగులకు, వారి కుటుంబ సభ్యులకు సాధ్యమైనంత సహాయం అందేలా చేశారు.

2015లో శ్యామా ప్రసాద్ తన ప్రభుత్వ ఉద్యోగానికి పదవీ విరమణ చేశారు. శ్యామా ప్రసాద్ సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. 2020 జనవరిలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా

నియమించింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా శ్యామా ప్రసాద్ ఎన్నో విశిష్టమైన పనులు చేస్తున్నారు. వైద్య విద్యా విధానంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. యూనివర్సిటీ రీసెర్చ్ వర్క్‌కు సంబంధించి క్వార్టర్లీ జనరల్‌ను తీసుకురావడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా చురుకైన పాత్ర పోషించినందుకు, ఉత్తమ వైస్ ఛాన్సలర్‌గా గోల్డెన్ ఎయిమ్ కాన్ఫరెన్స్ అవార్డును అందుకున్నారు. వైద్య విద్యలో చూపించిన నైపుణ్యానికి, నాయకత్వం లక్షణాలకు గాను ఎన్నో అవార్డులు కూడా గెలుచుకున్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ గారి జీవిత చరిత్రను వివిధ భాషల్లో పుస్తకంగా తీసుకొచ్చేందుకు కృషి చేసిన డాక్టర్ అరవింద్ యాదవ్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. డాక్టర్ శ్యామా ప్రసాద్ గారి జీవిత విశేషాలు ఎంతో మంది యువ వైద్యుల్లో స్ఫూర్తి నింపుతాయని, వారి కెరియర్ పై సానుకూల ప్రభావం చూపుతాయని ఖచ్చితంగా చెప్పగలను. అంతేకాదు, వైద్య విద్యా వ్యవస్థలో ఓ సమగ్రమైన అభివృద్ధిని తీసుకురావడానికి, మనదేశంలో హెల్త్ కేర్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి కూడా ఈ పుస్తకం ఉపయోగపడుతుందని నా నమ్మకం. ఈ పుస్తకం విజయవంతం అవుతుందని, భవిష్యత్తులో చేసే ఇలాంటి ప్రయత్నాలకు కూడా విజయాలు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

**– డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి,**

**ఛైర్మన్ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు**

**AIG హాస్పిటల్స్, హైదరాబాద్**

# ముందుమాట

విప్లవకారులు, సంఘ సంస్కర్తల కథలను మనిషి మరిచిపోవచ్చు. అందుకు ఎన్నో కారణాలూ ఉండొచ్చు. నిజానికి మహావీరుల ఆవిర్భావం గొప్ప విప్లవకారులు, సంఘ సంస్కర్తలు అని చెప్పుకునే వారి కథలను కూడా తుడిచిపెట్టేస్తుంది. మహానుభావుల జననం అలాంటి వారి కథలన్నీ కాలగర్భంలో కలిసిపోయేలా చేశాయి కూడా.

ఒక విప్లవాన్ని విజయతీరానికి చేర్చడానికి ఎంతోమంది రక్తం ధారపోస్తారు. కొంతమంది వీరులు తమ పూర్తి బలాన్ని, ధృడ సంకల్పాన్ని ప్రదర్శిస్తారు. ఎన్నో కష్టాలకోర్చి విజయం సాధిస్తారు. వారిలో కొందరు మాత్రమే తమ మేథస్సుకు పని చెప్పి.. తెలివితేటలు ఉపయోగించి వ్యూహాలు రచిస్తుంటారు. కాని, ఒక విప్లవ కథను రాసేప్పుడు ఎంతోమంది మహావీరుల కథలు అందులో అంతర్లీనంగా కనిపిస్తుంటాయి. అలాంటి వారి కథలకే ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. చరిత్రపుటల్లో అలాంటి వారి కథలే ప్రాచుర్యంలో ఉంటాయి. విప్లవాన్ని విజయవంతం చేసేందుకు ప్రాణాలను అర్పించిన ఎందరో యోధుల కథలు కూడా ఒక్కోసారి మరుగునపడిపోతుంటాయి. అలా ఎంతో మంది అమరవీరుల పేర్లు చరిత్ర పుటల్లో సైతం నమోదు కాలేదు. ఎందరిలోనో స్ఫూర్తి నింపి, ఆదర్శంగా నిలిచిన వీరుల కథలు పుస్తకాలుగా ప్రచురితం అయ్యాయి. కాని, ఏ విప్లవం కోసమైతే తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారో అలాంటి కొందరి మహావీరుల కథలు మాత్రం పుస్తకాల రూపంలో తీసుకురాలేదు. నిజానికి ఓ విప్లవం పుట్టుకొచ్చే సమయంలోనే ఓ మహావీరుడు సైతం ఆవిర్భవిస్తాడన్నది కాదనలేని సత్యం. ఆ వీరులే భవిష్యత్ తరాల విప్లవకారులకు సైతం మార్గదర్శకంగా నిలుస్తారు. సామాన్యులు ఎప్పుడూ నాయకుడినే అనుసరిస్తుంటారు. కాని, కొన్ని సందర్భాల్లో ఆ సామాన్య వ్యక్తులే నాయకుడిని సరైన మార్గంలో నడిపిస్తుంటారు. విచారకరం ఏంటంటే.. అలాంటి సామాన్యులు నాయకుడిని తెరపైకి తీసుకొస్తారు తప్ప వారు మాత్రం ఎన్నటికీ వెలుగులోకి రారు. ఇంకా బాధాకరమైన విషయం ఏంటంటే.. ఎంతో గొప్పగా వర్ణించే అలాంటి కథలలో, ఆ సాధారణ వ్యక్తి పడ్డ కష్టం, చూపించిన

తెగువ మరుగునపడిపోతాయి. కేవలం ఆ కథలలోని మహావీరులకు మాత్రమే విప్లవ ఘనత, అనంత కీర్తి దక్కుతుంది. ఇలాంటి ఉదాహరణలు ఒకట్రెండు కాదు. చరిత్ర తిరగేస్తే చాలానే ఉండుంటాయి. ప్రతిసారీ ఈ సామాన్యుడే అసామాన్య రీతిలో కొత్త మార్గాన్ని చూపుతూ మరికొందరిని నాయకులుగా తయారుచేస్తుంటారు. ఎంతోమందిని విప్లవకారులుగా, మహావీరులుగా తీర్చిదిద్దుతుంటారు. కాని, ఆ సామాన్యుడి కథ, కష్టం మాత్రం మరుగున పడిపోతుంటుంది. పిగిలం సుందరయ్య, ఆయన కుమారుడు శ్యామా ప్రసాద్ కూడా ఎంతో మందికి కొత్త జీవితాలు, ఉన్నతమైన జీవితాలను అందించారు. ఎంతోమంది తమ వృత్తిలో రాణించేందుకు ఎన్నో సహాయ సహకరాలు అందించారు. అంతేకాదు, సామాజికంగా, రాజకీయంగా ప్రధానమైన మార్పులు తీసుకురావడంలో చెప్పుకోదగిన పాత్ర పోషించారు.

శ్యామా ప్రసాద్ తండ్రి సుందరయ్య కథ కూడా చాలా ఆసక్తిగా ఉంటుంది. అవసరమైతే సంప్రదాయాల అడ్డుగోడలను కూల్చివేయాలనే తత్వం ఆయనది. అలాగే ముందుకు సాగారు కూడా. ఆ రోజుల్లో యాదవ సామాజికవర్గం వారి పని ఒక్కటే. చేతిలో కర్రలు పట్టుకుని ఆవులు, గేదెలు, మేకలు మేపుతూ పొలాల వెంట తిరుగుతూ పాల వ్యాపారంలో మునిగితేలడమే ఆ రోజుల్లో ఉండే సంప్రదాయం. కాని, అలాంటి వాటికే పరిమితం కాకూడదని, కష్టపడి చదివి డాక్టర్ అయ్యారు. యాదవ వర్గానికి చెందిన వాళ్లంటే ఆ రోజుల్లో ఎన్నో పరిమితులు, కట్టుబాట్లు ఉండేవి. సమాజంలో పెద్దగా విలువ ఇచ్చే వాళ్లు కాదు. ఆనాటి భారతం కులం అనే కుంపట్లలో రగిలిపోతుండేది. అలాంటి సమయంలోనే మార్పు అనే వెలుగు రేఖలు ప్రసరించడం కూడా మొదలయ్యాయి. మేకలు, ఆవులు కాయడం కాదు.. చేతిలో పలక, బలపం ఉండాలంటూ చదువుకోవడం మొదలుపెట్టారు. సమాజంలో మార్పు రావాలంటే ఎవరో ఒకరు ముందడుగు వేయాలి. ఆ మొదటి అడుగు సుందరయ్యదే అయింది. సమాజంలోని అడ్డంకులను, అణచివేతను కూలదోస్తూ.. ఏకంగా ప్రాణాలు నిలిపే వైద్యుడిగా ఎదిగారు. సమాజ అసమానతలను అధిగమించి జిల్లాలోనే ఒక వెనుకబడిన వర్గం నుంచి డాక్టర్ అయిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఆవులు, గేదెలు, మేకలను

మేపడానికి చెట్టు కొమ్మల కొట్టే బదులు.. చేతిలో స్టెతస్కోప్ పట్టి ప్రజలకు చికిత్స చేయడానికి బయల్దేరారు సుందరయ్య. ఎన్నో శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేసి రోగాలను నయం చేశారు. సుందరయ్య నడవడిక కూడా ఎంతో వివేకవంతంగా ఉంటుందన్న ముద్ర వేయించుకున్నారు. వైద్య ఉపాధ్యాయుడిగా అనేక మంది వైద్యులు, సర్జన్లను తయారుచేశారు. జ్ఞానం, తెలివితేటలు ఏ ఒక్కరి సొంతమో కాదని, వారసత్వంగా ఒక వర్గానికే చెందినది కాదని సుందరయ్య సాధించిన విజయం నిరూపించి చూపించింది. ఫలానా వర్ణం వాళ్లు ఫలానా పనే చేయాలి అనే అడ్డుగోడలను కూల్చారు. ఎవరికైనా సరే విద్య అనే ఆయుధం చేతికందిస్తే.. సామాజిక కట్టుబాట్లు, ఆర్థిక వెనకబాటుతనాన్ని తెగనరికి వైద్యుడిగా, ఇంజనీర్‌గా, శాస్త్రవేత్తగా ఎదగొచ్చని చూపించి పది మందికి ఆదర్శంగా నిలిచారు. సుందరయ్య విజయం అక్కడితోనే ఆగిపోలేదు. అది చాలా మందికి ప్రేరణగా నిలిచింది. ఆయనే ఓ మార్గదర్శకుడిగా నిలిచారు. చాలా మంది వ్యక్తులు సుందరయ్య నుంచి ప్రేరణ పొంది, సమాజ, వ్యక్తిగత అభ్యున్నతిని అడ్డుకుంటున్న సంప్రదాయాలను విచ్ఛిన్నం చేయడానికి బయలుదేరారు. బానిసత్వం, బందీల నుంచి విముక్తి పొందారు. సుందరయ్య సాధిస్తున్న విజయాలను చూసి, సమాజంలో దొరుకుతున్న గౌరవ మర్యాదలు కేవలం విద్య వల్లనే అని తెలుసుకున్న ఆయన నలుగురు పిల్లలు కూడా డాక్టర్లు అవ్వాలనుకున్నారు. సుందరయ్య ఇద్దరు కుమారులు శ్యామా ప్రసాద్, గోపీకృష్ణ, కూతుళ్లు మైథిలి, శోభ తమ లక్ష్యానికి తగ్గట్టుగా డాక్టర్లయ్యారు. అలా సుందరయ్యతో సహా వారి కుటుంబం మొత్తం వైద్య వృత్తిని సాగిస్తూ జీవితాంతం ప్రజాసేవకే అంకితం అయ్యారు. నలుగురూ తమ జీవితంలో ఎనలేని విజయాలు సాధించారు. వైద్య వృత్తిని తమ కర్తవ్యంగా భావించి ఎప్పుడూ ముందుండే వారు.

శ్యామా ప్రసాద్ గురించి చెప్పాలంటే.. ఇతర సర్జన్లు చేయలేక వదిలేసిన ఎన్నో ఆపరేషన్లను విజయవంతంగా పూర్తిచేశారు. అత్యంత విషమ పరిస్థితుల్లో ఆస్పత్రులకు వచ్చిన వారికి, ఆపరేషన్ చేయకపోతే ప్రాణాలు పోతాయనే పరిస్థితుల్లో ఉన్న వారికి వైద్యం అందించి వారి ప్రాణాలు నిలబెట్టారు. ఒక్కోసారి సర్జరీల ఫలితం వేరేగా ఉండొచ్చు. కొత్త సమస్యలు ఎదురు కావొచ్చు. లేదా

ప్రాణాలు పోవచ్చు కూడా. చాలా సందర్భాల్లో ప్రాణం నిలపాలంటే ఆపరేషన్ తప్ప మరో అవకాశమే ఉండదు. అలాంటి సందర్భంల్లో ఎంతటి వైద్యులైనా రిస్క్ తీసుకోక తప్పదు. ఒక్కోసారి ఆ రిస్క్ తాలూకు లోతు తెలియకపోయినా సరే.. పేషెంట్ ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో ముందడుగు వేసేవారు. అలాంటి ఛాలెంజెస్ స్వీకరించారు కాబట్టే.. ఎందరి ప్రాణాలనో నిలబెట్టగలిగారు. అలా ఎన్నో చెప్పుకోదగిన ఆపరేషన్స్ నిర్వహించారు. క్రమంగా శ్యామా ప్రసాద్ కోరుకున్నట్టుగా సొంతంగా ఓ ఆస్పత్రి నిర్మించుకున్నారు. శ్యామా ప్రసాద్‌కు ఆనాడు ఉన్న పేరు ప్రతిష్టలు, నైపుణ్యానికి విదేశాల్లో స్థిరపడొచ్చు. బోలెడంత సంపాదించుకోవచ్చు కూడా. కాని, వైద్య వృత్తి అంటే సంపాదనా మార్గంగా చూడలేదు. వారి తండ్రి అడుగుజాడల్లోనే నడిచారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదవారికి వైద్యం సేవలు అందించడమే పరమావధి అనుకున్నారు. తన ప్రైవేట్ ప్రాక్టీస్‌లోనూ ఎంతోమంది నిరుపేదలకు ఉచితంగానే వైద్య సేవలు అందించారు. వైద్య సేవలతో పాటు క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధులను నివారించే విధానాలను బోధించేవారు. అందుకోసం పలు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక మార్పుకు సుందరయ్య, శ్యామా ప్రసాద్ నాంది పలికారు. దళిత, వెనుకబడిన కులాల యువత తమ పూర్వీకుల వృత్తికి మించి ఆలోచించడం ప్రారంభించారు. కొన్ని కులాల వారికే పరిమితం, అది వారి హక్కుగా భావించిన వృత్తులను సైతం చేపట్టడం మొదలుపెట్టారు. యాదవ కులానికి చెందిన యువకులే కాదు, ఇతర వెనుకబడిన కులాల వారు కూడా అభ్యున్నతి మార్గంలో పయనించారు. సుందరయ్య, శ్యామా ప్రసాద్‌లను తమ ఆరాధ్యదైవాలుగా భావించారు. ఈ ఇరువురిని స్ఫూర్తిగా తీసుకున్న యువత.. సామాజిక, ఆర్థిక బలాన్ని సంపాదించిన తర్వాత, ఇతరులకు సహాయం చేసి వారిని బలోపేతం చేయాలని కోరుకున్నారు. ఒక రకంగా చెప్పాలంటే కొత్త శకం మొదలైంది. సుందరయ్య, శ్యామా ప్రసాద్ సాధించిన విజయాలు.. వెనుకబడిన కులాల యువకులను వారు కోరుకున్న రంగాలవైపు నడిపించేంతటి స్ఫూర్తిని ఇచ్చాయి. ఎంతోమంది యువతలో ప్రోత్సాహాన్ని

నింపాయి. విద్య అందరి హక్కు అని, పురోగతితోనే స్వేచ్ఛ అని వారి విజయాలు నిరూపించాయి. సమానత్వం, సౌభ్రాతృత్వం సహృద్భావమనే సూత్రాల ఆధారంగా ఎంతోమంది ముందుకు సాగారు.

ఒక నిర్మాణాత్మక విప్లవం అంటే ఏంటి, అది ఎలా మొదలవుతుందనేది శ్యామా ప్రసాద్ జీవిత చరిత్రను చదివితే అర్థమవుతుంది. ప్రతి ఒక్క వైద్యుని జీవితంలోని అన్వేషించని కోణాలను ఈ పుస్తకం స్పృశిస్తుందని, ఆ స్ఫూర్తిని అందిస్తుందని ఆశిస్తున్నాను.

**– డాక్టర్ అరవింద్ యాదవ్**

arvindjournalist@gmail.com

# అధ్యాయం - 1

# నిశ్శబ్ద విప్లవం:

# గ్రామీణ యాదవ జాతిలో ఉద్భవించిన శస్త్ర వైద్య కిరణం

శేషయ్య, అక్కమ్మకు మూడో సంతానం కలిగినప్పుడు ఆ విషయం కోవూరులో చర్చనీయాంశంగా మారింది. చర్చకు కారణం చాలా విశేషమైనది. రెండో సంతానం పుట్టిన ఇరవై సంవత్సరాల తర్వాత అక్కమ్మకు మూడో సంతాన భాగ్యం కలిగింది. ఇది మామూలు విషయం కాదు. పిల్లల మధ్య ఇరవై సంవత్సరాల తేడా అంటే చూడటానికి, వినడానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ఒక బిడ్డ పుట్టిన తర్వాత ఇరవై సంవత్సరాలకు మరొకరు జన్మించడమన్నది ఎంతో ప్రత్యేకత సంతరించుకున్న విషయం. ఇది 1930 నాటి మాట. ఆ రోజుల్లో అబ్బాయిలకు, అమ్మాయిలకు చిన్న వయస్సులోనే వివాహాలు జరిగేవి. బాల్యవివాహాలు ఆ రోజుల్లో సర్వసాధారణం. అబ్బాయి, అమ్మాయిలకు యుక్తవయస్సు వచ్చిందనగానే వివాహాలు జరిపించేవారు. శేషయ్య, అక్కమ్మకు మూడో బిడ్డ జన్మించక పూర్వమే ముందు పుట్టిన ఇద్దరు పిల్లల వివాహం జరిగింది. శేషయ్య కుమార్తె కూడా తల్లి అయింది. అటువంటి పరిస్థితుల్లో శేషయ్యకు మూడో సంతానంగా అబ్బాయి పుట్టాడు. ఆ అబ్బాయి పుట్టకముందే అతనికి మేనల్లుడు ఉన్నాడు. శేషయ్య, అక్కమ్మలకు 1930, జూలై 1న మూడో బిడ్డ జన్మించాడు.

భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం జోరుగా సాగుతున్న రోజులవి. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతీయులు యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్న సమయం అది.

భారతదేశంలో ఆ రోజుల్లో ముఖ్యంగా పల్లెలు, గ్రామీణ ప్రాంతాల్లో చదువులపై ప్రజలు అంతగా దృష్టి సారించేవారు కాదు. అప్పట్లో  పాఠశాలల సంఖ్య కూడా బాగా తక్కువే. కులవ్యవస్థ సమాజంలో బలంగా ఉండేది. ప్రతి కులానికి ఒక సాంప్రదాయ వృత్తి ఉండేది.

ఆనాటి హిందూ సమాజం నాలుగు వర్ణాలుగా ఉండేది – బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. హిందూ మతంలోని కులవ్యవస్థలో బ్రాహ్మణులది అత్యున్నత స్థానం. దేవాలయాలలో పూజలు చేయడం, యాగాలు చేయడం, ఆచారాలు చేయడం, ఆచారాలు పాటించడం, వేదాలు అధ్యయనం, బోధన బ్రాహ్మణుల పని. రెండో స్థానం క్షత్రియులది. పాలించడం, యుద్ధాలు చేయడం, రాజ్య ప్రజలను రక్షించడం క్షత్రియుల కర్తవ్యం. క్షత్రియ అంటే పాలకుడు, యోధుడు, నిర్వహకుడని అర్థం. వ్యాపార నిర్వహణ వైశ్యుల పని. రైతులు, వ్యాపారులు, దుకాణదారులు వైశ్యవర్ణంలో ఉంటారు. తక్కువగా భావించే పనులు చేసే వ్యక్తులు శూద్ర వర్ణంలో ఉండేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ప్రజలకు సేవ చేయడం శూద్రుల పని. ఒక విధంగా చెప్పాలంటే శూద్ర అంటే కూలీ అని అర్థం. మంగలి, చాకలి, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, సారంగులు, బోయ, గొర్రెల కాపర్లు, యాదవులు, బంజారా, దర్జీ, నేత పనులు చేసేవారిని శూద్రులుగా పరిగణించేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలు ఉన్నత కులాలు. శూద్రులు అంటే తక్కువ కులాలకు చెందినవారు.

శేషయ్య శూద్ర వర్ణానికి చెందినవాడు. వారిది యాదవ కులం. ఆయన వ్యవసాయం చేసుకుని బతికే సాధారణ రైతు. గొర్రెలు, మేకల పెంపకం కూడా ఉండేది. వాటితో వారి కుటుంబ జీవనం సాగేది.

శేషయ్యకు మొదటి సంతానం కుమార్తె. ఆమె పేరు రమణమ్మ. ఆమె పుట్టిన ఏడాదికి కొడుకు పుట్టాడు. అతనికి వెంకటసుబ్బయ్య అని పేరు పెట్టారు. తెలుగువారికి వేంకటేశ్వర స్వామి ఇలవేల్పు. ఆ స్వామి పేరు వచ్చేలా మొదటి కొడుకుకు శేషయ్య అని పేరు పెట్టారు.

వెంకటసుబ్బయ్య పుట్టిన తర్వాత చాలా ఏళ్లపాటు శేషయ్య, అక్కమ్మ దంపతులకు సంతానం కలగలేదు. కాని ఇరవై సంవత్సరాల తర్వాత అక్కమ్మ గర్భవతి అయినప్పుడు శేషయ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

శేషయ్య భార్య గర్భవతి అయిందన్న విషయం విన్న చుట్టుపక్కల వాళ్లు ముక్కున వేలేసుకున్నారు. భార్యభర్తలు అపోహ పడుతున్నారేమోనని కూడా కొందరు సందేహించారు. కాని అక్కమ్మ శరీరంలో చోటుచేసుకుంటున్న మార్పులు చూసిన తర్వాత అందరూ నిజమని నమ్మారు. అందమైన, ఆరోగ్యకరమైన బాబుకు శేషయ్య భార్య జన్మనిచ్చింది. ఆ అబ్బాయి గురించి తెలిసిన వారు, బంధువులు కథలు కథలుగా చెప్పుకున్నారు. ఒక మహిళ ఒక బిడ్డ పుట్టిన తర్వాత ఇరవై ఏళ్లకు మళ్లీ గర్భం ధరించడం, ఆరోగ్యకరమైన శిశువుకు జన్మ ఇవ్వడం ఎలా సాధ్యమనే చర్చ అప్పట్లో చాలా కాలం పాటు సాగింది.

కుటుంబంలోకి కొత్త సభ్యుడి రాకతో ఇల్లంతా కలకలలాడింది. శేషయ్య తన మూడో బిడ్డకు సుందరయ్య అని పేరు పెట్టారు. సుందరయ్యను తల్లిదండ్రులు ఎంతో గారాబంతో పెంచసాగారు. దురదృష్టవశాత్తు శేషయ్య మరణించే నాటికి సుందరయ్యకు నిండా ఐదేళ్లు కూడా లేవు. చిన్న వయస్సులోనే తండ్రి ఆలంబనకు  సుందరయ్య దూరమయ్యారు. వయస్సులో ఇరవై ఏళ్లు పెద్దవాడు అయిన సుందరయ్య అన్నయ్య వెంకటసుబ్బయ్యకు అప్పటికే వివాహం జరిగింది. ఆయనే సుందరయ్య సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. తండ్రి లేరనే లోటు తెలియకుండా సుందరయ్యను పెంచారు. తండ్రి బాధ్యతలన్నీ వెంకట సుబ్బయ్యే నిర్వర్తించడం ప్రారంభించారు. సోదరి రమణమ్మ వివాహం జరగడంతో ఆమె అత్తింటికి వెళ్లిపోయింది. కానీ సోదరులతో నిరంతరం ఆమె సన్నిహితంగా ఉండేది. పండగలు, పబ్బాలకు తరచూ కలుసుకునేవారు. దురదృష్టవశాత్తు వివాహమైన కొన్నేళ్లకే రమణమ్మ భర్త మృతిచెందారు. అయినప్పటికీ ఆమె తన అత్తింట్లోనే పిల్లలతో కలిసి నివసించేది.

చదవడం, రాయడం నేర్చుకొనే వయస్సు రావడంతో సుందరయ్యను పాఠశాలలో చేర్పించాలని వెంకటసుబ్బయ్య నిర్ణయించుకున్నారు. ఆ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో కేవలం అగ్రవర్ణాల వారి పిల్లలు మాత్రమే పాఠశాలలకు వెళ్లేవారు. అట్టడుగు వర్గాలకు చెందిన వారి పిల్లలు కాస్త పెద్ద వయస్సులోకి రాగానే తల్లిదండ్రుల వృత్తి స్వీకరించేవారు. కుమ్మరి కొడుకు కుమ్మరి, కమ్మరి కొడుకు కమ్మరి. మంగలి కొడుకు మంగలి, చాకలి కొడుకు చాకలి అయ్యేవారు. తరాలుగా ఇలాగే సాగుతుండేది. చదువుసంధ్యలు అనేవి కొన్ని కులాలకే

పరిమితమయ్యేవి. కాని, భారతదేశంలో బ్రిటీష్‌వారు వచ్చిన తర్వాత సమాజంలో మార్పులు మొదలయ్యాయి. చదువుసంధ్యల విషయంలో కులవివక్షకు వ్యతిరేకంగా గళాలు వినిపించాయి. అనేక మంది సంఘసంస్కర్తలు సమాజంలో కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందినవారి పిల్లలు కూడా చదువు నేర్చుకోవడం మొదలుపెట్టారు.

వెంకటసుబ్బయ్య చదువు ప్రాధాన్యత తెలిసిన వ్యక్తి. ఆయన పాఠశాలకు వెళ్లి చదువుకోకపోయినా తన తమ్ముడిని బాగా చదివించాలని దృఢ సంకల్పం కలిగిన వ్యక్తి. కాని, ఆ కాలంలో కోవూరులో పాఠశాల లేదు. చదువుకోవాలంటే ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలే దిక్కే. తనలాగా తన తమ్ముడు గొర్రెలు, మేకల మధ్య బతకూడదన్నది వెంకటసుబ్బయ్య ఆలోచన. కుటుంబాన్ని నడిపించేందుకు ఉన్నత వర్గాల వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడరాదని భావించారు. చదువు ద్వారానే పేదల జీవితంలో మార్పు వస్తుందని గ్రహించిన వ్యక్తి వెంకటసుబ్బయ్య. ఉజ్వల భవిష్యత్ కోసం సుందరయ్యను వెంకటసుబ్బయ్య తమ ఊరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో బుచ్చిరెడ్డిపాళెంలోని దొడ్ల లక్ష్మీనరసింహారెడ్డి పాఠశాలలో చేర్పించారు.

దొడ్ల లక్ష్మీనరసింహారెడ్డి పాఠశాలను బుచ్చిరెడ్డిపాళెంలో నివసించే దొడ్ల అన్నారెడ్డి వంశస్తులు స్థాపించారు. అన్నారెడ్డి పూర్వీకులు తిరుపతిలో ఉండేవారు. తిరుపతి అప్పట్లో మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. అక్కడ తమిళం మాట్లాడే వారి సంఖ్య ఎక్కువ. 1715లో అన్నారెడ్డి తన కుటుంబంతో నెల్లూరు జిల్లాలోని వెవ్వరు గ్రామానికి వచ్చారు. అక్కడ తన పూర్వీకులు బుచ్చిరెడ్డి పేరుతో అన్నారెడ్డి అక్కడో గ్రామాన్ని ఏర్పాటు చేశారు. ఆర్కాట్ నవాబుగా పిలిచే కర్ణాటక నవాబు కోసం పన్నులు వసూలు చేసే బాధ్యతను అన్నారెడ్డి నిర్వర్తించేవారు. 1690 నుంచి1801 వరకు వారు కర్ణాటక నవాబు ఆధీనంలో ఉండేవారు. ఆ నవాబుల రాజధాని ఆర్కాట్. కర్ణాటక నవాబులకు హైదరాబాద్ దక్కన్ నవాబుల మద్దతు, వారి రక్షణ ఉండేది. కాని భారతదేశంలో బ్రిటీష్‌వారు పట్టు బలోపేతమైన తర్వాత ఆర్కాట్ కూడా బ్రిటీష్ వారి ఏలుబడిలోకి వెళ్లిపోయి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైంది.

అన్నారెడ్డి, ఆయన వారసులు ఎంతో సంపన్నులు. వారు తమ వ్యవహారాలు, కార్యకలాపాల పట్ల బాధ్యతాయుతంగా ఉండేవారు. బుచ్చిరెడ్డిపాళెం వేగంగా అభివృద్ధి చెందేలా ఆ కుటుంబసభ్యులు వ్యవహరించేవారు. రోడ్లు వేశారు, దేవాలయాలు నిర్మించారు, విద్యా సంస్థలు  స్థాపించారు. వారు ప్రారంభించిన పాఠశాలకు దొడ్ల లక్ష్మీనరసింహ రెడ్డి అని పేరు పెట్టారు. నరసింహారెడ్డి కూడా అన్నారెడ్డి వారసుడే. దొడ్ల లక్ష్మీ నరసింహారెడ్డి స్కూల్ ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే బాగా ప్రాచుర్యం పొందింది. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలలో పాఠశాలలు లేకపోవడంతో ఈ పాఠశాలపై ప్రజలు ఆధారపడేవారు. ఈ కారణంగా, సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు చదువుకునేందుకు దొడ్ల లక్ష్మీనరసింహారెడ్డి పాఠశాలకు రావడం మొదలైంది.

ఆ రోజుల్లో తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పాఠశాలలలో విద్యార్థుల కోసం 'పెద్ద బాలశిక్ష' అనే పుస్తకం ఉండేది. బ్రిటిష్ అధికారుల సూచనలకు లోబడి  తెలుగు భాషా పండితుడు పూడూరు సీతారామ శాస్త్రి ఒక పాఠ్యపుస్తకం రాసి దానికి 'పెద్ద బాలశిక్ష' అని పేరు పెట్టారు. 1832లో మొదటిసారిగా ఈ పుస్తకాన్ని ప్రచురించారు. దీనికి పాఠశాలల్లో పాఠ్యపుస్తక హోదా లభించింది. ఆ రోజుల్లో చదువుకోవాలనుకునే ఏ విద్యార్థి అయినా తప్పనిసరిగా పెద్దబాలశిక్ష నేర్చుకోవాలి.  పిల్లలుకానీ, పెద్దలుకానీ ఎవరైనా సరే అక్షరాస్యులు అయ్యేందుకు, జ్ఞానాన్ని పొందేందుకు ఈ పుస్తకం ఒక సాధనంగా ఉపయోగపడేది. ఈ పుస్తకంలో ముందుగా  తెలుగు భాష వర్ణమాల ఉంటుంది. ఆ తర్వాత పదాలకు సంబంధించిన పరిజ్ఞానం ఉంటుంది. పిల్లలకు పదాల అర్థం తెలిసినప్పుడు, వారికి వాక్య నిర్మాణాన్ని నేర్పిస్తారు. చదవడం, రాయడం అన్నది విద్యార్థులు ఏకకాలంలో నేర్చుకుంటారు. వాక్యనిర్మాణం తెలిసిన తర్వాత వ్యాకరణ బోధన ఉంటుంది. వ్యాకరణాన్ని విద్యార్థులు ఆకళింపు చేసుకున్న తర్వాత వారికి వివిధ విషయాలకు సంబంధించిన పరిజ్ఞానం అందించడంలో భాగంగా గణితం నేర్పుతారు. సైన్స్, చరిత్ర బోధన కూడా ఉంటుంది. ఆ రోజుల్లో విద్యార్థులకు మరో పుస్తకం కూడా నేర్పించేవారు. ఆ పుస్తకం పేరు "బాలరామాయణం". సాధారణ భాషలో అది శ్రీరాముని కథను తెలిపే పుస్తకం. విద్యార్థులకు శ్రీరాముని గురించి అవగతమైన తర్వాత వారికి

కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారం నేర్పించేవారు. ఆ తర్వాత గుణింతాల బోధన సాగేది. ప్రతి సంవత్సరం పరీక్షలు జరిగేవి. ఆ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులు పై తరగతులకు వెళ్లేవారు. పదో తరగతి వారు ఇదే ప్రక్రియను అనుసరించేవారు. తొమ్మిదో తరగతి వరకు పాఠశాలలోనే పరీక్షలు నిర్వహించేవారు. పదో తరగతి పరీక్షలను బ్రిటీష్ ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించేది. ఆ పరీక్షల్లో పాసయ్యే విద్యార్థులకు సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ ప్రదానం చేసేవారు.

సుందరయ్య ప్రతిరోజు పాఠశాలకు వెళ్లడం ప్రారభించాడు. ఆయన పాఠశాలకు నడిచి వెళ్లేవారు. అక్కడ చదువు నేర్చుకొని తిరిగి నడుచుకుంటూ ఇంటికి వచ్చేవారు. చదువు కోసం ప్రతిరోజు అతను నలభై కిలోమీటర్లు నడిచేవారు. దారి బాగుండేది కాదు. ఒక  పిల్లవాడు రోజూ స్కూలుకు ఇరవై కిలోమీటర్లు నడిచి వెళ్ళడం సాధారణ విషయం కాదు. కష్టంగా ఉండే దారిపై ఆలోచనలు నలిగిపోయేవి. అడుగులు తడబడేవి. వెనక్కి వెళ్లిపోవాలని అనిపించేది. కాని, సంకల్పం దృఢంగా నడిచే దారి సాఫీగా మారుతుంది, ధైర్యంగా ముందుకు సాగడానికి కావాల్సిన శక్తిని ఇస్తుంది. వయస్సుకు విలువ ఉండదు, శారీరక  బలమూ ముఖ్యం కాదు, ధైర్యమే కీలకం. తాను నడిచే దారి తనకు ఆనందాన్ని ఇస్తుందని తెలిసినప్పుడు బాటసారికి ఎటువంటి బాధలు కలగవు, దారి గురించి చింతించడు. వారి అడుగులు సంతోషంగా ముందుకు సాగుతాయి. బాల్యంలో సుందరయ్య కూడా ఇలాగే వ్యవహరించారు.

సుందరయ్య ప్రతిరోజు ఉదయాన్నే భోజనం చేసి ఇంటి నుండి పాఠశాలకు బయలుదేరేవాడు. అక్కడ శ్రద్ధగా చదువుకునేవాడు. పాఠశాలలో ఎక్కువ మంది పిల్లలు అగ్రవర్ణాలకు చెందినవారు. యాదవుల కులానికి చెందిన విద్యార్థి సుందరయ్య ఒక్కడే. కులం పేరుతో పాఠశాలలో వివక్ష లేనప్పటికీ, అగ్రవర్ణాలు, ధనిక కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థుల దగ్గర తగిన సౌకర్యాలు ఉండేవి. విలాసవంతమైన జీవితం గడిపేవారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు తమ నౌకర్లను తీసుకొచ్చేవారు. వీళ్లంతా గుర్రపు బగ్గీలు లేదా ఎడ్లబండ్లలో పాఠశాలకు వచ్చేవారు. ఖరీదైన దుస్తులతో పాటు పాదాలకు తళతళలాడే బూట్లు ధరించేవారు.

కానీ సుందరయ్య పరిస్థితి భిన్నంగా ఉండేది. అతని దగ్గర రెండు జతల దుస్తులు మాత్రమే ఉండేవి అవి కూడా పాతవే. కాళ్లకు చెప్పులు ఉండేవి కావు. చెప్పుల్లేకుండా వట్టి కాళ్లతో రోజు నలభై కిలోమీటర్లు నడిచేవాడు. ప్రారంభంలో సుందరయ్య పాఠశాలలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మిగిలిన విద్యార్థుల్లాగా అతని దగ్గర పలక, బలపం ఉండేది కాదు. తనకు పలక, బలపం కావాలని సుందరయ్య అడిగినప్పుడు అన్న వెంకటసుబ్బయ్యకు ఊరి జమీందారు ముందు చేతులు చాపడం మినహా మరో మార్గం కనిపించలేదు. సుందరయ్య నివసించే పాకకు దగ్గరలోనే ఒక జమీందారు ఉండేవారు. ఆయనది విశాలమైన ఇల్లు. సుందరయ్య తండ్రి ఆ ఇంట్లో పనిచేసేవారు. సుందరయ్య తండ్రి శేషయ్యకు సొంతంగా ఒక ఎకరం పొలమున్నా దాని ద్వారా కుటుంబం గడపడం కష్టంగా ఉండేది. గొర్రెలు, మేకలు ఉన్నా కుటుంబ పోషణ కోసం జమీందార్ ఇంట పనిచేయడం తప్పనిసరిగా మారింది. అతనికి వందల ఎకరాల మాగాణి భూమి ఉండేది. అంతే కాదు పాడికి కూడా కొదవ లేదు. పెద్ద సంఖ్యలో ఆవులు, ఎద్దులు ఉండేవి. గుర్రపు బగ్గీ కూడా ఉండేది. జమీందార్ ఇంట చాలా పని ఉండేది కాబట్టి పదుల సంఖ్యలో పనివాళ్లు ఉన్నా తక్కువే అనిపించేది. శేషయ్య తాత ముత్తాతలు కూడా ఈ జమీందార్ కుటుంబంలో పనిచేశారు. ఆ పరంపర తరాలుగా కొనసాగుతుండేది.

ఈ జమీందార్ దగ్గర ఒక గొప్ప గుణం ఉండేది. ఆయన దగ్గర పనిచేసేవారు ఎంతో సంతృప్తితో ఉండేవారు. పనికి తగినట్టుగా జీతం అందుకునేవారు. జీతం విషయంలో ఎటువంటి భేదభావాలు ఉండేవి కావు. జమీందార్‌కు గర్వం, అహంకారం అన్నవి అస్సలు ఉండేవి కావు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడేవారు కాదు. ఆయన గొప్పతనం, హోదా కారణంగా అంతా గౌరవించేవారు. అవసరమైన సమయంలో పేదప్రజలకు సాయం చేసే గుణం ఆయన సొంతం.

ఆంధ్రా జమీందార్లు, భారతదేశంలోని ఇతర ప్రాంతాల జమీందార్లతో పోల్చితే నెల్లూరు జమీందార్లు కొంత భిన్నంగా ఉండేవారు. నెల్లూరు జిల్లాలో చాలా మంది జమీందార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. రెడ్డి కులంలోని వారు మొదటి నుంచి భూస్వాములు. ఈ కులంలో అనేక మంది

రాజులు, మహారాజులు ఉన్నారు. రాచరికం అంతరించిన తర్వాత కూడా లక్షల ఎకరాల భూమి  రెడ్డి కులస్తుల ఆధీనంలో ఉండేది. ఆంధ్రాలోని రాయలసీమ ప్రాంతంలో చాలా మంది భూస్వాములు రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. జమీందారుల చేతిలో రైతులు, కార్మికులు, పేదలు పడే అగచాట్లకు సంబంధించిన కథలు దేశవ్యాప్తంగా వినిపించేవి. కులం పేరుతో వివక్ష, అస్పృశ్యత తారాస్థాయిలో ఉన్న కాలం అది.

నెల్లూరు జిల్లాలో దాదాపు అందరు జమీందార్లు రెడ్డి వర్గానికి చెందినవారు. కానీ వారి వ్యవహారశైలి ఇతర జమీందారులకు భిన్నంగా ఉండేది. కులం పేరుతో వివక్ష, అంటరానితనం ఉన్నా దోపిడీ అన్న పదానికి తావుండేదికావు. కులం పేరుతో హింస జరగడం వంటివి ఉండేవికావు. నెల్లూరు జిల్లా అంతటా ప్రజలు సామరస్యంగా ఉండటంతో జీవితాలు ప్రశాంతంగా సాగేవి.

అన్ని కులాల ప్రజలు గ్రామాల్లో నివసించేవారు. క్షురకులు, చాకలి, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు, దర్జీలు, నేత కార్మికులు, కసాయి వంటి కులాల ప్రజలు ప్రతీ గ్రామంలో ఉండటం సహజం. ఈ కులాల వారి కోసం చాలా గ్రామాల్లో ప్రత్యేక బావులు ఉండేవి. వారి ఇళ్లు జమీందారుల ఇళ్ల చుట్టూ ఉండేవి, కాని, వీరు ఎప్పుడూ పేదలుగానే ఉంటూ జమీందార్ల దయదాక్షిణ్యాలపై బ్రతికేవారు.

నెల్లూరు జిల్లాలో ఎక్కువ మంది రెడ్డి కులస్తులు ఉండేవారు. రెడ్లను కాపులు అని అప్పట్లో పిలిచేవారు. రెడ్లు అంటే ఒక వ్యవసాయ కులం. ఈ కులానికి చెందినవారు వ్యవసాయం సాగు చేసేవారు. కాపు అంటే భూమి రక్షకులు అని అర్థం. సాధారణంగా రెడ్డి కులస్తుల దగ్గర వ్యవసాయం కోసం సొంతంగా భూములు ఉండేవి. ఉపాధి కోసం ఇతరులపై ఆధారపడేవారి సంఖ్య ఈ కులంలో చాలా తక్కువ. శతాబ్దాలుగా కాపు కులస్తులు అగ్రవర్ణాలుగా ఉన్నారు. నెల్లూలు జిల్లాలో కమ్మ, వెలమ కులాలకు చెందిన వాళ్లు కూడా ఉండేవారు. ఆ రెండు కులాలకు చెందిన వారు కూడా సంపన్నులే. వారు కూడా ఉన్నత కులాలకు చెందిన వారిగానే గుర్తింపు పొందారు. కమ్మ, వెలమ కులస్తులు భూస్వాములు.  సారవంతమైన భూములకు వారు యాజమానులు కావడంతో వారు స్వతహాగా సంపన్నులు.

యానాది కులానికి చెందిన ప్రజలు కూడా నెల్లూరు జిల్లాలో ఉండేవారు. వీరు స్వతహాగా ఆదివాసీలు. కానీ సమాజపు జనజీవన స్రవంతిలోకి పదిహేడవ శతాబ్దంలో వచ్చారు. ఈ కులస్తులు జంతువులను వేటాడి చంపి కడుపు నింపుకునేవారు. ఈ కులంలోని చాలా మంది ప్రజలు శ్రీహరికోట ద్వీపంలో నివసించేవారు. అప్పట్లో పొలాల్లో పనిచేస్తూ విషపూరితమైన పాము కాట్లతో రైతులు, కూలీలు చనిపోయే సంఘటనలు తరచూ జరిగేవి. అలాంటి ఘటనలు రోజురోజుకూ ఎక్కువవుతుండటంతో పాములను చంపేందుకు యానాదుల సాయాన్ని ప్రజలు తీసుకోవడం ప్రారంభించారు. ఆదివాసులైన వారు ఈ విధంగా సమాజంలో జనజీవన స్రవంతిలోకి వచ్చారు. 'యానాది' అనే పదం 'అనాది' అనే పదానికి రూపాంతరమని నిపుణులంటారు. యానాది కులానికి చెందినవారు అనాది నుంచి అడవులలో నివసించేవారు కాబట్టి దుస్తులు ధరించేవారు కాదు. కానీ వారు సమాజ జనజీవన స్రవంతిలో భాగమైన తర్వాత దుస్తులు ధరించాల్సి వచ్చింది. చిన్నచిన్న దుస్తులు ధరించడం ఈ కులం వారి ప్రత్యేకత.

నెల్లూరు జమీందార్లు మూడు కులాలవారిని చాలా దూరంగా పెట్టేవారు. ఆ మూడు కులాలకు చెందిన వారి నీడ కూడా అపవిత్రంగా భావించారు. మాల, మాదిగ, ఎరుకల కులాల వారిని అంటరానివారుగా పరిగణించేవారు. ఈ మూడు కులాల ప్రజల ఇళ్లు కూడా గ్రామాలకు దూరంగా ఉండేవి. వీరిపై వివక్ష చాలా అధికంగా ఉండేది. ఈ కులాల మనుషులు తాకిన వాటిని ముట్టుకునేందుకు కూడా మిగతా కులాల ప్రజలు ఇష్టపడేవారు కాదు.

మాల కులానికి చెందిన వారు ప్రాథమికంగా వ్యవసాయ కూలీలు. పొలాల్లో పని చేయడమే కాకుండా వారు పత్తి వడికేవారు. ఈ కులానికి చెందినవారిలో ఒక ప్రత్యేకత ఉండేది. వీరు ఆవులు, ఎద్దుల తోళ్ల నుంచి డప్పులు, నగారా వంటి సంగీత వాయిద్య పరికరాలు తయారు చేసేవారు. గ్రామాల్లో ఏదైనా పండుగ లేదా వేడుక జరిపినపుడు మాల కులంలోని వ్యక్తులను మాత్రమే డప్పులు వాయించేందుకు పిలిచేవారు. మాదిగ కులంలోని చాలా మంది తోలు పనిచేసేవారు. వారి ప్రధాన వృత్తి పాదరక్షలు తయారు చేయడం. ఎరుకల కులంలోని ప్రజలు చిన్నపాటి పనులు చేసుకునేవారు. బుట్టలు అల్లడం,

చాపలు అల్లడం, తాళ్ల తయారీ, పందుల పెంపకం, కోళ్ల పెంపకం చేసేవారు. ఎరుకల కులానికి కూడా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. శతాబ్దాలుగా ఈ కులంలోని మహిళలు జనాల ముఖాలు చూసి జాతకం చెప్పేవారు. సమస్యలు దూరం చేసేందుకు వారు తాయత్తులు ఇచ్చేవారు. ఈ మూడు కులాల ప్రజలతో అంటరానితనం సమస్య నెల్లూరులో కూడా ఉండేది. అంటరానితనానికి ఒక ప్రధాన కారణం ఈ ప్రజలు గొడ్డు మాంసం తినడం. ఇది మాత్రమే కాదు, ఈ కులాల ప్రజలు చేసే పనులు చాలా హీనమైనవిగా పరిగణించబడేవి.

నెల్లూరు జిల్లాలో గ్రామాల్లోని వెనుకబడిన వర్గాలలో యాదవులది  ఉన్నత స్థానం. రెడ్డి భూస్వాములు యాదవులతో బాగా వ్యవహరించేవారు. జమీందారుల పొలాలు, ఇళ్లలో పని చేయడమే కాకుండా, యాదవులు ఆ భూస్వాముల ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు మొదలైన వాటి ఆలనా పాలనా చూసేవారు. జమీందారుల బంగాళాలో ప్రవేశించే హక్కు యాదవులకు ఉండేది. వంటగది, పూజ గది మినహా జమీందారుల బంగాళాలో ఎక్కడికైనా వెళ్లే వెసులుబాటు యాదవులకే ఉండేది.

సుందరయ్య చదువు కోసం జమీందార్లు సహాయం చేస్తారని నమ్మారు వెంకటసుబయ్య. తన తమ్ముడి చదువు కోసం సాయం చేయాలని జమీందారును వెంకటసుబయ్య అడిగిన వెంటనే వారు పలక, బలపం ఇవ్వడంతో పాటు సుందరయ్యకు కొత్త దుస్తులు కూడా కుట్టించారు. ఈ సాయంతో జమీందార్‌పై ఉన్న గౌరవం వెంకటసుబ్బయ్య, సుందరయ్యలో మరింత పెరిగిపోయింది.

కొత్త దుస్తులు, కొత్త పలక, బలపం సుందరయ్యలో ఉత్సాహాన్ని నింపాయి. మరింత ఏకాగ్రతతో చదవసాగాడు. కొత్త ఉత్సాహం కారణంగా ఇరవై కిలోమీటర్ల ప్రయాణం సులువుగా మారిపోయింది.

చదువు విషయంలో సుందరయ్య ఎంతో శ్రద్ధగా ఉండేవాడు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఎంతో ఏకాగ్రతతో వినేవాడు. శ్రద్ధగా చదివేవాడు. ఆ శ్రమకు ప్రతిఫలంగా ప్రతి పరీక్షలో మంచి మార్కులు వచ్చేవి.

సుందరయ్య జ్ఞాపకశక్తి అద్భుతం. ఒక్కసారి వింటే చాలు అది మనస్సులో నాటుకుపోయేది. విన్న విషయాన్ని గుర్తుంచుకోవడం అతనికి ఎంతో మేలు

చేసింది. ఏటా పరీక్షలు పాసవుతూ, ఒక తరగతి తర్వాత మరో తరగతికి వెళ్లసాగాడు.

వదిన గారు మధ్యాహ్నం తినేందుకు సుందరయ్యకు ప్రతిరోజూ భోజనం పంపేది. కాని, కొన్నిసార్లు తను ఉదయాన్నే పొలానికి వెళ్లాల్సి వచ్చిన రోజుల్లో మధ్యాహ్నం సుందరయ్య పస్తు ఉండాల్సి వచ్చేది. అలాంటి సమయాల్లో జమీందార్ల సాయాన్ని కోరాల్సి వచ్చేది. ఒకసారి ఒక జమీందారు ఇంటికి వెళ్తే మరోసారి మరో ధనవంతుల కుటుంబం దగ్గరకు భోజనం కోసం వెళ్ళాల్సి వచ్చేది. ఇలా జమీందార్లు, ధనవంతులు ఇంట మధ్యాహ్నం భోజనం చేస్తూ సుందరయ్య తన చదువులు కొనసాగించాడు.

సెలవు రోజుల్లో సుందరయ్య ఇంట్లో ఖాళీగా కూర్చునే వాడు కాదు. అన్నయ్యకు పనిలో సహాయం చేయడానికి వెళ్లేవాడు లేదా మేకలు, గొర్రెలు మేపేవాడు.  పిలుపు వస్తే జమీందారు ఇంట పనికి వెళ్లేవాడు. సుందరయ్యది సహజంగానే కష్టపడి పనిచేసే స్వభావం. ఏ పని చేసేందుకైనా సిద్ధంగా ఉండేవాడు. పన్నెండేళ్లు కూడా నిండకముందే అతను పొలాల్లో నాట్లు వేయడం, పంట కోయడం, కలుపు తీయడం వంటి పనులన్నీ నేర్చుకున్నాడు.

ఆటల్లోనూ సుందరయ్య ఎప్పుడూ ముందుండేవాడు. సమయం దొరికినప్పుడల్లా స్నేహితులతో కబడ్డీ ఆడేవాడు. ఆ ఆటలో సుందరయ్య ప్రావీణ్యం సంపాదించాడు. సుందరయ్య ఎదుటి గ్రూపులోకి వెళ్లినప్పుడు ప్రత్యర్థి కాలు, తొడ గట్టిగా పట్టుకునేవాడు, ప్రత్యర్థిపై నాలుగు వైపుల నుంచి దాడి చేసేవాడు. దాడి చేయడంలోనే కాదు, రక్షణలోనూ మంచి నైపుణ్యాన్ని సాధించాడు. ఆటలో ఆటగాళ్ళ పరిస్థితి, ప్రత్యర్థుల నైపుణ్యాలు దృష్టిలో ఉంచుకుని సుందరయ్య వ్యూహరచనలు చేసేవాడు. పాఠశాలలో కావచ్చు ఆటలాడే మైదానంలో కావచ్చు, పొలం పనుల్లో కావచ్చు, చేసే ప్రతీ పనిలోనూ సుందరయ్య ఎంతో ఏకాగ్రత చూపేవాడు.

ఏడో తరగతి పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత పాఠశాలలో చేరినప్పుడు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాల వైపు సుందరయ్య ఆకర్షితుడయ్యాడు. స్వాతంత్ర్య పోరాటం తారాస్థాయికి చేరుకున్న రోజులవి.

దేశవ్యాప్తంగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రతీ నగరం, పట్టణం, పల్లె పల్లెనా, వాడవాడనా స్వాతంత్ర్య పోరాటం వ్యాపించింది. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంతో రకరకాల ఉద్యమాలు సాగుతున్న రోజులవి. భరతభూమి నుంచి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టేందుకు చేపట్టిన మహా యుద్ధంలో మహాత్మా గాంధీ గొప్ప నాయకుడిగా ఎదిగారు.

1942 సంవత్సరంలో, ఆగస్టు నెలలో, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మహాసభ బొంబాయిలో జరిగింది. కాంగ్రెస్‌కు చెందిన పెద్ద నాయకులందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. దేశ స్వాతంత్ర్యం కోసం "డూ ఆర్ డై" అంటూ దేశప్రజలకు మహాత్మ గాంధీ పిలుపునిచ్చారు. అంతే కాదు నాటి సమావేశంలో ఆగస్టు 8న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా 'క్విట్ ఇండియా ఉద్యమం' ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఈ ప్రకటనతో దేశవ్యాప్తంగా సరికొత్త సామూహిక విప్లవం ప్రారంభమైంది. 9 ఆగస్టు, 1942 న, బ్రిటిష్ ప్రభుత్వం మహాత్మాగాంధీని, కాంగ్రెస్‌కు చెందిన ఇతర ప్రముఖ నాయకులందరినీ అరెస్టు చేసి వేర్వేరు జైళ్లలో ఉంచింది. ఈ అరెస్టులతో బ్రిటిష్ వారిపై ప్రజల ఆగ్రహం మరింత పెరిగింది. బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం తీవ్రమైంది. బ్రిటిష్ ప్రభుత్వానికి కంటి మీద కునుకు కరువైంది. ఈ ఉద్యమం కారణంగా బ్రిటిష్ వారు బలహీనపడటం మొదలైంది. ఆ బలహీన స్థితికి మరో ప్రధాన కారణం కూడా ఉంది. ఆ సమయంలో బ్రిటన్ రెండో ప్రపంచ యుద్ధంలో చిక్కుకుంది. యుద్ధం కారణంగా బ్రిటన్ భారీ నష్టాలను చవిచూసింది. ప్రత్యేకించి జర్మనీకి బ్రిటన్ లక్ష్యంగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధం 1 సెప్టెంబర్ 1939న ప్రారంభమైంది. జర్మన్ పాలకుడు హిట్లర్ పోలాండ్‌పై దాడి చేశాడు. ఈ దండయాత్రతో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

ఈ యుద్ధం కారణంగా ప్రపంచం మిత్రదేశాలు, శత్రుదేశాలని రెండు ముక్కలుగా చీలిపోయింది. బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్, చైనా వాటి దేశాలు మిత్రదేశాలు 'మిత్రదేశాల'లో ఉండగా, జర్మనీ, జపాన్, ఇటలీ మరియు వాటి మిత్రదేశాలు 'శత్రుదేశాలుగా'నిలిచాయి. యుద్ధం చాలా భీకరంగా సాగింది. డెబ్భైకి పైగా దేశాల సైన్యం, నావికాదళం, వాయుసేన

దళాలు ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. లక్షల మంది సైనికులు యుద్ధభూమిలోకి వచ్చారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నిత్యం కాల్పులు, విస్ఫోటనాలు జరుగుతూనే ఉండేవి. జర్మనీ చేపట్టిన దాడుల కారణంగా బ్రిటన్ చాలా నష్టపోయింది. దాని అధీనంలో ఉన్నదేశాల్లోనూ దాడులు జరిగాయి. ఆగకుండా సాగుతున్న ఆ దాడులు ఒకవైపు, ఆయా దేశాల్లో స్వాతంత్ర్యం కోసం ప్రజలు చేస్తున్న పోరాటాలు మరో వైపు.. వలసరాజ్యాలపై బ్రిటన్ పట్టు బలహీనపడటం ప్రారంభం కావడానికి కారణాలయ్యాయి. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు 'ఆజాద్ హింద్ ఫౌజ్' సృష్టించిన విప్లవ నాయకుడు సుభాష్ చంద్రబోస్, జర్మనీ, జపాన్‌కు మద్దతు ఇవ్వడం ప్రారంభించారు. మలేషియా, సింగపూర్, బర్మాలో వైమానిక దాడుల చేసి బ్రిటిష్ వారిని జపనీయులు తరిమికొట్టారు. ఈ మూడు దేశాలు బ్రిటిష్ వారి ఆక్రమిత వలస ప్రాంతాలు.

ఇటు భారతదేశంలో ప్రత్యేకమైన దేశం కోసం ముస్లిం డిమాండ్ ఊపుందుకోవడంతో అనేక ప్రాంతాల్లో మతపరంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. 'పాకిస్తాన్' డిమాండ్ చాలా రాష్ట్రాల్లో ముఖ్యంగా పంజాబ్, బెంగాల్‌లో హిందువులు, ముస్లింల మధ్య ద్వేషాన్ని సృష్టించింది. 1930 సంవత్సరం నుంచే ముస్లింలకు ప్రత్యేక దేశం కోసం ముస్లిం లీగ్ డిమాండ్ చేస్తున్నా నలభై సంవత్సరం ఆరంభం నుంచి ఆ డిమాండ్ తీవ్రమైంది. రాజకీయ వాతావరణం బాగా వేడెక్కింది. హిందువులు, సిక్కులు ఒక వైపు, ముస్లింలు మరో వైపు నిలిచారు. ఇరువర్గాలకు ఒకరిపై ఒకరికి విశ్వాసం తగ్గడం ప్రారంభమైంది. ఇరుపక్షాల మధ్య ప్రేమ, ఆప్యాయత, స్నేహభావం సన్నగిల్లింది. పరస్పరం అనుమానాలు, అపనమ్మకాలు పెరిగాయి. ఈ అపనమ్మకం నగర ప్రజల్లో స్పష్టంగా కనిపించింది. గ్రామాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేది.

నెల్లూరులో మతపరంగా ఎటువంటి ఉద్రిక్తత చోటుచేసుకోలేదు. మతపరమైన హింస, ఉద్రిక్తత, జాతి, మతం పేరుతో హింసకు నెల్లూరు ఎప్పుడూ దూరంగా ఉండేది.

కానీ నలభైలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాలు నెల్లూరులోనూ పెరగడం మొదలైంది. సంఘ్ శాఖలు క్రమం తప్పకుండా

నిర్వహించబడేవి. ఆలోచనాపరుడు, మేధావి అయిన డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ 1925 లో విజయదశమి రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించారు. "హిందూ సంస్కృతి భారతదేశానికి హృదయ స్పందన. కనుక భారతదేశం రక్షించబడాలంటే, ముందుగా మనం హిందూ సంస్కృతిని కాపాడుకోవాలి. సంఘటితంగా ఉండటం ద్వారా శక్తి వస్తుంది. కాబట్టి హిందూ సమాజాన్ని బలోపేతం చేసేందుకు ప్రతీ హిందువు తన వంతు ప్రయత్నం చేయాలి. ఈ మహోన్నత లక్ష్యం కోసం నవతరం తమ ప్రాణాలు అర్పించేందుకు ముందుకు రాకపోతే దేశం ఇలాగే ఉండిపోతుంది. ఈ విషయంలో యువత తమ ఆలోచనలు మార్చుకోవాలి" అని ఆయన చెప్తుండేవారు, దాన్నే ఆయన బలంగా విశ్వసించేవారు. ఈ ఆలోచనలే కేంద్రంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాలు అభివృద్ధి చెందాయి.

సంఘ్ ప్రారంభ రోజుల్లో డాక్టర్ హెడ్గేవార్‌కు భయ్యాజీ దాని, బాబాసాహెబ్ ఆప్టే, బాలాసాహెబ్ దేవరస్, మధుకర్ రావు భగవత్ వంటి నాయకుల మద్దతు లభించింది. మహారాష్ట్రలోని నాగపూర్‌లో సంఘ్ ప్రధాన కార్యాలయానికి పునాది పడింది. క్రమంగా సంఘ్ కార్యకలాపాలు దేశంలోని వివిధ నగరాలు, గ్రామాలకు విస్తరించాయి. స్వయంగా డాక్టర్ హెడ్గేవార్ అనేక ప్రాంతాలు సందర్శించారు. అనేక సమావేశాలలో ప్రసంగించి సంఘ్ భావజాలం, లక్ష్యాలు ప్రజలకు వివరించారు. డాక్టర్ హెడ్గేవార్ జూన్ 21, 1940 న మరణించారు. ఆయన అనుచరుడు మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్ సంఘ్ బాధ్యతలు చేపట్టి దాని విస్తరణ కోసం కృషి చేయడం ప్రారంభించారు.

ఒక రోజు ఉదయం తన గ్రామంలో కొంతమంది యువకులు వెళ్తుండటం కౌమారప్రాయంలో ఉన్న సుందరయ్య చూశాడు. ఆ యువకులందరూ తెల్ల చొక్కాలు, ఖాకీ నిక్కర్ ధరించి ఉన్నారు. ప్రతి ఒక్కరి చేతిలో లాఠీలు ఉన్నాయి. పెద్ద సంఖ్యలో యువకులు కలిసికట్టుగా ముందుకు సాగడం చూసిన సుందరయ్యకు ఆ బృందంలో చేరాలనే తలంపు కలిగింది. ఆ యువ సమూహంలో కోవూరుకు చెందిన కొంతమంది యువకులు కూడా ఉన్నారు. ఆ సమావేశంలో తెలిసిన వారిని అడిగేందుకు సుందరయ్య ఇష్టపడలేదు. ఆ సంఘం గురించి సాయంత్రం తెలుసుకొని ఎలాగైనా అందులో చేరాలని

సుందరయ్య నిర్ణయించుకున్నారు.

ఆ రోజంతా సుందరయ్య మనస్సు చంచలంగానే ఉంది. ఆ సమూహం గురించి తెలుసుకోవాలనే ఉత్సుకత ఆ నవయువకుడిని అశాంతికి గురిచేసింది. ఆ బృందంలో పాల్గొన్నవాళ్ళలో పరిచయం ఉన్న ఒక యువకుడి ఇంటికి సుందరయ్య ఆ సాయంత్రం వెళ్లాడు. తాము చేసిన ఆ విన్యాసాలు సుందరయ్యను ప్రభావితం చేశాయని తెలుసుకొని ఆ యువకుడు సంతుష్టుడయ్యాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, దాని కార్యకలాపాల గురించి సుందరయ్యకు వివరించాడు. ఆ యువకుడి మాటలు సుందరయ్యపై ప్రభావం చూపాయి. వాలంటీర్‌గా చేరాలని అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నాడు. సంఘ్ కార్యకర్తలు అందరూ కలిసే చోటుకు సుందరయ్యను ఆ యువకుడు తీసుకెళ్లాడు. సంఘ్ కార్యకర్తలను స్వయంసేవకులంటారని వారంతా ఉదయం, సాయంత్రం ఒక చోట సమావేశమవుతారని ఆ యువకుడు సుందరయ్యకు వివరించాడు. స్వయం సేవకులందరూ గుమిగూడే ప్రదేశాన్ని శాఖ అంటారు. సాధారణంగా యువకులు, వృద్ధులకు ఉదయం పూట శాఖ ఉంటుంది, విద్యార్థుల కోసం సాయంత్రం శాఖ నిర్వహిస్తారు. ఏ వయస్సువారైనా శాఖలో చేరవచ్చు. శాఖ ఒక గంట సేపు సాగుతుంది. అవసరాన్ని బట్టి ఈ సమయం పొడిగించబడుతుంది. సంఘ్ కార్యకలాపాల గురించి తెలియజేసిన తర్వాత ఆ శాఖ నిర్వహించే వ్యక్తిని సుందరయ్యకు ఆ యువకుడు పరిచయం చేశాడు. సంఘ్ కార్యకర్తలందరూ వచ్చిన తర్వాత కాషాయ రంగు జెండా ఎగరేసి అంతా వందనం చేశారు. కార్యకర్తలు చేసినట్టుగానే సుందరయ్య కూడా చేశాడు. జెండావందనం తరువాత శాఖాధిపతి ఆ కార్యకర్తలందరికీ  సుందరయ్యను పరిచయం చేశారు. అలా పరిచయం చేస్తున్న సమయంలో సుందరయ్య ఛాతీ ఆనందం, గర్వంతో ఉప్పొంగింది. కౌమారప్రాయం కాబట్టి సుందరయ్య మనస్సులో రకరకాల ఆలోచనలు చోటుచేసుకునేవి. కాని ఇప్పుడు తాను సరైన మార్గంలో చేరుకున్నాననే భావన సుందరయ్యలో కలిగింది. ఇన్నాళ్లు ఎటువంటి లక్ష్యం లేకుండా జీవితాన్ని గడిపిన సుందరయ్యకు ఇప్పుడు ఒక లక్ష్యం దొరికింది. ఇక తన జీవితం దేశం కోసం, హిందూ జనుల సేవ కోసం అంకితమని

మనస్సులోనే ప్రతిజ్ఞ చేశాడు సుందరయ్య. హైందవ సంస్కృతి పరిరక్షణ కోసం తనువు, మనస్సు అర్పించాలని నిర్ణయించుకున్నాడు.

శాఖలో చేరిన మొదటి రోజు నుంచే అక్కడి కార్యకలాపాలలో నిమగ్నమయ్యాడు సుందరయ్య. కొత్త స్నేహితులతో కలిసి మొదటి రోజు వ్యాయామం చేయడం సుందరయ్యకు సరదాగా అనిపించింది. వ్యాయామం తర్వాత శాఖాధిపతి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధం గురించి కార్యకర్తలకు సమాచారం అందించారు. అంతే కాదు పాకిస్తాన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కారణంగా బెంగాల్, పంజాబ్‌లో చోటుచేసుకుంటున్న ఉద్రిక్తత గురించి కూడా ఆయన కార్యకర్తలకు వివరించారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో హిందువులపై దాడులు జరుగుతున్నాయని తెలిసి చాలా మంది కార్యకర్తలు కలవరపాటుకు గురయ్యారు. బెంగాల్‌లో చోటుచేసుకున్న కొన్ని ఘటనలను శాఖాధిపతి ప్రస్తావించారు.

శాఖ ముగిసిన వెంటనే ఇతర కార్యకర్తల మాదిరిగానే సుందరయ్య కూడా తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నాయనే విషయం అతన్ని మనస్సును కలవరానికి గురిచేసింది. పాకిస్తాన్ ఏర్పాటు చేయాలని బ్రిటీషర్లు, ముస్లింలు డిమాండ్ చేస్తుండటం వల్ల హిందువులు, హైందవ సంస్కృతి ప్రమాదంలో పడుతోందని సుందరయ్యకు నమ్మకం కలిగింది.

అప్పటి నుంచి సంఘ్ శాఖలో నిత్యం పాల్గొనడం సుందరయ్య అలవాట్లలో ఒకటిగా మారింది. చదువులు, ఆటపాటలు కొనసాగుతున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావజాల ప్రభావం సుందరయ్య మనస్సులో పెరుగుతూపోయింది. పదిహేడేళ్ల వయస్సులో సుందరయ్య పదో తరగతికి వచ్చాడు.

ఒక రోజు శాఖ ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చినప్పుడు సుందరయ్య తన మేనత్త ఆదియమ్మ వచ్చిన విషయాన్ని గుర్తించాడు. మేనల్లుడిని చూసిన వెంటనే ఎంతో మురిసిపోయి అతన్ని అక్కున చేర్చుకుంది. తన వెంట తెచ్చుకున్న సంచిలోంచి స్టెతస్కోప్ తీసి సుందరయ్య మెడలో వేసింది. మేనత్త ఎందుకు

అలా చేసిందో సుందరయ్యకు అర్థం కాలేదు. ఇంతకు ముందు స్టెతస్కోప్‌ను సుందరయ్య ఒకట్రెండుసార్లు డాక్టర్ మెడలో చూశాడు కాని అది ఎందుకు ఉపయోగిస్తారో, దాని పేరేంటో అతనికి తెలియదు. సుందరయ్య ముఖంలో కనిపిస్తున్న అయోమయం, సందేహాలను గమనించిన ఆదియమ్మ, 'సుందర్, నీవు డాక్టరు కావాలి, డాక్టర్ అయి ప్రజలకు సేవ చేయాలి. చూస్తున్నావు కదా నెల్లూరు మొత్తంలో కేవలం ఇద్దరో, ముగ్గురో డాక్టర్లు ఉన్నారు. వాళ్లంతా కూడా నెల్లూరు పట్టణంలో ఉంటూ వైద్యసేవలందిస్తుంటారు. అనారోగ్యం బారిన పడిన వాళ్ల చికిత్స పొందేందుకు అష్టకష్టాలు పడుతున్న పరిస్థితి. నీవు డాక్టరై గ్రామాల్లోని ప్రజలు సేవ చేయాలి" అన్నారు.

మేనత్త నోటి నుంచి వచ్చిన మాటలు విని సుందరయ్య ఆశ్చర్యంలో మునిగిపోయాడు. తనను డాక్టర్ కావాలని మేనత్త ఎందుకు అడుగుతోందనే ప్రశ్న సుందరయ్య మనసులో తలెత్తింది. తనకు ఆ మాట చెప్పేందుకు మేనత్త ఎందుకింత నాటకీయంగా వ్యవహరించింది? వైద్యులు ఉపయోగించే పరికరాలు కొనుగోలు చేయడం అవసరమా? ఎవరైనా స్టెతస్కోప్ మెడలో వేసుకుంటే డాక్టర్ అయిపోతారా? అని రకరకాల సందేహాలు సుందరయ్యకు కలిగాయి.

సంఘ్‌లో చేరినప్పుడు తన జీవిత లక్ష్యాన్ని తెలుసుకున్నానని సుందరయ్య అనుకున్నాడు. ఇప్పుడు హఠాత్తుగా మేనత్త కొత్త బాధ్యత చేపట్టడమని అడగడం సుందర్యయను సందేహంలోకి నెట్టింది.

సుందరయ్య మేనత్త అతనికి అత్యంత శ్రేయోభిలాషి. తన మేనత్త తెలివైనది, లోకజ్ఞానం కల్గిన వ్యక్తి. ప్రపంచవ్యాప్తంగా జరిగే అనేక విషయాలు తెలుసుకుంటారనే సంగతి కూడా తెలుసు. మేనల్లుడి ముఖంలో కనిపిస్తున్న అయోమమం, సందేహాలు గమనించిన అక్క 'సుందర్, నీవు ఆందోళనగా కనిపిస్తున్నావు, ఏమైంది?" అని ప్రశ్నించింది.

సుందరయ్య మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు ఆమె, 'మీ అక్కకు కూడా చెప్పవా?" అని అడిగింది.

అది విన్న సుందరయ్య, "అక్క, నేను స్వయం సేవకుడిగా మారిపోయాను.

ఇప్పుడు నేను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో సభ్యుడిగా ఉన్నాను. నేను ప్రతీ రోజు శాఖకు వెళ్తున్నాను. అక్కడ నేను అనేక విషయాలు నేర్చుకున్నాను. జీవితాంతం స్వయంసేవకుడిగా ఉంటూ ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాను. హైందవ సంస్కృతి ప్రమాదంలో ఉంది. హిందువులపై దాడులు జరుగుతున్నాయి. మన సోదర సోదరీమణులను రక్షించుకోవడం మన కర్తవ్యం" అన్నాడు.

ఈ మాటలు చెప్పిన తర్వాత సుందరయ్య మౌనంగా నిల్చున్నాడు. మేనత్త తెలివైనది. చక్కని ఆలోచనాపరురాలు. ప్రపంచంలో జరిగే ప్రతీ విషయం తెలుసుకోవాలనుకుంటుంది. మేనల్లుడి ఆలోచనలు అర్థం చేసుకునేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు. ఈ విషయాలు అర్థం చేసుకుంటూనే ఆమె, చూడు సుందర్, నీవు సంఘ్‌లో కొనసాగు. స్వయం సేవకుడిగా ఉండు. నీకెవరు అడ్డు చెప్పరు. సంఘ్ ఏం చెప్తుందో నేను కూడా అదే విషయాన్ని నీకు చెప్తున్నాను. నీవు ప్రజలకు సేవ చేయి. నీ జీవితాన్ని పేదల సేవకు సమర్పించు. డాక్టర్ అయి నీవు ఎంతో మందికి సాయపడవచ్చు. ఇది దేశానికి సేవ కూడా. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారికి చికిత్స చేసే వారు ఎవరూ లేరు. నీవు డాక్టరై అలాంటి వారికి సాయమందించు" అని చెప్పింది.

'నీవు తెలివైనవాడివి. చదువు సంధ్యల్లో రాణిస్తున్నావు. నీ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. నీ తెలివితేటలను సద్వినియోగం చేసుకో. నీవు సులభంగా డాక్టరు కాగలవు. డాక్టరై పేదలకు వైద్యసేవలందిస్తూ దేశానికి సేవ చేయ్. గుర్తుంచుకో.. పేదలకు సేవ చేయడం, వాళ్లను అనారోగ్యం నుంచి బయటపడేయటానికి మించిన దేశ సేవ ఏముంటుందని" మేనల్లుడికి ఆదియమ్మ కర్తవ్య బోధ చేసింది.

మేనత్త మాటలకు సుందరయ్య ప్రభావితుడయ్యారు. డాక్టర్ కావాలని నిశ్చయించుకొని సుందరయ్య కొత్త ప్రతిజ్ఞ తీసుకున్నాడు. వైద్యుడిగా మారి ప్రజలకు ముఖ్యంగా పేదలకు చికిత్స అందించవచ్చని భావించారు. అంతే కాదు సంఘ్ కార్యకలాపాలలో మరింత చురుగ్గా పాల్గొనాలని అనుకున్నారు. సుందరయ్య కళ్ళలో కొత్త ఉత్సాహం గమనించిన మేనత్త ఆదియమ్మ అతను ఇక సరైన మార్గంలో ఉంటాడని, మేనల్లుడికి జీవిత లక్ష్యం దొరికిందని అర్థం చేసుకుంది.

ఇది జరిగిన తర్వాత రోజు శాఖకు వచ్చిన సుందరయ్య డాక్టర్ కావాలనే తన కొత్త లక్ష్యం గురించి సహచరులకు చెప్పాడు. డాక్టర్ అవడం ద్వారా చాలా మందికి సేవ చేయవచ్చని సహచరులు కూడా సుందరయ్యను ఒప్పించారు. " వైద్యో నారాయణో హరి అంటే వైద్యులు దేవుడితో సమానం. వారు ప్రాణాలు కాపాడతారు. బాధను తొలగిస్తారు. వ్యాధిని దూరం చేస్తారు. మన దేశంలో వైద్యుల కొరత ఉంది" అని ఒక సహచరుడు అన్నాడు. ఈ తరహా మాటలు సుందరయ్య సంకల్పాన్ని మరింత దృఢం చేశాయి.

పదో తరగతిలో చేరిన సుందరయ్యకు ఒకటే లక్ష్యం. మంచి మార్కులతో పదో తరగతిలో పాసై డాక్టరయ్యేందుకు మంచి కళాశాలలో చేరాలని. పదో తరగతి ప్రారంభం నుంచే సుందరయ్య ఎంతో శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు. అటు తెల్ల చొక్కా, ఖాకీ నిక్కర్ ధరించి శాఖకు వెళ్తుండటం సుందరయ్యకు ఎంతో గౌరవంగా అనిపించేది. ప్రభాతభేరీలో సహచరులతో అడుగు అడుగు కలుపుతూ ముందుకు సాగుతున్నప్పుడు అతని ఆనందం ఉన్నతస్థాయిలో ఉండేది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లేనట్టు అయితే హిందువులపై దాడులు చేసి వారిని భయపెట్టి, బెదిరించి మతమార్పిడి చేస్తారని కౌమారప్రాయంలో ఉన్న సుందరయ్య భావించాడు.

పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో సుందరయ్య ఉత్తీర్ణత సాధించాడు. అతను 62% మార్కులు సాధించాడు. ఆ రోజుల్లో అలాంటి మార్కులు పొందడం గొప్ప విజయంగా పరిగణించబడేది. చాలా తక్కువ మంది పిల్లలే అప్పట్లో  పాఠశాలకు వెళ్లేవారు. ఆరోజుల్లో తక్కువ మంది విద్యార్థులు మాత్రమే చదువుకోసం పాఠశాలలకు వెళ్లేవారు. వారిలో చాలామంది రకరకాల కారణాలతో చదువులు మధ్యలోనే ఆపేసేవారు. పదో తరగతి చాలా తక్కువ మంది చేరేవారు. అందులోనూ అతి తక్కువ మంది ఆ పరీక్షల్లో గట్టెక్కేవారు. బ్రిటీష్ వారి కాలంలో పదవ తరగతి ఉత్తీర్ణత అంటే ప్రభుత్వ ఉద్యోగం పొందడం. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో  కేవలం ఇరవై  శాతం మంది పిల్లలు మాత్రమే 10 వ తరగతి వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులయ్యేవారు. 10 వ తరగతి ఉత్తీర్ణులైన పిల్లలలో  కొంతమంది మాత్రమే తదుపరి చదువులకు వెళ్లేవారు. చాలా మంది పిల్లలు తమ కుటుంబీకులు చేసే కులవృత్తిలో చేరేవారు. కొందరు

ఉద్యోగాల అన్వేషణలో నిమగ్నమయ్యేవారు. ఆ రోజుల్లో విద్యావంతుల కొరత ఎక్కువగా ఉండటంతో పదవ తరగతి పాసైతే చాలు ఖచ్చితంగా ఉద్యోగం లభిస్తుందనే నమ్మకం ఉండేది.

జమీందార్లు, సామంతులు, అధికారుల పిల్లలు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలలో చదువుకునేవారు. బ్రిటీష్ వారు తమ పిల్లల విద్య కోసం దేశంలో అనేక ప్రాంతాల్లో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు ప్రారంభించారు. వారి పిల్లల చదువుల కోసం యూరప్ నుంచి ముఖ్యంగా బ్రిటన్ నుంచి ఉపాధ్యాయులను భారతదేశానికి పిలిచేవారు. క్రైస్తవ మిషనరీలు అనేక పాఠశాలలు ప్రారంభించాయి. ఆ పాఠశాలల ఉపాధ్యాయులలో ఎక్కువ మంది పాస్టర్లే ఉండేవారు. క్రైస్తవ సన్యాసినులు అంటే నన్స్ కూడా ఈ మిషనరీ పాఠశాలల్లో విద్యార్థులకు బోధించేవారు. చాలా మంది హిందువులు తమ పిల్లలను ఈ పాఠశాలలకు పంపేవారు కాదు. ఆ పాఠశాలల్లో క్రైస్తవమత ప్రచారం చేస్తారని, పిల్లల మనస్సు ప్రభావితం చేయడం ద్వారా వారు క్రైస్తవ మతంలోకి మారేలా మోసగిస్తారని నమ్మేవారు.

సుందరయ్య చదువంతా తెలుగు మాధ్యమంలోనే సాగింది. చదువు చెప్పిన ఉపాధ్యాయులందరూ హిందువులే. పాఠశాలలో నిర్వహించినా ఏ పరీక్షలోనూ సుందరయ్య ఎప్పుడు టాప్ మార్కులు పొందలేదు, ఎప్పుడూ తరగతిలో మొదటి స్థానంలో నిలవలేదు. కానీ అలా అని వెనుకబడి లేదు. మూడో ర్యాంక్ లేదా నాలుగో ర్యాంకులో నిలిచేవాడు. పదవ తరగతి వార్షిక పరీక్షలో పాఠశాలలో మూడవ ర్యాంక్ సాధించాడు.

మంచి మార్కులతో సుందరయ్య పాసయ్యాడని తెలిసి అమితంగా సంతోషించిన వ్యక్తి అతని మేనత్త ఆదియమ్మ. ఇక ఖచ్చితంగా తన మేనల్లుడు డాక్టరవుతాడని ఆమె విశ్వసించింది.

సుందరయ్య విషయంలో మరో ప్రత్యేకత కూడా ఉంది. మంచి మార్కులు సాధించిన సుందరయ్య సమాజంలో అట్టడగు వర్గాల పిల్లలందరిలో ఉన్నతంగా నిలిచాడు. వెనుకబడిన కులాలకు చెందిన విద్యార్థుల్లో చాలా తక్కువ మందే పదో తరగతికి వచ్చేవారు. అలా వచ్చిన వారిలో అతి తక్కువ మంది మాత్రమే

పరీక్షల్లో విజయం సాధించేవారు. వారికి కూడా 50% కంటే తక్కువ మార్కులే వచ్చేవి. పశువులు మేపేవాళ్లు, మేకలు, గొర్రెలు పెంచుకునే వ్యవసాయ కూలీల కుటుంబానికి చెందిన బాలుడు సుందరయ్య పదవ తరగతి 60 శాతానికి పైగా మార్కులతో పాసవడం సామాన్యమైన విషయం కాదు. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులను బట్టి చూస్తే అదొక అసాధారణ సంఘటన

ఆ సమయంలో భారతదేశమంతటా ఒక సామాజిక విప్లవం ప్రారంభమైంది. కులం పేరుతో జరిగే వివక్ష, హింస అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమాలు మొదలయ్యాయి. అటువంటి అతి పెద్ద ఉద్యమానికి నాయకత్వం వహించింది భీంరావు రాంజీ అంబేద్కర్. ఆయనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్గా ప్రాచుర్యం పొందారు. 1891 ఏప్రిల్ 14 న మధ్య భారతదేశంలోని మహూ పట్టణంలోని మిలిటరీ కంటోన్మెంట్లో జన్మించిన అంబేద్కర్– దళితులు, అంటరానివారు, అణగారిన వర్గాలు, మహిళల హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా ఎదిగారు. అంటరానివారిగా పరిగణించబడే మహార్ కులంలో జన్మించాడు అంబేద్కర్. అంబేద్కర్ పూర్వీకులు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి చెందిన సైన్యంలో చాలాకాలంగా సేవలందిస్తుండేవారు. ఆయన తండ్రి రామ్జీ సక్పాల్. మహులోని భారత సైన్యానికి కంటోన్మెంట్లో పనిచేసేవారు. నిమ్న కులానికి చెందిన వాడు కావడం వలన బాల్యంలో వివక్ష, అస్పృశ్యత, అవమానకరమైన వ్యాఖ్యలను అంబేద్కర్ భరించాల్సి వచ్చేది.

అంబేద్కర్ పాఠశాల విద్య 1900, నవంబర్ 7 న మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని రాజవాడ చౌక్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. 1904 లో అంబేద్కర్ బొంబాయికి మారాల్సి వచ్చినప్పుడు ఆ మహానగరంలో ఎల్ఫిన్స్టోన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరారు. అంబేద్కర్ 1907 లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆ రోజుల్లో అంటరాని కులాలకు చెందిన పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశం ఉండేది కాదు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణల కారణంగా వారికి కూడా విద్య హక్కు లభించింది. ఈ కారణంగా అంబేద్కర్ పాఠశాలకు వెళ్లగలిగాడు. మహార్ కులానికి చెందిన వారిలో మెట్రిక్యూలేషన్ పాసైన మొదటి విద్యార్థి బహుశా అంబేద్కర్ అయి ఉంటారు. మెట్రిక్యులేషన్ పూర్తైన తర్వాత, అంబేద్కర్ ఉన్నత

చదువుల కోసం బొంబాయి విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఎల్ఫిన్‌స్టోన్ కళాశాలలో చేరారు. 1912 లో బొంబాయి విశ్వవిద్యాలయం నుండి ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (B.A.) డిగ్రీని పొందారు. డిగ్రీ పొందిన తరువాత, ఆయన బరోడా రాజ్యంలో ఉద్యోగం ప్రారంభించారు. అంబేడ్కర్ B.A.), లో ఉన్నప్పుడు జరిగిన సంఘటన అది. అంబేడ్కర్ చదువలకయ్యే ఖర్చును ఆయన తండ్రి భరించలేకపోయారు. ఆనాటి ప్రసిద్ధ సంఘ సంస్కర్త, మరాఠీ సాహితీవేత్త కృష్ణాజీ అర్జున్ కేలుస్కర్ బరోడా ప్రభుత్వం నుంచి అంబేడ్కర్‌కి స్కాలర్‌షిప్ అందేలా చేసారు. ఈ కారణంగా డిగ్రీ పాసైన వెంటనే అంబేడ్కర్ బరోడా సంస్థానంలో పని చేయాల్సి వచ్చింది. అంబేడ్కర్ తండ్రి 1913, ఫిబ్రవరి 2 న మరణించారు. అదే సంవత్సరంలో అతను మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (M.A.) అధ్యయనం కోసం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు వెళ్లాడు. 1915 లో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పట్టా పొందాడు. M.A.లో, ఆయన మెయిన్ సబ్జెక్ట్ అర్థశాస్త్రం. కొలంబియా విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్రం, చరిత్ర, తత్వశాస్త్రం, మనస్తత్వ శాస్త్రం కూడా అంబేడ్కర్ అభ్యసించారు. M.A.లో ఆయన "ప్రాచీన భారతీయ వాణిజ్యం" అనే పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంబేడ్కర్ అమెరికాలో ఉన్న సమయంలోనే ప్రముఖ మానసిక శాస్త్రవేత్త డాక్టర్ అలెగ్జాండర్ గోల్డెన్‌వైజర్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా పత్రం చదివే అవకాశం లభించింది. ఈ పత్రంలోని అంశం "భారతదేశంలో కులాలు: వారి యంత్రాంగం, మూలం, అభివృద్ధి". అది చదివిన తరువాత అంబేడ్కర్ తన పరిశోధనా, అధ్యయనాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా – ఎ హిస్టారికల్ అండ్ అనలిటికల్ స్టడీ' అనే అంశంపై అద్భుతమైన పరిశోధనా పత్రాన్ని సిద్ధం చేశారు.

ఆ తర్వాత అంబేడ్కర్ అమెరికా నుంచి లండన్ వెళ్లి ఆర్థికశాస్త్రం, రాజకీయ శాస్త్రం అభ్యసించారు. విదేశాల్లో చదువు కోసం బరోడా ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్‌షిప్ గడువు ముగియడంతో ఆయన దాన్ని ఆపేసి భారతదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. అప్పటి బరోడా మహారాజా సాయాజీరావు గైక్వాడ్ – III అంబేడ్కర్‌ను తన రక్షణ మంత్రిగా నియమించారు. కానీ బరోడాలో అంబేడ్కర్

కులవివక్షకు గురయ్యారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ కులం కారణంగా వ్యతిరేకతను చవిచూడాల్సి వచ్చింది. ఒక విధంగా అది సామాజిక బహిష్కరణ. అంబేడ్కర్ నవంబర్ 1917 లో బొంబాయికి తిరిగి వచ్చారు.

బ్రతుకుతెరువు కోసం అంబేడ్కర్ ప్రైవేట్ ట్యూటర్, అకౌంటెంట్‌గా పనిచేయడం ప్రారంభించారు. సొంత కన్సల్టెన్సీని కూడా ఆయన మొదలుపెట్టారు. అంటరాని కులానికి చెందిన కారణంగా అంబేడ్కర్‌కు పని ఇచ్చేందుకు చాలా మంది నిరాకరించడంతో ఆ కన్సల్టెన్సీ సరిగ్గా నడవలేదు. ఆ తర్వాత అంబేడ్కర్ బొంబాయిలోని సిడెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్‌లో రాజకీయ, ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, భీంరావు 1920 జనవరి 31 న 'మూక్నాయక్' పేరుతో పక్షపత్రికను ప్రారంభించారు. ఈ వార్తాపత్రిక నిర్వహణకు కొల్హాపూర్ పాలకుడు షాహు మహారాజ్ సాయమందించారు. షాహు మహారాజ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, వారి అభివృద్ధికి అనుకూలంగానే ఉండేవారు. ఈ సమయంలో అంబేడ్కర్ అనేక సమావేశాలలో ప్రసంగించారు. వెనుకబడిన కులాల ప్రజలు తమ అధికారాలు, చదువు కోసం పోరాడేలా ప్రేరేపించారు, ప్రోత్సహించారు. తదుపరి ఉన్నత చదువుల కోసం నిధులు సేకరించుకొని సెప్టెంబర్ 1920లో అంబేడ్కర్ మళ్లీ లండన్ వెళ్లారు.

1921లో ఎకనామిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తి చేశాక బారిస్టర్ అయ్యారు. 1923లో ఎకనామిక్స్‌లో 'డాక్టర్ ఆఫ్ సైన్స్' డిగ్రీ పొందారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి. పిహెచ్.డి పొందారు. విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేసుకున్న అంబేడ్కర్ ఏప్రిల్ 1923 లో స్వదేశానికి తిరిగి వచ్చారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత అంబేడ్కర్ బొంబాయి హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అదే సమయంలో స్వాతంత్య పోరాటంలోనూ కీలకంగానూ వ్యవహరించారు. న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా, రచయితగా, అంబేడ్కర్ దళితులు, అణగారిన వర్గాల ప్రజలు, మహిళల అభ్యున్నతి, వారి వికాసం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించడం

ప్రారంభించారు. ఈ కార్యక్రమాలన్నీ సామాజిక, రాజకీయ విప్లవంగా మారాయి.

1924 లో అంటరానితనానికి వ్యతిరేకంగా చేసిన ప్రచారంలో భాగంగా 'బహిష్కృత హితకారణి సభ'ను స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం అంటరానివర్గాలను జనజీవన స్రవంతిలోకి తీసుకురావడం, వారిని చైతన్యపరిచి వారి సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగుపరచడం. విద్యావంతులు అవ్వండి, చైతన్యవంతులు అవ్వండి, సంఘటితంగా ఉండండి ఈ సంస్థ నినాదం.

1927 డిసెంబర్ 25న, అంబేడ్కర్ ఒక పని ద్వారా మొత్తం దేశం దృష్టిని ఆకర్షించారు. దళితులతో కలిసి ప్రాచీన హిందూ గ్రంథం 'మనుస్మృతి' ప్రతులను అంబేడ్కర్ తగలబెట్టారు. భారతీయ సమాజంలో అమలవుతున్న చట్టాలు మనుస్మృతిపై ఆధారపడి ఉన్నాయని ఆయన అన్నారు. ఇవి బ్రాహ్మణ, పురుషాధిక్య, వివక్షపూరిత చట్టాలు. వీటికి ముగింపు పలకాలని అంబేడ్కర్ పిలుపునిచ్చారు. 'మనుస్మృతి'పై దళితుల ఆగ్రహం నిరంతరం పెరుగుతునే ఉంది. అంబేడ్కర్ వ్యతిరేకించిన అనేక విషయాలు ఆ గ్రంథంలో ఉన్నాయి. బ్రాహ్మణులకు సేవ చేయడమే శూద్రుల ప్రధాన కర్తవ్యమని మనుస్మృతిలో వివరించబడింది. అంతే కాదు, శూద్రుడు ఏం చేసినా, అతనికి కర్మ ఫలం లభించదని అందులో పేర్కొనబడింది. బ్రాహ్మణుల ఆస్తిని రాజు ఎన్నడూ తీసుకోరాదని, దానికి ఒక నిర్దిష్ట నియమమని, ఇదొక గౌరవమని, కానీ ఇతర కులస్తుల ఆస్తిని వారికి వారసులు లేనట్టయితే రాజు తీసుకోవచ్చని మనుస్మృతిలో పేర్కొనబడింది. బ్రాహ్మణ హత్యను మించిన పాపకార్యం ఈ సృష్టిలో మరొకటి లేదు. కాబట్టి, రాజు తన మనస్సులో బ్రాహ్మణులను చంపాలనే ఆలోచనను ఎప్పుడూ తీసుకురాకూడదు. ఇది మాత్రమే కాదు, శూద్రులకు భోజనం కోసం ఎంగిలి ఆహారం, ధరించడానికి పాత దుస్తులు, కప్పుకోవడానికి వరి గడ్డి, పాత బట్టలు వేయాలని కూడా అందులో లిఖించబడింది. పిల్లి, ముంగీస, నీలకంఠం, కప్ప, కుక్క, ఆవు, గుడ్లగూబ, కాకి వీటిలో దేన్ని హింసించినా దానికి ప్రాయశ్చిత్తంగా శూద్రుడిని చంపవచ్చని.. ఏదైనా ఒక హింసకు శూద్రుడిని చంపడానికి ప్రాయశ్చిత్తంతో సమానమని..

అంటే శూద్రుడిని చంపడమన్నది కుక్క-పిల్లిని చంపడంతో సమానమని చెప్పబడింది. ఒకవేళ శూద్రుడు ఎవరైనా ద్విజుడిని దూషించినట్టు అయితే అతని నాలుకను కత్తిరించాలి, ఎందుకంటే వారు బ్రహ్మ శరీరంలోని అత్యంత దిగువ భాగం నుండి జన్మించారు. ఎవరైనా తక్కువ కులంలో జన్మించిన వ్యక్తి ఉన్నత కులానికి చెందిన వ్యక్తిని కొట్టి, హాని చేస్తే, అతని అవయవాన్ని నష్టానికి అనుగుణంగా నరికేయాలి. శూద్రులకు బ్రహ్మ దేవుడు ఒక బాధ్యతను మాత్రమే నిర్దేశించాడు. అదేంటంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులను కీర్తిస్తూ వారికి సేవ చేయడం.

ఈ సంఘటన తరువాత అస్పృశ్యత సంఘటనలకు ముగింపును పలికే లక్ష్యంతో మరో గొప్ప పని చేసారు అంబేడ్కర్. "అంటరానితనం బానిసత్వం కంటే దారుణం" అని అంబేడ్కర్ అన్నారు.

అంబేడ్కర్ 1927, మార్చి 20 న మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలోని మహాడ్‌కు చెందిన అనేక మంది దళితులతో కలిసి అక్కడి చెరువులో నీళ్లు తాగారు. అంబేడ్కర్ స్వయంగా తన చేతులతో నీరు తాగడమే కాకుండా ఇతర దళితులను కూడా చెరువులోని నీరు తాగమని కోరాడు. ఆ రోజుల్లో, ఈ చెరువులో దళితుల ప్రవేశం ఉండేది కాదు. గ్రామానికి చెందిన కరుడుగట్టిన అగ్రవర్ణాలవారు ఈ నిషేధాన్ని విధించారు.

హిందూ మతంలో అగ్రవర్ణాల హక్కులను నిరంతరం సవాలు చేయడం ప్రారంభించారు అంబేడ్కర్. ఒకదాని తర్వాత ఒకటిగా అనేక ఉద్యమాలు చేపట్టారు. 1930 లో నాసిక్ లోని కాలారామ్ ఆలయంలో దళితుల ప్రవేశంపై ఉన్న నిషేధానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ 1930 మార్చి 2 న నాసిక్ నగరంలో ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపులో పాల్గొన్న దళితులందరూ కాలారామ్ ఆలయానికి చేరుకోవాలని అంబేడ్కర్ పిలుపునిచ్చారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించడమే ఆయన లక్ష్యం. అంబేడ్కర్ నాయకత్వంలో ప్రజలు ఆలయానికి చేరుకునే సమయానికి ఆ ఆలయ ద్వారాలు మూసేశారు. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడాలని అంబేడ్కర్ కోరుకోలేదు. దీంతో ఆయన ఊరేగింపుతో వెనక్కి తిరిగి వచ్చారు. మరుసటి

రోజు మళ్లీ ఆలయ ప్రవేశానికి మరో ప్రణాళిక సిద్ధం చేశారు. రెండో రోజు కూడా దళితులను ఆలయంలోనికి అనుమతించలేదు. ఇది ఇలాగే కొనసాగింది. ఈ క్రమంలో బ్రాహ్మణులు, దళితుల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం శ్రీరామనవమి నాడు నిర్వహించే రథోత్సవంలో రథాన్ని లాగే హక్కు దళితులను ఇవ్వాలని నిర్ణయించారు. కాని శ్రీరామనవమి నాడు రథం లాగేందుకు దళితులు చేరుకునే సమయానికి కొంత మంది ఉన్నత కులాలకు చెందిన యువకులు రథాన్ని తీసుకొని వెళ్లిపోయారు. రథాన్ని లాగే అవకాశం దళితులకు దక్కలేదు. ఈ సంఘటన తర్వాత ఘర్షణ కొనసాగింది. దళితులపై దాడులు మొదలయ్యాయి. దళితుల పిల్లలు పాఠశాలలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. రోడ్లు, ఇతర మార్గాలు మూసివేయబడ్డాయి. అగ్రవర్ణాల దుకాణదారులకు దళితులకు సరుకులు విక్రయించడం ఆపేశారు. సామాజిక బహిష్కరణ ప్రారంభమైంది. అయినప్పటికీ, అంబేద్కర్ తన ఆందోళనను ఆపలేదు. ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు. ముఖ్యమైన విషయమేంటంటే అంబేద్కర్ ఎప్పుడూ కూడా అహింసా మార్గాన్ని వీడలేదు. ఆందోళనలు చేపట్టిన వారు హింసకు పాల్పడకుండా చూశారు. చట్ట ఉల్లంఘనను అంబేద్కర్ ఏనాడు సమర్థించలేదు.

1935 లో మహారాష్ట్ర యెవాలాలో జరిగిన ఒక సమావేశంలో అంబేద్కర్ ఉపన్యాసం చేశారు. ఆ ప్రసంగం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంబేద్కర్ మొదటిసారి దూకుడు వైఖరిని కనబరిచారు. తమ హక్కుల కోసం పోరాడేందుకు ప్రేరేపించే లక్ష్యంతో చేసిన ఈ ప్రసంగంలో అంబేద్కర్ అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలు పడుతున్న బాధ, వేదనను తెలియబరిచారు. ఈ చారిత్రక ప్రసంగంలో అణగారిన వర్గాలకు మతాన్ని ఎంచుకునే హక్కు కల్పించాలని అంబేద్కర్ నినదించారు. దళితులను ఉద్దేశించి "మీకు గౌరవప్రదమైన జీవితం కావాలంటే, మీకు మీరే సాయం చేసుకోవాలి, అది ఉత్తమైన సాయంగా ఉండాలి" అని అంబేద్కర్ అన్నారు. మీకు ఆత్మగౌరవం కావాలంటే మతం మారండి. మీకు అనుకూల సమాజాన్ని కాంక్షిస్తున్నట్టు అయితే మతం మారండి. మీకు బలం, అధికారం కావాలనుకుంటే మతం మార్చుకోండి. సమానత్వం, స్వేచ్ఛ, సంతోషంగా జీవించేందుకు తగిన

ప్రపంచాన్ని సృష్టించుకోవాలంటే మతం మారండి" అని పిలుపునిచ్చారు.

వెనుకబడిన వర్గాల ప్రజలను చైతన్యపరిచేందుకు అంబేద్కర్ తాను చేస్తున్న ప్రయత్నాలు కొనసాగిస్తూ తన ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఇప్పుడు భారతదేశంలో పోరాటం బ్రిటిష్ వారిని భారతదేశం నుండి తరిమికొట్టడం మాత్రమే కాదు, దళితులు, అణగారిన వర్గాల ప్రజలను అన్యాయం, దౌర్జన్యం నుంచి విముక్తి కల్పించి వారికీ హక్కులు కల్పించేందుకు కూడా సాగింది. భారతదేశంలో రాజకీయ మార్పు కోసమే కాదు సామాజిక, సాంస్కృతిక మార్పు కోసం కూడా విప్లవం సాగింది. భీంరావు అంబేద్కర్, ఆయన చేపట్టిన ఉద్యమాల కృషి ఫలితంగా విప్లవం విజయవంతమైంది.

హిందూ సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించే ప్రయత్నాలకు బ్రిటీష్ వారు ఇరవైవ శతాబ్ద ఆరంభంలో పూనుకున్నారు. కాని దానికి ఉన్నత వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురైంది. దళితులకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా బ్రిటీష్ వారు హిందూ ధర్మాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డాయి ఆ వర్గాలు. దళితులను హిందువుల నుంచి వేరు చేసేందుకు బ్రిటీష్ వారు కుట్ర పన్నారనే ఆరోపణలు ఆ నాడు వినిపించాయి.

1908లో బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్ రిప్పన్‌ను భారతదేశ గవర్నర్ జనరల్‌గా నియమించింది. భారతదేశంలో విద్యను ప్రోత్సహించేందుకు, దాని కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు 'ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' పేరుతో ఒక కమిషన్‌ను లార్డ్ రిప్పన్ ఏర్పాటు చేశారు. 1882 ఫిబ్రవరి 3 న సర్ విలియం హంటర్ అధ్యక్షతన ఈ విద్యా కమిషన్ ఏర్పడింది. వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యుడు విలియం హంటర్. భారతదేశంలో విద్యారంగంలో చేపట్టాల్సిన సంస్కరణలు, ప్రాథమిక విద్య, ఉన్నత విద్య అభివృద్ధి కోసం ఈ కమిషన్ అనేక కీలక సూచనలు చేసింది. సంఘ సంస్కర్త, ఆలోచనాపరుడు, తత్వవేత్త, విప్లవ నాయకుడు 'మహాత్మ' జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడేవారు. ఉచిత, నిర్బంధ విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికి దామాషా పద్ధతిలో రిజర్వేషన్– ప్రాతినిధ్యాన్ని కల్పించాలని విద్యా కమిషన్‌కు జ్యోతిరావు పూలే సూచించారు.

భారతదేశంలో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని మహాత్మా ఫూలే ప్రారంభించిన ఉద్యమాన్ని అంబేద్కర్ మరింతముందుకు తీసుకెళ్లారు. అంబేద్కర్ కృషి, చేపట్టిన సామాజిక–రాజకీయ ఉద్యమాల కారణంగా భారత ప్రభుత్వ 1909లో అంటరానివర్గాలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించింది. అంతే కాదు బ్రిటిష్ ప్రభుత్వం 1932 ఆగస్టు 17 న వివిధ కులాలు, మతాల కోసం 'కమ్యూనల్ అవార్డు' ప్రారంభించింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక ఓటు, స్వతంత్ర రాజకీయ హక్కు లభించింది. దళితులకు రెండు ఓట్లు హక్కు లభించాయి. రెండు ఓట్ల విధానంలో దళితులు ఒక ఓటు ద్వారా తమ ప్రతినిధిని ఎంచుకోవచ్చు, రెండో ఓటు ద్వారా వారు సాధారణ ప్రతినిధిని ఎంచుకోవచ్చు. ప్రత్యేక నియోజకవర్గం, రెండు ఓట్ల విధానం కారణంగా హిందూ సమాజం రెండుగా చీలిపోతుందని విశ్వసించారు గాంధీజీ. దళితులకు కల్పించిన ఈ హక్కును వ్యతిరేకిస్తూ బ్రిటిష్ అధికారులకు గాంధీజీ ఒక లేఖ రాశారు. ఆ లేఖపై బ్రిటీష్ ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టకపోవడంతో పూణేలోని ఎరవాడ జైలులో గాంధీజీ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు.

ఆమరణ నిరాహార దీక్ష కారణంగా గాంధీజీ ఆరోగ్య పరిస్థితి క్షీణించసాగింది. దేశంలో అగ్రవర్ణాలు, దళితుల మధ్య ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. దీంతో అంబేద్కర్ రాజీ పడాల్సి వచ్చింది. 1932 సెప్టెంబర్ 24న అంబేద్కర్, మహాత్మా గాంధీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది, దీనికి పూనా ఒప్పందం అని పేరు. ఈ ఒప్పందం కారణంగా దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు, రెండు ఓట్లు ముగిశాయి. దీనికి ప్రతిగా ప్రాంతీయ శాసనసభలలో దళితులకు రిజర్వ్ చేసిన స్థానాల సంఖ్యను 71 నుంచి 148 కి పెంచారు. అలాగే కేంద్రీయ సభలోని మొత్తం సీట్లలో 18 శాతం ఉండేలా మార్పులు చేశారు.

పునా ఒప్పందం దళితులకు మేలు చేసిందా? హాని చేసిందా?

ఈ ప్రశ్నకు చరిత్రకారుల్లో భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. చాలా మంది చరిత్రకారులు పునా ఒప్పందం దళితులకు వ్యతిరేకమని అభిప్రాయపడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అంబేద్కర్ రాజీపడ్డారని విశ్లేషించారు. మరో వైపు ఇతర చరిత్రకారులు పూనా ఒప్పందం దళితులకు మేలు చేసిందని వాదించారు.

కమ్యూనల్ అవార్డు కింద దళితుల కోసం రిజర్వ్ చేయబడిన 71 సీట్లను 148 కి పెంపును దీనికి ఉదాహరణగా చూపారు. ఈ ఒప్పందంలోని మరో ముఖ్యమైన విశేషం ఏంటంటే, సివిల్ సర్వీసెస్‌లో అణగారిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ అంగీకరించడం. ఈ ఒప్పందం కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించబడింది. హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి బ్రిటీష్ పాలకులు పెద్ద కుట్రకు తెరలేపుతున్నారని మహాత్మ గాంధీలాగా నమ్మినవాళ్లు చాలా మందే ఉన్నారు. బ్రిటిష్ వారి లక్ష్యం హిందూ సమాజం నుంచి దళితులను వేరు చేయడం. 'విభజించు, పాలించు' అన్నది బ్రిటీష్‌వారు అనుసరించిన విధానమని చాలా మంది నమ్మారు.

ఇటు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రభావం కారణంగా బ్రిటిష్ వారు హిందూ సమాజాన్ని కుట్రపూరితంగా విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని సుందరయ్య కూడా విశ్వసించసాగాడు. తక్కువ కులానికి చెందినప్పటికీ, హిందువులంతా ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటారని సుందరయ్య భావించాడు. 10 వ తరగతి పాసైన తర్వాత మిషనరీ కళాశాలలో సుందరయ్య చేరకపోవడానికి ఇదే కారణం. మిషనరీ కళాశాలలో ఇంగ్లిష్ కూడా బోధిస్తారు. డాక్టర్ కావాలంటే ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉండటం చాలా అవసరమనే విషయం సుందరయ్యకు బాగా తెలుసు. కానీ మిషనరీ కళాశాలలో చేరి, ఇంగ్లిష్ నేర్చుకోవడం ఇష్టంలేకపోయింది. మిషనరీ పాఠశాలలు, కాలేజీల్లో చేరిన హిందూ విద్యార్థులు వారి బోధనలతో ప్రభావితమై క్రైస్తవమతంలోకి మారుతారని సుందరయ్య మనసులో బాగా నాటుకుపోయింది. దిగువ కులానికి చెందిన పిల్లలు మతం మార్చుకునేలా చేసేందుకు రకరకాల ప్రలోభాలకు గురిచేస్తారు. ఈ కారణంగా సుందరయ్య మిషనరీ కళాశాలలో అడ్మిషన్ తీసుకోకుండా హిందూ సంస్థ నిర్వహించే కళాశాలలో చేరాలని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజుల్లో నెల్లూరు నగరంలోని వెంకటగిరి రాజా హైస్కూల్ హిందూ ధర్మానికి ప్రతీకగా ఉండేది. ఆ స్కూల్‌లో చేరి ఇంటర్మీడియట్ పూర్తి చేయాలని సుందరయ్య నిర్ణయించుకున్నాడు.

వెంకటగిరి రాజా ఉన్నత పాఠశాల ఏర్పాటుకు సంబంధించి ఆసక్తికరమైన చరిత్ర ఉంది. క్రైస్తవ మిషనరీలు పంతొమ్మిదవ శతాబ్దంలో నెల్లూరులో ఒక పాఠశాల నెలకొల్పారు. ఈ పాఠశాల పేరు ఫ్రీ చర్చి మిషన్ హైస్కూల్. అప్పటి నెల్లూరు జిల్లాలో ఉన్న ఏకైక ఉన్నత పాఠశాల అది. క్రైస్తవ మిషనరీలు ఇంటింటికీ వెళ్లి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కానీ చాలా మంది హిందువులు దీనిని వ్యతిరేకించారు. ఈ పాఠశాలలో హిందువులు పిల్లలకు క్రైస్తవ మతాన్ని నేర్పుతారని చాలా మంది నమ్మసాగారు. పిల్లలు హిందూమతాన్ని విస్మరించి క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా ప్రలోభాలకు గురిచేస్తారనే భావన అప్పటి సమాజంలో ఉండేది. ఈ అనుమానం కారణంగా చాలా హిందూ కుటుంబాలు తమ పిల్లలను ఈ పాఠశాలకు దూరంగా ఉంచాయి. హిందువుల పిల్లలను ఆకర్షించేందుకు క్రైస్తవ మిషనరీ 1873 లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సుంకు నారాయణ స్వామి చెట్టి అనే హిందువును నియమించింది. నారాయణ స్వామి చెట్టి నెల్లూరు జిల్లాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మొట్టమొదటి వ్యక్తి. కాని, పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి చెట్టితో రెవరెండ్ జాన్ మెక్‌మిలన్ ఏకీభవించలేదు. ఇద్దరి ఆలోచనలు వేర్వేరు. ప్రిన్సిపాల్ జాన్ మెక్‌మిలన్‌తో విభేదాల కారణంగా నారాయణ స్వామి చెట్టి ఉద్యోగం మానేశారు. నారాయణస్వామి చెట్టి పాఠశాలలో ఉద్యోగం విడిచిపెట్టిన తర్వాత మతమార్పిడులపై ఉన్న భావన ప్రజల్లో మరింత బలపడింది. ఆ పాఠశాల క్రైస్తవ మత ప్రచారం కోసం మాత్రమే ప్రారంభించారు అని నిర్ధారించుకున్నారు. విద్యావంతుడమైన నారాయణ స్వామి చెట్టి ఉపాధ్యాయుడిగా మంచి పేరు తెచ్చుకోవడంతో నెల్లూరులోని కొందరు హిందువులు, హిందూ పాఠశాల ప్రారంభించాలని ఆయనను అభ్యర్థించారు.

1875 మే 3 న నెల్లూరులో ఒక హిందూ పాఠశాల ప్రారంభమైంది. విరాళంగా అందించిన పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల స్థాపకుడైన నారాయణ స్వామి చెట్టి ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు కూడా చేపట్టారు. చెట్టితో పాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులు పాఠశాలలో పిల్లలకు బోధన ప్రారంభించారు. ప్రారంభించిన మొదటి సంవత్సరంలో 152 మంది

విద్యార్థులు పాఠశాలలో చేరారు. హిందూ పాఠశాలకు పెరుగుతున్న ఆదరణ క్రైస్తవ మిషనరీలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ హిందూ పాఠశాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. పాఠశాల నిర్వహిస్తున్న ప్రాంగణాన్ని పదేపదే తనిఖీలు చేస్తూ వేధించడం ప్రారంభించారు. నెల్లూరులో ఒక పాఠశాల ఉండగా మరో పాఠశాల అవసరం లేదని వాదనలు చేయసాగారు. ఈ కారణంగా హిందూ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ పాఠశాలకు ఇచ్చిన గ్రాంటును కలెక్టర్ నిలిపివేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాలను నడపడం కష్టతరంగా మారింది. నారాయణ స్వామి చెట్టి 1878 లో హెడ్ మాస్టర్ పదవికి రాజీనామా చేసినా, పాఠశాలను నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే వచ్చారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఆయన నెల్లూరు కాథలిక్ బిషప్ సి.ఆర్. మిషెల్ సాయంతో మద్రాసు రోమన్ కాథలిక్ బిషప్‌ని కలిశారు. హిందూ పాఠశాల నడిచేలా సహాయం చేసేందుకు మద్రాసు బిషప్ అంగీకరించారు. దీంతో పాఠశాల కార్యకలాపాలు మళ్లీ సజావుగా సాగాయి. 1879 లో ఈ పాఠశాలకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం తిరిగి గుర్తింపు ఇచ్చింది.

ఆరంభంలో హిందూ పాఠశాలను నెల్లూరు పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం దగ్గర ఒక అద్దె ఇంటి నుంచి నిర్వహించారు. కానీ 1879 ఫిబ్రవరి 27న వెంకటగిరి రాజ్యానికి చెందిన మాజీ దివాన్, హాజీ మహమ్మద్ రహీమతుల్లా కోర్టు వేలంలో కొంత భూమిని కొన్నారు. హాజీ మహమ్మద్ రహీమతుల్లా ఈ భూమిని హిందూ హైస్కూల్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. కాని, పాఠశాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదు. ఈ సమయంలో వెంకటగిరి సంస్థానానికి చెందిన రాజావారు ఒక ప్రభుత్వ బాండ్ కొనుగోలు చేశారు. హిందూ పాఠశాలకు తన పేరు పెట్టాలనే షరతుతో పదిహేను వేల రూపాయల చెల్లింపుపై బాండ్ కొనుగోలు చేయబడింది. పాఠశాల భవనం మరమ్మతు కోసం రాజు గ్రాంట్ డబ్బు కూడా ఇచ్చారు. పాఠశాల కొత్త బ్లాక్ 12 నవంబర్ 1888 న మద్రాస్ గవర్నర్ లార్డ్ కొనెమెరా ప్రారంభించారు. దీని తరువాత హిందూ ఉన్నత పాఠశాల పేరు వెంకటగిరి రాజా ఉన్నత పాఠశాలగా మారింది.

1889 నుంచి ఈ పాఠశాల మళ్లీ ప్రభుత్వ గ్రాంట్లను స్వీకరించడం ప్రారంభించింది. 1901 సంవత్సరంలో కరీం ఖాన్ సాహెబ్ అనే వ్యక్తి ఒక

బ్రాంచ్ స్కూల్ నిర్వహించడానికి రెండువేల రూపాయల విలువైన ఇంటిని విరాళంగా ఇచ్చారు. 1902 లో మద్రాసు గవర్నర్, లార్డ్ ఎంప్తిల్ పాఠశాలను సందర్శించారు. ఆ సందర్భంగా పాఠశాల కొత్త భవనానికి శంకుస్థాపన చేశారు. కొత్త గదులు నిర్మించడానికి వెంకటగిరి రాజావారి తమ్ముడు వెలుగోటి కృష్ణ యాచేంద్ర పదకొండు వేల మూడు వందల రూపాయలు విరాళంగా ఇచ్చారు.

1889 లో నెల్లూరు నగరంలో పాఠశాల కొత్త శాఖ ప్రారంభమైంది. కొన్ని సంవత్సరాల తరువాత దీన్ని అసలు పాఠశాలలో విలీనం చేశారు. 1905 లో అక్కరాజు రాఘవయ్య ప్రైమరీ స్కూల్ హిందూ స్కూల్ బ్రాంచ్ మారింది. అక్టోబర్ 1908 లో ఇది కూడా మాతృ పాఠశాలలో విలీమైంది. నెల్లూరులోని రంగనాయకులపేటలో 1908, మేలో మరో బ్రాంచ్ స్కూల్ ప్రారంభమైంది. కాని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా 1909 లో మూసివేయబడింది. 1912, 1928 మధ్య చిన్న బజార్లోని ముత్తరాజు సుబ్బరామయ్య పాఠశాలను బ్రాంచ్ స్కూల్గా మార్చారు. పాఠశాలకు ప్రజాదరణ, ప్రతిష్ట పెరిగేకొద్దీ, విద్యార్థుల సంఖ్య పెరిగింది.

క్రైస్తవ మిషనరీల ప్రభావం నుంచి తనను తాను రక్షించుకోవడం కోసం హిందూ ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలనే లక్ష్యంతో వెంకటగిరి రాజా ఉన్నత పాఠశాలలో చేరాడు సుందరయ్య. డాక్టర్ కావాలనుకున్నాడు కాబట్టి, సుందరయ్య ఇంటర్మీడియట్లో సైన్స్ను ప్రధాన సబ్జెక్ట్గా ఎంచుకున్నాడు.

డాక్టర్ కావడం అంత సులభం కాదని సుందరయ్యకు తెలుసు. డాక్టర్ కావాలంటే ఇంటర్మీడియట్ పరీక్షలో అద్భుతమైన మార్కులు సాధించాలి. చాలా మంది విద్యార్థులు మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందడానికి ప్రయత్నిస్తుంటారు కాబట్టి పోటీ బలంగా ఉంటుంది.

ఆ రోజుల్లో దాదాపు అన్ని వైద్య కళాశాలలు బ్రిటిష్ పాలనలో నడిచేవి. ఇంటర్మీడియట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను వైద్య కళాశాలలో ప్రవేశానికి ఎంపిక చేసేవారు. అందుకే ఇంటర్మీడియట్ లో చేరిన మొదటి రోజు నుండే సుందరయ్య జీవశాస్త్రం, రసాయన శాస్త్రం మరియు భౌతిక శాస్త్రాన్ని సమీకరించడంపై తన పూర్తి దృష్టి సారించాడు.

సుందరయ్య ఇంటర్మీడియట్ చదువుతున్న తొలినాళ్లలోనే జీవశాస్త్రం అంటే మక్కువ ఏర్పడింది. జీవశాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి విశ్లేషణాత్మక నైపుణ్యాలు అవసరం లేదని గ్రహించాడు. ఇందులో కావాల్సింది జ్ఞాపకశక్తి. పుస్తకాల్లో రాసుకున్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలి. గురువు ఏమి చెప్పినా దాన్ని ఏకాగ్రత, చిత్తశుద్ధితో ఆకళింపు చేసుకోవాలి. గణితంలో ఉత్తీర్ణత సాధించడానికి విశ్లేషణాత్మక నైపుణ్యం అవసరం. మెదడుకు పనిచెప్పాలి. లెక్కలు పరిష్కరించాల్సి ఉంది. కానీ జీవశాస్త్రంలో ప్రత్యక్ష ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. జీవశాస్త్రం అనేది జీవులు, జీవుల శాస్త్రీయ అధ్యయనం. ఇక్కడ విషయం కేవలం చదవడమే కాదు చదివిన విషయాన్ని గ్రహించి జ్ఞానాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవడం.

ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కూడా సుందరయ్య సంఘ్ శాఖకు క్రమం తప్పకుండా హాజరవుతూనే ఉన్నాడు. చాలా సార్లు, సుందరయ్య స్వయం సేవక్ యూనిఫాం అంటే తెల్ల చొక్కా, ఖాకీ నిక్కర్ ధరించి కళాశాలకు వెళ్ళేవాడు. సంఘ్ కార్యక్రమాలలో క్రమం తప్పకుండా పాల్గొనడం వలన పెద్ద నాయకులతో పరిచయం ఏర్పడింది. ఆ నాయకుల ప్రసంగాలు వినడం వలన, సుందరయ్య జ్ఞానం పెరగడమే కాదు అతను మంచి వక్తగా మారాడు. సుందరయ్య భారతదేశ చరిత్ర, హిందువులపై దాడులు, హిందూ ఐక్యత ఆవశ్యకత, దేశానికి సేవ వంటి అంశాలపై ప్రసంగాలు చేయడానికి గ్రామ గ్రామానికి వెళ్లేవాడు. ఈ సమయంలో క్లాస్‌మేట్లు రమణారెడ్డి, కోటేశ్వరరావులు సన్నిహిత స్నేహితులయ్యారు.

రెండేళ్ల చదువుల తర్వాత ఇంటర్ పరీక్షలు జరిగినప్పుడు సుందరయ్య పూర్తి విశ్వాసంతో పరీక్షలు రాశాడు. ఆ పరీక్షల్లో సుందరయ్య అనుకున్న విధంగా మంచి మార్కులు సాధించాడు. కానీ, మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందగలిగేటన్నీ మార్కులు రాలేదు. పరీక్షలో అతని కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు చాలా మంది ఉన్నారు.

బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ అంటే ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం లభించకపోవడంతో సుందరయ్య చాలా నిరాశ చెందాడు. మేనల్లుడిని డాక్టర్‌గా చూడాలనే కల చెదిరిపోయిందని అత్త కూడా బాధపడింది.

సీటు రాకపోవడం వల్ల ఏర్పడిన ఎదురుదెబ్బల నుంచి కోలుకున్న తరువాత, సుందరయ్య వెటర్నరీ సైన్స్‌లో చేరి వెటర్నరీ డాక్టర్ కావాలని అనుకున్నాడు. మనుషుల డాక్టర్ కానప్పుడు జంతువుల డాక్టర్‌గా మారాలని ప్రయత్నించాడు. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో ప్రవేశానికి సుందరయ్య దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ కోర్సులోనూ అతనికి సీటు రాలేదు. డాక్టర్ కావాలనే కల చెదిరిపోయిందని సుందరయ్య భావించాడు.

ఆ రోజుల్లో, ఇంటర్మీడియట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా వైద్య కళాశాలల్లోని విద్యార్థులు ఎంపిక చేసేవారు. అప్పట్లో ఏ కోర్సుకు ప్రవేశ పరీక్షలు ఉండేవి కావు. అంతే కాదు సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ ఎగ్జామ్స్ అనే విధానం లేదు. దీంతో సుందరయ్య తాను డాక్టర్ కాలేనని భావించాడు.

దీంతో సుందరయ్య తన మొత్తం దృష్టిని సంఘ్ భావజాల ప్రచారానికి అంకితం చేసాడు. సంఘ్ నాయకులతో కలిసి గ్రామాలు, నగరాలకు తిరగడం ప్రారంభించాడు. సమావేశాల్లో ప్రసంగించడం కూడా ప్రారంభించి తిరిగి సామాజిక సేవలో నిమగ్నమయ్యాడు.

చూస్తుండగానే ఒక సంవత్సరం గడిచిపోయింది. ఈ లోపు ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యాయి. కొన్ని రోజులకు ఫలితాలు వెలువడ్డాయి. ఈసారి విద్యార్థులకు మంచి మార్కులు రాకపోవచ్చని సుందరయ్య అనుమానించాడు. ఆ క్రమంలోనే సుందరయ్యకు ఒక ఆశాకిరణం కనిపించింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు, సుందరయ్య గత సంవత్సరం పరీక్షలో వచ్చిన మార్కులు పేర్కొంటూ దరఖాస్తు చేశాడు.

ఈసారి సుందరయ్యకు మెడికల్ కాలేజీలో సీటు లభించింది. ఈ సంవత్సరం, చాలా మంది విద్యార్థులకు వచ్చిన మార్కులకంటే సుందరయ్యకు మెరుగైన మార్కులు వచ్చాయి. మిగిలిన దరఖాస్తుదారులకంటే మంచి మార్కులు రావడంతో సుందరయ్యకు సీటు ఖరారైంది.

డాక్టర్ కావాలనే కల మళ్లీ ప్రాణం పోసుకుంది. మేనత్త సంతోషంతో ఉప్పొంగిపోయింది. కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. మద్రాస్ మెడికల్ కాలేజీలో సుందరయ్య అడ్మిషన్ పొందాడు. మద్రాసు వెళ్లి మెడిసిన్

చదివేందుకు సుందరయ్య సిద్ధమయ్యాడు.

గొప్ప విషయం ఏమిటంటే, నెల్లూరు జిల్లా నుంచి మొదటిసారి, శూద్రజాతి, దిగువ కులానికి చెందిన వ్యక్తి మెడికల్ కళాశాలలో ప్రవేశం పొందడం. సుందరయ్యకు ముందు, 'శూద్ర జాతి' నుంచి ఎవరూ మెడిసిన్ చదువుకోవడానికి మెడికల్ కాలేజీకి రాలేదు. సుందరయ్య మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందడం కూడా సాధారణ విషయం కాదు. ఇది భారతీయ సమాజంలో కొత్త సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవానికి నాంది కూడా.

## అధ్యాయం - 2

# ద్రవిడ నేలపై హిందూత్వ ఉన్నతికై పోరాటం

డాక్టరుగా ప్రజాసేవ చేయాలనే దృఢ సంకల్పంతో 1949లో సుందరయ్య మద్రాసులో అడుగుపెట్టారు. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి రెండేళ్లు అయింది. మద్రాసుకు సుందరయ్య చేరుకున్న సమయంలో తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ జోరుగా వినిపిస్తున్న రోజులవి. ఆ రోజుల్లో తెలుగు మాట్లాడే రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలు మద్రాసు రాష్ట్రంలో భాగం. ఆ ప్రాంతాలకు కూడా మద్రాసే రాజధాని. రాజధాని మద్రాసులో తమిళుల పెత్తనం తీవ్రంగా ఉండేది. కోస్తాంధ్ర, ఉత్తర కేరళ అంటే మలబార్, బళ్లారి, దక్షిణ కన్నడ ప్రాంతాలన్నీ కూడా మద్రాసు రాష్ట్రంలో భాగమే. ప్రస్తుత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ భూభాగమంతా కూడా మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. అంతే కాదు ప్రస్తుత కేరళ, కర్ణాటక, ఒడిషాలోని చాలా భూభాగం కూడా మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది. తమిళ భాషకు పలుకుబడి బాగా ఉండటం వలన మద్రాసు రాష్ట్రంలో నివసించే అందరినీ మద్రాసీలు అని పిలిచేవారు. తెలుగు, మలయాళ, కన్నడ భాషాభిమానులు తమ స్వాభిమానాన్ని కాపాడుకునేందుకు భాషప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రారంభించారు.

స్వాతంత్ర్యానికి ముందు, ఆ తరువాత మద్రాసు రాష్ట్రంపై 'పెరియార్' అని పేరుగాంచిన విప్లవ నాయకుడు ఈరోడ్ వెంకట నాయకర్ రామస్వామి

ప్రభావం అధికంగా ఉండేది. సామాజిక దురాచారాలు, కులం, మతం పేరుతో చూపే వివక్షకు వ్యతిరేకంగా ఆయన ఉద్యమించారు. యువకుడిగా ఉన్నప్పటి నుంచే పెరియార్ మతాన్ని వ్యతిరేకించారు. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారు. అంతే కాదు హిందూ మతపు దురాచారాలను ఆయన తప్పుబట్టారు. విగ్రహారాధనను పెరియార్ బహిరంగంగా వ్యతిరేకించారు. హిందూ మతగ్రంథాలు మానవత్వానికి విరుద్ధమని అభివర్ణిస్తూ వాటిని ఆయన దహనం చేశారు. మద్రాస్ రాష్ట్రంలో అణచివేతకు గురయ్యే ప్రజలు సంఖ్య అధికంగా ఉండటం వలన అందరూ పెరియార్‌ను తమ నాయకుడిగా భావించడం ప్రారంభించారు. పెరియార్ ఆలోచనలు మద్రాసు రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపడం ప్రారంభించాయి.

1879 సెప్టెంబర్ 17న తమిళనాడులోని ఈరోడ్‌లో సంపన్న, సంప్రదాయ హైందవ కుటుంబంలో జన్మించిన రామసామి కాశీ యాత్ర తర్వాత మతవ్యతిరేకిగా మారారు. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు రామసామి.. వివాహం 'పవిత్ర బంధం'గా కాకుండా 'భాగస్వామ్యంగా' ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బాల్య వివాహ సంప్రదాయాన్ని అంతం చేయడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. వితంతువుల పునర్వివాహ హక్కు కోసం పెరియార్ ఆందోళన చేశాడు.

రామసామి రాజకీయ జీవితం కాంగ్రెస్‌తో ప్రారంభమైంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ ఆలోచనలతో ప్రభావితమైన రామసామి మాదకద్రవ్యాల నిషేధంపై ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఖాదీని ప్రోత్సహించారు.

ట్రావెన్‌కోర్ రాష్ట్రంలోని వైకోమ్లో నిర్వహించిన సత్యాగ్రహంతో అణగారిన వర్గానికి రామస్వామి గొప్ప నాయకుడయ్యారు. రామసామి నుంచి ఆయన 'పెరియార్' అయ్యాడు. అణగారిన వర్గాలు, అట్టడుగు వర్గాల్లో ఆయన పట్ల గౌరవం పెరిగింది.

ఇది ఇరవయ్యో శతాబ్దంలో ఇరవైవ దశకంలో చోటుచేసుకున్నప్పటి పరిస్థితి. ఆ రోజుల్లో ట్రావెన్‌కోర్ రాష్ట్రంలో అంటరానితనమనేది చాలా తీవ్రంగా ఉండేది. ట్రావెన్‌కోర్ రాష్ట్రంలో చాలా మంది మాట్లాడే భాష

మలయాళం. ఆ రోజుల్లో దేవాలయాలలోకి దళితుల ప్రవేశంపై నిషేధం ఉండేది. అంతే కాదు, రాజపరివారం ఆలయానికి వెళ్లేటప్పుడు ఆ మార్గంలో దళితులు కనిపించకూడదని ఆంక్షలు ఉండేవి. ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం మొదలైంది. కానీ, రాజు, సైన్యం, అగ్రవర్ణ ప్రజలు ఈ ఉద్యమాన్ని అణిచివేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఆందోళన చేసేవారిని అదుపులోకి తీసుకొని వారిని హింసించడం ప్రారంభించారు. ఉద్యమం బలహీనపడుతున్న సమయంలో కొంతమంది సంఘ సంస్కర్తలు ఉద్యమాన్ని నడిపించమని పెరియార్‌ను కోరారు. ఆ బాధ్యతలను రామస్వామి స్వీకరించినప్పుడు అగ్రవర్ణాల ప్రజలు ధైర్యాన్ని కోల్పోయారు. దురాచారాన్ని ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెరియార్ దృఢ సంకల్పం, నాయకత్వపటిమకు ట్రావెన్‌కోర్ మహారాజు దిగిరావాల్సి వచ్చింది. దీంతో పెరియార్ గొప్ప నాయకుడిగా ఎదిగారు.

ఆ తర్వాత చదువు, ఉద్యోగాల్లో దళితులకు రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ పెరియార్ ఆందోళన చేపట్టినప్పుడు కాంగ్రెస్‌లోని అనేక మంది అగ్రవర్ణ నాయకులు ఆయనను వ్యతిరేకించారు. కాంగ్రెస్ నాయకులు, పెరియార్ మధ్య విభేదాలు, దూరం పెరిగాయి. బ్రాహ్మణ ఆధిపత్య పార్టీ కాంగ్రెస్ అని పేర్కొంటూ పెరియార్ దాని నుంచి బయటకు వచ్చారు. 1938లో పెరియార్ సొంత పార్టీ స్థాపించారు. దళితులు, ఇతర వెనుకబడిన కులాల ప్రజలకు హక్కులు, న్యాయం కల్పించాలనే లక్ష్యంతో తన పార్టీకి 'జస్టిస్ పార్టీ' అని నామకరణం చేశారు. 1944 లో జస్టిస్ పార్టీని 'ద్రవిడ కజగం' గా మార్చారు. వెనుకబడిన వర్గాలకు చెందిన లక్షలాది మంది ఆయన వెంట నిలిచారు. దళితుల ఆత్మగౌరవం కాపాడటం, వారి పట్ల అమానుషంగా వ్యవహరించే చర్యలకు అడ్డుకట్ట వేసే చట్టాల రూపొందాయి అంటే దానికి కారణం పెరియార్ చేపట్టిన ఉద్యమాలే. స్వాతంత్ర్యం తరువాత మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఓమండూర్ రామసామి రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మద్రాస్ ఆలయ ప్రవేశ చట్టం పేరుతో రూపొందించిన చట్టాన్ని 1947లో ఆమోదించడం జరిగింది. ఈ చట్టం కారణంగా మద్రాసు రాష్ట్రంలోని దేవాలయాలలోకి ప్రవేశించే హక్కు దళితులకు

లభించింది. దేవదాసి విధానాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం మరో చట్టం చేసింది.

మను ధర్మానికి వ్యతిరేకంగా ఉద్యమం బలంగా సాగుతున్న సమయంలో, హిందూ మతాన్ని బహిరంగంగా వ్యతిరేకిస్తున్న కాలంలో సుందరయ్య మద్రాసు చేరుకున్నారు. పెరియార్ వంటి విప్లవ నాయకుల ప్రభావంతో నాస్తికుల సంఖ్య పెరుగుతోంది. హిందూ జాతీయవాదాన్ని దృఢంగా నమ్మిన ఒక యువకుడు నాస్తికుల మధ్యకు చేరుకున్నాడు.

మద్రాసు చేరుకున్న తర్వాత సుందరయ్య జీవితం మొత్తం మారిపోయింది. ఆయన ఇప్పుడు తన కుటుంబం, ఊరికి దూరంగా ఉన్నారు. మద్రాస్ మెడికల్ కాలేజీలో ప్రవేశ ప్రక్రియ పూర్తైన తరువాత, సుందరయ్య హాస్టల్లో నివసించడం ప్రారంభించాడు. ఆ రోజుల్లో దాదాపు అన్ని వైద్య కళాశాలలు ప్రభుత్వ నియంత్రణలో ఉండేవి. వైద్య విద్యార్థుల చదువులు, వారికి వసతి సౌకర్యాలు, ఆహారం వంటి ఏర్పాట్లన్నీ ప్రభుత్వమే చేసేది. మద్రాస్ మెడికల్ కాలేజీలో సీటు సంపాదించినందుకు సుందరయ్య పొంగిపోలేదు. మద్రాసు మెడికల్ కాలేజీకి గొప్ప చరిత్ర ఉంది. ఈ వైద్య కళాశాలను బ్రిటిష్ వారు స్థాపించారు. ఇది భారతదేశంలో ప్రారంభించిన మూడవ వైద్య కళాశాల. పాండిచ్చేరి, కలకత్తా తరువాత మద్రాసులో వైద్య కళాశాల నెలకొల్పారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ తన సైనికులు, ఉద్యోగులు, అధికారుల చికిత్స కోసం 1664లో మద్రాసులో ఒక ఆసుపత్రిని ప్రారంభించింది. రోగులకు చికిత్స అందించేందుకు బ్రిటన్ నుంచి వైద్యులు, నర్సులను రప్పించారు. ఆ సమయంలో ఈస్టిండియా కంపెనీ చీఫ్ ఏజెంట్‌గా ఉన్న సర్ ఎడ్వర్డ్ విలియం చొరవ, కృషి కారణంగా మద్రాసులో ఈ ఆస్పత్రికి అంకురార్పణ జరిగింది.

బ్రిటీష్ వారు మద్రాసులోని సెయింట్ జార్ట్ ఫోర్ట్లో మొదటి ఆసుపత్రిని స్థాపించారు. ఆ ఆస్పత్రిలో ప్రతిరోజూ రోగులకు చికిత్స చేసేవారు. మద్రాస్ రాష్ట్రంలో ఈస్టిండియా కంపెనీ సిబ్బంది సంఖ్య పెరగడంతో, ఈ ఆసుపత్రిలో రోగుల సంఖ్య కూడా పెరిగింది.

ఆసుపత్రి విస్తరణలో అప్పటి గవర్నర్ సర్ ఎలిహ్ యేల్ కీలకపాత్ర పోషించారు. 1690లో ఆసుపత్రిని కొత్త భవనానికి మార్చారు.

పద్దెనిమిదవ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో తన పట్టు బిగించేందుకు అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది. ఈ యుద్ధాల కారణంగా ఆసుపత్రిని కోట వెలుపలికి తరలించాలని నిర్ణయించారు. 1772లో ఆసుపత్రిని పార్క్ టౌన్‌కు మార్చారు. ఈ సమయంలో మద్రాస్ జనరల్ హాస్పిటల్‌గా ప్రసిద్ధి చెందిన ఈ హాస్పిటల్లో యూరోప్, భారతదేశంలోని ఎంపిక చేసిన వ్యక్తులకు అల్లోపతి వైద్య విధానంలో చికిత్స అందించడంపై బోధన, శిక్షణ ప్రారంభమైంది. అంటే ఈ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు సిద్ధమవడం మొదలైంది. ఆసుపత్రి నుంచి ఆధునిక వైద్య విధానంలో శిక్షణ పొందిన డాక్టర్లకు చిన్న, పెద్ద ఆసుపత్రుల్లో నియమించేవారు. 1820లో ఈ ఆసుపత్రికి 'మోడల్ హాస్పిటల్' హోదా లభించింది. ఆసుపత్రి విస్తరణ కొనసాగుతుండగా, 1827లో సూపరింటెండెంట్‌ను నియమించాలని నిర్ణయించారు. డాక్టర్ డి. మోర్టిమర్ మద్రాస్ జనరల్ హాస్పిటల్ మొదటి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు.

డాక్టర్ మోర్టిమర్ నిర్వహిస్తున్న ఒక ప్రైవేట్ మెడికల్ హాల్‌ను మెడికల్ స్కూల్గా మార్చారు. 1835 ఫిబ్రవరి 2 న అప్పటి మద్రాస్ గవర్నర్ సర్ ఫ్రెడరిక్ ఆడమ్స్ మెడికల్ స్కూల్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ మెడికల్ స్కూల్‌ను మద్రాస్ జనరల్ హాస్పిటల్‌కు అనుసంధానం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

1842 లో భారతీయ పౌరులకు కూడా ఈ ఆసుపత్రి సేవలందించడం ప్రారంభించింది. అంతే కాదు, బోధన-శిక్షణ కోసం భారతీయ పౌరులను కూడా ఈ వైద్య కళాశాలలో చేర్చుకున్నారు. కొన్ని సంవత్సరాల తరువాత బోధన-శిక్షణ పాఠ్యాంశాలను విస్తరించారు. అదే సమయంలో వైద్య సంస్థ, ఆసుపత్రులలో వైద్యులు, నర్సులు, బోధకులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. నిర్వహణకు సంబంధించిన సంస్థ చేసిన ప్రతిపాదనను అంగీకరించిన బ్రిటీష్ ప్రభుత్వం 1850 లో దానికి కళాశాల హోదా ఇచ్చింది. అంటే వైద్య పాఠశాల ఇప్పుడు వైద్య కళాశాలగా మారింది.

1850 అక్టోబర్ 1 న మద్రాస్ మెడికల్ కాలేజీ ఉనికిలోకి వచ్చింది. అప్పటి నుంచి ఇక్కడ వైద్యుల ఆవిర్భావం మొదలైంది. 1857లో భారత తిరుగుబాటు

తరువాత, బ్రిటిష్ పార్లమెంట్ ఈస్టిండియా కంపెనీని రద్దు చేసి భారతదేశంలో పాలనను తన హస్తగతం చేసుకుంది. మద్రాస్ మెడికల్ కాలేజీ కూడా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చింది. ఈ సమయంలో మద్రాస్ మెడికల్ కాలేజీ మద్రాస్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉండేది. వైద్య కళాశాలలో విజయవంతంగా బోధన-శిక్షణ పూర్తి చేసుకున్న వ్యక్తులకు మద్రాస్ విశ్వవిద్యాలయం సర్టిఫికెట్లు ప్రదానం చేసేది. ఆ తర్వాత కొన్నాళ్లకు మద్రాస్ మెడికల్ కాలేజీలో మహిళలకు కూడా వైద్య విద్యలో ప్రవేశం లభించింది. 1875 నుంచి మద్రాస్ మెడికల్ కళాశాలలో అర్హత కలిగిన మహిళా అభ్యర్థులకు ఆధునిక వైద్యంలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. భారతదేశంలో మహిళా డాక్టర్లను తయారు చేసిన మొదటి కళాశాల మద్రాస్ మెడికల్ కళాశాల. ఈ కళాశాల తరువాతే దేశంలోని మిగిలిన మెడికల్ కాలేజీల్లో బాలికలు, మహిళలకు ప్రవేశం లభించింది.

భారతదేశంలో మొదటి మెడికల్ కాలేజీని ఫ్రెంచ్ ప్రభుత్వం ప్రారంభించిందని చరిత్ర పుస్తకాలు చెబుతున్నాయి. ఫ్రెంచ్ ప్రభుత్వం తన పౌరులకు ఆధునిక వైద్యం అంటే అల్లోపతి బోధించడానికి పాండిచ్చేరిలో స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రారంభించింది. 1823 సంవత్సరంలో ఈ సంస్థలో బోధన-శిక్షణ ప్రారంభమైంది. ఆ రోజుల్లో పాండిచ్చేరి ఒక ఫ్రెంచ్ కాలనీ. దీని తరువాత, బ్రిటిష్ ప్రభుత్వం 1835లో కలకత్తాలో మెడికల్ కాలేజీని స్థాపించింది. ఈ కళాశాల ప్రారంభంతో వైద్య విద్యలో భారతదేశంలో కొత్త శకం ప్రారంభమైంది. తొలినాళ్లలో 14 నుంచి 20 సంవత్సరాల్లోపు అభ్యర్థులకు అల్లోపతి వైద్య సూత్రాలు, సిద్ధాంతాల్లో శిక్షణ ఇచ్చేవారు. మెరిట్ లిస్టు ద్వారా ఈ యువకుల ఎంపిక జరిగేది. ఏటా 50 మంది విద్యార్థులను శిక్షణ కోసం ఎంపిక చేసేవారు. కోర్సు వ్యవధి నాలుగు సంవత్సరాలు. నిర్దేశించిన అన్ని విషయాలకు సంబంధించిన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసేవారు. ఈ సర్టిఫికెట్ ఉన్న ఎవరైనా అల్లోపతి విధానంలో ప్రజలకు చికిత్స అందించడం, అవసరమైతే శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కూడా అనుమతి ఉండేది. ఈ కళాశాల నుంచి సర్టిఫికేట్

పొందిన భారతీయులను స్థానిక వైద్యులు అని పిలిచేవారు. 1835 సంవత్సరంలో మద్రాసులోనూ బ్రిటీష్ వారు  వైద్య పాఠశాల ప్రారంభించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో అనుసరించే నియమ నిబంధనలే ఇక్కడ అమలయ్యేవి. గోవాలోని పోర్చుగీస్ ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ స్కూల్ 1842 లో గోవా మెడికల్ అండ్ సర్జికల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయబడింది. ఆ రోజుల్లో గోవా పోర్చుగీసు వారి ఏలుబడిలో ఉండేది.

1843లో బొంబాయిలో కొత్త వైద్య కళాశాలకు శంకుస్థాపన జరిగింది. 1845లో ఆ కళాశాలలో కార్యకలాపాలు మొదలయ్యాయి. లక్నోలో కింగ్ జార్జ్ మెడికల్ కాలేజీ 1912లో, ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మెడికల్ కాలేజ్ 1925లో పట్నాలో ప్రారంభమయ్యాయి. మద్రాసులోని రాయపురం మెడికల్ స్కూల్, ఇండోర్‌లోని కింగ్ ఎడ్వర్డ్ మెడికల్ స్కూల్ ఆ కాలంలో ప్రసిద్ధి చెందాయి. 1917లో మద్రాసులో ప్రారంభమైన స్టాన్లీ మెడికల్ స్కూల్ దేశానికి మంచి స్వదేశీ వైద్యులను అందించడం ప్రారంభించింది.

డాక్టర్ రఫియుద్దీన్ అహ్మద్ 1928లో కలకత్తాలో దేశంలోనే మొదటి డెంటల్ కళాశాలను ప్రారంభించారు. తన స్వార్జితంతో ఆయన కళాశాల స్థాపించారు. డాక్టర్ అహ్మద్ అమెరికాలోని అయోవా విశ్వవిద్యాలయం నుంచి డెంటిస్ట్రీలో డిగ్రీ పొందారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత కలకత్తాలో ఒక డెంటల్ కళాశాల ప్రారంభించారు. ఈ కారణంగానే ఆయన భారతదేశంలో 'దంతవైద్య పితామహుడిగా' ప్రసిద్ధి చెందాడు.

1943 లో, ఆగ్రా మెడికల్ స్కూల్ అప్‌గ్రేడ్ అయి మెడికల్ కాలేజీగా మారింది. బ్రిటన్ తరహాలో భారతదేశంలోని అన్ని వైద్య కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ (MBBS) కోర్సులు ఒక్కొక్కటిగా ప్రవేశపెట్టబడ్డాయి. దేశవ్యాప్తంగా పాఠ్యాంశాలు ఏకరీతిలో ఉండేలా రూపొందించారు. 1949 సంవత్సరంలో, భారతదేశంలో అల్లోపతి వైద్య శిక్షణ అందించే సంస్థలు వేళ్ల మీద లెక్కించే స్థాయిలో ఉన్నాయి. పాశ్చాత్య దేశాలలో అభివృద్ధి చెందిన ఆధునిక వైద్య విధానం పద్దెనిమిదవ శతాబ్దం నుంచి భారతదేశంలో అమల్లో ఉన్నప్పటికీ దానికి ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభం నుంచే ఆదరణ పెరగడం ప్రారంభమైంది. అల్లోపతి వైద్యాన్ని 16వ శతాబ్దంలో

పోర్చుగీసువారు భారతదేశానికి మొదటిసారిగా తీసుకువచ్చారు.

సుందరయ్య వైద్య కళాశాలలో చేరిన సమయంలో భారతదేశంలో ఏడు వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయి. పాండిచ్చేరి, కలకత్తా, వెల్లూరు, లక్నో, పట్నా, పూణే, మద్రాస్ వైద్య కళాశాలల్లో. బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ (MBBS) కోర్సులు బోధించేవారు. అంటే 1949లో భారతదేశవ్యాప్తంగా కేవలం 700 మంది విద్యార్థులు మాత్రమే ఎంబీబీఎస్ కోర్సులో చేరగలిగారు. అందులో ఒకరు సుందరయ్య. ఆ రోజుల్లో భారతదేశంలో ఎంబీబీఎస్ వైద్యుల సంఖ్య చాలా తక్కువ. ప్రజలు ఎక్కువగా ఆయుర్వేదం లేదా యునాని వైద్యులను ఆశ్రయించి తమ వ్యాధులకు చికిత్స పొందేవారు. అల్లోపతి ఆసుపత్రులను 'తెల్లవారి ఆసుపత్రులు' అని పిలిచేవారు. తెల్లవారి ఆసుపత్రిలో వైద్యులు చికిత్స చేయలేకపోతే, ఆ రోగి జీవితాన్ని ప్రపంచంలో ఎవరూ రక్షించలేరనే నమ్మకం ఆ కాలంలో ఉండేది. మరణపుటంచుల దగ్గర ఉన్న వ్యక్తిని కాపాడగలిగే శక్తి ఇంగ్లీష్ వైద్యానికి మాత్రమే ఉందనే భావన ఉండేది.

ఆ రోజుల్లో ఎంబీబీఎస్ కోర్సు సిలబస్ అన్ని వైద్య కళాశాలల్లో ఒకే విధంగా ఉండేది. ఈ కళాశాలలన్నింటిలో చాలా మంది ఉపాధ్యాయులు బ్రిటిష్ సైనిక ఆసుపత్రులలో పనిచేసిన వైద్యులు. దాదాపు ప్రొఫెసర్లందరూ విదేశాల్లో చదువుకొని వచ్చినవారే. మద్రాస్ మెడికల్ కాలేజీలోనూ చాలా మంది టీచర్లు ఇంగ్లీష్ మిలిటరీ హాస్పిటల్స్‌లో పనిచేసిన వచ్చిన వారే. సైనిక ఆసుపత్రిల్లో పని చేయడం వలన వారు నిబంధనలు, క్రమశిక్షణపరంగా కఠినంగా వ్యవహరించేవారు. ఏది ఏమైనా సుందరయ్య జీవితం క్రమశిక్షణతో కూడుకున్నదే. స్వయంసేవక్ కావడం వలన ఆయన క్రమశిక్షణతో ఉండేవారు. సమయానికి ముందే తరగతికి చేరుకోవడం ఆయనకు మొదటి నుంచి అలవాటు. మద్రాసు మెడికల్ కాలేజీలోనూ ఈ అలవాటు కొనసాగింది.

మద్రాస్ మెడికల్ కాలేజీలో చాలా మంది పిల్లలు తమిళం, మలయాళం, కన్నడ లేదా తెలుగు మీడియం పాఠశాలల్లో చదివిన వారు కావడం వలన ఇంగ్లీష్‌పై పట్టు పెరిగేలా చూసేందుకు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. సుందరయ్య కూడా ఈ తరగతులకు హాజరయ్యేవారు.

ఎంబీబీఎస్ కోర్సు బోధనంతా ఇంగ్లీష్‌లోనే సాగుతుంది. పరీక్షలు కూడా ఇంగ్లీష్‌లోనే రాయాలి. విషయపరంగా అద్భుతమైన పరిజ్ఞానం కలిగిన విద్యార్థులు ఉన్నా ఇంగ్లీష్‌పై పట్టు లేకపోవడం వలన వారు పరీక్షల్లో సరైన సమాధానాలు ఇవ్వలేకపోయేవారు. ఎంబీబీఎస్ కోర్సు పూర్తిచేసేందుకు, అల్లోపతి డాక్టరుగా ఎదగడానికి ఇంగ్లీష్ పరిజ్ఞానం చాలా ముఖ్యం.

ఎంబీబీఎస్ కోర్సు మొదటి సంవత్సరంలో విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ బోధిస్తారు. మొదటి రోజు నుంచే సుందరయ్య చదువులపై దృష్టి కేంద్రీకరించారు. కష్టపడకుండా తాను డాక్టర్ కాలేనని సుందరయ్యకు బాగా తెలుసు. అంతే కాదు మంచి డాక్టర్ కావాలనుకుంటే మరింత కష్టపడాల్సి ఉంటుందని. మంచి డాక్టర్ కావాలనే లక్ష్యంతో సుందరయ్య అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవడం ప్రారంభించారు.

ఆ రోజుల్లో మద్రాస్ నగరం వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాలతో ప్రభావితమై ఉండేది. సుందరయ్య వంటి యువతకు ఈ ఉద్యమాల ప్రభావం దూరంగా ఉండటం సాధ్యమయ్యేది కాదు. ఏది ఏమైనా నెల్లూరు ఒక చిన్న పట్టణం. మద్రాసు చాలా పెద్దది. దక్షిణ భారతదేశం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి స్థిరపడిన మహానగరం. అనేక సంస్కృతుల సంగమం ఈ నగరం. పదిహేడవ శతాబ్దంలో బ్రిటిష్ వారు మద్రాసు నగరాన్ని నిర్మించి ఇక్కడ స్థిరపడ్డారు. చరిత్ర పుస్తకాల ప్రకారం, 1639లో విజయనగరం రాజు నుంచి కొంత భూమిని తీసుకొని ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి అయిన ఫ్రాన్సిస్ డే, ఈ నగరాన్ని నెలకొల్పారు. క్రమంగా నగరం విస్తరించింది. రహదారులు, జల రవాణా ద్వారా ఈ నగరం అనుసంధానమైంది. తరువాత మద్రాసు నగరంలోకి రైలు, విమాన సేవలు చేరాయి. అనతి కాలంలోనే ఇది ఈస్ట్ ఇండియా కంపెనీకి అతిపెద్ద కేంద్రంగా మారింది. దక్షిణ భారతదేశంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోనేందుకు ఈస్ట్ ఇండియా కంపెనీ మద్రాసును రాజధానిగా చేసుకుంది. మద్రాస్ ప్రెసిడెన్సీకి రాజధానిగా మద్రాస్ నగరం మారింది. 1857 లో ఈస్ట్ ఇండియా కంపెనీని తొలగించి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో తన ప్రత్యక్ష పాలన ప్రారంభించినప్పుడు కూడా మద్రాస్ ప్రాధాన్యత కొనసాగింది. కలకత్తా,

మద్రాస్, బొంబాయిని కేంద్రాలుగా చేసుకుని దేశాన్ని పాలించేందుకు బ్రిటీషర్లు ప్రయత్నించారు. మద్రాస్ ఒక పెద్ద ప్రెసిడెన్సీకి అతిపెద్ద కేంద్రం, అంటే, ఒక వలసరాజ్య కాలనీ. ఇక్కడ పెద్ద భవనాలు నిర్మించారు. ఇది బ్రిటిష్ కంటోన్మెంట్‌గా కూడా నిలిచింది. నగరంలో కొత్త రోడ్లు వేశారు. ప్రజల సౌకర్యార్థం విద్యుత్, తాగునీటి సరఫరా మొదలయ్యాయి. కోర్టులు, ఆసుపత్రులు స్థాపించబడ్డాయి. పెద్ద పార్కులు నిర్మించబడ్డాయి. క్రీడా మైదానాలు అభివృద్ధి చేయడం జరిగింది.

సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడకు వచ్చి స్థిరపడటం ప్రారంభించారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారడమే కాదు సాంస్కృతిక, కళాత్మక కార్యకలాపాలకు మద్రాసు మహానగరం కేంద్రంగా మారింది. దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రధాన భాషలకు చెందిన సినిమాల నిర్మాణం ఇక్కడే జరిగేది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మద్రాసు ప్రాముఖ్యత తగ్గలేదు. పాశ్చాత్య సంస్కృతి ఈ మహానగరంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. విభిన్న ఆలోచనా ధోరణులు కలిగిన ప్రజలు నివాసం ఉండటం వల్ల నగరంగా, విశ్వనగరంగా రూపు దాల్చింది.

మద్రాసు నగరంలో కొన్ని రోజుల జీవితం గడిపిన తర్వాత అక్కడి ప్రజలు తమను తాము అభ్యుదయవాదులమని చెప్పుకొని గర్వపడుతుండటం సుందరయ్య గమనించారు. చాలా మంది హిందూ ఆచార వ్యవహారాలు, మతం, పౌరాణిక గ్రంథాలకు వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడేవారు. హిందూ వ్యతిరేక భావన సుందరయ్యను కలిచివేసింది. రామాయణం–మహాభారతం వంటి పురాణాలు మద్రాసులో వ్యతిరేకతకు గురైతే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని ఆయన భావించారు. మద్రాస్ మహానగరంలో హిందూ వ్యతిరేక కార్యకలాపాలు సుందరయ్యకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయి. మద్రాసులో సంఘ శాఖలు ఉండే ప్రాంతాన్ని సుందరయ్య తెలుసుకున్నారు. ఆయన క్రమం తప్పకుండా ప్రతీ సాయంత్రం శాఖకు హాజరయ్యేవారు.

ఒకరోజు సుందరయ్య చేసిన పనికి మెడికల్ కాలేజీలోని అందరూ ఆశ్చర్యపోయారు. సంఘ్ యూనిఫామ్ అంటే తెల్ల చొక్కా, ఖాకీ నిక్కర్ ధరించి సుందరయ్య వైద్య కళాశాలకు వచ్చారు. ఆ వేషంలో సుందరయ్యను చూసిన అంతా ఆశ్చర్యపోయారు. సుందరయ్యను ఎవరూ ఏమీ అనలేదు. అంతా మౌనంగా ఉన్నారు. సంఘ్ వాలంటీర్ దుస్తులు ధరించి కళాశాలకు వచ్చిన సుందరయ్య తాను హిందూ జాతీయవాదానికి మద్దతుదారనే సందేశాన్ని ఇచ్చారు. ఇది మాత్రమే కాదు, ఆయన చర్య నాస్తికులు, వామపక్షాలు, పెరియార్ మద్దతుదారులకు బహిరంగ సవాల్‌గా మారాయి. అదే డ్రెస్‌లో సుందరయ్య క్లాస్‌కు హాజరయ్యారు. క్లాసులు పూర్తయిన వెంటనే హాస్టల్‌కు తిరిగి వచ్చారు. సుందరయ్య విసిరిన బహిరంగ సవాల్ కళాశాల, హాస్టల్లో చర్చనీయాంశమైంది. లెఫ్ట్ భావజాలం కలిగినవారు, నాస్తికులకు ఈ ధోరణి నచ్చకపోతే కళాశాలలో వాతావరణం చెడిపోతుందని కొందరు ఆచార్యులు భావించారు. కాలేజీలోని  నాస్తికులు, హిందు మతోన్మాదుల మధ్య సంఘర్షణ తలెత్తవచ్చని, శాంతికి విఘాతం కలుగుతుందని, హింస చెలరేగవచ్చని అనుమానించారు. ఇది వైద్య కళాశాలకు మంచిది కాదని భావించిన కొందరు ఆచార్యులు సుందరయ్య ప్రవర్తనపై ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు.

మరుసటి రోజు కూడా సుందరయ్య స్వయం సేవక్ సంఘ్ దుస్తులతో కళాశాలకు చేరుకున్నప్పుడు ఆయనను తరగతిలోనికి అనుమతించలేదు. ముందుగా ప్రిన్సిపల్‌ను కలవాలని, వారి అనుమతితో క్లాస్‌లోకి రావాలని ప్రొఫెసర్ స్పష్టం చేశారు. సుందరయ్య నేరుగా ప్రిన్సిపాల్ గదికి వెళ్లారు.

సుందరయ్యను చూసి ప్రిన్సిపాల్ "మీరు ఏమి చేస్తున్నారు? వైద్య విద్యార్థులు ఇలాంటి దుస్తులు ధరిస్తారా? అని ప్రశ్నించారు.

దానికి సుందరయ్య ఇలా అన్నారు, "ఈ దుస్తులతో అభ్యంతరమేంటి? విద్యార్థులందరూ వారికి నచ్చిన దుస్తులు ధరించి వస్తున్నారు. నేను ధరించిన దుస్తులపై అభ్యంతరమేంటి?

దానికి ప్రిన్సిపాల్– "చూడు,  తెలివిగా మాట్లాడుతున్నాను అనుకోవద్దు. నీ ప్రవర్తన ఇతరుల మనోభావాలను దెబ్బతీస్తోంది. ఇది మీకు తెలుసా?"

సుందరయ్య – "లేదు, నాకు తెలియదు. నా దుస్తులు ఇతరుల మనోభావాలను ఎందుకు దెబ్బతీస్తాయి?"

ప్రిన్సిపాల్ – "నీవు చాలా తెలివిగలవాడిని అనుకుంటున్నావేమో. మద్రాస్ రాష్ట్రంలో ఏం జరుగుతోందో నీవు తెలుసుకోవాలి. ఇక్కడి ప్రజలు ఆర్‌ఎస్‌ఎస్‌పై కోపంగా ఉన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌నూ వ్యతిరేకించేవారూ ఉన్నారు. చాలా మందికి సంఘ్ సిద్ధాంతాలు నచ్చవు."

సుందరయ్య– "వాటితో నాకేం సంబంధం? నాకు ద్రవిడ కజగం సిద్ధాంతం నచ్చలేదు. నేను పెరియార్‌కు వ్యతిరేకం. కానీ, నేను వాటి గురించి ఎవరికి ఏం చెప్పలేదు. నేను ఇతరుల దుస్తులు, ఇతరుల భాష పై అభ్యంతరం చెప్పలేదు. నా పని నేను చేసుకుంటున్నాను. వాళ్లు వారి పని చేసుకుంటున్నారు. నేను ఏ తప్పు చేయలేదు."

ప్రిన్సిపాల్ – "సుందరయ్య, తప్పు చేయలేదని నీవు అనుకోవచ్చు. కానీ నేను నీకు చెప్తున్నాను, నీవు తప్పు చేస్తున్నావు. నీకు బహుశా తెలియకపోవచ్చు, నీ డ్రెస్ కారణంగా కాలేజీలో గొడవలు చెలరేగే అంశాన్ని నీవు గుర్తించలేకపోవచ్చు. మీ సహచర విద్యార్థుల్లో కొందరు మీ ప్రవర్తనతో చాలా కోపంగా ఉన్నారు."

సుందరయ్య– " నా అభిప్రాయాలను ఎవరిపైనా రుద్దడం లేదు. నేను నమ్మిన నియమాలు మరియు క్రమశిక్షణను మాత్రమే అనుసరిస్తున్నాను".

ప్రిన్సిపాల్– కాదు సుందరయ్య, నీవు క్రమశిక్షణను పాటించడం లేదు. కళాశాల వాతావరణాన్ని పాడు చేసే హక్కు నీకు లేదు. ప్రజలలో ద్వేషాన్ని సృష్టించే అలాంటి పని చేసే హక్కు ఎవరికీ లేదు. నా మాట విను. ఇతర విద్యార్థులు కళాశాలకు వచ్చినట్లుగా, నీవు కూడా రావాలి. నేను చెప్పేది చాలా జాగ్రత్తగా విను. హాస్పిటల్ మరియు మెడికల్ కాలేజీలో కులానికి, మతానికి ప్రాధాన్యత ఉండదు. ముఖ్యమైనది జ్ఞానం మరియు మానవత్వం. ఇక్కడ ఎలాంటి భావజాల వ్యాప్తి జరగడం లేదు. ఇక్కడ సైన్స్ మాత్రమే పనిచేస్తుంది, వైద్య విద్య మాత్రమే ముఖ్యం. నీవు మంచి భవిష్యత్ ఉన్న విద్యార్థివి, నేను చెబుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకో. సంఘ్‌కి మద్దతు ఇవ్వకుండా నిన్ను

ఎవరూ ఆపలేరు, కానీ సంఘ్ కర్యాకలాపాలను గానీ, ఇతర ఏ సంస్థల కార్యకలపాలను గానీ కళాశాలలో నిర్వహించడానికి అనుమతించలేము. కళాశాల వెలుపల నీకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే స్వేచ్ఛ నీకు ఉంది. ప్రతి ఒక్కరూ కళాశాలలో క్రమశిక్షణను పాటించాలి.”

సుందరయ్యకి విషయం అర్థమైంది. తనకు నచ్చిన రీతిలో ఉండేందుకు ప్రయత్నిస్తే తనపై చర్యలు తీసుకుంటారని సుందరయ్య గ్రహించారు. డాక్టర్ కావాలనే దృఢ సంకల్పంతో సుందరయ్య మద్రాసు వచ్చారు. ఏ కారణం చేతనైనా తన వైద్య చదువులకు ఆటంకం కలగకూడదనుకున్నాడు. విషయాన్ని అర్థం చేసుకొని తనను తాను అదుపు చేసుకున్న సుందరయ్య, మీ ఆదేశాలు పాటిస్తానని ప్రిన్సిపల్‌కు మాట ఇచ్చారు. నేను డాక్టర్ అయ్యేందుకు ఈ కాలేజీలో అడుగుపెట్టాను, డాక్టర్ అయిన తర్వాతే ఇక్కడి నుంచి నిష్క్రమిస్తానని స్పష్టంగా తెలియజేశారు.

సుందరయ్య దగ్గరకు వచ్చిన ప్రిన్సిపల్, ఆయన వీపుపై తట్టి, “శభాష్, వెళ్లు, శ్రద్ధగా చదువు” అని చెప్పారు. ఆ తర్వాత సుందరయ్య హాస్టల్‌కు వెళ్లి సాధారణ డ్రెస్‌లో కాలేజీకి తిరిగి వచ్చారు. ఒక వైపు చదువులు, మరో వైపు సంఘ్ కార్యకలాపాల్లో భాగస్వామ్యాన్ని సుందరయ్య కొనసాగించారు.

మొదటి సంవత్సరంలో ఇతర వైద్య విద్యార్థుల మాదిరిగానే సుందరయ్యకూ, ఆయన సహచరులకు శవాన్ని చూపించి అందులో వివిధ భాగాల గురించి, వాటి పనితీరుకు సంబంధించిన బోధన సాగింది. మొదటి సంవత్సరంలో, సుందరయ్య మానవ శరీర నిర్మాణం గురించి అలాగే వివిధ రకాల మందులు, వివిధ వ్యాధులకు ఉపయోగించే ఔషధాల గురించి తెలుసుకున్నాడు.

మెడికల్ కాలేజీలో నిర్వహించిన ప్రతీ పరీక్షలో సుందరయ్య ఉత్తీర్ణుడయ్యేవాడు. సుందరయ్య ఎప్పుడూ పరీక్ష తప్పలేదు. ఆ రోజుల్లో చాలా మంది విద్యార్థులు మెడికల్ కాలేజీ పరీక్షలలో ఫెయిల్ అయ్యేవారు. అలా ఫెయిల్ అయ్యే కారణంగా చాలా మంది విద్యార్థులకు నాలుగు సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసేందుకు ఆరు సంవత్సరాలు పట్టేది. కానీ సుందరయ్య ఆ కోవకు చెందిన విద్యార్థి కాదు. సమయం విలువ ఆయనకు

బాగా తెలుసు. ఒక్క సంవత్సరం కూడా వృధా చేయడం ఆయనకు నచ్చలేదు. నిర్ణీత వ్యవధిలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి త్వరగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. సమాజంలోని పేదలు, నిస్సహాయుల రోగుల చికిత్స కోసం తన జీవితాన్ని అంకితం చేయాలని సుందరయ్య నిర్ణయించుకున్నారు. కేవలం ఎంబీబీఎస్ డిగ్రీ పొందేందుకు కాదు, ఆధునిక వైద్యశాస్త్రాన్ని సమగ్రంగా అర్థం చేసుకొని, అందులో పూర్తిస్థాయి నైపుణ్యం సంపాదించుకునే దిశగా సుందరయ్య తన చదువులు కొనసాగించారు.

అద్భుతమైన జ్ఞాపకశక్తి సుందరయ్య సొంతం. దానికి తోడు కష్టించి పనిచేసే స్వభావం వలన ఆయన ఏ పరీక్షలోనూ ఇబ్బందిపడలేదు. ఈ లక్షణాలన్నీ మెడికల్ కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో సుందరయ్యకు ఎంతో ఉపయోగపడ్డాయి. సుందరయ్య తన జీవితాన్ని కళాశాల, సంఘ్ పరివార్ కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేసుకోలేదు. మద్రాసులో ఎక్కువ మంది తమిళం మాట్లాడతారు కాబట్టి, సుందరయ్య ఆ భాష నేర్చుకోవడం ప్రారంభించాడు. ఒక సంవత్సర కాలంలో ఆయన తమిళంలో స్పష్టంగా మాట్లాడగలిగే పట్టు సాధించారు. అంతే కాదు ఇంగ్లీష్‌పై పట్టు సాధించేందుకు నిత్యం 'ది హిందూ' దినపత్రిక చదవడం ప్రారంభించాడు. పత్రికలు చదవడం ఆయనకు ఎన్నో విధాలుగా ప్రయోజనం చేకూర్చింది. ఇంగ్లీష్‌పై బలమైన పట్టు సాధించడమే కాదు విశ్వవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలన్నీ తెలుసుకో గలిగారు.

చదువుల్లోనే కాదు ఆటల్లోనూ మేటి సుందరయ్య. కబడ్డీ అంటే ఆయనకు చాలా ఇష్టం. కబడ్డీ ఆటలో తన ప్రతిభను ఆయన మద్రాసు నగరంలోనూ చూపారు. కొంతమంది గొప్ప విద్యార్థులతో స్నేహం కారణంగా సుందరయ్యకు మద్రాసులో టెన్నిస్ నేర్చుకునే అవకాశం వచ్చింది. కొన్ని నెలల్లోనే టెన్నిస్ ఆటలో గొప్ప ప్రావీణ్యం సంపాదించారు. సుందరయ్య తన ఫోర్ హ్యాండ్, బ్యాక్ హ్యాండ్ షాట్లతో ప్రత్యర్థులకు చుక్కలు చూపించేవారు.

మద్రాసులో ఉన్నప్పుడు సుందరయ్యకు సంగీతం మీద ఆసక్తి కలిగింది. మౌత్ ఆర్గాన్, ఫిడేల్ వాయించడం నేర్చుకోవడమే కాదూ పియానో పైన మంచి

పట్టు సాధించారు. అటు సంఘ్ శాఖకు క్రమం తప్పకుండా హాజరు కావడం, నాయకుల ప్రసంగాలు వినడం వలన సుందరయ్య కూడా గొప్ప వక్తగా మారారు. శాఖలో చేరే కొత్త సభ్యులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించసాగారు. కళాశాలలోనే కాదు కళాశాల ప్రాంగణం వెలుపల జరిగే వక్తృత్వ పోటీలల్లోనూ పాల్గొనేవారు. సుందరయ్య ప్రసంగం విన్న ఎవరైనా ఆయన మాటలకు బాగా ప్రభావితమయ్యేవారు. మెడికల్ కాలేజీ విద్యార్థిగా సుందరయ్య బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారు. సుందరయ్య ప్రజ్ఞాపాటవాలు చూసిన ఎవరైనా ఆయనను ప్రశంసించకుండా ఉండలేరు.

సుందరయ్య ఎంబిబిఎస్ మూడవ సంవత్సరంలో ఉన్నప్పుడు తెలుగు మాట్లాడేవారు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండును తీవ్రతరం చేశారు. మహాత్మాగాంధీ అనుచరుడు, కాంగ్రెసుకు చెందిన నాయకుడు పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. పొట్టి శ్రీరాములు గట్టి గాంధేయవాది. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్న వ్యక్తి ఆయన. 1901 మార్చి 16 న మద్రాసులో తెలుగు మాట్లాడే వైశ్య కుటుంబంలో జన్మించిన పొట్టి శ్రీరాములు చదువుల్లో దిట్ట. పాఠశాల విద్య పూర్తయిన వెంటనే ఆయనకు రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో ఉన్నప్పుడు, శ్రీరాములు ఒకసారి గాంధీజీ ప్రసంగాన్ని విన్నారు. ఈ ప్రసంగం ఆయనను ఎంతగానో ఆకట్టుకుంది. దాని ప్రభావానికి లోనైన పొట్టి శ్రీరాములు తన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి గాంధీజీని కలిసేందుకు అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమానికి వెళ్లాడు. గాంధీజీ ఆదేశాల మేరకు ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలోకి చేరారు. 1930లో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలోనూ పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించడాన్ని నిరసిస్తూ మహాత్మా గాంధీ ఆ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. ఉప్పు చట్టాన్ని వ్యతిరేకించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అంతే కాదు తనతో పాటు సముద్ర తీరానికి వచ్చి చేతిలోకి ఉప్పు తీసుకోవాలని కోరారు. 77 మందితో కలిగి గాంధీజీ అహ్మదాబాద్ లోని సబర్మతి ఆశ్రమం నుంచి సముద్రపు ఒడ్డున

ఉన్న దండి గ్రామం వరకు కాలినడకన వెళ్లి 1930 ఏప్రిల్ 6 న ఉప్పు చట్టాన్ని వ్యతిరేకించారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకు గాంధీ సహా సత్యాగ్రహిలందరిని అరెస్టు చేశారు. సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు పొట్టి శ్రీరాములును కూడా బ్రిటిష్ ప్రభుత్వం ఖైదు చేసింది.

గాంధీజీ ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని పొట్టి శ్రీరాములు అనుసరించారు. ఆయన సూచనల మేరకు పనిచేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేలా ప్రజలకు ప్రేరణగా నిలిచారు. 1942లో, గాంధీజీ క్విట్ ఇండియా నినాదం ఇచ్చినప్పుడు, స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి పొట్టి శ్రీరాములు సత్యాగ్రహం ప్రారంభించారు. మరోసారి, బ్రిటిష్ ప్రభుత్వం శ్రీరాములును అరెస్టు చేసింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా పొట్టి శ్రీరాములు సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా మరోసారి తన ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. మద్రాసులో పట్టి అక్కడే పెరిగిన వ్యక్తి కావడంతో తమిళ భాష ప్రభావానికి పొట్టి శ్రీరాములు లోనయ్యారు. భాషా ప్రాతిపదికన కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని శ్రీరాములు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం ప్రారంభించారు. తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష కారణంగా తమిళ, తెలుగు మాట్లాడేవారి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. మెడికల్ కాలేజీలో ఈ దీక్ష ప్రభావం అంతగా పడలేదు కాని విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది భాష కారణంగా వేరుపడ్డారు.

పొట్టి శ్రీరాములు చేపట్టిన నిరాహార దీక్ష భారత ప్రభుత్వాన్ని కదిలించలేదు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు దీక్ష విరమించాలని పొట్టి శ్రీరాములుకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కానీ, ఆయన ఒప్పుకోలేదు. యాభై రోజుల దీక్ష పూర్తయినప్పటికీ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల స్పందన లభించలేదు. మరో వైపు నిరాహార దీక్ష కారణంగా పొట్టి శ్రీరాములు ఆరోగ్యం బాగా క్షీణించింది. నిరాహార దీక్ష

చేపట్టిన 56 వ రోజు ఆయన కోమాలోకి వెళ్లాడు. దీక్ష చేపట్టిన 58వ రోజు అంటే 1952 డిశంబర్ 15న పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారు. శ్రీరాములు త్యాగాన్ని చూసిన తెలుగు నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు మాట్లాడే ప్రజలు ప్రతీ చోటా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు మరణించిన నాలుగు రోజుల తర్వాత, అంటే 1952, డిశంబర్ 15న, తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేకంగా 'ఆంధ్ర' రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించవలసి వచ్చింది. ఆంధ్ర రాష్ట్రం అధికారికంగా 1953, అక్టోబర్ 1 న ఏర్పడింది. రాయలసీమలోని కర్నూలు నగరం కొత్త రాష్ట్రానికి రాజధాని అయింది.

సుందరయ్యకు కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఏ మాత్రం నచ్చలేదు. నెహ్రూను వ్యతిరేకించారు. యాభై రోజుల నిరాహారదీక్ష తర్వాత కూడా పొట్టి శ్రీరాములు డిమాండ్‌పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆయనకు బాగా ఆగ్రహం తెప్పించింది. పొట్టి శ్రీరాములు సాధారణ వ్యక్తి కాదు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధీజీ ప్రియ శిష్యుల్లో ఆయన ఒకరు. శ్రీరాములు దేశభక్తి, అంకితభావం చూసి ముగ్ధుడైన గాంధీజీ "నాకు శ్రీరాములు వంటి మరో పదకొండు మంది మద్దతుదారులు ఉంటే, ఒక సంవత్సరంలో భారతదేశానికి బ్రిటిష్ పాలన నుంచి స్వేచ్ఛ లభించేది" అన్నారు. అంతటి మహా వ్యక్తి పొట్టి శ్రీరాములు.

1953 లో జరిగిన మరో కీలక రాజకీయ సంఘటన సుందరయ్యకు నెహ్రూపై మరింత వ్యతిరేకత కలిగించింది. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అనూహ్యమైన పరిస్థితుల్లో మరణించడం సుందరయ్యను బాగా కదిలించింది. డాక్టర్ ముఖర్జీ మరణవార్త తెలిసినప్పుడు సుందరయ్య చాలా బాధపడ్డారు. నెహ్రూ ప్రభుత్వంపై ఆయనకు కోపం విపరీతంగా పెరిగింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. కశ్మీర్ పూర్తిగా భారతదేశపు భూభాగంగా ఉండాలని,

ఇతర రాష్ట్రాల్లో వర్తించే మాదిరిగానే అక్కడ చట్టాలు ఉండాలని ఆయన కోరుకున్నారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. డాక్టర్ ముఖర్జీ మాట్లాడుతూ "ఒక దేశంలో రెండు చిహ్నాలు, రెండు చట్టాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదని గట్టిగా నమ్మాడు. ఒక భారతీయుడు కశ్మీర్ వెళ్ళేందుకు ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని డాక్టర్ ముఖర్జీ కోరుకున్నారు. కశ్మీర్ భారతదేశంలో ఒక భాగమని, భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానమైన హక్కులు ఉండాలని భావించారు.

ఆ రోజుల్లో భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలో నివసిస్తున్న పౌరులు కశ్మీర్ సందర్శనకు కశ్మీర్ ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉండేది. 1953, మే 8 న, డాక్టర్ ముఖర్జీ ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఢిల్లీ నుంచి కశ్మీర్ వెళ్లారు. రెండు రోజుల తరువాత, అంటే మే 10 న, ఆయన పంజాబ్‌లోని జలంధర్ చేరుకున్నారు. "మేము అనుమతి లేకుండా జమ్మూ కశ్మీర్‌లోకి వెళ్లాలి, అది మన ప్రాథమిక హక్కు" అని ఆయన జలంధర్‌లో అన్నారు. మే 11 న, డాక్టర్ ముఖర్జీ శ్రీనగర్ వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను గృహ నిర్బంధంలో ఉంచారు. జూన్ 22న ఆయన ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమైంది, జూన్ 23న ఆయన అనూహ్యమైన పరిస్థితులలో మరణించాడు. ఆయన మరణంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కశ్మీర్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు వచ్చాయి. డాక్టర్ ముఖర్జీ ఆరోగ్యం అకస్మాత్తుగా ఎలా క్షీణించిందని పలువురు ప్రశ్నించారు. ఆరోగ్యం క్షీణించినప్పుడు ఎందుకు చికిత్స అందించలేదు? ఆయనను ఎందుకు ఆసుపత్రికి తీసుకెళ్లలేదు? అని చాలా మందిలో సందేహాలు కలిగాయి. డాక్టర్ ముఖర్జీ అతివాద నాయకుడు కావడంతో ఆయన మరణంపై హిందూ జాతీయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశంలోని ప్రముఖ నాయకులలో ఒకరు. ఆయన 1901, జులై 6న బెంగాలీ మాట్లాడే ఒక ప్రముఖ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి అశుతోష్ బాబు ఆ కాలంలోనే ప్రముఖ విద్యావేత్త. బాల్యం నుంచే శ్యామా ప్రసాద్ ముఖర్జీ చదువుల్లో చురుగ్గా ఉండేవారు. తెలివైనవాడు, ప్రతిభాశాలి కూడా. ఆయన 1917 లో మెట్రిక్యులేషన్ పరీక్షలో

ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత 1921 లో బి.ఎ., డిగ్రీ పొందారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ తన 22వ ఏట ఎం.ఎ., పూర్తి చేసారు. అదే సంవత్సరంలో సుధాదేవిని వివాహం చేసుకున్నారు. న్యాయశాస్త్రం అభ్యసించడానికి 1923లో విదేశాలకు వెళ్లి 1926 లో బారిస్టర్‌గా ఇంగ్లాండ్ నుంచి తిరిగి వచ్చారు. 33 సంవత్సరాల వయస్సులో ఆయన  కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ అయ్యారు. ఈ పదవిలో నియమితులైన అతి పిన్న వయస్కుడైన వైస్–ఛాన్సలర్ ఆయన. ఆలోచనాపరుడిగా, అతివాద విద్యావేత్తగా ఆయన కీర్తి దినదిన ప్రవర్ధమానంగా పెరిగింది.

ముప్పైవ దశకంలో శ్యామా ప్రసాద్ రాజకీయాలలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. కాంగ్రెసేతర హిందువుల సహాయంతో 'కృషక్ ప్రజా పార్టీ'లో చేరి 'ప్రగతిశీల కూటమి' ఏర్పాటు చేశారు. 1941, డిశంబర్ 12 న, ఆయన బెంగాల్ ప్రధానమంత్రి ఎ. కె. ఫజులుల్ హక్ క్యాబినెట్‌లో ఆర్థిక మంత్రి అయ్యారు. ఆ క్రమంలో విప్లవ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్ జాతీయవాదం వైపు ముఖర్జీ ఆకర్షితులై హిందూ మహాసభలో చేరారు.

ముస్లింల కోసం ప్రత్యేక దేశం పాకిస్తాన్ ఏర్పాటు చేయాలనే ముస్లిం లీగ్ డిమాండ్‌ను, వారి చేసే ఉద్యమాన్ని శ్యామా ప్రసాద్ వ్యతిరేకించారు. ముస్లిం లీగ్‌పై కాంగ్రెస్ మెతక ధోరణి చూపడాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. గాంధీజీ, నెహ్రూ ముస్లింలతో బుజ్జగించే రాజకీయాలు చేస్తున్నారని విశ్వసించిన వారిలో శ్యామా ప్రసాద్ కూడా ఒకరు. మహాత్మా గాంధీ అహింసా విధానాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. "గాంధీజీ అహింసా విధానాన్ని గుడ్డిగా అనుసరిస్తే బెంగాల్ మొత్తం పాకిస్థాన్ అధికార పరిధిగా మారే రోజు ఎంతో దూరంలో లేదు" అని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెహ్రూ, గాంధీ బుజ్జగింపు విధానాన్ని కూడా ఆయన బహిరంగంగా వ్యతిరేకించారు. మతం పేరుతో దేశ విభజనను వ్యతిరేకించారు. కానీ, శ్యామా ప్రసాద్ విభజనను ఆపలేకపోయారు. దేశ విభజనతోనే భారతదేశం స్వతంత్రంగా మారింది. పాకిస్తాన్‌లోకి సగం పంజాబ్, సగం బెంగాల్ వెళ్లాయి.

స్వాతంత్ర్యానంతరం దేశానికి  నెహ్రూ మొదటి ప్రధాని అయ్యారు. గాంధీజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ అభ్యర్థన మేరకు శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్వతంత్ర భారతదేశపు మొదటి కేంద్ర మంత్రివర్గంలో చేరారు. పరిశ్రమలు, ఉక్కు మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు.  దేశంలో కొత్త ఫ్యాక్టరీలు స్థాపనలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ కీలక పాత్ర పోషించడం ప్రారంభించారు.

1950లో భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత, శ్యామా ప్రసాద్ నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. నెహ్రూ విధానాలు ఆయనకు రుచించలేదు. కశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు. భారతదేశంలో కశ్మీర్ విలీనం కావాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్, జునాగఢ్, ఇతర సంస్థానాలు భారతదేశంలో విలీనమైన తరహాలోనే కశ్మీర్ కూడా భారతదేశంలో విలీనం కావాలని ఆశించారు.

ముఖర్జీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధిపతి మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్‌ని సంప్రదించి 1951, అక్టోబర్ 21న రాష్ట్రీయ జన సంఘ్‌ను స్థాపించారు. దేశంలో మొదటిసారిగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ సహ రాష్ట్రీయ జన సంఘ్ తరపున ముగ్గురు ఎంపీలు ఎన్నికయ్యారు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 కారణంగా జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా లభించింది. 1947 సంవత్సరంలో భారత-పాకిస్తాన్ విభజన సమయంలో, అక్కడి పాలకుడు రాజు హరి సింగ్ కశ్మీర్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలని కోరుకున్నట్టు చరిత్ర చెపుతోంది. కానీ, తరువాత కొన్ని షరతులతో భారతదేశంలో విలీనానికి అంగీకరించారు. భారతదేశంతో ఎలాంటి సంబంధాలు కలిగి ఉండాలనే దానిపై జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ముసాయిదా సిద్ధం చేసింది. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ పరిషత్ ఆర్టికల్ 306 A (తరువాత ఆర్టికల్ 370) ను కొన్ని మార్పులతో 1949, మే 27న ఆమోదించింది. తరువాత 1949, అక్టోబర్ 17న, ఈ ఆర్టికల్ భారత రాజ్యాంగంలో భాగమైంది. భారత పార్లమెంట్ 1949, నవంబర్ 26 న రాజ్యాంగాన్ని ఆమోదించింది. (ఆ తర్వాత అది అధికరణం 370గా మారింది). ఇన్‌స్ట్రూమెంట్ ఆఫ్ యాక్సెషన్ ఆఫ్ జమ్మూ అండ్ కశ్మీర్ టూ ఇండియాలోని

షరతులకు అనుగుణంగా ఆర్టికల్ 370లో ప్రస్తావించారు. దాని ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్ మినహా ఇతర విషయాలలో జమ్మూ కశ్మీర్ కోసం చట్టాలు చేసే అధికారం భారతదేశ పార్లమెంటుకు ఉండదు. అలాగే, జమ్మూ కశ్మీర్‌కు తన సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకునే వెసులుబాటూ లభించింది.

ఆ తర్వాత ఆర్టికల్ 370కి అనుగుణంగా జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. ఆ తరువాత, 1951 సంవత్సరంలో ప్రత్యేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఆ రాష్ట్రానికి అనుమతి లభించింది. జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే డిమాండ్ కూడా క్రమంగా పెరగసాగింది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 కి డాక్టర్ భీంరావు అంబేద్కర్ అనుకూలం కాదని చాలా మంది చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ఆర్టికల్‌ను రాజ్యాంగంలో చేర్చాలని జమ్మూ కశ్మీర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా ప్రతిపాదించారు. స్వల్ప చర్చ జరిగిన తర్వాత దీన్ని రాజ్యాంగంలో చేర్చారు. ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, షేక్ మొహమ్మద్ అబ్దుల్లా మధ్య దీనిపై ఐదు నెలలపాటు చర్చలు జరిగాయి. ఆ తర్వాతే ఆర్టికల్ 370 ని రాజ్యాంగంలో చేర్చాలనే ప్రతిపాదన సమర్పించారు. జమ్మూ కశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పట్ల సంతోషంగా లేనని అంబేద్కర్ స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 35A ను 'రాష్ట్రపతి ఉత్తర్వు' ద్వారా చేర్చారు. ఈ రాష్ట్రపతి ఉత్తర్వు జారీ చేసినప్పుడు ప్రధాన మంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ. రాష్ట్రపతిగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు. ఆర్టికల్ 370 ప్రకారం, రక్షణ, విదేశాంగ విధానం, కమ్యూనికేషన్ విషయాలు కాకుండా ఇతర విషయాలకు సంబంధించిన చట్టాలు రూపొందించేందుకు, అమలు చేసేందుకు, రాష్ట్ర ప్రభుత్వ నుంచి కేంద్రం అనుమతి తీసుకోవడం అవసరం. ఈ ప్రత్యేక హోదా కారణంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి వర్తించదు. ఈ కారణంగా రాష్ట్ర రాజ్యాంగాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి లేదు. ఆర్టికల్ 370 కారణంగా జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక జెండా ఉంటుంది. అంతే కాదు జమ్మూ కశ్మీర్ శాసనసభ కాలపరిమితి 6

సంవత్సరాలు. అక్కడి ముఖ్యమంత్రిని వజీర్-ఎ-అజామ్ అంటే ప్రధాని అని పిలుస్తారు. ఆర్టికల్ 370 కారణంగా భారత రాష్ట్రపతి జమ్మూ కశ్మీర్‌కు ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించలేరు.

భారతదేశ సమైక్యత, సమగ్రత కోసం చేసిన త్యాగం కారణంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ అంటే గౌరవ భావన సుందరయ్య మనసులో బాగా పెరిగింది. ఆయన ప్రాణత్యాగం హిందూ జాతీయవాదుల సంకల్పాన్ని బలోపేతం చేసింది. లక్షలాది ఆర్ఎస్ఎస్ వాలంటీర్ల మాదిరిగానే సుందరయ్య కూడా హిందూ గుర్తింపు, హిందూ ఆత్మగౌరవం భారతదేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతీది త్యాగం చేయాలని నిర్ణయించుకున్నారు.

రాజకీయ, సామాజిక ఉద్యమాల మధ్య సుందరయ్య వైద్య విద్య కొనసాగింది. ఏటా నిర్వహించే పరీక్షల్లో ఆయన పాసయ్యారు.

అటు సుందరయ్య గురించి అతని మేనత్త మనసులో రకరకాల ఆలోచనలు రావడం మొదలయ్యాయి. మద్రాసు మహానగరంలో ఇతర యువకుల ప్రభావంతో సుందరయ్య కూడా ప్రేమలో ఏమైనా పడతాడేమోనని అనుమానించింది. అంతే కాదు సుందరయ్యను ఎవరైనా అమ్మాయి తన వలలో వేసుకుంటుందనే భయం ఆమెలో మొదలైంది. సుందరయ్య యువకుడు, ఉత్సాహవంతుడు, బహుముఖ ప్రతిభాశాలి, ఉజ్వలమైన భవిష్యత్ ఉన్నవాడు కావడంతో ఆయన వైపు అమ్మాయిలు ఆకర్షితులు కావడం సహజం. ఆ రోజుల్లో అనేక ప్రేమ వ్యవహారాలు, కథలను సుందరయ్య మేనత్త విన్నది.

పెరియార్ ఉద్యమాల కారణంగా మద్రాసులో కులాంతర వివాహాలు పెరిగాయనే విషయం ఆమె తెలుసుకుంది. ఈ క్రమంలో తన మేనల్లుడు తమ కులం కాని అమ్మాయిని ఎక్కడా వివాహం చేసుకుంటాడోనని ఆమె తల్లడిల్లింది. ఆమెకు తన కులం అంటే ఎంతో అభిమానం.

వైద్య విద్యార్థుల గురించి ఆమె ఎన్నో కథలు విన్నది. చాలా మంది వైద్య విద్యార్థులు కాలేజీ రోజుల్లో తమ జీవిత భాగస్వామిని ఎంచుకుంటారనే విషయం ఆమెకు అవగతమైంది. చాలా సందర్భాలలో జీవిత భాగస్వామి కూడా వైద్య వృత్తిలో ఉండేవారే ఉంటారు. సుందరయ్య తండ్రి చాలా కాలం క్రితమే

కన్నుమూశారు. ఆయన బాధ్యతలన్నీ అన్న వెంకటసుబ్బయ్యే చూస్తున్నాడు. దీంతో ఆమె సుందరయ్య వివాహ ప్రస్తావనను తన పెద్ద మేనల్లుడు వెంకటసుబ్బయ్య ముందు ఉంచింది. తన దగ్గర బంధువు ఒక అమ్మాయిని సుందరయ్య వివాహం చేసుకుంటే బాగుంటుందని తన కోరిక తెలియజేసింది. ఈ విషయం ఆమె ఇంతకు ముందు కూడా చాలామందికి చెప్పింది. కాని, ఇప్పుడు సుందరయ్య పెళ్లి చేసుకోకపోతే తనకు నచ్చిన అమ్మాయి చేసుకుంటాడేమోననే భయంతో ఇక ఆలస్యం చేయకూడదని ఒత్తిడి చేయసాగింది.

సుందరయ్య సోదరుడు వెంకటసుబ్బయ్యకు వివాహ ప్రతిపాదన నచ్చింది. సమీప బంధువు లక్ష్మీకాంతమ్మ అంటే వెంకటసుబ్బయ్యకు చాలా ఇష్టం. ఇంట్లో అందరూ లక్ష్మీకాంతమ్మను 'కాంతమ్మ' అని పిలిచేవారు. కాంతమ్మ అందంగా ఉంటుంది. చదువుకుంది, గుణవంతురాలు కూడా. ఇంటి పనులు ఎలా చేయాలో ఆమెకు తెలుసు. సంగీతం అంటే ఆసక్తి ఉండేది. ఆమె స్వరం చాలా మధురంగా ఉంటుంది. పాటలు పాడటం కూడా నేర్చుకుంది. తన తమ్ముడు సుందరయ్యకు తగిన భాగస్వామి లక్ష్మి అని వెంకటసుబ్బయ్య భావించారు.

బంధువుల మధ్య వివాహాలనే సంప్రదాయం దక్షిణ భారతదేశంలో శతాబ్దాలుగా ఉంది. మామ, కోడలు మధ్య వివాహాలు సర్వసాధారణం. మేనకోడలితో మేనమామ వివాహం శుభకరమైనవి భావిస్తారు. చిన్నవయస్సులోనే అమ్మాయిల పెళ్లిళ్లు చేస్తారు. ఆ కారణంగా వారు చిన్నవయస్సులోనే తల్లి అయ్యేవారు. చిన్న తమ్ముడు వయస్సు ఎక్కువ లేకపోతే అక్కలు తమ కుమార్తెను తమ్ముడికిచ్చి పెళ్లి చేసేవారు.

మేనమామ– మేనకోడలి మధ్య జరిగే వివాహానికి ముఖ్య కారణం ఆస్తులే అని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. పుట్టింటి నుంచి తన వాటా అడగకుండా చూసేందుకు ఆమె కూతురిని వివాహం చేసుకునేవారు. అంతే కాదు సోదరుడు, సోదరి పిల్లల మధ్య వివాహాలు నిర్వహించే సంప్రదాయం కూడా దక్షిణాదిలో ఉంది.

వైద్య కళాశాలలో సెలవు తీసుకొని వివాహం కోసం సుందరయ్య కోవూరుకు వచ్చారు. సంప్రదాయబద్ధంగా వివాహ వేడుక జరిగింది. బంధువులందరూ

పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ సంబంధిత కార్యక్రమాలు పూర్తయిన వెంటనే, సుందరయ్య తన చదువుల కోసం మద్రాసు తిరిగి వచ్చారు. మెడికల్ కాలేజీ విద్యార్థుల్లో వివాహం చేసుకున్న ఏకైక వ్యక్తి సుందరయ్య మాత్రమే. చాలా మంది విద్యార్థులు డాక్టర్ అయ్యాక మంచి పేరు తెచ్చుకున్న తర్వాతే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గ్రామాలు, పల్లెల్లో బాల్యవివాహాలు కొనసాగాయి. సుందరయ్య కుటుంబంలో ఇరవై ఏళ్లు దాటిన తర్వాత వివాహం చేసుకున్నది సుందరయ్య ఒక్కరే. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి దాదాపు చిన్న వయసులోనే వివాహం జరిగింది.

మెడికల్ కాలేజీకి తిరిగి వచ్చిన తరువాత, సుందరయ్య తన దృష్టంతా చదువులపైనే నిలిపారు. ఎం.బి.బి.ఎస్ మూడో సంవత్సరం చివరి దశకు చేరింది. ఆ పరీక్షల్లో చక్కని మార్కులు తెచ్చుకోవాలని సుందరయ్య ఆకాంక్షించారు. లక్ష్య సాధన కోసం ఎక్కువ సమయంలో లైబ్రరీలోనే గడిపేవారు. పుస్తకాలతో స్నేహం చేశారు. వైద్య శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు, మ్యాగజైన్‌లు చదువుతూ మానవ శరీర నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు జీవితకాలం సరిపోదని గ్రహించారు. పుస్తకాలు చదవడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవాలనే తపన ఆయనలో బాగా బలపడింది. పాఠ్యాంశాలే కాకుండా ఇతర పుస్తకాలు చదవడం ద్వారా సుందరయ్య ఎంతో ప్రయోజనం పొందారు. ఆయన జ్ఞానం వికసించింది. అల్లోపతి వైద్యంపై అవగాహన పెరిగింది. సుందరయ్య కృషి ఫలించి మూడవ సంవత్సరపు పరీక్షలలోనూ అద్భుతమైన మార్కులు సాధించారు. ఎంబిబిఎస్ కోర్సు మొదటి మూడు సంవత్సరాలలో సుందరయ్య అనాటమీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ, ఆప్తాల్మాలజీ వంటి విషయాలు నేర్చుకున్నారు. ఏ సబ్జెక్ట్ తప్పని విద్యార్థుల్లో సుందరయ్య ఒకరు. ఆ రోజుల్లో విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కాలేకపోయేవారు. సబ్జెక్టులు చాలా కఠినంగా ఉండేవి. సాధారణ విద్యార్థులు వాటిని నేర్చుకోవడం అంత సులభం కాదు. చాలా మంది విద్యార్థులు గంటలు గంటలు చదివినా విషయ పరిజ్ఞానాన్ని పొందలేకపోయారు. వైద్య విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్

కావడం బ్యాక్‌లాగ్‌లు ఉండటం సర్వసాధారణం. ఐదు సంవత్సరాల కోర్సు పూర్తి చేసేందుకు కొందరు విద్యార్థులకు ఆరేడు ఏళ్లు పట్టేది. ప్రతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల బృందంలో సుందరయ్య ఒకరు.

మూడో సంవత్సరం పరీక్షల తర్వాత కుటుంబ సభ్యుల సూచనల మేరకు సుందరయ్య తన భార్య కాంతమ్మను మద్రాసుకు తీసుకువచ్చారు. మద్రాసులో, సుందరయ్య తన భార్య కాంతమ్మతో కాలేజీ క్యాంపస్లోనే ఒక ప్రత్యేక గదిలో నివసించడం ప్రారంభించారు. నాలుగవ సంవత్సరం చదువులు, వైవాహిక జీవితం కలిసి ప్రారంభమయ్యాయి.

ఎం.బి.బి.ఎస్ నాలుగో సంవత్సరం చదువులు మొదలయ్యాయి. ఆ సమయంలో సర్జరీ గురించి బోధన ప్రారంభమైంది. మెడిసిన్‌లో ప్రధానంగా రెండు విభాగాలు ఉంటాయి. అవి కాయచికిత్స (మెడిసిన్), శస్త్ర చికిత్స. వీటి ఆధారంగా వైద్యులకు పేర్లు ఉంటాయి. కేవలం మందులిచ్చి చికిత్స అందించేవారిని ఫిజిషియన్ అని, శస్త్రచికిత్సలు చేసేవారిని సర్జన్‌లు అంటారు. ఫిజిషియన్‌లు ఔషధాలతో వ్యాధులకు చికిత్స అందిస్తారు. అదే సర్జన్‌లు శస్త్రచికిత్స ద్వారా మనుషులను రోగాల నుంచి విముక్తి చేస్తారు. మందులు నయం చేయలేనప్పుడు లేదా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు, రోగి ప్రాణాలు కాపాడేందుకు, వారి వ్యాధి నయం చేసేందుకు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. సర్జన్ కావడానికి విభిన్న నైపుణ్యాలు అవసరం. మెడిసిన్ జ్ఞానం ఒక్కటే సరిపోదు. సర్జన్‌లు సాధారణంగా సర్జరీ, ఆపరేషన్ అనే రెండు రకాల ప్రక్రియలు నిర్వహిస్తారు. శరీరంలోని ఏ భాగానికైన గాయాలు అవడం లేదా, తెగడం లేదా విరగడం వంటి వాటికి చేసే చికిత్సను సర్జరీ అంటారు. శరీరంలో ఏదైనా భాగంలో వ్యాధి, కుళ్లిపోవడం వంటి సమస్యలను తొలగించే ప్రక్రియను ఆపరేషన్ అంటారు. శస్త్రచికిత్స, ఆపరేషన్ అంత తేలికైన పనులు కావు. చాలా మందికి తమ జీవితంలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడదు. కాని ఔషధాలతో చికిత్స సాధ్యం కానప్పుడు, శస్త్రచికిత్స ద్వారా సమస్యను చక్కదిద్దే ప్రయత్నం జరుగుతుంది. ప్రమాద సమయంలో ఎముక విరిగినప్పుడు, లోతైన గాయం లేదా ప్రాణాలు పోయే సమస్యలు ఏర్పడినప్పుడు, రోగి ప్రాణాలు కాపాడేందుకు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. కాని ఒక్క వ్యక్తి మాత్రమే

శస్త్రచికిత్స చేయలేరు. శస్త్రచికిత్సలో సర్జన్‌కు అనేక మంది సహాయకుల అవసరం ఉంటుంది. నొప్పి తీవ్రంగా ఉండే పరిస్థితుల్లో రోగికి మత్తుమందు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ రంగంలోని నిపుణులు మాత్రమే ఆ పని చేస్తారు. శస్త్రచికిత్స సమయంలో వైద్యుడికి కత్తి, కత్తెర, సూది, దారం, ఇతర పరికరాలు అందించేందుకు కూడా సాయం అవసరం. శస్త్రచికిత్స పెద్దదా, చిన్నదా అన్నదానితో సంబంధం లేకుండా డాక్టర్లు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అజాగ్రత్తగా ఉంటే రోగి చనిపోవచ్చు.

సుందరయ్య ఎం.బి.బి.ఎస్ చదువుతున్న రోజుల్లో చాలా మంది వైద్య విద్యార్థులు క్లినికల్ మెడిసిన్ వైపు ఎక్కువ ఆసక్తి చూపారు. కొద్ది మంది విద్యార్థులు మాత్రమే సర్జన్ కావాలని ఆలోచించారు. మొదటి రోజే ఆపరేషన్ థియేటర్ అంటే సుందరయ్యకు ఆసక్తి ఏర్పడింది. క్లిష్టమైన పనులు చేయడంలో ఆనందం ఉంటుందని భావించారు. బ్రిటిష్ కాలంలో విద్యార్థులు సర్జన్‌లుగా మారేలా ప్రోత్సహించే వారు. దీనికి కారణం ఆ రోజుల్లో జరిగిన యుద్ధాలు. యుద్ధంలో గాయపడిన సైనికులకు చికిత్స అందించడానికి బ్రిటిష్ వారికి సర్జన్‌లు అవసరం. అందుకే బ్రిటిష్ వారు ఎక్కువ మంది సర్జన్‌లను సిద్ధం చేశారు. బ్రిటిష్ వారి నిష్క్రమణ తరువాత, వైద్య రంగంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. చాలా మంది కొత్త విద్యార్థులు క్లినిక్స్, ఆసుపత్రులలో కూర్చుని ప్రజలకు ఔషధాలతో చికిత్స అందించేందుకు మొగ్గు చూపారు. కానీ, సుందరయ్య ఆలోచనలు భిన్నం. ఆయన శస్త్రచికిత్సల్లో మునిగిపోయారు. ఆపరేషన్ థియేటరుకు వెళ్లి సీనియర్ ప్రొఫెసర్లు చేసే శస్త్రచికిత్స చూసే అవకాశం వచ్చినప్పుడల్లా ప్రతి విషయాన్ని నిశితంగా గమనించేవారు. నాలుగవ సంవత్సరంలో ఉన్నప్పుడు మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలోని వివిధ వార్డులు సందర్శించడానికి, రోగులను కలవడానికి, వారి సమస్యలను తెలుసుకోవడానికి సుందరయ్యకు అవకాశం వచ్చింది. రోగులకు చికిత్స అందించడంలో తన సీనియర్ విద్యార్థులకు, ప్రొఫెసర్లకు సాయంగా ఉండేవారు సుందరయ్య. ఇంతలో కాంతమ్మ గర్భవతి అయింది. ప్రసవ సమయం దగ్గర పడినప్పుడు సుందరయ్య ఆమెను తన ఊరికి తీసుకెళ్లాడు.

అది మే నెల. మండువేసవి కాలం. ఎండ కారణంగా పగటిపూట జనం బయటకు వచ్చేందుకు జంకేవారు. అలాంటి మండు వేసవిలో 1954, మే 22 న ఒక చక్కని, ఆరోగ్యవంతమైన అబ్బాయికి జన్మనిచ్చింది కాంతమ్మ. సుందరయ్య ఆనందానికి అవధులు లేవు. తండ్రి అయినందుకు హృదయం ఆనందంలో మునిగిపోయింది. ఆ సమయంలో సుందరయ్య మదిలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఉన్నారు. ఆయన వ్యక్తిత్వం, రచనలు, త్యాగనిరతి సుందరయ్యను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కారణంగా తన కుమారుడికి ఆయన పేరు పెట్టాలని అనుకున్నారు. నామకరణం రోజున బంధువులందరికీ తన కుమారుడి శ్యామా ప్రసాద్ అని పేరు పెడుతున్నట్టు తెలిపారు.

సుందరయ్య ఇంటర్మీడియట్ చదువుతుండగా భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. స్వాతంత్ర్యం లభించిన కారణంగా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు. మరోవైపు దేశంలో కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు జరుగుతున్నాయి. పాకిస్తాన్ ఏర్పడ్డం వల్ల ఇటు పంజాబ్‌లో, అటు బెంగాళ్‌లో చాలామంది ఇటునుండి అటు, అటునుండి ఇటు రావడం, పోవడం జరిగింది. లక్షలాది మంది హిందువులు, సిక్కులు పాకిస్తాన్ వీడి ఇండియాకు వచ్చారు. అదేవిధంగా ఇక్కడి నుండి అక్కడికి కూడా చాలామంది వెళ్లారు. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద వలస. కానీ ఈ వలస జరుగుతుండగా పంజాబ్, బెంగాళ్‌లో మతపరమైన అల్లర్లు జరిగాయి. హత్యలు, మానభంగాలు, లూఠీలు జరిగాయి. హిందువుల, సిక్కులు ఒకవైపు, ముస్లింలు మరోవైపు. ఘర్షణల వల్ల విధ్వంసం తారాస్థాయికి చేరింది. పంజాబ్, బెంగాళ్ ప్రాంతాల్లో హింస ఒకవైపు కొనసాగుతుండగా దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లోని చిన్నచిన్న సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యేందుకు సిద్ధమయ్యాయి. కానీ హైదరాబాద్, కాశ్మీర్, జూనాగడ్, మైసూర్, ట్రావెన్ కోర్ భారతదేశంలో విలీనమవ్వడానికి అంగీకరించలేదు. నెల్లూరులోని సందరయ్య దేశవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలు గురించి విని అందోళన చెందారు. ఈ సంఘటనలో అప్పడు స్వయం సేవక్ సంఘ్ లేనట్లైతే హిందువులపై దాడులు ఎంతగానో జరిగేవని అభిప్రాయపడ్డారు. భారతదేశ తొలి హోం మినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశంలోని అన్ని సంస్థానాలను విలీనం చేయడానికి ప్రయత్నించారు.

## అధ్యాయం - 3

# తండ్రి సిద్ధాంతాలే ప్రేరణగా వైద్యవృత్తి చేపడతానని శ్యామా ప్రసాద్ ప్రమాణం

తండ్రి అయిన తర్వాత సుందరయ్య బాధ్యతలు పెరిగాయి. ఆయన తన వైద్య విద్య పూర్తి చేసిన వెంటనే పనిలో చేరాల్సిన అవసరం ఏర్పడింది. కుటుంబ బాధ్యతలు చూసుకోవడమే కాక డాక్టరుగా పేదలకు సేవ చేయాలనే తన సంకల్పాన్ని నెరవేర్చుకోవాల్సిన అవసరం కూడా తనపై ఉంది. భార్య, బిడ్డను తన అత్తమామల ఇంటికి పంపించి సుందరయ్య మద్రాసు తిరిగి వచ్చి తన చదువులో పూర్తిగా నిమగ్నయ్యారు. నాలుగవ సంవత్సరం చదువుతున్న సమయంలో వివిధ వ్యాధులకు ఎలా చికిత్స చేయాలో తెలుసుకోవడానికి మద్రాసు జనరల్ హాస్పిటల్‌లోని వివిధ వార్డులకు వెళ్ళి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం సుందరయ్యకు లభించింది. రోగులతో నేరుగా మాట్లాడే అవకాశంతో పాటు వారి కేస్ షీట్లు సిద్ధం చేసుకునే అవకాశాన్ని కూడా లభించింది. శస్త్రచికిత్స అంటే సుందరయ్యకు ఆసక్తి పెరిగింది. దాంతో ఆయన ఆపరేషన్ థియేటర్లో ఎక్కువ సమయం గడపటం ప్రారంభించారు. ఆపరేషన్ థియేటర్లో జరిగే శస్త్రచికిత్స ప్రక్రియ చూడటం, నేర్చుకోవడం దాన్ని అర్థం చేసుకోవడం సుందరయ్య పని.

ఎం.బి.బి.ఎస్ కోర్సు చివరి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 1954లో జరిగాయి. సుందరయ్య బాగా కష్టపడి చదవడంతో పూర్తి నమ్మకంతో పరీక్షలు

రాశారు. ఊహించిన విధంగానే ఫలితాలు వచ్చాయి. సుందరయ్య చివరి సంవత్సరంలోని అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులతో పాసయ్యారు. 1955 ఫిబ్రవరి 16న, మద్రాస్ యూనివర్సిటీలోని మెడిసిన్ ఫ్యాకల్టీ బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ (MBBS) డిగ్రీని ప్రదానం చేసింది. ఇది మామూలు విషయం కాదు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి చాలా మంది తోటి వైద్య విద్యార్థులు డాక్టర్లుగా మారినప్పటికీ, వెనుకబడిన కులాల నుంచి, నెల్లూరు జిల్లా నుంచి MBBS పట్టా పొందిన మొదటి వ్యక్తిగా సుందరయ్య నిలిచారు. సుందరయ్య కంటే ముందు వెనుకబడిన కులాలకు చెందిన వారెవరూ డాక్టర్ కాలేదు. సుందరయ్య కంటే ముందు నెల్లూరు జిల్లా నుంచి డాక్టర్లు ఉన్నారు. కాని వారంతా అగ్రవర్ణాలకు చెందినవారే. చాలా మంది వెనుకబడిన కులాల విద్యార్థులు 10వ తరగతి తర్వాత పైచదువులు చదవలేకపోయేవారు. 10వ తరగతి దాటిన వారు ఇంటర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేక పోయారు. ఒకవేళ ఇంటర్ పాసైతే అక్కడితోనే చదువులు ఆపి ఏదో ఒక ఉద్యోగంలో చేరేవారు. దళిత సమాజం, వెనుకబడిన కులాల నుంచి పట్టభద్రులయ్యే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి గ్రాడ్యుయేట్ కావడం గొప్ప విజయంగా భావించే రోజులవి. దేశవ్యాప్తంగా దళిత వర్గానికి చెందిన వ్యక్తి లేదా ఏదైనా వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి డాక్టర్ లేదా ఇంజినీర్ కావడం అరుదైన విషయంగా భావించే వారు. యాదవ కులానికి చెందిన పిల్లలు చేతుల్లో కర్రలు పట్టుకుని ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మేపేందుకే పరిమితమయ్యేవారు. అలాంటిది ఆ వర్గానికి చెందిన వ్యక్తి చేతిలో స్టెతస్కోప్ పట్టుకుని డాక్టర్‌గా ఊహించుకోవడం ఆరోజుల్లో నిజంగా కష్టంతో కూడుకున్నదే.

ఎం.బి.బి.ఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి సుందరయ్య గొప్ప విజయాన్ని సాధించారు. సుందరయ్య మొదటి ప్రయత్నంలోనే అన్ని పరీక్షలూ పాసవడం గొప్ప విషయం. ఆయన డాక్టర్ కావడం చర్చనీయాంశమైంది. చదివే సమయంలో ఆయన ఏనాడు సమయం వృథా చేయలేదు. మెడికల్ కాలేజీలో ఆయనకు ఫస్ట్, సెకండ్ ర్యాంక్ రాలేదు కాని ఆయన సాధించిన మార్కులు ఆ టాపర్ల కంటే తక్కువేం కాదు.

డాక్టర్ పట్టా తీసుకున్న సుందరయ్య తన సంకల్పం నెరవేర్చుకునే లక్ష్యంతో గ్రామానికి వచ్చి పేద ప్రజలకు వైద్యం చేయడం ప్రారంభించారు. ఆయన అప్పుడు తన కుటుంబంతో ఉన్నారు. డాక్టరుగా ప్రజా సేవ కొనసాగిస్తూనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారంలోనూ పాల్గొనేవారు. కష్టించి పనిచేసే తత్వం ఆయనది. అలాగే ఆయనది చక్కని వాగ్ధాటి కావడంతో మాట తీరు అందర్ని ఆకట్టుకునేది. ఈ కారణంగా సుందరయ్యకు సంఘ్‌లో మంచి పేరు వచ్చింది. సంఘ్‌కు చెందిన పెద్ద నాయకులు ఆయన ఇంటికి వచ్చేవారు. సంఘ్ పరివార్‌లో పూర్తి కాల ప్రచారక్‌గా బాధ్యతలు నిర్వర్తించే సోంపల్లి సోమయ్యతో సుందరయ్యకు మంచి స్నేహం కుదిరింది.

ప్రకాశం జిల్లా పరళామిల్లి గ్రామంలో 1927 లో జన్మించిన సోమయ్య అంకితభావంతో పనిచేసే సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సేవకుడు. సోమయ్య పేద కుటుంబంలో జన్మించారు. చిన్న వయసులోనే ఆయన తన తండ్రిని కోల్పోయారు. సోమయ్య, ఆయన తోబుట్టువులు తొమ్మిది మందిని తల్లే పెంచి పెద్దచేసింది. బతుకుదెరువు కోసం ఆమె కట్టెలు అమ్మేది. తెనాలి హైస్కూల్లో చదువుతున్నప్పుడే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకలాపాల పట్ల సోమయ్య ఆకర్షితుడయ్యారు. 15 సంవత్సరాల వయస్సు నుంచే ఆయన సంఘ్ శాఖలలో పాల్గొనడం ప్రారంభించారు. వాలంటీర్‌గా కర్ణాటకలోని బెల్గాంలో ప్రత్యేక శిక్షణ పొంది సంఘ్ ప్రచారక్‌గా మారారు. తొలుత గుంటూరు విభాగం ఇంచార్జిగా చేశారు. ఆ తర్వాత ఆయన పేరు ఆంధ్రప్రదేశ్ అంతటా మార్మోగింది. సంఘ్‌ను విస్తరించడానికి సోమయ్య ఆంధ్రాలోని ప్రతీ గ్రామం, ప్రతీ పట్టణంలో పర్యటించడం ప్రారంభించారు. సోమయ్య చేసే ఉత్తేజవంతమైన ప్రసంగాల కారణంగా చాలా మంది యువకులు సంఘ్‌లో చేరారు. 1948లో మహాత్మా గాంధీ హత్యానంతరం సంఘ్ నిషేధించబడినప్పుడు, దాన్ని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేసినందుకు సోమయ్యను అరెస్టు చేసి జైలులో పెట్టారు. సంఘంపై నిషేధం తొలగించిన తరువాత సోమయ్య జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. అతి కొద్ది సంవత్సరాలల్లోనే ఆయన ఆంధ్రా ప్రాంతంలో సంఘ్‌లో అతి గొప్ప,

అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా ఎదిగారు. సంఘ్ ప్రచారంలో సుందరయ్య లాంటి ఉత్సాహవంతుడైన యువకుడి నుంచి సోమయ్యకు పూర్తిస్థాయిలో సహకారం లభించింది.

ఆ సమయంలోనే సుందరయ్య, కాంతమ్మలకు రెండవ బిడ్డ పుట్టింది. ఈసారి కూడా అబ్బాయే. రెండో కుమారుడికి గోపికృష్ణ అని నామకరణం చేశారు.

రెండో బాబు పుట్టిన సంవత్సరానికి అంటే 1957లో, సుందరయ్యకు ప్రభుత్వ వైద్యుడిగా ఉద్యోగం లభించింది. దీంతో ఆయన ప్రభుత్వ వైద్యుడయ్యారు. మొదటి ఉద్యోగం కందుకూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చింది. 1957 నవంబర్ 12న సుందరయ్య ఆ ఆసుపత్రిలో అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయడం వల్ల నిస్సహాయులు, పేదలకు సేవ చేసే చక్కని అవకాశం లభించింది. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఉచితంగా చికిత్స చేస్తారు. ఎలాంటి రుసుము తీసుకోకుండా రోగులకు మందులు అందజేస్తారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్స చేయడం ప్రారంభించారు. 1958 ఏప్రిల్ 9న నెల్లూరు జిల్లా కేంద్రానికి అనుబంధంగా ఉన్న క్లినిక్‌కు సుందరయ్య బదిలీ అయ్యారు. ఆరు నెలల తరువాత సుందరయ్యకు పదోన్నతి లభించింది. అసిస్టెంట్ సర్జన్ నుంచి ఆయన పదోన్నతితో సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదా పొందారు. ఆ తర్వాత 1959 జూన్ 25న ఇస్కపాలెం గ్రామానికి బదిలీ అయ్యారు. మరోసారి సుందరయ్య గ్రామ ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది. కానీ ఈ గ్రామం పరిస్థితి చాలా భిన్నంగా ఉండేది. ఇక్కడ గ్రామ అధ్యక్షుడిది ఫ్యూడల్ మనస్తత్వం. పేదలను హీనంగా చూడటమే కాదు, తరచూ వారితో అవమానకరంగా వ్యవహరించేవారు. అనేక ఎకరాల భూమికి యజమాని కావడంతో చాలా మంది కూలీలు ఆయన దగ్గర పని చేసేవారు. ఇంట్లోనూ చాలా మంది పని మనుషులు ఉండేవారు. అందులో కొంత మంది బంధువులు కూడా ఉండేవారు. పనివాళ్లతో గొడ్డు చాకిరీ చేయించుకోవడమే కాదు, సక్రమంగా జీతాలూ చెల్లించక పోయేవారు. కొందరికి డబ్బుకు బదులు తిండి గింజలు

ఇచ్చేవారు. అధ్యక్షుడి తీరు సుందరయ్యకు చాలా కోపం తెప్పించింది. అన్యాయాన్ని సహించలేని స్వభావం సుందరయ్యది. గ్రామంలోని పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తూ సుందరయ్య తమ స్వరం పెంచారు.

డాక్టర్ కావడంతో గ్రామస్తులంతా సుందరయ్యను ఎంతో గౌరవించేవారు. గ్రామస్థుల పక్షాన నిలబడిన సుందరయ్య అంటే ఆ ఊరి ప్రెసిడెంట్‌కు సహజంగానే కోపం పుట్టుకొచ్చింది. అంతే కాదు, సుందరయ్యపై ఆధిపత్యం చలాయించడం మొదలుపెట్టారు. సుందరయ్యకు ఆచరణ సాధ్యం కాని ఆదేశాలు ఇవ్వడం ప్రారంభించారు. ఊరి ప్రెసిడెంట్ నియంతలా ప్రవర్తిస్తుండటంతో సుందరయ్య తన నిరసన కొనసాగించారు. ఆ ఊరి ప్రెసిడెంట్ రాజకీయంగా కూడా బాగా పలుకుబడి కలిగిన వ్యక్తి కావడంతో ఊరిలో ఆయన మాటే వేదంలా సాగింది.

ఈ సమయంలోనే సుందరయ్య, కాంతమ్మ దంపతులకు మూడో సంతానం జన్మించింది. ఈసారి అమ్మాయి పుట్టింది. 1959 డిసెంబర్ 16న జన్మించిన ఆ పాపను చూసి సుందరయ్య తన ఇంటికి దేవదూత వచ్చినట్టుగా పులకించి పోయారు. ఆ పాపకు మైథిలి అని పేరు పెట్టారు. కుమార్తె పుట్టడం సుందరయ్యకు చాలా ఆనందం కలిగించింది.

గ్రామ అధ్యక్షుడి నియంతృత్వ వైఖరి ఆయనను ఆందోళనకు గురిచేస్తూనే ఉంది. ఏదో ఒకరోజు ఊరి ప్రెసిడెంట్ పై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సుందరయ్య ఆశించారు. ఈ ఆశ ఆయనను గ్రామంలో ఉండి ప్రజలకు సేవ చేస్తూ ఉండటానికి స్ఫూర్తిగా నిలిచింది.

సుందరయ్య, కాంతమ్మ దంపతులు ఇస్కపాలెం గ్రామంలో ఉంటున్న సమయంలోనే నాలుగో సంతానం పుట్టింది. 1960 జనవరి 5న, కాంతమ్మ ఒక అందమైన, ఆరోగ్యకరమైన అమ్మాయికి జన్మనిచ్చింది. ఆ కుటుంబంలో మరోసారి పండుగ వాతావరణం నెలకొంది. సుందరయ్య, కాంతమ్మ రెండో కుమార్తెకు శోభారాణి అని పేరు పెట్టారు. ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తర్వాత సుందరయ్య, కాంతమ్మ తమ కుటుంబం పరిపూర్ణమైందని అనుకున్నారు. కుటుంబ నియంత్రణ పాటించాలని దంపతులు నిర్ణయం తీసుకున్నారు.

సుందరయ్య కుటుంబంలో సదా ఆనందం వెల్లివిరిసి ఉండేది. కానీ గ్రామ ప్రెసిడెంట్ చేతిలో పేదల ప్రజలు దోపిడికి గురవుతుండటం ఆయనను బాగా కలిచివేసేది. ఊరి ప్రెసిడెంట్ పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సుందరయ్య ఆగ్రహం తారస్థాయికి చేరింది. ప్రభుత్వం, అధికారుల వైఖరిపై ఆగ్రహించిన సుందరయ్య సెలవుపై వెళ్లారు. కానీ భూస్వామ్య భావజాలం కలిగిన ప్రెసిడెంట్ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగిస్తానని, నిస్సహాయ ప్రజలకు న్యాయం చేసేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ చేశారు.

సెలవు రోజుల్లోనూ పనిచేసే అలవాటు సుందరయ్యకు ఉంది. సెలవు రోజుల్లోనూ ఆసుపత్రికి వెళ్లి రోగులకు చికిత్స అందించేవారు. ఏదైనా కారణాల వలన ఆసుపత్రికి వెళ్లడం కుదరకపోతే ఇంట్లో రోగులకు చికిత్స అందించేవారు. వైద్య సాయం అందించేందుకు సుందరయ్య 24 గంటలూ అందుబాటులో ఉంటారనే విషయం ప్రజలకు అర్థమైంది. ప్రజలు బాధలో ఉన్నప్పుడు మాత్రమే డాక్టర్ దగ్గరకు వస్తారనే విషయమూ సుందరయ్యకు బాగా తెలుసు. కష్టకాలంలో డాక్టరు అందుబాటులో లేకపోతే రోగి పరిస్థితి విషమంగా మారవచ్చు. రోగి ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. తన కారణంగా రోగులు ఇబ్బంది పడటం సుందరయ్యకు ఇష్టం ఉండేది కాదు. ఆయన రోగుల సేవ తన కర్తవ్యంగా భావించేవారు. ఆ కారణంగా రోగులు ఆయనను దేవుడిగా ఆరాధించేవారు. పగలు, రాత్రి రోగుల సేవలో నిమఘ్నమై ఉండే కారణంగా సుందరయ్య అంటే అందరికీ గౌరవభావం ఏర్పడింది. రోగుల కోసం ఆయన ఇంటి ద్వారాలు సదా తెరిచే ఉండేవి. సుందరయ్య ఏనాడు సెలవు తీసుకోలేదు. కాని, ఇస్కపాలెం గ్రామ ప్రెసిడెంట్ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా సెలవు తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు, సెలవు రోజుల్లోనూ పనిచేసే అలవాటు ఆయనకు వరంగా మారింది.

ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి సెలవులు తీసుకోనప్పుడు అవన్నీ ఆర్జిత సెలవులుగా మారిపోతాయి. అంటే, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆర్జిత సెలవుపై వెళ్లినప్పుడు కూడా జీతం పొందుతారు. ఆ రోజుల్లో ఒక ఉద్యోగి 30 రోజుల కంటే ఎక్కువ ఆర్జిత సెలవులు తీసుకోకూడదనే నియమం ఉండేది.

దీంతో సుందరయ్య 30 రోజుల ఆర్జిత సెలవు తీసుకున్నారు. ప్రెసిడెంట్ నియంతృత్వ తీరుకు నిరసనగా ఆయన 1960 జూన్ 9 నుంచి 1960 జులై 8 వరకు 'ఎర్న్ డ్ లీవ్' తీసుకున్నారు. ఇంత నిరసన చేపట్టినా ప్రెసిడెంట్ తీరులో మార్పు రాకపోవడంతో పరిస్థితి మారే వరకు ఇస్కపాలెం గ్రామానికి రాకూడదని సుందరయ్య పెద్ద నిర్ణయం తీసుకున్నారు.

సుందరయ్యకు ప్రభుత్వ ఉద్యోగం వదలుకోవడం ఇష్టం లేదు. అటు ప్రభుత్వం ఆయనను మరో చోటుకు బదిలీ చేయడం లేదు. ఇస్కపాలెం గ్రామం నుంచి బదిలీ చేయాలని కోరినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కోపోద్రిక్తుడైన సుందరయ్య 'అసాధారణ సెలవు' సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రత్యేక పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగి లేదా అధికారికి 'అసాధారణ సెలవు' మంజూరు చేస్తారు. ఇతర రకాల సెలవులు మంజూరు చేయలేనప్పుడు ప్రభుత్వ ఉద్యోగికి 'అసాధారణ సెలవు' మంజూరు చేయవచ్చు. ఇతర రకాల సెలవులు మంజూరు చేయలేనప్పుడు ప్రభుత్వ ఉద్యోగి లిఖితపూర్వకంగా 'అసాధారణ సెలవు' కోసం దరఖాస్తు చేసినప్పుడు ఈ సదుపాయాన్ని కల్పిస్తారు. మరో విషయం ఏమిటంటే, ఏ ప్రభుత్వ ఉద్యోగికి అయినా 5 సంవత్సరాలకు మించి అసాధారణ సెలవులు ఇవ్వలేరు. ఈ 'అసాధారణ సెలవు' సమయంలో ఉద్యోగికి జీతం రాదు, కాని వారు ప్రభుత్వ ఉద్యోగిగానే ఉంటారు. ఉద్యోగి 'అసాధారణ సెలవు' వ్యవధి ముగించుకొని తిరిగి విధుల్లోకి చేరవచ్చు. సుందరయ్య 1960, జూలై 9 నుంచి 'అసాధారణ సెలవు' తీసుకున్నారు. ఆయనకు ఇప్పుడు తగినంత సమయం ఉంది కాబట్టి ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారంలో పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. మరోసారి పల్లెలు, పట్టణాలకు ఆయన ప్రయాణం ప్రారంభమైంది. శాఖల్లో ప్రసంగాలు చేస్తూ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. మరింత మంది యువతను సంఘ్‌తో అనుసంధానించడానికి, అనేక గ్రామాలు, నగరాల్లో క్రమం తప్పకుండా నగర సంకీర్తన ప్రారంభించారు.

ఈ సమయంలోనే వివిధ రాష్ట్రాలు సందర్శించి అక్కడ శాఖలలో పాలుపంచుకునే అవకాశం సుందరయ్యకు లభించింది. సంఘ్ అగ్రనేతలతో

జరిగిన సమావేశాలు, వివిధ రాష్ట్రాల్లోని ప్రజల సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు సంఘ్ చేస్తున్న కృషిని సుందరయ్య తెలుసుకున్నారు. సంఘ్ కార్యకలాపాల్లో నిమగ్నమైన సుందరయ్య తన వైద్య వృత్తిని మానేయలేదు. ఎవరైనా రోగి ఆయన దగ్గరకు వచ్చినప్పుడు ఆయన చికిత్స అందించేవారు. సుందరయ్య గొప్ప వైద్యుడనే విషయం ప్రజలకు తెలుసు. ఈ కారణంగా సుదూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం ప్రజల ఆయన దగ్గరకు వచ్చేవారు.

దాదాపు పది నెలలపాటు ప్రభుత్వాసుపత్రికి దూరంగా ఉన్న సుందరయ్య ఇక సెలవు పెట్టడం సరికాదని గ్రహించారు. ప్రభుత్వోద్యోగం చేసుకుంటూ చాలా మందికి వైద్య సేవలందించవచ్చని, బయట ఆ రీతిలో చేయడం సాధ్యం కాదనే విషయాన్ని ఆయన గుర్తించారు. అటు పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నారు కాబట్టి స్థిరమైన ఆదాయం కలిగిన ఉద్యోగం చేయడం సుందరయ్యకు అనివార్యమైపోయింది. ఆ సమయంలో విశాఖా ఆంధ్ర మెడికల్ కాలేజీలో మాస్టర్ ఆఫ్ సర్జరీ కోర్సులో సీటు లభించింది. ఇది ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్స్, రెండు సంవత్సరాలు పాటు సుందరయ్య అనేక విధాలుగా చేయబడే శస్త్రచికిత్స పద్ధతులు గురించి నేర్చుకున్నారు. క్యాన్సర్ లాంటి పెద్ద జబ్బు కూడా ఏ రకంగా శరీరం నుండి సర్జరీ ద్వారా బయటకు తీయవచ్చో తెలుసుకున్నారు. సర్జరీ ద్వారా ఏ రకంగా అనేక వ్యాధులను చికిత్స చేయగలరో వాటిలో నైపుణ్యం సాధించారు. ఎం.ఎస్. డిగ్రీ పొందిన కొన్ని రోజులకే ఆయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ సర్జన్‌గా నియమించింది. ఎముకలకు సంబంధించిన వ్యాధుల నివారణలో ప్రత్యేక శిక్షణ పొందిన ఆయనను కొన్నినెలలు తరువాత ఆర్థోపెడిక్ విభాగంలో ట్యూటర్‌గా నియమించింది. కింగ్ జార్జ్ హాస్పిటల్లోని ఆర్థోపెడిక్ సర్జన్‌కు అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగించారు.

బంగాళాఖాతం ఒడ్డునున్న విశాఖపట్నంలో స్థిరపడిన తర్వాత సుందరయ్య తన భార్యాపిల్లలను అక్కడికి రప్పించుకున్నారు. మళ్లీ కుటుంబమంతా ఒకేచోట కలిసి జీవించడం మొదలుపెట్టారు.

కొన్ని నెలల తర్వాత సుందరయ్యకు, ఆయన కుటుంబానికి విశాఖపట్నంతో అమితమైన అనుబంధం ఏర్పడింది. సముద్ర తీరాన ఉన్న ఈ నగరం

నచ్చడంతో అక్కడే శాశ్వతంగా స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. సుందరయ్యకు ఆంధ్రా మెడికల్ కాలేజీలో కింగ్ జార్జ్ హాస్పిటల్లో పని విధానం కూడా నచ్చింది.

ఆంధ్ర వైద్య కళాశాలకు ఒక అద్భుతమైన చరిత్ర ఉంది. ఇది ఆంధ్రా ప్రాంతంలోనే అతి పురాతన వైద్య కళాశాల. భారతదేశంలో వైద్య విద్యను ప్రోత్సహించడంలో భాగంగా బ్రిటిష్ పరిపాలన సమయంలో పెద్ద నగరాల్లో వైద్య సంస్థలు, వైద్య కళాశాలలు ప్రారంభించారు. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో మద్రాసు ప్రెసిడెన్సీలోని ప్రధాన నగరాల్లో విశాఖపట్నం ఒకటి. ఆంధ్ర ప్రాంతంలో విశాఖపట్నం అతి పెద్ద నగరం. రేవు పట్టణం కావడంతో బ్రిటిష్ వారు ఈ నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు.

1902 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం మహారాజా సర్ గోడే నారాయణ గజపతి రావు, మహారాణి చిట్టి జానకమ్మ సహాయంతో విక్టోరియా డైమండ్ జూబ్లీ మెడికల్ స్కూల్‌ను స్థాపించింది. ఈ వైద్య సంస్థ నుంచి అల్లోపతి వైద్య విద్య అభ్యసించిన విద్యార్థులకు లైసెన్సియేట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ లైసెన్సియేట్ సర్టిఫికేట్ కలిగిన ఎవరైనా అల్లోపతి వైద్యవిధానాన్ని అవలంబించి రోగులకు చికిత్స చేయవచ్చు. 1923 జూలై 1న ఈ పాఠశాలను కళాశాలగా మార్చారు. నవీకరించిన కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్‌గా ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ నియమితులయ్యారు. 1886 మార్చి 10న జన్మించిన ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ తండ్రి ఆల్ఫ్రెడ్ జాస్పర్ ఆండర్సన్ ఇంగ్లాండ్‌లో బ్లాక్ పూల్‌లో మెడికల్ ఆఫీసర్. ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్, ఎప్సమ్ కాలేజీ, సెయింట్ బార్తోలోమ్యూస్ హాస్పిటల్లో అల్లోపతి వైద్యశాస్త్రాన్ని అభ్యసించారు. 1912 జనవరిలో 'ఇండియన్ మెడికల్ సర్వీస్'లో చేరారు. ఫ్రెడరిక్ జాస్పర్ అండర్సన్ మొదటి ప్రపంచ యుద్ధంలో 1914-15 సమయంలో ఫ్రాన్స్‌లో, 1916-18 సమయంలో ఇరాక్, ఈజిప్టులో వైద్య సేవలందించారు. 1915లో ఆయనకు 'కెప్టెన్'గా పదోన్నతి లభించింది. 1917 లో, ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ యుద్ధ సమయంలో అద్భుతమైన పనితీరు, గాయపడిన అనేక మంది సైనికులకు చికిత్స అందించినందుకు 'మిలిటరీ క్రాస్' ప్రదానం చేశారు. 1922లో ఆయన ఫెలోషిప్ తీసుకున్నారు. 1923లో మేజర్‌గా ఆయనకు పదోన్నతి లభించింది.

1913 నుంచి 1923 వరకు ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ మద్రాసులో సివిల్ సర్జన్ గా పనిచేశారు. మద్రాస్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు 'సర్జరీ' విధానాలు నేర్పించారు. ఆయన 'ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ'గా ప్రసిద్ధి చెందారు. 1923లో విశాఖపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ 1934 వరకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను కలకత్తాకు బదిలీ చేసింది. అక్కడ ఆయన 1945 వరకు పనిచేశారు. 1945 లో లెఫ్టినెంట్-కల్నల్ హోదాలో పదవీ విరమణ చేసిన తరువాత, ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ కలకత్తాలో స్థిరపడ్డారు. అక్కడ సొంత క్లినిక్ ప్రారంభించి రోగులకు చికిత్స చేయడం ప్రారంభించారు. ఆయన అద్భుతమైన ఉపాధ్యాయుడు, ఉత్తమ సర్జన్‌గా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ఫ్రెడరిక్ జాస్పర్ ఆండర్సన్ కారణంగానే ఆంధ్రా మెడికల్ కాలేజీ వేగంగా అభివృద్ధి చెందింది. ఇక్కడ బోధన-శిక్షణ పొందిన తరువాత అన్ని పరీక్షలలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు ఎం.బి.బి.ఎస్ డిగ్రీ ప్రదానం చేసేవారు.

సుందరయ్య విశాఖపట్నం చేరేనాటికి ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న కింగ్ జార్జ్ హాస్పిటల్ ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత ప్రముఖ ఆస్పత్రిగా పేరుగాంచింది. పెద్ద సంఖ్యలో రోగులు అక్కడికి వచ్చేవారు. బ్రిటిష్ ప్రభుత్వం 1845లో విశాఖపట్నంలో సివిల్ డిస్పెన్సరీ ప్రారంభించింది. దాని ద్వారా రోగులకు చికిత్స అందేది. రోగుల సంఖ్య పెరగడం, తీవ్ర అస్వస్థతకు గురైన వారికి 24 గంటలూ పర్యవేక్షణ అవసరం ఏర్పడటంతో డిస్పెన్సరీని ఆస్పత్రిగా మార్చారు. 1857లో ఈ సివిల్ డిస్పెన్సరీ 30 పడకల ఆసుపత్రిగా మార్చబడింది. అప్పటి నుంచి ఆసుపత్రి దశల వారీగా విస్తరించింది. 1923 జూలై 19న, ఆసుపత్రి నూతన భవనాన్ని మద్రాసు ముఖ్యమంత్రి, పానగల్ రాజు పాగనంటి రామరాయణింగర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఆసుపత్రికి యునైటెడ్ కింగ్ డం సామ్రాట్, భారతదేశ పరిపాలకుడు ఆల్బర్ట్ ఫ్రెడరిక్ ఆర్థర్ జార్జ్ అయిన బ్రిటిష్ చక్రవర్తి జార్జ్ VI పేరును పెట్టారు. అదే కింగ్ జార్జ్ ఆసుపత్రిగా ప్రసిద్ధి చెందింది.

ఒక అద్భుతమైన కళాశాలలో ఉపాధ్యాయుడిగా చేరినందుకు, మంచి ఆసుపత్రిలో సర్జన్‌గా మారినందుకు సుందరయ్య సంతోషించారు. పెద్ద ప్రభుత్వాసుపత్రి కావడం వలన సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు విశాఖపట్నం వచ్చేవారు. రోగులలో ఎక్కువ మంది పేదలే. వారికి చికిత్స చేస్తున్నప్పుడు సుందరయ్య తన లక్ష్యం విజయవంతం అయినట్లు భావించారు.

పెద్ద కుమారుడు శ్యామా ప్రసాద్ పాఠశాలకు వెళ్లే వయస్సులో ఉన్నప్పుడు సుందరయ్య అతని కోసం చక్కని పాఠశాల అన్వేషించారు. ఆ అన్వేషణ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌తో ఆగిపోయింది. ఈ పాఠశాల విశాఖపట్నం నగరంలో ప్రాచీన, ప్రసిద్ధ పాఠశాలల్లో ఒకటి. దీన్ని బ్రిటిష్ కాలంలోనే నెలకొల్పారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ పాఠశాలను క్రైస్తవ మిషనరీలు ప్రారంభించారు. పాఠశాల నిర్వహణ మిషనరీల చేతిలో ఉండటంతో అన్ని వర్గాల పిల్లలకు అక్కడ ప్రవేశం లభించేది. తొలినాళ్లలో మిషనరీలే ఉపాధ్యాయుల పాత్ర పోషించేవారు. కానీ పాఠశాల విస్తరించడంతో రెగ్యులర్ ఉపాధ్యాయులనూ నియమించారు. నాణ్యమైన విద్యతో పాటు కఠినమైన క్రమశిక్షణ కారణంగా సెయింట్ ఆంథోనీ హైస్కూల్ ఖ్యాతి దశదిశలా వ్యాపించింది. అనతి కాలంలోనే ఈ పాఠశాల బాగా ప్రాచుర్యం పొందింది. ఈ పాఠశాలలోనే తన కుమారుడు శ్యామా ప్రసాద్‌ను చేర్పించాలని సుందరయ్య భావించారు.

శ్యామా ప్రసాద్‌ను సెయింట్ ఆంటోనీస్ హైస్కూల్లో సుందరయ్య చేర్పించారు. శ్యామా ప్రసాద్ ప్రతీ రోజు  పాఠశాలకు వెళ్లడం ప్రారంభించారు. చదువుల విషయంలో శ్యామా ప్రసాద్ తన తండ్రిలాగే ఉండేవారు. తరగతి ఫస్ట్ ర్యాంక్‌లో నిలవకపోయినా తెలివైన విద్యార్థుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. శ్యామాప్రసాద్‌కు పరీక్షల్లో టాప్ మార్కులు రాకపోయినా, టాపర్ల కంటే అతనికి వచ్చిన మార్కులు తక్కువేం కాదు.

నాలుగో తరగతి చదువుతున్న శ్యామా ప్రసాద్‌కు ఒక రోజు అతనికి స్కూల్ వెళ్లాలని అనిపించలేదు. ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఏదో

సాకులు చెప్పి తల్లికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లే టైమ్ దాటిపోతే ఇక తనను స్కూల్‌కు పంపరన్నది అతని ఆలోచన. శ్యామా ప్రసాద్ చేస్తున్న ప్రయత్నాలను తండ్రి సుందరయ్య గమనించారు. కొడుకు దగ్గరకు వచ్చి స్కూల్‌కు టైమ్ అవుతోంది, ఎందుకు ఇంకా రెడీ కాలేదు అని అడిగాడు.

తండ్రి అడిగిన తీరును శ్యామా ప్రసాద్ సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు రెడీ అవుతానని తేలిగ్గా చెప్పాడు. తండ్రికి కోపం వచ్చింది. ఇంకోసారి ఆలస్యం జరగడానికి వీల్లేదని కఠినంగా మందలించారు. ఆ తర్వాత కాసేపటికి కూడా శ్యామా ప్రసాద్ రెడీ కాకపోవడంతో ఆగ్రహించిన సుందరయ్య, కొడుకు దగ్గరకు వచ్చి చెంపపై గట్టిగా కొట్టారు. ఆ దెబ్బ ఇల్లంతా మార్మోగిపోయింది. తన పిల్లలపై సుందరయ్య చేయి ఎత్తడం అదే మొదటిసారి. తన తండ్రి తనను అంతలా కొడతారని శ్యామా ప్రసాద్ ఊహించలేదు. ఆ దెబ్బకు అతను స్పృహ కోల్పోయాడు. తన తండ్రి చెంపదెబ్బ కొడతాడని శ్యామా ప్రసాద్ తన కలలో కూడా ఊహించలేదు. ఈ దాడితో కన్నీటి పర్యంతమైన కొడుకు పరిస్థితిని చూసిన తల్లి, అతన్ని ఒడిలోకి తీసుకొని ఓదార్చసాగింది. సుందరయ్య అక్కడితో ఆగలేదు. శ్యామా ప్రసాద్‌కు అర్థమయ్యేలా, హెచ్చరికగా కొన్ని అంశాలను చెప్పారు. చెప్పేది జాగ్రత్తగా విను. క్రమశిక్షణ విషయంలో నేను రాజీపడను. ఆలస్యాన్ని నేను సహించను. పనిని తప్పించుకునేవాళ్లంటే నాకు ఇష్టం ఉండదు. ప్రతీ పని సమయానికి జరగాలి. నాకు క్రమశిక్షణ పట్ల గట్టి నమ్మకం ఉంది. నాకు వాయిదా వేయడం ఇష్టం ఉండదు. పని నుంచి పారిపోయే వ్యక్తులను నేను ఇష్టపడను. అంతా సమయానికి చేయాలి. స్కూల్‌కు వెళ్లడం నీ పని. ప్రతీ రోజు నీవు స్కూల్‌కు వెళ్లాలి. అక్కడ ఏం చెప్తారో అదంతా నీవు చేయాలి. చదువు విషయంలో నాకు అలసత్వం నచ్చదు. నీవు డాక్టర్ కొడుకువని మర్చిపోకు. డాక్టరు తన పని విషయంలో జాప్యం చేస్తే రోగి చనిపోవచ్చు. ఒక్క విషయం గుర్తుంచుకో, జీవితంలో ప్రతీ విషయంలోనూ క్రమశిక్షణ కలిగి ఉండటం చాలా ముఖ్యం. ఎవరైతే క్రమశిక్షణ పాటించరో, వారు విజయం సాధించలేరు అని కరాఖండీగా చెప్పారు.

చదువులు, స్కూల్ విషయంలో అలసత్వాన్ని తన తండ్రి ఏ మాత్రం సహించరనే విషయం అర్థం చేసుకునేందుకు శ్యామా ప్రసాద్‌కు ఎక్కువ

సమయం పట్టలేదు.

అదే సమయంలో తొమ్మిదేళ్ల బాలుడు శ్యామా ప్రసాద్ తన జీవితంలో మొట్టమొదటి ప్రతిజ్ఞ చేశాడు. జీవితంలో ఇక ఏనాడు క్రమశిక్షణ తప్పవద్దని. ప్రతిదీ సమయానికి చేయాలని, ఏ పనిలోనూ ఆలస్యం చేయకూడదని, పనిలో జాప్యం ఉండకూడదని, ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని శపథం చేసుకున్నాడు.

ఈ ప్రతిజ్ఞ తర్వాత శ్యామా ప్రసాద్ జీవితం మారిపోయింది. ఆ తర్వాత కాలంలో అతనిని తండ్రి ఏనాడు  మందలించే పరిస్థితి, తిట్టే పరిస్థితి రాలేదు.

శ్యామా ప్రసాద్ 6 వ తరగతికి వచ్చిన తరువాత. కొత్త క్లాస్ మేట్లు, కొత్త స్నేహితులు పరిచయమయ్యారు. మార్పు సహజం. చదువుల విషయంలో పెద్దగా తేడా కనిపించలేదు. కానీ కొత్త హాబీలు పుట్టుకొచ్చాయి, కొత్త అలవాట్లు వచ్చాయి. పుస్తకాలంటే శ్యామా ప్రసాద్‌కు హఠాత్తుగా ప్రేమ పుట్టింది. అవి పాఠ్యపుస్తకాలు కావు. కథల పుస్తకాలు, బాలమిత్ర, చందమామ వంటి పిల్లల పుస్తకాలపై శ్యామా ప్రసాద్‌కు ఆసక్తి పెరిగింది.

శ్యామా ప్రసాద్ ఏడో తరగతి చదివే సమయంలో విశాఖలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేస్తూ సాగుతున్న ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఒక్కసారిగా ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. ఆంధ్రాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న డిమాండును కేంద్ర ప్రభుత్వం విస్మరించడాన్ని తెలుగువారు జీర్ణించుకోలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఆంధ్రాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని తెలుగు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో అభివృద్ధి, నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. నిర్మాణ కార్యకలాపాలు జోరుగా సాగుతుండటంతో ఉక్కుకు డిమాండ్ చాలా పెరిగింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు విశాఖ నగరం అనువైన ప్రదేశం. స్వాతంత్ర్యం తరువాత, కేంద్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్‌లోని భిలాయ్, ఒడిశాలోని రూర్కెలా, పశ్చిమ బెంగాల్లోని దుర్గాపూర్, బీహార్‌లోని బొకారోలో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటు చేసింది. ఈ ఉక్కు ఫ్యాక్టరీల కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి లభించింది. రాష్ట్రాల అభివృద్ధి వేగం

పుంజుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారాన్ని ప్రారంభించాలనే ప్రతిపాదనను కేంద్రం పక్కనపెట్టింది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నెలకొల్పిన ఉక్కు కర్మాగారాలకు ముడిసరుకు ఆంధ్రా నుంచే వెళ్లడం వల్ల ఆంధ్రా బాగా నష్టపోతోంది. పెద్ద మొత్తంలో ముడిసరుకు అందిస్తున్న ఆంధ్రాలో స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ తెలుగు ప్రజలు ఉద్యమం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై ఆగ్రహించిన కొందరు రాజకీయ నాయకులు కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేశారు. 1966 అక్టోబర్ 16న మాజీ ఎమ్మెల్యే టి.అమృతరావు విశాఖలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించడంతో ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఈ నిరాహారదీక్షతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు చెలరేగాయి. కేంద్రాన్ని ఒప్పించాలని అధికార కాంగ్రెస్ నేతలపై ఒత్తిడి పెరిగింది. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదం ఆ రోజుల్లో మార్మోగింది. అమృతరావు నిరాహార దీక్ష ప్రారంభించిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగులు సమ్మె చేశారు. విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు మద్దతుగా రోడ్ల దిగ్బంధం కూడా చేపట్టారు. రాస్తారోకో అన్నది ఉద్యమంలో భాగమైంది. రాష్ట్ర ప్రభుత్వ పోలీసుల సహాయంతో ఉద్యమాన్ని అణచి వేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ చర్యల కారణంగా ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ఉద్యమం హింసాత్మక రూపాన్ని సంతరించుకుంది. ప్రభుత్వాల అణచివేత వైఖరికి నిరసనగా ఆందోళనకారులు రైల్వేలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆస్తులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉద్యమ జ్వాలలు రాష్ట్రమంతటికీ వ్యాపించాయి. ఎక్కడ చూసినా ఎవరి నోట విన్నా ఉద్యమ చర్చే. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు మూతబడ్డాయి.

బంద్ కారణంగా శ్యామా ప్రసాద్ ఇంట్లోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చింది. చదువు ఆగిపోయింది. ఈ ప్రజా ఉద్యమం కారణంగా శ్యామా ప్రసాద్‌కు కొత్త అలవాటు అబ్బింది. కథల పుస్తకాలపై ఆసక్తి పెరిగింది. రోజంతా ఇంట్లోనే ఉండాల్సి వచ్చింది. కాబట్టి సమయం గడపడానికి ఏదో

ఒకటి చేయాలి. ఆ రోజుల్లో సుందరయ్య తన పిల్లల కోసం బాలమిత్ర, చందమామ అనే రెండు పిల్లల పుస్తకాలు ఇంటికి తెప్పించేవారు. బాలమిత్ర అతి పురాతనమైన పిల్లల పత్రిక. ఈ పత్రిక ప్రచురణ 1940 సంవత్సరంలో ప్రారంభమైంది. మద్రాసు నుంచి ప్రచురితమైన ఈ పత్రిక వ్యవస్థాపక ఎడిటర్ బి. వి.రాధాకృష్ణ, బి.ఆర్. వరదరాజు ఆ పిల్లల పుస్తకానికి అసిస్టెంట్ ఎడిటర్. ఈ పిల్లల పుస్తకంలో నీతి కథలే కాదు చారిత్రక, పౌరాణిక కథలు కూడా ప్రచురించేవారు. బొమ్మలతో కూడిన మ్యాగజైన్ కావడంతో పిల్లలు దీన్ని అమితంగా ఇష్టపడేవారు. ఈ పత్రికలో నవలలు, లఘు కథలు కూడా ఉండేవి. ఇందులో ప్రచురితమయ్యే థ్రిల్లర్ కథలు పత్రికకు ప్రాణంగా నిలిచేవి. ఆ రోజుల్లో చందమామ పేరుతో మరో పిల్లల పత్రిక కూడా ఉండేది. అది కూడా చాలా జనాదరణ పొందిన పిల్లల కథల పత్రిక. ఈ మాస పత్రికలోనూ రకరకాల ఆసక్తికరమైన కథలు ఉండేవి. పౌరాణిక, చారిత్రక సంఘటనల ఆధారంగా రూపొందించిన కథలతో పాటు ఈ పుస్తకంలో అనేక జానపద కథలు కూడా ఉండేవి. ఈ మాస పత్రికలో వచ్చే సంచికల కోసం పిల్లలు ప్రతీ నెలా ఎదురుచూసేవారు. అనేక భాషల్లో ప్రచురితమయ్యే చందమామ మాసపత్రిక తెలుగు భాషతో ప్రారంభమైంది. ప్రఖ్యాత సినిమా నిర్మాతలు బి.వి.నాగిరెడ్డి, ఆలూరి చక్రపాణి ఈ పత్రికను ప్రారంభించారు. పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వారిలో పుస్తక పఠన అలవాటును పెంపొందించే లక్ష్యంతో 1947లో ఒక పత్రిక ప్రారంభించాలని నాగిరెడ్డి, ఆలూరి చక్రపాణి నిర్ణయించారు. తెలుగు తమిళ భాషలలో సినిమాలు తీసిన నాగి రెడ్డి, చక్రపాణి, 'కొకు'గా ప్రసిద్ధిగాంచిన కొడవటిగంటి కుటుంబరావుకు పత్రిక ఎడిటింగ్ బాధ్యతలు అప్పగించారు. పిల్లలు చేరువ కావాలనే ఉద్దేశంతో దీనికి చందమామ అని పేరు పెట్టారు. 'చందమామ' తొలి సంచిక 1947 జూలైలో తెలుగు, తమిళ భాషల్లో వెలువడింది. అనతి కాలంలోనే ఈ పత్రిక ప్రజాదరణ పొందింది. పత్రికకు లభించిన అపారమైన ప్రజాదరణతో ప్రభావితమైన నాగిరెడ్డి, చక్రపాణి చందమామను హిందీ, మరాఠీ వంటి ఇతర భాషలలోనూ ప్రచురించడం ప్రారంభించారు. బాలమిత్ర, చందమామ పత్రికల్లో కథలు మాత్రమే కాదు పిల్లలకు అనేక ప్రశ్నలు కూడా ఉండేవి. సరైన సమాధానాలు

రాసిన పిల్లలకు బహుమతులు ఉండేవి. ఈ కథల పుస్తకాల్లో ఉండే పజిల్స్, జోకులు పిల్లలను బాగా ఆకట్టుకునేవి. గణితం, సైన్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఆర్ట్–కల్చర్, జంతువుల గురించి కూడా ఆసక్తికరమైన సమాచారం ఈ పత్రికలు అందించేవి.

పిల్లలకు ఒకే విధమైన అభిరుచులు ఉండవు అనేది నిజం. అందరూ ఒకేదాన్ని ఇష్టపడరు. ఎవరికి వారికి సొంత ప్రాధాన్యత ఉంటుంది. బాలమిత్ర, చందమామ పత్రికల్లో విశిష్టత ఏంటంటే అందులో ప్రతీ ఒక్కరికీ నచ్చేలా ఏదో ఓ ఫీచర్ ఉంటుంది. అందుకే పిల్లలు ఈ రెండు పత్రికలను బాగా ఇష్టపడేవారు. బాలమిత్ర, చందమామ పత్రికలు శ్యామా ప్రసాద్‌ను కూడా బాగా ఆకట్టుకున్నాయి. ఉద్యమంతో ఆంధ్రప్రదేశ్ అట్టుడుకుతున్న సమయంలో శ్యామా ప్రసాద్ బాలమిత్ర, చందమామ కథల పుస్తకాలతో తీరిక లేకుండా గడిపేవాడు. ఉద్యమాన్ని అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపించింది. లాఠీ దెబ్బలకు వెరవకుండా ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగించడంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. పోలీసుల వైఖరి కారణంగా ఉద్యమం మరింత హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు వివిధ చోట్ల ప్రభుత్వ ఆస్తులకు నిప్పుపెట్టారు. అమృతరావు చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎలాంటి ప్రభావం చూపడం లేదని ఆందోళనకారులు ఆందోళన చెందారు. అమృతరావు ధైర్యంగా మరింత ముందుడుగు వేశారు. ఆ సమయంలో కేంద్రంలో ఇందిరాగాంధీ నేతృత్వంలో ప్రభుత్వం ఉంది. ఆమె దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన ప్రభావవంతమైన నాయకురాలు. ప్రధానిగా ఆమె ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఆమె నిర్ణయానికి వ్యతిరేకంగా గళం విప్పడానికి ఎవ్వరూ సాహసించేవారు కాదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభుత్వం పటిష్ఠంగా ఉంది. బలమైన నాయకుడు కాసు బ్రహ్మానంద రెడ్డి ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇందిరాగాంధీ, కాసు బ్రహ్మానంద రెడ్డి వంటి ప్రముఖ నాయకులకు వ్యతిరేకంగా ఆందోళన చేయడానికి మాజీ ఎమ్మెల్యే అమృతరావు సాహసించారు. వేలాది మంది అమృతరావుకు బాసటగా

నిలిచారు. అమృతరావు తన నిరాహార దీక్ష ద్వారా ఉక్కు కర్మాగార ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించారు. అమృతరావు నిరాహార దీక్ష చేపట్టిన వెంటనే విశాఖ ఉక్కు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, లోక్‌సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం ఆ కమిటీకి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. జాయింట్ యాక్షన్ కమిటీ వివిధ రకాల నిరసనలు ప్రారంభించింది. లాఠీఛార్జి జరిగినా ఆందోళనకారులు చలించకపోవడంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు కొన్ని చోట్ల కాల్పులు కూడా జరిపారు. పోలీసు కాల్పుల్లో మొత్తం 32 మంది మరణించారు. విశాఖపట్నంలో అత్యధికంగా పన్నెండు మంది పోలీసు బుల్లెట్లకు బలయ్యారు. విజయవాడ, గుంటూరులో ఐదుగురు, విజయనగరంలో ఇద్దరు చొప్పున మరణించారు. పోలీసుల చర్యల్లో పలువురు గాయపడ్డారు.

రోజురోజుకూ తీవ్రమవుతున్న ఆందోళన కాణంగా అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులకు నిద్రలేకుండా పోయింది. పోలీసులు ఉద్యమాన్ని తీవ్రంగా అణిచివేస్తున్నా దాని తీవ్రత రోజురోజూకూ పెరుగుతూనే ఉంది. నిరాహార దీక్ష కారణంగా అమృతరావు ఆరోగ్యం దిగుజారుతుండటం ఉద్యమానికి ఆజ్యంలా మారింది. అమృతరావు నిరాహార దీక్ష ఇరవయ్యవ రోజుకు చేరింది. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో పొట్టి శ్రీరాములు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆయనకు గుర్తుకువచ్చింది. పొట్టి శ్రీరాములు మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు అప్పటి ప్రభుత్వాన్ని కదిలించాయి. అలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతుందనే భయం కాసు బ్రహ్మానందరెడ్డిలో కలిగింది. అదే జరిగితే తమ ప్రభుత్వం ఆ మంటల్లో కాలిపోతుందని ఆందోళన చెందారు. వాస్తవ పరిస్థితిని ప్రధాని ఇందిరాగాంధీకి వివరించేందుకు ఆయన హడావుడిగా ఢిల్లీ ప్రయాణమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆందోళనల గురించి ప్రధానికి అవగతం చేశారు. రాష్ట్రంలోని ప్రతి చోట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయని, విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని హెచ్చరించారు. స్కూళ్లు,

కాలేజీలు, దుకాణాలు మూతపడ్డాయని, రహదారులు దిగ్బంధంతో పాటు రైళ్ల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని వివరించారు. ప్రతిచోటా ప్రభుత్వ ఆస్తి లక్ష్యంగా మారుతుందని, కేంద్రంపై ప్రజాగ్రహం తీవ్రస్థాయిలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని, వారి హక్కులను హరిస్తోందనే భావన ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఉందని ప్రధాని ఇందిరా గాంధీకి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నివేదించారు.

పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకునేందుకు ప్రధాని ఇందిరాగాంధీకి ఎక్కువ సమయం పట్టలేదు. 1966 అక్టోబర్ 31 న జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో విశాఖలో ఉక్కు కర్మాగారం డిమాండును కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని, ఆంధ్రా ప్రజల ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయం తీసుకుంటుందని ప్రధాని ప్రకటించారు. ఈ ప్రకటన తరువాత ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి విశాఖపట్నం చేరుకున్నారు. నిరాహార దీక్షను విరమించుకోవాలని అమృతరావును అభ్యర్థించారు. ప్రధాని స్వయంగా ప్రకటన చేయడంతో అమృతరావు తన నిరాహార దీక్ష విరమించారు. దీక్ష ముగిసిన వెంటనే ఉద్యమం కూడా ఆగిపోయింది. దేశంలో ప్రభుత్వ యాజమాన్యంలో ఐదో స్టీల్ ప్లాంట్ విశాఖపట్నంలో ఏర్పాటు అవుతుందని కొన్ని రోజుల తర్వాత కేంద్రం ప్రకటించింది. ఈ ప్రకటనతో ఒక ప్రజా ఉద్యమం విజయవంతంగా ముగిసింది. మరోసారి కేంద్రం ప్రజల ముందు తలవంచాల్సి వచ్చింది. ఆంధ్రులు తమ సత్తా చాటారు.

ఉద్యమం ముగిసిన తరువాత జనజీవనం మళ్లీ సాధారణమైంది. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. దుకాణాలు తెరుచుకున్నాయి. కార్యాలయాల్లో పనులు ప్రారంభమయ్యాయి. అంతటా మళ్లీ శాంతి నెలకొంది.

శ్యామా ప్రసాద్ మళ్లీ స్కూల్‌కు వెళ్లడం ప్రారంభించాడు. విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మొదలైన ఉద్యమం కారణంగా శ్యామా ప్రసాద్‌కు ఒక అలవాటు మొదలైంది. అది పత్రికలు చదివే అలవాటు. పిల్లల పత్రికలు చదవడం వలన శ్యామా ప్రసాద్ జ్ఞానం క్రమంగా విస్తరించ

సాగింది. జ్ఞాపకశక్తి పెరిగింది. సామాజిక-రాజకీయ అవగాహన కూడా పెరగడం మొదలైంది. బడి తెరిచిన తర్వాత కూడా బాలమిత్ర, చందమామలపై శ్యామా ప్రసాద్ ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదు. అది పెరగసాగింది. కొత్త సంచిక వచ్చిందంటే దాన్ని చదవకుండా నిద్రపోయేవాడు కాదు. ప్రతీ సంచికలో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు రాసి వాటిని ఎడిటర్‌కు పంపుతూ బహుమతి సాధించాలని శ్యామా ప్రసాద్ ప్రయత్నించసాగాడు. అలా అతను అనేకసార్లు బహుమతులు కూడా అందుకున్నాడు.

శ్యామా ప్రసాద్‌కు సెయింట్ ఆంథోనీస్ స్కూల్లో చాలా మంది కొత్త స్నేహితులు ఎందరో పరిచయమైనా రాయప్పరాజుతో స్నేహం చాలా బలంగా ఉండేది. రాయప్పరాజుకు కూడా చదవడం అంటే ఇష్టం. ఇద్దరూ కలిసి పుస్తకాలు కొనుక్కొని చదివేవారు. వయసు చిన్నదే అయినా ఇద్దరిలోనూ నవలలు చదవాలనే ఆసక్తి పెరిగింది. పన్నెండేళ్ల వయసులోనే శ్యామా ప్రసాద్ సాహిత్య రచనలు చదవడం ప్రారంభించారు.

తల్లి ప్రతివారం శ్యామా ప్రసాద్‌కు మూడు రూపాయలు ఇచ్చేది. ఈ డబ్బుతో శ్యామ్ ప్రసాద్ సినిమాలు చూసేవాడు లేదా పుస్తకాలు కొనుక్కునే వాడు. రాయప్ప రాజు కూడా తన తల్లిదండ్రులకు ఇచ్చే పాకెట్ మనీతో పుస్తకాలు కొనేవారు. శ్యామా ప్రసాద్ ఒక పుస్తకం కొని దాన్ని చదివి రాయప్ప రాజుకు ఇచ్చేవాడు. రాయప్పరాజు కూడా అలాగే చేసేవాడు. ఈ పుస్తకాల మార్పిడి కొనసాగింది. ఆ రోజుల్లో చాలా తక్కువ మంది పిల్లలు పుస్తకాలు, సాహిత్యం అంటే ఆసక్తి చూపేవారు. ఇద్దరూ పుస్తకాల పురుగులు అయ్యారు. ఇద్దరికీ పుస్తకాలపై అమిత వ్యామోహం ఏర్పడింది. కొత్త పుస్తకం మార్కెట్లోకి వచ్చిన వెంటనే దానిని శ్యామా ప్రసాద్ లేదా రాయప్ప రాజు కొనేవారు. ఆ విధంగా సాహిత్య పుస్తకాలు చదివే ప్రక్రియ కొనసాగింది.

శ్యామా ప్రసాద్‌కు డిటెక్టివ్ నవలలు అంటే చాలా ఇష్టం. డిటెక్టివ్ నవలలు, క్రైమ్ కథలపై అమితమైన ఆసక్తి ఉండేది. క్రైమ్ సంఘటనల ఆధారంగా ఉండే నవలలను శోధించి చదవడం ప్రారంభించాడు. కొమ్మూరి సాంబశివరావు నవలలు శ్యామా ప్రసాద్‌కు బాగా నచ్చేవి.

సాంబశివరావు తెలుగులో అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్-ఫిక్షన్ రచయిత. సాంబశివరావు చిన్నవయసులోనే రచనా వ్యాసాంగం ప్రారంభించారు. గుంటూరు జిల్లా తెనాలిలో 1926 అక్టోబర్ 26న జన్మించిన సాంబశివరావు తండ్రి వెంకట్రామయ్య తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్ నడిపేవారు. ఆయన తల్లి పద్మావతి నటి. నాటకాలలో విభిన్న పాత్రలు పోషించేవారు. ఆమె తెలుగులో అత్యంత ప్రసిద్ధ నాటక కళాకారుడు బళ్లారి రాఘవతో కలిసి స్టేజ్ నాటకాల్లో పాల్గొనేవారు. తన సాహితీ రచనల ద్వారా సాంబశివరావు సోదరుడు చలం కూడా బాగా ప్రసిద్ధి చెందారు.

తెలుగులో తొలి హారర్ నవల "చావు తప్పితే చాలు" సాంబశివరావు రాశారు. అంతకు ముందు ఆయన రాసిన డిటెక్టివ్ నవల 'నెంబర్ 888' తెలుగు సాహితీ ప్రపంచాన్ని ఓ ఊపు ఊపింది. సాంబశివరావు తన కథలతో డిటెక్టివ్-క్రైమ్ కథలలో కొత్త ఒరవడి సృష్టించారు. ఆయన డిటెక్టివ్ నవలల్లో డిటెక్టివ్ పేరు యుగంధర్, ఆయన అసిస్టెంట్ రాజు, ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు పాత్రలు ప్రజలకు బాగా నచ్చాయి. ఆయన నవలలన్నీ 'బెస్ట్ సెల్లర్స్' అయ్యాయి. ఆయన కొత్త నవల మార్కెట్లోకి వచ్చిన వెంటనే అమ్ముడుబోయేది. సాంబశివరావు నవలలతో పాటు మరో రచయిత విశ్వప్రసాద్ రాసే డిటెక్టివ్ నవలలు కూడా శ్యామా ప్రసాద్ ను బాగా ఆకట్టుకున్నాయి.

క్రైమ్, డిటెక్టివ్ నవలతో పాటు సాంఘిక నవలలను కూడా శ్యామా ప్రసాద్ ఇష్టపడేవాడు. కోడూరి కౌసల్యా దేవి, యద్దనపూడి సులోచనా రాణి, రంగనాయకమ్మ నవలలన్నీ శ్యామా ప్రసాద్ చదివాడు. కోడూరి కౌసల్యా దేవి రచనల్లో ఇతివృత్తమంతా కుటుంబ సంబంధాలపై ఉండేది. ఆమె రాసిన కొన్ని నవలల ఆధారంగా తెలుగులో అనేక సినిమాలు కూడా రూపొందాయి. నవలలు లాగా సినిమాలు కూడా హిట్ అయ్యాయి. డాక్టర్ చక్రవర్తి, ప్రేమనగర్, చక్రవాకం, శంఖుతీర్థం వంటి హిట్ చిత్రాలన్నీ కౌసల్యా దేవి రచించిన నవలల ఆధారంగా రూపొందించబడినవే. సులోచనా రాణి నవలలు కూడా అత్యంత ప్రాచుర్యం పొందాయి. స్త్రీల సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు చేసిన రంగనాయకమ్మ కథలు కూడా శ్యామా ప్రసాద్ చదివేవారు.

సాహితీ రచనలు చదవడం ద్వారా శ్యామా ప్రసాద్ ఎంతో ప్రయోజనం పొందాడు. తెలుగు భాషపై పట్టు మరింత బలపడింది. జ్ఞానమూ వికసించింది. సమాజంలో ఉండే సమస్యలపై అవగాహన పెరిగింది. సంబంధాలు ఎలా ఏర్పడతాయి, ఎలా చెడిపోతాయనే విషయం చక్కగా ఆకళింపు చేసుకోగలిగారు. సాహిత్యం చదవడం వల్ల శ్యామా ప్రసాద్ జీవితంలో కుటుంబ సంబంధాల ప్రాముఖ్యతను చిన్న వయస్సులోనే బాగా అర్థం చేసుకోవడం ప్రారంభించారు.

పుస్తకాలు చదివే అలవాటు శ్యామా ప్రసాద్‌కు తోటివారి నుంచి వేరు చేసింది. ఆ రోజుల్లో చాలా మంది టీనేజర్లు సినిమాలు చూసేందుకు, ఆటలు ఆడేందుకు బాగా ఇష్టపడేవారు. పెద్దలు మాత్రమే పుస్తకాలు చదివేవారు. హైస్కూలు పిల్లలు బాలమిత్ర, చందమామ వంటి పిల్లల పుస్తకాలు చదివేవారు. కాని, శ్యామా ప్రసాద్, రాయప్ప రాజు మాత్రమే వారి హైస్కూల్ రోజుల నుంచే క్రైమ్, ఇన్వెస్టిగేషన్, థ్రిల్లర్ రచనలు చదవడం ప్రారంభించిన విద్యార్థులు. ఆ వయస్సు పిల్లలు సామాజిక అంశాలపై రాసిన కథలు చదువుతారని ఎవరూ ఊహించరు. కానీ శ్యామా ప్రసాద్, రాయప్ప రాజు పన్నెండేళ్ల వయస్సు నుంచే సామాజిక సమస్యలు, స్త్రీ-పురుష సంబంధాల ఆధారంగా రాసిన పుస్తకాలు చదవడం ప్రారంభించారు. సాహిత్య రచనలు చదవడం, సినిమాలు చూస్తూ శ్యామా ప్రసాద్ సమయం గడిపేవారు. కథల పుస్తకాలపైనే కాదు పాఠ్యపుస్తకాలపై కూడా శ్యామా ప్రసాద్ తగిన శ్రద్ధ చూపేవాడు. ఏ పరీక్షలోనూ అతను ఫెయిల్ కాలేదు. తరగతిలో ఫస్ట్ ర్యాంక్ సాధించకపోయినా తెలివైన విద్యార్థిగా గుర్తింపు పొందాడు.

శ్యామా ప్రసాద్‌కు హిందీతో కొంత ఇబ్బంది ఉండేది. హిందీ ఓ పట్టాన అర్థమయ్యేది కాదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కూడా హిందీ చదవడం, రాయడంలో ఇబ్బంది ఎదుర్కొనే వాడు. 1967లో తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైనప్పుడు ఆ తరహా ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగాలని శ్యామా ప్రసాద్ కోరుకున్నారు. హిందీ భాషను బలవంతంగా విద్యార్థులపై రుద్ది నేర్చుకునేలా ఒత్తిడి చేయకూడదని కోరుకున్నాడు.

హిందీ నేర్చుకునేందుకు శ్యామా ప్రసాద్ అనేక తిప్పలు పడాల్సి వచ్చింది. హిందీపై పట్టు సాధించేందుకు హిందీ వాక్యాలు, పదాలను తెలుగులో రాయడం మొదలుపెట్టారు. పై తరగతికి వెళ్లాలంటే హిందీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి. అందుకే హిందీ చదవడం, రాయడం తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు పాఠశాల విద్యలో త్రిభాషా సూత్రం అమలులో ఉండేది. హైస్కూల్ పిల్లలు తమ మాతృభాష తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ నేర్చుకోవడం తప్పనిసరి. ఈ మూడు సబ్జెక్టులే కాకుండా విద్యార్థులు గణితం, సైన్స్, సోషల్ చదవాల్సి ఉంటుంది. మొత్తం ఆరు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అందులో మూడు లాంగ్వేజ్ సబ్జెక్టులు.

కొడుకు శ్యామా ప్రసాద్‌కు చదువుల్లో ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకు సుందరయ్య ప్రైవేట్ ట్యూషన్ ఏర్పాటు చేశారు. టీచర్లు ఇంటికి వచ్చి శ్యామా ప్రసాద్‌కు,  అతని తోబుట్టువులకు ట్యూషన్ చెప్పేవారు.

సుందరయ్య అభ్యర్థన మేరకు శ్యామా ప్రసాద్, అతని తోబుట్టువులకు ట్యూషన్ చెప్పేందుకు ప్రముఖ తెలుగు కథా రచయిత, కవి కాళీపట్నం రామారావు వారి ఇంటికి వచ్చేవారు. 'కారా మాస్టారు'గా పేరుగాంచిన కాళీపట్నం రామారావు జీవనోపాధి కోసం సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్లో టీచర్‌గా పనిచేసేవారు. ఆయన ఒక సాహితీవేత్త, తన విద్యార్థులకు భాషా సుగంధాన్ని అందించకుండా ఆయన ఉండలేకపోయేవారు.

కారా మాష్టార్ కారణంగా శ్యామా ప్రసాద్‌కు తెలుగు భాష పై పట్టు మరింత పెరిగింది. కథలు రాయమని కారా మాస్టర్ తరచు శ్యామా ప్రసాద్‌ను అడిగేవారు. ఏ మాస్టారు కూడా ఓ హైస్కూల్ పిల్లాడిని కథ రాయమని అడగరు కానీ, కారా మాస్టర్ శైలి భిన్నంగా ఉండేది. ఆయన పిల్లలను చిన్న కథలు రాయమని ప్రోత్సహించడం ద్వారా వారికి ఎన్నో విషయాలు నేర్పించేవారు. రాసేటప్పుడు కూడా పిల్లలు అనేక విషయాలు నేర్చుకుంటారన్నది ఆయన నమ్మకం. పిల్లలకు కథ రాసేందుకు తగిన విషయం తట్టనప్పుడు కారా మాస్టర్ స్వయంగా వారికి ఓ విషయాన్ని సూచించేవారు. ఓ రోజు కారా మాస్టర్ ఇంట్లో తల్లిదండ్రుల మధ్యే జరిగే గొడవల గురించి రాయమని పిల్లలను అడిగారు.

పిల్లలందరూ బాగా రాశారు. వారు రాసిన కథలు చదివిన తర్వాత ప్రతి ఇంట్లో గొడవలు ఉన్నాయనే విషయం కారా మాస్టారుకు అర్థమైంది.

శ్యామా ప్రసాద్‌కు చదువులో ఎప్పుడూ ఎలాంటి అడ్డంకులు లేవు. అతను బాగా శ్రద్ధగా చదివే విద్యార్థి. తండ్రి సుందరయ్య స్వయంగా తన పిల్లలకు ఇంట్లో చదువు చెప్పాలనే అనుకునేవారు. కాని పగలు, రాత్రి రోగుల చికిత్సలో నిమగ్నమై ఉండటవం వలన ఆయనకు సమయం దొరకేది కాదు.

ఆ రోజుల్లో సుందరయ్య అత్యంత బిజీ డాక్టర్. ఎముకల వైద్యుడు కావడంతో నిరంతరం ఆయన దగ్గరకు రోగులు వచ్చేవారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలకు ఎంతో ఓపిగ్గా చికిత్స అందించేవారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచే కాక ఒరిస్సాలోని అనేక ప్రాంతాల నుంచి కూడా రోగులు చికిత్స కోసం ఆంధ్రా మెడికల్ కాలేజీకి వచ్చేవారు. కోస్తాంధ్రలో అతి పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి కావడంతో నిరంతరం రోగుల ప్రవాహం కొనసాగేది. సుందరయ్య ఆర్థోపెడిక్ సర్జన్ కావడంతో ప్రమాద బాధితులు చాలా మంది ఆయన దగ్గరకు వచ్చేవారు. ప్రమాదాల్లో ఎముకలు విరిగి నొప్పితో బాధపడుతూ అనేక మంది సుందరయ్య దగ్గరకు వైద్యం కోసం వచ్చేవారు. విరిగిన ఎముకలు అతికించడంలో సుందరయ్య మంచి పట్టు సాధించారు. ఫ్రాక్చర్లు మాత్రమే కాదు కీళ్లనొప్పులు, కండరాల నొప్పి, వెన్నెముక క్షయ, ఎముక కణితులు, సయాటికా, వెన్నెముక నొప్పి వంటి సమస్యలతో పెద్ద సంఖ్యలో ఆయన దగ్గరకు రోగులు నిత్యం వచ్చేవారు. ఆ రోజుల్లో రోగులకు ప్రభుత్వ సర్జన్ ఇంట్లో కూడా చికిత్స అందించడానికి అనుమతి ఉండేది. సుందరయ్య తన ఇంట్లో క్లినిక్ తెరిచారు. అక్కడ కూడా చిన్నపాటి సర్జరీలు చేసేవారు. సుందరయ్య హస్తవాసిపై ప్రజలకు నమ్మకం పెరగడంతో ఇతర సర్జన్లను సంప్రదించేందుకు చాలా మంది ఇష్టపడకపోయేవారు. సుందరయ్య హాస్పిటల్లో డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి ఇంట్లో కూడా చాలా మంది ఆయన కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆయన ప్రజలకు చికిత్స కొనసాగించేవారు.

శ్యామా ప్రసాద్, అతని తోబుట్టువులు తమ తండ్రి రోగులకు చికిత్స

అందిస్తూ ఎప్పుడూ బిజీగా ఉండటాన్ని గమనించేవారు. ఆయన పనితీరు పిల్లల మనస్సులపై తీవ్ర ప్రభావం చూపింది. చికిత్స పొంది కోలుకున్న తర్వాత రోగులు తమ డాక్టర్ సుందరయ్యను ప్రశంసించే తీరు చూసిన పిల్లలు గర్వపడేవారు.

ఒకనాడు జరిగిన ఒక సంఘటనతో శ్యామా ప్రసాద్ కూడా తండ్రిలాగే తాను డాక్టరై ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేయాలని మనసులో నిర్ణయించుకున్నాడు.

ఒక రోజు ఒక  రోగి బాధతో మూలుగుతూ సుందరయ్య ఇంటికి వచ్చారు. విచారణలో ఆ రోగి తాను ప్రమాదానికి గురయ్యానని ఎడమ భుజానికి గాయమైందని చెప్పారు. భుజం నొప్పితో అల్లాడుతున్నాడు. రోగిని సుందరయ్య పరీక్షించారు. పరీక్షలయ్యాక సుందరయ్య బాధపడకు, నీ నొప్పి తొందరగా పోతుంది అని చెప్పి పేషెంట్‌ను నేలపై పడుకోబెట్టారు. అతని ఎడమ చేతిని తన కుడి చేతితో గట్టిగా పట్టుకున్నారు. ఆ తరువాత ఆ రోగి భుజం మీద ఒక కాలు వేసి, దానిని నేలపై ఉంచారు. ఆ తర్వాత వెంటనే ఒక కుదుపుతో తన చేతిని బయటకు తీశారు. రోగి గట్టిగా అరిచారు. ఆ అరుపులకు చుట్టుపక్కలవారు భయపడ్డారు. కానీ ఈ అరుపు కొన్ని క్షణాలు మాత్రమే. ఆ తర్వాత ఆ రోగి శాంతించారు. నొప్పి మాయమైంది. తన జీవితాన్ని నరకప్రాయం చేస్తున్న నొప్పి డాక్టర్ ఒక్క దెబ్బతో మాయమైందని అతను నమ్మలేకపోయారు. ఈ షాక్ ట్రీట్మెంట్‌తో భుజం నొప్పి నయమైంది. ఆ రోగి డాక్టర్ కాళ్లపై పడి కృతజ్ఞతలు చెప్పారు. సుందరయ్య  ఆ రోగిని లేపి ఇక ఇంటికి వెళ్లవచ్చని చెప్పారు. డాక్టర్ మీ చేతుల్లో మంత్రం ఉంది. నీ మాయ నన్ను రక్షించింది. నేను నొప్పితో చనిపోతానని అనుకున్నాను" అన్నారు.

ఈ సంఘటన శ్యామా ప్రసాద్ కళ్ల ముందే జరిగింది. డాక్టర్ చేతిలో మ్యాజిక్ ఉందని అతనూ భావించాడు. ఆ మాయాజాలంతోనే వారు రోగులకు చికిత్స చేస్తారని అనుకున్నాడు. ఆ క్షణాన శ్యామా ప్రసాద్ తన తండ్రిలాగే తాను కూడా డాక్టర్‌ని అయ్యి ప్రజల బాధలు దూరం చేయాలని సంకల్పించాడు.

తన తండ్రి రోగికి శాస్త్రీయ విధానంలో చికిత్స చేశారని శ్యామా ప్రసాద్‌కు తెలియదు. రోగిని పరీక్షిస్తున్నప్పుడు అతని భుజం ఎముక దాని స్థానం నుంచి

జారిపోయి స్థానభ్రంశం చెందిందని గుర్తించేందుకు సుందరయ్యకు ఎక్కువ సమయం పట్టలేదు. భుజం ఎముక సరైన స్థితికి వచ్చే వరకు రోగికి నొప్పి ఉంటుంది. సుందరయ్య భుజాన్ని నేర్పుగా యథాస్థానానికి తీసుకొచ్చారు. అనుభవజ్ఞులైన వైద్యులు మాత్రమే ఈ పనిని చేయగలరు. లేకపోతే భుజపు ఎముకును తిరిగి యథాస్థానంలో నిలబెట్టేందుకు శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. సుందరయ్య రోజూ ఎంతోమంది రోగులకు వైద్యం చేసేవారు. ఎన్నో సర్జరీలు చేసేవారు. ఎముకలకు సంబంధించిన సమస్యలు గుర్తించడంలో ఆయన ఎంతో ప్రావీణ్యం సంపాదించారు.

వైద్య వృత్తిలో డాక్టర్ సుందరయ్య క్షణం తీరిక లేకుండా ఉండేవారు. కుటుంబానికి సమయం వెచ్చించడం ఆయనకు చాలా కష్టంగా ఉండేది. పిల్లల పెంపక బాధ్యత అంతా కాంతమ్మే చూసుకునేది. నలుగురు పిల్లలను ఆమె పోషించి పెంచింది. మంచి చదువులు అందించడంతో పాటు గౌరవ మర్యాదలు నేర్పించారు. తల్లి బాధ్యతను చక్కగా నిర్వర్తించారు. పిల్లలు తమ బాల్యాన్ని సరదాగా గడిపేలా చూడటంతో పాటు తండ్రి తమకు ఎక్కువ సమయం కేటాయించడం లేదనే లోటును వారు గుర్తించకుండా ఆమె చూసుకున్నారు. ప్రతీ పురుషుడి విజయం వెనుక ఒక మహిళ ఉంటారనే నానుడిని నిజం చేస్తూ విజయవంతమైన డాక్టరుగా సుందరయ్య పేరు తెచ్చుకోవడం వెనుక కాంతమ్మ పోషించిన పాత్ర  కీలకమైనది.

1967 ఆగస్టులో సుందరయ్య కాకినాడకు బదిలీ అయ్యారు. రంగరాయ మెడికల్ కళాశాలలో ఆయన బోధనా బాధ్యతలు చేపట్టారు. దాంతో పాటు కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సర్జన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కొత్త ఊళ్లో స్థిరపడ్డాక సుందరయ్య తన భార్యాపిల్లలను కాకినాడకు పిలిపించారు. పెద్ద కొడుకు శ్యామా ప్రసాద్ 10వ తరగతి చదువుతున్నాడు కాబట్టి సుందరయ్య అతనికి మంచి స్కూల్ వెతకడం మొదలుపెట్టారు. మెక్ లారిన్ హైస్కూల్‌ను ఆయన ఎంచుకున్నారు. కెనడియన్ బాప్టిస్ట్ మిషన్ ఈ పాఠశాలను 1930లో నెలకొల్పింది. ఇది  కాకినాడలోని అతి పురాతన మిషనరీ పాఠశాల. ఈ పాఠశాల విద్యాపరంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. కుమారుడు శ్యామ్ ప్రసాద్‌ను డాక్టర్ సుందరయ్య మెక్ లారిన్ హైస్కూల్లో

చేర్పించారు. శ్యామా ప్రసాద్‌కు పదో తరగతి పరీక్షలంటే అంత సులభం కాదని తెలుసు. పదో పరీక్షలను చదువుకున్న స్కూల్లో కాకుండా మరో స్కూల్లో రాయాల్సి ఉంటుంది. ఏ స్కూల్లో పరీక్ష రాయాలో పాఠశాల విద్యా బోర్డు నిర్ణయిస్తుంది. పరీక్షాపత్రాన్ని కూడా స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు రూపొందిస్తుంది. 10వ తరగతిలో వచ్చే మార్కుల ఆధారంగా ఇంటర్ కాలేజీలో అడ్మిషన్ జరుగుతుంది. ఎంత మంచి మార్కులు వస్తే అంత మంచి కాలేజీలో ప్రవేశం లభిస్తుంది.

ఎంతో శ్రద్ధగా చదువుకొని శ్యామా ప్రసాద్ పదో తరగతి పరీక్షలు రాశాడు. కష్టమైన సబ్జెక్టులు గణితం, సైన్స్‌పై పట్టు పెంచుకున్నాడు. ప్రైవేట్ ట్యూషన్ అతనికి మేలు చేసింది. కానీ ఎప్పటిలాగే హిందీ ఇబ్బంది పెట్టింది. హిందీ పరీక్షలోనూ పాసయ్యేందుకు శ్యామా ప్రసాద్ చాలా కష్టపడ్డాడు. ఈ కష్టానికి తగిన ఫలితం లభించింది. హిందీ పరీక్షలోనూ గట్టెక్కారు. మిగిలిన సబ్జెక్టులతో పోలిస్తే హిందీలో తక్కువ మార్కులు వచ్చాయి. గణితం, సైన్స్, సోషల్, తెలుగు, ఇంగ్లీష్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాడు. హిందీలో తక్కువ మార్కులు వచ్చినప్పటికీ శ్యామా ప్రసాద్ పదో తరగతి పరీక్షల్లో ఫస్ట్ డివిజన్ సాధించారు. కొడుకు సాధించిన విజయంతో తండ్రి సుందరయ్య ఉప్పొంగిపోయారు.

1969 సంవత్సరంలో శ్యామా ప్రసాద్ పదోతరగతి పాసయ్యారు. అతని పాఠశాల విద్య అంతా అరవయ్యవ దశకంలో సాగింది. ఆ దశాబ్దంలో భారతదేశంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక విప్లవాలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో అనేక ఉద్యమాలు జరిగాయి. శ్యామా ప్రసాద్ బాల్యం ఈ ఉద్యమాల మధ్యే గడిచింది. అరవయ్యవ దశకం అంతా అల్లకల్లోలంగా ఉండేది. ఆ దశకంలో భారతదేశం రెండు యుద్ధాలు చేసింది. 1962లో చైనాతో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భారతదేశం తీవ్రనష్టాన్ని చవిచూసింది. చైనాకు చెందిన ఎనభై వేల మంది సైనికులను ఎదుర్కోవడానికి భారతదేశం కేవలం ఇరవై వేల మంది సైనికులతో రంగంలోకి దిగిందని చరిత్ర పుస్తకాలు చెబుతున్నాయి. చైనా దాడి జరుపుతుందని భారత్ ఊహించలేదు. కాని, చైనా ఒక్కసారిగా భారత్ పై దాడి చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. చైనా భారత్‌కు ద్రోహం చేసింది. స్నేహం

పేరుతో చైనా వెన్నుపోటు పొడిచిందని భారత ప్రజలు భావించారు. చర్చల ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భారత్ అనుకుంది. కాని చర్చల మధ్యలో చైనా ఒక్కసారిగా దాడికి తెగబడింది. 1962 యుద్ధంలో చైనా చేతిలో భారత్ ఓడిపోయింది. ఈ యుద్ధంలో దాదాపు 1300 మంది సైనికులు మరణించారు. వెయ్యి మంది సైనికులు గాయపడ్డారు. పదిహేను వందల మంది సైనికులు అదృశ్యమయ్యారు. దాదాపు నాలుగు వేల మంది సైనికులను చైనా యుద్ధ ఖైదీలుగా బంధించింది. అదే సమయంలో 700 మందికి చైనా సైనికులు మరణించారు. ఈ యుద్ధం తర్వాత ప్రధాని నెహ్రూపై చాలా విమర్శలు వచ్చాయి. చైనాతో స్నేహం గురించి ఆయనపై ప్రశ్నల వర్షం కురిసింది. నెహ్రూ విదేశాంగ విధానంపై కూడా విమర్శలు వచ్చాయి. భారతీయ సైనిక శక్తిని బలోపేతం చేయలేదని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. చైనా చేసిన ద్రోహం నెహ్రూని బాగా కదిలించేసింది.

భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1964 మే 24 న మరణించారు. దేశమంతా శోకసముద్రంలో మునిగిపోయింది. దేశానికి కొత్త ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి బాధ్యతలు చేపట్టారు. శాస్త్రిజీ దేశానికి “జై జవాన్, జై కిసాన్” నినాదాన్ని ఇచ్చారు. అతను శ్వేత విప్లవం, హరిత విప్లవాలు రెండింటినీ ప్రోత్సహించారు.

1965లో పాకిస్థాన్-భారత్‌కు యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ ఓడించింది. ఈ యుద్ధంలో విజయం సాధించడం ద్వారా పాకిస్థాన్‌లో కశ్మీర్ విలీన ప్రయత్నాన్ని భారత్ భగ్నం చేసింది. యుద్ధం ద్వారా, భారతదేశం తన సైనిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పింది.

కానీ 1966 జనవరి 11న సోవియట్ యూనియన్లోని తాష్కెంట్‌లో లాల్ బహదూర్ శాస్త్రి అనుమానాస్పద స్థితిలో మరణించారు. 1966 జనవరి 10న పాకిస్తాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న 12 గంటల తర్వాత, జనవరి 11న మధ్యాహ్నం 1:32 గంటలకు మరణించారు. మరణానికి అరగంట ముందు వరకు శాస్త్రిజీ పూర్తి ఆరోగ్యంగానే ఉన్నారని, అయితే 15 నుంచి 20 నిమిషాల్లో ఆయన ఆరోగ్యం క్షీణించిందని చెబుతున్నారు. వైద్యులు ఆయనకు ఇంట్రా-

మస్కులర్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంజెక్షన్ ఇచ్చిన కొన్ని నిమిషాలకే ఆయన కన్నుమూశారు. ప్రియమైన నేతను కోల్పోయిన భారతదేశం మరోసారి శోకసంద్రంలో మునిగిపోయింది.

నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ దేశానికి మూడో ప్రధానమంత్రి అయ్యారు. ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అనేక బలమైన, చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. 1969లో 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేశారు. దేశంలోని 70శాతం డిపాజిట్లు ఈ 14 బ్యాంకుల్లోనే ఉన్నాయి. జాతీయకరణ తర్వాత ఆ బ్యాంకుల యాజమాన్యం ప్రభుత్వ చేతికి వచ్చింది. ఆర్థిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేశారు.

అరవయ్యవ దశకంలో భారతదేశం రెండు యుద్ధాలు చేయాల్సి వచ్చింది. ఆ దశాబ్దంలో ఇద్దరు ప్రధానులు మరణించారు. శ్వేత విప్లవం, హరిత విప్లవానికి అప్పుడే శ్రీకారం చుట్టారు. ఇందిరా గాంధీ రూపంలో ఒక ప్రభావవంతురాలైన, శక్తిమంతురాలైన నాయకురాలు భారతదేశానికి లభించింది. గొప్ప రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాల మధ్య శ్యామా ప్రసాద్ తన పాఠశాల విద్యను అభ్యసిస్తూ బాల్యాన్ని గడిపారు.

1969లో 10వ ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల తర్వాత, సుందరయ్య తన పెద్ద కొడుకు ముందు ముందు ఏం చదవాలనుకుంటున్నాడో తెలుసుకోవాలనుకున్నారు.

ఒక రోజు శ్యామా ప్రసాద్‌ను సుందరయ్య అడిగారు, “బాబు, నువ్వు పదో తరగతి పాసయ్యావు, ఇక ఇంటర్మీడియట్‌లో చేరాలి. కాలేజీలో అన్ని సబ్జెక్టులు చదవాల్సిన అవసరం లేదు. నీకు నచ్చిన సబ్జెక్ట్ ఎంచుకోవాలి. నీకు ఏది ఇష్టమో దాన్ని బట్టి నిన్ను కాలేజీలో చేర్పించాలనుకుంటున్నాను అన్నారు.

తండ్రి అలా అడిగిన వెంటనే శ్యామా ప్రసాద్ ఠక్కున జవాబిచ్చేసాడు. నేను మీలాగా డాక్టర్ కావాలనుకుంటున్నాను. నేను మీ కంటే పెద్ద డాక్టరు కావాలనుకుంటున్నాను అన్నాడు. మీరు సాధించిన దానికంటే ఇంకా ఎక్కువ సాధించాలనుకుంటున్నాను” అన్నాడు.

ఆ జవాబు విని సుందరయ్య మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయింది. తన పెద్ద కుమారుడు తన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన చేస్తున్నాడనే భావన ఆయనను ఆశ్చర్యపరిచింది. తన మనసులో తలెత్తిన కొన్ని సందేహాలు నివృత్తి చేసుకోవడానికి సుందరయ్య కొడుకుతో చూడు శ్యామ్, డాక్టర్ అవ్వడం అంత ఈజీ కాదు. ఇంటర్‌లో చాలా కష్టపడాల్సి ఉంటుంది. టాప్ ర్యాంకు తెచ్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే మెడికల్ కాలేజీలో సీటు వస్తుంది" అన్నారు

దానిని నేను కష్టపడి చదువుతాను, డాక్టరవుతాను అని శ్యామా ప్రసాద్ దృఢ విశ్వాసం వ్యక్తం చేశాడు. కొడుకు ఆలోచనలను మరింత లోతుగా గ్రహించేందుకు నీవు ఎందుకు డాక్టర్ కావాలని అనుకుంటున్నావు? అని శ్యామా ప్రసాద్‌ను ప్రశ్నించారు.

మీరు రోగులకు చికిత్స చేయడాన్ని నేను చూశాను. మీరు ప్రజల బాధ తొలగిస్తారు. రోగుల వ్యాధులు నయం చేస్తారు. మీ చికిత్సతో వారి వ్యాధులన్నీ బాగు చేస్తారు. మీ చికిత్సతో ఆరోగ్యవంతులైన వాళ్లందరూ మిమ్మల్ని ప్రార్థించడం నేను చూశాను. అందరూ మిమ్మల్ని దేవుడిగా భావిస్తారు. నేను కూడా మీలాగా ఉండాలనుకుంటున్నాను. నేను మీ కంటే గొప్ప డాక్టర్ అవ్వాలనుకుంటున్నాను అని చెప్పాడు శ్యామా ప్రసాద్.

కుమారుడి సంకల్పం, నమ్మకమైన మాటలతో సుందరయ్య మనసులోని అనుమానాలన్నీ తొలగిపోయాయి. తన కుమారుడు తన వారసత్వాన్ని కొనసాగిస్తాడనే నమ్మకం సుందరయ్యలో ఏర్పడింది.

# అధ్యాయం - 4

# సహోదరులలో మేరునగధీరుడు శ్యామా ప్రసాద్

డాక్టరు అవడం అంత సులభం కాదు. డాక్టరు కావాలంటే చాలా కష్టపడాలి. అంతేకాదు, డాక్టరు అవడానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉండటం చాలా అవసరం. డాక్టరు కావాలంటే  తెలివితేటలు ఉండాలి. అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండాలి. శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా దృఢంగా ఉండటం కూడా చాలా ముఖ్యం.

స్వాతంత్ర్యానికి ముందు, బ్రిటిష్ వారు భారతదేశంలో అల్లోపతి వైద్య కళాశాలలు ప్రారంభించారు. అల్లోపతి వైద్య విధానం ద్వారా భారతీయులకు వైద్య చికిత్సను బ్రిటీష్ వారు పరిచయం చేశారు. అల్లోపతికి ముందు భారతదేశంలో ఆయుర్వేదం, యునాని వైద్య విధానాలను అనుసరించేవారు. ఆయుర్వేద చరిత్ర చాలా పురాతనమైనది, అది భారతదేశంలో శతాబ్దాలుగా ఆచరణలో ఉంది.

స్వాతంత్ర్యానికి ముందు భారతదేశంలోని అన్ని వైద్య కళాశాలలు బ్రిటీష్ ప్రభుత్వ నియంత్రణ కిందే ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం వైద్య కళాశాలల నియంత్రణ భారత ప్రభుత్వ చేతుల్లోకి వచ్చింది. రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్నాయి. కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు కూడా ప్రారంభమయ్యాయి. అయితే అన్ని మెడికల్ కాలేజీల సిలబస్ మాత్రం దేశమంతా ఒకే రీతిలో ఉంటుంది.

శ్యామా ప్రసాద్ పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన సంవత్సరం భారతదేశంలో ఉన్న మెడికల్ కాలేజీలు కేవలం 98 మాత్రమే. అంటే 1969లో భారతదేశంలో ఉన్నవి 100 కంటే తక్కువ వైద్య కళాశాలలే. ఈ మెడికల్ కాలేజీల్లో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ (ఎంబిబిఎస్) కోర్సులకు 50 నుంచి 100 సీట్లు ఉండేవి. 1969లో ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది వైద్య కళాశాలలు ఉండేవి. ఆంధ్రా ప్రాంతంలో మొదటి వైద్య కళాశాల ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో 1923లో ఏర్పాటు చేశారు. దీని తర్వాత 1946లో గుంటూరు మెడికల్ కాలేజీ, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉస్మానియా మెడికల్ కాలేజీ స్థాపించారు. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రప్రదేశ్లో మొదటి వైద్య కళాశాల సికింద్రాబాద్‌లో నెలకొల్పారు. గాంధీ వైద్య కళాశాల పేరుతో ప్రారంభమైన ఈ కళాశాలలో 1954 నుంచి వైద్య విద్య ప్రారంభమైంది. ఆ తర్వాత 1957లో కర్నూలు మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. 1958లో కాకినాడలో నెలకొల్పిన రంగరాయ వైద్య కళాశాల ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి ప్రైవేట్ వైద్య కళాశాల. 1959లో వరంగల్లో కాకతీయ వైద్య కళాశాల ప్రారంభమైంది. 1960లో తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల స్థాపించబడింది.

ఈ ఎనిమిది మెడికల్ కాలేజీల్లో సీట్ల కోసం విద్యార్థుల మధ్య గట్టి పోటీ ఉండేది. 1968 వరకు ఈ మెడికల్ కాలేజీల్లో ఇంటర్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ప్రవేశం కల్పించేవారు. డాక్టర్లు కావాలనుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించేందుకు ప్రయత్నించే వారు. ఎంబిబిఎస్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌లో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ చదవడం తప్పనిసరి. అంటే మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులు ఇంటర్లో బైపీసీ (బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) గ్రూపు చదవాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్లో ఈ నాలుగు సబ్జెక్టులతో పాటు ఇంగ్లీష్, ఎంపిక చేసుకున్న లాంగ్వేజీ కూడా పరీక్ష రాయాలి.

ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకే మెడికల్ కాలేజీలో ప్రవేశం లభిస్తుంది. మెడికల్ కాలేజీలో సీటు రావాలంటే టాప్ ర్యాంక్ హోల్డర్‌గా నిలవాల్సిందే.

డాక్టరు కావాలని చాలా మంది విద్యార్థులు కలలుగన్నా, ఆ అవకాశం మాత్రం చాలా తక్కువ మందికే లభించేది. ఆ రోజుల్లోనూ ఇంటర్మీడియట్ పరీక్ష

రాసే విద్యార్థుల సంఖ్య లక్షల్లో ఉండేది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని మెడికల్ కాలేజీల్లో మొత్తం సీట్లు వెయ్యి లోపు మాత్రమే. మెడికల్ కాలేజీలో సీటు రావాలంటే ఇంటర్మీడియట్ పరీక్షలో 750లోపు ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కొన్ని సీట్లు రిజర్వు అయి ఉంటాయి. ఈ కారణంగా మెడికల్ కాలేజీలో సీటు సాధించాలంటే ఇంటర్మీడియట్లో టాప్ 750 మందిలో ఒకరిగా ఉండటం తప్పనిసరి.

శ్యామా ప్రసాద్‌కు డాక్టరు కావాలనే పట్టుదల ఉంది. అంతే కాదు డాక్టరు అవడం అంత సులువు కాదనే విషయం కూడా అతనికి బాగా తెలుసు. డాక్టరు కావాలంటే చదువులలో పూర్తి సత్తా చాటాలి. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి క్లిష్టమైన సబ్జెక్టులపై పట్టు సాధించాలి. పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి. చిన్నపాటి అజాగ్రత్త, నిర్లక్ష్యం కూడా డాక్టరు కావాలనే కలను ఛిద్రం చేస్తుంది. డాక్టరు కావాలనుకున్న శ్యామా ప్రసాద్ కల నెరవేర్చేందుకు తన వంతు సహకారం అందించాలని సుందరయ్య నిశ్చయించుకున్నారు.

1969 ఫిబ్రవరిలో సుందరయ్య కాకినాడ నుంచి తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ అయ్యారు. శ్రీ వేంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వాసుపత్రిలో సర్జన్ బాధ్యతలు చేపట్టారు. వైద్య చికిత్స రూపంలో ప్రజాసేవ కొనసాగింది. భార్యాపిల్లలను సుందరయ్య తిరుపతికి తీసుకువచ్చారు.

ఆ రోజుల్లో తిరుపతిలో గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల పేరుతో కొత్త కళాశాల నెలకొల్పారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్వహించే తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ కళాశాల స్థాపించారు. ఆలయాల నిర్వహణతో పాటు సామాజిక, మత, సాహిత్య, విద్యా, వైద్య కార్యకలాపాలను ప్రోత్సహించే బాధ్యతను కూడా తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టింది.

శ్యామా ప్రసాద్‌ని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కాలేజీలో ఇంగ్లీష్ మీడియంలో చేర్పించారు డాక్టరు సుందరయ్య. వైద్య విద్యాభ్యాసమంతా ఇంగ్లీష్‌లోనే జరుగుతుందని సుందరయ్యకు అనుభవపూర్వకంగా తెలుసు. మాతృభాషపైన లేదా మరే ఇతర భాషపైన పట్టు సాధించడం వలన ఉపయోగం ఉండదనే విషయమూ ఆయనకు తెలుసు. మెడిసిన్ చదవాలంటే ఇంగ్లీష్ పై గట్టి పట్టు ఉండాలి. సుందరయ్య 12వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివారు.

మెడికల్ కాలేజీలో సీటు వచ్చాక ఇంగ్లీష్ నేర్చుకోవడం, అర్థం చేసుకోవడం చాలా కష్టమైంది. వైద్యవిద్యపై పట్టు సాధించాలంటే ముందు శ్యామా ప్రసాద్ ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలి. ఇంటర్మీడియట్ స్థాయిలో శ్యామా ప్రసాద్ ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే మెడిసిన్ చదవడం సులభమవుతుందని తండ్రి డాక్టర్ సుందరయ్య భావించారు.

శ్యామా ప్రసాద్‌కి తిరుపతి వాతావరణం అంతా కొత్తగా కనిపించింది. కొత్త ఊరు, కొత్త కాలేజీ, కొత్త వాతావరణం, కొత్త క్లాస్‌మేట్స్, కొత్త స్నేహితులు, అంతా కొత్తే. శ్యామ్ ప్రసాద్‌కి కొత్త సవాల్ కూడా వచ్చి పడింది. పదో తరగతి వరకు అతను తెలుగు మీడియంలో చదివాడు. కానీ, ఇప్పుడు ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియంలో చదవాలి. తెలుగు భాషపై పట్టు ఉండటంతో శ్యామా ప్రసాద్‌కు పదో తరగతి వరకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. మాతృభాషలో విద్యాభ్యాసం కావడంతో సబ్జెక్టులను సులభంగా ఆకళింపు చేసుకోగలిగాడు. కొరకరాని కొయ్యగా మారిన హిందీని ఎంతో కష్టపడి అధిగమించాడు. కానీ ఇప్పుడు ఇంగ్లిష్ సమస్యగా మారింది. ఇంగ్లీష్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి అర్థం చేసుకోవడం అంత సులువు కాదు. మొదటి రోజు నుంచే సమస్య కనిపించడం మొదలైంది. సైన్స్‌కు సంబంధించిన అన్ని సబ్జెక్టులు ఇంగ్లీష్‌లోనే బోధించారు. లెక్చరర్ చెబుతున్న విషయాలు ఏవీ శ్యామా ప్రసాద్‌కు అర్థం కాలేదు. అతను ఇంగ్లీష్ లో సబ్జెక్ట్ పాఠాలు వినడం అదే మొదటిసారి. ఇంతకు ముందు టీచర్లు అంతా తెలుగులోనే బోధించేవారు. మాతృభాష తెలుగు కావడం వల్ల సంక్లిష్టమైన సబ్జెక్టును కూడా సులభంగా అర్థం చేసుకోగలిగాడు. అనేక తెలుగు పుస్తకాలు చదవడం వల్ల భాషపై శ్యామా ప్రసాద్‌కు పట్టు బాగా పెరిగింది. కాళీపట్నం రామారావు వంటి గొప్ప పండితుల దగ్గర విద్యను అభ్యసించడం వల్ల తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించాడు. శ్యామా ప్రసాద్ స్కూల్లో ఇంగ్లీష్ సబ్జెక్టు చదివినా ఇంటర్లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి క్లిష్టమైన సబ్జెక్టులను అర్థం చేసుకోవడానికి ఈ చదువు సరిపోలేదు.

ఇంటర్ కాలేజ్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల ఇంగ్లీష్ లెక్చర్స్ వింటుంటే శ్యామా ప్రసాద్‌కి మరో లోకంలో ఉన్నట్టు అనిపించేది. మొదటి వారంలోనే ఈ చదువు అంత సులువు కాదనే ఫీలింగ్ మొదలైంది. రెండో వారం

కూడా పరిస్థితి ఇలాగే ఉండటంతో అతడి మనోనిబ్బరం సడలింది. ఇంగ్లీష్‌లో బోధన వలన బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాథమిక సూత్రాలు కూడా శ్యామా ప్రసాద్‌కు అర్థం కాలేదు. రోజురోజుకూ అతనిలో నిస్పృహ పెరగడం మొదలైంది. నిరాశ చెందసాగాడు. మనసులో వింత ఆలోచనలు మొదలయ్యాయి. కాలేజీ చదువులు ప్రారంభమై నెల కూడా కాలేదు. అతని మనసులో అంతులేని నిస్సహాయత. ఇక ఎప్పటికీ డాక్టరు కాలేనేమోననే భావన మెదలయ్యింది.

నిస్సహాయంగా, నిరాశగా ఉండటానికి మరొక కారణం ఉంది. ఇంగ్లీష్ మీడియంలో చదివి కాలేజీకి వచ్చిన విద్యార్థులు కాలేజీలో చాలా మంది ఉన్నారు. అందరూ అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడేవారు. ఉపాధ్యాయుల ప్రశ్నలకు ఆంగ్లంలో అద్భుతంగా సమాధానాలు చెప్పేవారు. ఇంగ్లీష్‌లో అడగడం వల్ల ప్రశ్న అర్థం కాకపోవడంతో శ్యామా ప్రసాద్ సమాధానం చెప్పలేకపోయేవాడు. ప్రశ్నలు అర్థం చేసుకున్నా సబ్జెక్టుపై అవగాహన లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోయేవాడు.

శ్యామా ప్రసాద్ తన బ్యాచ్‌లో ఒక్కడే కాదు, తెలుగు మీడియంలో చదివి కాలేజీకి వచ్చిన ఇంకా చాలా మంది విద్యార్థులు ఉన్నారు. అందరి పరిస్థితి కూడా దాదాపు శ్యామా ప్రసాద్ లానే ఉంది. అయితే వారిలో చాలా మంది కూల్‌గా ఉన్నారు. వారికి ఎలాంటి ఆందోళనలు లేవు. విచార పడలేదు, నిరాశ చెందలేదు. వాళ్లు ఎవరు కూడా డాక్టరు కావాలని కలలు కనలేదు. డాక్టరు కావాలని కలలుకంటున్న శ్యామా ప్రసాద్ ఆందోళన చెందాడు. అతను తన తండ్రి కంటే మంచి పేరున్న డాక్టరు కావాలని నిర్ణయించుకున్నాడు. ఇంటర్ కాలేజీకి వచ్చిన తర్వాత కలలు కనడం సులభమని, వాటిని సాకారం చేసుకోవడం కష్టమనే విషయం శ్యామా ప్రసాద్‌కు అర్థమైంది. శ్యామా ప్రసాద్ వాస్తవాన్ని గ్రహించాల్సి వచ్చింది. అతనికి ఆంగ్ల భాష సవాల్ గా నిలిచింది. ఇంగ్లీష్‌లో బలహీనంగా ఉండటం వల్ల జీవితంలో కన్న మొట్టమొదటి కల శాశ్వతంగా చెదిరిపోయినట్లు అనిపించింది.

డాక్టరు కావాలనే కలను సజీవంగా ఉంచుకునేందుకు శ్యామా ప్రసాద్ తన ప్రయత్నాలను కొనసాగించాడు. పరీక్షలో ప్రశ్నలకు సమాధానాలు బాగా

రాయాలని నిర్ణయించుకున్నాడు. జవాబులను శ్యామా ప్రసాద్ కంఠస్థం చేయడం ప్రారంభించాడు. కానీ ఆ ప్రయత్నమూ విఫలమైంది. సబ్జెక్టులు సంక్లిష్టంగా, సూత్రాలపై ఆధారపడినవి కావడంతో కంఠస్థం చేయడం కుదరలేదు. చాలా సేపు అతనికి సబ్జెక్టు గుర్తుకు రాలేదు. భట్టి పట్టే ఫార్ములా ఫెయిల్ కావడంతో శ్యామా ప్రసాద్‌లో ఫ్రస్ట్రేషన్ మరింత పెరిగింది.

తన కొడుకు విచారంగా, అశాంతిగా ఉన్నాడని గమనించించిన సుందరయ్యకు మనసులోనూ ఎన్నో భయాలు కలిగాయి. దీంతో సుందరయ్య ఒక రోజు శ్యామా ప్రసాద్‌ను చదువు ఎలా సాగుతోందని అడిగారు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు, తండ్రి దగ్గర ఏమి దాచేందుకు శ్యామా ప్రసాద్ ప్రయత్నించలేదు. నాన్న, నేను చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. పాఠాలన్నీ ఇంగ్లీష్‌లో సాగుతున్నాయి. లెక్చరర్లు ఏం చెప్తున్నారో అర్థం కావడం లేదు. నాకు ఇంగ్లీష్ పదాలు గుర్తు ఉండటం లేదు. ఎంత ప్రయత్నించినా ఆ పాఠాలు గుర్తుకు రావడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. నేను ఇక చదవలేనని అనుకుంటున్నాను. నేను డాక్టరు కాలేను అని కన్నీటి పర్యంతమయ్యాడు.

కొడుకు సమస్యను అర్థం చేసుకోవడానికి తండ్రికి ఎక్కువ సమయం పట్టలేదు. ఇంగ్లీష్ కష్టాలేంటో సుందరయ్యకు తెలుసు. స్వయంగా ఆయన ఆ సమస్యను ఎదుర్కొన్నారు. డాక్టర్ సుందరయ్య కూడా ఇంటర్మీడియట్ వరకు తెలుగు మీడియంలో చదివారు. ఎంబిబిఎస్ లో చేరగానే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విద్యాభ్యాసమంతా ఇంగ్లీష్‌లోనే సాగేది. ఇంగ్లీష్‌పై పట్టు లేకపోవడంతో లెక్చరర్లు చెప్పే పాఠాలు సుందరయ్యకు అర్థం కాకపోయేవి. ఆనాడు తాను ఎదుర్కొన్న సమస్యే ఇప్పుడు తన కుమారుడు శ్యామా ప్రసాద్‌కు ఎదురైందని డాక్టర్ సుందరయ్య గ్రహించారు.

ఈ సమస్యకు పరిష్కారమేంటో సుందరయ్యకు తెలుసు. కొడుకుకు చదువులో ఎలాంటి ఇబ్బంది కలగకూడదని నిర్ణయించి ప్రైవేట్ ట్యూటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తిరుపతిలోని అగ్రశ్రేణి ఉపాధ్యాయుల గురించి సుందరయ్య తెలుసుకుని వారి దగ్గరకు శ్యామా

ప్రసాద్‌ను ట్యూషన్‌కు  పంపడం ప్రారంభించారు. ఆ రోజుల్లో తిరుపతిలో గోవిందప్ప అత్యంత ప్రజాదరణ పొందిన ఉపాధ్యాయుడు. గోవిందప్ప సైన్స్ సబ్జెక్టులో నిష్ణాతుడు. ఆయన బోధనా శైలి ప్రత్యేకంగా ఉండేది. సైన్స్‌లోని సూక్ష్మాంశాలను విద్యార్థులకు సరళమైన భాషలో వివరించేవారు. గోవిందప్ప క్రమశిక్షణ గల వ్యక్తి.  విద్యార్థుల నుంచి కూడా అదే ఆశించేవారు.

గోవిందప్ప వల్ల శ్యామా ప్రసాద్ జీవితం మారిపోయింది. శ్యామా ప్రసాద్ జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. గోవిందప్ప తన ఇంట్లో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు. ఆయన ఓ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తుండటంతో ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి పది గంటల వరకు మాత్రమే తన ఇంట్లో పిల్లలకు పాఠాలు చెప్పేవారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయన కాలేజీలో బాధ్యతలు నిర్వర్తించేవారు.

శ్యామా ప్రసాద్ రోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకే లేవడం మొదలుపెట్టాడు. తెల్లవారుజామునే ట్యూషన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యేవాడు. సరిగ్గా ఐదు గంటలకు గోవిందప్ప మాస్టరు ఇంటికి చేరుకోవాలి. గోవిందప్ప ఉదయం 5 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యార్థులకు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించేవారు. గోవిందప్ప ఏ సబ్జెక్ట్ బోధించినా, ఆ సబ్జెక్టును విద్యార్థులకు నోట్ బుక్‌లలో రాసుకునేలా అలవాటు చేశారు. వినడం వల్ల పిల్లలకు విషయాలు అంతగా గుర్తుండవన్నది గోవిందప్ప నమ్మకం. సబ్జెక్టులను బాగా గుర్తుంచుకునేందుకు జాగ్రత్తగా రాయడం కూడా అవసరమని ఆయన నమ్మేవారు.

గోవిందప్ప చాలా చక్కగా డయాగ్రామ్స్ గీసేవారు. డయాగ్రామ్‌ల ద్వారా విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల గురించి బోధించేవాడు. చిత్రాల ద్వారా వివరించి బోధించడం వల్ల విద్యార్థులు సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకోగలిగేవారు.

గోవిందప్ప శ్యామా ప్రసాద్‌కు, ఇతర విద్యార్థులకు జీవశాస్త్రపు సూత్రాలు, ఇతర విషయాల గురించి నేర్పించడం ప్రారంభించారు. ఉదయం 9 గంటల వరకు గోవిందప్ప ఇంట్లో ట్యూషన్ పూర్తి చేసుకొని శ్యామా ప్రసాద్ కాలేజీకి

వెళ్లాల్సి వచ్చేది. కాలేజీలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చదువులు సాగేవి. మధ్యలో ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. సైన్స్ విద్యార్థులు పరస్పరం సంభాషించుకునే అవకాశం లభించే సమయం ఇది. శ్యామా ప్రసాద్ సాయంత్రం కాలేజీ వదిలిన తర్వాత ఇంటికి వచ్చేవాడు. ఇంట్లో ఫ్రెష్ అయ్యాక మళ్లీ నేరుగా ట్యూషన్లకు వెళ్లేవాడు. మళ్లీ రాత్రి పది గంటల వరకు గోవిందప్ప మాస్టర్ ఇంట్లో పాఠాలు. రోజూ ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు చదువులో నిమగ్నమై ఉండేవాడు. మధ్యలో భోజనం కోసం కొంచెం సమయం వెచ్చించేవాడు.

ఇలా పగలు, రాత్రి కష్టపడకపోతే డాక్టరు కావాలనే తన కల చెదిరిపోతుందనే విషయం శ్యామా ప్రసాద్‌కు బాగా తెలుసు. డాక్టరు కావాలంటే పట్టుదలతో ఇంటర్మీడియట్ చదివి పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించాలనే సంగతి శ్యామా ప్రసాద్ బాగా తెలుసుకున్నాడు.

శ్యామా ప్రసాద్ ఇంటర్మీడియట్లో చేరిన ఏడాదికి ముందే మెడికల్ కాలేజీలో అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష  నిర్వహించడం ప్రారంభమైంది. 1967 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల్లో ప్రవేశానికి విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. ఇంటర్మీడియట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు మెడికల్ కాలేజీల్లో ప్రవేశం లభించేది. కానీ 1968 సంవత్సరం నుంచి మెడికల్ కాలేజీలో ప్రవేశానికి ఎంట్రన్స్ పరీక్ష ప్రారంభమైంది. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ర్యాంకులు ఇవ్వడంతో పాటు ఈ ర్యాంకుల ఆధారంగానే మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు కేటాయించేవారు. మెడికల్ కాలేజీలో సీటు రావాలంటే ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు రావాల్సిందే. సీట్లు తక్కువ, ఆశించే వారు ఎక్కువ ఉండటంతో పోటీ తీవ్రంగా ఉంటుంది. ఈ గట్టి పోటీని దృష్టిలో ఉంచుకుని శ్యామా ప్రసాద్ మరింత కష్టపడి చదివాడు.

ఇంటర్ కాలేజీలో శ్యామా ప్రసాద్‌కు చాలా మంది స్నేహితులయ్యారు. స్నేహితులందరూ అతనిలా డాక్టరు కావాలని కలలు కనేవారే. కాని చాలా

మంది స్నేహితుల తండ్రులు డాక్టర్లు కాదు. కాని, తమ కుమారుడు వైద్య విద్య చదవి డాక్టరై సమాజంలో ఎంతో పేరు తెచ్చుకోవాలనే ఉబలాటపడే తల్లిదండ్రులే. ఆరెల్లి రవికుమార్, సుధాకర్ బాబు, ఆర్ముగంతో శ్యామా ప్రసాద్‌కు చక్కని స్నేహం ఏర్పడింది. ముగ్గురూ డాక్టరు కావాలనే కలతో కాలేజీలో చేరారు. ఆ ముగ్గురూ శ్యామా ప్రసాద్ పడుతున్న సమస్యతో ఇబ్బంది పడుతున్నవారే. ఇంగ్లీష్‌లో బలహీనంగా ఉండడంతో ఈ ముగ్గురూ ఫిజిక్స్, కెమిస్ట్రీ లెక్చరర్ల పాఠాలు అర్థం చేసుకోలేకపోయారు. ఈ నలుగురు స్నేహితులు తమ బాధలను తమలో తాము పంచుకునేవారు. సమస్యను ఇతరులతో పంచుకుంటే దాని తీవ్రత తగ్గుతుందంటారు. ఈ విషయం నలుగురికి బాగా తెలుసు. పంచుకోవడం వల్ల సంతోషం పెరుగుతుందని ఈ నలుగురు కూడా నమ్మారు. సుఖమైనా, దుఃఖమైనా, కష్టమైనా, నష్టమైన ఆ నలుగురూ తమలో తాము పంచుకునేవారు. నలుగురి ఆలోచన ఒకే రీతిలో ఉండటం వలన కళాశాల ఒత్తిడి నుంచి శ్యామా ప్రసాద్‌కు కొంత ఉపశమనం లభించేది.

శ్రీ గోవిందరాజ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు అనుభవజ్ఞులు మాత్రమే కాదు ప్రభావశీలురు కూడా. దీని వల్ల శ్యామా ప్రసాద్‌తో పాటు మిగతా విద్యార్థులందరికీ కూడా ప్రయోజనం చేకూరింది. చంద్రశేఖరరావు జంతుశాస్త్రం బోధించేవారు. ఆయన మొదట జంతువుల గురించి, మొక్కలు, చెట్ల గురించి విద్యార్థులందరిలో ఆసక్తిని రేకెత్తించాడు. ఆయన చెప్పిన ఒక మాట శ్యామా ప్రసాద్ మెదడులో నిక్షిప్తమైంది. ఒకసారి లెక్చరర్ చంద్రశేఖర్ రావు ఒక పాఠం చెప్తూ మానవులకు సంభవించే వివిధ వ్యాధులను నియంత్రించడానికి, ఆ వ్యాధుల నివారణకు మార్గాలు తెలుసుకోవడానికి జంతుశాస్త్ర అధ్యయనం అవసరమని చెప్పారు. రోగాలను వ్యాపింపజేసే క్రిములు, కీటకాలపై అవగాహన జంతుశాస్త్ర అధ్యయనం ద్వారానే సాధ్యమవుతుంది.

కాలేజీలో రెడ్డి మాస్టర్ బోటనీ అంటే వృక్షశాస్త్రం బోధించేవారు. రెడ్డి మాస్టారు మొక్కల గురించి ఆసక్తికర సమాచారాన్ని విద్యార్థులకు అందించి, మొదటి రోజే సబ్జెక్ట్‌పై ప్రేమను పెంచే ప్రయత్నం చేశారు. మొక్కలు మానవులకు చాలా ముఖ్యమైనవి, ప్రయోజనకరమైనవని మాస్టర్ వివరించారు.

చెట్లు, మొక్కలు లేని మానవ జీవితాన్ని ఊహించడం సాధ్యం కాదు. సూర్యకాంతి నుంచి కిరణజన్య సంయోగక్రియ ప్రక్రియ ద్వారా మొక్కలు తమ స్వంత ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. మానవులకు జీవనాధార ఆక్సిజన్‌ను సిద్ధం చేస్తాయి. ఒక చెట్టు సంవత్సరానికి సగటున ఇరవై ఒక్క కిలోగ్రాముల కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహిస్తుంది. నలుగురు వ్యక్తులు జీవించగలిగేంత ఆక్సిజన్‌ను పగటిపూట ఇస్తుంది.

శ్యామా ప్రసాద్‌కి బోటనీ, జువాలజీ సబ్జెక్టులతో పెద్దగా సమస్యల్లేవు. కెమిస్ట్రీ. ఫిజిక్స్ సబ్జెక్టులతోనే సమస్య. ఈ రెండు సబ్జెక్టుల పరీక్షల్లో పాస్ అయ్యేందుకు శ్యామా ప్రసాద్ ప్రశ్నలకు తెలుగు భాషలో సమాధానాలు రాసుకునేవారు. రాయడం ద్వారా కంఠస్థం చేయడం ప్రారంభించాడు. ఈ రెండు సైన్స్ సబ్జెక్టుల పదజాలాన్ని కంఠస్థం చేయడానికి శ్యామా ప్రసాద్ అదే ట్రిక్ అవలంభించాడు. కానీ ఆ ప్రయోగం సత్ఫలితాన్ని ఇవ్వలేదు.

శ్యామా ప్రసాద్ తండ్రి డాక్టర్ సుందరయ్యకు ఫిజిక్స్ లెక్చరర్ లక్ష్మీనారాయణ సన్నిహితుడు. సుందరయ్య కీర్తి అంతటా వ్యాపించింది. ప్రజలు ఆయనను ఎంతో గౌరవించేవారు. సుందరయ్య వైద్య విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తూ ఆసుపత్రిలో వైద్యం చేసేవారు. ఆర్థోపెడిక్ సర్జన్ కావడంతో ఎముకలు, కండరాలకు సంబంధించిన వ్యాధులకు సుదూర ప్రాంతాల నుంచి సుందరయ్య దగ్గర వైద్యం చేయించుకునేందుకు చాలా మంది రోగులు వచ్చేవారు. ఆయనో అద్భుతమైన సర్జన్. ఒకసారి శ్యామా ప్రసాద్ ఫిజిక్స్ పరీక్షలో ఫెయిల్ అయినప్పుడు, లెక్చరర్ లక్ష్మీనారాయణ ఆన్సర్ షీట్‌తో సుందరయ్య వద్దకు వచ్చాడు. "డాక్టరు గారూ, మీ అబ్బాయి చదువులో చాలా బలహీనంగా ఉన్నాడు, నేను చాలా ప్రయత్నించాను, అతను ఫిజిక్స్ ప్రతి పరీక్షలో ఫెయిల్ అవుతున్నాడు, మీ అబ్బాయి డాక్టరు కాలేడేమోనని నాకు చాలా బాధగా ఉంది" అని లక్ష్మీనారాయణ సుందరయ్యతో అన్నారు.

ఈ విషయాన్ని సుందరయ్య పెద్దగా పట్టించుకోలేదు. తన కొడుకుకు ఇంగ్లీష్‌పై పట్టు లేకపోవడంతో ఫిజిక్స్, కెమిస్ట్రీలలో తక్కువ మార్కులు వచ్చాయని గ్రహించారు.

“నాకు మా అబ్బాయి గురించి బాగా తెలుసు. ఇది ప్రారంభం మాత్రమే. రెండేళ్లు  చదవాలి. అతను కచ్చితంగా ఇంప్రూవ్ అవుతాడు. మీరు ప్రయత్నిస్తూ ఉండండి, అతను కూడా ప్రయత్నిస్తాడు” అని లక్ష్మీనారాయణతో సుందరయ్య అన్నారు.  శ్యామా ప్రసాద్‌కు డాక్టరు కావాలనే సంకల్పం ఉంది. కష్టపడి చదివే గుణం ఉంది. కచ్చితంగా డాక్టరు అవుతాడనని డాక్టర్ సుందరయ్య ఫిజిక్స్ లెక్చరర్‌కు భరోసా కల్పించారు.

తన తండ్రికి ఫిజిక్స్ లెక్చరర్‌కి మధ్య జరిగిన  సంభాషణ శ్యామా ప్రసాద్‌కు తెలియడంతో తన తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయకూడదని నిర్ణయించుకున్నాడు. డాక్టర్ అయిన తర్వాతే విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

శ్యామా ప్రసాద్ తన దృష్టంతా కాలేజీ పాఠ్యపుస్తకాలపైనే పెట్టడం మొదలుపెట్టాడు. సాహిత్యంపై ఉన్న ఆసక్తి మరుగున పడిపోయింది. సినిమాలు, షికార్లు పూర్తిగా బంద్ అయ్యాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫార్ములాలు నేర్చుకునేందుకు, వాటిని ఆకళింపు చేసుకునేందుకు విపరీతంగా శ్రమించాడు. శ్యామా ప్రసాద్ తపన చూసిన  కెమిస్ట్రీ లెక్చరర్ భాస్కర్ నాయుడు తగిన తోడ్పాటును అందించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షల్లో ఒత్తిడికి గురి కాకుండా రాతపూర్వకంగా సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ప్రయోజనకరమని శ్యామా ప్రసాద్‌కు కెమిస్ట్రీ లెక్చరర్ వివరించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షల్లో థియరీతోపాటు న్యూమరికల్ ప్రశ్నలు కూడా ఉంటాయి. వాటిని సాల్వ్ చేయడానికి, పరిష్కరించడానికి, సూత్రంతో పాటు సమీకరణాలను కూడా గుర్తుంచుకోవాలి. రాసి అర్థం చేసుకోవడం వల్ల పరీక్ష సమయంలో మర్చిపోయే సమస్య ఉండదు. ఇలా చేయడం వల్ల లెక్కలు సాల్వ్ చేసేందుకు కూడా ఇది బాగా సహాయపడుతుంది. శ్యామా ప్రసాద్, ఇతర విద్యార్థులకు ప్రయోగశాలలో విభిన్న ప్రయోగాలు చూపించి రసాయన శాస్త్రాన్ని సులభతరం చేశారు కెమిస్ట్రీ లెక్చరర్ భాస్కర్ నాయుడు.

క్రమంగా శ్యామా ప్రసాద్‌కు తనపై తనకు నమ్మకం పెరుగుతూ వచ్చింది. కాలేజీ చదువులతో పాటు గోవిందప్ప మాస్టారు దగ్గర గంటల తరబడి చదువుకోవడం, రాయడం వల్ల మంచి ఫలితాలు రావడం మొదలయ్యాయి.

కానీ హిందీ సమస్య తీరలేదు. ఇంటర్‌లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి శ్యామా ప్రసాద్ హిందీని ద్వితీయ భాషగా ఎంచుకున్నాడు. ఆ రోజుల్లో తెలుగు జవాబు పత్రాలను కఠినంగా దిద్దుతారనే అభిప్రాయం ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఉండేది. హిందీ ప్రశ్నపత్రాలను అంత పరిశీలనగా చూడరని, మార్కులు బాగా వేస్తారని చాలా మంది విద్యార్థులు నమ్మేవారు. తెలుగు సబ్జెక్టు విద్యార్థుల కంటే హిందీ విద్యార్థులకు ఎప్పుడూ ఎక్కువ మార్కులు వచ్చేవి. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలో ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి శ్యామా ప్రసాద్ హిందీ ఎంచుకున్నాడు. కానీ హిందీ ఎంపిక పెద్ద సమస్యగా మారిపోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసిన శ్యామా ప్రసాద్ తన హిందీని మెరుగుపరచుకోలేక పోయాడు. హిందీపై తనకున్న పట్టుతో ఆ పరీక్షలో గట్టెక్కడం కష్టమని భావించిన శ్యామా ప్రసాద్ విద్యాసంవత్సరం మధ్యలో హిందీని వదులుకుని ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకున్నాడు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మొదటి ఆరు నెలలు శ్యామా ప్రసాద్ ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఆ తర్వాత నుంచి ప్రయాణం సాఫీగా సాగింది. ప్రతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ప్రారంభించాడు. క్రమంగా పరీక్షల్లో మార్కులు కూడా బాగా మెరుగుపడ్డాయి. కాలేజీలో చేరిన ఏడాది తర్వాత టాప్ ముగ్గురు విద్యార్థుల్లో ఒకరిగా నిలిచాడు. ఈ స్థాయి చేరుకునేందుకు శ్యామా ప్రసాద్ చేసిన కృషి, అంకితభావమే కారణం.

శ్యామా ప్రసాద్ కాలేజీలో చేరినప్పుడు అతని చదువును చూసి చాలా మంది లెక్చర్లు పెదవి విరిచారు. మొద్దు విద్యార్థి కింద అతన్ని జమకట్టారు. పరీక్షల్లో పాస్ అవడం కష్టమేనని అంచనా వేశారు. కాని శ్యామా ప్రసాద్ తన దృఢ సంకల్పం, అవిశ్రాంత కృషితో ఉపాధ్యాయుల ఆలోచనలను మార్చాడు.

ఇంటర్మీడియట్ ఫైనల్ ఇయర్ పరీక్షల ఫలితాలు రాగానే శ్యామా ప్రసాద్ పడ్డ కష్టం లెక్చరర్లకు కనిపించింది. ఆయన తపస్సు ఫలించింది. కాలేజీలో శ్యామా ప్రసాద్ మూడో స్థానంలో ఉండేవాడు. గోవిందరాజ్ ఆర్ట్స్ కాలేజీలో బైపీసీ మొదటి బ్యాచ్‌లో 200 మంది విద్యార్థుల్లో 3వ ర్యాంక్ సాధించడం పెద్ద విజయం.

ఈ విజయంతో శ్యామా ప్రసాద్ సంతోషించాడు. తండ్రి సుందరయ్య ఆనందానికి అవధులు లేవు. ఇంటర్ ఫలితాలతో, తన కొడుకు మెడికల్

కాలేజీలో సీటుకు అడుగు దూరంలో ఉన్నాడని సుందరయ్య గ్రహించారు.

మెడికల్ కాలేజీలో సీటు సంపాదించాలంటే, శ్యామా ప్రసాద్ ఇప్పుడు ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్ పొందాల్సి ఉంటుంది. అందుకే సమయాన్ని వృథా చేయకుండా ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు కొడుకును సిద్ధం చేయసాగారు.

కానీ ప్రవేశ పరీక్ష ఆలస్యమైంది. మెడికల్ కాలేజీల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించాలా? లేక ఇంటర్మీడియట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను మెడికల్ కాలేజీల్లో చేర్చుకోవాలా? అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. అంతకు ముందు సంవత్సరం మొదటిసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పరీక్షను ప్రారంభించింది. ప్రవేశ పరీక్షను చాలా మంది వ్యతిరేకించారు. ఇంటర్ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా వైద్య కళాశాలలో ప్రవేశానికి అర్హతను నిర్ణయించాలని చాలా మంది చెప్పారు. కాని, ఇంటర్ పరీక్షల్లో అనేక చోట్ల మాస్ కాపీయింగ్ జరుగుతుందని పలువురు విద్యావేత్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాలేజీల్లో చాలా మంది విద్యార్థులు కాపీ కొడుతున్నారు. ఈ కారణంగా మెడికల్ కాలేజీలో చేరేందుకు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రవేశ పరీక్ష ఉండాలనే వాదన బలంగా వినిపించసాగింది. మరో వైపు ప్రవేశ పరీక్ష పద్ధతిపై కూడా వ్యతిరేకత వచ్చింది. గతేడాది జరిగిన పరీక్షలో ఒకే పరీక్షలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అన్ని సబ్జెక్టుల నుంచి వేర్వేరు ప్రశ్నలు అడిగారు. అన్ని సబ్జెక్టులకు ఒకే పరీక్ష నిర్వహించారు. చాలా మంది తల్లిదండ్రులు వేర్వేరు సబ్జెక్టులకు వేర్వేరు పరీక్షలు ఉంటే బాగుంటుందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సూచనలను పరిగణనలోకి తీసుకుంది. కాని నిపుణుల నుంచి రకరకాల అభిప్రాయాల వ్యక్తం కావడంతో నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ఏర్పడింది. దీంతో చాలా మంది విద్యార్థులు అయోమయంలో పడ్డారు.

ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే డిగ్రీ కాలేజీల్లో భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలనుకున్న చాలా మంది విద్యార్థులు డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవడం ప్రారంభించారు. సుందరయ్య కూడా డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలని శ్యామా ప్రసాద్‌కు సలహా ఇచ్చారు.

మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభుత్వ నిర్ణయం వచ్చే వరకు డిగ్రీ కాలేజీలో చేరాలని శ్యామా ప్రసాద్ సంకల్పించారు. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీలో అడ్మిషన్ తీసుకుని బి.ఎస్సీ (బి.జడ్.సి) కోర్సు చదవడం ప్రారంభించాడు. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రంలో చదువు మొదలైంది. కొన్ని నెలల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని మెడికల్ కాలేజీలకు విద్యార్థుల ఎంపిక ప్రవేశ పరీక్ష ఆధారంగా జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో శ్యామా ప్రసాద్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌కి ప్రిపేర్ అయ్యాడు.

గట్టి ప్రిపరేషన్‌తో శ్యామా ప్రసాద్ పరీక్ష బాగా రాశాడు. ఆ రోజుల్లో వెనుకబడిన కులాల విద్యార్థుల ఆన్సర్ షీట్ వేరుగా దిద్దేవారు. ప్రశ్నపత్నాలు దిద్ది, ఫలితాలు వెలువడిన తర్వాత సుందరయ్య ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. దానికి కారణం ఉంది. ఆ సంతోషానికి కారణం బీసీ వర్గాల్లో టాప్ ర్యాంకర్‌గా శ్యామా ప్రసాద్ నిలవడం. వైద్య కళాశాలలో శ్యామా ప్రసాద్‌కు సీటు కన్ఫామ్ అయింది. తన వైద్యం ద్వారా లక్షలాది మంది ఆదరాభిమానాలు పొందిన డాక్టర్ సుందరయ్య కుమారుడు కూడా డాక్టర్ కావడం తథ్యమని తేలిపోయింది. కుమారుడు సాధించిన విజయంతో డాక్టర్ సుందరయ్య ఉప్పొంగిపోయారు. ఇంట్లో సంబరాలు మొదలయ్యాయి. బంధువులు, స్నేహితులు, తెలిసిన వారందరికీ స్వీట్లు ఆర్డర్ చేసి పంపారు. తన పెద్ద కొడుకు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచాడని సుందరయ్య కూడా సంతోషించారు. శ్యామా ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన సోదరులు, సోదరీమణులు కూడా విజయపథంలో పయనించాలని తహతహలాడుతున్నారు.

శ్యామా ప్రసాద్‌కు మెరుగైన ర్యాంకు రావడంతో తనకు నచ్చిన మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోనే అవకాశం లభించింది. మెడికల్ కాలేజీలో అడ్మిషన్ విషయంలో శ్యామా ప్రసాద్ తన తండ్రిని సంప్రదించాడు. సుందరయ్య తన కుమారుడిని తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. తన తండ్రి సలహాను అనుసరించి, శ్యామా ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోని పురాతన మరియు అత్యంత ప్రతిష్టాత్మకమైన వైద్య కళాశాల అయిన శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో చేరాడు.

## అధ్యాయం - 5

# చికిత్సలలో మెళకువలు, వైద్యశాస్త్రంపై తిరుగులేని పట్టు కోసం అధ్యయనం

శ్రీ గోవిందరాజ్ స్వామి ఆర్ట్స్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు సరికొత్త చరిత్రను సృష్టించారు. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ (బైపీసీ) బ్యాచ్‌కు చెందిన 200 మంది విద్యార్థుల్లో 150 మంది విద్యార్థులు మెడికల్ కాలేజీలో సీట్లు పొందేందుకు అర్హత సాధించారు. అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క కాలేజీ నుంచి ఇంత ఎక్కువ మంది విద్యార్థులు ఎంబిబిఎస్ కోర్సులో సీట్లు పొందిన దాఖలాలు లేవు. శ్రీ గోవిందరాజ్ స్వామి ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు చేయడానికి ముందు విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాల, మారిస్ స్టెల్లా కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో వైద్య కళాశాలలో సీట్లు సాధించారు. ఆంధ్రా లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థికి మెడికల్ కాలేజీలో కచ్చితంగా సీటు వస్తుందనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో ఉండేది. లయోలా కాలేజీలో సీటు రావడం గర్వంగా భావించేవారు. ఈ కళాశాల ఆంధ్రప్రదేశ్ లో మొదటి స్థానంలో నిలిచేది. శ్రీ గోవిందరాజ్ స్వామి ఆర్ట్స్ కాలేజీ, లయోలా కాలేజీ రికార్డులన్నింటినీ బద్దలు కొట్టింది. ఆ రోజుల్లో విజయవాడ, గుంటూరు నగరాల విద్యార్థులు వైద్య కళాశాలల్లో అత్యధిక సీట్లు సాధించేవారు. కానీ 1971లో తిరుపతి విద్యార్థులు ఘనవిజయం సాధించారు.

శ్యామా ప్రసాద్ స్నేహితులకు కూడా మెడికల్ కాలేజీలో సీట్లు వచ్చాయి. కొందరు కర్నూలు మెడికల్ కాలేజీలో, మరికొందరు గుంటూరు మెడికల్

కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నారు. శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులకు సీట్లు రాని మెడికల్ కాలేజీ ఆంధ్రాలోనే లేదు.

కానీ శ్యామా ప్రసాద్ స్నేహితుడు ఒకరు సామర్థ్యం ఉన్నప్పటికీ మెడికల్ కాలేజీలో సీటు సాధించలేకపోయాడు. చదువుల విషయంలో అతను చాలా చురుకైన విద్యార్థి. అతనికి ఖచ్చితంగా మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని క్లాస్‌మేట్స్ అంతా నమ్మారు. అతను కూడా తనకు సులువుగా మెడికల్ కాలేజీలో అడ్మిషన్ లభిస్తుందని ధీమాగా ఉన్నాడు. కానీ, పేదరికం కారణంగా మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకోకూడదని అతను నిర్ణయించుకున్నాడు. మెడిసిన్ చదవాలంటే ఖర్చు ఎక్కువ అవుతుందని, పేద తల్లిదండ్రులకు భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబిబిఎస్ కోర్సు పూర్తి చేసేందుకు ఐదేళ్లకు పైగా సమయం పడుతుందనే విషయం అతనికి తెలుసు. డిగ్రీ చదివి వీలైనంత త్వరగా ఉద్యోగంలో చేరాలని, తద్వారా తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలని భావించాడు.

ఇంటర్ పరీక్షలో చాలా ప్రశ్నలకు అతను ఉద్దేశపూర్వకంగా సమాధానాలు రాయలేదు. దీంతో అతనికి తక్కువ మార్కులు వచ్చాయి. వైద్య కళాశాలలో ప్రవేశానికి అతనికి అర్హత లభించలేదు. అతనికి కావాల్సింది అదే. ఇంటర్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా బి.కామ్ కోర్సులో సీటు వచ్చింది. ఇది అతనికి చాలా సంతోషం కలిగించింది. మూడేళ్లు చదివితే కోర్సు పూర్తవుతుందని, డిగ్రీ చేతికి రాగానే ఉద్యోగం వస్తుందని అనుకున్నాడు. కాని, ఇది శ్యామా ప్రసాద్‌కే కాదు ఇతర విద్యార్థులకు కూడా బాధ కలిగించింది. అతను కూడా తమతో కలిసి మెడిసిన్ చదవాలని అందరూ కోరుకున్నారు. అందరిలోకి ఉత్తమ విద్యార్థి అతను. కానీ అతను మాత్రం తన తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఆలోచనతో మెడికల్ కాలేజీ సీటు వదులుకున్నాడు. అతను తీసుకున్న నిర్ణయం చాలా మంది విద్యార్థుల మనస్సులను గాయపరిచింది. కలలు సాకారం చేసుకునేందుకు పేదరికం అడ్డంకులు సృష్టిస్తుందని శ్యామా ప్రసాద్ గ్రహించాడు. సామర్థ్యం ఉన్నప్పటికీ పేదరికం కారణంగా ఓ వ్యక్తిని ఇతరులు అధిగమించుతారనే విషయం బోధపడింది. స్నేహితుడంటే శ్యామా ప్రసాద్‌కు చాలా సానుభూతి ఉండేది.

జీవితంలో ముందుకు వెళ్లాలంటే మనిషి చాలా విషయాలు మర్చిపోవాలి. చాలా విషయాల నుంచి దృష్టిని మళ్లించుకోవాల్సి ఉంటుంది. చాలా విషయాలను విస్మరించాల్సి ఉంటుంది. తన కలలు సాకారం చేసుకునేందుకు గతాన్ని మరచిపోవాల్సిన అవసరం వస్తుందని శ్యామా ప్రసాద్ గ్రహించాడు. మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని అర్థం చేసుకున్నాడు. ఇవన్నీ గ్రహించిన శ్యామా ప్రసాద్ తన కలలు సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయడం ప్రారంభించాడు.

తన తండ్రి సుందరయ్య కంటే సమర్థుడైన డాక్టరుగా నిలిచి అంత కంటే మంచి పేరు సంపాదించాలనే బలమైన లక్ష్యంతో శ్యామా ప్రసాద్ తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ కోర్సులో చేరాడు.

ఎంబిబిఎస్ కోర్సు కాలవ్యవధి నాలుగున్నరేళ్లు ఉంటుంది. ఆ తర్వాత ఏడాది పాటు హౌస్-సర్జన్‌షిప్ చేయాలి. వైద్యశాస్త్రంలో ప్రధానమైన ఎంబిబిఎస్ కోర్సు చదివేటప్పుడు విద్యార్థులు మానవ శరీర నిర్మాణం, అది ఎలా పనిచేస్తుందో అనే విషయాల గురించి జ్ఞానాన్ని అందుకుంటారు. మానవ శరీరానికి సంబంధించిన అన్ని విషయాలు తెలుసుకునేలా ఎంబిబిఎస్ కోర్సు రూపకల్పన చేశారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు, యుక్తవయస్సు, వృద్ధాప్యం వరకు సమస్త సమాచారాన్ని ఈ కోర్సు విద్యార్థులకు అందిస్తుంది. అంటే మనిషి పుట్టుక నుంచి మరణం వరకు సాగే ప్రక్రియ అంతా ఈ కోర్సు ద్వారా అవగతమవుతుంది.

సరైన గర్భధారణకు కొన్ని విషయాలు కీలకంగా ఉంటాయి. అలాగే గర్భం దాల్చిన తర్వాత కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన తర్వాత స్త్రీకి సరైన సంరక్షణ అవసరం. రోగాలు రాకుండా ఉండాలంటే మనుషులు ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. ఎప్పుడైనా ఏదైనా గాయాలబారిన పడినప్పుడు లేదా ఏదైనా అనారోగ్యం బారిన పడినప్పుడు సరైన చికిత్స అవసరమవుతుంది, తద్వారా ఆ వ్యక్తి కోలుకొని మళ్లీ ఉత్సాహంగా ఉండగలుగుతాడు. మనిషిని ఇబ్బందులపాలు చేసే వ్యాధులను గుర్తించి చికిత్స చేసే పని డాక్టర్లది. ఎంబిబిఎస్ చదివేటప్పుడు ప్రాక్టికల్స్‌పై ప్రొఫెసర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అలాంటివి ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా వ్యాధి, దాని

లక్షణాలను  విద్యార్థులు సరిగ్గా అర్థం చేసుకోగలరు. మనుషులకు వచ్చే వివిధ వ్యాధులను గుర్తించడమే కాదు వాటికి సరైన చికిత్స అందించేలా ఎంబిబిఎస్ కోర్సులో విద్యార్థులు తర్ఫీదు పొందుతారు.

ఆ రోజుల్లో శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ కోర్సులో ఏటా 100 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం లభించేది. 1971 బ్యాచ్‌లో ప్రవేశం పొందిన 100 మందిలో తాను చోటు సంపాదించినందుకు శ్యామా ప్రసాద్ చాలా సంతోషించాడు.

ఎంబిబిఎస్ కోర్సు మొదటి సంవత్సరంలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలను విద్యార్థులు మరింత లోతుగా నేర్చుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన కూడా ఉంటుంది. దీనికి పెద్ద కారణం ఉంది. మెడికల్ కాలేజీలో ప్రవేశం పొందిన విద్యార్థుల్లో చాలా మంది తెలుగు మీడియం నుంచి వచ్చిన వారే. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీని వాళ్లు తెలుగు మీడియంలో చదివి ఉంటారు. మెడికల్ కాలేజీలో బోధనా అంతా ఇంగ్లీష్‌లోనే సాగుతుంది. పరీక్షలు కూడా ఇంగ్లీషులోనే రాయాల్సి ఉంటుంది. వైద్య విద్యను సరైన రీతిలో ఆకళింపు చేసుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు నిర్వహించారు. బోధన-అభ్యాసాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు, ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో ఇంగ్లీష్ పై అధిక దృష్టి పెడతారు. ఈ  ఫౌండేషన్ కోర్సులో భాగంగా వైద్య విద్యార్థులకు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధన ఉంటుంది. విద్యార్థులందరు ఇంగ్లీష్‌పై పట్టు సాదించేందుకు కృషి చేశారు. ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు పూర్తయిన తర్వాత, ఎంబిబిఎస్ చదువులు మొదలయ్యాయి.

ప్రవేశ పరీక్ష ఆలస్యం కావడంతో 1971 బ్యాచ్ విద్యార్థులకు అక్టోబర్‌లో కాకుండా జనవరి నెలలో ఎంబిబిఎస్ కోర్సు ప్రారంభమైంది. సాధారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి, ఏప్రిల్‌లో పూర్తవుతాయి. పరీక్ష ఫలితాలు మేలో వెలువడుతాయి. ప్రవేశ పరీక్షల ప్రక్రియ లేనప్పుడు జూన్‌లోనే మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేది. ఎంబిబిఎస్ కోర్సు ఆగస్టులో ప్రారంభించేవారు. 1970లో మొదటి ప్రవేశపరీక్ష నిర్వహించినప్పుడు కూడా ఆగస్టులోనే కోర్సు ప్రారంభమైంది. కానీ 1971లో చాలా జాప్యం

జరిగింది. డిశంబర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి జనవరిలో కోర్సులు ప్రారంభమయ్యాయి.

ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు జూన్ 1972 వరకు కొనసాగింది. ఈ సమయంలో కోస్తాంధ్ర, రాయలసీమలో 'జై ఆంధ్ర ఉద్యమం' మొదలైంది. ఆ ఉద్యమం హింసాత్మకంగా మారింది. ప్రతిచోటా హింసాత్మక సంఘటనలు జరిగేవి. విద్యార్థులు చురుగ్గా పాల్గొనడం వల్ల ఎక్కడ చూసినా ఉద్యమ ప్రభావం కనిపించేది. ఆంధ్ర, రాయలసీమలో పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. చదువు ఆగిపోయింది. విద్యాసంస్థల్లో ప్రతీ రోజు నిరసనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనాలు గళం విప్పారు. పదే పదే బంద్‌లు జరగడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

ఆంధ్ర, రాయలసీమ ప్రజలు ప్రత్యేక 'ఆంధ్ర' రాష్ట్రాన్ని డిమాండ్ చేయడం ప్రారంభించారు. 1956లో 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి వివిధ ప్రాంతాల ప్రజలు రకరకాల కారణాలతో ఉద్యమిస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రజలు మొదటి నుంచి ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణను ఆంధ్ర, రాయలసీమలో కలిపి కొత్త రాష్ట్ర ఏర్పాటును ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ ప్రజల సంస్కృతి, యాస, ఆచార వ్యవహారాలు ఆంధ్ర, రాయలసీమ ప్రజల కంటే భిన్నమైనవి, కాబట్టి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని అక్కడి ప్రాంత ప్రజల భావన.

తెలంగాణ చరిత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. 1719 నుండి సెప్టెంబర్ 1948 వరకు తెలంగాణ ప్రాంతం హైదరాబాదు సంస్థానంలో భాగంగా ఉంది. నిజాంల పాలనకు ముందు తెలంగాణను శాతవాహన, కాకతీయ, చాళుక్య, మొఘల్, కుతుబ్షాహీ రాజవంశాలకు చెందిన వారు పరిపాలించారు. అసఫ్ జాహీ వంశానికి చెందిన నిజాంల ఏలుబడిలో హైదరాబాద్ రాజ్యం 1719 నుండి 1948 వరకు ఉంది. తెలంగాణతో పాటు నిజాం పాలనలో కొన్ని మరాఠీ, కన్నడ మాట్లాడే ప్రాంతాలు కూడా హైదరాబాద్ రాజ్యంలో భాగంగా ఉన్నాయి. తెలుగు మాట్లాడే ప్రజలు అత్యధికంగా ఉన్న ప్రాంతాన్ని తెలంగాణ అని పిలిచేవారు. హైదరాబాదు సంస్థానంలో హిందువులు పెద్ద సంఖ్యలో ఉన్నా చాలా సంవత్సరాల పాటు ఈ ప్రాంతాన్ని ముస్లిం రాజులు పాలించారు.

1947 ఆగస్టు 15న బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. వివిధ సంస్థానాలు, రాజ్యాలు భారతదేశంలో విలీనం కావడం ప్రారంభమయ్యాయి. బ్రిటిష్ వారు స్వాతంత్ర్య ప్రక్రియను ప్రారంభించిన వెంటనే సంస్థానాలు భారతదేశంలో చేరాలా వద్దా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. చాలా సంస్థానాలు భారతదేశంలో తాము విలీనమవుతామని ప్రకటించాయి. భారతదేశంలో విలీనమయ్యేందుకు సిద్ధంగా లేని సంస్థానాలను ఒప్పించే బాధ్యత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అప్పగించారు. 1947 మే 6న, వల్లభాయ్ పటేల్ సంస్థానాలు, రాజ్యాల విలీన ప్రక్రియను మొదలుపెట్టారు. ఆ సమయంలో భారతదేశంలో 562 రాజులు, నవాబులు ఉన్నారు. స్వాతంత్ర్య సమయంలో దాదాపు ఈ అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనానికి అంగీకరించాయి, అయితే ట్రావెన్‌కోర్, భోపాల్, జునాగఢ్, హైదరాబాద్ రాజ్యాలు భారతదేశంలో విలీనానికి నిరాకరించాయి. ఈ నాలుగు రాజ్యాల్లో పెద్దది హైదరాబాద్.

స్వాతంత్ర్యానికి ఒకరోజు ముందు, అంటే ఆగస్టు 14న, ట్రావెన్‌కోర్‌ను భారతదేశంలో విలీనం చేస్తున్నట్లు అక్కడి రాజు ప్రకటించాడు. రాజ్య ప్రజల డిమాండ్ మేరకు ఆయన విలీనానికి సమ్మతి తెలిపారు. విలీనానికి అంగీకరించకుంటే రాజుకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు అక్కడి ప్రజలు సన్నద్ధులయ్యారు. రెఫరెండం తర్వాత జునాగఢ్ భారతదేశంలో విలీనమైంది. 1948 ఫిబ్రవరి 20న జూనాగఢ్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో 2,01,457 మంది ఓటర్లలో 1,90,870 మంది భారత్‌లో విలీనానికి అనుకూలంగా ఓటు వేశారు. కేవలం 91 మంది మాత్రమే పాకిస్థాన్‌లో చేరడాన్ని సమర్థించారు. జునాగఢ్ 1947 నవంబర్ 7న భారతదేశంలో భాగమైంది. జునాగఢ్ విలీనం తరువాత మూడు రాజ్యాలు సమస్యగా మిగిలాయి. అవి – భోపాల్, కశ్మీర్, హైదరాబాద్. 82 వేల చదరపు మైళ్ల విస్తీర్ణంతో కూడిన అతిపెద్ద రాజ్యం హైదరాబాద్. దాని జనాభా దాదాపు కోటి అరవై లక్షలు. హైదరాబాదు సంస్థానంలో దాదాపు 85 శాతం మంది హిందువులు, పాలకులు మాత్రం ముస్లింలు. భోపాల్లోనూ ఇదే పరిస్థితి. కశ్మీర్లో భిన్నమైన పరిస్థితి. అక్కడి రాజు హిందువు మరియు మూడు వంతుల ప్రజలు ముస్లింలు.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు హైదరాబాద్ సంస్థానం కూడా భారతదేశంలో విలీనం కావాలని అక్కడి ప్రజలు కోరుకున్నారు. కానీ నిజాం నవాబుకు ఇది రుచించలేదు. హైదరాబాద్‌ను ప్రత్యేక స్వతంత్ర దేశంగా ఉంచాలని ఆయన భావించారు. ఆయనపై రజాకార్ల ఒత్తిడి కూడా తీవ్రంగా ఉండేది. నిజాం ప్రైవేట్ సైన్యం రజాకార్లు. ఆ సైన్యానికి అధిపతి కాసిం రిజ్వీ కరుడుగట్టిన మతవాది. బ్రిటీష్ వారు భారతదేశాన్ని విడిచి వెళ్లిన తర్వాత హైదరాబాద్ రాజ్యాన్ని ముస్లిం దేశంగా మార్చాలని రిజ్వీ ఆకాంక్షించాడు. అనేక మంది హిందువులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చారనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. హిందువులను ఇస్లాం మతం మార్చాలనే లక్ష్యంతో రజాకార్ల సహాయంతో రిజ్వి ప్రచారం ప్రారంభించాడని కొందరు చరిత్రకారులు చెప్తారు. ఇస్లాం మతంలోకి మారడానికి అంగీకరించని వారిని హింసించేవారు.

హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేయడానికి నిజాం నిరాకరించడంతో, నిజాంకు వ్యతిరేకంగా సామూహిక ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమాన్ని అణిచివేయడమే లక్ష్యంగా రజాకార్లు ప్రజలపై దౌర్జన్యాలకు దిగారు. ఇక్కడి ప్రజలు సాయమందించాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైన్యాన్ని పంపి రజాకార్లను, నిజాంను బలవంతంగా లొంగిపోయేలా చేశారు. హైదరాబాద్ రాజ్యం 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనమైంది. భారత ప్రభుత్వం సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముల్లాత్ కడింగి వెల్లోడిని హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా భారత ప్రభుత్వం నియమించింది. కొన్నాళ్లకు ఇక్కడ ఎన్నికలు నిర్వహించి ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే డిమాండ్ మొదలైంది. ఈ డిమాండ్ తీవ్రరూపం దాల్చినప్పుడు భారత ప్రభుత్వం 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించింది. అదే ఏడాది భారతదేశంలో తొలిసారిగా సాధారణ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు కూడా జరిగాయి. హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన మొదటి ముఖ్యమంత్రి. మరోవైపు మద్రాసు సంస్థానంలో తెలుగు

మాట్లాడే ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం ఆంధ్ర డిమాండ్‌కు మద్దతుగా నిరాహార దీక్ష ప్రారంభించారు.

58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు 1952 డిసెంబర్ 15న ప్రాణాలు విడిచారు. శ్రీరాములు త్యాగం తెలుగు మాట్లాడే ప్రజల్లో కేంద్రంపై ఆగ్రహం పెంచింది. ఎక్కడికక్కడ తెలుగు మాట్లాడే ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. శ్రీరాములు మరణించిన నాలుగు రోజుల తర్వాత, అంటే 1952 డిసెంబర్ 15న తెలుగు మాట్లాడేవారి కోసం ప్రత్యేక 'ఆంధ్ర' రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. ఆంధ్ర రాష్ట్రం అధికారికంగా 1 అక్టోబర్ 1953న ఏర్పడింది. రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు కొత్త రాష్ట్రానికి రాజధాని అయింది.

ఆ తర్వాత భాషా ప్రాతిపదికన కొత్త రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్ ఊపందుకుంది. తెలంగాణను ఆంధ్రాలో కలపాలని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేయడం ప్రారంభించారు. తెలుగు మాట్లాడే వారందరికీ సొంత రాష్ట్రం ఉండాలన్నది వారి వాదన. కాని తెలంగాణ ప్రజలు ఈ డిమాండ్‌ను వ్యతిరేకించారు. తెలంగాణకు తనదైన ప్రత్యేక సంస్కృతి, ప్రత్యేక మాండలికం ఉందన్నారు. ఈ ప్రాంతానికి ప్రత్యేకమైన సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయని, కాబట్టి ఈ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని వాదించారు. కొత్త రాష్ట్రాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రధానమంత్రి నెహ్రూ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌కు ఛైర్మన్ జస్టిస్ ఫజల్ అలీ. ఈ కమిషన్ పలు సిఫార్సులు చేసింది. ఈ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రధానమంత్రి నెహ్రూ మాత్రం తెలుగు భాషను ప్రాతిపదికగా చేసుకుని ఆంధ్ర, తెలంగాణలను కలిపి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1 నవంబర్ 1956న

ఆవిర్భవించింది. దీంతో హైదరాబాద్ రాష్ట్ర అస్తిత్వానికి తెరపడింది. హైదరాబాద్ నగరం కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అయింది. కానీ తెలంగాణ ప్రజలు విలీనాన్ని అంగీకరించలేకపోయారు. ఆంధ్రా, తెలంగాణా ప్రాంత ప్రజల మధ్య విభేదాలను నివారించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఇరు ప్రాంతాల నాయకుల మధ్య ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దానికి 'పెద్దమనుషుల ఒప్పందం' అని పేరు పెట్టారు. ఈ ఒప్పందం ప్రకారం తెలంగాణలో స్థానిక పౌరుల హక్కుల పరిరక్షణకు నిబంధనలు రూపొందించారు. ఈ నిబంధనలకు 'ముల్కీ చట్టం' అని పేరు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడే సమయంలో ప్రభుత్వ ఆదాయంలో ఎంత భాగాన్ని ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు ఖర్చు చేయాలో కూడా నిర్ణయించారు.

హైదరాబాద్ రాష్ట్రంలోని కన్నడ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలు మైసూర్ రాష్ట్రంలో విలీనమయ్యాయి. మరాఠీ ప్రాబల్యం ఉన్న జిల్లాలు బొంబాయి రాష్ట్రంలో విలీనమయ్యాయి. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 23 జిల్లాలు వచ్చాయి, అందులో 10 తెలంగాణకు చెందినవి. 9 జిల్లాలు ఆంధ్రాకు, 4 రాయలసీమకు చెందినవి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రజలు తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఆంధ్రా ప్రజలు రాజకీయంగా ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యమంత్రి పదవి ఆంధ్రా ప్రాంతాలకు చెందిన పదవిగా మిగిలిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి. ఆ తర్వాత రెండవ ముఖ్యమంత్రిగా దళిత నాయకుడు దామోదరం సంజీవయ్య అయ్యారు. ఆ తర్వాత నీలం సంజీవరెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. సంజీవరెడ్డి తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఆంధ్రా వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలంగాణ నేతలు ఆరోపించారు. తెలంగాణలో కూడా ఆంధ్రా వాళ్లనే నియమిస్తున్నారని మాటలు వినిపించాయి. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందనే భావన పెరుగుతూ పోయింది. ఆదాయంలో ఎక్కువ భాగం ఆంధ్రాలో ఖర్చు చేస్తున్నారని, ఆ ప్రాంతం నదీ జలాలతో ప్రయోజనం పొందుతోందని

ఆగ్రహిస్తూ తెలంగాణ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగేలా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నది విద్యార్థుల డిమాండ్. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఆందోళన హింసాత్మక రూపం దాల్చింది. ఈ ఉద్యమంలో తెలంగాణ విద్యార్థులు ముందున్నారు. ఆ ఉద్యమానికి ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా మారింది. రోజురోజుకు పెరుగుతున్న ఆందోళనలను అణిచివేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ప్రయోగించడం ప్రారంభించింది. విద్యార్థులను అదుపు చేసేందుకు పలుచోట్ల పోలీసులు లాఠీచార్జి చేశారు. కానీ ఉద్యమం తీవ్రమైంది. పలుచోట్ల ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు కూడా జరిపారు. పోలీసుల కాల్పుల్లో పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడ్డారు. తెలంగాణాలో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను నియంత్రించేందుకు కేంద్రం జోక్యం చేసుకోవలసి వచ్చింది. ముల్కీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని ప్రధాని ఇందిరాగాంధీ హామీ ఇచ్చారు. ఈ ప్రకటన తర్వాత ఉద్యమం కాస్త సద్దుమణిగింది కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉధృతంగా సాగింది.

1971లో ఆంధ్రా విద్యార్థులు తమకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ ప్రత్యేక ఆంధ్రా కావాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు రాజకీయ నాయకులు, మేధావుల నుంచి మద్దతు లభించడం మొదలైంది. 1972లో విద్యార్థులతో ఉద్యమం మొదలైంది. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ  ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా మారింది.

ఈ ఉద్యమ జ్వాల ఆంధ్రా ప్రాంతంలోని మెడికల్ కాలేజీలకు కూడా వ్యాపించింది.  ఉద్యమంలో విద్యార్థుల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటంతో వైద్య విద్యార్థులు కూడా అందులో భాగస్వాములు కావాల్సి వచ్చింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర కళాశాల వైద్య విద్యార్థులు కూడా 'జై ఆంధ్ర' ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో విద్యా కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌కు మద్దతుగా శ్యామా ప్రసాద్ కూడా ప్రదర్శనల్లో పాల్గొనడం ప్రారంభించారు. శ్రీనివాసులురెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, కాకాని వెంకటరత్నం వంటి ప్రముఖ నాయకులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

గౌతు లచ్చన్న సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు. రైతుల హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. ఆంధ్రాలో వెనుకబడిన కులాలకు అతిపెద్ద నాయకుడిగా కూడా గుర్తింపు పొందారు. విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో తెన్నేటి విశ్వనాథం కీలక పాత్ర పోషించారు. విప్లవ నాయకుల నాయకత్వం కారణంగా 'జై ఆంధ్రా' ఉద్యమానికి విస్తృత ప్రజాభిమానం లభించింది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు జై ఆంధ్ర ఉద్యమానికి సంబంధించిన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని తమ ఇళ్లకు చేరుకునేవారు. కానీ శ్యామా ప్రసాద్ మనసు ఇంటికి తిరిగి రావడానికి నిరాకరించింది. మెడిసిన్ చదువులు ఆగిపోయినందుకు మనసు బాధపడింది. సమయం వృథా అవుతూ ఉండేది. శ్యామా ప్రసాద్ తన ఎంబిబిఎస్ కోర్సు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు చికిత్స చేయడం ప్రారంభించాలని కోరుకున్నాడు. జై ఆంధ్ర ఉద్యమం కారణంగా ఆయన కోరిక సాకారం కావడంలో జాప్యం ఏర్పడసాగింది.

ఒక రోజు సాయంత్రం తిరుపతి వీధుల్లో భక్తి గీతాలు వింటూ శ్యామా ప్రసాద్ నడవసాగాడు. ఆ శాస్త్రీయ సంగీత గానం వినసొంపుగా ఉండటంతో అది ఎటు వైపు నుంచి వస్తుందో ఆ దిశగా శ్యామా ప్రసాద్ అడుగులు పడ్డాయి. అలా నడుస్తూ నడుస్తూ శ్యామా ప్రసాద్ త్యాగరాజ మండపం చేరుకున్నాడు. అక్కడ భక్తి సంగీత కార్యక్రమం జరుగుతోంది. ఒక కళాకారుడు అన్నమయ్య గేయాలను ఆలపిస్తున్నాడు. ఆ సంగీత విద్వాంసుని స్వరం మనోహరంగా ఉంది. శ్యామా ప్రసాద్ ప్రేక్షకుల మధ్యలో కూర్చుని భక్తి సంగీతాన్ని ఆస్వాదించడం ప్రారంభించాడు.

కార్యక్రమం ముగిసిన తర్వాత శ్యామా ప్రసాద్ ఇంటికి తిరిగి వచ్చాడు. కానీ ఆ మధురమైన స్వరప్రభావం అతని మనసుపై అలాగే ఉండిపోయింది. అన్నమయ్య భక్తిగీతాలు శ్యామా ప్రసాద్ పై అద్భుత ప్రభావాన్ని చూపాయి.

అది మొదలు శ్యామా ప్రసాద్ ప్రతిరోజు సాయంత్రం త్యాగరాజ మండపానికి వెళ్లి భక్తి సంగీతాన్ని ఆస్వాదించడం ప్రారంభించాడు. ఆ రోజుల్లో ప్రతిరోజు సాయంత్రం ఆడిటోరియంలో భక్తి-సంగీత కార్యక్రమాలు

నిర్వహించేవారు. దక్షిణ భారతదేశానికి చెందిన ప్రఖ్యాత కళాకారులు అక్కడ ప్రదర్శనలు ఇచ్చేవారు. ఒక సాయంత్రం శ్యామా ప్రసాద్ ప్రఖ్యాత విదుషీమణి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ఆత్మీయ స్వరం వినిపించింది. సుబ్బులక్ష్మి తన గాన నైపుణ్యంతో ప్రేక్షకులందరినీ మంత్రముగ్ధులను చేశారు. సుబ్బులక్ష్మి ఆ రోజుల్లో భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కళాకారిణి. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారు కూడా ఆమె స్వరానికి తన్మయం చెందారు. దేశంలోనే కాదు ప్రపంచం నలుమూలలా ఆమెకు అభిమానులు ఉన్నారు. సుబ్బులక్ష్మి తన కోకిల స్వరంతో కోట్లాది మందిని అభిమానులుగా మార్చుకున్నారు. లతా మంగేష్కర్ వంటి ప్రముఖ కళాకారులు ఆమెను 'తపస్విని' అని పిలిచారు. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో ప్రముఖ కళాకారుడు ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ సుబ్బులక్ష్మికి 'సుస్వరలక్ష్మి' బిరుదునిచ్చారు. సుబ్బులక్ష్మి కార్యక్రమం ఉందంటే ఆడిటోరియం సంగీత ప్రియులతో కిక్కిరిసిపోయేది.

ఆ సుమధుర గాత్రం శ్యామా ప్రసాద్ పై ఎంత ప్రభావం చూపిందంటే అతను సంగీత విద్యార్థిగా మారాడు. శాస్త్రీయ సంగీతపు సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. భారతీయ శాస్త్రీయ సంగీతంపై శ్యామా ప్రసాద్‌కు రోజురోజుకూ ఆసక్తి పెరగసాగింది. ప్రతీ రోజు ఒక గొప్ప కళాకారుడి సంగీతాన్ని వింటూ శ్యామా ప్రసాద్ ఆనంద డోలికల్లో తేలియాడసాగారు.

శాస్త్రీయ సంగీతంలోని మూడు విభాగాలు – గానం, వాద్యం, నృత్యంలోని సూక్ష్మ నైపుణ్యాలను శ్యామా ప్రసాద్ అర్థం చేసుకోవడం ప్రారంభించాడు. శ్యామా ప్రసాద్ తండ్రి సుందరయ్య కూడా మెడిసిన్ చదువుతున్నప్పుడు సంగీతం వైపు ఆకర్షితులయ్యారు. వైద్య కళాశాలలో చదువుతున్నప్పుడు సుందరయ్య సంగీతం నేర్చుకోవడం ప్రారంభించాడు. కొన్ని వాయిద్యాలు వాయించడం కూడా నేర్చుకున్నాడు. సంగీత విద్వాంసుడు కావాలని శ్యామా ప్రసాద్ అనుకోలేదు. కాని, వైద్య కళాశాలలో చదువుకునే రోజుల్లో సంగీతం గురించి పూర్తిగా తెలుసుకోవాలని భావించాడు. కళాకారుల మధురమైన గాత్రాలు ఒలలాడిస్తున్న సమయంలోనే అటు జై ఆంధ్రా ఉద్యమం తీవ్రరూపం

దాల్చింది. రాష్ట్రవ్యాప్తంగా హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలు ఉగ్రరూపం దాల్చాయి. ఉద్యమాన్ని నియంత్రించేందుకు పోలీసు బలగాలను ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఒత్తిడి చేసింది. ఉద్యమాన్ని అణిచివేయాలనే లక్ష్యంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి చేయడం ప్రారంభించారు. దాంతో విద్యార్థులు రెచ్చిపోయారు. ఉద్యమం మరింత హింసాత్మకంగా మారింది. పలుచోట్ల ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కాల్పుల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. కొందరు విద్యార్థులు ప్రాణాలు కూడా కోల్పోయారు. కానీ ఉద్యమం ఆగలేదు.

1969లో తెలంగాణ ఉద్యమం ఎలా జరిగిందో ఆంధ్రాలో కూడా అదే జరిగింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య చిచ్చురేగింది. జై ఆంధ్రా ఉద్యమం మొదలైన వెంటనే ఈ విద్వేషం తారాస్థాయికి చేరుకుంది. ఇప్పుడు రెండు వైపుల నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన డిమాండ్ మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌ను రెండు ప్రత్యేక రాష్ట్రాలుగా విభజించాలనే డిమాండును అంగీకరిస్తే, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇదే డిమాండు తలెత్తవచ్చని ప్రధాని ఇందిరాగాంధీ అనుమానించారు. కొత్త రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌ను ప్రధాని ఇందిరా గాంధీ తిరస్కరించారు. కొత్త రాష్ట్రాల ఏర్పాటు ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇందిరా గాంధీ ఆదేశించారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లని విద్యార్థులను విద్యాసంస్థ నుంచి బహిష్కరిస్తున్నట్లు డిక్రీ జారీ చేశారు. ఆందోళనలో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశించారు. అంతే కాదు ఆందోళనకు దిగిన నాయకులు, వారికి మద్దతిచ్చిన ప్రజలను జైల్లో పెట్టారు. ఇరుప్రాంతాల రాజకీయ నాయకులు, మేధావులకు అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇందిరాగాంధీ సూచించారు. ప్రధాని నుంచి అలాంటి ఆదేశాలు రావడంతో చర్చల పర్వం మొదలైంది. ఉద్యమం ఆగింది.

పాఠశాలలు, కళాశాలలు మళ్లీ ప్రారంభమయ్యాయి. జనజీవనం సాధారణమైంది. శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో విద్యా కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాయి. శ్యామా ప్రసాద్ కూడా కాలేజీకి వెళ్లడం మొదలు పెట్టాడు.

ఫౌండేషన్ కోర్సు పూర్తయ్యాక ఎంబిబిఎస్ కోర్సు చదువులు మొదలయ్యాయి. వైద్య విద్యార్థులకు మొదటి సంవత్సరంలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ గురించి బోధన ఉంటుంది. అనాటమీ అన్నది వైద్య విద్యలో కీలకమైన భాగం. శరీర నిర్మాణాన్ని తెలియజేసే విభాగం. కదిలే జీవులు, కదలని జీవుల నిర్మాణం గురించి ఇది సవివరంగా వివరిస్తుంది. వృక్షజాతులు, జీవ జంతుజాలం అంతా కూడా ఇందులో భాగమే. మానవ శరీర నిర్మాణ శాస్త్ర అధ్యయనం ఆచరణాత్మక దృక్కోణం నుంచి చాలా కీలకమైనది. శరీర నిర్మాణ శాస్త్రాన్ని వైద్యులు అనేక విధాలుగా అధ్యయనం చేయాలి. రూపం, స్థితి, పరిమాణం, ఇతర నిర్మాణాలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని వైద్య విద్యార్థులు నేర్చుకోవాలి. ఈ జ్ఞానం పెంచుకోవడానికి పిండశాస్త్రం, జీవశాస్త్రం, ఫైలోజెనెటిక్స్, హిస్టాలజీ అధ్యయనం అవసరం. మానవ శరీరపు వివరణాత్మక జ్ఞానం కలిగి ఉండటం వలన వ్యాది నిర్ధారణ ప్రభావవంతంగా చేసి చక్కని చికిత్స అందించడానికి వీలు కలుగుతుంది. అందువల్ల, ఈ శాస్త్రం మనిషి ఆరోగ్యం, జీవిత నిర్వహణకు చాలా ముఖ్యమైనది. మానవ శరీర నిర్మాణ శాస్త్రం మానవ శరీర అధ్యయనంపై దృష్టి పెడుతుంది. చికిత్సా శాస్త్రంలో దీన్ని ప్రాథమిక అంశంగా పరిగణిస్తారు.

చాలా మంది వైద్య విద్యార్థులు అనాటమీని అత్యంత క్లిష్టమైన సబ్జెక్ట్‌గా భావిస్తారు. శ్యామా ప్రసాద్‌కు కూడా శరీర నిర్మాణ శాస్త్ర అధ్యయనం చాలా కష్టంగా మారింది. శ్యామా ప్రసాద్‌కు ప్రాక్టికల్‌లో ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. కాని థియరీలో వెనుకబడి పోయేవాడు. అనాటమీ లాబొరేటరీ అని పేరు వినగానే ఉలిక్కిపడే విద్యార్థులు చాలా మంది ఉంటారు. అదంటేనే చాలా మందికి చెమటలు పడుతుంటాయి. ప్రయోగశాలలో ఉండే మానవ మృతదేహాన్ని చూడగానే చాలా మందికి కళ్లు తిరిగేవి. వికారంతో కొందరు వాంతులు కూడా చేసుకునేవారు. మానవశరీరాన్ని విడదీసి, అవయవాలను వివరించినప్పుడు కొంతమంది విద్యార్థులు స్పృహ తప్పి పడిపోతుంటారు. కానీ శ్యామా ప్రసాద్‌కు అనాటమీ ల్యాబొరేటరీలో ఎప్పుడూ ఎలాంటి సమస్య రాలేదు. మృతదేహాలను విడదీయడం శ్యామా ప్రసాద్‌కు ఏనాడు ఇబ్బంది అనిపించలేదు. వాంతులు చేసుకోవడం, తల తిరగడం వంటి సమస్యలు

ఎదురవ్వలేదు. అవకాశం లభించినప్పుడు శ్యామా ప్రసాద్ స్వయంగా మృతదేహాన్ని చీల్చి ఆ అవయవాల గురించి వివరించేవాడు.

కానీ పుస్తకాలలోని విషయాలు గుర్తుంచుకోవడం శ్యామా ప్రసాద్‌కు కష్టంగా ఉండేది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా పాఠ్యపుస్తకాల్లోని విషయాలు బుర్రకు ఎక్కకపోయేవి. వైద్యవిద్యా సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది. ఒక సబ్జెక్టు చదివినప్పుడు, మరొకటి మర్చిపోవడం సాధారణం. శరీర నిర్మాణ శాస్త్రం– అనాటమీ సబ్జెక్టు శ్యామా ప్రసాద్‌ను కలవరానికి గురిచేసేది. ఇంటర్మీడియట్ తొలినాళ్లలో ఎలాంటి ఆలోచనలు వచ్చాయో, మళ్లీ అలాంటి ఆలోచనలు రావడం మొదలయ్యాయి. ఏం చేసినా అనాటమీ మీద శ్యామా ప్రసాద్ పట్టు సాధించలేకపోయాడు. మానవ శరీరంతో ముడిపడి ఉన్న వివిధ కణాలు, కణజాలాలు, ఆ వ్యవస్థల గుర్తుంచుకోవడం అతనికి అసాధ్యంగా మారింది.

ఎంబిబిఎస్ డిగ్రీ పొందాలంటే అన్ని సబ్జెక్టుల్లో పాస్ అవడం తప్పనిసరి. మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు అనాటమీ పరీక్షలో పాస్ కాలేనని శ్యామా ప్రసాద్ భావించాడు. శ్యామా ప్రసాద్ మనసులో అనాటమీ ఒక భయం సృష్టించింది. కాని, అనాటమీ పేరు వింటేనే వణికిపోయే విద్యార్థులు ఎందరో ఉంటారు.

ఎంబిబిఎస్ సిలబస్‌కు సంబంధించి చాలా పుస్తకాలు ఉన్నాయి. ఆ పుస్తకాల్లో రాసిన విషయాలను సమీకరించుకోవడం చాలా ముఖ్యం. మంచి వైద్యుడు కావాలంటే మనిషి శరీర నిర్మాణాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం తప్పనిసరని ప్రొఫెసర్లు స్పష్టంగా చెప్తారు. మంచి డాక్టర్ కావాలంటే అనాటమీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే కాదు, విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. మానవ శరీరం వివిధ నిర్మాణాలతో కూడిన ఒక సంక్లిష్ట వ్యవస్థ. కణాలు, కణజాలాలు, అనేక సమ్మేళనాలతో ఇది రూపుదిద్దుకుంటుంది. వాటి కలయికతో మానవ శరీరం రూపదాల్చుతుంది.

రసాయనిక పరిభాషలో మానవ శరీరం వివిధ జీవ రసాయనాల క్రియాత్మక రూపం, దానిలో వివిధ మూలకాల అణువులు సమ్మేళనాల రూపంలో పనిచేస్తూ జీవసంబంధ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. ఈ మూలకాలు ప్రధానంగా

కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్, భాస్వరం, సల్ఫర్ కలిగి ఉంటాయి. శరీరంలోని అతి చిన్నరూపం కణం. మానవ శరీరం అసంఖ్యాక కణాలతో రూపొందించబడుతుంది. కణాల నుంచి కణజాలాలు ఉత్పన్నమవుతాయి. వివిధ అవయవాలు, శరీర వ్యవస్థలు ఏర్పడతాయి. ఇవి రక్త ప్రసరణ, శ్వాసక్రియ, జీర్ణక్రియ, శోషణ, విసర్జన క్రియలవంటి నిర్దిష్ట విధులు సంయుక్తంగా నిర్వహిస్తాయి.

మంచి డాక్టరు కావాలని ప్రతిజ్ఞ చేసిన వ్యక్తి శ్యామా ప్రసాద్ ఆ దిశగా అన్ని ప్రయత్నాలను చేయసాగాడు. ఉదయం, సాయంత్రం పుస్తకాలతో కుస్తీ పట్టేవాడు. అనాటమీ పరీక్షలో విజయం సాధించాలనే పట్టుదలతో తన అభిరుచులన్నీ పక్కన పెట్టాడు. ఏకాగ్రతతో చదవడం మొదలుపెట్టాడు.

ఎముకలు, కండరాలు, నరాలు, ధమనులు, సిరలు, కొవ్వు, కణజాలం, చర్మం, అంతర్గత అవయవాలతో కూడిన ఒక సంక్లిష్టమైన రూపం మానవ శరీరం. ఈ నిర్మాణాలన్నింటినీ అధ్యయనం చేసే శాస్త్రం శరీర నిర్మాణ శాస్త్రం– అనాటమీ.

అంతర్గత ఇంద్రియాలు సహా మానవ శరీరంలోని వివిధ అవయవాల కార్యకలాపాలను అధ్యయనం చేస్తుంది ఫిజియాలజీ. ఇందులో భాగంగా వైద్య విద్యార్థులకు శరీరంలోని వివిధ అవయవాలు ఏం పని చేస్తాయి, ఎలా పని చేస్తాయనే విషయాల గురించి చెబుతారు. మొదటి సంవత్సరంలో వైద్య విద్యార్థులు బయోకెమిస్ట్రీ కూడా చదవాలి. బయోకెమిస్ట్రీ అంటే జీవరసాయనం. మొక్కలు, జంతువుల జీవ ప్రక్రియలతో వ్యవహరించే రసాయన శాస్త్రంలోని ఒక విభాగం. శ్యామా ప్రసాద్‌కు సబ్జెక్టులపరంగా ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీతో ఎటువంటి సమస్య లేదు కానీ అనాటమీ మాత్రం కొరకరాని కొయ్యగా నిలిచింది.

అనాటమీ బోధించే ప్రొఫెసర్ పేరు విశ్వనాథం. ఆయన ఎంతో అనుభవం కలిగిన సమర్థుడైన ఉపాధ్యాయుడు. సుందరయ్యకు నేర్పించింది కూడా ఆయనే. ఇప్పుడు ఆయనే సుందరయ్య కొడుకుకి కూడా నేర్పిస్తున్నాడు. విశ్వనాథం రూపంలో గొప్ప గురువు దొరికినప్పటికీ అనాటమీపై పట్టు సాదించడం శ్యామా ప్రసాద్‌కు కష్టంగా అనిపించింది.

పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ శ్యామా ప్రసాద్‌కు ఆందోళన ఎక్కువైంది. అనాటమీ పుస్తకాలు తెరవగానే చెమటలు పట్టేవి. ఎన్నిసార్లు చదివినా ఏది గుర్తు ఉండటం లేదు.

అనాటమీ పరీక్షల్లో గట్టెక్కడం కష్టమనే భావన శ్యామా ప్రసాద్‌లో స్థిరపడింది. ఈ భయంతో ఒంటరిగా ఏడవడం మొదలుపెట్టాడు. రెండు కళ్లనుండి కన్నీటి ధారలు ప్రవహించాయి. మగవాడు కావడం వలన ఇతరుల ముందు ఏడ్వలేకపోయాడు. తన బాధను తనలోనే ఉంచుకోవాలనుకున్నాడు. తాను పడుతున్న సమస్య గురించి తల్లిదండ్రులకు చెబితే వాళ్లు చాలా బాధపడతారని ఆవేదనకు గురయ్యాడు. శ్యామా ప్రసాద్ మంచి తెలివితేటలు కలిగిన చురుకైన విద్యార్థి అని అతని తల్లిదండ్రులు భావించారు. కష్టపడి చదువుతాడనే భావన వారిలో ఉంది. అన్ని పరీక్షల్లో విజయం సాధించినట్టుగానే మెడిసిన్‌లోనూ రాణిస్తాడనే గట్టి నమ్మకం వారిలో ఉంది. అలాంటిది అనాటమీ గురించి తండ్రికి తెలిస్తే బాధపడతారనే అనుమానం శ్యామా ప్రసాద్‌లో తలెత్తింది. అంతే కాదు, తన సమస్యను స్నేహితులకు చెప్పేందుకు కూడా శ్యామా ప్రసాద్ ఇష్టపడలేదు. తెలిస్తే స్నేహితులు కొందరు ఎగతాళి చేస్తారనే భయం ఏర్పడింది.

తన వైఫల్యం కారణంగా తన తండ్రి సుందరయ్య అపఖ్యాతి పాలవుతారనే భయం కూడా శ్యామా ప్రసాద్‌కు ఏర్పడింది. తాను పరీక్షలో ఫెయిల్ అయితే చాలా మంది తన తండ్రి గురించి తప్పుగా మాట్లాడతారని, ఆ కారణంగా ఆయనకు చెడ్డ పేరు వస్తుందనే భయం కూడా కలిగింది.

సుందరయ్య మంచి ప్రజాదరణ పొందిన ప్రసిద్ధ డాక్టరు. శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఆయన గురించి తెలియని వారు ఉండరు. ఆయన సామర్థ్యం ప్రతీ ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తుంది. సుందరయ్యది విశిష్టమైన వ్యక్తిత్వం అందరినీ ప్రోత్సహించే తత్వం. అందరికీ ఆయన సాయపడుతూ ఉంటారు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం చూపెడతారనే పేరు ఆయనకు ఉంది. చాలా స్నేహపూర్వకంగా, సహాయకారిగా ఉంటార. వైద్య శాస్త్రంలో ఆయన ఎంతో ప్రావీణ్యం సంపాదించారు. అంతటి వ్యక్తి కొడుకు, మెడిసిన్ పరీక్షలో ఫెయిల్

అయితే ఆ విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతుంది. అనేక మంది అనేక ప్రశ్నలు లేవనెత్తుతారని శ్యామా ప్రసాద్ అభిప్రాయపడ్డారు. వైద్య విజ్ఞానాన్ని ప్రజలకు అందించిన వ్యక్తి తన కొడుకుకు సరైన విద్యను అందించలేకపోయారని చెడ్డపేరు వస్తుందని శ్యామా ప్రసాద్ ఆందోళన చెందాడు. నిందలు వేసే వారు చాలా మంది ఉంటారనే విషయం ఆయనకు అర్థమైంది. యోగ్యత లేని కొడుకు తండ్రి పేరును చెడగొట్టాడని నిందలు వినాల్సి వస్తుందని ఆతను తీవ్ర నిరాశకు గురయ్యాడు.

సుందరయ్య ఎంతో అనుభవం కలిగిన డాక్టరు. కొడుకు ప్రవర్తనలో వచ్చిన మార్పు ఆయన ఇట్టే పసిగట్టారు. ఏదో తప్పు జరిగిందనే విషయం ఆయనకు అర్థమైంది. కొడుకు ప్రవర్తనపై ఆయన ఓ కన్నేసి ఉంచారు. ఏదో తీవ్రమైన విషయంతో కొడుకు మదనపడుతున్నాడని ఆయన గ్రహించారు. కొడుకులో డిప్రెషన్ సంకేతాలను ఆయన గుర్తించారు. కొడుకు పరిస్థితి చూసి డాక్టరు సుందరయ్య కూడా భయపడ్డారు. పరీక్షలు సమీపిస్తున్నవేళ కొడుకు డిప్రెషన్‌లో కూరుకుపోతుండటం ఆయన జీర్ణించుకోలేకపోయారు. కొడుకుతో మాట్లాడి విషయం తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఆ రోజు రానే వచ్చింది. పరీక్షలు దగ్గరపడ్డాయి, ప్రిపరేషన్ ఎలా సాగుతోందని ఒక రోజు శ్యామా ప్రసాద్‌ను తండ్రి సుందరయ్య అడిగారు. శ్యామా ప్రసాద్ ఏనాడూ తండ్రితో ఏ విషయాన్ని దాచలేదు. వాస్తవానికి తండ్రే శ్యామా ప్రసాద్ ఆదర్శం. సబ్జెక్టు పరంగా తనకు ఎదురవుతున్న సమస్యను తండ్రి ముందు ఏకరువు పెట్టాడు. బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ విషయంలో బాగానే ఉంది. కాని, అనాటమీ కష్టంగా మారిందని తండ్రికి వివరించాడు. ఏం చదివినా, ఎంత చదివినా గుర్తుకు ఉండటం లేదని, పరీక్షలో పాస్ కాలేననే భయం ఉందని శ్యామా ప్రసాద్ తండ్రికి తెలిపాడు.

వైద్య విద్యార్థుల మనస్తత్వం ఎలా ఉంటుందో గుర్తెరిగిన సుందరయ్యకు కొడుకు సమస్య అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

కొడుకులో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. అనాటమీ కష్టమైన సబ్జెక్టు అని నాకు తెలుసు. చాలా విషయాలు గుర్తుంచుకోవాలి. అలాగే ప్రతీది

గుర్తుంచుకోవడం అంత సులభమేమి కాదు. నీకు గుర్తున్నంత వరకు రాయి. పరీక్షకు భయపడకు. ఆందోళనకు గురవడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు, ఇది భయపడాల్సిన సమయం కాదని, పరీక్షకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాల్సిన సమయమని కొడుకుకు ధైర్యం నూరిపోయారు.

తండ్రి చెప్పిన మాటలేవీ శ్యామా ప్రసాద్ పై పెద్దగా ప్రభావం చూపలేదు. అనాటమీ ఎగ్జామ్‌లో గట్టెక్కడం అంత సులభమైన విషయం కాదని శ్యామా ప్రసాద్‌కు బాగా తెలుసు. అతనే కాదు, అనాటమీ పరీక్షలో పాసవడం కష్టమని భావించే విద్యార్థులు అనేక మంది ఉన్నారు. ఒక సంవత్సరం కోల్పోయేందుకు శ్యామా ప్రసాద్ మానసికంగా సిద్ధమయ్యాడు.

ఎంబిబిఎస్ కోర్సులో మొదటి సంవత్సరం అత్యంత ముఖ్యమైనది. సెకండియర్‌లోకి రావాలంటే ఫస్ట్ ఇయర్లో అన్ని సబ్జెక్టులు పాస్ కావాల్సిందే. ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయినా మొదటి సంవత్సరం సిలబస్‌ని మళ్లీ చదవాలి. అది పాస్ కాకుండా సెకండియర్లోకి ప్రవేశించలేరు. రెండో సంవత్సరంలో అడుగుపెట్టాలంటే అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ పరీక్షల్లో ఖచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. మొదటి సంవత్సరం పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులను 'రెఫర్డ్ స్టూడెంట్స్' అంటారు. ఈ విద్యార్థులు మొదటి సంవత్సరం సిలబస్ మళ్లీ చదవాలి. మొదటి సంవత్సరం కోర్సులోని అన్ని సబ్జెక్టుల్లో పాసయ్యేంత వరకు రెండో సంవత్సరం తరగతులకు హాజరు కావడానికి అనుమతి ఉండదు.

ఆ రోజుల్లో ప్రతి మెడికల్ కాలేజీలో ప్రతి సంవత్సరం చాలా మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యేవారు. వారందరిని రెఫర్డ్ అనేవారు. వైద్య కళాశాలల్లో 'రెఫర్డ్' అన్నది మామూలు విషయం.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్ రాగానే చాలా మంది విద్యార్థులు చదువు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం సాధారణం. మెడికల్ కాలేజీలో సీటు వచ్చిందంటే డాక్టరు అవడం ఖాయమనే భావన వారిలో ఏర్పడుతుంది. తాము ఎంతో తెలివైనవాళ్లం కాబట్టే మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందామనే భావనలో వారుంటారు. ఇప్పటి వరకు అన్ని పరీక్షల్లో విజయం సాధించిన తమకు మెడిసిన్ పరీక్షలో పాసవడం పెద్ద విషయమేమి కాదనే చాలా మంది

విద్యార్థులు అనుకుంటారు. చాలా మంది వైద్య విద్యార్థులు పరీక్షల్లో వచ్చిన మార్కుల శాతాన్ని పట్టించుకోరు. పాసైతే చాలు అనే భావన చాలా మందిలో ఉంటుంది. డాక్టర్ కావాలంటే ఎంబిబిఎస్ డిగ్రీ తప్పనిసరి. ఎంబిబిఎస్ పట్టా పొందిన వ్యక్తి ప్రజలకు చికిత్స చేయడానికి అర్హులు. అల్లోపతి వైద్యం చేయాలంటే వారు ఎంబిబిఎస్ డిగ్రీ కలిగి ఉండాలి. ఆ డాక్టరు ఎంబిబిఎస్ పరీక్షల్లో ఫస్ట్ డివిజన్ మార్కులు సాధించారా? థర్డ్ డివిజన్ మార్కులు సాధించారా? అన్నది రోగులు పట్టించుకోరు. అందుకే చాలా మంది మెడిసిన్ స్టూడెంట్స్ పరీక్షల్లో పాసైతే చాలు అని అనుకుంటారు. మార్కులు, ర్యాంకుల గురించి ఆలోచన చేయరు. కానీ చదువులు ముందుకు సాగుతున్న కొద్దీ పరీక్షలో విజయం సాధించడం అంత సులభం కాదనే విషయం వారికి అవగతమవుతుంది. అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ, మూడు సబ్జెక్టులలో భారీ సిలబస్ ఉంటుంది. పరీక్షలకు ముందు పుస్తకాలు తెరిస్తే వాటిని అర్థం చేసుకోవడం అసాధ్యం. తప్పుడు మూల్యాంకనం, నిర్లక్ష్యం కారణంగా చాలా మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలో ఫెయిలై ఒక సంవత్సరం నష్టపోతుంటారు.

ఆ రోజుల్లో చాలా మంది విద్యార్థులు తెలుగు మీడియం చదివేవారు. ఫౌండేషన్ కోర్సు పూర్తయ్యాక మెడిసిన్ సబ్జెక్టులు మొదలుపెట్టినా కష్టమైన సబ్జెక్టుతో పాటు మరెన్నో కొత్త పదాలు పరిచయం కావడం వల్ల సబ్జెక్టులపై పట్టు సాధించలేకపోయేవారు. ఇంగ్లీష్ పై సరైన అవగాహన ఏర్పరచుకోకపోవడం వలన చాలా మంది విద్యార్థులు పరీక్షలు తప్పేవారు.

ఫస్ట్ ఇయర్ మళ్లీ చదవక తప్పదని శ్యామా ప్రసాద్ తోటి విద్యార్థులు చాలా మంది భావించారు.

తండ్రి సలహాను అనుసరించిన శ్యామా ప్రసాద్, పరీక్షకు సిద్ధమయ్యాడు. ఎక్కడా లోపం లేకుండా ప్రయత్నం చేసాడు. అయినప్పటికీ పరీక్ష తేదీ దగ్గరపడుతున్న కొద్దీ శ్యామా ప్రసాద్‌లో అందోళన తీవ్రమయ్యింది. పగలు, రాత్రి తేడా లేకుండా చదివినా ఆత్మవిశ్వాసం పెరగలేదు. మనస్సులోని భయాలు తొలగిపోలేదు. కుమారుడి ఆందోళనను అర్థం చేసుకున్న సుందరయ్య, అనుక్షణం అతన్ని కనిపెట్టుకుంటూ వచ్చాడు.

అనాటమీ పరీక్ష రోజున శ్యామా ప్రసాద్ ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్ తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సైకిల్ తీసుకుని పరీక్షా కేంద్రం వైపు వెళ్లడం ప్రారంభించాడు. ఇంటి నుంచి కొంచెం దూరం వెళ్లగానే వెనుక తండ్రి కారులో వచ్చారు. సైకిల్ అక్కడ పెట్టి కారులో రమ్మని కుమారుడికి చెప్పారు. తండ్రి చెప్పినట్టుగానే శ్యామా ప్రసాద్ సైకిల్ జాగ్రత్తగా పక్కన పెట్టి కారులో కూర్చున్నాడు. కుమారుడిని సుందరయ్య స్వయంగా పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. కారు పార్కు చేసి కుమారుడిని పరీక్షా హాల్లోకి తీసుకెళ్తూ, భయపడకు, నీకు తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయి అని కొడుకు భుజం తట్టి ధైర్యం చెప్పి రోగులకు వైద్యం చేసేందుకు ఆస్పత్రికి వెళ్లారు.

పరీక్ష మొదలైంది. కొశ్చన్ పేపర్ చూడగానే శ్యామా ప్రసాద్ ఆందోళనలన్నీ తొలగిపోయాయి. అతనికి సమాధానాలు తెలిసిన అనేక ప్రశ్నలు అందులో ఉన్నాయి. ఆ ప్రశ్నలన్నింటికీ శ్యామా ప్రసాద్ సమాధానాలు రాశాడు. అవన్నీ ఒకసారి చూసుకున్న తర్వాత, ఆ పరీక్షలో ఖచ్చితంగా పాసవుతాననే నమ్మకం శ్యామా ప్రసాద్‌కు ఏర్పడింది.

అనాటమీ పరీక్ష గురించి మాత్రమే శ్యామా ప్రసాద్ భయపడ్డారు. మిగిలిన బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ గురించి అతనికి పెద్దగా చింత లేదు. ఆ రెండు పరీక్షలు కూడా శ్యామా ప్రసాద్ బాగా రాశాడు.

ఆ పరీక్ష ఫలితాలు రానే వచ్చాయి. అవి చూసిన శ్యామప్రసాద్ ఆనందానికి అవధులు లేవు. అనాటమీ పరీక్షలో పాసవడమే కాదు ఏకంగా ఆ సబ్జెక్టులో మూడో ర్యాంకు సాధించాడు. అతని కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఇద్దరు మాత్రమే. అటు బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ సబ్జెక్టుల్లోనూ శ్యామా ప్రసాద్ అద్భుతమైన మార్కులు సాధించాడు.

ఊహించినట్లుగానే చాలా మంది విద్యార్థులు అనాటమీ పరీక్షలో ఫెయిల్ అయ్యారు. బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ పరీక్షల్లో ఫెయిలైన వారు కూడా ఉన్నారు. మూడు సబ్జెక్టుల్లోనూ ఫెయిల్ అయిన విద్యార్థులు కొందరు ఉన్నారు. ఈ విద్యార్థులందరూ 'రెఫర్డ్' అయ్యారు. వాళ్లంతా ఫస్ట్ ఇయర్ మళ్లీ చదవక తప్పని పరిస్థితి ఏర్పడింది. కొత్త బ్యాచ్ విద్యార్థులతో పాటు మొదటి సంవత్సరం

తరగతులకు మళ్లీ హాజరు కావాల్సి వచ్చింది.

మొదటి సంవత్సరం అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు శ్యామా ప్రసాద్ ముందుకు సాగాడు. ఎంబిబిఎస్ రెండో సంవత్సరంలో వైద్య విద్యార్థులకు పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ గురించిన బోధన ఉంటుంది. సాధారణంగా, విద్యార్థులు రెండో సంవత్సరంలో పెద్దగా ఇబ్బంది పడరు. సబ్జెక్టును వారు సులభంగానే ఆకళింపు చేసుకోగలుగుతారు.

వైద్య శాస్త్రంలో ఒక ముఖ్యమైన విభాగం పాథాలజీ. జబ్బుపడిన వ్యక్తికి చికిత్స చేయాలంటే ముందు ఆ వ్యాధి ఏంటి? దానికి కారణం ఏంటి? అని తెలుసుకోవడం చాలా ముఖ్యం. మనుషులకు సంభవించి వివిధ వ్యాధులను గుర్తించేందుకు చేసే పరీక్షల శాస్త్రాన్ని పాథాలజీ అంటారు. ప్రోటోజోవా, ఆల్గే, బాక్టీరియా, వైరస్‌ల గురించి, అవి ఎలా వ్యాధికారకాలు అవుతాయనే విషయాన్ని విద్యార్థులకు బోధిస్తారు. ఈ శాస్త్రాన్నే మైక్రోబయాలజీ అంటారు. ఈ సూక్ష్మజీవుల కారణంగా మానవ శరీరానికి కలిగే మంచి చెడుల ప్రభావాలను వైద్య విద్యార్థులకు ప్రొఫెసర్లు తెలియజేస్తారు. మనుషులకు వచ్చే వ్యాధులు, వాటి కారణాలు తెలుసుకునేందుకు మైక్రోబయాలజీ సాయపడుతుంది.

మానవ శరీరంపై వివిధ రసాయనాల కలిగించే ప్రభావాన్ని తెలియజేస్తుంది ఫార్మకాలజీ. ప్రాథమికంగా ఈ సైన్స్ విభాగంలో ఔషధాల గురించిన బోధన ఉంటుంది. ఏ వ్యాధి చికిత్స కోసం ఏ మందులు వాడాలో ఇందులో తెలియజేయడం జరుగుతుంది. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో డాక్టర్ క్రిష్ణన్ ఫారెన్సిన్ మెడిసిన్ బోధించేవారు. ఈ సబ్జెక్టులో ఆయన నిష్ణాతుడు. వైద్యవిద్యార్థులు ఫారెన్సిక్ మెడిసిన్ సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకోవాలని ఆలోచించి ఆయన ఒక పుస్తకం రాశారు. ఈ పుస్తకంలో మందులు, వాటి కూర్పు, తయారీ విధానం, వాడే విధానం సులభతరమైన భాషలో వివరించారు. చాలా మంది విద్యార్థులు ఈ పుస్తకం చదివి పరీక్షకు సిద్ధమయ్యేవారు. ఈ 500 పేజీల పుస్తకం కారణంగా డాక్టర్ క్రిష్ణన్ భారతదేశమంతటా ప్రసిద్ధి చెందారు. ఫారెన్సిక్ మెడిసిన్ అర్థం చేసుకోవడంలో ఈ పుస్తకం శ్యామా ప్రసాద్‌కు ఎంతగానో ఉపయోగపడింది.

కాలేజీ ఇంటర్నల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రశ్నపత్రాలను దిద్దిన ఎగ్జామినర్‌కు, శ్యామా ప్రసాద్ రాసిన జవాబులు సంతృప్తి కలిగించాయి. డాక్టర్ క్రిష్ణన్ పుస్తకంలోని ప్రతీ అంశాన్ని శ్యామా ప్రసాద్ బాగా ఆకళింపు చేసుకున్న తీరును గుర్తించారు.

పాథాలజీ ప్రొఫెసర్ పేరు డాక్టర్ శ్యామల. శ్యామా ప్రసాద్ తండ్రి డాక్టర్ సుందరయ్యకు ఆమె సన్నిహిత స్నేహితురాలు. శ్యామా ప్రసాద్ చదువుపై ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు.

డాక్టర్ రామలక్ష్మి వైద్య విద్యార్థులకు మైక్రోబయాలజీ బోధించేవారు. రామలక్ష్మి బోధనా శైలి అద్భుతం. విద్యార్థులకు వచ్చే ప్రతి సందేహాన్ని ఆమె తీర్చేవారు.

ఉత్తమ ఉపాధ్యాయుల నుంచి బోధన అందడంతో రెండో సంవత్సరం పరీక్షలకు శ్యామా ప్రసాద్ బాగా సన్నద్ధమయ్యాడు. బాగా కష్టపడి చదివి సెకండియర్లోనూ చక్కని మార్కులతో పాసయ్యారు. సెకండియర్లోనూ ఆయనకు రెండో ర్యాంకు వచ్చింది.

ఎంబిబిఎస్ కోర్సు మూడవ సంవత్సరంలో విద్యార్థులకు కళ్లు, చెవి, ముక్కు, గొంతు, కమ్యూనిటీ మెడిసిన్ గురించి బోధిస్తారు. శ్యామా ప్రసాద్ ఈ సబ్జెక్టులను శ్రద్ధగా చదువుకున్నాడు. ఆ ఫలితం కూడా అందుకున్నడు. మూడో సంవత్సరం అన్ని పరీక్షల్లోనూ మంచి మార్కులు తెచ్చుకున్నాడు.

ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరంలో విద్యార్థులు మెడిసిన్, శస్త్రచికిత్స, ప్రసూతి, స్త్రీ వ్యాధులు, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, సైకియాట్రీ, రేడియాలజీ గురించి నేర్చుకుంటారు. నాలుగో సంవత్సరం వైద్య విద్యార్థులు బాగా కష్టపడాల్సి ఉంటుంది.

ఆ రోజుల్లో శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో సైకాలజీ సబ్జెక్ట్ డాక్టర్ సుబ్రమణ్యం బోధించేవారు. మనస్తత్వశాస్త్రంలో ఆయన నిపుణుడు. ఆయన బోధనాశైలి ప్రత్యేకంగా ఉండేది. డాక్టర్ సుబ్రహ్మణ్యం ముందుగా విద్యార్థులకు సైకాలజీ ప్రాముఖ్యతను వివరించేవారు. మానవ ప్రవర్తనకు గల కారణాలు అర్థం చేసుకోవడంలో సైకాలజీలోని శాస్త్రీయ సూత్రాలు సహాయపడతాయని

ఆయన చెప్పారు. ఒక కోణంలో మనస్తత్వశాస్త్రం అనేది మానవ ప్రవర్తనకు సంబంధించిన నిజమైన శాస్త్రం. మనస్తత్వశాస్త్రంలో మానవ సంబంధాలు, మానవ స్వభావ అధ్యయనం ఉంటుంది.

మనస్తత్వశాస్త్రం కారణంగా ఒక వ్యక్తి ఏ పరిస్థితులలో ఎలా వ్యవహరిస్తాడో అర్థం చేసుకోవచ్చు. మనస్తత్వశాస్త్రం కారణం సంబంధాలను కనుగొనడం ద్వారా నిర్దిష్ట ప్రవర్తనకు కారణమేంటో కనుగొంటుంది. సైకాలజీ అనేది అనుభవ శాస్త్రం అని డాక్టర్ సుబ్రమణ్యం చెప్పారు. చేతనావస్థలో చేసే పనులను విశ్లేషించడం, వాటి పరస్పర చర్యల స్వరూపం, అలా చేయడానికి దారి తీసే కారణాలను దీని ద్వారా తెలుసుకోవచ్చు.

డాక్టర్ సుబ్రమణ్యం ఉపన్యాసాల ప్రభావంతో చాలా మంది వైద్య విద్యార్థులు సైకియాట్రిస్టులమవుతామని ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ సుబ్రమణ్యం ప్రభావంతో సైకియాట్రిస్టాట్‌గా మారాలని శ్యామా ప్రసాద్ సహచర వైద్యవిద్యార్థులు చంద్రశేఖర్, సాయి కుమార్ రెడ్డి, గౌరీదేవి నిర్ణయించుకున్నారు. సైకియాట్రిస్టులమై మనిషి మనసులో మెదిలే ఆలోచనలకు కారణాలను తెలుసుకుంటామని వీరంతా ప్రతిజ్ఞ చేశారు.

డాక్టర్ వసంతరావు, డాక్టర్ శేషాచారి సర్జరీ ప్రొఫెసర్లు. డాక్టర్ వసంతరావు సుప్రసిద్ధ శస్త్రవైద్యుడు. ఆయన నిర్వహించిన శస్త్ర చికిత్సలతో అనేక మంది తిరిగి ప్రాణం పొందారు. శరీరంలోని కణితులు తొలగించి ఎంతో మందికి ఆయన కొత్త జీవితాన్ని ప్రసాదించారు. జనరల్ సర్జన్ కాబట్టి డాక్టర్ వసంత్ రావు అనేక రకాల సర్జరీలు చేసేవారు.

డాక్టర్ వసంత్ రావు గారు విద్యార్థులతో పదే పదే ఒక మాట గట్టిగా చెప్పేవారు. రోగిని భౌతికంగా పరిశీలన చేసేటప్పుడు తప్పనిసరిగా వారి దుస్తులు తొలగించాలని చెప్పేవారు. దుస్తులతోనే రోగిని పరీక్షించినట్టు అయితే బట్టలలోనే పరీక్షించినట్లయితే వ్యాధి లక్షణాలను ఖచ్చితంగా గుర్తించలేమని ఆయన చెప్పేవారు.

అంతే కాదు బాధ్యతలు నిర్వర్తించే సమయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, భయపడవద్దని వైద్యవిద్యార్థులకు డాక్టర్ వసంతరావు

ఉద్బోధిస్తుండేవారు. దుస్తుల తొలగింపునకు సంబంధించిన తనకెదురైన ఒక అనుభవాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు. ఒక స్త్రీకి ఛాతీలో కణితి ఉందనుకోండి, దుస్తులతోనే ఆమెను పరీక్షించినట్లు అయితే కణిచి ఉన్న విషయాన్ని గుర్తించలేం. దుస్తులపై స్టెతస్కోప్ కూడా సరిగా పనిచేయదు. శరీరంలోని సాధారణ, అసాధారణ శబ్దాలు గుర్తించడానికి దుస్తులు తీసేసిన తర్వాతే రోగిపై స్టెతస్కోప్ ఉంచి పరీక్షించాలని ఆయన చెప్పేవారు. స్త్రీని తల్లిగానో, చెల్లిగానో భావించినప్పుడు బాధ్యతలు నిర్వర్తించడంలో ఎలాంటి ఇబ్బంది, సంకోచం ఉండదని తెలియజేసేవారు.

సుందరయ్యకు అత్యంత ప్రియమైన మిత్రుల్లో ఒకరు డాక్టర్ శేషాచారి. ఆయన గొప్ప ప్రొఫెసర్. రోగులకు ఎలా చికిత్స చేయాలో విద్యార్థులకు నేర్పించారు. రోగులు, వారి కుటుంబాలకు మంచి వైద్యం అందించేవారు. వ్యాధిని గుర్తించేందుకు రోగిని చాలా ప్రశ్నలు అడిగేవారు. మాట్లాడే కొద్ది నిమిషాల్లోనే ఆయన రోగి నమ్మకాన్ని పొందుతారు. సర్జరీ చేయించుకునేందుకు భయపడే రోగులను ఇతర డాక్టర్లు డాక్టర్ శేషాచారి దగ్గరకు పంపించేవారు.

సర్జరీ శిక్షణలో భాగంగా ఆ ప్రక్రియను చూసేందుకు, అర్థం చేసుకునేందుకు వైద్య విద్యార్థులకు ఆపరేషన్ థియేటర్ సందర్శించే అవకాశం లభిస్తుంది. తొలినాళ్లలోనే ఆపరేషన్ థియేటర్ సందర్శించే అవకాశం శ్యామా ప్రసాద్‌కు లభించింది. ప్రతీ రోజు ఆపరేషన్ థియేటర్‌కి వెళ్లడం మొదలుపెట్టాడు.

ఓ రోజు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి శస్త్ర చికిత్స నిర్వహించబోతుండగా ఆపరేషన్ థియేటరుకు చేరుకున్నాడు. శ్యామా ప్రసాద్, అతని వెంట వచ్చిన మరో సహచర వైద్యవిద్యార్థి ఉమామహేశ్వరరావును చూసిన డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మీరిద్దరూ చాలా చిన్నవారు. ఆపరేషన్ థియేటర్ నుంచి బయటికు వెళ్లండి. పుస్తకాలు చదవండి. వయస్సు వచ్చాక ఆపరేషన్ థియేటర్‌కి రండి అని అన్నారు.

అది విన్న శ్యామా ప్రసాద్, డాక్టర్ సార్, మేము ఇంతకు ముందు ఆపరేషన్ థియేటర్‌కు వచ్చాము. "మేము దేనికీ భయపడము. మేము శస్త్రచికిత్స చేయడం నేర్చుకోవాలనుకుంటున్నాము" అని అన్నాడు.

ఆత్మవిశ్వాసంతో శ్యామా ప్రసాద్ చెప్పిన మాటలు విన్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఇంప్రెస్ అయ్యారు. ఆపరేషన్ థియేటర్‌లోకి వచ్చేందుకు అనుమతించారు.

శ్యామా ప్రసాద్, ఉమామహేశ్వర్‌లు మాత్రమే ఆపరేషన్ థియేటర్‌కు క్రమం తప్పకుండా వెళ్లడం ప్రారంభించారు. మిగిలిన విద్యార్థులు ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లడం తప్పనిసరి అని చెప్పినప్పుడు మాత్రమే వెళ్లేవారు. కానీ శ్యామా ప్రసాద్, ఉమామహేశ్వర్ ఆపరేషన్ థియేటర్లో సర్జరీ విధానాన్ని చూసి నేర్చుకోవడంప్రారంభించారు.

అపెండిసైటిస్ ఆపరేషన్ చేస్తున్న సర్జన్‌ని చూసి శ్యామా ప్రసాద్‌కు సర్జరీపై ఆసక్తి ఏర్పడింది. అపెండిసైటిస్ ఆపరేషన్‌ను అపెండెక్టమీ అంటారు. ఈ శస్త్రచికిత్సలో వ్యాధి సోకిన అపెండిక్స్ భాగాన్ని శరీరం నుంచి తొలగిస్తారు. అపెండిక్స్ అనేది ఒక సన్నని చిన్న గొట్టం, ఇది రెండు నుంచి మూడు అంగుళాల పొడవు ఉంటుంది. మలం ఏర్పడే పెద్ద పేగుకు ఈ అపెండిక్స్ జోడించబడి ఉంటుంది. కొన్నిసార్లు అపెండిక్స్‌కు ఇన్ఫెక్షన్ సోకుతుంది, దీనివల్ల అది ఉబ్బుతుంది. దాని వలన రోగి ఉదరం కుడి దిగువ భాగంలో తీవ్రమైన నొప్పి, జ్వరం, ఆకలి లేకపోవడం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అపెండిక్స్ పొత్తికడుపు లోపల పగిలితే, వ్యాధి మరింత తీవ్రమవుతుంది. కొన్ని సందర్భాల్లో అది ప్రాణాంతకం కూడా అవుతుంది. అపెండెక్టమీ అనేది అపెండిక్స్ నొప్పిని తగ్గించడానికి చేసే శస్త్రచికిత్స. ఈ ప్రక్రియలో పొత్తికడుపులో ఒక కోత కోసి  దాని ద్వారా వైద్యుడు ఆ జాయింట్ తొలగించి, ఆపై పొత్తికడుపులో కుట్లు వేస్తాడు. అపెండిసైటిస్ సోకినప్పుడు ఆ భాగాన్ని శరీరం నుంచి తొలగించడం చాలా ముఖ్యం. ఈ కారణంగా అపెండిక్స్ ఇన్ఫెక్షన్ ఎమర్జెన్సీగా పరిగణించబడుతుంది. ఎమర్జెన్సీ పరిస్థితిలో శరీరంలో నుంచి అపెండిక్స్‌ను సర్జన్లు తొలగించే తీరు శ్యామా ప్రసాద్‌ను ఆకట్టుకుంది.

వైద్యరంగంలో సర్జన్లదే అత్యున్నత స్థానమని భావించే రోజులవి. వైద్యుల్లో రెండు రకాలు ఉంటారు. ఒకరు క్లినికల్, మరొకరు సర్జికల్. క్లినికల్ వైద్యులు రోగులకు మందులతో చికిత్స చేస్తారు. సర్జన్లు శస్త్రచికిత్స చేస్తారు.

ఆ రోజుల్లో సర్జన్లను భారతదేశంలో హీరోలుగా పరిగణించేవారు. దృఢమైన చిత్తం, అచంచలమైన మనస్సు ఉన్న వైద్యులు మాత్రమే సర్జన్లు కాగలరని

ప్రజలు నమ్మేవారు. క్లినికల్ డాక్టరుగా ఉండటం చాలా సులభం, కానీ సర్జన్‌గా మారడం కష్టం. ఆ రోజుల్లో చాలా మంది యువతులు కూడా సర్జన్లు అంటే పడిచచ్చేవారు. శ్యామా ప్రసాద్ తండ్రి సుందరయ్య సర్జన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇవన్నింటిని చూసిన శ్యామా ప్రసాద్ సర్జన్‌గా స్థిరపడాలని నిర్ణయించుకున్నాడు.

శ్యామా ప్రసాద్ ప్రసూతి–గైనకాలజీ విభాగంలో పనిచేస్తున్నప్పుడు చాలా నేర్చుకున్నాడు. డాక్టర్ పి.ఎస్. సావిత్రి ఆ విభాగాధిపతి. కష్టపడే స్వభావం, అంకితభావం కలిగిన శ్యామా ప్రసాద్ అంటే ఆమెకు చాలా ఇష్టం. శ్యామా ప్రసాద్ తన బ్యాచ్‌లో అత్యంత శ్రద్ధగల వైద్యవిద్యార్థి. ఆయనలా ఆసుపత్రిలో గడిపిన వారు ఎవరూ లేరు. ఆస్పత్రిలో, ఆపరేషన్ థియేటర్లో పగలు రాత్రి పని చేసేందుకు శ్యామా ప్రసాద్ సిద్ధంగా ఉండేవాడు.

ఆ రోజుల్లో ఎంబిబిఎస్ విద్యార్థులకు ప్రసూతి గదిలో ప్రసవ ప్రక్రియ చూసే అవకాశం ఒకట్రెండుసార్లు మాత్రమే లభించేది. యోని పరీక్షలు చేసే అవకాశాలు కూడా విద్యార్థులకు తక్కువ ఉండేవి. కానీ డాక్టర్ సావిత్రి, శ్యామా ప్రసాద్‌కు యోని పరీక్షలు నిర్వహించేందుకు అనేక అవకాశాలు ఇచ్చారు. అది మాత్రమే కాదు, చాలా మందికి ప్రసవ సమయంలో సాయమదించే అవకాశాన్ని కూడా కల్పించారు.

వైద్యులు పురుషులైనా, స్త్రీ అయినా ప్రసవ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సావిత్రి అనేవారు. ప్రతి వైద్యుడు విజయవంతంగా ప్రసవం చేయగలగాలి. వైద్యులు గ్రామాల్లో పని చేయాల్సి ఉంటుంది. చాలా చోట్ల మహిళా డాక్టర్లు అందుబాటులో ఉండరు. అలాంటి సమయాల్లో పురుష డాక్టర్లే ప్రసవాలు చేయాల్సి ఉంటుందని అనేవారు.

శ్యామా ప్రసాద్‌కు అబార్షన్ చేసే విధానాలను డాక్టర్ సావిత్రి నేర్పించారు. ఆ రోజుల్లో అవాంఛిత గర్భం తొలగించుకునేందుకు మహిళలు ప్రభుత్వాసుపత్రికి వచ్చేవారు. అప్పట్లో ప్రైవేటు ఆసుపత్రులు తక్కువ. గర్భస్రావానికి సంబంధించిన చట్టాలు అప్పట్లో ఇప్పుడున్నంత కఠినంగా లేవు. మెడికల్ అబార్షన్ చేసే బాధ్యత డాక్టర్ సావిత్రిపై ఉండేది. కొన్నిసార్లు ఒక రోజులో నాలుగైదు ఐదు వైద్య గర్భస్రావాలు చేయవలసి ఉంటుంది. ఆ కారణంగా ఆమె

మెడికల్ అబార్షన్లలో శ్యామా ప్రసాద్ సహాయం తీసుకోవడం ప్రారంభించారు. శ్యామా ప్రసాద్ సొంతంగా మెడికల్ అబార్షన్ చేయగలడని నిర్ధారణకు వచ్చిన తర్వాత అబార్షన్ బాధ్యతలు డాక్టర్ సావిత్రి అతనికే అప్పగించింది. శ్యామా ప్రసాద్‌కు ఒకదాని తర్వాత ఒకటిగా మెడికల్ అబార్షన్లు చేయడం మొదలుపెట్టాడు. ఒక్కోసారి కేసుల సంఖ్య పెరిగిపోయి గంటల తరబడి ఆపరేషన్ థియేటర్లో గడపాల్సి వచ్చేది. ఈ సమయంలో వారికి తినడానికి, త్రాగడానికి ఏమీ ఉండేవి కావు. పని చేయాలనే తపన ఉండటం, అనుభవం ద్వారా ప్రావీణ్యం సంపాదించాలనే కోరిక ఉండటంతో శ్యామా ప్రసాద్ ఆపరేషన్ థియేటర్లో గంటల తరబడి పనిచేసేవాడు.

నేత్ర వైద్య విభాగంలో పనిచేస్తూ అక్కడ అనేక విషయాలను శ్యామా ప్రసాద్ నేర్చుకున్నాడు. నేత్ర వైద్యులు కాకూడదని నిర్ణయించుకున్న వైద్య విద్యార్థులు సాధారణంగా నేత్ర వైద్య విభాగంలో ఎక్కువ సమయం గడపరు. అలాంటి విద్యార్థులు కేవలం ఫార్మాలిటీలు పూర్తి చేస్తారు. కానీ శ్యామా ప్రసాద్ మాత్రం అందుకు భిన్నం. నేర్చుకోవాలనే తపన అతనిలో పెరుగుతూనే ఉంది. నేర్చుకోవాలనే తపన మనిషిని రాణింపజేస్తుందని తండ్రి సుందరయ్య చాలా సార్లు చెప్పారు. నేర్చుకునే ప్రక్రియ అన్నది ఎప్పుడూ ఆగకూడదు.

ముక్కు, చెవి, గొంతు విభాగంలో శ్యామా ప్రసాద్ సమయాన్ని వృథా చేయలేదు. ఇక్కడ కూడా ఆయన ఆపరేషన్ థియేటర్లో ఎక్కువ సమయం గడిపి, శస్త్రచికిత్స ద్వారా ముక్కు, చెవి, గొంతుకు సంబంధించిన వ్యాధులను ఎలా గుర్తించాలో తెలుసుకున్నాడు.

అందరినీ ఆశ్చర్యపరిచే విషయమేంటంటే డెంటిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు కూడా వెళ్లి శ్యామా ప్రసాద్ నేర్చుకోవడం. ఎంబిబిఎస్ విద్యార్థులు దంత విభాగంలోనే అతి తక్కువ సమయం వెచ్చిస్తారు. శ్యామా ప్రసాద్ లోని నేర్చుకోవాలనే తపన చూసి ఆ విభాగం ప్రొఫెసర్లు కూడా ముగ్ధులయ్యారు. కొద్దిరోజుల్లోనే శ్యామా ప్రసాద్ దంతాల ఆపరేషన్ నేర్చుకున్నాడు.

ఆర్థోపెడిక్స్ విభాగంలో అత్యంత ప్రత్యేకమైన, మరపురాని అనుభవాలను శ్యామా ప్రసాద్ పొందారు. ఈ విభాగంలో తన తండ్రి అంటే డా.సుందరయ్య తన గురువుగా మారారు.

డాక్టర్ సుందరయ్య గొప్ప ప్రొఫెసర్. ఎముకలు, వాటి వ్యాధుల గురించి వైద్య విద్యార్థులకు బోధించేవారు. ఆ వ్యాధులను గుర్తించే మార్గాలను ఆయన విద్యార్థులకు వివరిస్తారు. విరిగిన ఎముకలను శస్త్రచికిత్స ద్వారా సరిచేయడంలో సుందరయ్య నిపుణుడు. శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో బోధించడమే కాకుండా ఇతర వైద్య విద్యా సంస్థలకు వెళ్లి ఆర్థోపెడిక్ వ్యాధుల నిర్ధారణ గురించి వైద్యులకు తెలియజేసేవారు.

సుందరయ్య తన పెద్ద కొడుకు శ్యామా ప్రసాద్‌కు చాలా విషయాలు నేర్పారు. జీవితాన్ని సఫలం చేసుకునేందుకు అవసరమైన సూత్రాలు తెలిపారు. ఏది తప్పో, ఏది ఒప్పో అని వివరించారు. కష్టసమయాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. జీవితంలో ప్రతి పరీక్షను ఎదుర్కొనే ధైర్యాన్ని ఇచ్చారు.

ఈ పాఠాలన్నీ శ్యామా ప్రసాద్ ఇంట్లోనే నేర్చుకున్నాడు. కానీ ఇప్పుడు కాలేజీలో తండ్రి దగ్గర నేర్చుకోవాల్సిన సమయం వచ్చింది. ఇంట్లో సుందరయ్య కొడుకు శ్యామా ప్రసాద్. కానీ కాలేజీలో మాత్రం  అతను మిగతా విద్యార్థుల్లాగే విద్యార్థి. సుందరయ్యకు విద్యార్థులంతా సమానమే. తన కొడుకునని చెప్పి ఇతర విద్యార్థుల నుంచి అతనిని వేరు చేయలేదు. ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఉంటూ సుందరయ్య కళాశాలలో ఇతర విద్యార్థులతో ఎలా వ్యవహరించారో అదే విధంగా తన కుమారుడిని చూసుకున్నారు. క్లాస్ రూంలో తనకు పాఠాలు నేర్పుతోందని తన తండ్రి చెప్పే విషయాన్ని శ్యామా ప్రసాద్ కూడా మర్చిపోయాడు. కాలేజీలో సుందరయ్య, శ్యామా ప్రసాద్‌లది గురుశిష్యుల అనుబంధం.

శ్యామా ప్రసాద్ తన తండ్రి సుందరయ్య జ్ఞానంతో బాగా ప్రభావితమయ్యాడు. తన తండ్రి చాలా గొప్ప సర్జన్ మాత్రమే కాదు ఒక మహోన్నతమైన ఉపాధ్యాయుడు కూడా అని భావించాడు.

తన కుమారుడు చురుకైన వాడనే విషయాన్ని డాక్టరు సుందరయ్య గుర్తించారు. మిగిలిన విద్యార్థులతో పోల్చితే చదువులపై అధిక శ్రద్ధ చూపుతాడనే విషయాన్ని ఆయన గ్రహించారు. సుందరయ్య, శ్యామా ప్రసాద్ ఒకరి సామర్థ్యాన్ని చూసి మరొకరు గర్వపడటం ప్రారంభించారు. తన కొడుకు

విజయ శిఖరాలు అధిరోహిస్తాడనే నమ్మకం సుందరయ్యకు ఉంది. అదే సమయంలో తన తండ్రిలా పేరు తెచ్చుకోవాలంటే మరింత కష్టపడాలనే విషయాన్ని శ్యామా ప్రసాద్ గుర్తించారు.

శ్యామా ప్రసాద్ మెడిసిన్, డెర్మటాలజీ వంటి అన్ని విభాగాలలో ఇతర విద్యార్థుల కంటే ఎక్కువ సమయం గడిపాడు. సాధారణంగా ఎంబిబిఎస్ విద్యార్థులు ఎం.డి., ఎం.ఎస్. వంటి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఫోర్త్ ఇయర్ చదువుతున్న సమయంలోనే సిద్ధమవుతారు. సహచర విద్యార్థుల మాదిరిగానే శ్యామా ప్రసాద్ కూడా ఆ ప్రవేశ పరీక్షలకు ప్రిపరేషన్‌లో నిమగ్నమయ్యాడు. “బాబూ నువ్వు నాలాగే ఆర్థోపెడిక్ సర్జన్ అవుతావా?” అని సందరయ్య తన కొడుకు శ్యామా ప్రసాద్‌ను అడిగాడు.

ఈ ప్రశ్నకు శ్యామా ప్రసాద్ బదులిస్తూ లేదు నాన్న, “నేను నేను జనరల్ సర్జన్‌ని అవ్వాలనుకుంటున్నాను” అని స్పష్టంగా చెప్పాడు.

ఈ సమాధానం విని సుందరయ్య హృదయం ఆనందంతో నిండిపోయింది. తన కొడుకు సరైన నిర్ణయాలు తీసుకోగల సమర్థుడని గ్రహించారు.

తనను చూసి శ్యామా ప్రసాద్ ఆర్థోపెడిక్ సర్జన్ అవుతాడని సుందరయ్య అనుకున్నారు. కాని, తన కొడుకు తనకంటే ముందే ఆలోచిస్తున్నాడని సుందరయ్యకు అర్థం అయ్యింది.

ఆ సంతోష సమయంలో శ్యామా ప్రసాద్‌కు వివాహం చేయాలనే ఆలోచన డాక్టరు సుందరయ్యకు కలిగింది. పెద్ద కుమారుడు శ్యామా ప్రసాద్ కోసం తగిన వధువును అన్వేషించడం మొదలుపెట్టారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదువుతున్న లక్ష్మీరాజ్యం సరైన జోడీ అని భావించారు. లక్ష్మీరాజ్యం సంపన్నమైన, పేరు ప్రఖ్యాతి కలిగిన కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆమె అందంగానే కాక చదువుల్లోనే చురుకైన విద్యార్థిని. లక్ష్మీరాజ్యం తండ్రి ఒంగోలు నివాసి, ట్రావెల్స్ నిర్వహించేవారు. శ్యామా ప్రసాద్ తల్లికి కూడా లక్ష్మీరాజ్యం నచ్చింది. సంబంధం ఖాయమైంది.

1977 ఆగస్ట్ 20న శ్యామా ప్రసాద్, లక్ష్మీరాజ్యంల వివాహం జరిగింది. వివాహ సమయానికి, లక్ష్మీరాజ్యం తన హౌస్ సర్జన్‌షిప్ పూర్తి చేసింది. శ్యామా

ప్రసాద్ హౌస్ సర్జన్ చేస్తున్నారు. పెళ్లయ్యాక శ్యామా ప్రసాద్ ఇంటికి లక్ష్మీరాజ్యం వచ్చింది. శ్యామా ప్రసాద్ రోజూ ఆసుపత్రికి వెళ్తూ హౌస్ సర్జన్‌గా బిజీగా ఉన్నారు. అదే సమయంలో పీజీ కోర్సు ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అవుతున్నాడు. అటు లక్ష్మీరాజ్యం కూడా ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్నారు.

ఈ సమయంలో అద్భుతమైన మార్కులతో శ్యామా ప్రసాద్ ఎంబిబిఎస్ పట్టా పొందారు. శ్రీ వేంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రి, శ్యామా ప్రసాద్ బోనోఫైడ్ సర్టిఫికెట్పై 'వెరీ గుడ్' అని రాశారు. వెరీ గుడ్ అని సర్టిఫికేట్‌పై పొందే విద్యార్థులు చాలా అరుదుగా ఉంటారు. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో 'వెరీ గుడ్' అని సర్టిఫికేట్ పొందిన మొదటి వైద్య విద్యార్థి శ్యామా ప్రసాద్. ఎంబిబిఎస్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి సర్టిఫికెట్లో 'గుడ్' అని మాత్రమే రాశారు.

కర్నూలులో ప్రవేశ పరీక్ష జరిగింది. భార్యాభర్తలిద్దరూ ప్రవేశ పరీక్ష రాశారు. తొలి ప్రయత్నంలోనే ఇద్దరికీ పీజీ సీటు కన్ఫర్మ్ అయింది. ఎంట్రెన్స్ ఎగ్జామ్ పాసైన ప్రతి అభ్యర్థి పీజీ కోర్సుకు మూడు ఆప్షన్లు ఎంచుకోవాల్సి ఉంటుంది. శ్యామా ప్రసాద్ ఎం.ఎస్. జనరల్ సర్జరీ, ఎం.ఎస్. పీడియాట్రిక్స్, ఎం.ఎస్. ఆర్థోపెడిక్స్ ఆప్షన్‌గా ఎంచుకున్నారు. అటు డాక్టర్ లక్ష్మీరాజ్యం తన మూడు ఆప్షన్‌గా ఎం.డి. గైనకాలజీని ఎంచుకున్నారు

శ్యామా ప్రసాద్, లక్ష్మీరాజ్యం ఎంట్రన్స్ ఎగ్జామ్ అద్భుతంగా రాసారు కాబట్టి ఇద్దరికీ నచ్చిన కోర్సులో అడ్మిషన్ వచ్చింది. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలోనే ఎం.ఎస్. జనరల్ సర్జరీ కోర్సులో చేరే అవకాశం శ్యామా ప్రసాద్‌కు లభించింది. లక్ష్మీరాజ్యంకు కూడా అదే కాలేజీలో ఆబ్జెట్రిక్స్ ఆండ్ గైనకాలజీలో డిప్లొమా సీటు వచ్చింది. ఇద్దరూ పీజీ చదువులు ప్రారంభించారు.

తండ్రి సుందరయ్య, అన్నయ్య శ్యామా ప్రసాద్ నుండి స్ఫూర్తి పొందిన గోపిక్రిష్ణ తాను కూడా డాక్టర్ కావానే దృఢసంకల్పంతో కష్టపడి చదివి ఇంటర్లో మంచి మార్కులు సాధించాడు. అనతంరం జరిగిన ఎంబిబిఎస్ ఎంట్రన్స్‌లో మెరుగైన ర్యాంకు సాదించి అన్న చదివిన శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలోనే సీటు పొందారు. గోపి క్రిష్ణ 1973లో సీటు పొందారు. అనంతరం సుందరయ్య

పెద్ద కుమార్తె మైథిలి, చిన్న కుమార్తె శోభలు సైతం తన తండ్రి, అన్నదమ్ములిద్దరు స్ఫూర్తితో కష్టపడి చదివి ఎంబిబిఎస్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు సాధించి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలోనే సీటు పొందారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు డాక్టర్లు కావడం అరుదైన విషయం. తన వారసత్వాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో తన బిడ్డలంతా డాక్టర్లు చదవడం సుందరయ్య జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చే అంశం.

# అధ్యాయం - 6

# జనరల్ సర్జరీపై తిరుగులేని పట్టు

చాలా మంది ఎంబిబిఎస్ విద్యార్థులు పీజీ కోర్సులకు ప్రిపరేషన్‌తో పాటు యూఎస్‌లో అడ్వాన్స్‌డ్ మెడికల్ కోర్సుల ఎంట్రన్స్ టెస్టులకు సిద్ధమయ్యే సమయం అది. సాధారణంగా విద్యార్థులంతా థర్డ్ లేదా ఫోర్త్ ఇయర్‌లో ప్రిపరేషన్ మొదలుపెడతారు. అమెరికాలో సీటు సంపాదించాలంటే ఆ మాత్రం ముందు చూపు తప్పనిసరి. ఎందుకంటే, అడ్వాన్స్‌డ్ మెడికల్ ట్రైనింగ్ తీసుకోడానికి అమెరికా కంటే మెరుగైన దేశం మరేదీ లేదనేది విద్యార్థుల భావన. అమెరికాలో అత్యుత్తమ వైద్య కళాశాలలు ఉన్నాయని, వైద్య రంగానికి సంబంధించిన వ్యక్తులకు కూడా తెలుసు. అత్యుత్తమ డాక్టర్లు, సర్జన్లు అమెరికాలోనే ఎక్కువగా ఉన్నారు. పైగా యూఎస్‌లో వైద్య విజ్ఞాన రంగంలో ప్రతిరోజూ సరికొత్త ఆవిష్కరణలు జరుగుతూనే ఉంటాయి. అందుకే, అమెరికాలోని అనేక ఆసుపత్రులు అడ్వాన్స్ టెక్నాలజీని కలిగి ఉన్నాయి. మానవ శరీరాన్ని పీడిస్తున్న వివిధ వ్యాధుల నిర్ధారణ కోసం అమెరికాలో అనేక కొత్త యంత్రాలు తయారుచేశారు. యుఎస్‌లో నయం చేయలేని వివిధ వ్యాధులకు చేయాల్సిన ట్రీట్‌మెంట్‌పై పరిశోధనలు కూడా జరుగుతున్నాయి.

విదేశీ విద్యార్థులు ఏదైనా హాస్పిటల్‌లో రెసిడెన్సీ చేయడానికి లేదా ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ పొందడానికి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్‌ల కోసం

ఉద్దేశించిన ఎడ్యుకేషనల్ కమిషన్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. అమెరికాలో అధునాతన వైద్య విద్యను అభ్యసించడానికి శ్యామా ప్రసాద్ కూడా ఈ పరీక్షలో పాస్ కావాలని నిర్ణయించుకున్నారు. ఒకరోజు తన లక్ష్యాన్ని తండ్రికి వివరించారు. తన కోరికను తండ్రి వెంటనే ఒప్పుకుంటాడనేది శ్యామా ప్రసాద్ భావన. కానీ అలా జరగలేదు. నాకు ఉన్నది నువ్వొక్క కొడుకువే కాదు.. మరో కొడుకు, ఇద్దరు కూతుళ్లు కూడా ఉన్నారు. తండ్రిగా నాకు చాలా బాధ్యతలు ఉన్నాయి. నా ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయాలి. ఈరోజుల్లో కూతుళ్లకు పెళ్లిళ్లు చేయడం ఎంత ఖర్చుతో కూడుకున్నదో తెలుసా? యుఎస్‌లో నీ చదువుల ఖర్చులు భరించే స్థితిలో నేను లేను అంటూ సుందరయ్య శ్యామా ప్రసాద్‌తో కరాఖండిగా చెప్పేశారు. సుందరయ్య అక్కడితోనే ఆగలేదు. అందరూ అమెరికా అంటూ వెళ్లిపోతే.. ఇక భారతదేశంలో రోగులకు చికిత్స ఎవరు చేస్తారు? మనం కూడా మనదేశంలో సరికొత్త, అత్యాధునిక వైద్య పద్ధతులను ఆవిష్కరించాలి. వ్యాధుల చికిత్సకు కొత్త పద్ధతులను కనుక్కోవాలి. పరిశోధనలు, ఆవిష్కరణల పరంగా మనం చాలా పురోగతి సాధించాలి. మనం భారతదేశానికి సరికొత్త, అధునాతన సాంకేతికతలను తీసుకురావాలి. దేశభక్తి, మాతృభూమి పట్ల గౌరవం ఉన్న వ్యక్తులు దీన్ని చేయగలరు అంటూ సుందరయ్య తన అభిప్రాయాన్ని శ్యామా ప్రసాద్‌కు చెప్పారు.

1960, 1970 లలో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ల కోసం ఎడ్యుకేషనల్ కమిషన్‌కు ఇండియాలో పరీక్షలు పెట్టేవాళ్లు కాదు. భారతీయ విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాలంటే మనీలా లేదా సింగపూర్ వెళ్లాల్సి వచ్చేది. ప్రయాణానికి, తిండికి, బసకు దాదాపు లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. ఆ రోజుల్లో లక్ష అంటే చాలా పెద్ద మొత్తంగానే పరిగణించేవారు. లక్ష రూపాయలు అంటే సుందరయ్య ఏడాదంతా సంపాదించే ఆదాయంతో సమానం. సుందరయ్యకు తన మిగతా పిల్లల చదువుల ఖర్చులు కూడా భరించాల్సిన బాధ్యత ఉండడంతో శ్యామా ప్రసాద్ కోసం అంత ఖర్చు భరించేందుకు సిద్ధపడలేదు.

తాను అమెరికాలో చదువుకోవాలనుకుంటున్నాననే కోరికను శ్యామా ప్రసాద్ తన భార్యకు చెప్పారు. అప్పటికే, తన భర్త చదువు కోసం మామగారిని లక్ష

రూపాయలు అడిగారని, అంత పెద్ద మొత్తం ఖర్చు చేయలేనని చెప్పిన విషయం తెలుసుకున్న లక్ష్మి. తన పుట్టింటి వారిని సాయం అడగాలని అనుకున్నారు. కానీ శ్యామా ప్రసాద్ తన అత్తమామల నుంచి సహాయం తీసుకోవడానికి నిరాకరించారు. స్వతహాగానే శ్యామా ప్రసాద్‌కు ఆత్మాభిమానం, ఆత్మగౌరవం ఎక్కువ. తండ్రి తప్ప ఎవరి దగ్గరా ఆర్థిక సహాయం తీసుకోరు. అతని తండ్రే సర్వస్వం. అందుకే, చాలా విషయాల్లో శ్యామా ప్రసాద్ తన తండ్రిపై ఆధారపడ్డారు. పైగా తన ప్రతి నిర్ణయాన్ని తండ్రికి తెలియజేసేవారు. తండ్రిని సంప్రదించకుండా, తండ్రికి చెప్పకుండా పెద్ద నిర్ణయాలు తీసుకోరు. శ్యామా ప్రసాద్ అత్తమామలు సంపన్నులు, చాలా ఆస్తులు ఉన్నాయి. డాక్టర్ చదవాలనుకుంటున్న తన అల్లుడికి వారు మరో ఆఫర్ ఇచ్చారు. శ్యామా ప్రసాద్ ఎంబిబిఎస్ చదివి ఒంగోలులో స్థిరపడాలనేది మామగారి కోరిక. అతని కోసం నర్సింగ్ హోం కూడా నిర్మించాలనుకున్నారు. తన కూతురు, అల్లుడు ఒంగోలులో స్థిరపడితే, ఇక్కడే ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తారనేది ఆయన ఆశ. కానీ శ్యామా ప్రసాద్ ఆ ఆఫర్ ఒప్పుకోలేదు. అతను పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, తన కాళ్లపై తాను నిలబడాలని, స్వయంగా ఎదగాలని అనుకున్నారు.

శ్యామా ప్రసాద్‌కి సర్జరీ సబ్జెక్ట్ అంటే చాలా ఇష్టం. తండ్రి సుందరయ్య ప్రభావం వల్ల సర్జరీపై ఇష్టం ఏర్పడింది. అందుకే, పీజీ కోర్సు ప్రారంభమైనప్పటి నుంచే శ్యామా ప్రసాద్ ఆపరేషన్ థియేటర్‌కి వెళ్లడం, సర్జరీ పద్ధతులను నేర్చుకోవడం ప్రారంభించారు. సర్జన్ కావాలంటే కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే సరిపోదని అతనికి తెలుసు. ఒక మంచి సర్జన్ అవ్వాలంటే.. ఎన్నో ఆపరేషన్లు చేసిన అనుభవం కావాలి. ఎన్ని సర్జరీలు చేస్తే అంత నైపుణ్యం వస్తుంది.

మాస్టర్ ఆఫ్ సర్జరీ, డాక్టర్ ఆఫ్ మెడిసిన్ రెండూ పీజీకోర్సులే. ఈ రెండు కోర్సుల్లోనూ విద్యార్థులకు వివిధ వ్యాధుల చికిత్సల గురించి చెబుతారు. మాస్టర్ ఆఫ్ సర్జరీ కోర్సులో సర్జరీ ద్వారా జబ్బులకు ఎలా చికిత్స చేయాలో, ఎండీ కోర్సులో రోగులకు మందులతో ఎలా చికిత్స చేయాలో నేర్పిస్తారు. MS డిగ్రీ ఉన్న వైద్యుడిని సర్జన్ అని, MD డిగ్రీ ఉన్న వైద్యుడిని ఫిజిషియన్ అని పిలుస్తారు. సాధారణంగా ఫిజిషియన్ సర్జన్‌గా పని చేయలేరు. కానీ ఔషధాల

గురించి తెలిసిన సర్జన్.. అటు ఫిజిషియన్‌గానూ చేయొచ్చు. రోగులకు చికిత్స చేయడానికి ఫిజిషియన్స్ ఎటువంటి సర్జరీ టూల్స్ వాడరు. అయితే సర్జన్లు మాత్రం చికిత్స చేయడానికి అనేక రకాల పరికరాలను ఉపయోగించాల్సి ఉంటుంది. మాస్టర్ ఆఫ్ సర్జరీ, డాక్టర్ ఆఫ్ మెడిసిన్ కోర్సుల వ్యవధి మూడేళ్లు. ఈ కోర్సు చదువుతున్న సమయంలో రీసెర్చ్ కూడా చేయాల్సి ఉంటుంది. రాత పరీక్ష, వైవా పరీక్షలకు హాజరుకావాలి. ఒక వైద్య విద్యార్థి మంచి వైద్యుడిగా మారాలంటే ఎంతోమంది రోగులను బాగుచేయడానికి సమయాన్ని కేటాయించాలి. మంచి సర్జన్ కావాలంటే ఆపరేషన్ థియేటర్‌లో ఎక్కువ సమయం గడపాలి. సుందరయ్య మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉండడంతో కాలేజీ అధికారులు ఆయనకు బంగ్లా కేటాయించారు. ఆ బంగ్లా మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో ఉండేది. కాలేజీకి, హాస్పిటల్‌కి దగ్గరలోనే నివాసం ఉండడంతో శ్యామా ప్రసాద్‌కి హాస్పిటల్‌లోనూ, మెడికల్ కాలేజీలోనూ గడిపేందుకు చాలా సమయం దొరికింది. శ్యామా ప్రసాద్ ఎంఎస్ కోర్సులో అడ్మిషన్ తీసుకోకముందే, అంటే రెండేళ్ల ముందే శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో పీజీ కోర్సులు ప్రారంభించారు. శ్యామా ప్రసాద్ కోర్స్ మూడో బ్యాచ్‌లో ఉండేవారు. మూడేళ్ల కోర్సు కావడంతో శ్యామా ప్రసాద్‌కు తన సీనియర్లతో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది.

MS కోర్సు చేసే సమయంలో, వివిధ సబ్జెక్టుల విద్యార్థులు ఒక గ్రూపుగా ఏర్పడతారు. ప్రతి గ్రూప్ ఒక నిర్దిష్ట యూనిట్‌లో పనిచేయాలి. అలా మూడో యూనిట్‌లో శ్యామా ప్రసాద్‌కు చోటు దక్కింది. ఈ యూనిట్‌లో ఎం.ఎస్. తృతీయ సంవత్సరం చదువుతున్న రమేష్‌కుమార్, ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాజగోపాల్ ఉన్నారు. ఈ విభాగం ప్రొఫెసర్ శేషాచారి నేతృత్వంలో నడిచేది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యుత్తమ సర్జన్‌లలో ఒకరిగా ప్రొ.శేషాచారి గుర్తింపు పొందారు. పైగా వైద్య విద్యార్థులతో ఎంతో ప్రేమగా ఉంటూ, వారితో ఎక్కువ సమయం గడిపేవారు. విద్యార్థులకు సర్జరీకి సంబంధించిన మెళకువలు నేర్పడమే కాకుండా, సర్జరీల్లో తనకు సహకరించేందుకు కూడా అనుమతించేవారు. ఒక విద్యార్థి తనను తాను సమర్థుడని నిరూపించుకుంటే గనక.. శేషాచారి ఆ విద్యార్థికి స్వయంగా

శస్త్రచికిత్స చేయడానికి అనుమతిచ్చేవారు.

శ్యామా ప్రసాద్ తన మొదటి సంవత్సరంలో చాలా కష్టపడాల్సి వచ్చింది. జూనియర్ విద్యార్థి కావడంతో అతనిపై పనిభారం ఎక్కువగా ఉండేది. రోజూ ఉదయం 7 గంటలకు కాలేజీకి చేరుకోవాలి. కాలేజీకి వెళ్లగానే వార్డుల్లోని రోగులను కలుసుకోవాలి. రోగుల కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడాల్సి ఉంటుంది. వారికి చేయబోయే సర్జరీల గురించి ఉదయం 8 గంటలకే చెప్పేవారు. ఆ తరువాత పీజీ విద్యార్థులు కాలేజీకి వచ్చేవారు. శ్యామా ప్రసాద్ అప్పటి వరకు ఏమేం చేశాడన్నది సీనియర్లు సమీక్షించేవారు. ఏదైనా పొరపాటు జరిగితే వాటిని సరిదిద్దేవారు. అంటే, చేయాల్సిన పనులు అసంపూర్తిగా ఉంటే సీనియర్ విద్యార్థులు ఆ పనులను పూర్తిచేసే బాధ్యత తీసుకునేవారు. సరిగ్గా ఉదయం 9 గంటలకు ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్‌కు చేరుకుంటారు. తన యూనిట్ విద్యార్థులు చేసిన వర్క్ చూసి, ఓ అంచనాకు వస్తారు. ఆ తర్వాత విద్యార్థులను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లే వారు. ఆ తరువాత సమయం మొత్తం ఆపరేషన్ థియేటర్లోనే గడపాల్సి ఉంటుంది. జూనియర్ విద్యార్థికి వారానికి ఒకరోజు మాత్రమే ఆపరేషన్ థియేటర్‌లో పనిచేసే అవకాశం లభించేది. ఇతర రోజులలో క్లాసులో చదువుకోవడం లేదా రీసెర్చ్ చేయడం, ల్యాబ్‌లో ట్రైనింగ్‌కు వెళ్లడం చేయాల్సి ఉంటుంది.

సీనియర్లైన రమేష్ కుమార్, రాజ్‌గోపాల్ నుంచి శ్యామా ప్రసాద్‌కు ఎప్పుడూ సహకారం లభించేది. సీనియర్లు ఇద్దరూ ఎన్నో మైనర్ సర్జరీ విధానాలను నేర్పించారు. ఆపరేషన్ థియేటర్‌లో శ్యామా ప్రసాద్‌కి సర్జరీలు చేస్తూనే చదువు చెప్పేవారు. ఇలా ప్రతి యూనిట్‌లో జూనియర్ విద్యార్థులకు సీనియర్లు బోధిస్తారు. సీనియర్ విద్యార్థులు ఏది నేర్చుకుంటే అది జూనియర్‌లకు నేర్పించేవారు. ఈ జూనియర్లు సీనియర్లు అయినప్పుడు వారు తమ జూనియర్లకు ఆ విషయాలు నేర్పిస్తారు. ఒక యూనిట్‌లోని ప్రతిదీ ప్రొఫెసర్ పర్యవేక్షణలోనే జరుగుతుంది. అలాగే యూనిట్లోని సీనియర్, జూనియర్ విద్యార్థులకు ప్రొఫెసర్ ప్రతి విషయం బోధిస్తారు. మెడికల్ కాలేజీల్లో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. రమేష్ కుమార్, రాజ్‌గోపాల్ ఇద్దరూ అద్భుతమైన సర్జన్లు. రకరకాల సర్జరీలు చేస్తూ ప్రతిరోజు తమ జ్ఞానాన్ని

మరింత పెంచుకునే వారు. శ్యామా ప్రసాద్ కూడా వారికి సర్జరీలలో సహాయం చేస్తూ నేర్చుకునే వారు. అలా సీనియర్లు అతనికి సర్జరీలు చేయడానికి అనేక అవకాశాలు ఇచ్చేవారు. శ్యామా ప్రసాద్ శరీరంపై ఉండే గడ్డలను తొలగించే ప్రక్రియతో సర్జరీలు మొదలుపెట్టారు. నెలరోజుల్లోనే అపెండిక్స్, పైల్స్, హెర్నియాలను తొలగించడానికి సర్జరీలు చేశారు. ఆపరేషన్ థియేటర్‌లో శ్యామా ప్రసాద్ సర్జన్‌లకు సహకరించిన తీరు చూసి ప్రొఫెసర్ శేషాచారి ఆయన్ను మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. శ్యామ్ తనకు ఆస్తి అని ప్రొఫెసర్ తరచుగా చెబుతుండే వారు. అటు శ్యామా ప్రసాద్ కూడా తన ప్రొఫెసర్స్‌ను చూసి ఎప్పుడూ ప్రేరణ పొందుతుండేవారు.

ప్రతి MS విద్యార్థి ఏదో ఒక రీసెర్చ్ సబ్జెక్టును ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ మూడేళ్లలో ఒక్కొక్కరు రీసెర్చ్ పేపర్‌ను ప్రిపేర్ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఎంఎస్ డిగ్రీ చేతికి రావాలంటే రీసెర్చ్ పేపర్ తప్పనిసరి. పైగా రీసెర్చ్ పేపర్ సొంతంగా రూపొందించిందై ఉండాలి. శ్యామా ప్రసాద్ తన పరిశోధనా పత్రానికి 'చేతులు, కాళ్లపై మృదు కణజాల కణితులు' అనే సబ్జెక్ట్ ఎంచుకున్నారు.

1979 తొలినాళ్లలో లక్ష్మి గర్భవతి అయింది. అప్పట్లో శ్యామా ప్రసాద్, లక్ష్మి ఇద్దరూ పీజీ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నారు. గర్భం దాల్చిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలను తీసుకుంటూ లక్ష్మి తన చదువు కొనసాగించింది.

ఆ రోజుల్లో రోగిలోని అనారోగ్య కారణాలను అతనితో మాట్లాడటం ద్వారా గుర్తించడం నిజంగా ఒక కళ. ఎందుకంటే, రోగులు తమ సమస్యల గురించి వైద్యులకు అంత వివరంగా చెప్పరు. వారి జీవనశైలి, వారి అలవాట్ల గురించి రోగులు వైద్యులతో పంచుకోవడానికి ఇష్టపడకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. గ్రామాల్లో చాలా మంది పొగాకు నములుతూ, మద్యం సేవిస్తుంటారు. ధూమపానం, మద్యపానం కారణంగా ఆరోగ్యం క్షీణిస్తుంది. అత్యంత తేలిగ్గా వ్యాధుల బారిన పడుతుంటారు. చాలామంది ఆరోగ్యం విషయంలో బాగా ఆలస్యం అయిన తరువాత ఆసుపత్రికి వెళ్లేవారు. ఆసుపత్రికి చేరిన తర్వాత కూడా డాక్టర్లకు నిజం చెప్పరు. డాక్టర్‌కి నిజం చెప్పడం వల్ల

కుటుంబానికి తెలియకుండా దాచిన రహస్యాలన్నీ బయటపడతాయని భయపడేవారు. ఆసుపత్రికి వెళ్లడం అంటే ప్రపంచం తమ రహస్యాలను బహిర్గతం చేసుకోవడమేనని చాలా మంది నమ్ముతారు. లైంగికంగా సంక్రమించే వ్యాధులతో బాధపడుతున్న రోగులైతే మరింత మొహమాటంతో ఉంటారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులైతే.. మహిళా రోగుల నుంచి చాలా ఇబ్బందులు పడుతుంటారు. మగ వైద్యుల వద్దకు వెళ్లడానికి అవమానంగా భావించి చాలా మంది మహిళలు వెనుకాడతారు. వారు తమ సమస్యల గురించి వైద్యులతో గాని, వారి బంధువులతో గాని చెప్పుకోరు. నిజంగా ఆడవారి ఆరోగ్య సమస్యలు అర్థం చేసుకోవడానికి మహిళా డాక్టర్లు లేదా నర్సుల సహాయం అవసరం. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేఅధికశాతం మంది రోగులు చదువుకోని వారే. అందుకే తమ సమస్యను స్పష్టంగా చెప్పుకోలేకపోతుంటారు.

డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్లు ఎదుర్కొనే మరో సమస్య ఏంటంటే.. ఆసుపత్రుల్లో ఉండే రద్దీ. ఆ రోజుల్లో చాలా తక్కువ ఆసుపత్రులు ఉండడం, వచ్చే రోగులు సైతం సుదూర ప్రాంతాల నుంచి వస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రులు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉండేవి. దీంతో ఒక్కో రోగితో సమయం గడపడం, వారి సమస్యను అర్థం చేసుకోవడం, వారితో మాట్లాడటం పెద్ద సవాలుగా ఉండేది. నిజానికి, సీనియర్లే గాని, ప్రొఫెసర్లే గాని.. వ్యాధికి గల కారణాలపై ఖచ్చితమైన అవగాహన వచ్చే వరకు ప్రతి డాక్టర్ రోగితో మాట్లాడాలని శ్యామా ప్రసాద్‌కు సూచించారు. అనారోగ్యానికి గల కచ్చితమైన కారణాలు, వ్యాధి తీవ్రత, అనర్థాలు, చికిత్సను అర్థం చేసుకోవాలంటే.. వైద్యులు రోగితో మాత్రమే కాకుండా అతని లేదా ఆమె బంధువులతో కూడా మాట్లాడాల్సి ఉంటుంది. కాని, శ్యామా ప్రసాద్, ఇతర వైద్య విద్యార్థులకు ఎదురయ్యే అనుభవం వేరేలా ఉండేది. పైగా రోగులు కూడా నొప్పిగా ఉన్నప్పుడు మాత్రమే ఆసుపత్రికి వస్తారు. దీంతో రోగి గురించి వైద్యుడు మరింత శ్రద్ధ తీసుకోవాల్సి వస్తుంది. ఆసుపత్రిలో ఉన్న ఏ రోగిని డాక్టర్ నిర్లక్ష్యం చేయకూడదన్నది ప్రాథమిక సూత్రం. వైద్యుడు రోగిని చిత్తశుద్ధితో చూడాలి, రోగం నయం అయ్యేలా వైద్యం అందించాలి.

డాక్టర్ అంటే భగవంతుని స్వరూపం అని చాలా మంది అనుకుంటారు. రోగులు కూడా చాలా నమ్మకంతో ఆసుపత్రికి వస్తారు. రోగాల నుంచి వైద్యులు ఉపశమనం కలిగిస్తారని బలంగా నమ్ముతారు. రోగి గనక వైద్యునిపై అంత విశ్వాసాన్ని ప్రదర్శిస్తే, వైద్యుడు కూడా సరైన చికిత్స అందించడానికి అంతే కట్టుబడి ఉంటాడు. డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్లకు, రోగులకు మధ్య విశ్వాసం అనే బంధం ఉండాలని సీనియర్లు, ప్రొఫెసర్లు చెబుతుండే వారు. రోగులతో మంచి ప్రవర్తన అన్నది చాలా ముఖ్యం. ఎందుకంటే, మంచి సంభాషణతో అనారోగ్య సంకేతాలను వైద్యుడు ముందే రోగులకు చెప్పగలడు. అంతేకాదు, మెడికల్ ఎమర్జెన్సీని సైతం తప్పించగలడు. ఒక రోగిలోని సగం సమస్యలను మంచి కౌన్సెలింగ్ ద్వారా తొలగించవచ్చని ప్రొఫెసర్లు వైద్య విద్యార్థులకు బోధిస్తుంటారు. వైద్యుడు ఎల్లప్పుడూ దయ, సానుభూతితో ఉండాలి. ఎందుకంటే, వైద్యుని ప్రవర్తన రోగిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రవర్తన మంచిగా, దయతో ఉంటే, రోగం త్వరగా నయం అవుతుందనే నమ్మకం రోగిలో మొదలవుతుంది. సైకాలజిస్టులు కూడా.. వైద్యుని ప్రవర్తన అనారోగ్యంతో ఉన్న రోగిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని చెబుతుంటారు. మొత్తానికి శ్యామా ప్రసాద్ కాలేజీలో వైద్య పరిజ్ఞానాన్ని పొందడం మాత్రమే కాకుండా తన కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా మెరుగుపరుచుకున్నారు.

రోగులు తనతో చాలా ఓపెన్‌గా మాట్లాడేలా శ్యామా ప్రసాద్ ఒక ప్రత్యేకమైన టెక్నిక్‌ని ఉపయోగించేవారు. అదేంటంటే.. మాట్లాడేందుకు ఇష్టపడని రోగులకు పండ్లు, స్వీట్లు ఇవ్వడం ప్రారంభించారు. వైద్య విద్యార్థుల నుంచి పండ్లు, మిఠాయిలు అందుకోవడం రోగులకు సంతోషాన్ని కలిగించింది. ఈ చర్యతో డాక్టర్లు, వైద్య విద్యార్థులు చాలా మంచి వారని, దయగల వారనే అభిప్రాయం రోగుల్లో ఏర్పడింది. ఆ టెక్నిక్ అద్భుతమైన ప్రభావం చూపించింది. ప్రొఫెసర్లు కూడా శ్యామా ప్రసాద్ చేస్తున్న పనికి సంతోషించేవారు.

రోగులు, వారి బంధువులతో మాట్లాడడం వల్ల శ్యామా ప్రసాద్ మరిన్ని నైపుణ్యాలు పెంచుకున్నారు. ముఖ్యంగా రోగులను సర్జరీకి మానసికంగా సిద్ధం చేసే కళను నేర్చుకున్నారు. శ్యామా ప్రసాద్ పని తీరు ప్రొఫెసర్ శేషాచారిని

విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో అతన్ని కూడా రెగ్యులర్‌గా సర్జరీలకు తీసుకెళ్లడం మొదలుపెట్టారు. క్రమంగా క్రిటికల్ సర్జరీ టీమ్స్‌లోనూ జాయిన్ అయ్యారు. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న రోగులపై ప్రాథమిక విచారణ చేసే బాధ్యతను కూడా ఆయనకు అప్పగించారు.

ఒక సందర్భంలో పరిస్థితి విషమంగా ఉన్న ఓ 35 ఏళ్ల వ్యక్తిని ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో శ్యామా ప్రసాద్ డ్యూటీలో ఉన్నారు. బంధువులను ప్రశ్నించి, యాక్సిడెంట్ అయిందని తెలుసుకుని, ట్రీట్ మెంట్ మొదలుపెట్టారు. ప్రైమరీ ఇన్వెస్టిగేషన్‌లో రోగి ఛాతీ, కడుపులో లోతైన గాయాలు ఉన్నాయని, అక్కడ రక్తస్రావం అవుతోందని గుర్తించారు. రోగి ప్లీహం కూడా తీవ్రంగా గాయపడి రక్తస్రావం అవుతున్నట్లు శ్యామా ప్రసాద్ కనుగొన్నారు. ప్లీహం నుంచి రక్తస్రావం వెంటనే ఆపకపోతే, అది ప్రాణాలకే ప్రమాదం కావచ్చు. శ్యామా ప్రసాద్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రొఫెసర్‌కి పరిస్థితిని తెలియజేశారు. రోగిని పరీక్షించిన ప్రొఫెసర్ అత్యవసర శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించారు. వెంటనే రోగిని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారు. సర్జరీ చేసేటప్పుడు శ్యామా ప్రసాద్ కూడా అక్కడే ఉన్నారు. డాక్టర్ శేషాచారి ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రమేష్ కుమార్‌కు సర్జరీ చేసే బాధ్యత అప్పగించారు. ఇది చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. అది మామూలు ఆపరేషన్ కాదు. చాలా క్లిష్టమైన ఆపరేషన్. ఒక నిమిషం ఆలస్యం చేసినా, ఏదైనా పొరపాటు జరిగినా ప్రాణం మిగలదు. కానీ శేషాచారికి తన విద్యార్థిపై పూర్తి విశ్వాసం ఉండేది. రమేష్ కుమార్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో సర్జరీ ప్రారంభించారు. ముందుగా, ఆ వ్యక్తి శరీరం నుంచి గాయపడిన ప్లీహాన్ని వేరుచేశాడు. దీంతో రక్తస్రావం ఆగిపోయి రోగి ప్రాణాలు నిలబడ్డాయి.

18 సంవత్సరాలు నిండిన వ్యక్తి నుంచి ప్లీహం తీసేసినంత మాత్రాన అది శరీరంపై పెద్దగా ప్రభావం చూపదు. శరీర రోగనిరోధక వ్యవస్థను రక్షించడమే ప్లీహం చేసే పని. లింఫోసైట్లు అని పిలువబడే తెల్ల రక్త కణాలు ఈ ప్లీహములోనే ఉత్పత్తి అవుతాయి. లింఫోసైట్లు వివిధ వ్యాధులను కలిగించే ఫారెన్ బాడీలకు వ్యతిరేకంగా రక్షణ వ్యవస్థను ఏర్పరుస్తాయి. లింఫోసైట్లు దెబ్బతిన్న రక్త

కణాలను వేరు చేసి, వాటిని నాశనం చేస్తాయి. ప్లీహం ఎర్ర రక్త కణాలు, ప్లేట్‌లెట్లను కలిగి ఉంటుంది. ఇవి గాయాలను మాన్పడానికి రక్తం గడ్డకట్టేలా చేస్తుంది.

ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడల్లా, ప్లీహం దెబ్బతిన్న కణాలతో పాటు ఎర్ర రక్త కణాలను నాశనం చేయడం ప్రారంభిస్తుంది. ఇది రోగులకు చాలా హానికరం. 18 సంవత్సరాల వయసు వరకు ప్లీహం శరీర రోగ నిరోధక వ్యవస్థను నియంత్రిస్తుంది. కానీ 18 సంవత్సరాల తర్వాత, ఎముక మజ్జ, లింఫ్ నోడ్, కాలేయం రోగనిరోధక వ్యవస్థను రక్షించే పనిని తీసుకుంటాయి. అందుకే, 18 ఏళ్లు పైబడిన వ్యక్తి నుంచి ప్లీహం తొలగించినా ఏం కాదు. కాని, ప్లీహానికి గాయమై అలాగే ఉంటే మాత్రం రోగికి ప్రాణాంతకం కావచ్చు. సరైన సమయంలో ఆపరేషన్ చేయకపోతే అది మరణానికి దారితీస్తుంది. ప్లీహం గాయంతో ఉందంటే రోగి పరిస్థితి విషమంగా ఉందని అర్థం.

శేషాచారి తన విద్యార్థితో సర్జరీ చేయించి ప్లీహం తొలగించేలా చేశారు. అంటే, పెద్ద, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయడంలో తన విద్యార్థులను సిద్ధం చేశారని అర్థం. ప్రొఫెసర్ శేషాచారి వంటి అనుభవజ్ఞులైన సర్జన్స్ టీమ్‌లో భాగమవడం శ్యామా ప్రసాద్ తన అదృష్టంగా భావించారు. శేషాచారి వల్ల శ్యామా ప్రసాద్‌కి కూడా అనేక సర్జరీలు చేసే అవకాశం వచ్చింది. ఆ రోజుల్లో సర్జన్లు మాత్రమే రోగి శరీరంలోని కణితులను తొలగించేవారు. కణితిని తొలగించే ప్రక్రియ అంత సులభం కాదు. మానవ శరీరంలో కోట్లాది కణాలుంటాయి. పాత కణాలు చనిపోయి వాటి స్థానంలో కొత్త కణాలు పుడతాయి. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. కొన్ని కారణాల వల్ల ఈ ప్రక్రియ నిలిచిపోయి కణాల ఉత్పత్తి అసాధారణంగా జరుగుతుంది. అలాంటి సందర్భాల్లో శరీరంలో కణితులు ఏర్పడతాయి. వైద్య పరిభాషలో దీనిని నియోప్లాజమ్ అంటారు. శరీరంలోని ఏదైనా భాగంలో కణితి ఏర్పడినప్పుడు వైద్య పరీక్ష చేయించుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే, కణితులు క్యాన్సర్‌గా కూడా మారవచ్చు. ప్రతి కణితి తప్పనిసరిగా క్యాన్సర్ కాదు. కానీ వాటిలో కొన్ని ఉండవచ్చు.

కణితులు రెండు రకాలుగా ఉంటాయి. అపాయం కలిగించనివి, ప్రాణాంతకమైనవి. అపాయం కలిగించని కణితులు క్రమంగా పెరుగుతాయి గానీ క్యాన్సర్‌కు కారణం కాదు. ఈ కణితులు శరీరంలోని ఒక భాగంలో నెమ్మదిగా పెరుగుతాయి తప్ప ఇతర భాగాలకు వ్యాపించవు. ప్రాణాంతక కణితులు మాత్రం చాలా వేగంగా పెరుగుతాయి, ముమ్ముందుకు క్యాన్సర్‌కు కారణమవుతాయి. ఆ రోజుల్లో ట్యూమర్లు, క్యాన్సర్ గురించి చాలా తక్కువ అవగాహన ఉండేది. చాలా మంది ప్రజలు తమ శరీరంలో గడ్డలను సీరియస్‌గా తీసుకోరు. ఎప్పుడైతే సీరియస్ అవుతుందో అప్పుడే ఆసుపత్రికి పరుగులు తీస్తారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. సామాన్యులు కణితి, క్యాన్సర్ లక్షణాలను గుర్తించలేరు. అందుకే, చూడడానికి, వినడానికి, మాట్లాడడానికి ఇబ్బంది ఉన్నప్పుడు మాత్రమే ఆసుపత్రికి వెళ్లేవారు. చాలా మంది సీరియస్‌గా ఉన్న రోగులను ఆస్పత్రులకు తీసుకొచ్చి.. తమవారు జ్ఞాపకశక్తి కోల్పోతున్నాడని వైద్యులకు చెబుతుంటారు. మహిళలైతే ఈ విషయంలో అత్యంత దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. వారిలో చాలా మంది తమ శరీరంలోని ఏ భాగంలోనైనా గడ్డలు పెరిగితే.. సాధారణంగానే చూస్తారు తప్ప.. దాని వల్ల ఇబ్బంది వస్తుందని తెలుసుకోరు. పరిస్థితి అదుపు తప్పినప్పుడే ఆసుపత్రికి వస్తుంటారు. ఈ అవగాహన లేని కారణంగానే రొమ్ము క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి.

ఒకసారి 18 ఏళ్ల వివాహిత తన రొమ్ములో పెద్ద కణితి ఏర్పడ్డ కారణంగా ఆసుపత్రికి వచ్చింది. ఆ సమయంలో శ్యామా ప్రసాద్ డ్యూటీలో ఉన్నారు. కాని, ఆ మహిళ శ్యామా ప్రసాద్ చెక్ చేయడానికి ఒప్పుకోలేదు. మహిళా వైద్యురాలితోనే చెకప్ చేయించాలని పట్టుబట్టింది. అప్పట్లో పెద్దగా లేడీ డాక్టర్లు లేరు. దీంతో శ్యామా ప్రసాద్ చొరవ తీసుకుని ఆ మహిళతో మాట్లాడడం మొదలుపెట్టారు. ముందుగా కంగారును పోగొట్టే ప్రయత్నం చేశారు. ఆ తరువాత.. సమస్య ఏంటో తెలియాలంటే చెక్ చేయడం తప్పనిసరి అని ఒప్పించే ప్రయత్నం చేశారు. సమస్య ఏంటి, ఎక్కడుంది అని తెలుసుకోవడం డాక్టర్ల బాధ్యత అని నచ్చజెప్పారు. రోగం గురించి డాక్టర్లకు చెప్పాలి తప్ప సిగ్గుపడకూడదు అని చెప్పుకొచ్చారు.

అంత చెప్పినా గానీ ఆ మహిళ ఒప్పుకోలేదు. దీంతో మరోసారి ప్రయత్నించారు శ్యామా ప్రసాద్. జబ్బు ఏంటో చెక్ చేయించకపోతే.. సమస్య మరింత పెరుగుతుందని మెల్లగా హెచ్చరించారు. లేడీ డాక్టర్ వచ్చే సమయానికి సమస్య మరింత జఠిలం కావొచ్చని చెప్పారు. తాను చేసే చెకప్‌తో జబ్బు ఏంటన్నది బయటపడితే వెంటనే ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాల్సి ఉంటుందని, ఒకవేళ చికిత్స ఆలస్యం చేస్తే ప్రాణానికే హాని కలగవచ్చని, అది మరణానికి కూడా దారి తీయొచ్చని చెప్పారు. ఎప్పుడైతే ప్రాణం పోతుందని చెప్పారో.. వెంటనే శ్యామా ప్రసాద్ తనను చెక్ చేయడానికి ఒప్పుకుంది. ఆ తరువాత ఇన్వెస్టిగేషన్ చేసి చూస్తే.. ఆమె రొమ్ములో కణితి ఉందని, చాలా పెద్దదిగా ఉందని తేలింది. తనకున్న నాలెడ్జ్‌తో ఆ కణితి క్యాన్సర్‌దా కాదా అనే దానిపై ఓ ఐడియా ఉంది. అయితే, నిర్ధారణను కోసం కణితిని బయాప్సీ చేశారు. బయాప్సీ ద్వారా అది క్యాన్సర్ కణితా కాదా అని తెలుసుకోవచ్చు. దాని ద్వారా ట్రీట్‌మెంట్ చేయడం కూడా సులభం అవుతుంది. బయాప్సీ అనేది ఒక సాధారణ సర్జికల్ ప్రొసీజర్. ఇందులో భాగంగా శరీరంలోని కణితి లేదా కణజాలాన్ని తీసుకుంటారు. మైక్రోస్కోప్ కింద పరీక్షించి క్యాన్సర్ కణితా కాదా అనేది తెలుసుకుంటారు. ఆ బయాప్సీలో మహిళకు ఇన్వేసివ్ డక్టల్ కార్సినోమా ఉన్నట్లు తేలింది. ఇది రొమ్ము క్యాన్సర్‌కి ఒక రూపం. ఇన్వేసివ్ అంటే.. క్యాన్సర్ అప్పటికే శరీరంపై దాడి చేసిందని అర్థం. లేదా సమీపంలోని రొమ్ము కణజాలాలకు వ్యాపించిందని అర్థం. డక్టల్ అంటే పాల నాళాల్లో క్యాన్సర్ మొదలైనట్టు. కార్సినోమా అనేది చర్మం లేదా ఇతర కణజాలాలలో ఉత్పత్తి అయ్యే క్యాన్సర్‌ని సూచిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న ఇతర వైద్యులు ఆశ్చర్యపోయారు. ఇన్వేసివ్ డక్టల్ కార్సినోమా కేసులు ఆ రోజుల్లో తరచుగా ఉండేవి. కానీ చాలా సందర్భాల్లో, రోగులు 30ఏళ్ల పైబడిన వారే అయి ఉంటారు. అందులోనూ ఎక్కువ మంది వృద్ధులే ఉండేవాళ్లు. కాని, 18 ఏళ్ల మహిళకు ఈ వ్యాధి నిర్ధారణ కావడం చాలా అరుదు. తక్షణమే, యువతి ప్రాణాలను కాపాడేందుకు సర్జరీ చేయాలని ప్రొఫెసర్ శేషాచారి సూచించారు. వెంటనే సర్జరీకి సన్నాహాలు మొదలుపెట్టారు. కాని, ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లే లోపే ఆమె ప్రాణాలు విడిచింది. ఈ మరణంతో డాక్టర్లు చాలా

బాధపడ్డారు. సర్జరీ చేస్తే ఆమెకు ప్రాణాపాయం తప్పేదని అంతా భావించారు. అయితే సర్జరీ కాకముందే ఆమె మరణించింది. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించిందని తర్వాత తెలిసింది. భార్య మరణవార్త విన్న భర్త కుప్పకూలిపోయాడు.

కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని శ్యామా ప్రసాద్‌ను ఈ సంఘటన ప్రేరేపించింది. ఎందుకంటే, అవగాహన కల్పించకుండా క్యాన్సర్ రోగులను రక్షించలేం. పెద్దసంఖ్యలో వస్తున్న క్యాన్సర్ పేషెంట్లు.. శ్యామా ప్రసాద్‌ను కేన్సర్ పరిశోధన గురించిన అవగాహనపై మరింత లోతుగా ఆలోచించేలా చేశాయి. చాలా చిన్న వయసులోనే క్యాన్సర్ పేషెంట్ మరణించడంతో శ్యామా ప్రసాద్ క్యాన్సర్ కేసులపై ఎక్కువ ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. ఎంఎస్ డిగ్రీ చేసి ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత తన వద్దకు ఎక్కువ సంఖ్యలో క్యాన్సర్, ట్యూమర్ కేసులు వస్తాయని తెలుసు. అందుకే, క్యాన్సర్ రోగులకు చికిత్స చేయడానికి కావాల్సిన నైపుణ్యాలను సంపాదించుకోవాలని అనుకున్నారు.

శ్యామా ప్రసాద్ తన పరిశోధన పత్రానికి సబ్జెక్ట్‌గా క్యాన్సర్ టాపిక్ ఎంచుకున్నందున, క్యాన్సర్ చికిత్సపై అతని ఆసక్తి మరింత పెరుగుతూ వచ్చింది. ఈ పరిశోధన పత్రాన్ని సిద్ధం చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. పైగా స్కానింగ్ మిషన్లు లేని కాలం అది. CT స్కాన్, MRI యంత్రాలు అప్పట్లో ఇంకా ఆవిష్కృతం కాలేదు. అప్పటికి భారతదేశంలో అల్ట్రాసౌండ్ యంత్రం కూడా లేదు. ఎక్స్-రేల ద్వారా కణితులను గుర్తించేవారు. దీంతో శ్యామా ప్రసాద్ క్యాన్సర్ రోగుల ఎక్స్-రే రిపోర్టులను సేకరించారు. కాళ్లు, చేతుల్లో మృదు కణజాల కణితులు ఉన్న పలువురు రోగులతో ఆయన మాట్లాడారు. ఎన్నో పుస్తకాలు చదవడంతో పాటు అనేక పరిశోధన పత్రాలను అధ్యయనం చేశారు. ఒకసారి ఒక రోగి పైల్స్ సమస్యతో ఆసుపత్రికి వచ్చాడు. అతడిని పరీక్షించిన డాక్టర్లు సర్జరీ చేయాలని నిర్ణయించారు. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డికి ఆపరేషన్ అప్పగించారు. అతను అనుభవజ్ఞుడైన సర్జన్. అప్పటికి అతను చాలా పైల్స్ సర్జరీలు చేశాడు. కాని, ఈసారి శ్యామా ప్రసాద్‌కి ఆపరేషన్ చేసే బాధ్యత ఇవ్వాలని నిర్ణయించారు. సర్జరీలు చేయాలనే ఉత్సాహం శ్యామా ప్రసాద్‌కి అన్ని వేళలా ఉండేది. ఎన్ని ఆపరేషన్లు చేయడానికైనా ఆసక్తి చూపేవారు. పైగా

సర్జరీలు చేసే ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూడదనుకున్నారు. సర్జరీల పట్ల ఆయనకున్న మక్కువ చూసి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి శ్యామా ప్రసాద్‌ను శస్త్రచికిత్స చేసేందుకు అనుమతించాలని నిర్ణయించుకున్నారు.

పైల్స్ అనేవి పురీషనాళం వెలుపల రక్తనాళాల వాపు వల్ల ఏర్పడతాయి. సాధారణంగా, ఇది గర్భధారణ సమయంలో, హార్మోన్ల మార్పులు, గాయాలు లేదా మలవిసర్జన సమయంలో ఒత్తిడి కారణంగా జరుగుతుంది. పైల్స్ చాలా నొప్పిని కలిగిస్తుంది. ఆ నొప్పిని రోగి తట్టుకోలేడు. ఈ సమస్య నుంచి రోగిని బయటపడేయడానికి సర్జరీ చేస్తారు. అప్పట్లో పైల్స్ పేషెంట్లకు హేమోరో హైడెక్టమీ చేసేవారు. ఇది శస్త్రచికిత్సా ప్రక్రియ. ఆ రోజుల్లో పైల్స్ నయం చేయడానికి దాన్నే మోస్ట్ ఎఫెక్టివ్ ప్రొసీజర్‌గా పరిగణించేవారు.

హెమోరోహైడెక్టమీ సమయంలో రోగికి అనస్థీషియా ఇస్తారు. స్కాల్పెల్‌తో ఉబ్బిన భాగాన్ని కత్తిరిస్తారు. దీని తరువాత రక్తస్రావం ఆగిపోతుంది, ఆ గాయానికి కుట్లు వేస్తారు. హెమోరోహైడెక్టమీ తర్వాత గాయాలు నయం కావడానికి సాధారణంగా రెండు నుంచి మూడు వారాలు పడుతుంది. కానీ శస్త్రచికిత్స తర్వాత కూడా రోగి నొప్పిని అనుభవిస్తూనే ఉంటాడు. అందుకే, నొప్పిని తగ్గించడానికి పెయిన్ కిల్లర్స్ ఇస్తారు. నొప్పి, వాపును తగ్గించడానికి ఐస్ ప్యాక్‌లను కూడా ఉపయోగిస్తారు. శ్యామా ప్రసాద్ ఆపరేషన్ థియేటర్‌లో పైల్స్ సర్జరీలను చాలాసార్లు చూశారు. సర్జన్లు కూడా అతనికి పైల్స్ సర్జరీల గురించి నేర్పించారు. డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సూచనలతో సర్జరీ ప్రారంభించారు. అంతా బాగానే సాగింది. ఆపరేషన్ తర్వాత రోగిని వేరే గదికి మార్చారు. శ్యామా ప్రసాద్, శ్రీనివాసులు రెడ్డి ఆపరేషన్ సక్సెస్ అయిందని భావించారు. అయితే, ఆపరేషన్ తర్వాత ఒక రోజు రోగి పురీషనాళం నుంచి నల్ల పదార్థాలు బయటకు రావడం మొదలయ్యాయి. విషయం తెలుసుకున్న శ్యామా ప్రసాద్ ఆశ్చర్యపోయారు. వెంటనే డాక్టర్ శ్రీనివాసులురెడ్డికి సమాచారం అందించారు. సాధారణంగా, రోగులు శస్త్రచికిత్స తర్వాత నొప్పి గురించి ఫిర్యాదు చేస్తారు. చాలా మంది రోగులు మలవిసర్జన చేసేటప్పుడు నొప్పిని అనుభవిస్తారు. కానీ పురీషనాళం నుంచి నల్ల పదార్థాలు బయటకు వచ్చిన సందర్భాలు ఎప్పుడూ రికార్డ్ అవలేదు. అలా జరగడం అదే

మొదటిసారి. ఈ విషయాన్ని డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సీరియస్‌గా తీసుకుని పురీషనాళాన్ని పరిశీలించారు. ఆ నల్లటి పదార్థాన్ని విశ్లేషించడానికి ల్యాబ్‌కు పంపారు. రోగికి పురీషనాళంలో మెలనోమా ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. మరో మాటలో చెప్పాలంటే అతనిలో క్యాన్సర్ బయటపడింది. ఆ రోగిలో క్యాన్సర్ బయటపడడం శ్యామా ప్రసాద్, శ్రీనివాసులు రెడ్డిని దిగ్భ్రాంతికి గురి చేసింది.

శస్త్రచికిత్సకు ముందు సరైన పరీక్షల ద్వారా మెలనోమాను గుర్తించవచ్చనేది వారి అభిప్రాయం. సాధారణంగా ఇది ఆపరేషన్ సమయంలో లేదా తర్వాత బయటపడుతుంది. ఈ సంఘటన శ్యామా ప్రసాద్‌కి మాత్రమే కాకుండా అతని గురువుకు కూడా ఒక విలువైన పాఠాన్ని నేర్పింది. పురీషనాళానికి సంబంధించిన ఏదైనా సర్జరీ చేసే ముందు, పురీషనాళంపై సమగ్ర పరిశోధన చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థి ఇద్దరూ గ్రహించారు. అప్పటి నుంచి సర్జరీ సమయంలోనూ, సర్జరీ తర్వాత కూడా పురీషనాళాన్ని పరీక్షించాలనుకున్నారు. ఎందుకంటే, రోగిని ఏదో ఒక వ్యాధే బాధించాల్సిన అవసరం లేదు. ఒక వ్యాధిని చికిత్స చేస్తున్నప్పుడు ఒక్కోసారి మరొక వ్యాధి బయటపడవచ్చు. ఈ సంఘటన తర్వాత, శ్యామా ప్రసాద్ ఒక రోగి పురీషనాళంలో ఫిర్యాదులతో వచ్చినప్పుడు, అతను మొత్తం అవయవాన్ని క్షుణ్ణంగా పరిశోధించాలనే నియమం పెట్టుకున్నారు. ప్రజలు కూడా తమ తప్పుల నుంచి నేర్చుకుంటారు.

కాలిన గాయాలతో వచ్చే రోగులతో ప్రభుత్వ ఆసుపత్రులు ఎప్పుడూ కిటకిటలాడుతుంటాయి. చాలా ప్రైవేట్ ఆస్పత్రులు కాలిన రోగులకు చికిత్స చేయడానికి నిరాకరిస్తుంటాయి. అలాంటి రోగులను కూడా వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకే తీసుకొస్తుంటారు. శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న రుయా హాస్పిటల్‌గా ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో కూడా చాలా బర్న్ కేసులు వస్తుంటాయి. ఈ కేసులను సీనియర్ వైద్యులు మాత్రమే చూసేవారు. ఒకరోజు ఒక పేషెంట్‌ను చాలా క్రిటికల్ కండిషన్‌లో ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఓ ప్రమాదంలో ఆమె కాలిపోయింది. ఆమె శరీరం 90 శాతం కాలిపోయింది. ఆ పరిస్థితిలో ఎవరూ బతకరు. రోగి శరీరం కాలిన తర్వాత ఎక్కువ కాలం జీవించలేరు. బర్న్ కేసుల్లో షాక్ వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని

నిపుణులు చెబుతున్నారు. కాలిన గాయాలు రోగికి విపరీతమైన నొప్పిని కలిగిస్తాయి. కొన్ని సందర్భాల్లో, గాయం చాలా తీవ్రంగా ఉంటుంది. రోగి చనిపోవచ్చు కూడా. ఆ పేషెంట్‌ను చూశాక ఆమె కూడా బతకదని శేషాచారి ఓ నిర్ణయానికి వచ్చే పరిస్థితి వచ్చింది. కానీ రోగిని రక్షించే ప్రయత్నం చేయడం డాక్టర్ బాధ్యత. శేషాచారి ఆమెకు చికిత్స చేయడం ప్రారంభించారు. ప్రొఫెసర్ శేషాచారి శ్యామా ప్రసాద్‌కి సర్జరీ చేసే బాధ్యత ఇచ్చారు. సాధారణంగా ఫస్ట్ ఇయర్ పీజీ విద్యార్థులకు బర్న్ సర్జరీలు చేసే అవకాశం ఇవ్వరు. కానీ శేషాచారి శ్యామా ప్రసాద్ బర్న్ సర్జరీలు కూడా నేర్చుకోవాలని ఆశించారు. శ్యామా ప్రసాద్ ఆ మహిళకు చికిత్స చేయడం ప్రారంభించారు. రోగి బలంగా ఉండేందుకు ఆమెకు ద్రవపదార్థాలు అందించారు. ఎలక్ట్రోలైట్ చికిత్స కూడా ప్రారంభించారు. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరాన్ని రక్షించేందుకు యాంటీబయాటిక్స్ ఇచ్చారు. ఒక్కొక్కటిగా శస్త్ర చికిత్సలు ప్రారంభించారు. మొదట చేతులకు చికిత్స చేశారు. తర్వాత మోచేతులు, కాళ్లకు చికిత్స పూర్తైంది. కానీ రోగిని మాత్రం రక్షించలేకపోయారు. ఆ మహిళ బతికి ఉంటే అద్భుతం అయ్యేది. ఎందుకంటే 90 శాతం కాలిన గాయాలు ఉన్నా కూడా ఓ రోగి 15 రోజుల పాటు బతికింది. నిజంగా అది అద్భుతమే. ఆమె చికిత్స, సంరక్షణ కోసం శ్యామా ప్రసాద్ ఎలాంటి చిన్న అవకాశాన్ని వదిలిపెట్టనందునే ఇది సాధ్యమైంది. ఆ పేషెంట్ వచ్చిన రోజు నుంచి శ్యామా ప్రసాద్ అసలు ఇంటికే వెళ్లలేదు. ఆమెను చూసుకోవడంలోనే ఎక్కువ సమయం గడిపేవారు. ఆసుపత్రి క్యాంటీన్‌లోనే భోజనం చేసేవారు. కానీ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆ మహిళ మరణించింది. శ్యామా ప్రసాద్ రోగిని చూసుకున్న తీరు ఇతర వైద్యులను ఆకట్టుకుంది. డాక్టర్ శేషాచారి అయితే "శ్యామ్ మీరు నిబద్ధత గల వ్యక్తి. మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నువ్వే నాకు ఆస్తివి." అంటూ ప్రశంసించారు. శ్యామా ప్రసాద్ తన కృషి, అంకితభావం, సేవ కారణంగా ఆసుపత్రిలో చాలా మంది హృదయాలను గెలుచుకున్నారు.

ఒకరోజు తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయ పూజారి తన కొడుకును వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చాడు. అతను శేషాచారికి సుపరిచితుడు. శేషాచారి బ్రాహ్మణుడు, ఆచారాలను చాలా కఠినంగా పాటించేవారు. పైగా ధర్మాత్ముడు,

దేవుణ్ణి చాలా బలంగా నమ్మేవారు. క్రమం తప్పకుండా పూజలు చేసేవారు. పూజారి కొడుకు గాయిటర్‌తో బాధపడుతుండడంతో తండ్రి హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. సహజంగా ఈ వ్యాధి అయోడిన్ లోపం వల్ల వస్తుంది. అయోడిన్ లోపం థైరాయిడ్ గ్రంధి వాపునకు కారణమవుతుంది. ఇది గొంతు వాపునకు కూడా కారణమవుతుంది. గాయిటర్ సాధారణంగా నొప్పిలేకుండా ఉంటుంది. కానీ ఇది థైరాయిడ్ గ్రంధి వాపు వల్ల వస్తుంది కాబట్టి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. గాయిటర్ ఉంటే ఆహారాన్ని మింగడం కూడా ఇబ్బందిగా ఉంటుంది. పూజారి కొడుకు గొంతు కూడా వాచిపోయి ఉంది. అతనికి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారింది. థైరాయిడ్ గ్రంధిని తొలగించడమే సమస్యకు ఏకైక పరిష్కారమని శేషాచారి రోగిని పరీక్షించి ఒప్పించారు. ప్రొఫెసర్ శేషాచారి శ్యామా ప్రసాద్‌కు శస్త్రచికిత్స చేసే బాధ్యత అప్పగించారు. ప్రొఫెసర్ శేషాచారి ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ థైరాయిడ్‌ను విజయవంతంగా తొలగించారు. ఆపరేషన్ విజయవంతమైంది. శ్యామా ప్రసాద్ ఎలాంటి పొరపాటు లేకుండా సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స తర్వాత, పూజారి కుమారుడికి అన్ని సమస్యల నుంచి విముక్తి లభించింది. దీంతో ఆ పూజారి చాలా సంతోషించాడు. ప్రొఫెసర్ శేషాచారిని శ్యామా ప్రసాద్‌తో కలిసి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి రావాలని ఆ పూజారి కోరారు. ఒకరోజు ప్రొ. శేషాచారి శ్యామా ప్రసాద్‌తో కలిసి గుడికి వెళ్లారు. పూజారి ఆ ఇరువురితో ప్రత్యేక పూజలు చేయించారు. సర్జరీని విజయవంతంగా చేసినందుకు బహుమతిగా, అతను శ్యామా ప్రసాద్‌కు చందనం చెట్టు ముక్కను ఇచ్చాడు. పూజారి నుంచి బహుమతి లభించినందుకు శ్యామా ప్రసాద్ సంతోషించారు.

శ్యామా ప్రసాద్ కూడా శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తుడే. ఆయన తరచూ తిరుమల శ్రీవారిని సందర్శించేవారు. ఎంబిబిఎస్ రోజుల్లో తిరుమల వెళ్లడం అలవాటైంది. ఆదివారాల్లో తిరుమల కొండలకు వెళ్లేవారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం తరువాత తిరిగి కాలేజీకి వచ్చేవారు. శ్రీవారిని చూసొచ్చాక తెలియని ప్రశాంతత, విశ్వాసం కలిగేవి. కొత్త సంవత్సరం సందర్భంగా తిరుమలను సందర్శించడం ఆయనకు అలవాటు. ఆలయ సందర్శనతో కొత్త

సంవత్సరాన్ని ప్రారంభించే వారు.

శ్యామా ప్రసాద్ ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తూ ఉండడంతో ఎంతో అనుభవాన్ని సంపాదించారు. రోగుల సమస్యలను స్వయంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. ఒకసారి రోగి కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చాడు. ఆ రోగి తనకు అజీర్ణం, వాంతులు సమస్య అని చెప్పాడు. డాక్టర్ రామచంద్రరావు ఆ రోగిని పరీక్షించారు. అతని పరిస్థితి అత్యంత విషమంగా ఉందని గుర్తించారు. వెంటనే రోగికి ఎండోస్కోపీ నిర్వహించారు. ఎండోస్కోపీలో కడుపులో గడ్డ ఉన్నట్లు తేలింది. డాక్టర్ ఆ గడ్డలో కొంత భాగాన్ని తీసి పరీక్షకు పంపారు. ఆ పరీక్షలో కడుపులో క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. కడుపు క్యాన్సర్ చికిత్స కణితి యొక్క దశలపై ఆధారపడి ఉంటుంది. ప్రారంభ దశలో కడుపు క్యాన్సర్‌కు చేసే ప్రాథమిక చికిత్స సర్జరీ మాత్రమే.

కడుపు క్యాన్సర్ అనేది ఒక ప్రాణాంతక వ్యాధి. కడుపు లోపలి గోడలో కణాలు నియంత్రణ లేకుండా పెరుగుతాయి. అవి ప్రాణాంతక కణితులుగా ఏర్పడుతాయి. దీనివల్ల కడుపు క్యాన్సర్ వస్తుంది. ప్రారంభ దశలో కడుపు క్యాన్సర్ కడుపు యొక్క అంతర్గత గోడలపై దాడి చేస్తుంది. క్రమంగా ఇతర కణజాలాలకు వ్యాపిస్తుంది. చివరగా, అది కాలేయం, ఊపిరితిత్తులు, పెరిటోనియంపై దాడి చేస్తుంది. కణితిని తొలగించకుండా క్యాన్సర్‌ను అరికట్టడం అసాధ్యం అని డాక్టర్ రామచంద్రరావు అభిప్రాయపడ్డారు. దీంతో డాక్టర్లు సర్జరీకి సిద్ధమయ్యారు. ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్లకు శ్యామా ప్రసాద్ సహకరించారు. రామచంద్రరావు ముందుగా సర్జరీ చేసి కణితిని తొలగించారు. శస్త్రచికిత్స పూర్తయ్యాక, రోగి గాయాలకు కుట్లు వేశారు. అయితే రోగికి మలద్వారం నుంచి రక్తస్రావం మొదలైంది. మరేదైనా సమస్య కారణంగా అలా జరిగి ఉంటుందని అనుకుని, తాము చేసిన సర్జరీ విజయవంతమైందని భావించారు. కాని, శ్యామా ప్రసాద్ మనసుని ఏదో సందేహం వెంటాడింది. డాక్టర్ రామచంద్రరావు దగ్గరికి వెళ్లి కడుపులో గాయం ఇంకా మానలేదని, దానికి కుట్లు వేయడం వల్ల రక్తస్రావం ఆగిపోవచ్చని చెప్పారు. డాక్టర్ కూడా ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. మళ్లీ కుట్లు తెరిచి చూసేసరికి శ్యామ్ ప్రసాద్ సందేహం నిజమేనని తేలింది. ఆ గాయానికి

కుట్లు వేయడంతో రక్తస్రావం ఆగిపోయింది.

సాధారణంగా, వైద్య విద్యార్థులు తమ ప్రొఫెసర్లకు సలహా ఇవ్వరు. తమ మనసులోని మాటను కూడా చెప్పరు. ఒక్కోసారి ఎలాంటి డౌట్లు కూడా బయటపెట్టరు. కానీ శ్యామా ప్రసాద్ మాత్రం అందుకు భిన్నం. ఆయన ప్రొఫెసర్లతో బహిరంగంగా చర్చించేవారు. ప్రొఫెసర్లను ప్రశ్నలు అడగడం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకునేవారు. ఈ లక్షణాల కారణంగా శ్యామా ప్రసాద్‌లో సర్జరీ నాలెడ్జ్, కాన్ఫిడెన్స్ పెరుగుతూ పోయాయి. దీని కారణంగానే ఎంఎస్ చదువుతున్న సమయంలోనే శ్యామా ప్రసాద్‌కి రకరకాల ఆపరేషన్లు చేసే అవకాశం వచ్చింది.

శ్యామా ప్రసాద్‌పై పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆయన పిల్లలకు అనేక సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడాన్ని శ్యామా ప్రసాద్ చూశారు. డాక్టర్ ప్రభాకర్ నవజాత శిశువులకు కూడా ఆపరేషన్ చేసేవారు. పైగా డాక్టర్ ప్రభాకర్ ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో కనిపించేవారు. నవజాత శిశువులకు ఆపరేషన్ చేయడం అంత సులభమేం కాదు. అందులో చాలా ప్రమాదాలు ఉంటాయి. కానీ డాక్టర్ ప్రభాకర్ పిల్లలకు ఆపరేషన్ చేయడంలో చాలా నైపుణ్యం సాధించారు. అయితే, ఆయన ఎంతోకాలం రుయా ఆసుపత్రిలో పని చేయలేదు. అతను వెంటనే మరొక ఆసుపత్రికి వెళ్లిపోయారు. దీంతో శస్త్రచికిత్సలు చేసే బాధ్యత జనరల్ సర్జరీ విభాగంపై పడింది.

ఇదే సమయంలో శ్యామా ప్రసాద్‌కి మరో ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. సర్జరీలకు ముందు అన్ని డాక్యుమెంట్స్ పూర్తి చేయడం అతని పని. ఈ బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పుడు రోగికి, అతని కుటుంబ సభ్యులకు చాలా విషయాలు చెప్పవలసి వచ్చేది. రోగికి ఏ వ్యాధి ఉందో చెప్పాల్సిన అవసరం ఉంది. సర్జరీ ఎందుకు చేశారో, దాని వల్ల కలిగే నష్టాలేమిటో చెప్పాల్సిన అవసరం కూడా ఉంటుంది. చాలా మంది రోగులు ఆ ప్రమాదాల గురించి విన్నప్పుడు సర్జరీ చేయించుకోవడానికి నిరాకరించేవారు. అనేక సందర్భాల్లో రోగి కుటుంబ సభ్యులు దీనిని వ్యతిరేకించేవారు కూడా. కొన్ని సందర్భాల్లో ఆపరేషన్ సమయంలో మరణించే ప్రమాదం ఉండడమే దీనికి కారణం. ఇది రోగులు, కుటుంబ సభ్యులను భయపెట్టేది. దీంతో సర్జరీలు చేయించుకోడానికి

వెనకాడేవారు. అటువంటి పరిస్థితిలో శస్త్రచికిత్స చేయకపోతే చనిపోయే ప్రమాదం ఉంటుందని శ్యామా ప్రసాద్ వారిని ఒప్పించాల్సి వచ్చేది. ఈ విషయంలో చాలా మంది రోగులు అతనితో ఏకీభవించేవారు. కాని వారిలో కొందరు మాత్రం ఎంత చెప్పినా సర్జరీకి అంగీకరించే వారు కాదు. వారిని ఆపరేషన్‌కు ఒప్పించడంతోనే సరిపోదు, రాతపూర్వకంగా సమ్మతి పొందేలా చేయడం కూడా శ్యామా ప్రసాద్ బాధ్యతే.

రాత్రి పగలు తేడా లేకుండా ఆస్పత్రిలో శ్రమిస్తున్నప్పటికీ.. వైద్య విద్యార్థులకు వచ్చే స్టైఫండ్ చాలా తక్కువగా ఉందని శ్యామా ప్రసాద్ గమనించారు. పైగా ఏళ్ల తరబడి స్టైఫండ్ పెంచలేదు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబానికి చెందిన వారు. అయితే చాలా మంది విద్యార్థులు ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. వారిలో కొందరు పేద కుటుంబాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అటువంటి విద్యార్థులు తమ చదువు కోసం తమ కుటుంబాలపై భారం వేయకూడదని అనుకున్నారు. కానీ స్టైఫండ్ చాలా తక్కువగా వస్తుండడంతో దాంతో బతకడం కష్టంగా మారింది. ఆ రోజుల్లో శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీల్లో మెడికల్ స్టూడెంట్లకి కేవలం 300 రూపాయలే స్టైఫండ్‌గా వచ్చేది. ఈ డబ్బులు కనీస అవసరాలకు గాని, అవసరమైన వస్తువులు కొనుక్కోడానికి గాని సరిపోయేవి కావు. పైగా మెడికల్ కాలేజీల్లో సౌకర్యాలు కూడా పెద్దగా ఉండేవి కావు. హాస్టల్ పరిస్థితి అస్సలు బాగుండేది కాదు. శ్యామా ప్రసాద్ మెడికల్ కాలేజ్ క్యాంపస్‌లోనే నివాసం ఉండడంతో హాస్టల్‌లో ఉండాల్సిన అవసరం రాలేదు. కానీ వైద్య విద్యార్థుల సమస్యలేంటో ఆయనకు బాగా తెలుసు. అతని స్నేహితులు చాలా మంది హాస్టల్‌లో ఉండేవారు. వారిని కలవడానికి శ్యామా ప్రసాద్ తరచూ హాస్టల్‌కు వెళ్లేవారు.

కాలేజ్ మేనేజ్‌మెంట్ హాస్టల్ ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విషయాన్ని శ్యామా ప్రసాద్ గమనించారు. హాస్టల్ పరిసరాలు మురికిగా ఉండేవి. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉండేవి కావు. హాస్టల్‌లో పెట్టే ఆహారం కూడా పౌష్టికాహారం కాదు. దీంతో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థుల దీనస్థితిని చూసి శ్యామా ప్రసాద్ ఆవేదన చెందేవారు. ఓ రోజు

హాస్టల్ వాసుల హక్కుల కోసం పోరాడాలని నిర్ణయించుకున్నారు. ఈ పోరాటానికి రోడ్‌మ్యాప్ తయారు చేయడం ప్రారంభించారు.

హాస్టళ్లలో ఉండే విద్యార్థులను హాస్టలర్స్ అంటారు. హాస్టళ్లో ఉండని వారిని డే స్కాలర్స్ అంటారు. శ్యామా ప్రసాద్ డే స్కాలర్. తన స్నేహితుడు, సహ విద్యార్థి మాలకొండయ్య గదికి తరచూ వెళ్లేవారు. అతని గదిలో కలిసి చదువుకునేవారు. ఇద్దరూ చాలా రాత్రులు కలిసి చదువుకున్నారు. అయినప్పటికీ, హాస్టల్‌లో సౌకర్యాల కొరత నేరుగా శ్యామా ప్రసాద్‌ను ప్రభావితం చేయలేదు. కానీ హాస్టలర్స్‌కు అన్యాయం జరుగుతోందన్న విషయం గ్రహించారు. తండ్రిలాగే శ్యామా ప్రసాద్ కూడా అన్యాయాన్ని సహించలేక పోయారు. ఎవరికి అన్యాయం జరిగినా వ్యతిరేకంగా మాట్లాడటం తన కర్తవ్యంగా భావించేవారు. బలహీనులు, నిస్సహాయులే ఎప్పుడూ అన్యాయానికి గురవుతుంటారు. కొన్ని కారణాలు, నిర్బంధాల కారణంగా వీరు అన్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడలేరు, అందుకే దోపిడీకి గురవుతుంటారు. అందుకే, సమాజంలో బలవంతులుగా ఉండే వాళ్లు ఇలాంటి బలహీనులకు సహాయం చేయడం తమ బాధ్యతగా భావించాలి. ఇందులో భాగంగా హాస్టలర్ల కోసం పోరాడాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించారు. పోరాటం కోసం రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నప్పుడు, యుద్ధం ఒంటరిగా గెలవదని గ్రహించారు. పెద్ద విజయాల కోసం ఒక ఆర్గనైజేషన్ పెట్టాలని డిసైడ్ అయ్యారు. ఆర్గనైజేషన్ అనేది మనిషి జీవితంలో చాలా ముఖ్యమైనదని శ్యామా ప్రసాద్ తన తండ్రి నుంచి నేర్చుకున్నారు. పెద్ద బాధ్యతలను ఏ ఒక్క వ్యక్తి పూర్తి చేయలేడు. ఎప్పుడైనా సరే ప్రజలు సంఘటితమై ఒక ఆర్గనైజేషన్‌గా ఏర్పడాలి. అప్పుడే వ్యక్తులు బలపడతారు. ఆర్గనైజేషన్‌కు ఉన్న పవర్‌తోనే ప్రజలు పెద్ద విజయాలు సాధించగలరు. ఇవే అనేక సమస్యలను కూడా పరిష్కరించగలదు. అందుకే, శ్యామా ప్రసాద్ ఓ ఆర్గనైజేషన్ నిర్మించేందుకు ప్రయత్నించారు. దాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో భాగంగా పలువురు విద్యార్థులతో మాట్లాడారు. చాలా సేపు చర్చలు జరిపారు. చాలా మంది విద్యార్థులు ఆర్గనైజేషన్‌లో భాగం కావడానికి అంగీకరించినప్పటికీ.. మరికొందరు ఆసక్తి చూపలేదు.

ఆ తరువాత ప్రిన్సిపాల్, హాస్పిటల్ సూపరింటెండెంట్, హాస్టల్ వార్డెన్‌లను

శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి కలిశారు. విద్యార్థులకు సముచిత హక్కులు కల్పించకపోతే సమ్మెకు దిగుతామని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వార్డెన్‌లకు అల్టిమేటం ఇచ్చారు.

ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వార్డెన్‌కు శ్యామా ప్రసాద్, అతని కుటుంబం గురించి బాగా తెలుసు. శ్యామా ప్రసాద్ తండ్రి సుందరయ్య మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ మరియు సర్జన్. వైద్య విద్యార్థుల నిరసనకు శ్యామా ప్రసాద్ నాయకత్వం వహిస్తారని ఆసుపత్రి, మెడికల్ కాలేజీ లేదా హాస్టల్ యాజమాన్యంలోని ఎవరూ ఊహించలేదు. కానీ శ్యామా ప్రసాద్‌కి చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నారని అక్కడున్న వారందరికీ తెలిసిరావడంతో.. వారందరూ ఉమ్మడి లక్ష్యం కోసం పోరాడడం ప్రారంభించారు. సమ్మె పిలుపుతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, వార్డెన్ ఒక్కసారిగా భయపడ్డారు. విద్యార్థుల సమ్మె వల్ల శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీకి, రుయా హాస్పిటల్‌కి చెడ్డ పేరు రావడమే కాకుండా విద్య, వైద్య కార్యకలాపాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని వారికి తెలుసు.

మెడికల్ కాలేజీల నిర్వహణలో వైద్య విద్యార్థులదే కీలకపాత్ర. అందులోనూ ఎంబిబిఎస్ విద్యార్థులతో పోలిస్తే పీజీ విద్యార్థులదే కీలక పాత్ర. వైద్య విద్యార్థుల సహాయం లేకుండా ఏ చికిత్స లేదా శస్త్రచికిత్స పూర్తి కాదు. వైద్య విద్యార్థులు లేకుంటే మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రుల్లో ఎలాంటి పనులు జరగవు. సమ్మెపై సూపరింటెండెంట్, వార్డెన్ కంగారు పడడానికి ఇదే ప్రధాన కారణం. సమ్మెను నిలువరించేందుకు వారి న్యాయమైన డిమాండ్లన్నింటినీ అంగీకరించారు. ఆ సమ్మె తరువాత హాస్టలర్లకు అన్ని రకాల సౌకర్యాలు అందాయి. అది శ్యామా ప్రసాద్‌కు చాలా సంతోషాన్నిచ్చింది. మౌనంతో అన్యాయం అంతం కాదని ఆయన గ్రహించారు. న్యాయం కోసం పోరాడాలని, బలవంతులైన వ్యక్తులపై పోరాటం చేసినప్పుడు ఒక వ్యక్తి ఏమీ చేయలేడని, ఆర్గనైజేషన్ బలంతో పెద్ద విజయాలు సాధించవచ్చని నేర్చుకున్నారు. హాస్టలర్ల హక్కుల పోరాటంలో విజయం సాధించిన స్ఫూర్తితో శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి విద్యార్థుల స్టైఫండ్ పెంపు డిమాండ్ కోసం పోరాడాలని ఆలోచించారు. ఈసారి పోరాటం కాలేజీ యాజమాన్యంపై కాదు. ఈసారి ఏకంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం జరిగింది. యుద్ధం

అంత తేలిక కాదని శ్యామా ప్రసాద్‌కి తెలుసు. రాష్ట్రంలో రెండు పెద్ద ఉద్యమాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం విభజించు, పాలించు అనే సూత్రాన్ని ఎలా వర్తింపజేసిందో ఆయన చూశారు. ఈ రెండు ఉద్యమాల్లోనూ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. జై ఆంధ్ర, జై తెలంగాణ ఉద్యమాలను అణిచివేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేసింది. కానీ అది న్యాయం కోసం జరుగుతున్న పోరాటం. అందుకే శ్యామా ప్రసాద్ ఉద్యమం కోసం పిడికిలి ఎత్తారు. కళాశాల యాజమాన్యం ద్వారా శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి ప్రభుత్వానికి మెమోరాండం పంపారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. నెల రోజుల్లోగా స్టైఫండ్ పెంచకపోతే విద్యార్థులు సమ్మెకు దిగుతామని ఇద్దరు విద్యార్థులు అల్టిమేటం ఇచ్చారు. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు.

ప్రభుత్వం తమను బలహీనంగా పరిగణిస్తోందని శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి గ్రహించారు. తమ బలాబలాలను ప్రభుత్వం అంచనా వేసేలా చేసేందుకు ఓ పెద్ద నిర్ణయం తీసుకున్నారు. ఆర్గనైజేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య విద్యార్థులందరినీ ఏకం చేయాలనే నిర్ణయానికొచ్చారు. అనుకున్న ప్లాన్ ప్రకారం శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి వివిధ వైద్య కళాశాలల విద్యార్థులతో మాట్లాడటం ప్రారంభించారు. వాళ్లు కూడా స్టైఫండ్ పెంచాలనే డిమాండ్‌కు మద్దతుగా నిలిచారు. స్టైఫండ్ పెంపు కోసం వివిధ మెడికల్ కాలేజీల విద్యార్థులు చేస్తున్న నిరసన గురించి తెలుసుకున్న వారంతా కలిసి పోరాడాలని నిర్ణయించుకున్నారు. తమ పోరాటానికి అన్ని వైపుల నుంచి మద్దతు రావడంతో శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి తమ ఆర్గనైజేషన్‌కు పేరు పెట్టాలని నిర్ణయించుకున్నారు. అప్పటి వరకు ఆ ఆర్గనైజేషన్‌కు ఎటువంటి పేరు పెట్టలేదు, ఎక్కడా నమోదు చేయలేదు కూడా. ఆ సమయంలో పేరు గురించి చాలా ఆలోచనలు, వరుస సమావేశాలు జరిగాయి. ఎన్నో పేర్లు పరిశీలనకు వచ్చాయి. ఎన్నో మేధోమదన సెషన్ల తరువాత జూనియర్ డాక్టర్ అనే పదాన్ని సృష్టించారు. దీని తరువాతే తమ ఆర్గనైజేషన్‌కు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అని పేరు పెట్టాలని నిర్ణయించారు.

వైద్యులు చేసే పనులన్నీ వైద్య విద్యార్థులు కూడా చేయాల్సి ఉంటుంది. వైద్య విద్యార్థులను డాక్టర్లు అని పిలవకపోయినా వైద్యులతో పోల్చితే ఏ విధంగానూ తక్కువ కాదు. ఈ అంశంపై జరిగిన చర్చలోనే జూనియర్ డాక్టర్ అనే పదం పుట్టుకొచ్చింది. అప్పటి నుంచి మెడికల్ కాలేజీ విద్యార్థులను జూనియర్ డాక్టర్లుగా పిలవాలని నిర్ణయించారు. ఈ విద్యార్థులు రోగులకు స్వతంత్రంగా చికిత్స చేయడానికి అనుమతించరు. కేవలం సీనియర్ డాక్టర్లు, ప్రొఫెసర్ల పర్యవేక్షణలో మాత్రమే రోగులకు చికిత్స చేయాల్సి ఉంటుంది.

చాలా మంది వైద్య విద్యార్థులు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా అయ్యారు. అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు ఎన్నికలు జరిగినప్పుడు తిప్పేస్వామి అధ్యక్షుడిగా, శ్యామా ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ ఇద్దరి నాయకత్వంలో స్టైఫండ్‌ను పెంచాలనే డిమాండ్ ఉద్యమంగా మారింది. కాని, అసోసియేషన్ లేఖలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో.. డిమాండ్లను నెరవేర్చకుంటే విద్యార్థుల సమ్మెకు దిగుతామని అల్టిమేటం ఇచ్చారు. ఈ అల్టిమేటం కూడా ప్రభుత్వాన్ని కదిలించడంలో విఫలమైంది. దీంతో తమ బలం ఏంటో చూపించేందుకు వైద్య విద్యార్థులు సమ్మెకు దిగారు. అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్య సేవలు స్తంభించాయి. వైద్య విద్యార్థులు లేని లోటు మెడికల్ కాలేజీల్లో చాలా స్పష్టంగా కనిపించింది. జూనియర్ డాక్టర్లు లేకపోవడంతో ఒత్తిడి అంతా ప్రొఫెసర్లు, ఇతర డాక్టర్ల పైనే పడింది. ఔట్ పేషెంట్ విభాగానికి ప్రతిరోజూ చాలా మంది రోగులు వస్తుండడంతో ప్రొఫెసర్లు, ఇతర డాక్టర్లు ఆ రోగులకు సేవలు అందించలేకపోయారు. కేవలం క్రిటికల్ కేసులకు మాత్రమే డాక్టర్లు హాజరయ్యారు. సమ్మె కారణంగా అన్ని కార్యకలాపాలను వాయిదా వేయాల్సి వచ్చింది. అత్యవసర కేసులను మాత్రమే ఆపరేషన్ థియేటర్లకు తరలించారు. జూనియర్ డాక్టర్ల సమ్మెతో రోగులు అనేక రకాల ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రోగులు పడుతున్న ఇబ్బందులను చూసి ప్రభుత్వం తలవంచక తప్పదని జూనియర్ వైద్యులు అంచనా వేశారు. కానీ అలా జరగలేదు.

ఆ సమయంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన చాలా కఠినంగా ఉండేవారు. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడే అత్యంత

శక్తిమంతమైన నాయకురాలుగా పేరున్న ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా యుద్ధం చేశారు. ఆలస్యం చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కానీ కేంద్రం పోలీసు బలగాలను ఉపయోగించి ఉద్యమాన్ని అణిచివేసింది. ఆ తర్వాత చెన్నారెడ్డి కాంగ్రెస్‌తో విడిపోయారు. తెలంగాణ ప్రజాసమితి పేరుతో కొత్త పార్టీ పెట్టారు. 1971 ఎన్నికల్లో తెలంగాణ ప్రజాసమితి అద్భుతమైన ఫలితాలు సాధించింది. తెలంగాణలోని 14 స్థానాలకు గానూ 11 స్థానాలను కైవసం చేసుకుంది. చెన్నారెడ్డి తన సత్తా చాటారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ అభ్యర్థన మేరకు తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 1974లో ఇందిరా గాంధీ ఆయనను ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గా నియమించారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో అప్పటికే బలహీనపడిన కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ఇందిరాగాంధీ చెన్నారెడ్డిని మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. 1978 మార్చి 6న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. జూనియర్ డాక్టర్ల సమ్మెపై చెన్నారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూనియర్ డాక్టర్ల ముందు తలవంచనని తేల్చిచెప్పారు.

ముఖ్యమంత్రి ఆదేశం మేరకు ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులపై పోలీసులు కేసులు పెట్టారు. ఐపీసీలోని పలు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేసినందున, సమ్మె చేస్తున్న వైద్యులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులను చూసి జూనియర్ డాక్టర్లంతా ఆశ్చర్యపోయారు. అరెస్ట్ వారెంట్లు చూపుతూ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడం భయాందోళనకు గురి చేసింది. విద్యార్థులను అరెస్టు చేయవద్దని డాక్టర్లు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అయితే ఆ విజ్ఞప్తి పోలీసులను ఆపలేకపోయింది. పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, తాము చేయగలిగింది ఏమీ లేదంటూ పోలీసులు డాక్టర్లకు చెప్పుకొచ్చారు. దీంతో విద్యార్థులను అరెస్ట్ చేయకుండా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పోలీసులు శ్యామా ప్రసాద్‌తో పాటు మరికొందరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కష్టాలు పడుతున్న పేషెంట్ల విన్నపాన్ని కూడా చెన్నారెడ్డి పట్టించుకోలేదు. నెల రోజుల సమ్మె తర్వాత ప్రభుత్వంపై గెలవడం అంత సులువు కాదని శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి తదితరులు గ్రహించారు. నిరసనలు ప్రభుత్వంపై పెద్దగా

ప్రభావం చూపకపోవడంతో కొందరు విద్యార్థులు తిరిగి విధుల్లో చేరారు. అయితే శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి తదితరులు తమ డిమాండ్లు నెరవేర్చాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారు.

సమ్మె జరిగి రెండు నెలలు గడిచినా ప్రభుత్వంలో చలనం రాలేదు. సమ్మె మూడో నెలకు చేరుకోవడంతో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు తమ వ్యూహాలపై పునరాలోచన చేయాల్సి వచ్చింది. వెంటనే శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్ వ్యూహాలపై చర్చించేందుకు ఆ భేటీ జరిగింది. కాని, చెన్నా రెడ్డి చలించరని చాలా మంది భావించారు. ఏం జరిగినా విద్యార్థుల ముందు తలవంచడని మాట్లాడుకున్నారు. సమ్మెల వల్ల చదువులు బాగా దెబ్బతిన్నాయని కొందరు నేతలు భావించారు. సమ్మెలు కొనసాగితే ఎగ్జామ్ ప్రిపరేషన్‌కు ఆటంకం ఏర్పడుతుందని మరికొందరు చెప్పుకొచ్చారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సమ్మె విరమించాలని మరికొందరు విద్యార్థులు సూచించారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమ్మె విరమించాలని నిర్ణయించారు. 67 రోజుల సమ్మె తర్వాత శ్యామా ప్రసాద్, తిప్పేస్వామి, ఇతర విద్యార్థులందరూ తిరిగి విధుల్లో చేరారు. స్టైఫండ్ అయితే పెరగలేదు గానీ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలేంటో ప్రజలకు అర్థమయ్యేలా చేసేందుకు నిరసనలు ఉపయోగపడ్డాయి. అలా సమ్మె విజయవంతమైంది. ఆ తరువాత ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్ న్యాయమైనదేనని ప్రభుత్వం కూడా గ్రహించింది. సమ్మె ప్రతిష్టాత్మక సమస్యగా మారినందున, సమ్మె జరిగే వరకు ప్రభుత్వం ఊరుకోలేదు. పైగా సమ్మె కూడా తీవ్ర ప్రభావం చూపింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వైద్య విద్యార్థులు ఏకం కావడం మొదలైంది. ప్రతి రాష్ట్రంలో జూనియర్ డాక్టర్ల సంఘాలు ఏర్పడ్డాయి. జూనియర్ డాక్టర్ల సమ్మె ప్రభావం ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల ప్రొఫెసర్లు, కార్మికులపైనా పడింది. ఆర్గనైజేషన్‌గా ఏర్పడి పోరాడితే సాధించలేనిది ఏదీ లేదని ఆ సమ్మె తరువాత అందరూ గ్రహించారు. అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, ప్రొఫెసర్లు కూడా ఆర్గనైజేషన్ పెట్టడం, దాన్ని బలోపేతం చేయడం మొదలుపెట్టారు. ఇతర డిపార్ట్ మెంట్లలోని కార్మికులు కూడా ఏకమయ్యారు. ఉద్యమం విజయవంతం కాలేదు గానీ.. శ్యామా ప్రసాద్

ఆదర్శవంతమైన నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రజలను సంఘటితం చేయగలనని నిరూపించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే తన తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లగలనని శ్యామ్ ప్రసాద్ నిరూపించుకున్నారు.

ఇంతలో 1979 డిసెంబర్ 24 సాయంత్రం శ్యామప్రసాద్ భార్య లక్ష్మీకి ప్రసవ నొప్పి వచ్చింది. వర్షాకాలం కావడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. లక్ష్మీ ప్రసవ వేదనను ఎవరూ ఊహించలేదు. అక్టోబర్‌లో గర్భం తొమ్మిదో నెలకు చేరుకుంటుందని, ఆ నెలలోనే ప్రసవం జరుగుతుందని వైద్యులు చెప్పారు. నిర్ణీత తేదీ కంటే నెల రోజుల ముందు లక్ష్మీకి ప్రసవ నొప్పులు రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. అయినప్పటికీ, ప్రసవ నొప్పి పెరగడంతో ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. హాస్పటల్ ఇంటికి దగ్గరగా ఉండటంతో భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఆమెను తీసుకెళ్లడం పెద్ద కష్టం కాలేదు. లక్ష్మీని నేరుగా లేబర్ రూమ్‌కి తీసుకెళ్లారు. డ్యూటీలో ఉన్న లేడీ డాక్టర్ ఆమెను పరీక్షించి వెంటనే ప్రసవానికి సిద్ధం చేశారు. కొద్ది నిమిషాల తర్వాత ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు తెలిపారు.

నెలలు నిండకుండానే బిడ్డ జన్మించడంతో చైల్డ్ స్పెషలిస్టుతో పరీక్ష చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేడీ డాక్టర్ సిఫారసు మేరకు చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ రత్నప్రభను పిలిపించారు. శిశువును పరీక్షించిన డాక్టర్ రత్నప్రభ చిన్నారి ఆరోగ్యంగా ఉందని తెలిపారు. ఆ మాటతో శ్యామా ప్రసాద్‌కి ఉపశమనం కలిగింది. కానీ రత్నప్రభ ఒక సలహా ఇచ్చారు. పిల్లవాడు నెలలు నిండకుండానే పుట్టాడు కాబట్టి ఉండాల్సినంత బరువు లేదని, శిశువును ఇంక్యుబేటర్‌లో ఉంచాల్సిన అవసరం ఉందని సూచించారు. కాని, ఆసుపత్రిలో ఇంక్యుబేటర్ సరిగా లేదని రత్నప్రభ చెప్పారు. దీంతో బిడ్డను మద్రాసులోని ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ ఏదైనా మంచి ఆసుపత్రిలో ఇంక్యుబేటర్‌లో ఉంచాలని సూచించారు. ఆ మాటతో శ్యామా ప్రసాద్ కాస్త కంగారుపడ్డారు. ఏం చేయాలో తోచలేదు. ఓవైపు జోరున వర్షం కురుస్తోంది, పైగా మద్రాసుకు ప్రయాణం అంత తేలికేం కాదు. శిశువును బస్సు లేదా రైలులో తీసుకెళ్లడం మంచిది కాదు.

తిరుపతి, మద్రాసు మధ్య దూరం దాదాపు 130 కిలోమీటర్లు. కారులో వెళ్లినా కనీసం 5 గంటలు పడుతుంది. శ్యామా ప్రసాద్ సమయం వృథా చేయకుండా వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే ఏం చేయాలో తోచని పరిస్థితిలో.. అతని మనసులో రకరకాల సందేహాలు తలెత్తాయి. తన బిడ్డను సమయానికి ఇంక్యుబేటర్‌కు చేర్చకపోతే పరిస్థితి మరింత దిగజారిపోతుందని భయపడ్డారు. కానీ బిడ్డను ఇంక్యుబేటర్‌లో చేర్చడానికి మద్రాసు ఆసుపత్రికి వెళ్లడం అంత సులభం కాదు. ఆ సమయంలో ప్రయాణం ప్రమాదకరమైంది. ఓ వైపు భారీ వర్షం, మరోవైపు ఐదు గంటల ప్రయాణం. వెళ్లే దారిలో బిడ్డ పరిస్థితి క్షీణిస్తే.. శిశువుకు చికిత్స చేయడానికి మధ్యలో ఆసుపత్రి కూడా ఉండకపోవచ్చు. శ్యామా ప్రసాద్, లక్ష్మి ఇద్దరూ మెడికల్ విద్యార్థులే, కాని వారేం పిల్లల వైద్య నిపుణులు కాదు.

అటువంటి క్లిష్ట పరిస్థితిలో సలహా ఇవ్వడానికి దగ్గర్లో సుందరయ్య కూడా లేరు. ఆయన కాకినాడలో ఉండేవారు. తండ్రిని సంప్రదించకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని శ్యామా ప్రసాద్ భావించారు. కానీ ఆ సమయంలో తన తండ్రిని సంప్రదించడం అంత సులభం కాదు. ఆ రోజుల్లో మొబైల్ ఫోన్ లేదు. ల్యాండ్‌లైన్ ఫోన్‌లు మాత్రమే ఉన్నాయి. వెంటనే శ్యామా ప్రసాద్ ఫోన్ చేశారు. చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ రత్నప్రభ చెప్పేది వినమని సుందరయ్య సలహా ఇచ్చారు. వెంటనే పసికందును మద్రాసు తీసుకెళ్లి ఎగ్మోర్ ఆసుపత్రి ఇంక్యుబేటర్‌లో ఉంచమని సుందరయ్య సలహా ఇచ్చారు. శ్యామా ప్రసాద్ తన సోదరి, అతని స్నేహితుడు మాలకొండయ్యతో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పిల్లాడితో పాటు ముగ్గురూ మద్రాసు వెళ్లారు. ఓవైపేమో వర్షం ఆగడం లేదు. రోడ్డు చూస్తే చాలా అధ్వానంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పలు చోట్ల రోడ్డు జలమయమయ్యాయి. బిడ్డ ప్రాణాలు కాపాడటం ముఖ్యం కాబట్టి ప్రయాణం కొనసాగించారు. ఎందుకంటే పిల్లవాడిని ఇంక్యుబేటర్‌లో ఉంచకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డకు కడుపులో అవయవాలు పూర్తిగా ఏర్పడవు. ఒక బిడ్డ తన తల్లి కడుపులో 37 వారాలు గడుపుతుంది. ఈ సమయంలో దాని అవయవాలు ఏర్పడతాయి. కాని, 37 వారాల లోపు బిడ్డ పుడితే మాత్రం

శరీరంలోని అవయవాలు ఏర్పడతాయా లేదా అనే దానిపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఉంటుంది. నెలల నిండకుండా పుట్టే వారిలో జీర్ణ వ్యవస్థ, ఊపిరితిత్తులు, రోగనిరోధక వ్యవస్థ, చర్మం పూర్తిగా అభివృద్ధి చెందవు. అందుకే, అటువంటి పిల్లలను బతికించేందుకు ఇంక్యుబేటర్లలో ఉంచుతారు. ఇంక్యుబేటర్ అనేది పిల్లల శరీరంలోని అన్ని ముఖ్యమైన అవయవాలు పని చేయడానికి అనుకూలమైన పరిస్థితిని అందించే ఒక యంత్రం. నెలలు నిండకుండా పుట్టిన పిల్లల శరీరాలు బయటి ఉష్ణోగ్రతను కూడా నియంత్రించలేవు. ఇంక్యుబేటర్ ఈ విధులను నిర్వహించడానికి సహాయపడుతుంది. మొత్తానికి మద్రాసు చేరే సరికి బిడ్డ ఆరోగ్యం మెరుగ్గానే ఉండడం శ్యామా ప్రసాద్‌కి ఉపశమనం కలిగించింది. ప్రయాణంలోనూ బిడ్డ కాస్త ప్రశాంతంగా ఉన్నట్టే కనిపించాడు. మద్రాసు చేరుకున్న శ్యామా ప్రసాద్ చిన్నారిని నేరుగా ఎగ్మోర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఆసుపత్రిలో ఆధునిక ఇంక్యుబేటర్లు ఉన్నాయి. చిన్నారిని పరీక్షించిన వైద్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నాడని వివరించారు. కానీ ఎందుకైనా మంచిదని పసివాడిని ఇంక్యుబేటర్‌లో ఉంచారు.

చిన్నారిని ఇంక్యుబేటర్‌లో ఉంచిన వెంటనే శ్యామా ప్రసాద్ ఊపిరి పీల్చుకున్నారు. శ్యామా ప్రసాద్ ఎగ్మూర్ చేరుకున్న కొద్ది గంటలకే సుందరయ్య కూడా అక్కడికి చేరుకున్నారు. తండ్రిని చూసి శ్యామా ప్రసాద్ ఆశ్చర్యపోయారు. అంత త్వరగా ఎలా వచ్చారని అడిగితే హౌరా–మద్రాస్ మెయిల్ ఎక్కి మద్రాసు చేరుకున్నట్టు చెప్పారు. చిన్నారికి చికిత్స అందిస్తున్న వైద్యులతో సుందరయ్య మాట్లాడారు. చిన్నారి క్షేమంగా ఉందని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చిన్నారి ఆరోగ్యానికి సంబంధించిన టెన్షన్‌ల మధ్య సుందరయ్య కొడుకుని అభినందించలేకపోయారు. శ్యామా ప్రసాద్ ఫోన్ చేసినప్పుడు కూడా సుందరయ్య వైద్యపరంగా చేయాల్సిన సలహా ఇచ్చారే తప్ప విష్ చేయలేదు. ముందుగా తండ్రి అయినందుకు కొడుకును అభినందించకుండా చైల్డ్ స్పెషలిస్ట్ సలహాను పాటించమని సుందరయ్య అతనికి సూచించారు. టెన్షన్ అంతా తగ్గి,

చిన్నారి పరిస్థితి నిలకడగా ఉందని తేలడంతో అందరూ రిలీఫ్ అయ్యారు. అప్పుడు.. తొలిసారి తండ్రి అయినందుకు శ్యామా ప్రసాద్‌ను సుందరయ్య అభినందించారు. సాధారణంగా పిల్లల పుట్టిన వార్త సంతోషకరమైన సందర్భం. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. నెలలు నిండకుండానే బిడ్డ పుట్టడం, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అనేక సందేహాలు తలెత్తడం, ఆ సందేహాలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడంతో కుటుంబ సభ్యుల మదిలో పలు అనుమానాలు నెలకొన్నాయి.

రెండు రోజులు చిన్నారిని మద్రాసు ఆసుపత్రిలో ఉంచి శ్యామా ప్రసాద్ తిరుపతికి తిరిగి వచ్చారు. కుటుంబసభ్యులంతా తిరుపతిలోని ఓ చోట సమావేశమై బిడ్డ పుట్టిన వేడుకను జరుపుకున్నారు. కొత్త కుటుంబసభ్యునికి సుందరయ్య కోలాహలంగా స్వాగతం పలికారు. విందు చాలా సేపు సాగింది. వేడుకలు ముగియగానే సుందరయ్య తిరిగి తన విధుల్లోకి వెళ్లిపోయారు. శ్యామా ప్రసాద్, లక్ష్మీ కూడా చదువు వైపు మళ్లారు.

శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంఎస్ కోర్సు ఒక సంవత్సరం పూర్తయిన తర్వాత, శ్యామా ప్రసాద్ వెల్లూరు పట్టణంలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతానని చెప్పారు. వెల్లూరు తమిళనాడులో ఉంది, క్రిస్టియన్ మెడికల్ కాలేజీకి చాలా మంచి పేరుంది. ఈ కాలేజీకి ఇండియాలోనే కాదు ప్రపంచంలో కూడా ప్రసిద్ధి చెందింది. ఈ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ఆసుపత్రికి దేశం నలుమూలల నుంచి చికిత్స కోసం వస్తుంటారు. దేశంలోని ఏ ఆస్పత్రిలోనూ వైద్యం చేయించుకోలేని రోగులను క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి పంపిస్తారు. తన కొడుకు క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో శిక్షణ పొందుతానని చెప్పినప్పుడు సుందరయ్య గర్వపడ్డారు. సుందరయ్యకు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ వైభవం, కీర్తి గురించి బాగా తెలుసు. సుందరయ్య కొడుకుని పిలిచి.. 'నువ్వు అదృష్టవంతుడివి. క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో శిక్షణ పొందే అవకాశం లభించడం అదృష్టం. ఇక్కడ అత్యుత్తమ డాక్టర్లతో కలిసి పనిచేయొచ్చు. ఆ కాలేజీలోని సర్జన్లు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందారు.' అని చెప్పారు.

క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ కేవలం డాక్టర్లను మాత్రమే తయారుచేయదు. అక్కడ వివిధ వ్యాధులపై ఎన్నో పరిశోధనలు కూడా జరుగుతాయి. వైద్య రంగంలోనే అధునాతన పరిశోధనలు చేస్తారు. అందుకే, శ్యామా ప్రసాద్‌కు సుందరయ్య మరిన్ని సలహాలు ఇచ్చారు. ఆ కాలేజీలో ఉన్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క నిమిషం కూడా వృధా చేయొద్దని, అక్కడ నేర్చుకున్నది మరెక్కడా నేర్చుకోలేరని చెప్పారు. పైగా ఎవరైనా రోగికి ఎక్కడా చికిత్స దొరకదని భావించినప్పుడు, ఆ రోగి కోలుకోవాలనే తీరని ఆశతో ఉన్నప్పుడు క్రిస్టియన్ మెడికల్ కాలేజీకే వస్తాడని చెప్పారు. తన మాటలను చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోవాలని, అలాంటి అవకాశం మరొకటి రాదని పదేపదే వివరించారు. సుందరయ్య మాటలు శ్యామా ప్రసాద్ మనసుపై చాలా ప్రభావం చూపాయి. శ్యామా ప్రసాద్ తన తండ్రి మాటలను చాలా సీరియస్‌గా తీసుకున్నారు.

క్రిస్టియన్ మెడికల్ కాలేజీ కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు వెనుక ఓ ఆసక్తికరమైన కథనం కూడా ఉంది. ఈ స్టోరీలో ఇడా సోఫియా స్కడర్ కథానాయిక. ఆమె 1870 డిసెంబర్ 9వ తేదీన తమిళనాడులోని రాణిపేటలో జన్మించారు. అతని తండ్రి డాక్టర్ జాన్ స్కడర్ మెడికల్ మిషనరీ నడిపేవారు. తన భార్య సోఫియాతో కలిసి భారతదేశానికి వచ్చి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తుండేవారు. వారు భారతదేశంలో ఉన్న సమయంలోనే ఇడా జన్మించింది. ఇడా కంటే ముందు జాన్, సోఫియాకు మరో ఐదుగురు పిల్లలు ఉన్నారు. వాళ్లంతా అబ్బాయిలే. ఆరో సంతానంగా ఆడపిల్ల పుట్టింది. అందుకే, తల్లిదండ్రులు ఆమెకు ఇడా అని పేరు పెట్టారు. ఇడా తాత రెవరెండ్ డాక్టర్ జాన్ స్కడర్ సీనియర్‌కు అమెరికన్ రిఫార్డ్మ్ చర్చితో సంబంధాలు ఉండేవి. జాన్ స్కడర్ సీనియర్ క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయడంతో పాటు రోగులకు చికిత్స చేసేవారు. అతనికి ఏడుగురు కుమారులు ఉన్నారు. వారందరినీ మిషనరీ పనిలో నిమగ్నం చేశారు. జాన్ స్కడర్ జూనియర్‌ని మాత్రం భారతదేశానికి పంపారు.

ఇడాకు ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పుడు భారతదేశంలో కలరా వ్యాప్తి చెందింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో కరువు నెలకొంది. మహమ్మారి, కరువు పరిస్థితులను అస్తవ్యస్తంగా మార్చింది. ఆ సమయంలో పరిస్థితి మరింత దిగజారింది. చాలా మంది ఆకలితో చనిపోయారు. లక్షలాది మంది కలరా బారిన పడ్డారు. ఆ రోజుల్లో మృత్యువు ప్రతిచోటా కరాళ నృత్యం చేసింది. అటువంటి పరిస్థితిలో డాక్టర్ జాన్ స్కడర్ తన కుటుంబంతో కలిసి US తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. 1878లో అతను తిరిగి US వెళ్ళారు. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ఇండియా రావాలని నిర్ణయించుకున్నారు. అలా వెళ్లిన వాళ్లు కూతుర్ని మాత్రం తీసుకురాలేదు. అతను తన సోదరుడు, సోదరి దగ్గరే ఈడాను విడిచిపెట్టారు. ఇడా తన మామ, అత్తల వద్ద పెరిగింది. 1887లో ఇడా మామ, అత్త కూడా మిషనరీ పని కోసం ఆసియాకు వెళ్లారు. కొన్ని నెలలపాటు ఇడా ఒంటరిగా USలో ఉండవలసి వచ్చింది. ఆ సమయంలో అక్కడ ప్రఖ్యాత మిషనరీ డ్వైట్ లైమాన్ మూడిషీ సలహా మేరకు మసాచ్యుసెట్‌లోని నార్త్ ఫీల్డ్ సెమినరీలో చదువుతోంది. ఇంతలో ఇండియాలో ఉన్న తన తల్లి ఆరోగ్యం పాడైపోయిందనే వార్త విన్నది. తన తల్లి సోఫియా బాగోగులు చూసుకోవడానికి చదువును మధ్యలో వదిలేసి మరీ ఇండియా వచ్చేసింది. ఆ సమయంలో ఆమె తల్లిదండ్రులు తమిళనాడులోని తిండివనంలో ఉండేవారు. ఆమె ఇండియాకు వచ్చి తల్లిదండ్రుల ఆలనాపాలనా చూసుకుంది.

ఒకరోజు రాత్రి అందరూ నిద్రపోతున్నప్పుడు ఎవరో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. ఆ శబ్దానికి అందరూ నిద్ర లేచారు. ఆ సమయంలో తలుపుకొడుతున్నారంటే.. ఏదో ముఖ్యమైన విషయమే అయింటుందని ముందే పసిగట్టారు. డాక్టర్ స్కడర్, అతని భార్య సోఫియా, కుమార్తె ఇడా అందరూ తలుపు తీసి బయటకు చూశారు. తలుపు దగ్గర ముగ్గురు వ్యక్తులు నిలబడి ఉన్నారు. తమ భార్యలకు ప్రసవ వేదన వస్తోందని, నొప్పితో విలపిస్తున్నారని చెప్పారు. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవడానికి డాక్టర్ స్కడర్‌కి ఎక్కువ సమయం పట్టలేదు. వెంటనే వారితో వెళ్లడానికి స్కడర్ రెడీ అయ్యారు. కానీ వచ్చిన ముగ్గురు వ్యక్తులు డాక్టర్ స్కడర్ రావొద్దని చెప్పారు. మగ వైద్యుడి వద్ద తమ భార్యలకు ప్రసవం చేయించబోమని చెప్పారు. ఆ సమయంలో డాక్టర్

స్కడర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితుల్లో మీకు సహాయం చేయగల ఏకైక వ్యక్తిని తానేనని, తన భార్య అనారోగ్యంతో ఉండడంతో ఆమె డెలివరీలో సహాయం చేయడం మంచిది కాదని చెప్పారు. తన కుమార్తెకు డెలివరీ కేసుల్లో అనుభవం లేదని పరిస్థితి వివరించారు. కాని, ఆ వ్యక్తులు అంగీకరించలేదు. తమ దగ్గర అలాంటివి కుదరవని, మగ డాక్టర్లతో ప్రసవ వైద్యం చేయించబోమని, తమ ఆచారాలు కూడా అందుకు అనుమతించవని చెప్పారు. ప్రసవానికి సహాయం చేయగల స్త్రీ ఎవరైనా ఉంటే చెప్పండి.. ఆమె సహాయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు. కాని, స్కడర్ మాత్రం రోగికి చికిత్స చేయడమే వైద్యుని విధి అని ఆ వ్యక్తులను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఒక డాక్టర్‌కు మతం, కులం అనే పట్టింపు ఉండదని, రోగి మగవారా లేదా ఆడవారా అని చూడదని, మనిషి ప్రాణాలు కాపాడడమే అతని లక్ష్యమని నచ్చజెప్పారు. ఎందుకంటే, ఈ సమయంలో, ఆ ప్రాంతంలో ప్రసవానికి సహాయంగా ఎవరూ రారని డాక్టర్ స్కడర్‌కు తెలుసు. కాని, ఎంత చెప్పినా ఆ ముగ్గురిలో ఎవరూ అందుకు అంగీకరించలేదు. చేసేది లేక, వారిని బలవంతం చేయలేక ఇంట్లోనే ఉండిపోయారు. వారిలో ఇద్దరు హిందువులు కాగా మరొకరు ముస్లిం. వారంతా వారివారి ధర్మం పాటించేవారే. అందుకే, మగ డాక్టర్ వైద్యం చేస్తానంటే అంగీకరించలేదని అర్థం చేసుకున్నాడు. విషాదం ఏంటంటే, ఆ మరుసటి రోజు ఆ ముగ్గురు మహిళలు ప్రసవ సమయంలో మరణించారని డాక్టర్ స్కడర్‌కు తెలిసింది. అది విని డాక్టర్ స్కడర్ చాలా బాధపడ్డాడు. ఇడాకి కూడా గుండె పగిలింది. ఈ ఘటన ఇడాను కుదిపేసింది. వారి కట్టుబాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా రోగులకు చికిత్స చేయడానికి భారతదేశంలో లేడీ డాక్టర్ల కొరత ఉందని ఇడాకు అప్పుడు అర్థమైంది. అనుభవజ్ఞులైన మంత్రసానులు డెలివరీ చేయగలరు. వైద్యపరమైన సమస్యలు వచ్చినా సరే నేరుగా డాక్టర్ వద్దకు మాత్రం వెళ్లరు. ఇంట్లో ఆడవాళ్లు అనారోగ్యంతో ఉంటే భర్త లేదా ఇంటి మగవాడే వైద్యుడి వద్దకు వెళ్లి లక్షణాలు చెప్పి మందు తెస్తాడు. భారతదేశంలో ఆడవాళ్ల జీవితాలను పట్టించుకోవడం లేదని ఇడా చాలా బాధపడింది. ఆ ముగ్గురు మహిళల మరణంతో ఇడా తీవ్ర దిగ్భ్రాంతికి గురై పెద్ద నిర్ణయం తీసుకుంది. ఆమె డాక్టర్ కావాలని, మహిళలకు సహాయం

చేయాలని నిర్ణయించుకుంది. అనారోగ్యంతో ఉన్న మహిళలకు చికిత్స చేయాలని నిశ్చయించుకుంది. అదే సమయంలో మహిళల హక్కుల కోసం పోరాడాలని ఓ నిర్ణయానికొచ్చింది. కాని, ఇడా తీసుకున్న నిర్ణయం చాలా పెద్దది. డాక్టర్ కావాలంటే మెడిసిన్ చదవాలి. ఆ రోజుల్లో మెడిసిన్ చదివే స్త్రీలు చాలా తక్కువ. భారతదేశంలో లేడీ డాక్టర్లు లేరు. అమెరికా, యూరప్ దేశాల్లోని మహిళలు మాత్రమే మెడిసిన్ చదవడం ప్రారంభించారు. కాని, ఇడా తీసుకున్న నిర్ణయం కూడా ముఖ్యమైనదే. ఎందుకంటే పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని కోరుకున్న ఇడా.. ఎప్పుడైతే ఆ ముగ్గురు మహిళలు చనిపోయారో.. ఆ ప్రభావం తనపై పడింది. పెళ్లి చేసుకుని సెటిల్ అవ్వాలనే ప్రాధాన్యత మారిపోయింది. ఎలాగైనా ఆడవారికి సహాయం చేయాలనుకుంది.

డాక్టర్ కావాలనే దృఢ సంకల్పంతో ఇడా యూఎస్ వెళ్లిపోయింది. 1895లో ఆమె పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకుని మెడిసిన్ చదవడం ప్రారంభించింది. మెడికల్ కోర్సు చివరి సంవత్సరంలో, ఆమె కార్నెల్ యూనివర్సిటీ వీల్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ తీసుకుంది. అప్పట్లో ఈ మెడికల్ కాలేజీనే అత్యుత్తమ మెడికల్ ఇన్‌స్టిట్యూట్. ఇడా ఆ కాలేజీలో సర్జరీలు చేయడం నేర్చుకుంది. డాక్టర్ అయిన తర్వాత హాస్పిటల్ నిర్మాణం కోసం ఇడా నిధులు సేకరించడం ప్రారంభించింది. ఒక వ్యక్తి 10వేల US డాలర్లను విరాళంగా ఇచ్చాడు. ఆసుపత్రికి తన దివంగత భార్య పేరు పెట్టాలని ఆ వ్యక్తి కోరాడు. ఆయన భార్య మరణం అతడిని తీవ్రంగా కలచివేసింది. ఎందుకంటే, అతనికి తన భార్య అంటే ఇష్టం, ఎంతో అంకితభావంతో ఉండేవాడు కూడా. అందుకే, తన భార్యలా ఎవరూ అకాల మరణం చెందకూడదని, దాన్ని అరికట్టాలంటే ఏదైనా చేయాలని అనుకున్నారు. ఇడా తన ప్రణాళికల గురించి చెప్పినప్పుడు అతను 10వేల అమెరికన్ డాలర్లను విరాళంగా ఇచ్చాడు. అప్పట్లో అది చాలా పెద్ద మొత్తం.

వైద్య కళాశాల కోసం నిధులు సేకరించిన తరువాత, ఇడా నార్త్ ఫీల్డ్‌కు చెందిన తన క్లాస్‌మేట్, బెస్ట్ ఫ్రెండ్ అన్నే హాన్‌కాక్‌తో కలిసి భారతదేశానికి బయలుదేరింది. భారతదేశానికి తిరిగి వచ్చిన కొన్ని నెలల తర్వాత ఆమె తండ్రి చనిపోయాడు. ఇడా తన తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని,

ప్రజలకు చికిత్స చేయాలని నిర్ణయించుకుంది. మొదట్లో ఇడా చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. ఆమె మహిళ అయినందున రోగులు ఆమె వద్ద చికిత్స చేయించుకోవడానికి వెనుకాడేవారు. వైద్యం కోసం ఆమె తండ్రి వద్దకు వచ్చేవారికి కూడా ఆమె సామర్థ్యంపై నమ్మకం లేదు. వారిలో చాలామందికి.. ఒక మహిళ డాక్టర్ కాగలదంటే నమ్మలేకపోయారు. పురుషులు మాత్రమే వైద్యులు అవుతారని, రోగులకు చికిత్స చేసే శక్తి పురుషులకు మాత్రమే ఉందని వారు భావించేవారు. పైగా ఇండియాలో విద్య అనేది కేవలం అబ్బాయిలకే పరిమితమైన కాలం అది. ఆడపిల్లలు ఇంటి పనులకే పరిమితం అయ్యేవారు. చదువు కూడా కొన్ని కుటుంబాలకే పరిమితమైంది. అందుకే, చాలా మంది నిరక్షరాస్యులుగా ఉండేవారు. అప్పట్లో భారతదేశంలో అనేక సామాజిక దురాచారాలు ఉన్నాయి. కులతత్వం, అంటరానితనం బాగా ఎక్కువగా ఉండేది. సమాజంలో ధనవంతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటే పేదరికం మాత్రం తారాస్థాయిలో ఉండేది. ప్రతిరోజు ప్రజలు ఆకలితో అలమటించేవారు. మహమ్మారి సర్వసాధారణం వచ్చి పోయేది. ఆ సమయంలో లక్షల మంది ప్రాణాలు కోల్పోయేవారు. ఈ నేపథ్యంలో ప్రజల విశ్వాసాన్ని పొందేందుకు ఇడా చాలా కష్టపడాల్సి వచ్చింది.

1900 సంవత్సరంలో ఇడా తన తండ్రి బంగ్లాలో సింగిల్ బెడ్ డిస్పెన్సరీని ప్రారంభించింది. తన తల్లి సహాయంతో రోగులకు చికిత్స చేయడం ప్రారంభించింది. అమెరికాలో సేకరించిన నిధులతో వెల్లూరులో ఆసుపత్రి నిర్మాణం మొదలుపెట్టింది. 1902 నాటికి ఆసుపత్రి సిద్ధమైంది. ఆ ఆసుపత్రిలో 40 పడకలు ఉన్నాయి. ఆ హాస్పిటల్‌కు 10వేల డాలర్లు విరాళంగా ఇచ్చిన వ్యక్తి భార్య పేరు అయిన మేరీ టాబర్ షెల్ మెమోరియల్ హాస్పిటల్ అని పేరు పెట్టారు. అప్పట్లో మొదటిసారిగా సర్జరీ విభాగాన్ని ప్రారంభించిన ఆసుపత్రి అదే. ఇడా స్వయంగా సర్జరీలు చేయడం ప్రారంభించింది. శస్త్రచికిత్సలు సక్సెస్ అవుతుండడంతో ప్రజలు ఇడాను డాక్టర్‌గా నమ్మడం మొదలుపెట్టారు. మందుల ద్వారా వైద్యం చేయగలిగే రోగికి మందులు ఇచ్చి, అవసరమైన వారికి సర్జరీలు చేసేది. ఇడానే స్వయంగా సర్జరీలు చేసేది. ఆమె ట్రీట్‌మెంట్ చూసి రోగులు మెచ్చుకునేవారు. సర్జరీ డాక్టర్‌గా ఇడా ఖ్యాతి సుదూర ప్రాంతాలకు

పాకింది. మగవాళ్లు మాత్రమే డాక్టర్లు అవుతారనే అపనమ్మకం అప్పటితో వీగిపోయింది. మహిళలు శస్త్రచికిత్సలు చేయలేరనే అపోహను కూడా ఆమె బద్దలు కొట్టింది. ఇడా మహిళా శక్తికి చిహ్నంగా మారింది. క్రమంగా ఆమె వద్దకు వైద్యం కోసం దూరప్రాంతాల నుంచి రోగులు వచ్చేవారు. కాంపౌండర్లు కావాలనుకునే చదువుకున్న మహిళలకు ఇడా శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఆమె 1903లో కాంపౌండర్ కోర్సును ప్రారంభించింది. ఈ సమయంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది ఆసుపత్రులకు చేరుకోలేకపోతున్నారని ఐడా గుర్తించింది. పేదరికం చాలా మందికి వైద్యం అందకుండా చేస్తోంది. అంతేకాదు మహిళలు వైద్యం చేయించుకునేందుకు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అటువంటి వ్యక్తులకు సహాయం చేయడానికి ఐడా ఒక ప్రాజెక్ట్ స్టార్ట్ చేసింది. రోడ్డు పక్కన క్లినిక్‌లను ప్రారంభించింది. ఆమె తన సహాయకులతో కలిసి వివిధ గ్రామాలకు వెళ్లి క్లినిక్‌ని ఏర్పాటు చేసుకునేది. ఒక ప్రాంతంలో క్లినిక్ పెట్టడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా రోగులు వచ్చేవారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఇడా బాగా పాపులర్ అయింది. ఆమె చేస్తున్న కృషిని భారతదేశ ప్రజలంతా ప్రశంసించారు. పనిలో పనిగా 1909లో నర్సింగ్ కోర్సును కూడా ప్రారంభించారు. భారతదేశంలో మొదటిసారిగా నర్సింగ్ డిప్లొమా కోర్సులు అనేవి ఇడా ఆసుపత్రిలోనే ప్రారంభమయ్యాయి

రోగులను ఎల్లవేళలా చూసుకోవడానికి, వారిని కనిపెట్టుకుని ఉండడానికి నర్సులు అవసరమని ఇడాకు తెలుసు. వైద్యులు నిత్యం రోగులతో సమయం గడపలేరు. డాక్టర్లు నర్సులకు చికిత్స విధానాన్ని చెబుతారు. వైద్యులు లేనప్పుడు లేదా వారు ఇతర రోగులతో బిజీగా ఉన్నప్పుడు నర్సులే ట్రీట్‌మెంట్‌ను ముందుకు తీసుకువెళతారు.

మహిళా శక్తిపై ఇడాకు పూర్తి విశ్వాసం ఉండేది. భారతదేశంలోని మహిళలకు సహాయం చేయాలనే సంకల్పంతోనే ఆమె డాక్టర్‌గా మారింది. భారతదేశంలోని ఆడపిల్లలు కూడా చదువుకోవాలని ఆమె ఆకాంక్షించేవారు. ఆడవాళ్లు పెద్ద సంఖ్యలో డాక్టర్లుగా, నర్సులుగా మారాలని ఇడా బలంగా

కోరుకునేవారు. అందుకే ఆమె స్త్రీ విద్యపై దృష్టి సారించింది. ఆమె తన ఆసుపత్రిలో మహిళల కోసం కొత్త కోర్సులను ప్రారంభించింది. 1918లో ఇడా మరో విప్లవాత్మక అడుగు వేసింది. భారతదేశంలో మొదటి మెడికల్ స్కూలును ప్రారంభించింది. మెడికల్ ప్రాక్టీషనర్ పేరుతో కోర్సులను ఆఫర్ చేసింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మెడిసిన్ ప్రాక్టీస్ చేయడానికి లైసెన్స్ పొందుతారు. ఈ లైసెన్స్ కలిగి ఉన్న ఎవరైనా లైసెన్సియేట్ ప్రాక్టీషనర్ అని పిలుస్తారు. నానాటికీ పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఇడా తొట్టపాలెంలో కొత్త ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ కూడా ఇడా పనితీరుకు ఎక్కువగా ప్రభావితమయ్యారు. 1928లో మహాత్మా గాంధీ ఇడా మెడికల్ స్కూలును సందర్శించారు. మానవాళికి ఇడా చేస్తున్న సేవను, ఆమె సహచరులను ప్రశంసించారు.

1942లో ఇడా మెడికల్ కాలేజీ స్థాపించి MBBS కోర్సును ప్రారంభించింది. కాలేజీకి క్రిస్టియన్ మెడికల్ కాలేజీ అని పేరు పెట్టారు. ఈ మెడికల్ కాలేజీని స్థాపించడంలో అనేక అమెరికన్ చర్చిలు ముఖ్య పాత్ర పోషించాయి. ఈ కళాశాలలో కేవలం బాలికలు మాత్రమే విద్యనభ్యసించేవారు. నిజానికి అదో విప్లవాత్మకమైన అడుగు అనే చెప్పాలి. ఆ సమయంలో భారతదేశంలో చాలా తక్కువ వైద్య కళాశాలలు ఉండేవి. అప్పటికి భారతదేశానికి స్వతంత్రం కూడా రాలేదు. అవిభక్త భారతదేశంలో పాండిచ్చేరి, కలకత్తా, మద్రాస్, గోవా, బొంబాయి, లాహోర్, లక్నో, పట్నా, ఆగ్రాలలో మాత్రమే మెడికల్ కాలేజీలు ఉండేవి. ఇడా మెడికల్ కాలేజీ ప్రారంభించడం ద్వారా చారిత్రాత్మక అడుగు వేసింది. దీనికి ముందు దేశంలోని అన్ని మెడికల్ కాలేజీలను భారత ప్రభుత్వమే ప్రారంభించింది. పాండిచ్చేరి మెడికల్ కాలేజీ మినహా మిగిలిన అన్ని మెడికల్ కాలేజీలు బ్రిటిష్ ప్రభుత్వం స్థాపించింది. 1945లో ఆమె ల్యాబ్ టెక్నీషియన్ కోర్సును ప్రారంభించింది. మరుసటి సంవత్సరం భారతదేశంలో మొదటి నర్సింగ్ కాలేజీని స్టార్ట్ చేసింది. ప్రస్తుతం ఇక్కడ నర్సింగ్ డిగ్రీలు ఇస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇడా భారతదేశాన్ని విడిచిపెట్టలేదు. ఆమె సామాజిక సేవ చేస్తూనే ఉంది. 1947లో క్రిస్టియన్ మెడికల్ కాలేజీ అబ్బాయిలను చేర్చుకోవడం ప్రారంభించింది.

1948లో క్రిస్టియన్ మెడికల్ కాలేజీ కొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచంలోనే తొలిసారిగా కుష్టు వ్యాధిగ్రస్తులకు రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ జరిగింది. లెప్రసీ స్పెషలిస్ట్, సర్జన్ డాక్టర్ పాల్ బ్రాండ్ ఈ సర్జరీ చేయడం ద్వారా చరిత్ర సృష్టించారు. ఆ రోజుల్లో కుష్టు వ్యాధిని నయం చేయలేనిదిగా భావించేవారు. చాలా మంది కుష్టు రోగులను సామాజికంగా బహిష్కరించేవారు. ఇడా తన ఆసుపత్రిలో కుష్టు రోగుల చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆమె కుష్టు రోగుల కోసం ప్రత్యేక ఆరోగ్యశాల ప్రారంభించారు. ఆ తరువాత టీబీ రోగుల కోసం మరో ఆరోగ్యశాల కూడా ప్రారంభించింది.

భారతదేశానికి వచ్చి క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో సేవలందించాలని డాక్టర్ పాల్ బ్రాండ్‌ను ఇడా అభ్యర్థించింది. దీంతో 1946లో భారతదేశానికి వచ్చిన పాల్ బ్రాండ్ రోగులకు చికిత్స చేయడం ప్రారంభించారు. డాక్టర్ పాల్ బ్రాండ్ తమిళనాడులోనే జన్మించారు. అతని తల్లిదండ్రులు మిషనరీ పని కోసం భారతదేశానికి వచ్చారు. డాక్టర్ పాల్ బ్రాండ్ లండన్‌లోని యూనివర్శిటీ కాలేజ్ హాస్పిటల్ నుంచి డాక్టర్ విద్య చదివారు.

అప్పట్లో దక్షిణాసియాలో కేవలం క్రిస్టియన్ మెడికల్ కాలేజీలోనే న్యూరాలజీ విభాగం మొదలైంది. 1949లో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జాకబ్ చాందీ ఈ విభాగాన్ని ప్రారంభించారు. భారతదేశంలో న్యూరో సర్జరీ పితామహుడిగా డాక్టర్ చాందీ ప్రసిద్ధి చెందారు. ఆయన 1910 జనవరి 23న కేరళలోని కొట్టాయంలో జన్మించారు. మద్రాసు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివి డాక్టర్ అయ్యారు. అతను తన వైద్య వృత్తిని ఒక మంచి మెడికల్ కాలేజీలో ప్రారంభించారు. డాక్టర్ జాకబ్ చాందీ 1944 వరకు ఆ మిషనరీ కళాశాలలోనే పనిచేశారు. ఆ తర్వాత MD చేయడానికి US వెళ్లారు. అతను పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి MD డిగ్రీని పొందారు. అమెరికాలో ఉన్న సమయంలో అతను జోనాథన్ రోడ్స్ నుంచి సర్జరీలు చేయడం నేర్చుకున్నారు. 1945లో మాంట్రియల్ న్యూరోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫెలోషిప్ పొందారు. 1948 వరకు అతను ఆ సంస్థలో అనేక సర్జరీలు చేశారు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెనడా నుంచి ఫెలోషిప్ పొందిన తర్వాత చికాగో వెళ్లారు. అదే సంవత్సరం.. అంటే, 1948లో అతను భారతదేశానికి తిరిగి వచ్చి క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో

మొదటి న్యూరోసర్జరీ విభాగాన్ని ప్రారంభించారు. అతను 1951లో న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాను స్థాపించారు. 1958లో భారతదేశంలో మొదటి న్యూరో సర్జరీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మొదలైంది. ఇడా కృషి కారణంగా 1950లోనే క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో MD, MS కోర్సులు బోధించడం మొదలైంది. 1954లో ఇడా రేడియోగ్రఫి కోర్సును ప్రారంభించింది. 1956లో మానసిక ఆరోగ్య కేంద్రం స్థాపించారు. 1957లో ఫ్యామిలీ మెడిసిన్ డిప్లొమా కోర్సును ప్రారంభించారు. దీంతో ఇడాకు ప్రజల్లో ఆదరణ మరింత పెరుగుతూ పోయింది. ఆమెకు జనాదరణ ఏస్థాయిలో ఉందో చెప్పేందుకు ఒక సంఘటన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఒకసారి ఒక వ్యక్తి విదేశాల నుంచి ఇడాకు ఉత్తరం రాశాడు. అతను ఇడా సామాజిక కార్యక్రమాలకు చాలా ప్రభావితం అయ్యాడు. ఇడాను ప్రశంసిస్తూ లేఖ రాశాడు. కానీ ఆమె చిరునామా మాత్రం అతనికి తెలియదు. చిరునామా స్థానంలో ఇడా.. ఇండియా అని మాత్రమే రాశాడు. అంతే, ఆ ఉత్తరం ఇడాకు చేరింది. అంటే, ఇడా అనే వ్యక్తి ఎక్కడ ఉంటారన్నది ఆ సమయంలో భారతదేశం మొత్తానికి తెలుసన్న మాట. సామాజిక సేవా లక్ష్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఇడా తన 89 సంవత్సరాల వయస్సులో1960, మే 23 న మరణించింది. ఆమె మరణానంతరం కూడా క్రిస్టియన్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. అత్యున్నత స్థాయి పరిశోధన, అభివృద్ధి కొనసాగింది. రోగుల చికిత్స ఎప్పుడూ ఆగలేదు. ఆసుపత్రిలో కొత్త విభాగాలు, కొత్త కోర్సులు ప్రారంభమవుతూ వచ్చాయి.

1961 సంవత్సరంలో క్రిస్టియన్ మెడికల్ కాలేజీ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇండియాలో ఇక్కడే మొట్టమొదటిసారిగా హార్ట్ సర్జరీ జరిగింది. అదే సంవత్సరం, చెవికి సంబంధించిన మైక్రోసర్జరీ కూడా చేశారు. భారతదేశంలోనే తొలిసారిగా కిడ్నీ డయాలసిస్ కూడా ఈ ఆసుపత్రిలోనే జరిగింది. 1962లో మెడికల్ రికార్డ్స్, ఫిజియోథెరపీ కోర్సులు ప్రారంభించారు. 1965లో వైరాలజీలో ఫ్లెమింగ్ మెమోరియల్ రీసెర్చ్ లాబొరేటరీ స్థాపించారు. 1966లో భారతదేశంలో ఇక్కడే మొదటి రీహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైంది. 1968లో కమ్యూనిటీ మెడిసిన్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్

కోర్సులు, 1969లో కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు ప్రారంభించారు. 1970లో భారతదేశంలో మొట్టమొదటి నెఫ్రాలజీ విభాగం ఈ కాలేజీలోనే ప్రారంభమైంది.

క్రిస్టియన్ మెడికల్ కాలేజీ గురించి, దాని చారిత్రాత్మక, విప్లవాత్మక విజయాల గురించి, అక్కడ పనిచేస్తున్న ప్రొఫెసర్లు, డాక్టర్ల గురించి తెలుసుకున్న శ్యామా ప్రసాద్ ఎంతో ఆకర్షితులయ్యారు. తన తండ్రి సలహా ప్రకారం.. తన సమయం, ఎనర్జీ ఉపయోగించి, కాలేజీలోని మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అన్నీ నేర్చుకోవాలనుకున్నారు. ఫైనల్‌గా సక్సెస్‌ఫుల్ సర్జన్ అవాలనేది శ్యామా ప్రసాద్ లక్ష్యం. కాబట్టి అతను ఎక్కువ సమయం ఆపరేషన్ థియేటర్‌లోనే గడిపేవారు. యూరాలజీ, కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీలలో చాలా కొత్త విషయాలు నేర్చుకున్నారు. వివిధ విభాగాల్లోని ఆపరేషన్ థియేటర్లలో ఎన్నో విషయాలు నేర్చుకోగలిగారు.

క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ప్రత్యేకత ఏంటంటే.. రోగులకు 24 గంటల పాటు ఆసుపత్రిలో చికిత్స అందుతుంది. రాత్రి పగలు తేడా లేకుండా ఆపరేషన్ థియేటర్లలో సర్జరీలు జరిగేవి. వైద్య విద్యార్థులు ప్రతిరోజు ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి ఇదే కారణం. పైగా అక్కడి ప్రొఫెసర్లు అందరూ అత్యంత అనుభవజ్ఞులు. వాళ్లు విద్యార్థులకు సాధ్యమైనన్ని అంశాల్లో సహాయం చేస్తారు. శస్త్రచికిత్స చేసే సమయంలోనే సర్జన్లు వ్యాధులు, వాటి చికిత్సల గురించి విద్యార్థులకు చెబుతారు. సర్జరీలోని అన్ని పద్ధతులు, వివిధ అంశాలను వివరంగా బోధించేవారు. సర్జరీ తరువాత విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు. విద్యార్థుల మదిలో ఉన్న సందేహాలన్నింటినీ నివృత్తి చేయడం ప్రతి ప్రొఫెసర్ తన బాధ్యతగా భావించేవారు. ప్రొఫెసర్ల పర్యవేక్షణలో విద్యార్థులు సర్జరీలు కూడా చేయొచ్చు. అలా శ్యామా ప్రసాద్‌కి కూడా ప్రొఫెసర్ల పర్యవేక్షణలో అనేక సర్జరీలు చేసే అవకాశం వచ్చింది.

ఇంతలో మొదటిసారిగా క్రిస్టియన్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో కిడ్నీ మార్పిడి జరుగుతోందన్న విషయం శ్యామా ప్రసాద్‌కి తెలిసింది. అప్పట్లో అది

సాదాసీదా విషయం కాదు. భారతదేశంలో అంతకు ముందు ఎప్పుడూ కిడ్నీ మార్పిడి చేయలేదు. ఏవో కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే కిడ్నీ మార్పిడి జరిగింది. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని చూడాలని శ్యామా ప్రసాద్ భావించారు. ఆ సర్జరీ చూస్తే తను కూడా చాలా విషయాలు తెలుసుకోవచ్చు అనుకున్నారు. ఆ కాలంలో కిడ్నీ మార్పిడికి చాలా సమయం పట్టేది. ప్రపంచంలోనే మొట్టమొదటి కిడ్నీ మార్పిడి చికాగోలో జరిగింది. రూత్ టక్కర్ అనే అమెరికన్ మహిళకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. డాక్టర్ రిచర్డ్ లొల్లర్ బృందం చనిపోయిన మహిళ కిడ్నీని రూత్ శరీరంలో అమర్చారు. మార్పిడి చేసిన కిడ్నీ తొమ్మిది నెలల పాటు రూత్ శరీరంలోనే ఉంది. ఇంతలో, ఆమె మరో కిడ్నీ మెరుగుపడింది. ఆ ఆపరేషన్ తరువాత ఆమె ఐదేళ్లపాటు బతికింది. 1954లో మొదటిసారిగా జీవించి ఉన్న మనిషికి కిడ్నీ మార్పిడి జరిగింది. రిచర్డ్ హెరిక్ జీవితాన్ని కాపాడటానికి, అతని కవల సోదరుడు రోనాల్డ్ కిడ్నీని దానం చేయాలని నిర్ణయించుకున్నాడు. బోస్టన్‌లోని వైద్యుల బృందం కిడ్నీ మార్పిడి సర్జరీ చేసింది. మూత్రపిండ మార్పిడిలో భాగంగా జీవించి ఉన్న వ్యక్తి మూత్రపిండాన్ని తీసుకుంటారు. దాన్ని మూత్రపిండాలు దెబ్బతిన్న లేదా అనారోగ్యంతో ఉన్న వ్యక్తి శరీరంలో ప్రవేశపెడతారు. కిడ్నీ ఫెయిల్యూర్‌తో అప్పట్లో చాలా మంది చనిపోయేవారు. దీంతో కిడ్నీ మార్పిడి సర్జరీ రోగులకు ఒక వరంలా మారింది.

అదే సమయంలో కిడ్నీ మార్పిడి అనేక ప్రమాదాలను కలిగి ఉండేది. చిన్నపాటి నిర్లక్ష్యం రోగికి ప్రాణాంతకంగా మారొచ్చు. నిపుణులు, అత్యంత నైపుణ్యం కలిగిన సర్జన్లు మాత్రమే కిడ్నీ మార్పిడిని చేయగలరు. ఈ ప్రక్రియను ఒక సర్జన్ మాత్రమే నిర్వహించలేరు. మూత్రపిండ మార్పిడి విజయవంతం కావాలంటే సర్జన్ల టీమ్ అవసరం. ఆ విషయం తెలియగానే శ్యామా ప్రసాద్ ఆ బృందంలో చేరాలని తెగ వెంపర్లాడిపోయారు. వెంటనే ప్రొఫెసర్ల దగ్గరికెళ్లి, సర్జరీ చూసేందుకు అనుమతించాలని అడిగారు. శ్యామా ప్రసాద్‌కి నేర్చుకోవడం పట్ల మక్కువ ఎక్కువ అని ప్రొఫెసర్‌లకు బాగా తెలుసు. పైగా సక్సెస్‌ఫుల్ సర్జన్ అవడానికి కావాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయి. శ్యామా

ప్రసాద్ అభ్యర్థనను ప్రొఫెసర్ అంగీకరించడానికి కారణం ఇదే. కానీ కిడ్నీ మార్పిడికి సంబంధించిన మొత్తం ప్రక్రియను పూర్తయ్యేంత వరకు ఉండాలనే షరతు విధించారు. ఆపరేషన్ థియేటర్లోకి వచ్చే పీజీ విద్యార్థులందరికీ ఆ నిబంధన ఉండేది. 4 గంటలకల్లా ఆపరేషన్ థియేటర్‌కు వచ్చే విద్యార్థులను మాత్రమే సర్జరీ చూసేందుకు అనుమతిస్తామని ప్రొఫెసర్లు విద్యార్థులకు తెలిపారు. కిడ్నీ మార్పిడికి ముందురోజు రాత్రి శ్యామా ప్రసాద్‌కి అస్సలు నిద్ర పట్టలేదు. నిద్ర పోయినా, సమయానికి నిద్ర లేవలేని పక్షంలో ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని చూసే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందని భావించారు.

కిడ్నీ మార్పిడి వార్త చర్చనీయాంశంగా మారింది. చాలా మంది సర్జన్లు, వైద్యులు ఆపరేషన్ జరుగుతున్నప్పుడు తమ కళ్లతో స్వయంగా చూడాలనుకున్నారు. ఎందుకంటే, కిడ్నీ మార్పిడి చాలా క్లిష్టమైన ప్రక్రియ. పైగా ఆపరేషన్ థియేటర్ పరిశుభ్రత చాలా అవసరం కాబట్టి, చాలా మందిని లోపలికి అనుమతించలేదు. అలాంటిది ఆ సర్జరీని చూసే అవకాశం శ్యామా ప్రసాద్‌కు రావడం తన అదృష్టంగా భావించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశాన్ని వదులుకోకూడదనుకున్నారు. ఆ ఆనందంతో రాత్రంతా నిద్ర కూడా పోలేదు. సరిగ్గా తెల్లవారుజామున 4 గంటలకు ఆపరేషన్ థియేటర్‌కి చేరుకున్నారు. ఒక సర్జన్ రోగి శరీరంలో పెట్టబోతున్న కిడ్నీని అతనికి చూపించాడు. కిడ్నీ మార్పిడి పట్ల ఆసుపత్రిలో ఉన్న వారంతా చాలా సంతోషంతో, ఉల్లాసంగా ఉన్నారు. నిర్ణీత సమయానికి ఆపరేషన్ ప్రారంభమైంది. రోగి శరీరం నుంచి దెబ్బతిన్న కిడ్నీని తొలగించారు. దాత శరీరం నుంచి తీసిన ఆరోగ్యకరమైన కిడ్నీతో భర్తీ చేశారు. మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి ఆరు గంటలకు పైగా సమయం పట్టింది.

శ్యామా ప్రసాద్ మొత్తం ప్రక్రియను ఆసక్తిగా చూశారు. కిడ్ని మార్పిడి విజయవంతంగా పూర్తైంది. ఈ చారిత్రాత్మక విజయం క్రిస్టియన్ మెడికల్ కాలేజీలోని వారినే కాకుండా భారతీయ వైద్య రంగంలోని ప్రతి ఒక్కరికీ ఆనందాన్నిచ్చింది. శ్యామా ప్రసాద్‌ను కూడా ఆ సర్జరీ విశేషంగా ఆకర్షించింది. అది అతని మనసులో తెలియని కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆనాటి సంఘటన

అతని మనసులో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. నేర్చుకోవాలనే తపనను ఇంకా అలాగే కొనసాగించాలనుకున్నారు. శ్రమ లేకుండా ఏదీ సాధించలేం, అసాధ్యమైనది కూడా ఏదీ లేదు. భారతీయ వైద్యులు ప్రపంచంలోని మరెవరికీ తీసిపోరని ఈ ఘటన నిరూపించింది. భారతదేశంలో కూడా మేజర్ సర్జరీలు జరుగుతున్న కాలమది. అంత పెద్ద విజయాలకు తాను కూడా ఒక సాక్ష్యంలా నిలవడం జీవితంలో కొత్త అర్థాన్ని, కొత్త మార్పుని కనుగొన్నట్లుగా భావించారు. క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో శ్యామా ప్రసాద్‌పై డాక్టర్ గణేశన్ ప్రభావం ఎక్కువగా ఉండేది. అతను ఫేమస్ సర్జన్. అతను శ్యామా ప్రసాద్‌కి వివిధ వ్యాధులకు చికిత్స చేయడానికి వేర్వేరు శస్త్రచికిత్సల గురించి చెప్పాడు. అంతేకాదు సర్జరీలు చేయడానికి శ్యామా ప్రసాద్‌కు అనేక అవకాశాలు ఇచ్చాడు. డాక్టర్ లిల్లీ జాన్ పని తీరు శ్యామా ప్రసాద్‌కు నచ్చింది. ఆమె కార్డియాక్ సర్జరీలు చేసేవారు. ప్రొఫెసర్ రామచంద్రరావు కూడా శ్యామా ప్రసాద్‌కి చాలా సహాయం చేశారు. అతను ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన తెలుగు వారే.

సాధారణంగా వెల్లూరులో శ్యామా ప్రసాద్‌కి దొరికే సమయం చాలా తక్కువ. సమయం దొరికినప్పుడల్లా స్నేహితులతో కలిసి చదువుకొనేవారు. సెలవుల్లో తన స్నేహితులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. వేలూరులోని సినిమా థియేటర్లలో ఎక్కువగా తమిళ సినిమాలే ప్రదర్శించారు. అక్కడ ఉన్న ఒక ఏడాది కాలంలో శ్యామా ప్రసాద్ చాలా తమిళ సినిమాలు చూశారు. వెల్లూరులో ఉండడం వల్ల తమిళ భాషపై పట్టు కూడా వచ్చింది. అవకాశం దొరికినప్పుడల్లా తిరుపతి కూడా వెళ్లేవారు. ఇంట్లోని వారితో ఆనందంగా సమయం గడిపిన తర్వాత తిరిగి వెల్లూరు వెళ్లేవారు.

వెల్లూరులో గడిపిన ఒక సంవత్సరం శ్యామా ప్రసాద్ జీవితాన్నే మార్చేసింది. అతను పొందిన అధునాతన శిక్షణ కారణంగా తనలో విశ్వాసం బాగా పెరిగింది. క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో ఒక సంవత్సరం శిక్షణ తీసుకున్న తరువాత శ్యామా ప్రసాద్.. కోర్సు చివరి సంవత్సరాన్ని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో పూర్తిచేశారు.

పీజీ కోర్సులో ఉండగా శ్యామా ప్రసాద్ రక్తదానం చేయమని ప్రజలను ప్రోత్సహించేవారు. తను కూడా ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయడాన్ని

అలవాటు చేసుకున్నారు. ఎవరికైనా 'ఓ' గ్రూపు రక్తం అవసరమైనప్పుడు, శ్యామా ప్రసాద్ సిద్ధంగా ఉండేవారు. శ్యామా ప్రసాద్ మెడికల్ కాలేజీలో ఒక డైరెక్టరీని తయారుచేశారు. ఆసుపత్రిలో రక్తం కొరత ఏర్పడినప్పుడల్లా విద్యార్థులు దానం చేసేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. విద్యార్థులందరి బ్లడ్ గ్రూప్, అడ్రస్ రిజిస్టర్‌లో పెట్టారు. ఏదైనా నిర్దిష్ట బ్లడ్ గ్రూప్ అవసరం వచ్చినప్పుడు, ఆసుపత్రి యాజమాన్యం ఈ విద్యార్థులను సంప్రదించేది. అయితే, రక్తదానం చేయవద్దని శ్యామా ప్రసాద్ తల్లి పదే పదే సలహా ఇచ్చేవారు. అతను సన్నగా ఉండడంతో, రక్తదానం చేస్తే మరింత బలహీనమవుతాడని భావించేవారు. కానీ సుందరయ్య ఆమె భయాన్ని పోగొట్టడానికి ప్రయత్నించేవారు. అంతేకాదు సుందరయ్య, శ్యామా ప్రసాద్ రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు ఎప్పుడూ చెబుతుండేవారు. సర్జరీల సమయంలో చాలా రక్తం పోతుందని వారికి చెప్పేవారు. ఆపరేషన్ సమయంలో, ఆ తర్వాత రక్తం అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది. సకాలంలో రక్తం అందించకపోతే రోగి చనిపోవచ్చు. కాబట్టి రక్తదానం చేస్తే అది ఇతరుల ప్రాణాలను కాపాడుతుంది. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయలేరని తెలుసుకోవడం కూడా ముఖ్యమే. ఎందుకంటే, ఆరోగ్యవంతులు మాత్రమే రక్తదానం చేయగలరు. జబ్బులతో బాధపడే వారు రక్తదానం చేయడానికి అనర్హులు.

1900-1902లో ప్రసిద్ధ జీవశాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్‌స్టైనర్ రక్తాన్ని నాలుగు గ్రూపులుగా వర్గీకరించారు. రక్తంలో A, B, AB, O అనే గ్రూపులు ఉంటాయని గుర్తించారు. O మినహా, ఇతర గ్రూపులలో రక్త కణాలలో యాంటిజెన్‌లు ఉంటాయి. అందువల్ల ఓ గ్రూపు రక్తాన్ని మరే ఇతర గ్రూపు రక్తం ఉన్న వారైనా దానం చేయవచ్చు. అందుకే 'ఓ' గ్రూప్‌ని యూనివర్సల్ డోనర్ అంటారు. AB గ్రూపును యూనివర్సల్ రిసీవర్ అంటారు. ఎందుకంటే ఇది ఏదైనా ఇతర బ్లడ్ గ్రూప్ నుంచి రక్తాన్ని స్వీకరించగలదు. సాధారణంగా, O నెగటివ్ చాలా తక్కువ మంది వ్యక్తులలో ఉంటుంది. ఇది అరుదైన రక్త రకం. కానీ O నెగటివ్ కంటే చాలా అరుదైన బ్లడ్ గ్రూప్ ఇంకోటి ఉంది. ఇది లక్ష మందిలో ఒకరిలోనే ఉంటుంది. అదే బాంబే బ్లడ్ గ్రూప్ లేదా hh. దీన్నే అరుదైన బ్లడ్ గ్రూపులలో అత్యంత అరుదైనది అని కూడా అంటుంటారు. ప్రపంచంలో కేవలం 0.0004

శాతం మందికి మాత్రమే ఈ గ్రూపు రక్తం ఉంది. డాక్టర్ వై. ఎం. భేండే 1952లో ఈ బ్లడ్ గ్రూప్‌ను కనుగొన్నారు. బొంబాయిలోని కొంతమందిలో మొదట కనుగొనబడినందున ఈ గ్రూపును బొంబాయి బ్లడ్ గ్రూప్ అని పిలుస్తారు. ఈ గ్రూప్‌లోని ఫినోటైప్ రియాక్షన్‌లో 'హెచ్' యాంటిజెన్ ఉందని వెల్లడైంది. ఈ రకం బ్లడ్ గ్రూప్ మునుపెన్నడూ కనిపించలేదు. ఈ గ్రూపులోని ఎర్ర రక్త కణాలు AB యాంటిజెన్‌ను కలిగి ఉంటాయి. దీని సీరంలో యాంటీ A, యాంటీ B, యాంటీ h ఉంటాయి. ABO గ్రూపులో యాంటీ h ఉంటుందని తేలింది. ప్రీట్రాన్స్ ఫ్యూజన్ పరీక్షలు దీన్ని బయటపెట్టాయి. ఈ h యాంటిజెన్ ABO బ్లడ్ గ్రూప్‌లో బిల్డింగ్ బ్లాక్‌గా పనిచేస్తుంది. ఈ యాంటిజెన్ లోపాన్ని బాంబే ఫినోటైప్ అంటారు. బాంబే బ్లడ్ గ్రూప్ వ్యక్తులు ABO బ్లడ్ గ్రూప్ వ్యక్తులకు దానం చేయవచ్చు. కానీ వారి నుంచి మాత్రం రక్తాన్ని స్వీకరించలేరు. ఈ గ్రూపు వారు.. వారి సొంత రకం నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. సాధారణంగా, ఈ రక్తం సన్నిహిత రక్త సంబంధాలలో మాత్రమే కనిపిస్తుంటుంది. బొంబాయిలో ఈ సమూహంలో బహుశా 0.01 శాతం మంది ఉన్నారు. తల్లిదండ్రులకు బొంబాయి రకం రక్తం ఉంటే పిల్లలకు నీనీ రకం రక్తం వచ్చే అవకాశం ఉంటుంది.

ఎంఎస్ చదవడం అంత సులభం కాదు. ఒక విద్యార్థి ఆపరేషన్ థియేటర్‌లోనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తుంది. పైగా చాలా పుస్తకాలను అధ్యయనం చేయాలి. పరిశోధనలు, పరీక్షలు చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు రాత పరీక్ష, వైవా పరీక్షలకు హాజరుకావాలి. పరీక్షలు కూడా అంత సులభం కాదు. సిలబస్ చాలా విస్తృతంగా ఉంటుంది. శ్యామా ప్రసాద్ ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తున్నప్పుడు చాలా విషయాలు నేర్చుకున్నారు. ఆ నేర్చుకునే ప్రక్రియ చాలా కాలం పాటు సాగింది. సీనియర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్యామా ప్రసాద్ పట్ల సంతృప్తి వ్యక్తం చేసేవారు. ఎందుకంటే, రోగులను ఆదుకోవడంలో చాలా మంది విద్యార్థుల కంటే శ్యామా ప్రసాద్ చాలా చురుకుగా ఉండేవారు. శ్యామా ప్రసాద్‌కి ప్రాక్టికల్ పరీక్షలంటే అస్సలు భయం లేదు. కానీ రాతపరీక్ష అంటే మాత్రం భయపడేవారు. అందుకే, పరీక్షలు వస్తున్నాయంటే చాలు పుస్తకాలతో కుస్తీ పట్టేవారు. పైగా చదవాల్సిన పుస్తకాలు

చాలా ఉంటాయి. ప్రతిదీ గుర్తుంచుకోవడం కష్టం. శ్యామా ప్రసాద్ తన ప్రిపరేషన్‌కు సంబంధించినంత వరకు ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టేవారు కాదు. కానీ అతనికి సర్జరీలు చేయడం అంటే ఇష్టం గానీ పరీక్షలు రాయడం ఇష్టం ఉండేది కాదు. సర్జరీలో చాలా తక్కువ రాత పరీక్ష ఉండాలని, ఎక్కువ దృష్టి ప్రాక్టికల్‌గా ఉండాలని నమ్మేవారు. కానీ వైద్య విద్య నిబంధనలను ఎవరూ మార్చలేరు కదా. రాత, వైవా, ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే పట్టా చేతికి అందుతుంది.

ఒకసారి ప్రిపేరేషన్‌లో భాగంగా శ్యామా ప్రసాద్ టెక్ట్స్ బుక్స్ చదువుతున్నారు. ఒక చాప్టర్‌లోకి వెళ్లినప్పుడు అతను మునుపటిదాన్ని మరచిపోయేవారు. ఇది రోజుల తరబడి కొనసాగింది. శ్యామా ప్రసాద్‌కు చాలా భయమేసింది. తనకు ఏకాగ్రత సమస్య ఉందని గ్రహించారు. ఆ సమస్య నుంచి బయటపడడానికి పరీక్షకు ఒక రోజు ముందు డెక్సెడ్రిన్ టాబ్లెట్ తీసుకునే వారు. డెక్సెడ్రిన్ టాబ్లెట్ ఏకాగ్రతను పెంపొందించడానికి సహాయపడుతుందని తన ప్రొఫెసర్లు చెబుతుండగా విన్నారు. ఈ టాబ్లెట్ వేసుకుంటే ఆ వ్యక్తి ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటాడు, పైగా విశ్వాసం పెరిగి, భయం పోతుంది. ఇది నిద్రను కూడా దూరం చేస్తుంది. పరీక్షకు ముందు రోజు రాత్రి ఈ టాబ్లెట్ వేసుకోవాలని శ్యామా ప్రసాద్ అనుకున్నారు. దానివల్ల నిద్రపోకుండా ఉండొచ్చని, ఏకాగ్రతను మరింత పెంచుతుందని భావించారు. ఆ టాబ్లెట్ వేసుకుని రాత్రంతా చదివేవారు. అయితే పరీక్ష హాలుకు చేరుకోగానే ప్రశ్నపత్రం చూసి షాక్ అయ్యేవారు. క్వశ్చన్ పేపరులో అతనికి ఒక్క సమాధానం కూడా తెలియలేదు. టాబ్లెట్ అతనిపై రివర్స్ ప్రభావాన్ని చూపింది. చదివిందంతా మర్చిపోయారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అతనికి ఏమీ గుర్తు రాలేదు. ఒక వాక్యం కూడా సరిగ్గా రాయలేకపోయారు. ఆ సమయంలో తన మీద తనకే కోపం వచ్చింది. తనను తాను అసహ్యించుకోవడం మొదలుపెట్టారు. ఆ పరిస్థితి చూసి పరీక్షల్లో ఇక ఎప్పుడూ పాస్ కాలేననే అధైర్యం ఆవహించింది. అదే నిరాశ, నిస్పృహలతో ఇంటికి తిరిగి వెళ్లారు. ఊహించినట్లుగానే ఈ పరీక్షలో ఫెయిలయ్యారు. తన జీవితంలో ఏ పరీక్షలోనూ ఫెయిలవలేదు. ఒకటో తరగతి నుంచి ఎంబిబిఎస్ వరకు ఏ పరీక్షలోనూ ఫెయిల్ కాలేదు. ప్రవేశ పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు

సాధించాడు. అలా జరగడం అదే మొదటిసారి. MS కోర్సు చేస్తున్నప్పుడు కూడా ఉత్తమ విద్యార్థుల లిస్టులో శ్యామా ప్రసాద్ పేరు ఉండేది. ప్రొఫెసర్లందరికీ ఆయనంటే అభిమానం. శ్యామా ప్రసాద్ ఖచ్చితంగా పాస్ అవుతాడని అందరూ నమ్మారు. కానీ అనుకున్నది జరగలేదు. ఫలితాలు చూసి ప్రొఫెసర్లు అవాక్కయ్యారు. సుందరయ్య కూడా తన కొడుకు ఫెయిల్ అయ్యాడంటే నమ్మలేకపోయారు. అతని కొడుకు అద్భుతమైన సర్జన్ అవుతాడని ప్రొఫెసర్లందరూ చెప్పారు. పైగా కష్టపడేతత్వం, సర్జరీలో లోతైన జ్ఞానం, నైపుణ్యాలు కూడా ఉన్నాయి. రోగుల సంరక్షణలో కూడా అందరికంటే ముందుండేవారు. అలాంటిది తన కొడుకు పరీక్షలో ఫెయిల్ కావడం వెనుక కారణం ఏమిటో సుందరయ్యకు అర్థం కాలేదు. ఫెయిల్ అవడానికి అతనిలో ఒక్క కారణం కూడా కనిపించలేదు. సుందరయ్య ఇతర ప్రొఫెసర్లు శ్యామా ప్రసాద్‌ను ఓదార్చేందుకు ప్రయత్నించారు. గుండె ధైర్యం కోల్పోవద్దని చెప్పారు. శేషాచారి మరింత ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఒక పరీక్షలో ఫెయిల్ అయినంత మాత్రాన ఏమీ అవ్వదని, చురుకైన విద్యార్థులు సైతం పరీక్షల్లో ఫెయిల్ అవుతుంటారని కొన్ని ఉదాహరణలు చెప్పారు. వైద్య విద్యలో ఫెయిల్ అయిన డాక్టర్లు, సర్జన్లు చాలా మంది ఉన్నారని, వాళ్లంతా తరువాత కాలంలో చాలా సక్సెస్ సాధించారని ఊరడించే ప్రయత్నం చేశారు. నువ్వు కూడా గొప్ప సర్జన్ అవుతావనే నమ్మకం నాకు పూర్తిగా ఉందంటూ వెన్నుతట్టారు. ఆ క్షణం తరువాత శ్యామా ప్రసాద్ తన తప్పులను అర్థం చేసుకున్నారు. పరీక్షకు ప్రిపేర్ అయ్యే విషయంలో ఎలాంటి మెడిసిన్ సహాయం తీసుకోనని తనకు తానే వాగ్దానం చేసుకున్నారు. అన్ని రకాల పరీక్షలకు గట్టిగా ప్రిపేర్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. ఆ సంఘటన తర్వాత శ్యామా ప్రసాద్ సర్జరీలతోపాటు పుస్తకాల మీద కూడా దృష్టి సారించారు. చాలా పకడ్బందీగా ప్రిపరేషన్ సాగించారు. అలా తన ప్రిపరేషన్‌తో ప్రతి పరీక్షలోనూ పాస్ అవుతూ వచ్చారు. ఒకసారి ఫెయిల్ అవడం వల్ల MS కోర్సు క్లియర్ చేయడానికి నాలుగు సంవత్సరాల బదులు ఐదేళ్లు పట్టింది. 1982లో శ్యామా ప్రసాద్ మాస్టర్ ఆఫ్ సర్జరీ పట్టా పొందారు.

ఎంఎస్ డిగ్రీ పట్టా పొందిన కొన్ని నెలలకే శ్యామా ప్రసాద్‌కు ప్రభుత్వ ఉద్యోగం లభించింది. చిత్తూరు జిల్లా పైపాల్యం గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆయన డాక్టర్‌గా నియమితులయ్యారు. ఈ గ్రామం మరియు చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలందించడం మొదలుపెట్టారు. గ్రామీణ ప్రాంతం కావున తేలు, పాము కాటుకు సంబంధించిన కేసులు ఆరోజుల్లో సాధారణంగా ఎక్కువగా ఉండేవి. చిన్నపాటి తలనొప్పి నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడేవారుసైతం చికిత్సకోసం ఈ క్లినిక్ వచ్చేవారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లో చికిత్సకు వీలుకానప్పుడు రోగులకు దగ్గర్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపించేవారు. అక్కడ కూడా వైద్యం అందని పరిస్థితి ఎదురైతే జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసేవారు. పైపాల్యంలో కొన్ని నెలలు సేవలందించిన తరువాత శ్యామా ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బదిలీ చేసింది. నెల్లూరు జిల్లాలోని మల్లం గ్రామానికి ఆయన బదిలీ అయ్యారు. రోగులకు చికిత్స అందించేందుకు శ్యామా ప్రసాద్ ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచి ఉండేవి. రోగులకు చికిత్స అందించడంలో ఆయన పూర్తి సంతృప్తి చెందేవారు. మల్లంలో విశేష సేవలందించి ప్రజల మన్ననలు పొందిన శ్యామా ప్రసాద్‌ను ప్రభుత్వం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించింది. తాను ఎంబిబిఎస్, ఎంఎస్ డిగ్రీలు పూర్తిచేసిన కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులవ్వడం శ్యామా ప్రసాద్‌కు అత్యంత సంతోషం కల్గించింది. ఎక్కడైతే పాఠాలు నేర్చుకున్నారో అక్కడే పాఠాలు చెప్పే బాధ్యత రావడం గొప్ప విషయంగా భావించారు. ఈ సమయంలోనే 1986, మార్చ్ 23న లక్ష్మీరాజ్యం, శ్యామా ప్రసాద్ లకు రెండవ సంతానం కల్గింది. ఇద్దరి ప్రేమకు గుర్తుగా తిరుపతిలో పుట్టిన ఆమెకు సుమ అను నామకరణం చేసారు. సుమ పుట్టిన కొద్దినెలలకు శ్యామా ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి బదిలీ చేసారు. ఈ ఆసుపత్రిలో ప్రొఫెసర్ ఎల్. భాస్కర్ రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న యూనిట్‌లో తను చికిత్స సేవలు అందించడం మొదలు పెట్టారు. హైదరాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రిలో పనిచేస్తుండగా ఆయన రకరకాల సర్జరీలు చేసారు. పిల్లల వ్యాధుల చికిత్సలో నైపుణ్యం సాధించాలనే కోరిక కల్గింది. అందుకోసం ఆయన 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా'

(ఎం.సిహెచ్) డిగ్రీ కోసం జరిగే ఎంట్రన్స్ ఎగ్జాం వ్రాసారు. ఎం.సి.హెచ్. డిగ్రీ సర్జరీలో అత్యంత ఉన్నతమైన కోర్స్. ఎంట్రన్స్ ఎగ్జాంలో సాధించిన ర్యాంకు అధారంగా శ్యామా ప్రసాద్‌కు విశాఖపట్నంలోని ఆంధ్రామెడికల్ కాలేజీలో సీటు లభించింది. ప్రభుత్వ సర్వీసులో ఉండగానే ఆయన ఎం.సి.హెచ్ కోర్స్ ప్రారంభించారు. సాధారణంగా ఎం.సి.హెచ్ కోర్స్ చేసే విద్యార్థి ఒకే యూనివర్శిటీ సర్జరీ ప్రక్రియను నేర్చుకుంటారు. కానీ శ్యామా ప్రసాద్ కు భారతదేశంలోనే అత్యంత ఉన్నతమైన మెడికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ఉన్నత ప్రొఫెసర్ల వద్ద శిక్షణ పొందారు. మద్రాస్ మెడికల్ కాలేజ్, వెల్లూరు క్రిష్టియన్ మెడికల్ కాలేజ్, ఎగ్మోర్ చిల్డ్రన్స్ ఆసుపత్రి, ఉస్మానియా మెడికల్ కాలేజ్, గాంధీ మెడికల్ కాలేజ్, ఢిల్లీలోని ఎయిమ్స్, చండీగర్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆండ్ రీసెర్చ్ లాంటి సంస్థలలో ట్రైనింగ్ తీసుకున్నారు.

కొన్నిసార్లు శిశువుకు పుట్టిన కొన్ని గంటల వ్యవధిలోనే శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడాల్సి ఉంటుంది. ప్రతి సర్జన్ చిన్నపిల్లలకు ఆపరేషన్ చేయలేరు. శిశువులకు శస్త్రచికిత్స నిర్వహించేందుకు ప్రత్యేక శిక్షణ అవసరం. శ్యామా ప్రసాద్ ఎంఎస్ పూర్తి చేసి కింగ్ జార్జ్ ఆసుపత్రిలో పనిచేయడం ప్రారంభించినప్పుడు ఆయనకు పీడియాట్రిక్స్ విభాగంలో డ్యూటీ కేటాయించారు. శ్యామా ప్రసాద్ మొదటి రోజు నుంచే పిల్లలకు సర్జరీ చేయడం ప్రారంభించారు. చిన్నారులకు శస్త్రచికిత్స చేయడం అంత సులభం కాదు. పెద్దలతో పోలిస్తే పిల్లల శస్త్రచికిత్సలో ఎంతో రిస్క్ ఉంటుంది.

చాలా సందర్భాలలో, శిశువు పుట్టిన వెంటనే శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. సాధారణంగా పుట్టుకతో వచ్చే వైకల్యం లేదా ఏదైనా వ్యాధి లక్షణాలు కనిపించినట్లయితే, పిల్లల ప్రాణాలు కాపాడేందుకు శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు భావిస్తారు. ఎక్కడైతే ఔషధాలతో వ్యాధులు నయమయ్యే పరిస్థితి ఉందో, అక్కడ ఔషధాలే ఉపయోగిస్తారు. కానీ శస్త్రచికిత్స చేయడం తప్పనిసరి అయితే పుట్టిన వెంటనే శస్త్రచికిత్స చేస్తారు. ఆ ఆపరేషన్ ఆలస్యమైన పక్షంలో శిశువు మరణం సంభవించవచ్చు.

వ్యాధిని గుర్తించిన వెంటనే శస్త్రచికిత్స చేయడం సాధ్యం కాదు. శస్త్రచికిత్సకు ముందు శిశువును సమగ్రంగా పరీక్షించాల్సి ఉంటుంది. రక్తపరీక్షలు చేయాలి. ఎక్స్-రే లేదా సోనోగ్రఫీ అవసరం కావచ్చు. శస్త్ర చికిత్స సమయంలో శరీరం నుంచి చాలా రక్తం బయటకు వస్తుంది. దాన్ని భర్తీ చేసేందుకు రక్తం సిద్ధంగా ఉండాలి. రక్తహీనత కారణంగా రోగి మరణించే ప్రమాదం కూడా ఉంటుంది. ఆపరేషన్ థియేటరును శానిటైజ్ చేయడం తప్పనిసరి. ఆపరేషన్ తర్వాత శిశువుకు వైద్య సంరక్షణ అవసరం. అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. సకాలంలో మందులు ఇవ్వాలి. కింగ్ జార్జ్ ఆసుపత్రిలో, శ్యామా ప్రసాద్‌కు నవజాత శిశువు నుంచి 18–సంవత్సరాల వయస్సు వారికి శస్త్రచికిత్స చేసే అవకాశం వచ్చింది. పీడియాట్రిక్స్ విభాగంలో, నవజాత శిశువు నుంచి 18–సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు శస్త్రచికిత్స చేస్తారు. పీడియాట్రిక్ సర్జరీ డిపార్ట్మెంట్‌కి రెఫర్ చేసిన కేసులు చాలా వరకు పేగులు అడ్డుకోవడం లేదా విసర్జన నాళాలు అడ్డుపడినవేనని శ్యామా ప్రసాద్ గమనించారు. హెర్నియా, పేగులకు చిల్లులు, తల పెరిగిపోవడం వంటి కేసులు కూడా కొన్ని ఉంటాయి.

ఆ రోజుల్లో క్యాన్సర్‌తో బాధపడే పిల్లల సంఖ్య కూడా ఎక్కువే ఉండేది. అజాగ్రత్త లేదా సరైన సమయంలో చికిత్స ప్రారంభించకపోవడం వల్ల క్యాన్సర్‌తో చాలా మంది పిల్లల మరణించేవారు. శిశు సర్జరీలో ప్రావీణ్యం సంపాదించడం, వివిధ వ్యాధుల చికిత్స కోసం శస్త్రచికిత్స పద్ధతులు నేర్చుకోవడమే లక్ష్యంగా ‘మాస్టర్ ఆఫ్ చిరుర్గియా’ కోర్సులో అడ్మిషన్ పొందారు. ఈ కోర్సులో భాగంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ ఆసుపత్రి కాకుండా దేశంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రులకు వెళ్లి అక్కడి నిపుణుల వద్ద శిక్షణ తీసుకున్నారు. చెన్నై ఎగ్మోర్లోని పిల్లల ఆసుపత్రి గురించి శ్యామా ప్రసాద్ చాలా గొప్పగా విన్నారు. తనకు నెలల నిండక ముందే పుట్టిన మొదటి సంతానం ఆరోగ్యంపై అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు తన కుమారుడిని శ్యామా ప్రసాద్ ఎగ్మోర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నవజాత శిశువుల చికిత్సకు ఎగ్మోర్ శిశు ఆస్పత్రి అత్యుత్తమ వైద్య కేంద్రమని శ్యామా ప్రసాద్‌కు తండ్రి సుందరయ్య

చెప్పారు. ఈ ఆసుపత్రిని బ్రిటిష్ కాలంలో స్థాపించారు. స్వాతంత్ర్యం తరువాత ఈ ఆసుపత్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ ఆసుపత్రికి వైద్యం కోసం దూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తారు. అప్పట్లో ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేవి. ఎగ్మోర్లోని ఆసుపత్రిలో ప్రతిరోజూ అనేక ప్రసవాలు జరిగేవి. కొన్ని సమయాల్లో, ఒక రోజులో రెండు డజన్ల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. నవజాత శిశువు పరిస్థితి బాగా లేకున్నా లేదా పుట్టుకతో వచ్చిన సమస్యలు ఏమైనా ఉంటే, అలాంటి వాటికి చికిత్స అందించేందుకు అక్కడ ఏర్పాట్లు ఉన్నాయి. ఆసుపత్రిలో 24 గంటలూ పిల్లల వైద్యులు, ఇతర డాక్టర్లు అందుబాటులో ఉంటారు. అవసరమైతే, వెంటనే శస్త్రచికిత్స నిర్వహించేందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయి. ఆసుపత్రిలో చిన్నారులకు శస్త్ర చికిత్సలు అక్కడ నిత్యం జరుగుతూనే ఉంటాయి. పిల్లలకు సంబంధించిన అనేక వ్యాధులకు చికిత్స అందించే ఒకే ప్రాంగణం కావడంతో ఎగ్మోర్ ఆస్పత్రిలో శిక్షణ తీసుకోవాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించుకున్నారు.

ఎగ్మోర్ ఆస్పత్రిలో శిక్షణ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ అనేక విషయాలు నేర్చుకున్నారు. ఈ ఆసుపత్రిలో పిల్లల చికిత్స కోసం అప్పట్లో రెండు వేల పడకలు ఉండేవి. ఇది మొత్తం ఆసియా ఖండంలోనే అతి పెద్ద పిల్లల ఆసుపత్రి. ఇక్కడ శస్త్రచికిత్స నిర్వహించేందుకు 6యూనిట్లు పని చేసేవి. ఒక్కో యూనిట్‌కు ఒక ప్రొఫెసర్ నేతృత్వం వహిస్తారు. ప్రతి బృందంలో ఒక అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు అనేక మంమది వైద్య విద్యార్థులు ఉంటారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు జరుగుతుంటాయి. రోజూ రాత్రి వేళలో కూడా పది, పన్నెండు సర్జరీలు జరిగేవి. ఎగ్మోర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయడం ద్వారా శ్యామా ప్రసాద్ ఎంతో అనుభవం గడించారు.

బిడ్డ పుట్టినందుకు తల్లిదండ్రులు చాలా సంతోషిస్తారనే విషయం శ్యామా ప్రసాద్‌కు అనుభవంలోకి వచ్చింది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. కాని పుట్టిన బిడ్డకు ఏదైనా జబ్బు, అంగవైకల్యం

ఉందంటే అది ఆ కుటుంబసభ్యులను ఎంతో నిరాశాకు గురిచేస్తుంది. సంతోషం దుఃఖంగా మారుతుంది. మనస్సులో రకరకాల సందేహాలు తలెత్తుతాయి.

పెదవులు, అంగిలి చీలిపోయి పుట్టిన శిశువులను కూడా కొన్ని సందర్భాల్లో శ్యామా ప్రసాద్ చూశారు. అలాంటి బిడ్డను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయేవారు. శస్త్రచికిత్సతో ఆ వైకల్యం తొలగిపోతుందని అనుభవజ్ఞులైన వైద్యులు తల్లిదండ్రులకు వివరించేవారు. సర్జరీ ద్వారా పెదవి, అంగిలిని సరిచేసే అవకాశం డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు వచ్చింది. క్యాన్సర్ బారిన పడ్డ పిల్లలకు శస్త్రచికిత్స చేసి వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఎగ్మోరు ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న సందర్భంలో డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు లభించింది.

మద్రాసులో ఉంటున్న సమయాన్ని డాక్టర్ శ్యామా ప్రసాద్ సద్వినియోగం చేసుకున్నారు. మద్రాసు మెడికల్ కాలేజీకి కూడా వెళ్లారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ తండ్రి డాక్టర్ సుందరయ్య ఈ సంస్థలోనే మెడిసిన్ చదువుకున్నారు. మద్రాసు మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న జనరల్ హాస్పిటల్లో కూడా శ్యామా ప్రసాద్ శిక్షణ పొందారు. అక్కడి పీడియాట్రిక్స్ విభాగంలో చాలా సమయం గడిపారు. పిల్లలకు కలిగే వ్యాధులు, వాటి చికిత్స కోసం అందించే కొత్త మార్గాలు చూడడమే కాదు వాటిని సమగ్రంగా నేర్చుకున్నారు.

1853లో ప్రారంభమైన మద్రాసు జనరల్ హాస్పిటల్లో గతంలో పిల్లల వ్యాధుల చికిత్సకు ప్రత్యేక విభాగం లేదు. పెద్దల వైద్యులే పిల్లలకు కూడా చికిత్స చేసేవారు. 1948లో ప్రముఖ శిశువైద్యుడు ప్రొఫెసర్ ఎస్. టి. ఎచెర్ మద్రాస్ జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగాన్ని నెలకొల్పారు.

40వ దశకంలో భారతదేశంలో 15 మంది శిశువైద్యులు మాత్రమే ఉండేవారు. వారిలో ఆరుగురు శిశువైద్యులు బొంబాయిలో, ఇద్దరు ఢిల్లీలో, ఇద్దరు మద్రాసులో, మరో ఐదుగురు శిశు వైద్యులు కలకత్తాలో ఉండేవారు.

భారతదేశంలో పీడియాట్రిక్ మెడిసిన్ 1928లో బొంబాయిలో ప్రారంభమైంది. ఆనాటి ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త సర్ నెస్ వాడియా, వారి సోదరుడు సర్ కుస్రో వాడియా బొంబాయిలో పిల్లల కోసం ప్రత్యేక ఆసుపత్రి

ఏర్పాటు చేయాలని భావించారు. అన్నదమ్ములిద్దరూ కలిసి బాంబే డైయింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ నడిపేవారు. సోదరులిద్దరూ అనేక విద్యా సంస్థలను ప్రారంభించారు. ఇద్దరూ తమ తల్లి బాయి జెర్బాయి వాడియా జ్ఞాపకార్థం పిల్లల కోసం 'ది బాయి జెర్బాయి వాడియా హాస్పిటల్' స్థాపించారు. ఈ ఆసుపత్రి 1928 మార్చి 7న శంకుస్థాపన చేశారు. 1929 డిసెంబర్ 12న బొంబాయి గవర్నర్ సర్ ఫ్రెడరిక్ సైక్స్ ద్వారా దీనికి ప్రారంభోత్సం జరిగింది. ప్రఖ్యాత శిశువైద్యుడు డా. జార్జ్ కోయెల్హో భారతదేశపు మొట్టమొదటి పీడియాట్రిక్ ఆసుపత్రికి సూపరింటెండెంట్ అయ్యారు.

డాక్టర్ జార్జ్ కొయెల్హోను 'ఫాదర్ ఆఫ్ పీడియాట్రిక్స్ ఇన్ ఇండియా' అని పిలుస్తారు. డాక్టర్ జార్జ్ కోయెల్హో 1926లో పీడియాట్రిక్స్ పై స్వతంత్రంగా పరిశోధనలు చేపట్టారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన భారతదేశపు మొట్ట మొదటి శిశువైద్యుడు. డాక్టర్ జార్జ్ కోయెల్హో చొరవతో 1944లో బాయి జిర్బాయి వాడియా హాస్పిటల్లో డిప్లొమా ఇన్ చైల్డ్ హెల్త్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు ప్రవేశపెట్టడం జరిగింది. రెండేళ్ల తర్వాత అంటే, 1946లో బాంబే యూనివర్సిటీలో ఇదే కోర్సు ప్రారంభమైంది. ఈ కోర్సు కారణంగా భారతదేశంలో పిల్లల వైద్యుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది.

1950లో డాక్టర్ కోయెల్హో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిషియన్స్‌ను స్థాపించారు. 1952 నుంచి 1959 వరకు 'ఇండియన్ జర్నల్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పత్రికకు ఆయన సంపాదకత్వం వహించారు. ప్రఖ్యాత వైద్యుడు డా.కె.సి.చౌదరి 1933లో 'ఇండియన్ జర్నల్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పత్రిక ప్రచురణ చేపట్టారు. 1928లో తన మొదటి వియన్నా పర్యటనలో డాక్టర్ కె.సి.చౌదరిని ఆ దేశంలో శిశు సంక్షేమ చర్యలు బాగా ఆకట్టుకున్నాయి. పిల్లలకు తగిన వైద్యసేవలందించేందుకు వియన్నాలో అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. ఆ సంస్థల పనితీరుకు ముగ్ధుడైన డాక్టర్ కె. సి.చౌదరి భారతదేశంలో పీడియాట్రిక్ ఆసుపత్రిని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ముందు ఆయన పీడియాట్రిక్స్‌పై ఒక పత్రికను తీసుకువచ్చారు. ఈ పత్రిక ద్వారా భారతదేశంలోని వైద్యులు ఎంతో ప్రయోజనం పొందారు.

1956లో కలకత్తాలో పిల్లల ఆస్పత్రి ప్రారంభించడంలో డాక్టర్ కె.సి.చౌదరి సఫలమయ్యారు. 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పేరుతో నిర్మించిన ఈ ఆసుపత్రిని అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు.

అంతకుముందు 1948 ఎస్. టి.ఎచర్ చొరవతో మద్రాసు జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగం ఏర్పాటైంది. అదే సంవత్సరంలో బొంబాయి టోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజీ, బి.వై.ఎల్. నాయర్ ఛారిటబుల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగం ప్రారంభమైంది. డాక్టర్ శాంతిలాల్ సేథ్ ఈ విభాగానికి మొదటి అధిపతి అయ్యారు. ప్రొఫెసర్ లాలా సూరజ్ నందన్ ప్రసాద్ పట్నా హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు.

50వ దశకం ప్రారంభంలో బాంబే, పట్నా ఆస్పత్రుల్లో పీడియాట్రిక్స్ విభాగంలో ఎం.డి. కోర్సులు ప్రారంభమయ్యాయి. శిశువైద్యుడు డాక్టర్ పి.ఎన్. తనేజా కృషి వల్ల మొదట ఢిల్లీలోని ఇర్విన్ హాస్పిటల్లో, తర్వాత ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పీడియాట్రిక్స్ డిపార్ట్మెంట్ స్థాపన జరిగింది. డాక్టర్ జె. ఎన్. పొహోవా ఇండోర్లోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు. దీని తరువాత, భారతదేశంలోని అన్ని ప్రధాన ఆసుపత్రులలో పీడియాట్రిక్ విభాగాల ఏర్పాటు వేగవంతమైంది. వివిధ వైద్య కళాశాలలు, విద్యా–పరిశోధన సంస్థలలో పీడియాట్రిక్ కోర్సులు మొదలయ్యాయి. శిశువులకు వచ్చే వ్యాధులు, వాటికి అందించే చికిత్సపై విస్తృత పరిశోధనలు ప్రారంభమయ్యాయి.

డాక్టర్ ఎస్.టి. ఎచర్ 28 పడకలతో మద్రాసు జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు. కానీ అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య పెరగడం వల్ల డాక్టర్ ఎచర్ పిల్లల కోసం ప్రత్యేక ఆసుపత్రిని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఆ ఆలోచన ఫలితమే ఎగ్మోర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్.

1957లో మద్రాసు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ చైల్డ్ హెల్త్, 1961లో ఎం.డి. కోర్సు ప్రారంభమైంది. దేశంలోని వివిధ ఆసుపత్రుల నుంచి వైద్యులు

మద్రాసు జనరల్ హాస్పిటల్, ఎగ్మోర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్‌లో శిశు వైద్యంలో శిక్షణ పొందేందుకు, శిశువైద్యులు కావడానికి రావడం ప్రారంభించారు. శ్యామా ప్రసాద్ కూడా మద్రాసులో శిశు వ్యాధులు వాటి చికిత్స విధానం గురించి తెలుసుకున్నారు.

శిక్షణలో భాగంగా శ్యామా ప్రసాద్ బెంగుళూరు కూడా వెళ్ళారు. బెంగుళూరు మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వాణి విలాస్ స్త్రీ–శిశు హాస్పిటల్, విక్టోరియా హాస్పిటల్లో పిల్లల శస్త్రచికిత్సల గురించి తెలుసుకున్నారు.

ఈ రెండు ఆసుపత్రులు బ్రిటిష్ కాలంలోనే స్థాపించినవే. స్వాతంత్ర్యం తర్వాత ఆ రెండింటిని బెంగళూరు మెడికల్ కాలేజీకి అనుసంధానం చేశారు.

నేర్చుకోవాలనే బలమైన కోరిక డాక్టర్ శ్యామా ప్రసాద్‌ని చండీగఢ్‌కు కూడా తీసుకెళ్లింది. అక్కడి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో శిక్షణ పొందారు. ఈ సంస్థను ఏర్పాటు చేయాలని అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్ కైరో ఆలోచించారు. పంజాబ్‌లో అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు జరిగే వైద్య సంస్థ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నయంకాని వ్యాధులకు చికిత్స అందించేందుకు అక్కడ పరిశోధనలు జరగాలని కోరుకున్నారు. పెద్ద జబ్బులకు కూడా అక్కడ చికిత్స అందించాలనే భావన ఆయనకు ఉండేది. ఆయన ఆకాంక్షలు నెరవేరేలా ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేశారు. పంజాబ్ ప్రభుత్వానికి అన్ని విధాలా సహాయాన్ని అందించారు. ప్రొ. తులసీ దాస్, ప్రొ. సంతోఖ్ సింగ్ ఆనంద్, ప్రొ. పి.ఎన్. చుట్టాని, ప్రొ. బి.ఎన్.అయికత్, ప్రొ. సంత్ రామ్ ఢల్, ప్రొ. బాలకృష్ణ వంటి ప్రముఖ వైద్యులు ఈ సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారు.

1962లో ఇన్‌స్టిట్యూట్ స్థాపన పనులు ప్రారంభమయ్యాయి. 1963 జూలై 7న ప్రధాన మంత్రి నెహ్రూ ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రారంభించిన సమయంలో ఈ సంస్థ అవిభక్త పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం క్రింద ఉండేది. కానీ పంజాబ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత, సంస్థ పరిపాలనా నియంత్రణ నవంబర్ 1966లో కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ పరిధిలోకి వచ్చింది.

1967లో పార్లమెంటు చేసిన చట్టం ద్వారా ఇన్‌స్టిట్యూట్ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా రూపాంతరం చెందింది.

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తర్వాత వైద్యరంగంలో భారతదేశపు రెండో అతిపెద్ద పరిశోధనా కేంద్రంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆవిర్భవించింది. ఈ కేంద్రంలో శ్యామా ప్రసాద్ సుమారు నెల రోజులు పనిచేశారు. చాలా రోజులు ఆయన ఢిల్లీలోనే ఉన్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని పీడియాట్రిక్స్ నిపుణులతో కలిసి పనిచేసి ఎంతో అనుభవం సంపాదించారు. అక్కడే శ్యామా ప్రసాద్ రాత, మౌఖిక, ప్రాక్టికల్ పరీక్షలకు సిద్ధమయ్యారు.

ఢిల్లీలో ఉన్న సమయంలో శ్యామా ప్రసాద్‌కు డాక్టర్ సుబ్బారావు రూపంలో స్నేహితుడు, క్లాస్‌మేట్ ట్రైనీ డాక్టర్ దొరికారు. సుబ్బారావు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' కోర్సు చేస్తున్నారు. శ్యామా ప్రసాద్, సుబ్బారావు స్నేహం రోజురోజుకూ బలపడింది.

సాధారణంగా మాస్టర్ ఆఫ్ చిరుర్గియా కోర్సు విద్యార్థులు సంబంధిత వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో శిక్షణ పొందుతారు. శ్యామా ప్రసాద్ ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' కోర్సు చేస్తున్నారు. కింగ్ జార్జ్ హాస్పిటల్లో శస్త్రచికిత్స శిక్షణ పొందేందుకు ఆయన అర్హులు. కానీ, శ్యామా ప్రసాద్ భారతదేశంలోని ప్రముఖ వైద్య కళాశాలల్లోని అత్యుత్తమ సర్జన్ల నుంచి శిక్షణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కారణంగా ఆయన దేశంలోని ప్రధాన వైద్య విద్యా సంస్థలను సందర్శించేందుకు, అక్కడి నిపుణులైన సర్జన్ల నుంచి శస్త్రచికిత్స విధానాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక అనుమతి పొందారు.

శ్యామా ప్రసాద్ మద్రాసు, బెంగళూరు, ఢిల్లీ, చండీగఢ్, బొంబాయి, కలకత్తా, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో శిక్షణ తీసుకుని శస్త్రచికిత్సలో ప్రావీణ్యం సంపాదించారు. ఈ శిక్షణ ఆయన ఆత్మవిశ్వాసాన్ని ఎంతో బలపరిచింది. విశాఖపట్నం తిరిగి వచ్చిన

తరువాత, ఆయన క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడం ప్రారంభించారు. 1989లో 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' పట్టా పొందారు. డిగ్రీ రాగానే ఆయనకు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి ఆఫర్లు రావడం మొదలయ్యాయి. చాలా పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు శ్యామా ప్రసాద్‌కు పెద్ద మొత్తంలో జీతం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. కొన్ని సంస్థలు ఆయనను విదేశాలకు వెళ్లాలని సూచించాయి. కొంతమంది తోటి సర్జన్లు ఆయనను ఆస్ట్రేలియాకు తీసుకెళ్లాలని అనుకున్నారు. కొందరు స్నేహితులు అమెరికా వెళ్లమని సలహా ఇచ్చారు. అన్ని ఆసక్తికరమైన, అంగీకరించే యోగ్యమైన ఆఫర్లే. శ్యామా ప్రసాద్ సహచరులు చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారు. కానీ తన తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం కారణంగా శ్యామా ప్రసాద్ విదేశాలకు వెళ్లాలనే ఆఫర్లను తిరస్కరించారు. భారతదేశంలో ఉంటూ ఇక్కడి పేదలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు

ఎం.సి. హెచ్ డిగ్రీ లభించిన తరువాత శ్యామా ప్రసాద్‌ను ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన ఇక్కడ మెడికల్ విద్యార్థులను సబ్జెక్ట్ బోధిస్తూ, కింగ్ జార్జ్ ఆసుపత్రిలో సర్జరీ చేయడం మెదలుపెట్టారు.

## అధ్యాయం - 7

# ఆపరేషన్ థియటర్లో నిలిచిన ఎన్నో ప్రాణాలు

శ్యామా ప్రసాద్ విశాఖపట్నంలోని తన ఇంట్లో క్లినిక్ ప్రారంభించారు. కింగ్ జార్జ్ హాస్పిటల్లో రోగులకు వైద్యం చేసేవారు. డ్యూటీ అవర్స్ అయిపోగానే ఇంటికి వచ్చేవారు. కానీ, చికిత్స కోసం రోగులు ఇంటికి కూడా వచ్చేవారు. తండ్రి సుందరయ్యలాగే శ్యామా ప్రసాద్ కూడా రోగులకు ఇంట్లోనే వైద్యం చేయడం మొదలుపెట్టారు. క్లినిక్‌లో రోగులకు నాలుగు పడకలు ఉండేవి. శస్త్రచికిత్సలు చేసేందుకు శ్యామా ప్రసాద్ ఇంట్లో ఒక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుచేసారు. శ్యామా ప్రసాద్ సర్జరీలన్నీ స్వయంగా చేసేవారు. క్లినిక్‌లో రోగులను చూసేందుకు మరో డాక్టరు అవసరం ఏర్పడటంతో శ్యామా ప్రసాద్ కోరిక మేరకు ఆయన స్నేహితుడు డాక్టర్ రవి నవాస్కా రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు క్లినిక్‌లో రోగులను చూసేవారు. డాక్టర్ రవి కూడా కింగ్ జార్జ్ హాస్పిటల్లోనే పనిచేసేవారు. సమయం కేటాయించుకొని శ్యామా ప్రసాద్ ఇంట్లోని క్లినిక్‌కి వచ్చి రోగులకు వైద్యం చేసేవారు. డాక్టర్ రవి, డాక్టర్ శ్యామా ప్రసాద్‌లు మంచి స్నేహితులు. ఒకరి కష్టసుఖాలు ఒకరు పంచుకునేవారు. ఇద్దరికీ తమ తమ సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉండేది. తమ నైపుణ్యాలు, అనుభవాన్ని పరస్పరం గౌరవించుకునేవారు. డాక్టర్ రవి నియమనిష్ఠలు కలిగిన వ్యక్తి. ఇంట్లో పూజలు చేసి కాని రోజును మొదలుపెట్టేవారు కాదు. అన్ని పండగలను సంప్రదాయ పద్ధతిలో

చేసుకుంటారు. ఆయన సత్యసాయిబాబాకు పరమ భక్తుడు. సత్యసాయిబాబాను దేవుడిగా ఆరాధించేవారు.

సత్యసాయిబాబా వైభవం, ఆయన అద్భుత మహిమల గురించి ప్రజలకు డాక్టర్ రవి తరచూ చెప్పేవారు. ఒకసారి డాక్టర్ శ్యామా ప్రసాద్‌తో సత్యసాయిబాబా లీలలు అసమానమైనవని చెప్పారు. ఆయన తన లీలలతో ప్రజలు సన్మార్గంలో నడిచేలా చూస్తారు. బాబా మహిమాన్వితుడు. తన ప్రసాదంతో ప్రజల వ్యాధులు నయం చేయగలరు. ఆయనను చూడగానే కష్టాలు, బాధలు అన్నీ తొలగిపోతాయి." డాక్టర్ రవి చెప్పిన మాటలపై మొదట్లో శ్యామా ప్రసాద్ నమ్మకం కలగలేదు. కానీ డాక్టర్ రవి చెప్పే అద్భుత సంఘటనలను నిరంతరం వింటున్నప్పుడు, ఆయన మనస్సులో విశ్వాసం మెదలయ్యింది. రవి దేనికీ గర్వపడడు అనే విషయాన్ని శ్యామా ప్రసాద్ ఎప్పుడూ గమనించేవారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడమే రవి తన మతంగా భావిస్తారు. ప్రశాంతంగా ఉంటూ తన జీవితాన్ని సంతోషంగా, సంతృప్తికరంగా గడుపుతారని ఆయన ప్రవర్తనను చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది.

సత్యసాయిబాబాను దర్శించుకునేందుకు డాక్టర్ రవి తరచూ పుట్టపర్తికి వెళ్ళేవారు. పేదలు, నిస్సహాయులకు వైద్యం అందించేందుకు సత్యసాయిబాబా ఆస్పత్రి నిర్మించారని గ్రామాల్లోని పేద ప్రజలను ఆదుకునేందుకు మొబైల్ హాస్పిటల్స్ ప్రారంభించిన విషయాన్ని ఒక సందర్భంలో డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు డాక్టర్ రవి తెలిపారు. అంతే కాదు సత్యసాయి దర్శనం కోసం పుట్టపర్తి వెళ్లిన ప్రతీసారి బాబా దర్శనం చేసుకొని డాక్టర్ రవి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు గ్రామాలకు వెళ్లేవారు. ఎప్పుడు సెలవు దొరికినా వెంటనే కుటుంబంతో కలిసి డాక్టర్ రవి పుట్టపర్తికి వెళ్లేవారు. రవి, ఆయన కుటుంబ సభ్యులకు పుట్టపర్తి అతి పెద్ద పుణ్యక్షేత్రం.

డాక్టర్ రవి భక్తిప్రపత్తులు, సేవాగుణం చూసి డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంతో ముగ్ధుడయ్యారు. అంతే కాదు పుట్టపర్తి వెళ్లి సత్యసాయిబాబాను దర్శించాలనే కోరిక కూడా ఆయనలో కలిగింది. ఆ కోరిక రోజురోజుకూ బలపడింది. ఒకరోజు డాక్టర్ రవితో, "నువ్వు ఎప్పుడూ పుట్టపర్తికి వెళ్తావు.? నన్ను ఎప్పుడూ నీతో

తీసుకెళ్ళలేదు. నన్ను కూడా నీతో పుట్టపర్తికి తీసుకెళ్లు. నాకు కూడా సత్యసాయిబాబాను దర్శించుకోవాలని ఉంది" అని డాక్టర్ శ్యామా ప్రసాద్ అన్నారు. దానికి రవి, "పుట్టపర్తికి ఎవరూ, ఎవరిని తీసుకెళ్ళలేరు. తనంతట తానుగా కూడా పుట్టపర్తికి వెళ్ళలేరు. సత్య సాయిబాబా నుంచి పిలుపు వచ్చినప్పుడు వారు ఆ దేవుడి దర్శనానికి వెళ్తారు" అని డాక్టర్ రవి వివరించారు. నిన్ను ఆహ్వానించినప్పుడు నువ్వు తప్పకుండా అక్కడికి వెళ్తావు అని స్పష్టం చేశారు.

డాక్టర్ రవి చెప్పిన ఈ మాటలు విన్న తర్వాత సత్యసాయిబాబా పిలుపు కోసం శ్యామా ప్రసాద్ ఎదురుచూడసాగారు. ఈ క్రమంలో సత్యసాయి గురించి చాలా విషయాలు తెలుసుకునే అవకాశం డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు వచ్చింది. పేదలు, నిస్సహాయులకు సహాయం చేయడానికి సత్యసాయిబాబా అనేక ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే కాకుండా పేద పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు సత్యసాయి ట్రస్ట్ అనేక విద్యా సంస్థలు నిర్వహిస్తోంది. ఆ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులు వసూలు చేయరు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి డాక్టర్లు పుట్టపర్తి వచ్చి అక్కడ రోగులకు ఉచితంగా వైద్య సేవలందిస్తూ ఉంటారు. తన సేవాకార్యక్రమాల ద్వారా సత్యసాయిబాబా ఎంతో మంది జీవితాల్లో మంచి మార్పు తీసుకొచ్చారు. ప్రపంచంలోని ఎందరో ప్రముఖులు ఆయన మాటలతో ప్రభావితులయ్యారు. సత్యసాయి భక్తగణం ప్రపంచమంతటా విస్తరించి ఉంది. వారి సంస్థలు అనేక దేశాల్లో మత, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటాయి.

సత్యసాయి జీవితం గురించి శ్యామా ప్రసాద్ అనేక విషయాలు తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా పుట్టపర్తిలో ఒక సాధారణ కుటుంబంలో సత్యసాయిబాబా జన్మించారని ఆయనకు తెలిసింది. అక్షయ నామ సంవత్సరం కార్తిక మాసం బహుళ తదియ నాడు ఆరుద్ర నక్షత్రంలో బ్రహ్మ ముహూర్తంలో బాబా జన్మించారని చెబుతారు. ఆ రోజు 1926, నవంబర్ 23, సోమవారం. ఆయన తండ్రి పేరు పెద్ద వెంకమరాజు రత్నాకరం. తల్లి పేరు ఈశ్వరమ్మ. వీరు భట్రాజు కులస్థులు. రాజులు, చక్రవర్తుల ఆస్థానంలో 'భట్రాజు'

కులస్థులు సంగీత విద్వాంసులు, వాయిద్యకారులుగా ఉండేవారు. రాజు–మహారాజులను కీర్తిస్తూ పద్యాలు పాడేవారు.

సత్యసాయి జన్మించిన రోజు ఇంటిలోని వాయిద్యాలన్నీ వాటంతట అవే మోగాయని భక్తులు చెప్తారు. సత్యనారాయణ స్వామి వ్రతమాచరించి స్వామివారి ప్రసాదం స్వీకరించి ఈశ్వరమ్మ ఉపవాసాన్ని విరమించారని, ఆ వ్రతం చేసిన కొన్నాళ్లకే ఆమె గర్భం దాల్చింది. సత్యనారాయణ వ్రతం చేసిన తర్వాత పుట్టిన సంతానం కాబట్టి బాబుకు సత్యనారాయణరాజు అని నామకరణం చేశారు. పెద వెంకమ రాజు, ఈశ్వరమ్మ దంపతులకు ఐదో సంతానం సత్యనారాయణ రాజు.

చిన్నప్పటి నుంచే సత్యనారాయణరాజు మిగతా పిల్లలకు భిన్నంగా ఉండేవారు. అద్భుతమైన తెలివితేటలు, ప్రశాంతత, దయ స్వభావం కలిగిన వ్యక్తిగా నిలిచాడు. మొదటి నుంచి సంగీతం, సాహిత్యం పట్ల ఆసక్తి ఉండేది. తల్లిదండ్రులు బుక్కపట్నంలోని పాఠశాలలో సత్యనారాయణరాజును చేర్పించారు. అక్కడ మూడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత ఉరవకొండలో ఉంటున్న అన్న శేషంరాజు ఇంటికి సత్యనారాయణరాజు వెళ్ళాడు. సత్యనారాయణరాజు పాఠశాల విద్య అంతా ఉరవకొండలో సాగింది.

1940 మార్చి 8న సత్యనారాయణరాజు తన స్నేహితులతో ఆడుకుంటున్నప్పుడు ఒక తేలు ఆయనను కుట్టింది. ఆ తర్వాత స్పృహతప్పి పడిపోయారు. స్నేహితులంతా భయపడ్డారు. సత్యనారాయణరాజుకు తేలు కుట్టిందని కుటుంబసభ్యులకు తెలిపారు. వెంటనే వారు సత్యనారాయణను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లారు. డాక్టర్లు చికిత్స అందించిన సత్యనారాయణరాజుకు స్పృహ రాలేదు. తేలు విషం ప్రభావం తీవ్రంగా ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. కొన్ని గంటల వరకు స్పృహ రాకపోవడంతో ఇక సత్యనారాయణ తమకు దక్కడేమోనని అనుమానించారు. డాక్టరు కూడా పెదవి విరిచారు. ఆ తర్వాత ఒక్కసారిగా సత్యనారాయణరాజుకు స్పృహ వచ్చింది. దాంతో కుటుంబ సభ్యులంతా ఊపిరి పీల్చుకున్నారు. గ్రామప్రజలు దీన్నో అద్భుత మహిమగా భావించారు.

స్పృహలోకి రాగానే సత్యనారాయణ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. అకస్మాత్తుగా సంస్కృతం మాట్లాడటం మొదలుపెట్టారు. సంస్కృత మంత్రాలను ఎంతో లయబద్ధంగా పాడటం ప్రారంభించారు. అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. కుటుంబ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు. సత్యనారాయణ ఎప్పుడూ సంస్కృతం చదవలేదు. ఆయన విద్యాభ్యాసమంతా తెలుగులోనే సాగింది. ఆయనకు తెలుగు తప్ప మరే ఇతర భాష రాదు. అకస్మాత్తుగా ఆయన నోటి నుంచి సంస్కృత మంత్రాలు రావడంతో అంతా అవాక్కయ్యారు. సత్యనారాయణ అందరికీ చిక్కుముడిలా కనిపించారు.

ఈ క్రమంలో సత్యనారాయణ తన మాతృభాష తెలుగులో భక్తిగీతాలు రాయడం ప్రారంభించారు. ఆ భక్తిగీతాలు పాడుతూ ప్రజలకు వినిపించసాగారు. మృదుమధురమైన స్వరం కావడంతో జనమంతా ఆయన వైపు ఆకర్షితులయ్యారు.

ఒకరోజు సత్యనారాయణరాజు తన కుటుంబ సభ్యులందరినీ ఒక చోటికి రమ్మని చెప్పాడు. అందరూ అక్కడ చేరగానే సత్యనారాయణరాజు గాలిలోకి చేయి ఊపాడు. ఆశ్చర్యకరంగా ఆయన చేతిలో విభూతి ప్రత్యక్షమైంది. ఆ విభూతిని కుటుంబ సభ్యులకు ఇచ్చి దాన్ని నుదుటిపై రాసుకోమని చెప్పారు. ఆ తర్వాత, ఇక నుంచి నేను మీ ఒక్కరి వాడినే కాదు, అందరివాడిని, మీతో ఉన్న అనుబంధమే నాకు ఇతరులతోనూ ఉంటుంది. అందరూ నాకు సమానమే అని కుటుంబ సభ్యులతో సత్యనారాయణరాజు అన్నారు.

ఈ మాటలు సత్యనారాయణరాజు తండ్రికి కోపం తెప్పించాయి. తమ కుమారుడికి దెయ్యం పట్టిందని లేదా మతి భ్రమించి అయినా ఉంటుందని అనుమానించారు. సరైన దోవలో పెట్టాలనే ఉద్దేశంతో బెత్తం తీసుకొని సత్యనారాయణరాజును కొట్టడం మొదలుపెట్టాడు. ఎంత గట్టిగా కొట్టినా సత్యనారాయణరాజు పై ఎలాంటి ప్రభావం కనిపించలేదు. అలిసిపోయిన తండ్రి నీవు ఏం చేద్దామనుకుంటున్నావు అని కుమారుడిని ప్రశ్నించారు. దానికి సత్యనారాయణరాజు స్పందిస్తూ, భక్తులు నన్ను పిలుస్తున్నారు, ఆ భక్తులకు సాయం చేసేందుకు నేను వెళ్తున్నాను అన్నారు. దీనికి తండ్రి, "ప్రజలకు

సాయం చేయడానికి నీవెవరు?" అని ప్రశ్నించారు. అంతే కాదు, భక్తులు, భక్తులు అంటున్నావు, భగవంతుడికి భక్తులు ఉంటారు, నీవేమైనా దేవుడివా? అని నిలదీశారు.

దానికి సత్యనారాయణరాజు, "నేను సాయిబాబా అవతారాన్ని. నేను శివుడిని, నేనుశక్తి స్వరూపుడను" అని బదులిచ్చారు.

ఈ మాటలు విని తండ్రికి తల తిరిగిపోయింది. ఈ పిచ్చివాడు నన్ను కూడా పిచ్చివాడిని చేస్తాడు అని అనుకున్నారు.

ఆ తర్వాత సత్యనారాయణరాజు అన్నయ్య శేషంరాజు తన తండ్రితో మాట్లాడుతూ "నాన్న, వీడు సామాన్యమైన బాలుడు కాదు. ఇతని మహిమలు మనం చూశాం. అకస్మాత్తుగా సంస్కృతం మాట్లాడడం, భక్తిగీతాలు రాయడమంటే సామాన్యమైన విషయం కాదు. ఎన్నో మహిమలు చూపాడని ఇతర స్నేహితులు చెప్పారు. స్నేహితులతో కలిసి తరచూ చిత్రావతి నదీ తీరానికి వెళ్తుంటారు.. అక్కడ ఒక చింతచెట్టు ఉంది. అక్కడ అందరూ ఆడుకుంటారు. ఎక్కడ స్నేహితులు ఏమైనా కావాలని కోరితే గాల్లో చేతులు ఊపి వాటిని సృష్టిస్తాడు. ఆ వస్తువులు ఎక్కడి నుంచి వస్తాయో తెలియదు. ఇతను ఏదో మహిమ కలిగినవాడు" అని అన్నారు.

ఈ విషయాలు విన్న తండ్రికి తన కొడుకు సత్యనారాయణరాజులో నిజంగా అద్భుత లక్షణాలు ఉన్నాయని భావించారు. కుమారుడు సత్యనారాయణరాజు పనులకు ఏ మాత్రం అభ్యంతరం చెప్పకుండా స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో ఇకపై తనను భక్తులు సత్యసాయిబాబాగా పిలుస్తారని ప్రకటించారు.

సత్యనారాయణరాజు 'సత్యసాయి'గా మారిన తర్వాత సాధారణ దుస్తులు ధరించడం మానేశారు. ఆయన వస్త్రధారణ కాషాయ రంగులోకి మారింది. పద్నాలుగేళ్ల వయసులో సత్యసాయి కుటుంబాన్ని విడిచిపెట్టి దేశసంచారం ప్రారంభించారు. దేశ సంచారంలో భాగంగా అనేక ప్రాంతాలకు సత్యసాయి వెళ్లారు. ప్రతిచోటా ఆయన తమ మహిమలు చూపేవారు. ఈ మహిమల కారణంగా, ఆయనకు ప్రజాదరణ క్రమంగా పెరగసాగింది. ఆయనను చూసేందుకు దూరప్రాంతాల నుంచి జనం వచ్చేవారు. సమస్యలతో తన

దగ్గరకు వచ్చిన వారికి సత్యసాయి ప్రసాదం అందించేవారు. సత్యసాయి ఇచ్చే ప్రసాదం భుజించిన తర్వాత తమ సమస్యలన్నీ తొలగిపోయాయని కొందరు చెప్పసాగారు. మానసిక సమస్యలు, శారీరక సమస్యలు ఏవైనా సత్యసాయి దివ్య మహిమతో తొలగిపోతాయనే నమ్మకం జనాల్లో ఏర్పడింది. అనేక మందికి తమ ఆర్థిక, కుటుంబ, సామాజిక సమస్యలకు సత్యసాయి ప్రసాదం ద్వారా పరిష్కారం లభించసాగింది. తన దగ్గరకు వచ్చే భక్తులకు గాల్లోంచి ఏదో ఒకటి సృష్టించి సత్యసాయి అందించేవారు. ఆయన కొన్నిసార్లు గాలి నుంచి పండ్లు, విభూతి వంటివి సృష్టించేవారు. సత్యసాయి చూపే మహిమలపై జనాలకు నమ్మకం పెరిగింది. ఆయన మహిమలు తెలుసుకొని ఆయనను నమ్మేవారి సంఖ్య రోజురోజుకూ పెరగసాగింది. 1944లో కొంత మంది భక్తులు కలిసి ఆయన స్వగ్రామం పుట్టపర్తిలో మందిరాన్ని నిర్మించారు. 1948లో నిర్మాణం ప్రారంభమైన మరో మందిరం పనులు 1950లో పూర్తయ్యాయి. ఆ ఆలయానికి ప్రశాంతి నిలయం అని సత్యసాయిబాబా నామకరణం చేశారు. సత్యసాయి మహిమలతో ప్రయోజనం పొందిన అనేక మంది భక్తులు డబ్బులు, కానుకలు విరాళంగా ఇచ్చేవారు. భక్తుల సంఖ్య పెరగడంతో ప్రశాంతి నిలయం విస్తీర్ణం పెరిగింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లో సత్యసాయి భక్తులు ఆలయాలు నిర్మించారు. అంతే కాదు ప్రపంచంలోనే అనేక దేశాల్లో సత్యసాయి మందిరాల నిర్మాణం మొదలైంది. సత్యసాయి సందేశాలు భక్తులు వందకు పైగా దేశాల్లో వ్యాపింపజేశారు.

1963లో సత్యసాయి ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించిందని చెబుతారు. ఆయనకు గుండెపోటు వచ్చింది. పరిస్థితి విషమించడంతో చాలా రోజుల పాటు చికిత్స అందించారు. ఆ సమయంలో ప్రజలకు సత్యసాయిని దర్శించుకునే అవకాశం లభించలేదు. సత్యసాయి పరమపదించారనే పుకార్లు కూడా వ్యాపించాయి. కొన్ని నెలల తర్వాత సత్యసాయి కోలుకుని జనంలోకి రాగానే సంచలన ప్రకటన చేశారు. “ఒక రోజు నేను నా శరీరాన్ని విడిచిపెడతాను. కొత్త జన్మ తీసుకొని మళ్లీ మీ మధ్యకు వస్తాను. నేనెప్పుడూ మీతోనే ఉంటాను, ఎప్పుడూ ఉంటాను” అని ప్రకటించారు. అంతే కాదు తన తదుపరి జన్మ కర్ణాటకలో ఉంటుందని, అప్పుడు తన పేరు ప్రేమ్ సాయి అని కూడా చెప్పారు.

కులమతాలకు అతీతంగా సత్యసాయికి భక్తులు ఏర్పడ్డారు. దేశవిదేశాల్లో ఆయన భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ''నన్ను దేవుడిగా అంగీకరించడానికి ఎవరూ మతం మార్చుకోవాల్సిన అవసరం లేదు. మీ మనసుతో నన్ను దేవుడిలా చూసుకోండి, నేను మిమ్మల్ని చూసుకుంటాను'' అని సత్యసాయి ప్రవచించేవారు.

''నేను ఇక్కడ ఉన్నప్పుడు ఎందుకు భయం'' అని ఆయన తరచుగా ప్రజలతో చెప్పేవారు, ఈ మాటలు సత్యసాయి భక్తుల్లో విశ్వాసాన్ని పెంచాయి. సత్యసాయి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు పుట్టపర్తికి తరలివచ్చేవారు.

సత్యసాయి ప్రజాదరణకు ప్రధాన కారణం ఆయన తన భక్తులకు ఇచ్చే విభూతి ప్రసాదం. ఆయన ఇచ్చే విభూతిలో అద్భుత ప్రభావం ఉందని చాలా మంది నమ్మేవారు. సత్యసాయి చేతిలో విభూతిని పొందిన వ్యక్తికి కష్టాలన్నీ తొలగిపోతాయని, సత్యసాయి దర్శనంతో అన్ని బాధలు తొలగిపోతాయని నమ్మే భక్తుల సంఖ్య పెరిగిపోయింది. సత్యసాయి నివాసమైన పుట్టపర్తిలో అడుగు పెట్టగానే సమస్యలు తొలగిపోతాయని చాలా మంది నమ్ముతారు. ఇలాంటి మాటలు విని సుదూర ప్రాంతాల నుంచి జనం పుట్టపర్తికి రావడం ప్రారంభించారు. సత్యసాయి భక్తుల ముందు తన చేతులు గాలిలోకి ఊపి, గాల్లో విభూతిని సృష్టించి ప్రసాదంగా అందించేవారు. గాల్లోంచి విభూతి సృష్టించడాన్ని భక్తులు అద్భుతంగా భావించేవారు. ఇలాంటి ఎన్నో అద్భుతాలు సత్యసాయి చేశారు. కొంత మంది భక్తులకు సత్యసాయి గాల్లోంచి బంగారు గొలుసులు సృష్టించి ఇచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన ఆయన తన నోటి నుంచి శివలింగాన్ని బయటకు తీసేవారు.

సత్యసాయి ఆశ్రమంలో పండుగలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయి. నిత్యం భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగేవి. సత్యసాయి అనేక సందర్భాల్లో స్వయంగా భక్తిగీతాలు ఆలపించేవారు. తరచూ ఆయన ప్రవచనాలు ఇచ్చేవారు. ఆయన ప్రసంగాలలో సత్యం, మతం, శాంతి, ప్రేమ, అహింసకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. సత్యసాయికి ఆదరణ ఎంతగా పెరిగిందంటే చాలా మంది భక్తులు ఆయన పాదాల చిత్రపటానికి పూజలు చేసేవారు.

1965లో సత్యసాయి సేవా సంస్థలు ఏర్పాటయ్యాయి. ఈ సంస్థల ద్వారా సత్యసాయి కొత్త విద్యాసంస్థలు, ఆసుపత్రులు ప్రారంభించారు. ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు ప్రోత్సహించడం ప్రారంభించారు. పేదప్రజల సంక్షేమం కోసం ఎన్నో కొత్త పథకాలు ప్రారంభించారు.

1968లో సత్యసాయి తొలిసారిగా విదేశాలకు వెళ్లారు. ఆఫ్రికాలోని కెన్యా, ఉగాండా దేశాలకు వెళ్లారు. ఈ పర్యటన తర్వాత మళ్లీ ఆయన ఏనాడు విదేశీ సందర్శన చేపట్టలేదు. పుట్టపర్తి వెలుపల ఆయన దర్శన భాగ్యం పొందడం అరుదు. సత్యసాయిని దర్శించుకునేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పుట్టపర్తికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చేవారు. సత్యసాయి వల్లనే ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా పుట్టపర్తికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సత్యసాయికి ముందు తెలుగు మాట్లాడే ప్రాంతాల ప్రజలకు కూడా పుట్టపర్తి గురించి తెలియదు. చాలా వెనుకబడిన ప్రాంతం అనంతపురం జిల్లా. వర్షాలు కురిసేవి కావు. ఎప్పుడు నీటికి అక్కడ కొరతే. తరచూ కరువు బారిన పడే ప్రాంతం అనంతపురం. ఈ ప్రాంత ప్రజలు ఉద్యోగాలు వెతుక్కుంటూ వలసలు వెళ్లేవారు. చాలా మంది ప్రజలు తమ జీవనోపాధి కోసం ఊరూరూ తిరిగేవారు. కానీ సత్యసాయి పుట్టపర్తిలో నివాసం ఏర్పరచుకున్న తర్వాత అభివృద్ధి ప్రారంభమైంది. ప్రజలకు ఉద్యోగాలు వచ్చాయి. నీటి కొరత తీరింది. ప్రజల జీవితాల్లో మార్పు కనిపించింది. సత్యసాయి సంస్థలు స్థానిక ప్రజలకు అన్ని విధాలుగా సహాయం చేయడం ప్రారంభించాయి.

సామాజిక, ధార్మిక కార్యక్రమాల కోసం అనేక మంది భక్తులు సత్యసాయి సంస్థకు భారీ మొత్తంలో విరాళాలు ఇస్తారు. విరాళాల రూపంలో వచ్చిన ధనాన్ని పేద ప్రజల సంక్షేమం, ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగిస్తారు. అనేక కరువు పీడిత గ్రామాలకు తాగునీరు అందించడం ప్రారంభించారు. పేద పిల్లల కోసం పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు నిర్మించారు. ఎక్కడా ఎలాంటి రుసుము తీసుకోకుండా ప్రజలకు విద్య, వైద్య సేవలు అందించారు.

సమాజసేవకుడిగా కూడా సత్యసాయి ఎంతో గుర్తింపు పొందారు. విదేశాల్లోనూ ఆయన భక్తుల సంఖ్య పెరిగింది. సత్యసాయి స్వయంగా అనేక కీర్తనలు రచించి, సంగీతం అందించి వాటిని ఆలపించారు. ఆయన కీర్తనలు

ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందాయి. ఆయన మాటలు, ఉపన్యాసాలు చాలా మందిని ఆకట్టుకున్నాయి. సత్యసాయి తన ప్రసంగాలలో 'ప్రేమ' గురించి ఎక్కువగా చెప్పేవారు. ప్రేమ లేని జీవితానికి అర్థం లేదు. రోజును ప్రేమతో ప్రారంభించండి. రోజు ప్రేమతో జీవించండి. రోజును ప్రేమతో నింపండి. రోజును ప్రేమతో ముగించండి. అది భగవంతుడిని చేరుకునే మార్గం" అని ఆయన చెప్పేవారు. "నీకు నా మీద విశ్వాసం ఉంటే నా దయ నీకు మాత్రమే లభిస్తుంది. భగవంతుడిని నమ్మకపోతే ఆ భగవంతుడి దయ కూడా నీకు లభించదు" అని చెప్పేవారు. పేదలకు సేవ చేస్తే పుణ్యం లభిస్తుందని సత్యసాయి చెప్పారు. 'సత్యం, మతం, శాంతి, ప్రేమ, అహింస' జీవితానికి అత్యంత ముఖ్యమైనవిగా చెప్పేవారు. ఈ లక్షణాలే వ్యక్తి జీవితాన్ని సాఫల్యం చేస్తాయని సూచించేవారు.

సత్యసాయి మహిమలు శ్యామా ప్రసాద్ పై తీవ్ర ప్రభావం చూపాయి. సత్యసాయిని కలవాలనే ఉత్సుకత ఆయనలో పెరిగింది. వాస్తవానికి శ్యామా ప్రసాద్‌కు ఈ అద్భుతాలపై పూర్తి నమ్మకం లేకపోయినా స్వయంగా సత్యసాయిని కలుసుకుని ఆయన ప్రభావాన్ని, వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలనుకున్నారు. ఆ రోజుల్లో సత్యసాయిని విశ్వసించే వారి సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉండేది. పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు కూడా సత్యసాయికి భక్తులుగా మారారు.

ఇదిలా ఉండగా ఒకరోజు డాక్టర్ రవి త్వరలోనే తాను పుట్టపర్తి వెళ్తున్నానని, ఈసారి నా వెంట నిన్ను కూడా తీసుకెళ్తానని శ్యామా ప్రసాద్‌తో చెప్పారు. ఆ మాటలు శ్యామా ప్రసాద్‌కు ఎంతో సంతోషం కలిగించాయి.

డాక్టర్ రవి వెంట డాక్టర్ శ్యామా ప్రసాద్ ఒక్కరే పుట్టపర్తికి ప్రయాణం కాలేదు. డాక్టర్ రవి తన వెంట యాభై మంది స్నేహితులను తీసుకెళ్తున్నారు. విశాఖపట్నం నుంచి ఒక పెద్ద బృందం బయల్దేరింది. ఒకేసారి యాభై మంది ప్రయాణమయ్యారు. కానీ రకరకాల కారణాల చేత మొత్తం యాభై మంది పుట్టపర్తికి చేరుకోలేకపోయారు. దారిలో కొందరి ఆరోగ్యం క్షీణించడంతో మధ్యలోనే ప్రయాణాన్ని ఆపేయాల్సి వచ్చింది. కొందరిని కుటుంబ సభ్యులు వెనక్కి పిలిపించారు. కొంతమంది మనసు మార్చుకుని మధ్యలోనే

దిగిపోయారు. ఎంత మంది ప్రయాణాన్ని పూర్తి చేయగలిగారో ఎవరికీ తెలియదు.

ఆ బృందం పుట్టపర్తికి చేరుకోగానే డాక్టర్ రవి, శ్యామా ప్రసాద్‌లు సత్యసాయి సంస్థ ఏర్పాటు చేసిన గ్రామ ఆసుపత్రులకు ముందుగా వెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మందికి వారు చికిత్స అందించారు. బృందంలో వచ్చిన ఇతర వైద్యులు కూడా పరిసర గ్రామాల్లో పర్యటించి అక్కడ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసాయం అందించారు.

ఆ తర్వాత అందరూ సత్యసాయి దర్శనం కోసం ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సత్యసాయి ఆ బృందాన్ని చూసి చాలా సంతోషించారు. 32 చేతిగడియారాలు బహుమతిగా ఇచ్చారు. అక్కడ నలభై మంది ఉన్నారని శ్యామా ప్రసాద్‌కు అనిపించింది. కాని, సత్యసాయి కేవలం 32 వాచీలు మాత్రమే ఇచ్చారు. కొందరికి ఆ దేవుని నుంచి గడియారం పొందే అదృష్టం లేదని అనుకున్నారు. సహజంగానే ఆ వ్యక్తులు విచారానికి లోనయ్యారు. వారి హృదయం బాధతో నిండిపోయింది. కానీ పుట్టపర్తికి 32మంది మాత్రమే చేరుకోవడం చూసి శ్యామా ప్రసాద్ ఆశ్చర్యపోయారు. అది సత్యసాయి మహిమని శ్యామా ప్రసాద్ భావించారు. ఎంత మంది తన దగ్గరకు వస్తారనే విషయం ముందుగానే సత్యసాయికి తెలుసుననే విషయం శ్యామా ప్రసాద్ అర్థం చేసుకున్నారు. సత్యసాయి సర్వాంతర్యామి అని ఆయనలో ఎన్నో మహిమలు ఉన్నాయని డాక్టర్ శ్యామా ప్రసాద్ నమ్మారు.

అదే సమయంలో శ్యామా ప్రసాద్ పై సత్యసాయి ప్రభావం పెరిగింది. ఆయన భక్తుడయ్యారు. శ్యామా ప్రసాద్‌ని తన దగ్గరకు సత్యసాయి పిలిచారు. భక్తిలో మునిగిపోయిన శ్యామా ప్రసాద్ సత్యసాయికి అంకితమయ్యారు. నేరుగా వెళ్లి సత్యసాయి పాదాల చెంత కూర్చున్నారు. “ఏం చూశావు?” అని శ్యామా ప్రసాద్‌ను ప్రశ్నించారు. పుట్టపర్తి చుట్టుపక్కల గ్రామాల్లోని రోగులకు చికిత్స అందించిన అనుభవాన్ని శ్యామా ప్రసాద్ తెలియజేశారు. శ్యామా ప్రసాద్ కృషిని సత్యసాయి కొనియాడారు. ఆ మాటలకు మురిసిపోయిన డాక్టర్ శ్యామా ప్రసాద్ క్రమం తప్పకుండా తాను పుట్టపర్తికి వస్తానని, సత్యసాయి ఆసుపత్రుల్లో రోగులకు వైద్యం చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

వైద్యులు, ఉపాధ్యాయులపై సత్యసాయి ఎంతో ఆప్యాయత చూపేవారు. ఆయనను సందర్శించే ప్రతీ వైద్యుడు ఆయన అభిమానానికి పాత్రులవుతారు. శ్యామా ప్రసాద్ విషయంలోనూ అదే జరిగింది.

శ్యామా ప్రసాద్ సంతోషంతో విశాఖపట్నం తిరిగి వచ్చారు. సత్యసాయి దర్శనం, తనకు కలిగిన అనుభవాలను ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేశారు.

సత్యసాయి బహుమతిగా ఇచ్చిన వాచ్ ఎవరి దగ్గర ఎక్కువ కాలం ఉండదని డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు డాక్టర్ రవి తెలిపారు. అది పోతుందని అన్నారు. ఆ మాటలను శ్యామా ప్రసాద్ మొదట్లో నమ్మలేదు. డాక్టర్ రవి ఎప్పుడూ తప్పుగా మాట్లాడరని, ఆయన ఎప్పుడూ నిజమే మాట్లాడతారనే నమ్మకం పుట్టపర్తి సందర్శన తర్వాత పెరిగిపోయింది.

సత్యసాయి బహుకరించిన గడియారాన్ని శ్యామా ప్రసాద్ ఒక విలువైన సంపదగా భావించారు. ఆ వాచీని కోల్పోకూడదనే భావనతో దాన్ని జాగ్రత్తగా ఉంచారు. సత్యసాయి ఇచ్చిన వాచీని శ్యామా ప్రసాద్ ఏనాడు చేతిపై ధరించలేదు. సర్జన్ కావడంతో ఆపరేషన్ చేసే సమయంలో వాచీ తీసేయాల్సి ఉంటుంది. ఆపరేషన్ చేసే సమయంలో ఏదో ఒక రోజు ఆ వాచీ తీయాల్సి వచ్చినప్పుడు అది పోతుందనే లేదా దొంగతనం జరగవచ్చని అనుకున్నారు. దీంతో అమూల్యమైనదిగా భావించిన వాచీని ఎంతో పదిలంగా భద్రపరిచారు.

విశాఖపట్నం తిరిగొచ్చాక శ్యామా ప్రసాద్ తిరిగి తన విధులకు హాజరయ్యారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేయడం కూడా సేవే. అక్కడికి వివిధ రకాల రోగులు వస్తుంటారు. వారిలో చాలా మంది నిరుపేదలు, వారి దగ్గర ఆహారం తినేందుకు కూడా డబ్బు ఉండదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునే స్థోమత చాలా మందిలో ఉండదు.

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందజేస్తుండటంతో పేదలు ప్రభుత్వాసుపత్రులకు వస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించడం వల్ల మరో పెద్ద ప్రయోజనం ఉంది. ఏ వ్యాధి వచ్చినా, రోగి పరిస్థితి ఎంత విషమంగా ఉన్నా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్చుకొని వారికి వైద్యం అందిస్తారు. కాబట్టి రకరకాల

వ్యాధుల కలిగిన వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుంటారు.

చాలా మంది మెడికల్ సైన్స్‌లో డిగ్రీ పొందిన తర్వాత ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రారంభిస్తారు. కొందరు సొంతంగా నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు ప్రారంభిస్తారు. చాలామంది తమ సొంత క్లినిక్స్ తెరుస్తారు. కొంత మంది వైద్యులు ఆసుపత్రిలో పనిచేయడం ప్రారంభిస్తారు. ఈ డాక్టర్లు చాలా విషయాల్లో స్వేచ్ఛగా ఉంటారు. వీరి జీతం, ఆదాయం ప్రభుత్వ వైద్యుల కంటే ఎక్కువ. ఈ డాక్టర్లు ప్రతి వైద్య సేవకు రోగి నుంచి ఫీజు వసూలు చేస్తారు. కానీ ప్రభుత్వ వైద్యులు ఎలాంటి రుసుములు తీసుకోరు. ప్రభుత్వం ఇచ్చే జీతం కోసం వారు పని చేయాల్సి వస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్లు ఎంత మంది రోగులను చూసినా ప్రభుత్వం నిర్ణయించిన వేతనమే వారికి అందుతుంది. ప్రైవేట్ ప్రాక్టీస్ చేసే డాక్టర్ల ఆదాయం రోగుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. ఎంత ఎక్కువ మంది రోగులను చూస్తే అంత ఎక్కువ ఆదాయం. సంపద సృష్టించుకోవాలనే ఆశతో చాలా మంది వైద్యులు ప్రభుత్వాసుపత్రిల్లో పనిచేసేందుకు ఇష్టపడరు. ప్రజాసేవకే శ్యామా ప్రసాద్ ప్రాధాన్యత ఇచ్చారు. తండ్రి సుందరయ్యలాగా తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. నిరుపేదలు, నిస్సహాయులకు సేవ చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రి కంటే మెరుగైన చోటు మరొకటి లేదని ఆయనకు తెలుసు. శ్యామా ప్రసాద్ రోగులకు వైద్యం చేయడంలో నిత్యం బిజీగా ఉండేవారు.

ఒకరోజు ఆయన తన ఇంట్లోని క్లినిక్‌లో ఉన్న సమయంలో ఒక స్త్రీ అక్కడికి వచ్చింది. “డాక్టరుగారు, నాకు రెండు రోజుల క్రితం ఒక కల వచ్చింది. కలలో సత్యసాయిబాబా మీ గురించి నాకు చెప్పారు. మిమ్మల్ని కలుసుకుని, మీతో వైద్యం చేయించుకోమని ఆదేశించారు. స్వయంగా సత్యసాయిబాబానే నాకు అడ్రస్ ఇచ్చారు” అని చెప్పింది.

ఆ మాటలు విని శ్యామా ప్రసాద్ చాలా ఆశ్చర్యపోయారు. ఆ మహిళ పేరు వెంకమ్మ. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నివాసి. శ్యామా ప్రసాద్‌కు తణుకుతో ఏ మాత్రం పరిచయం లేదు. ఆ మహిళ చెప్పిన మాటలను విశ్వసించిన ఆమెను తన క్లినిక్‌లో అడ్మిట్ చేసుకున్నారు. ఆ మహిళ రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతోంది.

ఆమె ఉన్న పరిస్థితిల్లో చికిత్స చేయడం సాధ్యం కాదని తణుకు వైద్యులు తెలిపారు. ఆ మహిళ సత్యసాయి భక్తురాలు, ఆయనపై ఆమెకు అచంచలమైన విశ్వాసం. అందుకే ఆమె ఎంతో నిష్ఠతో సత్యసాయిని ప్రార్థించింది. ఆమెకు సత్యసాయి కలలో కనిపించి డాక్టర్ శ్యామా ప్రసాద్ దగ్గరికి దారి చూపించారు.

శ్యామా ప్రసాద్ శస్త్రచికిత్స చేసి మహిళ శరీరంలోని కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స అనంతరం కొద్దిరోజుల పాటు ఆమెను క్లినిక్‌లో ఉంచిన శ్యామా ప్రసాద్ కోలుకున్న తర్వాత ఆమెను ఇంటికి పంపించారు. ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో ఆ మహిళ శ్యామా ప్రసాద్‌ను ఎన్నో రీతులుగా కొనియాడింది.

వెంకమ్మ తర్వాత అనేక మంది సత్యసాయి భక్తులు శ్యామా ప్రసాద్ దగ్గరకు వైద్యానికి రాసాగారు. దూరప్రాంతాల నుంచి ఎంతో మంది వచ్చేవారు. వాళ్లందరు సత్యసాయి ఆదేశంపై వచ్చినవారే. శ్యామా ప్రసాద్ గురించి ఎవరికి తెలియని దూరప్రాంతాల నుంచి అనేక మంది వస్తుండటంతో, ప్రతీ రోగి చెప్పే మాటపై శ్యామా ప్రసాద్‌కు నమ్మకం కుదిరింది.

విశాఖపట్నంలోని సత్యసాయి ఆలయంలో ప్రజలకు వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శ్యామా ప్రసాద్‌కు తెలిసింది. ఆలయ ప్రాంగణంలో ఒక చిన్న ఆసుపత్రి ప్రారంభించారు. శ్యామా ప్రసాద్ రోజూ సాయంత్రం ఈ ఆసుపత్రిని సందర్శించడం ప్రారంభించారు. కింగ్ జార్జ్ ఆసుపత్రిలో డ్యూటీ అయిపోయిన వెంటనే శ్యామా ప్రసాద్ నేరుగా సత్యసాయి ఆసుపత్రికి వెళ్లి అక్కడి ప్రజలకు వైద్యం చేసేవారు

సత్యసాయిబాబా తనను పుట్టపర్తికి రమ్మని చెప్తున్నారని శ్యామా ప్రసాద్‌కు ఒకరోజు అనిపించింది. అది దేవుడి పిలుపుగా భావించి పుట్టపర్తికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. శ్యామా ప్రసాద్ పుట్టపర్తికి రాగానే ఈసారి డా.నరసింహన్‌తో పరిచయం ఏర్పడింది. సత్యసాయి మొబైల్ హాస్పిటల్ ప్రాజెక్టుకు ఇన్‌చార్జ్ డాక్టర్ నరసింహన్. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒక బస్సును ఆసుపత్రిగా మార్చారు. ఈ సంచార ఆసుపత్రిలో రోగుల చికిత్సకు అవసరమైన అన్ని పరికరాలు ఉంటాయి. సంచార ఆసుపత్రిలో ఉండే వైద్యుల బృందం వివిధ గ్రామాలు సందర్శిస్తుంది. ఈ క్రమంలో అక్కడికి వచ్చే రోగులకు చికిత్స

అందిస్తుంటారు. సంచార ఆసుపత్రి ద్వారా పూర్తిస్థాయి వైద్యం అందించలేని పరిస్థితుల్లో ఆ రోగులు పుట్టపర్తిలోని పెద్ద ఆసుపత్రికి రావాలని కోరారు. పుట్టపర్తిలోనే ఆ పెద్ద ఆసుపత్రిలో పెద్ద వ్యాధులకు చికిత్స అందిస్తారు. ఎన్నో సంక్లిష్టమైన ఆపరేషన్లు కూడా ఆ ఆస్పత్రిలో జరిగాయి. వివిధ వ్యాధుల చికిత్సలో నిపుణులైన వైద్యులు అక్కడికి వచ్చి తమ సేవలను అందిస్తారు. చాలా మంది వైద్యులు, సర్జన్లు ఇతర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి వచ్చి సేవలు అందించి తిరిగి తమ ఇళ్లకు వెళ్ళేవారు. పుట్టపర్తికి క్రమం తప్పకుండా వచ్చి రోగులకు సేవ చేయాలనే దృఢ సంకల్పం శ్యామా ప్రసాద్ తీసుకున్నారు. నిరుపేద రోగులకు శస్త్రచికిత్స చేయాలని శ్యామా ప్రసాద్‌ను డాక్టర్ నరసింహన్ అభ్యర్థించారు. ఆ అభ్యర్థన మేరకు శ్యామా ప్రసాద్ అనేక సర్జరీలు నిర్వహించి ఎంతో మంది రోగులను వ్యాధుల నుంచి కాపాడారు.

పుట్టపర్తిలో వైద్యం కోసం ఉన్న ఏర్పాట్లు శ్యామా ప్రసాద్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుట్టపర్తిలోని ఆసుపత్రిలో అనుభవజ్ఞులు, అర్హులైన వైద్యులు మాత్రమే కాదు చికిత్స అందించేందుకు ఆధునిక పరికరాలు, సదుపాయాలు కూడా అక్కడ ఉన్నాయి. వ్యాధులను గుర్తించే పరీక్షల నిర్వహించేందుకు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రోగికి చికిత్సకు సంబంధించిన ప్రతిదీ క్రమపద్ధతిలో జరుగుతుంది.

రోగులకు సేవ చేసేందుకు పుట్టపర్తికి వచ్చిన ప్రతీ వైద్యుడు, సర్జన్లను సత్యసాయి భక్తులు ఎంతో జాగ్రత్తగా చూసుకునేవారు. పుట్టపర్తి చేరుకున్న తర్వాత ఏ డాక్టరుకు కూడా తమ జేబులోంచి ఒక్క రూపాయి ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. సత్యసాయికి చెందిన సంస్థ వారికి భోజనపానీయాలు, బస ఏర్పాట్లన్నీ చేస్తుంది. పుట్టపర్తిలో వైద్యులకు ఎంతో గౌరవం ఉండేది.

శ్యామా ప్రసాద్ తన పుట్టపర్తి పర్యటనకు తేదీలను నిర్ణయించినప్పుడల్లా ఆయన రాకముందే ఆపరేషన్ కోసం రోగులను గుర్తించి వారి ఆపరేషన్ కోసం సన్నాహాలు కూడా పూర్తి చేసేవారు. శ్యామా ప్రసాద్ అక్కడికి చేరుకోగానే ముందుగా పేషెంట్ హిస్టరీ షీట్ చదివి, వ్యాధికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకుని రోగిని పరీక్షించి ఆపరేషన్ మొదలు పెట్టేవారు. శ్యామా ప్రసాద్

ఉదయం ఏడు గంటలకు తొలి ఆపరేషన్ మొదలుపెడితే ఒకరి తర్వాత ఒకరుగా ఆ ప్రక్రియ రాత్రి ఏడు గంటల వరకు సాగేది. పుట్టపర్తికి వచ్చినప్పుడల్లా శ్యామా ప్రసాద్ మూడు రోజులు ఉండేవారు. ఆ మూడు రోజుల్లో ఆయన యాభైకి పైగా ఆపరేషన్లు చేసేవారు. శ్యామా ప్రసాద్ హస్తవాసి గొప్పదని సత్యసాయి హాస్పిటల్లోని డాక్టర్లు, టెక్నీషియన్లు అందరూ నమ్మడం మొదలుపెట్టారు. ఆయన ఆపరేషన్ చేసిన ప్రతీ రోజు అనారోగ్యం నుంచి తొందరగా కోలుకుంటారు. శ్యామా ప్రసాద్ చేసిన ఆపరేషన్లు విజయవంతమయ్యాయి.

పుట్టపర్తి సాయిబాబా ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు జరిగేవి. ఆ సమయంలో బాబాగారి భక్తుల్లోని డాక్టర్లకు పిలుపు వచ్చేది. వీలు చూసుకుని ఓ నాలుగు రోజులు సర్వీస్ చేయాలంటూ కబురు పంపేవాళ్లు. ప్రతినెల ఒకటి నుంచి 12వ తేదీ వరకు జరిగే ఆ క్యాంపులకు డాక్టర్ శ్యామా ప్రసాద్ సతీసమేతంగా వెళ్లొచ్చే వారు. నాలుగు రోజుల పాటు పేదవారికి వైద్యం అందించి వచ్చే వారు. బాబాగారు శివైక్యం అయిన తరువాత కూడా సర్వీస్ కొనసాగింది. 2009లో ఈ మెడికల్ క్యాంపులను ఓ ఐఏఎస్ అధికారి ఆర్గనైజ్ చేసేవారు. అప్పట్లో పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ, స్పెషాలిటీ హాస్పిటల్స్ నడిచేవి. అందులో అడుగు పెట్టడం అంటే ఎంతో అదృష్టం చేసి ఉండాలి. అలాంటిది స్పెషాలిటీ ఆస్పత్రి బాధ్యతలు అప్పగించడానికి ముందుకొచ్చారు. అలా 2009 నుంచి 2015 వరకు అక్కడే లక్ష ఆపరేషన్లు పూర్తి చేశారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ఈ సందర్భాన్ని అక్కడే సెలబ్రేట్ చేసుకున్నారు. లక్ష ఆపరేషన్లలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోలేదంటే.. అదంతా బాబాగారి దయే అని అంటుంటారు. టెస్టికిల్స్, థైరాయిడ్, అపెండిక్స్.. ఇలా ఒకటేమిటి అనేక రకాల ఆపరేషన్లు దిగ్విజయంగా పూర్తిచేశారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ కోసమే ప్రత్యేకంగా కేసులను అట్టిపెట్టేవారు. గతంలో మూడు నెలలకు ఓసారి వెళ్లి ఆపరేషన్లు చేసేవారు. రోజుకు కనీసం 15 సర్జరీలు చేసేవారు. అక్కడే భోజనం, అక్కడే అన్ని వసతులు ఉండేవి. ఎప్పుడు పుట్టపర్తి వెళ్లినా.. మానసిక ప్రశాంతత లభించేది. ఎంత వర్క్ ప్రెషర్ ఉన్నా.. అక్కడ అడుగు పెట్టిన వెంటనే డాక్టర్ శ్యామా ప్రసాద్, ఆయన సతీమణికి ఒక కొత్త

వాతావరణంలోకి వెళ్లినట్టు, స్ట్రెస్ రిలీఫ్ అయినట్టు అనిపించేది.

డయాబెటిస్ వ్యాధితో బాధపడే వారికి చిన్న గాయం అయిందంటే చాలు.. ఆ భాగం మాత్రం తినేసేది. ముఖ్యంగా డయాబెటిక్ ఫుట్‌లో కాలు తీసేయాల్సిన పరిస్థితులు ఉండేవి. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం దానిపై సొంతంగా రీసెర్చ్ చేశారు. డయాబెటిక్ ఫుట్‌పై చర్మం అంటించి లాంగ్ యాక్టింగ్ పెన్సిలిన్ ఇంజెక్షన్ ఇచ్చేవారు. అంటే బోన్ ఇన్ఫెక్షన్ ఉండగానే ఈ పద్ధతి నిర్వహించే వారు. సాధారణంగా ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు చర్మం అంటిస్తే రిజెక్ట్ అవుతుంది. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ చేసిన పద్ధతిలో అతుక్కునేది. డయాబెటిక్ ఫుట్ ట్రీట్‌మెంట్‌లో ఇదొక విప్లవాత్మకమైన మార్పు. ఈ ప్రొసీజర్‌ను వీలైనంత మందికి చెప్పేవారు. డయాబెటిక్ ఫుట్ కేర్ సెంటర్ కోసం ఓ ఫెలోషిప్ కూడా చేసి పంపారు. వాళ్ల కాన్ఫరెన్సుకు ప్రతి సంవత్సరం వెళ్లి.. తన కొత్త పద్ధతిని వివరించే వారు. ఈ కొత్త ప్రొసీజర్‌లో మహా అయితే వేలు తీసేసేవారు తప్ప.. మొత్తం కాలునో, యాంకిల్‌లో తీసేసేవారు కాదు.

ఈ ఘనత అంతా సత్యసాయిదేనని శ్యామా ప్రసాద్ అంటారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించే శక్తిని భగవంతుడు ప్రసాదించాడని, ఆ పనిని తన ద్వారా సత్యసాయి చేయిస్తున్నారని నమ్మేవారు.

అది శ్యామా ప్రసాద్ పూర్తిగా ఆధ్యాత్మికం వైపు మళ్లుతున్న సమయం. సత్యసాయిబాబానే అన్ని పనులు చేయిస్తున్నారని నమ్మేవారు.

శ్యామా ప్రసాద్ సత్యసాయిని ఎంతో ప్రత్యేకమైన అభిమానించసాగారు. ఆయన పూజించడం మొదలుపెట్టారు. తన యోగక్షేమాలన్నీ సత్యసాయిబాబా చూసుకుంటారని నమ్మడం ప్రారంభించారు.

సత్యసాయిబాబా చెప్పిన ఒక విషయం శ్యామా ప్రసాద్ సంపూర్ణంగా ఆచరణలో పెట్టడం ప్రారంభించారు. ఎం.డి. అంటే కేవలం డాక్టర్ ఆఫ్ మెడిసిన్ కాదని, ఎం.డి., అంటే 'మాస్టర్ ఆఫ్ డివోషన్' అని బాబా చెప్పేవారు. అంటే పూర్తి అంకితభావం గలిగిన నాయకుడు అయి ఉండాలని తరచూ ఉద్బోధించేవారు. అదే విధంగా ఎం.ఎస్., అంటే కేవలం మాస్టర్ ఆఫ్ సర్జరీ కాదు, 'మాస్టర్ ఇన్ సెల్ఫ్‌లెస్ సర్జరీ'. అంటే ప్రతి సర్జన్ నిస్వార్థంగా ప్రజలకు

సేవ చేయాలని చెప్పేవారు. ఈ కారణంగానే శ్యామా ప్రసాద్ అవకాశం దొరికిన వెంటనే పుట్టపర్తికి చేరుకుని రోగులకు శస్త్ర చికిత్స చేసేవారు.

సత్యసాయిబాబా చెప్పిన మరో విషయాన్ని శ్యామా ప్రసాద్ తన మనస్సులో ఉంచుకున్నారు. మానవుని ఆరోగ్యం ఐదు విషయాలపై ఆధారపడి ఉంటుందని సత్యసాయిబాబా చెప్పేవారు. ఆ ఐదు విషయాలేంటంటే ఆహారం, విహారం, ప్రవర్తన, ఉచ్ఛారణ, ఆలోచన. ఆహారం అంటే తినే ఆహారం. విహారం అంటే మనుషులు చేసే పనులు. ప్రవర్తన అంటే మనుషులు వ్యవహరించే తీరు. ఉచ్ఛారణ అంటే మనుషులు మాట్లాడే మాటలు, వారి భాష. ఆలోచన అంటే మనుషులు చేసే ఆలోచనలు. ఈ ఐదు విషయాలు పవిత్రంగా ఉన్నప్పుడు ఆ వ్యక్తి సంతోషకరమైన జీవితాన్ని గడుపుతారు. శ్యామా ప్రసాద్ ఈ మాటలు ప్రచారం చేయడం ప్రారంభించారు.

భర్త సేవభావంలో నిమగ్నమై ఉండడం చూసిన భార్య డాక్టర్ లక్ష్మిరాజ్యం కూడా పేద ప్రజలకు అన్ని విధాలా సహాయం చేస్తానని ప్రతిజ్ఞ చేసారు. ఆమె కూడా తన భర్త శ్యామా ప్రసాద్‌తో కలిసి ప్రతి రోజూ సత్యసాయి ఆసుపత్రికి వెళ్లడం ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చే మహిళలకు లక్ష్మి వైద్యం అందించేవారు. ఆస్పత్రిలో ప్రసవ సేవలను కూడా డాక్టర్ లక్ష్మి ప్రారంభించారు. ప్రసవాలు ఉచితంగా చేయడంతో దూర ప్రాంతాల నుంచి కూడా మహిళలు వచ్చేవారు. గిరిజనుల ఎదుర్కొంటున్న సమస్యలను సత్యసాయి భక్తుడు ఒకరు శ్యామా ప్రసాద్ దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. విశాఖపట్నం, చుట్టుపక్కల జిల్లాల్లో అనేక గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. అడవుల్లో నివసించే గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారంతా గుడిసెల్లో నివసించేవారు. కరెంటు, సురక్షితమైన తాగునీరు వంటి సదుపాయాలు అక్కడ లేవు. వారి నివాసాలు దట్టమైన అడవుల్లో ఉంటాయి. అక్కడికి చేరుకునేందుకు సరైన దారి కూడా ఉండదు. ఏదైనా పని కోసం ఈ గిరిజనులు గ్రామం లేదా నగరానికి రావాలంటే కొండలు, గుట్టలు దాటి ప్రదయాణం చేయాల్సి ఉంటుంది. గిరిజన మహిళలకు సమస్యలు చాలా ఎక్కువ. ప్రసవ సమయంలో చాలా మంది మహిళలు చనిపోతుంటారు. చాలా మంది గిరిజన పిల్లలు పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటుంటారు. అంటువ్యాధులు సులభంగా వ్యాప్తి చెందుతాయి. నీరు,

విద్యుత్, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కనీస మౌళిక సౌకర్యాలు వారికి అందనంత దూరంలో ఉంటాయి.

గిరిజన ప్రాంతాలు సందర్శించి అక్కడ అనారోగ్యంతో ఉన్న ప్రజలకు చికిత్స చేయాలని డాక్టర్ శ్యామా ప్రసాద్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఈ పనిలో శ్యామా ప్రసాద్‌కు అన్ని విధాల సాయం చేయాలని ఆయన భార్య డాక్టర్ లక్ష్మి కూడా నిర్ణయించుకున్నారు. ఒకరోజు శ్యామా ప్రసాద్ తన భార్య, సహాయకులతో కలిసి గిరిజన ప్రాంతాల సందర్శనకు వెళ్లారు. అడవిలో అడుగుపెట్టిన తర్వాత శ్యామా ప్రసాద్ తాము విన్నదానికంటే అక్కడ పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయని గ్రహించారు. గిరిజనులు ప్రధాన జనజీవన స్రవంతి నుంచి పూర్తిగా దూరమయ్యారని తెలుసుకున్నారు. అక్కడ ఏ మాత్రం పరిశుభ్రత గురించి పట్టింపులేదు. ఆరోగ్య స్పృహ లేదు. గిరిజనులు చాలా రోజులు పాటు స్నానాలు చేయరు. గోళ్లు శుభ్రంగా ఉంచుకోరు. జుట్టు సరిగ్గా దువ్వకోరు. పళ్ళు తోముకోరు. వారి తినే ఆహారం పౌష్టికాహారం కాదు. వారు తినే ఆహారంలో శరీరాన్ని ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన పోషకాలు లేవు. బహిరంగ మలవిసర్జన ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పాము, తేలు కాటుకు మందు లేదు. దోమల వల్ల వ్యాపించే వ్యాధులతో చాలా మంది చనిపోతున్నారు. ఇవన్నీ చూసిన శ్యామా ప్రసాద్‌కు కష్టంగా అనిపించింది. అడవిలో మనుషులు ఇలా జీవిస్తారని ఆయన ఎప్పుడూ ఊహించలేదు.

శ్యామా ప్రసాద్ దంపతులు ముందుగా గిరిజన ప్రజలకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు ఇచ్చారు. ఆ తర్వాత అందరూ ఊరికి తిరిగొచ్చారు. శ్యామా ప్రసాద్ తన తదుపరి పర్యటనకు భిన్నంగా సిద్ధమయ్యారు. గిరిజనులకు పంపిణీ చేసేందుకు పౌష్టికాహారం, బిస్కెట్లు, విటమిన్, మినరల్ మాత్రలు, జలుబు, జ్వరానికి మందులు తీసుకువెళ్ళారు. కొత్త దుస్తులు కొనుగోలు చేసారు. గిరిజనులకు అవసరమైన అన్ని వస్తువులతో ఆ ప్రాంతాలకు వెళ్లి అక్కడి పేద ప్రజలకు పంపిణీ. గిరిజన మహిళలు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను లక్ష్మి వివరించారు. గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలను ఆదుకునే ఈ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగింది. మూడు నెలలకు

ఒకసారి శ్యామా ప్రసాద్ గిరిజన ప్రాంతాలకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యం చేసేవారు.

ఒక రోజు శ్యామా ప్రసాద్ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక పదహారేళ్ల బాలికను ఆస్పత్రికి తీసుకొచ్చారు. బాలిక యాసిడ్ తాగిందని బంధువులు డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు ఆమె అమ్మాయి తరపు బంధువులు తెలిపారు. పరీక్షించిన శ్యామా ప్రసాద్ ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించారు. యాసిడ్ తాగడం వల్ల నోరంతా చెడిపోయింది. శరీరంలోని అవయవాలు అన్నవాహిక, ఉదరం, పేగులు యాసిడ్ కారణంగా పాడయ్యాయి. ఆ బాలిక ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో డాక్టర్ శ్యామా ప్రసాద్ చికిత్స ప్రారంభించారు. రోగి నోటి ద్వారా ఏమీ తినలేదు, త్రాగలేదు కాబట్టి, ఆమెకు టోటల్ పేరెంట్రల్ న్యూట్రిషన్ ఏర్పాటు చేశారు. నరాల ద్వారా పోషకాహారం శరీరంలోని ఇతర అవయవాలకు అందించే ఏర్పాటు అది. ఈ పేరెంట్రల్ పోషణ కారణంగా రోగి శరీరం బలంగా ఉంటుంది. శరీరంలో రోగనిరోధక శక్తిని కాపాడుకోవడానికి పోషకాహారం అవసరం. కానీ యాసిడ్ కారణంగా రోగి అన్నవాహిక, జీర్ణవ్యవస్థ దెబ్బతింది. దాన్ని సరిదిద్దాలంటే శస్త్రచికిత్స తప్ప మరో మార్గం లేదు. కాని, ఆ సర్జరీ అంత సులువు కాదు. అది ఎంతో క్లిష్టమైన ప్రక్రియ. అటువంటి సందర్భాలలో, రోగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అయినప్పటికీ శ్యామా ప్రసాద్ తన బృందంతో కలిసి రోగి ప్రాణాలు కాపాడే ప్రయత్నం మొదలుపెట్టారు. శ్యామా ప్రసాద్ బృందంలో పీజీ విద్యార్థులు కూడా ఉన్నారు. ఈ విద్యార్థులు కూడా శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడాలని డాక్టర్ శ్యామా ప్రసాద్‌ను కోరారు. శస్త్రచికిత్స సమయంలో చాలా రిస్క్ ఉంటుంది. శస్త్రచికిత్స ప్రారంభంలోనే రోగి చనిపోవచ్చు. శ్యామా ప్రసాద్ మనసులో ఎన్నో సందేహాలు తలెత్తాయి. ఏం చేయాలో అర్థం కాలేదు. సర్జరీ చేయకపోయినా ప్రాణాపాయం తప్పేలా లేదు. ప్రాణాలు కాపాడాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గమని శ్యామా ప్రసాద్‌కు తెలుసు. ఈ విపత్కర పరిస్థితి నుంచి బయటపడేందుకు సత్యసాయిని స్మరించుకున్నారు. సర్జరీ చేయమని సత్యసాయిని తనకు చెప్తున్నట్టుగా డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు అనిపించింది. రోగి ప్రాణాలు కాపాడాలంటే సర్జరీ

చేయాలని, అది విజయవంతమవుతుందని సందేశాన్ని సత్యసాయి ఇచ్చారని డాక్టర్ శ్యామా ప్రసాద్ భావించారు.

సత్యసాయిపై నమ్మకం ఉంచి శ్యామా ప్రసాద్ ఆ సర్జరీ ప్రారంభించారు. ముందు యాసిడ్ కారణంగా గాయాలపాలైన నోటిని శుభ్రం చేశారు. అన్నవాహిక కాలిపోయి కుంచించుకుపోవడంతో దాన్ని మార్చారు. రోగి అన్నవాహిక, ఉదరం రెండు దెబ్బతిన్నాయి. దీంతో పేగు భాగాన్ని అతికించాల్సి వచ్చింది. ఎంతో కష్టమైన ఆ శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. సత్యసాయిబాబాకు శ్యామా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లో సత్యసాయి స్వయంగా ఉండి తనతో ఆ క్లిష్టమైన సర్జరీ చేయించారని శ్యామా ప్రసాద్  భావించారు. సత్యసాయిపై నమ్మకం లేకుంటే శ్యామా ప్రసాద్ బహుశా ఈ సర్జరీ చేసి ఉండేవారు కాదేమో. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి త్వరగా కోలుకున్నారు. నీళ్లు కూడా తాగలేని స్థితిలో ఉన్న ఆ బాలిక సర్జరీ తర్వాత చక్కగా భోజనం చేయగలిగింది.

ఈ సర్జరీ తర్వాత సత్యసాయిపై శ్యామా ప్రసాద్‌కి నమ్మకం మరింత పెరిగింది. సత్యసాయికి తనను తాను పూర్తిగా అంకితం చేసుకున్నారు.

ఓ రోజు ఓ 60 ఏళ్ల పెద్దావిడ కడుపులో గడ్డ వచ్చిందంటూ హాస్పిటల్‌కు వచ్చింది. గడ్డ చూసి క్యాన్సర్ అయి ఉంటుందని, దాన్ని తొలగిస్తే అయిపోతుంది అనుకుని మధ్యాహ్నం 12 గంటలకు ఆపరేషన్ మొదలుపెట్టారు. తీరా చూస్తే లోపల దయాఫ్రేమ్ మొత్తం పాడైంది. లోపల మొత్తం కుళ్లిపోయి పేగుల వరకు అస్తవ్యస్తంగా ఉంది. అలాగని గడ్డను మాత్రమే తీసేసి వదిలేస్తే పేషెంట్ చనిపోతుంది. దాంతో గంటల కొద్దీ నిల్చుని, ఆపరేషన్ చేసి, కడుపు లోపల మొత్తం క్లీన్ చేశారు. అలా 12 గంటలకు మొదలుపెట్టిన ఆపరేషన్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ జీవితంలో అంతసేపు ఆపరేషన్ చేయడం అదే మొదటిసారి. ఆ సమయంలో బాబాగారు పక్కనే ఉండి, తనతో ఆ ఆపరేషన్ చేయించారని ఇప్పటికీ చెబుతుంటారు.

ఓ రోజు పిఠాపురానికి చెందిన కుమారి అనే యువతి యాసిడ్ తాగిందంటూ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గొంతు నుంచి పేగుల వరకు మొత్తం కాలిపోయింది.

అలాంటి పొజిషన్‌లో ఉన్న పేషెంట్‌కు కడుపు దగ్గర రంధ్రం పెట్టి ఆహారం అందించడం తప్ప మరో దారి లేదు. కాని, ఆ కేసును ఛాలెంజింగ్‌గా తీసుకున్నారు. నెల రోజుల పాటు ఆ పేషెంటును ప్రత్యేకంగా చూశారు. ముందు గొంతు దగ్గర నుంచి పెద్దపేగు వరకు చర్మం పక్కగా పైప్ లైన్ వేసి ఓ ప్రత్యేకమైన ట్రీట్ మెంట్ అందించారు. అప్పట్లోనే టోటర్ పేరెంట్రల్ న్యూట్రిషన్ లిపిడ్స్ చాలా ఖరీదు. వాటిని బయటి నుంచి కొనుక్కొచ్చి మరీ వైద్యం చేశారు. ఆ అమ్మాయి మామూలు స్థితికి వస్తుందని ఎవరూ అనుకోలేదు. కాని, ఆపరేషన్ సక్సెస్ అవడం, ఆ తరువాత ఆ అమ్మాయికి పెళ్లై పిల్లలు కూడా పుట్టడం జరిగింది. పుట్టిన పిల్లలను తీసుకొచ్చి డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి కృతజ్ఞతలు కూడా చెప్పుకుందా యువతి. డాక్టర్ శ్యామా ప్రసాద్ జీవితంలో చేసిన మరో మేజర్ సర్జరీ ఇదే. ఇది కూడా బాబా ఆశీస్సులతోనే విజయవంతంగా చేశానంటారు.

ఆ తర్వాత నుంచి ఏదైనా సర్జరీ చేసే ముందు సత్యసాయిని స్మరించుకోవడం శ్యామా ప్రసాద్ ఒక నియమంగా పెట్టుకున్నారు. సత్యసాయి నామస్మరణ తర్వాతే శస్త్ర చికిత్స ప్రారంభించేవారు. ఎప్పుడు సర్జరీ చేసినా సత్యసాయి తన పక్కనే ఉంటారని, ఆయనే తన చేత సర్జరీ చేయిస్తారని నమ్మడం మొదలుపెట్టారు.

శ్యామా ప్రసాద్ మరో నియమం పెట్టుకున్నాడు. సంక్లిష్టమైన ఆపరేషన్ ఏదైనా ఉంటే, అతను గురువారం నాడు చేసేవాడు. గురువారం సత్యసాయికి శ్యామా ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన ఈ రోజును సత్యసాయికి అంకితం చేస్తారు.

## అధ్యాయం - 8
# దేవ గురువు సత్యసాయి బోధనలే ప్రేరణగా సేవ

సర్జరీలో సూపర్ స్పెషాలిటీ కోర్సు చేయాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించుకున్నారు. 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' అంటే ఎం.సి. హెచ్., డిగ్రీ ప్రవేశ పరీక్ష రాశారు. శ్యామా ప్రసాద్‌కు ఆంధ్రా మెడికల్ కాలేజీలోనే సీటు వచ్చింది.

'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' అనేది శస్త్రచికిత్సలో అత్యంత అధునాతన పోస్ట్ డాక్టోరల్ డిగ్రీ. ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు. భారతీయ వైద్యరంగంలో సర్జికల్ సైన్స్ విభాగంలో అత్యున్నత డిగ్రీ మాస్టర్ ఆఫ్ చిరుర్గియా. సర్వీసులో ఉండగానే, శ్యామా ప్రసాద్ పీడియాట్రిక్ సర్జరీలో సూపర్ స్పెషాలిటీ కోర్సు కోసం శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టారు.

కొన్నిసార్లు శిశువుకు పుట్టిన కొన్ని గంటల వ్యవధిలోనే శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడాల్సి ఉంటుంది. ప్రతి సర్జన్ చిన్నపిల్లలకు ఆపరేషన్ చేయలేరు. శిశువులకు శస్త్రచికిత్స నిర్వహించేందుకు ప్రత్యేక శిక్షణ అవసరం. శ్యామా ప్రసాద్ ఎంఎస్ పూర్తి చేసి కింగ్ జార్జ్ ఆసుపత్రిలో పనిచేయడం ప్రారంభించినప్పుడు ఆయనకు పీడియాట్రిక్స్ విభాగంలో డ్యూటీ కేటాయించారు. శ్యామా ప్రసాద్ మొదటి రోజు నుంచే పిల్లలకు సర్జరీ చేయడం ప్రారంభించారు. చిన్నారులకు శస్త్రచికిత్స చేయడం అంత సులభం కాదు. పెద్దలతో పోలిస్తే పిల్లల శస్త్రచికిత్సలో ఎక్కువ రిస్క్ ఉంటుంది.

చాలా సందర్భాలలో, శిశువు పుట్టిన వెంటనే శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. సాధారణంగా పుట్టుకతో వచ్చే వైకల్యం లేదా ఏదైనా వ్యాధి లక్షణాలు కనిపించినట్లయితే, పిల్లల ప్రాణాలు కాపాడేందుకు శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు భావిస్తారు. ఎక్కడైతే ఔషధాలతో వ్యాధులు నయమయ్యే పరిస్థితి ఉంటే, అక్కడ ఔషధాలే ఉపయోగిస్తారు. కానీ శస్త్రచికిత్స చేయడం తప్పనిసరి అయితే పుట్టిన వెంటనే శస్త్రచికిత్స చేస్తారు. ఆ ఆపరేషన్ ఆలస్యమైన పక్షంలో శిశువుకు మరణం సంభవించవచ్చు.

వ్యాధిని గుర్తించిన వెంటనే శస్త్రచికిత్స చేయడం సాధ్యం కాదు. శస్త్రచికిత్సకు ముందు శిశువును సమగ్రంగా పరీక్షించాల్సి ఉంటుంది. రక్తపరీక్షలు చేయాలి. ఎక్స్-రే లేదా సోనోగ్రఫీ అవసరం కావచ్చు. శస్త్ర చికిత్స సమయంలో శరీరం నుంచి చాలా రక్తం బయటకు వస్తుంది. దాన్ని భర్తీ చేసేందుకు రక్తం సిద్ధంగా ఉండాలి. రక్త మార్పిడి లేకుండా శస్త్రచికిత్స మొదలుపెట్టారు. రక్తహీనత కారణంగా రోగి మరణించే ప్రమాదం కూడా ఉంటుంది. ఆపరేషన్ థియేటరును శానిటైజ్ చేయడం తప్పనిసరి. ఆపరేషన్ తర్వాత శిశువుకు వైద్య సంరక్షణ అవసరం. అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. సకాలంలో మందులు ఇవ్వాలి.

కింగ్ జార్జ్ ఆసుపత్రిలో, శ్యామా ప్రసాద్‌కు నవజాత శిశువు నుంచి 18-సంవత్సరాల వయస్సు వారికి శస్త్రచికిత్స చేసే అవకాశం వచ్చింది. పీడియాట్రిక్స్ విభాగంలో, నవజాత శిశువు నుంచి 18-సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు శస్త్రచికిత్స చేస్తారు. పీడియాట్రిక్ సర్జరీ డిపార్ట్మెంట్‌కి రెఫర్ చేసిన కేసులు చాలా వరకు పేగులు అడ్డుపడడం లేదా విసర్జన నాళాలు అడ్డుపడినవేనని శ్యామా ప్రసాద్ గమనించారు. హెర్నియా, పేగులకు చిల్లులు, తల పెరిగిపోవడం వంటి కేసులు కూడా కొన్ని ఉంటాయి.

ఆ రోజుల్లో క్యాన్సర్‌తో బాధపడే పిల్లల సంఖ్య కూడా ఎక్కువే ఉండేది. అజాగ్రత్త లేదా సరైన సమయంలో చికిత్స ప్రారంభించకపోవడం వల్ల క్యాన్సర్ తో చాలా మంది పిల్లల మరణిస్తారు. శిశు సర్జరీలో ప్రావీణ్యం సంపాదించడం, వివిధ వ్యాధుల చికిత్స కోసం శస్త్రచికిత్స పద్ధతులు నేర్చుకోవడమే లక్ష్యంగా 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' కోర్సు చేపట్టాలని డాక్టర్ శ్యామా ప్రసాద్ భావించారు.

ఈ కోర్సులో భాగంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, కింగ్ జార్జ్ ఆసుపత్రిలోనే కాకుండా దేశంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రులకు వెళ్లి అక్కడి నిపుణుల వద్ద శిక్షణ తీసుకున్నారు.

చెన్నై ఎగ్మోర్లోని పిల్లల ఆసుపత్రి గురించి శ్యామా ప్రసాద్ చాలా గొప్పగా విన్నారు. తనకు నెలల నిండక ముందే పుట్టిన మొదటి సంతానం ఆరోగ్యంపై అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు తన కుమారుడిని శ్యామా ప్రసాద్ ఎగ్మోర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నవజాత శిశువుల చికిత్సకు ఎగ్మూర్ శిశు ఆస్పత్రి అత్యుత్తమ వైద్య కేంద్రమని శ్యామా ప్రసాద్‌కి తండ్రి సుందరయ్య చెప్పారు. ఈ ఆసుపత్రిని బ్రిటిష్ కాలంలో స్థాపించారు. స్వాతంత్ర్యం తరువాత ఈ ఆసుపత్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్ గా ప్రసిద్ధి చెందింది. ఈ ఆసుపత్రికి వైద్యం కోసం దూర ప్రాంతాల నుంచి కూడా మహిళలు వస్తారు. అప్పట్లో ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేవి. ఎగ్మూర్లోని ఆసుపత్రిలో ప్రతిరోజూ అనేక ప్రసవాలు జరిగేవి. కొన్ని సమయాల్లో, ఒక రోజులో రెండు డజన్ల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. నవజాత శిశువు పరిస్థితి బాగా లేకున్నా లేదా పుట్టుకతో వచ్చిన సమస్యలు ఏమైనా ఉంటే, అలాంటి వాటికి చికిత్స అందించేందుకు అక్కడ ఏర్పాట్లు ఉన్నాయి. ఆసుపత్రిలో 24 గంటలూ పిల్లల వైద్యులు, ఇతర డాక్టర్లు అందుబాటులో ఉంటారు. అవసరమైతే, వెంటనే శస్త్రచికిత్స నిర్వహించేందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయి. ఆసుపత్రిలో చిన్నారులకు శస్త్ర చికిత్సలు అక్కడ నిత్యం జరుగుతూనే ఉంటాయి. పిల్లలకు సంబంధించిన అనేక వ్యాధులకు చికిత్స అందించే ఒకే ప్రాంగణం కావడంతో ఎగ్మోర్ ఆస్పత్రిలో శిక్షణ తీసుకోవాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించుకున్నారు.

ఎగ్మోర్ ఆస్పత్రిలో శిక్షణ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ అనేక విషయాలు నేర్చుకున్నారు. ఈ ఆసుపత్రిలో పిల్లల చికిత్స కోసం అప్పట్లో రెండు వేల పడకలు ఉండేవి. ఇది మొత్తం ఆసియా ఖండంలోనే అతి పెద్ద పిల్లల ఆసుపత్రి. ఇక్కడ శస్త్రచికిత్స నిర్వహించేందుకు 6 యూనిట్లు పని చేసేవి. ఒక్కో యూనిట్‌కు ఒక ప్రొఫెసర్ నేతృత్వం వహిస్తారు. ప్రతి బృందంలో ఒక

అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు అనేక మంది వైద్య విద్యార్థులు ఉంటారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు జరుగుతుంటాయి. రోజూ రాత్రి వేళలో కూడా పది, పన్నెండు సర్జరీలు జరిగేవి. ఎగ్మోర్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయడం ద్వారా శ్యామా ప్రసాద్ ఎంతో అనుభవం గడించారు.

బిడ్డ పుట్టినందుకు తల్లిదండ్రులు చాలా సంతోషిస్తారనే విషయం శ్యామా ప్రసాద్‌కు అనుభవంలోకి వచ్చింది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. కాని పుట్టిన బిడ్డకు ఏదైనా జబ్బు, అంగవైకల్యం ఉందంటే అది ఆ కుటుంబసభ్యులను ఎంతో నిరాశాకు గురిచేస్తుంది. సంతోషం దుఃఖంగా మారుతుంది. మనస్సులో రకరకాల సందేహాలు తలెత్తుతాయి.

పెదవులు, అంగిలి చీలిపోయి పుట్టిన శిశువులను కూడా కొన్ని సందర్భాల్లో శ్యామా ప్రసాద్ చూశారు. అలాంటి బిడ్డను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లి పోయేవారు. శస్త్రచికిత్సతో ఆ వైకల్యం తొలగిపోతుందని అనుభవజ్ఞులైన వైద్యులు తల్లిదండ్రులకు వివరించేవారు. సర్జరీ ద్వారా పెదవి, అంగిలిని సరిచేసే అవకాశం డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు వచ్చింది. క్యాన్సర్ బారిన పిల్లలకు శస్త్రచికిత్స చేసివారి ప్రాణాలు కాపాడే అవకాశం ఎగ్మోరు ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న సందర్భంలో డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు లభించింది.

మద్రాసులో ఉంటున్న సమయాన్ని డాక్టర్ శ్యామా ప్రసాద్ సద్వినియోగం చేసుకున్నారు. మద్రాసు మెడికల్ కాలేజీకి కూడా వెళ్లారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ తండ్రి డాక్టర్ సుందరయ్య మెడిసిన్ చదువుకున్న ఈ సంస్థలోనే. మద్రాసు మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న జనరల్ హాస్పిటల్లో కూడా శ్యామా ప్రసాద్ శిక్షణ పొందారు. అక్కడి పీడియాట్రిక్స్ విభాగంలో చాలా సమయం గడిపారు. పిల్లలకు కలిగే వ్యాధులు, వాటి చికిత్స కోసం అందించే కొత్త మార్గాలు తెలుసుకోవడమే కాదు వాటిని సమగ్రంగా అర్థం చేసుకున్నారు.

1853లో ప్రారంభమైన మద్రాసు జనరల్ హాస్పిటల్లో గతంలో పిల్లల వ్యాధుల చికిత్సకు ప్రత్యేక విభాగం లేదు. పెద్దల వైద్యులే పిల్లలకు కూడా చికిత్స

చేసేవారు. 1948లో ప్రముఖ శిశువైద్యుడు ప్రొఫెసర్ ఎస్.టి. ఎచెర్ మద్రాస్ జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగాన్ని నెలకొల్పారు.

40వ దశకంలో భారతదేశంలో 15 మంది శిశువైద్యులు మాత్రమే ఉండేవారు. వారిలో ఆరుగురు శిశువైద్యులు బొంబాయిలో, ఇద్దరు ఢిల్లీలో, ఇద్దరు మద్రాసులో, మరో ఐదుగురు శిశు వైద్యులు కలకత్తాలో ఉండేవారు.

భారతదేశంలో పీడియాట్రిక్ మెడిసిన్ 1928లో బొంబాయిలో ప్రారంభమైంది. ఆనాటి ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త సర్ నెస్ వాడియా, వారి సోదరుడు సర్ కుస్రో వాడియా బొంబాయిలో పిల్లల కోసం ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేయాలని భావించారు. అన్నదమ్ములిద్దరూ కలిసి బాంబే డైయింగ్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ నడిపేవారు. సోదరులిద్దరూ అనేక విద్యా సంస్థలను ప్రారంభించారు. ఇద్దరూ తమ తల్లి బాయి జెర్బాయి వాడియా జ్ఞాపకార్థం పిల్లల కోసం 'ది బాయి జెర్బాయి వాడియా హాస్పిటల్' స్థాపించారు. ఈ ఆసుపత్రికి 1928 మార్చి 7న శంకుస్థాపన చేశారు. 1929, డిశంబర్ 12న బొంబాయి గవర్నర్ సర్ ఫ్రెడరిక్ సైక్స్ ద్వారా దీనికి ప్రారంభోత్సం జరిగింది. ప్రఖ్యాత శిశువైద్యుడు డా. జార్జ్ కోయెల్హో భారతదేశపు మొట్టమొదటి పీడియాట్రిక్ ఆసుపత్రికి సూపరింటెండెంట్ అయ్యారు.

డాక్టర్ జార్జ్ కొయెల్హోను 'ఫాదర్ ఆఫ్ పీడియాట్రిక్స్ ఇన్ ఇండియా' అని పిలుస్తారు. డాక్టర్ జార్జ్ కోయెల్హో 1926లో పీడియాట్రిక్స్ పై స్వతంత్రంగా పరిశోధనలు చేపట్టారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన భారతదేశపు మొట్టమొదటి శిశువైద్యుడు. డాక్టర్ జార్జ్ కోయెల్హో చొరవతో 1944లో బాయి జెర్బాయి వాడియా హాస్పిటల్లో డిప్లొమా ఇన్ చైల్డ్ హెల్త్ కోసం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు ప్రవేశపెట్టడం జరిగింది. రెండేళ్ల తర్వాత అంటే 1946లో బాంబే యూనివర్సిటీలో ఇదే కోర్సు ప్రారంభమైంది. ఈ కోర్సు కారణంగా భారతదేశంలో పిల్లల వైద్యుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది.

1950లో డాక్టర్ కోయెల్హో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిషియన్స్‌ను స్థాపించారు. 1952 నుంచి 1959 వరకు 'ఇండియన్ జర్నల్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పత్రికకు ఆయన సంపాదకత్వం వహించారు. ప్రఖ్యాత

వైద్యుడు డా.కె. సి.చౌదరి 1933లో 'ఇండియన్ జర్నల్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పత్రిక ప్రచురణ చేపట్టారు. 1928లో తన మొదటి వియన్నా పర్యటనలో డాక్టర్ కె.సి.చౌదరిని ఆ దేశంలో శిశు సంక్షేమ చర్యలు బాగా ఆకట్టుకున్నాయి. పిల్లలకు తగిన వైద్యసేవలందించేందుకు వియన్నాలో అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. ఆ సంస్థల పనితీరుకు ముగ్ధుడైన డాక్టర్ కె. సి.చౌదరి భారతదేశంలో పీడియాట్రిక్ ఆసుపత్రిని ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ముందు ఆయన పీడియాట్రిక్స్ పై ఒక పత్రికను తీసుకువచ్చారు. ఈ పత్రిక ద్వారా భారతదేశంలోని వైద్యులు ఎంతో ప్రయోజనం పొందారు.

1956లో కలకత్తాలో పిల్లల ఆస్పత్రి ప్రారంభించడంలో డాక్టర్ కె.సి.చౌదరి సఫలమయ్యారు. 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్' పేరుతో నిర్మించిన ఈ ఆసుపత్రిని అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారు.

అంతకుముందు 1948 ఎస్.టి. ఎచర్ చొరవతో మద్రాసు జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగం ఏర్పాటైంది. అదే సంవత్సరంలో బొంబాయి టోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజీ, బి.వై.ఎల్. నాయర్ ఛారిటబుల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగం ప్రారంభమైంది. డాక్టర్ శాంతిలాల్ సేథ్ ఈ విభాగానికి మొదటి అధిపతి అయ్యారు. ప్రొఫెసర్ లాలా సూరజ్ నందన్ ప్రసాద్ పట్నా పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు.

50వ దశకం ప్రారంభంలో బాంబే, పట్నా ఆస్పత్రుల్లో పీడియాట్రిక్స్ విభాగంలో ఎం.డి. కోర్సులు ప్రారంభమయ్యాయి. శిశువైద్యుడు డాక్టర్ పి.ఎన్. తనేజా కృషి వల్ల మొదట ఢిల్లీలోని ఇర్విన్ హాస్పిటల్లో, తర్వాత ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పీడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్ స్థాపన జరిగింది. డాక్టర్ జె. ఎన్. పొహోవా ఇండోర్లోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు. దీని తరువాత, భారతదేశంలోని అన్ని ప్రధాన ఆసుపత్రులలో పీడియాట్రిక్ విభాగాల ఏర్పాటు వేగవంతమైంది. వివిధ వైద్య కళాశాలలు, విద్యా-పరిశోధన సంస్థలలో పీడియాట్రిక్ కోర్సులు మొదలయ్యాయి. శిశువులకు వచ్చే వ్యాధులు, వాటికి అందించే చికిత్సపై విస్తృత పరిశోధనలు ప్రారంభమయ్యాయి.

డాక్టర్ ఎస్.టి. ఎచర్ 28 పడకలతో మద్రాసు జనరల్ హాస్పిటల్లో పీడియాట్రిక్స్ విభాగాన్ని ప్రారంభించారు. కానీ అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య పెరగడం వల్ల డాక్టర్ ఎచర్ పిల్లల కోసం ప్రత్యేక ఆసుపత్రిని ప్రారంభించాలని ఆలోచన చేశారు. ఆ ఆలోచన ఫలితమే ఎగ్మోర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్.

1957లో మద్రాసు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ చైల్డ్ హెల్త్, 1961లో ఎం.డి. కోర్సు ప్రారంభమైంది. దేశంలోని వివిధ ఆసుపత్రుల నుంచి వైద్యులు మద్రాసు జనరల్ హాస్పిటల్, ఎగ్మోర్లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ అండ్ హాస్పిటల్ ఫర్ చిల్డ్రన్ లో శిశు వైద్యంలో శిక్షణ పొందేందుకు, శిశువైద్యులు కావడానికి రావడం ప్రారంభించారు. శ్యామా ప్రసాద్ కూడా మద్రాసులో శిశు వ్యాధులు వాటి చికిత్స విధానం గురించి తెలుసుకున్నారు.

శిక్షణలో భాగంగా శ్యామా ప్రసాద్ బెంగుళూరు కూడా వెళ్ళారు. బెంగుళూరు మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వాణి విలాస్ స్త్రీ–శిశు హాస్పిటల్, విక్టోరియా హాస్పిటల్లో పిల్లల శస్త్రచికిత్సల గురించి తెలుసుకున్నారు.

ఈ రెండు ఆసుపత్రులు బ్రిటిష్ కాలంలోనే స్థాపించినవే. స్వాతంత్ర్యం తర్వాత ఆ రెండింటిని బెంగళూరు మెడికల్ కాలేజీకి అనుసంధానం చేశారు.

నేర్చుకోవాలనే బలమైన కోరిక డాక్టర్ శ్యామా ప్రసాద్‌ని చండీగఢ్ కు కూడా తీసుకెళ్లింది. అక్కడి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కలిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో శిక్షణ పొందారు. ఈ సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనను అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్ కైరో చేశారు. పంజాబ్లో అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు జరిగే వైద్య సంస్థ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నయంకాని వ్యాధులకు చికిత్స అందించేందుకు అక్కడ పరిశోధనలు జరగాలని కోరుకున్నారు. పెద్ద పెద్ద జబ్బులకు కూడా అక్కడ చికిత్స అందించాలనే భావన ఆయనకు ఉండేది. ఆయన ఆకాంక్షలు నెరవేరేలా ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చర్యలు చేపట్టారు. పంజాబ్ ప్రభుత్వానికి అన్ని విధాలా సహాయాన్ని అందించారు. ప్రొ. తులసీ దాస్, ప్రొ. సంతోఖ్ సింగ్ ఆనంద్, ప్రొ. పి.ఎన్. చుట్టాని, ప్రొ. బి.ఎన్.

అయికత్, ప్రొ. సంత్ రామ్ ఢల్, ప్రొ. బాలకృష్ణ వంటి ప్రముఖ వైద్యులు ఈ సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారు.

1962లో ఇన్‌స్టిట్యూట్ స్థాపన పనులు ప్రారంభమయ్యాయి. 1963, జైల్ 7న ప్రధాన మంత్రి నెహ్రూ ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రారంభించిన సమయంలో ఈ సంస్థ అవిభక్త పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం క్రింద ఉండేది. కానీ పంజాబ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత, సంస్థ పరిపాలనా నియంత్రణ 1966 నవంబర్‌లో కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ పరిధిలోకి వచ్చింది. 1967లో పార్లమెంటు చేసిన చట్టం ద్వారా ఇన్‌స్టిట్యూట్ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా రూపాంతరం చెందింది.

ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తర్వాత వైద్యరంగంలో భారతదేశపు రెండో అతిపెద్ద పరిశోధనా కేంద్రంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్స్ ఆవిర్భావించింది. ఈ కేంద్రంలో శ్యామా ప్రసాద్ సుమారు నెల రోజులు పనిచేశారు. చాలా రోజులు ఆయన ఢిల్లీలోనే ఉన్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని పీడియాట్రిక్స్ నిపుణులతో కలిసి పనిచేసి ఎంతో అనుభవం సంపాదించారు. అక్కడే శ్యామా ప్రసాద్ రాత, మౌఖిక, ప్రాక్టికల్ పరీక్షలకు సిద్ధమయ్యారు.

ఢిల్లీలో ఉన్న సమయంలో శ్యామా ప్రసాద్‌కు డాక్టర్ సుబ్బారావు రూపంలో స్నేహితుడు, క్లాస్‌మేట్ ట్రైనీ డాక్టర్ దొరికారు. సుబ్బారావు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' కోర్సు చేస్తున్నారు. శ్యామా ప్రసాద్, సుబ్బారావు స్నేహం రోజురోజుకూ బలపడింది.

సాధారణంగా మాస్టర్ ఆఫ్ చిరుర్గియా కోర్సు విద్యార్థులు సంబంధిత వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో శిక్షణ పొందుతారు. శ్యామా ప్రసాద్ ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' కోర్సు చేస్తున్నారు. కింగ్ జార్జ్ హాస్పిటల్లో శస్త్రచికిత్స శిక్షణ పొందేందుకు ఆయన అర్హులు. కానీ, శ్యామా ప్రసాద్ భారతదేశంలోని ప్రముఖ వైద్య కళాశాలల్లోని అత్యుత్తమ సర్జన్ల నుంచి శిక్షణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కారణంగా

ఆయన దేశంలోని ప్రధాన వైద్య విద్యా సంస్థలను సందర్శించేందుకు, అక్కడి నిపుణులైన సర్జన్ల నుంచి శస్త్రచికిత్స విధానాన్ని తెలుసుకోవడానికి ప్రత్యేక అనుమతి పొందారు.

శ్యామా ప్రసాద్ మద్రాసు, బెంగళూరు, ఢిల్లీ, చండీగఢ్, బొంబాయి, కలకత్తా, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో శిక్షణ తీసుకుని శస్త్రచికిత్సలో ప్రావీణ్యం సంపాదించారు. ఈ శిక్షణ ఆయన ఆత్మవిశ్వాసాన్ని ఎంతో బలపరిచింది. విశాఖపట్నం తిరిగి వచ్చిన తరువాత, ఆయన పెద్ద శస్త్రచికిత్సలు చేయడం ప్రారంభించారు. 1989లో 'మాస్టర్ ఆఫ్ చిరుర్గియా' పట్టా పొందారు. డిగ్రీ రాగానే ఆయనకు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి ఆఫర్లు రావడం మొదలయ్యాయి. చాలా పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు శ్యామా ప్రసాద్‌కు పెద్ద మొత్తంలో జీతం ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. కొన్ని సంస్థలు ఆయనను విదేశాలకు వెళ్లాలని సూచించాయి. కొంతమంది తోటి సర్జన్లు ఆయనను ఆస్ట్రేలియాకు తీసుకెళ్లాలని అనుకున్నారు. కొందరు స్నేహితులు అమెరికా వెళ్లమని సలహా ఇచ్చారు. అన్ని ఆసక్తికరమైన, అంగీకరించే యోగ్యమైన ఆఫర్లే. శ్యామా ప్రసాద్ సహచరులు చాలా మంది విదేశాల్లో స్థిరపడ్డారు. కానీ తన తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం కారణంగా శ్యామా ప్రసాద్ విదేశాలకు వెళ్లాలనే ఆఫర్లను తిరస్కరించారు. భారతదేశంలోనూ ఉంటూ ఇక్కడి పేదలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

అప్పట్లో పుట్టిన పిల్లలకు సమస్యలు అంటూ చాలా కేసులు వచ్చేవి. వారిలో చాలా మంది అప్పుడే  పుట్టిన పిల్లలకు Tracheoesophageal fistula సమస్య ఉండేది. అంటే.. మలద్వారం మూసుకుపోయి బయటకు విసర్జన కాకపోయేది. అలాంటి పిల్లలను హ్యాండిల్ చేయాల్సి వచ్చేది. అప్పుడే పుట్టిన పిల్లలకు అలాంటి ఆపరేషన్ చేయడం చాలా చాలా కష్టం. అలాంటివి ఎన్నో కేసులు టేకప్ చేశారు. అయితే, వీటిలో ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉందని దేశంలోని వేరే వేరే ప్రాంతాలకు వెళ్లారు. ఛండీగఢ్ వెళ్లి అక్కడ కొన్నాళ్లు నేర్చుకున్నారు. ఎయిమ్స్ ఢిల్లీలోనూ చదువుకుని అక్కడే ప్రాక్టీస్ చేశారు. దక్షిణాదిలో చెన్నై ఎగ్మోర్ హాస్పిటల్ పిల్లల కోసమే ఉండేది. అందులో రెండువేల

మందికి ఒకేసారి ట్రీట్ మెంట్ జరిగేది. మొత్తం ఆరు యూనిట్లలో 300 పడకల వరకు సర్జరీలే ఉండేవి. విశాఖలో ఉన్నప్పుడు రోజుకు రెండు మూడు ఆపరేషన్లు చేస్తే.. ఎగ్మోర్ ఆస్పత్రిలో మాత్రం రోజుకు 15 సర్జరీలు చేసేవారు. దీంతో చాలా సబ్జెక్ట్ నేర్చుకున్నారు. ఇవే కాదు, కలకత్తా, ముంబై, ఇండోర్.. ఇలా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆపరేషన్లు ఏ పద్ధతిలో చేస్తారో చూసి నేర్చుకుని అందులో నైపుణ్యం సంపాదించారు. డాక్టర్ శ్యామా ప్రసాద్‌లోని ఆ నాలెజ్జ్ చూసిన వాళ్లు ఆస్ట్రేలియా రమ్మని ఆహ్వానించారు. కాని, అప్పుడే పిల్లలు పుట్టడం, ఇంటికి ప్రాధాన్యత ఇవ్వాలనుకోవడం మూలంగా ఆస్ట్రేలియా వెళ్లదలచుకోలేదు. అదే సమయంలో గైనకాలజిస్టుగా డాక్టర్ శ్యామా ప్రసాద్ సతీమణి సైతం ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్‌ను చదివించింది ఆయన సతీమణే అని చెబుతుంటారు. రిటైర్మెంట్ అయ్యాక కూడా గైనకాలజిస్టుగా ఆమె సేవలను ఉపయోగించుకున్నారు. బోటాబోటీ జీతం వచ్చినా కూడా పేదలకు సేవ చేస్తున్నాం అనే తృప్తితో ఐదేళ్ల పాటు సేవలు అందించారు డాక్టర్ శ్యామా ప్రసాద్ సతీమణి.

డాక్టర్ శ్యామా ప్రసాద్ అంటే మహా క్రేజ్: కేజీహెచ్‌లో గురువారం నాడు ఓపీ చూసేవారు. ఆరోజు ఎంత లేదన్నా 300 మంది వరకు పేషెంట్లు వచ్చే వారు. మిగతా రోజుల్లో ఎప్పుడూ అంతమంది పేషెంట్లు రావడం అక్కడి డాక్టర్లు చూడలేదు. దాంతో బయట అడుక్కునేవారి నుంచి గోచి పెట్టుకునే వాళ్ల వరకు బీద బిక్కి పేషెంట్లు అందరూ డాక్టర్ శ్యామా ప్రసాద్ కోసం వచ్చే వారు. వైద్యునిగా ఎవరి స్థాయి ఏంటి అని చూసేవారు కాదు. దీంతో ఓపిగ్గా అందరికీ వైద్యం అందించి, అవసరమైతే హాస్పిటల్‌లో జాయిన్ చేసేవారు. ఈ తరువాత డయాబెటిక్స్ పై రీసెర్చ్ చేద్దామనే ఆలోచన వచ్చింది. వెంటనే పీహెచ్‌డీ కోసం యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కాని, ఆ రోజుల్లో ఎందుకనో రీసెర్చ్ అంటే ఎంకరేజ్ చేసే వారు కాదు. ఎవరో ఒకరిద్దరు మాత్రమే మహా కష్టంగా పీహెచ్‌డీలు చేసేవారు. యూనివర్సిటీ పెట్టిన 34 ఏళ్లలో 20 మందికే పీహెచ్‌డీ ఇచ్చారంటే.. ఆ రోజుల్లో ఎలాంటి పరిస్థితులు ఉండేవో అర్థం చేసుకోవచ్చు. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం పట్టు వదల్లేదు. బ్రెస్ట్ సర్జరీలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

పీడియాట్రిక్ సర్జన్‌గా ఎన్నో అద్భుతమైన కేసులు విజయవంతంగా చేశారు. ముఖ్యంగా చిన్నపిల్లలు చిన్న పేగు లేకుండా పుట్టేవాళ్లు. అలాంటివి నెలకు కనీసం ఆరు, ఏడు వచ్చేవి. ఈ ఆపరేషన్లలో సక్సెస్ రేటు చాలా ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా ఈ ఆపరేషన్ల సమయంలో ఇంట్రా క్యాథల్ పెట్టడం సవాల్‌గా ఉండేది. చాలా మంది డాక్టర్లకు కుదరకపోవడంతో.. స్వయంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ వెళ్లి ఇంట్రా క్యాథల్ పెట్టేసి వచ్చేవారు. ఆ రోజుల్లో అలా పెట్టినందుకు ప్రత్యేకంగా డబ్బులు కూడా ఇచ్చే వారంటే.. అది ఎంత కష్టసాధ్యమో అర్థం చేసుకోవచ్చు. చివరికి గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఫోన్ చేసి, ఇంట్రా క్యాథల్ పెట్టమని చెప్పి అడిగేవాళ్లు. ఆ తరువాత క్రమంగా పెద్దవారికి సర్జరీలు చేయడం మొదలుపెట్టారు. ఓ రోజు అనకాపల్లి నుంచి కిడ్నీ ఆపరేషన్‌కు పిలిచారు. ఎక్స్ రేల్లో కిడ్నీకి క్యాన్సర్ సోకిందని తేలడంతో ఆ పేషెంటుకు కిడ్నీ తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది. నిజానికి ఇలాంటి పెద్ద ఆపరేషన్లను ఉస్మానియాలో నేర్చుకున్నారు. రెండేళ్ల పాటు ఎంతో కష్టపడి క్లిష్టమైన సర్జరీలు చేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఉండి ఒక్కోసారి 20 కేసులు అటెంప్ట్ చేసేవారు. ఎవరైనా డ్యూటీకి రాలేనని చెబితే చాలు.. నేనుంటాను అంటూ ముందుకు వెళ్లేవారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ఆ అనుభవం అనకాపల్లిలోని కిడ్నీ రిమూవల్ ఆపరేషన్‌కు పనికొచ్చింది. అదే మొదటి మేజర్ సర్జరీ అయినప్పటికీ.. చాలా బాగా హ్యాండిల్ చేశారు. ఆ తరువాత ఆ పేషెంట్ పదేళ్లకు పైగా బతికారు. ఆ ఆపరేషన్ చేసిన తీరు చూసి, డాక్టర్లు వరుస ఆఫర్లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇలాంటి ఆపరేషన్లు డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రమే బాగా చేయగలరన్న పేరు వచ్చింది. అలా కొన్ని వందల కేసులు చేశారు డాక్టర్ శ్యామా ప్రసాద్. క్రమంగా ఆపరేషన్లకు పీజీ విద్యార్థులను వెంటతీసుకెళ్లి వారికి నేర్పించేవారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ఆపరేషన్ సమయం ఎక్కువగా రాత్రిళ్లే ఉండేది. రాత్రి పది, 11గంటలకు ఆపరేషన్లు చేయడం మొదలుపెట్టేవారు. ఆయనది అదో స్టైల్. పైగా ఎంసీహెచ్ ఉండడంతో మిగిలిన డాక్టర్ల కంటే ఓ వంద రూపాయలు ఎక్కువ ఇచ్చేవాళ్లు. అప్పట్లో వంద అంటే ఇప్పుడు లక్షతో సమానం.

డాక్టర్ శ్యామా ప్రసాద్ తన సర్వీసులో ఎన్నో క్రిటికల్ అండ్ టిపికల్ కేసులను హ్యాండిల్ చేశారు. ఓ రోజు నెల్లూరు నుంచి విశాఖ వచ్చి సెటిల్

అయిన ఓ ఫ్యామిలీ.. తన కూతురిని తీసుకుని హాస్పిటల్‌కు వచ్చారు. పైకి చూస్తే కడుపులో ఏదో గడ్డ అయిందనిపించింది. వచ్చిన వాళ్లు పేదవాళ్లు కావడంతో.. టెస్టులకు డబ్బులు సరిపోతాయో లేదోనని భావించి, కేజీహెచ్ తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. లోపల క్యాన్సర్ గడ్డ గానీ ఉందా అనుకున్నారు. ఆ భయంతోనే ఆపరేషన్‌కు సిద్ధమయ్యారు. తీరా చూస్తే అది గడ్డ కాదు.. వెంట్రుకల పోగు. ఆ అమ్మాయి తన జుట్టునే పీక్కుని తినేసేది. ఈ జబ్బుని ట్రైకోబెజోర్ అంటారు. ఈ వ్యాధి ఉన్న వాళ్లు జుట్టు లేదా రాళ్లు, మట్టి, ఇసుక తినేస్తారు. ఇదొక మానసిక జబ్బు. దీంతో అమ్మాయి కడుపులో పేరుకుపోయిన వెంట్రుకల పోగును జాగ్రత్తగా బయటికి తీసి అమ్మాయి సమస్యను తీర్చారు.

ఇలాంటివే అప్పట్లో నాలుగు కేసులు వచ్చాయి. ఆ రోజుల్లో ఇవి చాలా టిపికల్ కేసులు. చాలా రేర్‌గా ఈ కేసులు కనిపించేవి. పైగా అలాంటి కేసులు నాలుగు హ్యాండిల్ చేశారు. సాధారణంగా ఇలాంటి మానసిక స్థితి ఉన్న వాళ్లు గోడలను గీకి అక్కడ రాలే సున్నం తింటుంటారు. లేదా రాళ్లు మింగుతుంటారు. ఇసుక, మట్టిని సైతం నోట్లో వేసుకుంటారు. ఇలాంటి వాళ్లని ముందుగా సైకాలజిస్టులకు చూపించి, తగిన వైద్యం అందించి, నయం చేయించాలి. సాధారణంగా రక్తహీనత ఉన్న వారికే ఇలాంటి మానసిక స్థితి కలుగుతుంది. తమ దగ్గరికి వచ్చిన ఇలాంటి పేషెంట్లకు.. ఒకవేళ రక్తం తక్కువగా ఉంటే రక్తం ఎక్కించే వాళ్లు. ఒకవేళ సరిపడినంత రక్తం ఉంటే మాత్రం బ్లడ్‌కి రీప్లేస్‌మెంట్ ఇచ్చేవారు. ఇక శరీరంలో రక్తం తగ్గిపోవడానికి మరో కారణం ఉంది. మరీ ముఖ్యంగా చిన్నపిల్లల్లో ఈ సమస్య తలెత్తడానికి కారణం కడుపులో నులిపురుగులు. పిల్లలకు అప్పుడప్పుడు నులిపురుగుల మందు ఇవ్వాలి. అలా కొంత వరకు ఈ రోగాన్ని నయం చేయవచ్చు.

ఓ రోజు ఓ చిన్న పిల్లవాడిని హడావుడిగా ఆస్పత్రికి తీసుకొచ్చారు. కడుపు ఉబ్బరంగా ఉండడం వల్ల పిల్లాడు ఏడుపు ఆపట్లేదని బాలుడి తల్లిదండ్రులు చెప్పారు. ఓవైపు పిల్లాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. తనకున్న అనుభవంతో వెంటనే ఎక్స్ రే తీస్తే విషయం తెలుస్తుందని భావించారు. వెంటనే ఎక్స్ రే తీసి చూశారు. కడుపు పేగుల్లో రాళ్లన్నీ ఇరుక్కుపోయినట్టు కనిపించాయి. ఈ జబ్బుని వైద్య పరిభాషలో పైకా అంటారు.

ఇది కూడా ఒక రకమైన మానసిక వ్యాధి. గత కేసులో అమ్మాయి వెంట్రుకలు తినేస్తే.. ఈ కేసులో పిల్లాడు రాళ్లు తిన్నాడు. ఆ రాళ్లు అలా అలా చిన్న పేగు వరకు వచ్చి చేరాయి. దానివల్ల ఆ నాలుగేళ్ల పిల్లాడికి మలవిసర్జన అవక, కడుపు ఉబ్బిపోయి నరకం అనుభవించాడు. దీంతో రెక్టల్ ఎగ్జామినేషన్ చేయడానికి రెడీ అయ్యారు. రెక్టల్ ఎగ్జామినేషన్ అంటే.. మలద్వారంలో వేలు పెట్టి పేగుల్లో ఇరుక్కున్న రాళ్లు తీయడం అన్నమాట. అలా వారం పాటు ఆ పిల్లాడిని ఆస్పత్రిలోనే ఉంచుకుని, రాళ్లన్నీ బయటకు తీయగలిగారు.

నెల రోజుల తరువాత ఇలాంటి కేసే మరొకటి వచ్చింది. ఆ పిల్లాడికి ఆరేళ్లు. ఇది కూడా పైకా కేసే. ఈ కేసులో కూడా పిల్లాడు రాళ్లు తిన్నాడు. దీంతో అవన్నీ చిన్నపేగు చివరికి వచ్చి అడ్డుపడ్డాయి. ఆ రోజుల్లో సిటీస్కాన్ వంటి సదుపాయాలు పెద్దగా అందుబాటులో లేవు. దీంతో ఎక్స్ రేలను ఉపయోగించేవారు. కాని, ఎక్స్ రేలలో అవి రాళ్లేనని నిర్ధారించడం చాలా కష్టం. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ వాటిని గుర్తించగలిగారు. అప్పటికే అలాంటి కేసులు చేసిన అనుభవం ఉండడంతో.. ఓ అంచనాకు రాగలిగారు. అలాంటి కేసులలోని ఎక్స్ రేలను, ఫొటోలు తీసి ఇప్పటికీ భద్రంగా దాచుకున్నారు. పైగా ఆ కేస్ స్టడీస్‌ను జర్నల్‌లో ప్రచురించే వారు. ఇలాంటి వాటిని జర్నల్‌లో ప్రచురించాలంటే తగిన ప్రూఫ్స్ కూడా అవసరం. కాబట్టి వాటిని అలా భద్రపరుచుకున్నారు. అప్పటి ఎక్స్ రేలను ఇప్పటికీ దాచుకున్నారు డాక్టర్ శ్యామా ప్రసాద్. దాన్నొక మాన్యుమెంట్‌గా ఉంచుకున్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ అనుభవంలో ఎక్కువ కేసులు హైపోస్పాడియాస్ వచ్చేవి. అంటే.. పురుషుల్లో మూత్ర ద్వారం చివర కాకుండా కింది వైపు లేదా వెనక్కు ఉండడం అన్న మాట. దీనివల్ల వీర్యం బయటకు రాదు. అంటే పిల్లలు పుట్టే అవకాశం ఉండదు. సో, పిల్లలు పుట్టగానే డాక్టర్ గమనించి, ఇలాంటి కేసులను రిఫర్ చేసే వాళ్లు. ఇలాంటి ఆపరేషన్లను మూడేళ్ల లోపునే చేస్తారు. ఇలాంటి ఆపరేషన్లపై శిక్షణ తీసుకున్నారు. ఇందులో అసోపా అనే సర్జన్ నిష్ణాతుడు. ఆయన దగ్గర శిష్యరికం చేసి.. ఆ సర్జరీలు చేయడం నేర్చుకున్నారు. ఆగ్రాలోనే ఉండి, వంద కేసులు దగ్గరుండి స్టడీ చేశారు. దాన్ని అసోపా టెక్నిక్ అంటారు. నిజానికి ఈ టెక్నిక్ అందరికీ వచ్చేది కాదు. అది అసోపాకు మాత్రమే

అబ్బిన విద్య. ఈ మధ్య డాక్టర్ అసోపా చనిపోయారు. ఇలాంటి ఆపరేషన్లు చేసేప్పుడు అసోపా సలహాలు తీసుకునే వారు. ఆయన చనిపోవడంతో డాక్టర్ చంద్రశేఖరం అనే సీనియర్‌ను సంప్రదించేవారు. ఆయన ఎన్నో క్రిటికల్ కేసులను హ్యాండిల్ చేశారు. అలాంటి సర్జరీలు ఎలా చేయాలో డాక్టర్ చంద్రశేఖరం నుంచి నేర్చుకున్నారు. ఇప్పటికీ, ఏదైనా సమస్య వస్తే డాక్టర్లకు తోడుగా ఉండి, సలహాలు ఇస్తారు. ఈ విషయంలో డాక్టర్ చంద్రశేఖరం గురువు. ఆయన నుంచి శ్యామా ప్రసాద్ ఎన్నో నేర్చుకున్నారు. ఓర్పు, ఓపిక, మంచితనం ఇలా ఎన్నో సుగుణాలు ఉన్నాయి. అవసరమైతే పేషెంట్లకు దారి ఖర్చులకు డబ్బులు ఇచ్చి, భోజనం పెట్టి ఇంటికి పంపేవారు. రోగులు ఆయన్ను ఒక దేవుడి కింద లెక్కేసే వారు. అలాంటి సుగుణాలను శ్యామా ప్రసాద్ కూడా అలవరుచుకున్నారు. పేషెంట్లను ప్రేమ పలకరించడంతో పాటు అవసరమైన వారికి డబ్బులు కూడా ఇచ్చేవారు.

సాధారణంగా పేషెంట్లే డాక్టర్లను దేవుళ్లతో సమానంగా చూస్తారు. కాని, శ్యామా ప్రసాద్ అభిప్రాయంలో మాత్రం పేషెంట్లే దేవుళ్లు. డాక్టర్ విద్య నేర్చుకున్నానంటే దానికి కారణం పేషెంట్లే అనేవారు. డాక్టర్‌గా సర్జరీ చేసే అవకాశం వచ్చిందంటే.. అది పేషెంట్ ఇచ్చిన అవకాశమే అంటుంటారు. వాళ్లు ఆపరేషన్ చేయించుకున్నారు కాబట్టే.. డాక్టర్లకు మంచి పేరు వచ్చిందనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మే వ్యక్తి శ్యామా ప్రసాద్. అందుకే, అవసరమైన పేద రోగులకు డబ్బులు ఇవ్వడం, సాయం చేయడంలో ఏ తప్పూ లేదని భావించే వారు. పైగా మానసిక సంతృప్తి ఉండేది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ విశాఖలోని సాగరిక ఆస్పత్రిలో చాలా కాలం పాటు ప్రాక్టీస్ చేశారు. దాదాపు 15 ఏళ్ల పాటు ప్రాక్టీస్ చాలా గొప్పగా గడిచింది. పగలనకా రేయనకా కష్టపడే వారు. ఎప్పుడూ సర్జరీలతో బిజీగా గడిపేవారు. చాలాసార్లు అర్ధరాత్రి వరకు ఆపరేషన్లు చేసి ఇంటికి నడిచి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి.

సాధారణంగా పిల్లల్లో ఎక్కువగా, తరచుగా కనిపించే సమస్య నులిపురుగులు. శుభ్రత పాటించకపోవడం, ఏది పడితే అది నోట్లో పెట్టుకోవడం కారణంగా పిల్లల పేగుల్లో నులిపురుగులు పేరుకుపోతాయి. ఇవి

పిల్లల ఎదుగుదలను దెబ్బతీస్తాయి. అలాగే, కడుపులో పేగులను కూడా నాశనం చేస్తాయి. వీటి కారణంగా పేగులకు ఇన్ఫెక్షన్ వచ్చి పిల్లలు నరకయాతన పడాల్సి వస్తుంది. అలాంటి కేసులను ఎన్నో డీల్ చేశారు. ఓ రోజు ఓ పిల్లాడికి కడుపు నొప్పి అని హాస్పిటల్‌కు వచ్చారు. కడుపు నొప్పికి కారణం పేగుల్లో ఇన్ఫెక్షనే అని కనుగొన్న డాక్టర్ శ్యామా ప్రసాద్.. సర్జరీ చేసి ఓపెన్ చేసి చూశారు. ఆశ్చర్యంగా, గతంలో ఎన్నడూ చూడని విధంగా పిల్లాడి పేగుల్లో నులిపురుగులు పేరుకుపోయి ఉన్నాయి. వాటిని తీస్తున్నకొద్దీ బయటకు వచ్చాయి. అలా దాదాపు వేయి నులిపురుగులను బయటకు తీశారు. అప్పట్లో అదో రికార్డ్. అంతకు ముందు బెంగాల్‌లో ఇలాంటి కేసే వచ్చింది. అప్పటి డాక్టర్లు ఓ పేషెంట్ నుంచి 500 లేదా 600 నులిపురుగులను బయటకు తీశారు. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ చేసిన సర్జరీలో ఏకంగా వేయి నులిపురుగులు బయటపడ్డాయి. దీంతో ప్రెస్ మీట్ పెట్టి, ఇలాంటి అరుదైన ఆపరేషన్ చేశామని చెప్పుకొచ్చారు. ఆ వార్త పేపర్లో రావడంతో సెన్సేషన్ అయింది. ఆ తరువాత ఇలాంటి కేసులు మరో మూడు హ్యాండిల్ చేశారు.

ఓ రోజు 75 ఏళ్ల పెద్దావిడ కేజీహెచ్‌కు వచ్చింది. అప్పటికే ఆమెకు 8సార్లు ఆపరేషన్స్ జరిగాయి. పేగుల్లో హెర్నియా రావడంతో చాలా ఇబ్బంది పడింది. విజయనగరంలోని ఓ గైనకాలజిస్ట్ దగ్గర చూపించుకునేది. అయితే, అది నల్లబారి పోయి బయటకి వచ్చేయడంతో.. చేసేది లేక విశాఖ కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అంటే, విజయనగరంలోని గైనకాలజిస్టు చేయలేక విశాఖకు పంపించారన్న మాట. ఆ పెద్దావిడ కేజీహెచ్‌కు వచ్చినప్పుడు రాత్రి పది అయింది. చూస్తే చాలా అర్జెంటుగా చేయాల్సిన కేసు. అప్పుడు డ్యూటీలో ఉన్న డాక్టర్.. తన వల్ల కాదని చెప్పి డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ఫోన్ చేశారు. ఆ రాత్రి సమయంలో హడావుడిగా ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ శ్యామా ప్రసాద్.. పెద్దావిడకు ఆపరేషన్ చేయడానికి సిద్ధమయ్యారు. ముందుగా పేషెంట్‌ను మానసికంగా సిద్ధం చేశారు. ఆపరేషన్ ఏంటి, ఎందుకు చేయాలి, ఎలా చేయబోతున్నాం అని వివరించారు. అయితే, ఇంటెస్టేనియల్ హెర్నియా ఆపరేషన్‌ను సాధారణంగా చేసే పద్ధతిలో చేస్తే వర్కౌట్ కాదని తెలిసి.. తన వైద్య అనుభవంతో ముందుగానే ఆమెకు యాంటీ బయోటిక్స్ ఇంజెక్ట్ చేశారు. డాక్టర్

శ్యామా ప్రసాద్ దగ్గర ఖరీదైన యాంటీ బయోటిక్స్ ఎప్పుడూ తన బ్యాగులోనే ఉండేవి. దీంతో ఆవిడ వయసును, జబ్బును దృష్టిలో పెట్టుకుని ట్రీట్ మెంట్ మొదలుపెట్టారు. ఆ తరువాత పేగుల వద్ద మెష్ పెట్టి, దాన్ని బాగా క్లీన్ చేసి, దాదాపు ఐదారు గంటల పాటు సర్జరీ చేశారు. ఆ తరువాత ఐదు రోజుల్లోనే ఆ పేషెంట్ కోలుకున్నారు. చూడ్డానికి, చెప్పడానికి ప్రాసెస్ చిన్నగానే అనిపించినా, అదొక మేజర్ ఆపరేషన్. ఆ రోజుల్లో పెద్దగా ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో ఇలాంటి ఆపరేషన్ చేయడం నిజంగా సవాల్‌తో కూడుకున్నదే. డాక్టర్ శ్యామా ప్రసాద్ కెరీర్‌లో ఈ ఆపరేషన్‌ను ది బెస్ట్‌గా చెప్పొచ్చు.

ఇలాంటి క్రిటికల్ కేసులను ఎన్నో హ్యాండిల్ చేశారు. ఓ రోజు ఓ చిన్నపిల్లాడిని హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. కడుపులో గడ్డ ఉండడంతో ఉబ్బిపోయింది. దీంతో ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్జరీలో పొట్ట ఓపెన్ చేసి చూస్తే హార్జికల్ ఇన్‌ఫోర్మా అని తేలింది. అలాంటి కేసులకు అప్పట్లో ట్రీట్ మెంట్ లేదు. హార్జికల్ ఇన్‌ఫోర్మాకు కరెంట్ పెట్టడం లాంటి ట్రీట్ మెంట్ ఉంది. ఆ సమయంలో అవేమీ అందుబాటులో లేకపోవడంతో పేగులో ఎక్కడ ఈ ప్రాబ్లమ్ ఉందో దాన్ని తొలగించడం తప్ప మరో మార్గం లేదు. పైగా ఇందుకోసం ప్రత్యేకమైన మందులు లేకపోవడంతో.. తమ దగ్గర ఉన్న వాటినే డోస్ తగ్గించి, డైల్యూట్ చేసి, ఐవీల రూపంలో ఇచ్చే వాళ్లు. ఒకరకంగా చెప్పాలంటే పేషెంట్లను బతికించాలనే తాపత్రయంతో ప్రయోగాలు చేశారు. ఒక్కోసారి చిన్న పిల్లలను చాలా క్రిటికల్ స్టేజ్‌లలో తీసుకొచ్చే వారు. వారికి ఆపరేషన్ చేస్తుండగానే చనిపోయేవారు. మరికొందరు ఆపరేషన్‌కు ముందే ఈ పిల్లాడు మాకు వద్దు అంటూ ఆస్పత్రిలోనే వదిలి వెళ్లిపోతుండే వాళ్లు. అలాంటి కేసులపైనా స్టడీ చేసేవారు. వాటిని ఒక కేస్ స్టడీగా తీసుకుని, క్లినికల్‌గా ఏం చేయాలి, ఏం చేయగలం అనే విషయాలను నేర్చుకునే వారు. ఒకరకంగా.. డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ఎంత అనుభవం వచ్చినా... నిత్యం ఏదో ఒక కొత్త విషయం నేర్చుకోవాలనే తపన మాత్రం కనిపించేది. ఆ తపన, తాపత్రయం నుంచే బోలెడు విషయాలు నేర్చుకున్నారు.

ఆ రోజుల్లో సర్జరీ అంటేనే ఒంట్లోంచి పాడైపోయిన భాగాన్ని తీసేయడం. అది కూడా అనుకున్నంత ఈజీ కాదు. ఒక్కోసారి పేగుల్లోని కుళ్లిపోయిన

భాగాన్ని తీసేయాల్సి ఉంటుంది. ఒక పేషెంట్‌కు అయితే ఏకంగా దవడ భాగం తీసేయాల్సి వచ్చింది. ఒక్కోసారి పేషెంట్‌ను రక్షించడానికి ఇలాంటి కఠినమైన సర్జరీలు చేయాల్సి వచ్చేది. ఇలాంటి ఎన్నో ఆపరేషన్లను హ్యాండిల్ చేశారు.

ఓ రోజు మరో క్రిటికల్ కేసు వచ్చింది. ఆంధ్రా యూనివర్సిటీ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేసే వ్యక్తి కూతురికి కడుపులో ట్యూమర్ ఏర్పడింది. దీని లొకేషన్ ఎక్కడ ఉందో కనిపెట్టడం చాలా కష్టమైంది. ఆ సమయంలో ఇంట్రావీనస్ పైలోగ్రామ్ అనే మెథడ్ ఉయోగించారు. ఈ పద్ధతిలో నరాల్లోకి డైని ఇంజెక్ట్ చేస్తారు. అది శరీరంలో ప్రవేశించి కిడ్నీ ద్వారా బయటకు వస్తుంది. దీని ద్వారా ప్రాబ్లమ్ ఎక్కడ ఉందో తెలుస్తుంది. ఆ ప్రకారం.. ఆ అమ్మాయిలో ట్యూమర్ కిడ్నీకి పై భాగంలో ఉందని తేలింది. దీంతో సర్జరీ చేసి కిడ్నీతో సహా ట్యూమర్‌ను తొలగించారు. నిజానికి ఇలాంటి ఆపరేషన్ చాలా క్రిటికల్. పైగా ఇలాంటి సమస్యలతో బాధపడే వాళ్లు ఎక్కువ కాలం బతకలేరు కూడా. అయినా సరే, పేషెంటును కొంత కాలమైనా బతికించాలన్న తాపత్రయంతో తనవంతు ప్రయత్నం చేసేవారు. అలా ఆ అమ్మాయికి కూడా ఆపరేషన్ చేసి బతికించారు.

2000 సంవత్సరంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ నుంచి మరో సీరియస్ కేసు వచ్చింది. ఓ వ్యక్తికి కడుపులో నొప్పి, కడుపు ఉబ్బిపోయి హాస్పిటల్‌కు వచ్చాడు. ఆ పేషెంట్ పేగులో ట్యూమర్ ఏర్పడింది. పేగులోని ట్యూమర్‌ను తీసేయడం కూడా అంత సులభమేం కాదు. పైగా ఆ కాలంలో ఉన్న సౌకర్యాలతోనే ఉపయోగించుకుని సర్జరీ చేసి, ట్యూమర్‌ను పూర్తిగా తొలగించి, పేషెంట్‌ను బతికేలా చేయడం చాలా చాలా రిస్క్‌తో కూడిన పని. అలాంటి ఆపరేషన్‌ను డాక్టర్ శ్యామా ప్రసాద్ విజయవంతంగా చేయగలిగారు. ఆ సర్జరీకి సంబంధించిన ఫొటోలు, ఎవిడెన్సెస్ కూడా ఇప్పటికీ డాక్టర్ శ్యామా ప్రసాద్ దగ్గర ఉన్నాయి.

ఆ రోజుల్లో ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా (టీఈఎఫ్) కేసులు పెద్ద సంఖ్యలో ఉండేవి. అలాంటి పరిస్థితి ఉన్న శిశువును కాపాడాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. కానీ కింగ్ జార్జ్ హాస్పిటల్లో వెంటిలేటర్ సదుపాయం లేకపోవడంతో చాలా మంది పిల్లలకు శస్త్రచికిత్స జరగకపోవడంతో మృత్యువాత పడుతుండేవారు. టీఈఎఫ్ బారిన పడిన శిశువుల ప్రాణాలు సర్జన్లు

కాపాడలేకపోయేవారు. టీఈఎఫ్ అనేది అన్నవాహిక, శ్వాసనాళాల్లో తలెత్తే వైకల్యం వల్ల ఏర్పడే సమస్య.

గొంతు, ఉదరాన్ని కలిపే గొట్టం అన్నవాహిక. శ్వాసనాళం అనేది గొంతును ఊపిరితిత్తులను కలిపే గొట్టం. సాధారణ పరిస్థితుల్లో అన్నవాహిక, శ్వాసనాళం పరస్పరం అనుసంధానించి ఉండవు. అవి రెండు వేర్వేరు గొట్టాలు. కానీ కొన్ని సందర్భాల్లో కొన్ని కారణాల వల్ల ఈ గొట్టాలు మూసుకుపోతాయి. ఈ కలిసిపోవడమన్నది ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో ఉండవచ్చు. ఈ రుగ్మతను ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా (టీఈఎఫ్) అంటారు.

టీఈఎఫ్ అనేది పుట్టుకతోనే వచ్చే లోపం. గర్భధారణ సమయంలో తల్లి గర్భంలోనే ఈ సమస్య తలెత్తుతుంది. గర్భధారణ సమయం గడుస్తున్న కొద్దీ, అవయవ వ్యవస్థలు ఏర్పడుతూ అభివృద్ధి చెందుతాయని నిపుణులు అంటారు. శిశువు గర్భంలో అభివృద్ధి చెందుతుంది. శరీరంలోని అన్ని ఇతర భాగాలతో పాటు, ఆహార నాళం, శ్వాసనాళం కూడా అభివృద్ధి చెందుతాయి. ఈ రెండు వేర్వేరు గొట్టాలుగా అభివృద్ధి చెందుతాయి. గర్భం దాల్చిన 4 నుంచి 8 వారాలలో అన్నవాహిక, శ్వాసనాళం మధ్య గోడ ఏర్పడుతుంది. రెండింటిని ఈ గోడ వేరు చేస్తుంది. ఈ గోడ సరిగ్గా ఏర్పడనప్పుడు, ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా సమస్య తలెత్తుతుంది. ఆ స్థితిలో శిశువు ఏ పదార్థాన్ని తీసుకున్నా అది అన్నవాహికలోకి వెళ్లకుండా శ్వాసనాళంలోకి వెళుతుంది. ఆ పదార్థం శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తులలోకి ఆహార పదార్థాలు ప్రవేశించినప్పుడు న్యుమోనియా, ఇతర వ్యాధులు తలెత్తుతాయి.

రుగ్మత ఉన్న శిశువులలో ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా లక్షణాలు పుట్టిన వెంటనే కనిపిస్తాయి. ఈ సమస్య ఉన్న శిశువులకు ఏదైనా తినిపించినప్పుడు లేదా తాగించినప్పుడు వారికి దగ్గు వస్తుంది. అంతే కాదు ఈ శిశువులకు సాధారణంగా నోటి నుంచి తెల్లటి నురుగు బుడగలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో పిల్లలు వాంతులు చేసుకుంటారు. కొన్ని సందర్భాల్లో శిశువు పుట్టిన కొన్ని గంటల్లోనే ముఖ్యంగా ఏదైనా తాగినప్పుడు చర్మం నీలం రంగులోకి మారుతుంది. చాలా సందర్భాలలో శ్వాస తీసుకోవడంలో శిశువుకు ఇబ్బంది కలుగుతుంది.

శిశువులో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వారికి పరీక్షలు చేస్తారు. శిశువుకు ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా లోపం ఉందా లేదా అన్నది ఎక్స్ రే ద్వారా నిర్ధారిస్తారు.

శిశువు ఛాతీ, ఉదరాన్ని ఎక్స్ రే ద్వారా పరీక్షిస్తారు. ఆ పరీక్ష కోసం, శిశువు నోరు లేదా ముక్కులోకి ఒక చిన్న ట్యూబ్ చొప్పించబడుతుంది. శిశువుకు ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా సమస్య ఉంటే ఆ ట్యూబ్ శరీరం లోపలికి తగినంత లోతుకు వెళ్లదు. అన్నవాహిక, ఊపిరితిత్తులు ఎక్కడ కలిసిపోయి ఉన్నాయన్నది ఈ ఎక్స్ రే లో స్పష్టంగా కనిపిస్తుంది. రెండు గొట్టాలను వేరు చేయాల్సిన అవసరం ఏర్పడతుంది. ఆ రెంటిని విడదీయకపోతే బిడ్డ ప్రాణాలకు ముప్పు సంభవించవచ్చు. శస్త్రచికిత్స ద్వారా అన్నవాహిక, శ్వాసనాళాన్ని వేరు చేస్తారు. శరీరంలోని రెండు ముఖ్యమైన అవయవాలకు సంబంధించిన శస్త్రచికిత్స కాబట్టి ఆ సమయంలో చాలా రిస్క్ ఉంటుంది. వెంటిలేటర్ అమర్చాల్సిన అవసరం కూడా ఉంటుంది. ఆ రోజుల్లో కింగ్ జార్జ్ హాస్పిటల్లో వెంటిలేటర్ల సంఖ్య చాలా తక్కువ. చాలా సందర్భాలలో వెంటిలేటర్లకు బదులు అనెస్థిషియా యంత్రాలు ఉపయోగించేవారు.

శ్యామా ప్రసాద్‌కి మొదటి రోజు నుంచే ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా సర్జరీ చేసే అవకాశం వచ్చింది. కానీ చాలా సందర్భాలలో శిశువుల ప్రాణాలు కాపాడలేకపోయారు. సగటున ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా పది కేసులలో ముగ్గురి ప్రాణాలు మాత్రమే కాపాడగలిగేవారు. ట్రాకో ఈసోఫాగియల్ ఫిస్టులా వల్ల పసికందు చనిపోయినప్పుడల్లా శ్యామా ప్రసాద్ చాలా బాధపడేవారు. ప్రభుత్వాసుపత్రుల్లో తగిన సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేసేవారు. వెంటిలేటర్ల ఆవశ్యకత, ప్రాముఖ్యత తెలిసినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరానికి అనుగుణంగా వెంటిలేటర్లు ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్నది ఆయనకు అర్థం కాలేదు. వెంటిలేటర్ ఉంటే చాలా మంది రోగుల ప్రాణాలు కాపాడవచ్చు.

అప్పట్లో విశాఖ డైరీ చైర్మన్‌గా వ్యవహరించిన తులసీరావు.. డాక్టర్ శ్యామా ప్రసాద్‌ను ఓ సాయం అడిగారు. తాను ఆస్పత్రి నిర్మిస్తున్నానని, దాంట్లో తక్కువకే వైద్యం అందించాలని అభ్యర్థించారు. అసలు డాక్టర్ శ్యామా ప్రసాద్

మనస్తత్వమే పేదలకు వీలైనంత వైద్య సేవలు అందించాలని. అవసరమైతే ఉచితంగా కూడా చేస్తారు. ఎన్నడూ తనకు ఇంత డబ్బు కావాలని పేషెంట్లను అడగలేదు. అలాగని డబ్బు లేని కారణంగా వైద్యం అందించకుండా వెనక్కి పంపించలేదు. తులసీరావు అలా అడగడంతో.. వెంటనే ఒప్పుకున్నారు. పేదవాళ్లకి వైద్యం అందించడం కంటే గొప్ప అవకాశం ఏముంటుందని భావించారు.

అప్పట్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో పాలు పోసే వాళ్లంతా తమకు వచ్చిన రూపాయిలో అర్ధరూపాయి దాచుకుని హాస్పిటల్ కట్టుకున్నారు. అప్పట్లోనే కోటి రూపాయలకు పైగా ఖర్చుపెట్టి 29 ఎకరాల్లో హాస్పిటల్ నిర్మించారు. అనంతరం తులసీరావు వాళ్ల అబ్బాయి సతీష్ ఆ హాస్పిటల్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయనతో డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి మంచి స్నేహం ఏర్పడింది. ఇద్దరూ కలిసి చాలా సర్జరీలు చేశారు. ఆ హాస్పిటల్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్ అరుదైన రికార్డ్ ఉంది. పదేళ్లలోనే దాదాపు 150కి పైగా ఉదర సంబంధిత ఆపరేషన్లు చేశారు. అప్పుడప్పుడు లోపల లంప్‌లు ఉంటే తీసేయాల్సి వచ్చేది. ఇక అపెండిక్స్, ఇంటెస్టైన్, థైరాయిడ్ ఆపరేషన్లు కూడా చేసేవారు.

టోటల్ థైరోడిక్స్ ఆపరేషన్లు సైతం అలవోకగా చేసేసేవారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ఒక్కోసారి left hemi colon thyroxine సర్జరీలు చేసేవారు. ఇలాంటి ఆపరేషన్లు ఏ ఒక్కరో చేయడం సాధ్యం కాదు. పేషెంట్లు ఆ ఆపరేషన్ చేయించుకున్నానంటే వేరే డాక్టర్లు నమ్మేవారు కాదు. ఎక్స్ రేల్లో చూసి, అంత పెద్ద ఆపరేషన్ చేసిన విషయం తెలుసుకుని డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు ఫోన్ చేసేవారు. ఒక్కడివే ఎలా చేయగలిగావ్ అని ప్రశ్నించే వారు. ఆ రోజుల్లో సహాయంగా ఒకరు ఉంటే చాలు.. టకటకా ఆపరేషన్లు చేసేసే వారు. నిజంగా అదంతా దేవుడు ఇచ్చిన విద్య అంటుంటారు. పైగా బాబాగారే దగ్గరుండి తనతో అలాంటి ఆపరేషన్లు చేయించి, వాటిని సక్సెస్ చేయించారని నమ్మేవారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ దగ్గర ఒక బాక్స్ ఉండేది. అందులో అన్ని ఎక్విప్‌మెంట్లు ఉండేవి. చిన్న పిల్లల ఆపరేషన్లకు కావాల్సిన సామాగ్రి మొత్తం అందులో ఉండేవి. ఆ కాలంలో ఇలా మెయింటైన్ చేసిన డాక్టర్ మరొకరు లేరనే చెప్పాలి. మొత్తానికి ఉత్తరాంధ్రలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి

వైద్యం అందించేవారు. వేరే ఎవరైనా చూస్తారంటే వినేవాళ్లు కాదు. డాక్టర్ శ్యామ ప్రసాద్ రావాలి, ఆపరేషన్ చేయాలి అనేవారు. ఎక్కువగా రాత్రిళ్లే ఆపరేషన్లు చేసేవారు. ఉదయం ప్రయాణ సమయాన్ని నిద్ర కోసం ఉపయోగించుకునే వారు. ప్రయాణంలో నిద్రపోయి, హాస్పిటల్‌కు వచ్చి పనిచేసేవారు. వైద్య వృత్తి పట్ల అంత అంకితభావం ఉండేది.

అప్పట్లో గ్రహణమొర్రి ఆపరేషన్లు కూడా ఎక్కువగా చేసేవారు. ప్లాస్టిక్ సర్జరీ ఫర్ చిల్డ్రన్ అనేది అప్పటికింకా పూర్తిగా డెవలప్ కాలేదు. కాని, ఎంతో సక్సెస్‌ఫుల్‌గా ఆ ఆపరేషన్లు చేసేవారు. ఇక యురాలజీలో సర్కమ్‌సిషన్ అనేది చాలా కామన్ ఆపరేషన్. రోజూ అలాంటి సర్జరీలు నాలుగైదు చేసేవారు. ప్రతి నర్సింగ్ హోంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ కోసం పేషెంట్లను సిద్ధం చేసి ఉంచేవారు. గాజువాకలో ఉదయాన్నే మూడు గంటలకు గ్రహణమొర్రి ఆపరేషన్లు చేసేవారు. ప్రతి ఆదివారం గాజువాకలోనే ఉండి హెర్నియా, అపెండిసైటిస్, థైరాయిడ్, గ్రహణ మొర్రి ఇలా ఎన్నో ఆపరేషన్లు చేసేవారు. అన్ని ఆపరేషన్లు చేసినా.. పెద్దగా డబ్బులు ఇచ్చేవారు కాదు. కాని, హాస్పిటల్‌కు మాత్రం ఫుల్లు లాభాలు వచ్చేవి. ఒక్క ఆదివారమే ఆరోజుల్లో వారికి 30వేల వరకు సంపాదన వచ్చేది. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎప్పుడూ డబ్బు ఆశించి ఆపరేషన్లు చేసేవారు కాదు. అలా ఎంతోమందితో నర్సింగ్ హోంలు పెట్టించి, వారిని పైకి తీసుకొచ్చిన ఘనత ఆయనదే.

సర్జరీలు చేయడం తనకో పిచ్చి అంటుంటారు డాక్టర్ శ్యామా ప్రసాద్. నిజానికి సమస్య ఉన్నా సరే సర్జరీ ఏం అక్కర్లేదని తప్పించుకుని తిరిగే వాళ్లను తీసుకొచ్చి మరీ ఆపరేషన్ చేసేవారు. బాబా దయ వల్ల సక్సెస్ రేటు మిగతా వారి కంటే చాలా ఎక్కువగా ఉండేదని భావిస్తారు. ఎవరైనా చనిపోతే.. డాక్టర్ శ్యామా ప్రసాద్ సర్జరీ చేసినా బతకలేదంటే ఆ పేషెంటుకు భూమ్మీద నూకలు లేవేమో అనుకునే వారు. అంతలా సర్జరీల్లో సక్సెస్ రేటు ఉండేది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ఇంటికి దగ్గర్లోనే ఓ ఇంజనీర్ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. ఆయనకు, వాళ్లావిడకు వచ్చే పెన్షన్‌తో బతుకుతుంటారు. అబ్బాయి మాత్రం ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసేవాడు. ఆ రిటైర్డ్ ఇంజనీరు రోజూ డాక్టర్ శ్యామా ప్రసాద్ క్లినిక్‌కి వచ్చి కూర్చునే వారు.

అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని డాక్టర్ శ్యామా ప్రసాద్ క్లినిక్‌కు తీసుకొచ్చేవారు. పైగా ఎవరికైనా డబ్బు సాయం కావలంటే చెప్పాలంటూ అడిగి, మందులు ఇతరత్రా అవసరాల కోసం నెలకు పది వేల రూపాయల వరకు ఇచ్చి వెళ్లేవారు. రిటైర్డ్ అయిన ఉద్యోగి తనకు వచ్చే పెన్షన్ డబ్బులోంచి కొంత సాయంగా అందించేవారు. సాధారణంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ కూడా తక్కువ ఫీజు తీసుకునే వారు. ఒక్కోసారి ఉచితంగానే వైద్యం అందించేవారన్నమాట. అలా ఆ ఇద్దరి మధ్య వేవ్ లెంగ్త్ సరిపోయింది. 2010లో ఒకనాడు ఆ రిటైర్డ్ ఇంజనీర్ వాళ్ల అత్తకు హెల్త్ ప్రాబ్లమ్ వస్తే తీసుకొచ్చారు. ఆమె vesicointestinal fistulaతో బాధ పడుతున్నారు. పైగా అది చాలా రేర్ కేసు. యూరినరీ బ్లాడర్‌తో లింక్ అయి ఉన్న సమస్య కావడంతో ఆపరేషన్ చేయడం మినహా మరో దారి లేదు. ఒకవేళ ఆ సర్జరీ చేస్తే పేషెంట్ బతకొచ్చు లేదా చనిపోవచ్చు. అందులోనూ ఆ ఆపరేషన్ యూరాలజిస్టుతో కలిసి చేయాల్సింది కావడంతో ముందే.. ఆపరేషన్‌కు సంబంధించిన కన్సెంట్‌ను వీడియో రికార్డ్ చేసుకున్నారు. అంటే, ఆపరేషన్ వల్ల జరిగే ప్రమాదం గురించి చెప్పి, వారు అంగీకరించిన తరువాతే ఆపరేషన్‌కు ముందుకు వెళ్లేవారు. అలా ఆ 86 ఏళ్ల ఆవిడకు ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా చేశారు. కేవలం 12 రోజుల్లోనే కోలుకుని ఇంటికి వెళ్లిపోయారు. అంత పెద్ద వయసులో ఆపరేషన్‌ను తట్టుకోవడం, అది సక్సెస్ అవడం నిజంగా స్వామి దయే అంటారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ఆవిడ ఉండేది కూడా డాక్టర్ శ్యామా ప్రసాద్ ఇంటి దగ్గర్లోనే కాబట్టి అప్పుడప్పుడు వెళ్లి పలకరిస్తూ ఉండేవారు. ఆ తరువాత ఆమె ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా మూడేళ్లపాటు జీవించి సహజ మరణం పొందారు. ఇలాంటి అరుదైన కేసులు ఎన్నో చేశారు.

2012లో శ్యామా ప్రసాద్‌కు ప్రమోషన్ వచ్చింది. దీంతో ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రికి సూపరింటెండెంట్ గా నియమితులయ్యారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంతో ఆసుపత్రికి రూపురేఖలు మార్చేసారు. రోగులకు మెరుగైన వైద్యసదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా చేసినప్పుడు చాలా మంచి పనులు, పేద ప్రజలకు పనికొచ్చే పనులు చేశారు. జన ఔషధి పేరిట ఇప్పుడు పుట్టుకొచ్చిన మెడికల్

షాపుల కాన్సెప్టును మరో ఐఏఎస్ అధికారితో కలిసి డెవలప్ చేసారు. చాలా ఖరీదైన మందులను జనరిక్ వర్షన్‌లో తీసుకొచ్చేవారు. జీవనధార పేరుతో మందులను తక్కువ ధరకే అందించే ఓ ప్రయోగాత్మక పద్ధతిని కనిపెట్టారు. ఓ పది, పదిహేను కంపెనీలను పిలిపించి, సేమ్ ఫార్ములాతో తక్కువ ఖరీదుకు మందులు ఎందుకు తయారుచేయకూడదని అడిగేవారు. ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లి.. మార్కెట్లో 40 రూపాయలకు దొరికే ట్యాబ్లెట్‌ను అర్ధ రూపాయికే దొరికేలా చేశారు. మొట్టమొదటి షాపును కేజీహెచ్‌లో పెట్టించారు. దానికి చాలా లాభాలు వచ్చాయి. ఆ తరువాత దేశవ్యాప్తంగా జన ఔషధి ఔట్‌లెట్లు వచ్చాయి.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా చేస్తున్నప్పుడే భోజనం అనే ప్రయోగాన్ని తీసుకొచ్చారు. పేషెంట్ సహాయకులకు భోజనం అందించే పథకం అది. అక్షయ పాత్రతో ఒప్పందం కుదుర్చుకుని, పేషెంట్ బంధువులు, సహాయకులకు భోజనం అందించేవారు. నిజానికి ఈ కాన్సెప్టును సత్యసాయి నిగమాగమంలో చూశారు. అక్కడ అన్నీ అర్ధరూపాయి, రూపాయికే దొరికేవి. దాన్నే కాస్త మార్చి, కేజీహెచ్‌లో ఇంప్లిమెంట్ చేశారు. హాస్పిటల్‌లో ఎవరిదైనా పుట్టిన రోజు ఉంటే.. వారి నుంచి పదివేలు తీసుకుని, ఈ రోజు అన్నదానం చేసేది ఫలానా వ్యక్తి అని బోర్డు మీద రాసి పెట్టేవాళ్ళు. అలా ఆ ప్రోగ్రామ్ చాలా క్లిక్ అయింది. కేజీహెచ్‌లో భోజనం చూసిన తరువాత చాలా ఆస్పత్రుల్లో ఈ పద్ధతిని తీసుకొచ్చారు. ఉస్మానియా, నీలోఫర్‌లోనూ ఇంప్లిమెంట్ చేశారు. ఆ తరువాత ప్రభుత్వమే ఈ పథకాన్ని టేకప్ చేసింది.

కేజీహెచ్‌ను కాపాడడంలో ఆ రోజుల్లోనే ఎంతో పోరాటం చేశారు డాక్టర్ శ్యామా ప్రసాద్. రోడ్డు విస్తరణ కోసం గోడను వెనక్కి జరపాల్సి వచ్చినప్పుడు సత్యాగ్రహాలు చేశారు. అదే ఆవరణలో సూపర్ స్పెషాలిటీ కోసం ఓ బిల్డింగ్ కట్టి మధ్యలో వదిలేశారు. అది అలా పాడైపోతుంటే చూసి తట్టుకోలేక.. దాని బాధ్యతలు తనకు ఇచ్చేయమని అడిగారు. మీరేం చేసుకుంటారు దాన్ని అడిగిన వారికి తగిన సమాధానం చెప్పి.. ఆ బిల్డింగును హ్యాండోవర్ చేసుకుని, కొంత మంది డాక్టర్లతో బ్యాచ్ ఏర్పాటు చేసి అందులో వైద్యం అందించడం

మొదలుపెట్టారు. దినదినాభివృద్ధి చెందడం చూసి కొంతమంది ప్రైవేట్ హాస్పిటల్స్ వాళ్లు వచ్చి దాన్ని తమకు ఇచ్చేయండి, ప్రభుత్వానికి మేం సమాధానం చెప్పుకుంటాం అని ఆఫర్లు ఇచ్చేవాళ్లు. కాని, కేజీహెచ్ అంటే డాక్టర్ శ్యామా ప్రసాద్ దృష్టిలో అమ్మ లాంటిది. చదువు నేర్పి, జీవితాన్ని ఇచ్చింది కాబట్టి దాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో వ్యవహరించారు.

విశాఖలో పేద ప్రజలకు అందుబాటులో ఉండే క్యాన్సర్ హాస్పిటల్ లేదు. దీంతో ఎలాగైనా దాన్ని కట్టించాలనే సంకల్పంతో ఓ పెద్ద ప్రయత్నమే చేశారు. ఇందుకోసం, స్టీల్ ప్లాంట్‌లో ఫైనాన్సియల్ మేనేజర్‌గా చేస్తున్న వై.ఆర్. రెడ్డిని సంప్రదించి స్థలం అడిగారు. కావాల్సిన ఆర్థిక వనరులు కూడా సమకూర్చారు. స్టీల్ ప్లాంట్ నుంచి 5 కోట్లు, పోర్ట్ ట్రస్ట్ నుంచి 25 కోట్లు, హెచ్‌పీసీఎల్ 10 కోట్లు.. ఇలా వంద కోట్ల రూపాయల నిధులు సమీకరించారు. కాని, అదే సమయంలో రిటైర్మెంట్ తీసుకోవడం, ప్రభుత్వం మారడంతో కొన్నేళ్ల పాటు క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణం కొంతకాలం బ్రేక్ పడింది. కరోనా వచ్చాక దాన్ని కొవిడ్ హాస్పిటల్‌గా మార్చారు. యాక్చువల్ ప్లాన్ ప్రకారం ఆ క్యానర్స్ హాస్పిటల్‌లో మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, 15 బెడ్లతో ఆపరేషన్ థియేటర్ ఇలా ఎన్నో ప్లాన్స్ వేసుకున్నారు. ఇప్పుడు ఆ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందంటే.. అందుకు కారణం డాక్టర్ శ్యామా ప్రసాదే. ప్రస్తుతం ఆ హాస్పిటల్‌కు సూపరింటెండెంట్‌గా సోదరి మైథిలినే వ్యవహరిస్తున్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ కేజీహెచ్ సూపరింటెండెండ్‌గా ఉన్నప్పుడు ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఆస్పత్రికి ఆగిపోయిన నిధులను తిరిగి తెప్పించడం కోసం తన తెలివి తేటలను వాడారు. వన్ వే ట్రాఫిక్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు.

దేశంలో ఎక్కడా చేపట్టని ఓ గొప్ప ప్రాజెక్టును తీసుకొచ్చిన ఘనత డాక్టర్ శ్యామా ప్రసాద్‌కే దక్కుతుంది. రోగిమిత్ర పేరుతో కొంతమంది సహాయకులను ప్రవేశపెట్టారు. టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన పిల్లలను తీసుకొచ్చి, వారికి రెండు వేలు ఇచ్చి ఆస్పత్రిలో రోగులకు సహాయంగా అపాయింట్ చేశారు. ఆ రోజుల్లో ఇదొక సెన్సేషన్. ఆస్పత్రి నిధులతో ఈ ప్రయోగం చేశారు డాక్టర్ శ్యామా ప్రసాద్. వీళ్లు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులను జాగ్రత్తగా

చూసుకుంటూ, వారికి వైద్యం అందించి తిరిగి ఊళ్లకు పంపించే వారు. ఖాళీ సమయాల్లో ఆపరేషన్ థియేటర్లో, లేబర్ రూమ్‌లో పనిచేసేవాళ్లు. డాక్టర్ శ్యామా ప్రసాద్ రిటైర్మెంట్ తరువాత కూడా రోగిమిత్ర వ్యవస్థ కొనసాగింది. ఇప్పుడు అదొక కార్పొరేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం రోగిమిత్రలో చేస్తున్న వారి జీతాలు రెండువేల నుంచి 18వేల రూపాయలకు పెరిగింది. ఎప్పుడు వెళ్లినా.. రోగిమిత్ర సభ్యులు డాక్టర్ శ్యామా ప్రసాద్‌ను ఓ దేవుడిలా కొలుస్తారు. అయితే, ఇదంతా అప్పటి కలెక్టర్, కొంతమంది అధికారుల సహాయంతోనే చేయగలిగానని చెప్పుకుంటుంటారు.

1988లో శ్యామా ప్రసాద్ తండ్రి సుందరయ్య ప్రభుత్వ సర్వీసు నుండి రిటైర్ అయ్యారు. ఆయన 33 సంవత్సరాల వరకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యార్థులకు ఆర్థోపెడిక్ సర్జరీ గురించి నేర్పించారు. ఈ మెడికల్ కాలేజ్‌కు అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్నో ఆర్థోపెడిక్ సర్జరీలు చేసారు. ఎందరో డాక్టర్లను తయారు చేయడంతో కీలక పాత్ర పోషించారు. వేలాదిమంది రోగులకు చికిత్స అందించారు. పేదలకు రకరకాలుగా సాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తుండగా ఆయనకు మెల్లమెల్లగా ఆయనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై ఆసక్తి తగ్గుతూ వచ్చింది. సంఘ్ నాయకత్వం ఎప్పుడూ అగ్రకులాల వారి చేతుల్లో ఉండడం సుందరయ్యకు నచ్చలేదు. సమాజంలో, దేశంలో ఎక్కువశాతం పేదలు దళితులు, వెనుకబడిన తరుగతులవారేనని, గిరిజనులు, దళితులు మరియు వెనుకబడిన తరగతులు వారి సంఖ్య 80శాతంపైన ఉన్నప్పటికీ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వారు వెనుకబడి ఉన్నారు. రాజకీయ అధికారం అగ్రకులాలవారి చేతుల్లోనే ఉండడం ఆయనకు నచ్చలేదు. రిటైర్‌మెంట్ తరువాత ఆయన బహుజనుల అభివృద్ధి కోసం పనిచేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో బహుజన సమాజ్ పార్టీ స్థాపించిన ప్రముఖ దళిత నాయకుడు కాన్షీరాం సుందరయ్య చేస్తున్న ప్రజాసేవలగురించి తెలుసుకొని పార్టీలో చేరాల్సిందిగా ఆహ్వానం పలికారు. అత్యంత ఉన్నతమైన వ్యక్తిత్వం గత సుందరయ్యను కాన్షీరాం ఆంధ్రప్రదేశ్‌కు అధ్యక్షుడిగా నియమించారు. సుందరయ్య ఊరూరా తిరిగి పార్టీని బలోపేతం చేయడంతో పాటు వెనుబడిన

తరగతులు, దళితులు, గిరిజనులకు ఏకం చేసేందుకు ప్రయత్నించారు. ఇదే క్రమంలో ఆయన తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజక వర్గం నుండి 1989లో బహుజన సమాజ్ వాద్ పార్టీ తరుపున పోటీచేసారు. ఈ నియోజక వర్గంలో యాదవుల సంఖ్య అధికం ఉండడం వల్ల కాన్షీరాం సూచనల మేరకు సందరయ్య ఈ నియోజక వర్గాన్ని ఎంచుకున్నారు. కానీ ప్రధాన రాజకీయ పార్టీల ప్రాబల్యం వల్ల ఆయనకు ఆ ఎన్నికలలో డిపాజిట్ కూడా దక్కలేదు. కానీ తన ప్రయత్నాన్ని ఎన్నడూ ఆపలేదు. వెనుకబడిన కులాల హక్కుల కోసం తన పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. 1994 విశాఖపట్నం నుండి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసారు. ఈ సారి కూడా ఆయన తన డిపాజిట్‌ను దక్కించుకోలేకపోయారు. అనంతరం ఆయన ములాయంసింగ్ యాదవ్ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. బహుజన పార్టీని వీడి సమాజ్ వాద్ పార్టీలో చేరారు. ములాయంసింగ్ యాదవ్‌కు అత్యంత సన్నిహితులలో ఒకరుగా సుందరయ్య ఎదిగారు. 2005లో సుందరయ్య ఆరోగ్యం క్షీణించింది. ఆయన ప్రాణం కాపాడేందుకు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచే పరిస్థితి వచ్చింది. కానీ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో వైద్యులు అందించిన మెరుగైన చికిత్స కారణంగా ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. దీని తరువాత ఆయన ఆరోగ్యం సహకరించపోవడంతో క్రమంగా రాజకీయాలకు దూరమయ్యారు. 2015లో ఆయన అల్జీమర్ వ్యాధికి గురయ్యారు ఫలితంగా ఆయన జ్ఞాపకశక్తి క్షీణించింది. దీంతో ఆయన ఇంటికే పరిమితయ్యారు.

## అధ్యాయం - 9

# వైద్య సేవల అభివృద్ధి కోసమే జీవితం అంకితం

శ్యామా ప్రసాద్ కొడుకు సిద్ధార్థ్ బాల్యం తన అమ్మమ్మ, తాతయ్య ఇంట్లో జరిగింది. సిద్ధార్థ్ ఒంగోలులో చదువుకున్నాడు. ఆరోతరగతి వరకు అతను ఒంగోలు పబ్లిక్ స్కూల్‌లో విద్యను అభ్యసించాడు. అమ్మమ్మ తాతలే అతనిని తల్లితండ్రిలా చూసుకున్నారు. శ్యామా ప్రసాద్ విశాఖపట్నంలో స్థిరపడిన తరువాత కొడుకును తమ వద్దకు రప్పించుకున్నారు. సిద్ధార్థ్ సెయింట్ ఫ్రాన్సిస్‌డి సేల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలో చదివాడు. 10వ తరగతి చరవుతుండగా సిద్ధార్థ్ తన తాత సందరయ్య, తల్లితండ్రులు శ్యామా ప్రసాద్, లక్ష్మీరాజ్యంల లాగా ఒక గొప్ప డాక్టర్ అవ్వాలని నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయం మేరకు అతను బైపిసి గ్రూపులో అడ్మిషన్ తీసుకున్నాడు. ఇంటర్మీడియట్ పూర్తయ్యాక మెడికల్ కాలేజీలకు జరిగే ప్రవేశ పరీక్షలు వ్రాసాడు. కానీ అతని మంచి ర్యాంకు రావకపోవడంతో సీటు దక్కలేదు. స్పెషల్ కోచింగ్ కొరకు తండ్రి శ్యామా ప్రసాద్ తన కుమారుడిని గుంటూరు పంపించారు. రెండవసారి మాత్రం సిద్ధార్థ్ ర్యాంకు సాధించాడు. కానీ హెల్త్ యూనివర్సిటీలో రిజర్వేషన్ రూల్‌ని సక్రమంగా పాటించకపోవడంతో అతను తనకు దక్కాల్సిన సీటు కోల్పోయాడు.

ఇక కొడుకు కెరీర్, పెళ్లి విషయంలోనూ బాబాగారి ఆశీస్సులు ఉన్నాయని బలంగా నమ్ముతారు. ఒక డాక్టరుగా ఉన్నప్పటికీ తన కుమారుడికి మెడికల్

సీటు ఇప్పించడం కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. అప్పట్లో నారాయణ మెడికల్ కాలేజీలో సీటు ఇచ్చినప్పటికీ.. తరువాత తొలగించి ఓసీకి ఇచ్చారు. దీనిపై కొంతమంది బీసీలను సైతం పోగేసి, అసోసియేషన్ ఏర్పాటు చేసి న్యాయ పోరాటం చేయడం మొదలుపెట్టారు. ఇలా చేయడం యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు నచ్చలేదు. ఆయన డాక్టర్ శ్యామా ప్రసాద్ పై కోపం పెంచుకున్నారు. ఇలా మెడికల్ సీటు కోసం పోరాడుతున్న వారికి ఎలాగోలా సెటిల్మెంట్ చేసేసి డాక్టర్ శ్యామా ప్రసాద్ కుమారుడి దగ్గరికి వచ్చే సరికి ఎటూ తేల్చకుండా, సీటు ఇవ్వకుండా ఆపేశారు. అప్పటి వరకు తనతో పాటు పోరాటం చేసిన వాళ్లంతా... రిజిస్ట్రార్ చూపించిన ఆశకి లొంగిపోయారు. దీంతో డాక్టర్ శ్యామా ప్రసాద్ హైకోర్టులో ఒంటరి పోరాటం చేసి సీటు సాధించారు. అయినప్పటికీ, అది అమలు జరగలేదు. అక్కడ కూడా రిజిస్ట్రారే అడ్డుపడ్డారు. కేసును సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లారు. ఆ రోజుల్లో ఒక్కో మెడికల్ సీటుకు 20 లక్షలు ఖర్చు అయ్యేది. కాని, ప్రభుత్వంపై ప్రతిష్టకు పోయి 50 లక్షలు ఖర్చుపెట్టారు. దీంతో సెకండ్ బ్యాచ్ లో తన అబ్బాయిని జాయిన్ చేశారు. ఆ తరువాత అతను కష్టపడి చదివి ఫిజియాలజీ, ఆప్తమాలజీ, జనరల్ సర్జరీలో గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తరువాత అమెరికా వెళ్లాలన్న ఆశతో మూడేళ్లపాటు ప్రిపరేషన్లోనే ఉన్నారు. ఆ ప్రిపరేషన్ కోసం హైదరాబాద్ పంపించి చదివించారు . కాని, అప్పటికే తన కొడుకు వయసు పెరిగిపోతోంది. డాక్టర్ శ్యామా ప్రసాద్ 24 ఏళ్లకే పీజీ పూర్తి చేశారు. దీంతో త్వరపడాల్సిందేనని చెప్పడంతో కుమారుడు ఆర్థోపిడిక్స్‌లో చేరేందుకు ఆసక్తి చూపించారు. ఆ సమయంలో పిన్నమనేని సిద్ధార్థ కాలేజీలో ఒక్క సీటే ఖాళీగా ఉంది. ఆ ఒక్క సీటుకు కోటిన్నరకు పైగా డిమాండ్ ఉంది. కాని, ఆ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ దగ్గర డబ్బులు లేవు.

ఎంబిబిఎస్ చదివిన తర్వాత చాలా మంది పీజీ కోర్సు చేస్తారు. సర్జరీపై ఆసక్తి ఉన్నవారు సర్జికల్ కోర్సులు చేస్తారు. క్లినికల్ ట్రీట్మెంట్ అంటే ఆసక్తి ఉన్న వైద్యులు క్లినికల్ కోర్సులు చేస్తారు. పీజీ కోర్సులో సీటు కోసం పోటీ ఎక్కువుంటుంది. మెడికల్ పీజీ కోర్సులో సీటు సంపాదించడం అంత సులభం కాదు. దేశవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలల్లో పీజీ కోర్సుల్లో దాదాపు యాభై వేల

సీట్లు ఉన్నాయి. ఈ సీట్ల కోసం ఏటా దాదాపు 1.75 లక్షల మంది వైద్యులు దరఖాస్తు చేసుకుంటారు. పీజీ కోర్సు ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో పీజీ కోర్సులు ఉంటాయి. ఎంబిబిఎస్ మాదిరిగానే పీజీ కోర్సులకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అన్ని సీట్లు ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగానే భర్తీ చేస్తారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మేనేజ్మెంట్ కోటా 50% సీట్లు ఉంటాయి. ఈ సీట్ల కోసం భారీ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. చాలా చోట్ల కోటి రూపాయల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు ఫీజు ఉంటుంది.

సిద్ధార్థ్‌కు వచ్చిన ర్యాంక్‌తో సీటు వచ్చే అవకాశం తక్కువ. మేనేజ్మెంట్ కోటాలో సీటు వచ్చే అవకాశం ఉంది. మేనేజ్మెంట్‌కు రూ. 1.5 కోట్ల 'విరాళం' ఇస్తే తన కొడుక్కి ఎలాగైనా పీజీ సీటు పొందవచ్చని శ్యామా ప్రసాద్ భావించారు. డొనేషన్ కోసం డబ్బులు సేకరించడం మొదలుపెట్టారు. తన దగ్గరున్నదంతా తీసుకున్నారు. అయినప్పటికీ కొంత మొత్తం తగ్గింది. తన దగ్గరున్న నగలు అమ్మాలని శ్యామా ప్రసాద్ ఆలోచించారు. అయితే కుటుంబ సభ్యులు దానికి వ్యతిరేకించారు. ఈ క్రమంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ మరోసారి సత్యసాయి శరణు కోరారు. మరోసారి అద్భుతం చోటుచేసుకుంది. అనూహ్యంగా కాలేజీ యాజమాన్యం డొనేషన్ మొత్తాన్ని కోటి రూపాయలకు తగ్గించింది. డొనేషన్ ఫీజు కట్టేందుకు సాయం చేస్తామని కొంత మంది శ్యామా ప్రసాద్ మిత్రులు ముందుకొచ్చారు. వారి సహకారంతో డొనేషన్ మొత్తం కట్టారు. గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో సిద్ధార్థ్ చేరాడు. తాత సుందరయ్యలాగా ఆర్థోపెడిక్స్ సర్జరీలో మాస్టర్ కోర్సు చేరే అవకాశం లభించింది.

ఇలాంటి ఘటనలను శ్యామా ప్రసాద్ ఎప్పుడూ అద్భుతాలుగా భావించేవారు. తన జీవితమనే కారు ఎక్కడ ఆగిపోయినా సత్యసాయి దానిలో ఇంధనం నింపి, కారును ముందుకు తీసుకెళ్తారని నమ్మారు. శ్యామా ప్రసాద్ జీవితంలోని అడ్డంకులన్నింటినీ సత్యసాయి తొలగించారు. కష్టాల నావ నుంచి బయటపడేసి జీవితాన్ని ఆనందమయం చేశారు.

ఆ రోజుల్లో కోయంబత్తూరులో గంగా హాస్పిటల్లో రాజశేఖరన్ అనే గొప్ప ఆర్థోపిడీషన్ ఉండేవారు. ఆ హాస్పిటల్లో పేదవారికి ఒక్కోసారి ఉచితంగానే ఆపరేషన్ చేసే వాళ్లు. ముందు ఫీజులాంటిదేం తీసుకోకుండా.. ఆపరేషన్ మొత్తం చేసేసి.. ఆ తరువాత ఎంత ఉంటే అంత కట్టమనేవారు తప్ప ఎవరినీ బలవంత పెట్టకూడదు. ఆ ఆస్పత్రిలో సేవాభావం చూసి.. తన కొడుకుని కూడా అందులో చేర్పించాలని సంకల్పించారు. మొదటి దరఖాస్తు పెట్టుకున్నా అవకాశం ఇవ్వలేదు. కాని, అబ్బాయి టాలెంట్ చూసి రెండోసారి అవకాశం ఇచ్చారు. అలా ఆ హాస్పిటల్లో ప్రాక్టీస్ చేసి లింబ్ రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీలో ఫెలోషిప్ తెచ్చుకున్నారు. ఆ సమయంలో కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్లో రోజుకు 30 ఆర్థోపెడిక్ ఆపరేషన్లు జరిగేవి. వాటిలో రోజుకు స్వయంగా ఐదారు కేసులలో తన కొడుకే ఇన్వాల్వ్ అయ్యేవారు. ఆ ప్రాక్టీస్ ఎంతో అనుభవాన్ని నేర్పింది. ఒక రకంగా అది కొడుకు సిద్ధార్థ్ జీవితాన్నే మార్చేసింది. దీంతో ఆ తరువాత విశాఖపట్నం వచ్చి కిమ్స్ ఐకాన్లో జాయిన్ అయ్యారు.

కూతురు సుమ పెళ్ళయ్యేంతవరకు తల్లితండ్రులతోనే ఉండేది. ఆమె విశాఖవేలీ స్కూల్లో ఒకటో తరగతి నుండి పదవతరగతి వరకు చదివింది. తను కూడా తన తాత, తల్లితండ్రులలాగా డాక్టర్ కావాలని నిశ్చయించుకుంది. దీంతో ఇంటర్మీడియట్ లోబైపిసి గ్రూపు తీసుకొని కష్టపడి చదివింది. కూతురు సుమకు మెడికల్ ప్రవేశ పరీక్షలో శ్యామా ప్రసాద్ ఆశించినంత ర్యాంకు రాలేదు. పరీక్ష కోసం సన్నద్ధమవడంలో సుమ ఏ కోశానా తేలిగ్గా తీసుకోలేదు. బాగా కష్టపడింది. చాలా శ్రద్ధగా చదువుకుంది. ఇంటర్ పరీక్షల్లో వచ్చిన మార్కులు చూసిన శ్యామా ప్రసాద్ కూతురికి సులువుగా మెడికల్ కాలేజీలో సీటు వస్తుందని నమ్మకం కలిగింది. కానీ తక్కువ ర్యాంక్ రావడంతో సీటు దక్కలేదు. కూతురు నిరాశపడటం శ్యామా ప్రసాద్ ఇష్టపడలేదు. ఆమె ఆత్మవిశ్వాసం సన్నగిల్లరాదని అనుకున్నారు. తల్లిదండ్రులు, అన్నలాగా తాను కూడా డాక్టరు కావాలని సుమ నిశ్చయించుకుంది. ఈ ఏడాది మెడికల్ కాలేజీలో సీటు రాకపోతే వచ్చే ఏడాది సుమ మళ్లీ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాస్తుందని శ్యామా ప్రసాద్‌కి తెలుసు. కాని, దాని కోసం ఒక్క సంవత్సరం వృథా అవుతుంది. ఏడాదంతా ప్రవేశపరీక్ష కోసం సిద్ధం కావాల్సి ఉంటుంది.

ఎంబిబిఎస్ కోర్సులో ప్రవేశం కోసం చాలా మెడికల్ కాలేజీలకు సుమతో దరఖాస్తు చేయించారు. సీటు వస్తుందనే నమ్మకం లేకున్నా ఎక్కడో చిన్న ఆశ. సుమకు వచ్చిన ర్యాంకుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభించడం అసంభవం. ప్రైవేట్ మెడికల్ కాలేజీలో సీటు లభించిన అది మేనేజ్మెంట్ కోటాలోనే వస్తుంది. దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజుల్లోనే మెడికల్ కాలేజీల్లో సీట్లు భర్తీ కావడం మొదలైంది. సుమకు ఏ కాలేజీలోనూ సీటు వచ్చేలా కనిపించలేదు. ఈ ఏడాది సీటు రాదని సుమ భావించినా, శ్యామా ప్రసాద్ మాత్రం ఆశ వదులుకోలేదు.

కష్టాలు వచ్చినప్పుడు సత్యసాయిని శ్యామా ప్రసాద్ స్మరించుకునేవారు. ఈసారి కూడా శ్యామా ప్రసాద్ సత్యసాయిని ప్రార్థించారు. ఒక్కటే ప్రార్థన. కూతురు సుమకు మెడికల్ కాలేజీలో సీటు రావాలి, ఏడాది వృథా కాకూడదని.

అప్పటికే అన్ని కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియ పూర్తయింది. ఒక కాలేజీలో ఒక్క సీటు మాత్రమే ఖాళీగా ఉంది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని ఆశ్రమ వైద్య కళాశాలలో మేనేజ్మెంట్ కోటాలో ఒక సీటు ఖాళీగా ఉంది. దరఖాస్తు చేసుకున్న ఇతరులెవరూ సీటు తీసుకునేందుకు ముందుకు రాకపోవడంతో సుమకు సీటు ఇచ్చారు. సుమకు సీటు రాగానే శ్యామా ప్రసాద్ ఆనందంతో ఉప్పొంగిపోయారు. సత్యసాయి తన ప్రార్థనను విన్నారని ఆయనకు నమ్మకం కలిగింది. తన ఇష్టదైవం తన కోసం మరోసారి అద్భుతాన్ని చూపారని విశ్వసించారు.

సాధారణంగా మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్ కోర్సు ప్రవేశ ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ముందుగా సీట్లు భర్తీ అవుతాయి. ప్రైవేట్ కాలేజీల్లో ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకి కూడా ఎక్కువ సమయం పట్టదు. మేనేజ్మెంట్ కోటా సీట్ల భర్తీకి మాత్రం కొంత సమయం పడుతుంది. కాని, కొన్ని రోజుల్లోనే ఆ సీట్లు కూడా భర్తీ అయిపోతాయి.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒకే కేటగిరీ సీట్లు ఉంటాయి. మెడికల్ ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహిస్తారు. అడ్మిషన్ ప్రక్రియ సమయంలో రిజర్వేషన్ నియమాలు వర్తిస్తాయి. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందుతారు.

ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 50% సీట్లు ప్రభుత్వ కోటాలో ఉంటాయి. ఈ సీట్ల భర్తీ ప్రక్రియ కూడా ర్యాంక్ ఆధారంగానే ఉంటుంది. ఈ 50% సీట్లకు ఎంపికైన విద్యార్థుల చదువు ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మిగిలిన 50% సీట్లు మేనేజ్మెంట్ కోటా. ఇక్కడ కూడా ర్యాంక్ ఆధారంగానే నియామక ప్రక్రియ జరుగుతుంది. కానీ మేనేజ్మెంట్ కోటా సీటు ఫీజు మాత్రం లక్షల్లో ఉంది. ఆ రోజుల్లో ఫీజులకు సంబంధించి ఎలాంటి పటిష్ఠమైన చట్టం లేకపోవడంతో ప్రైవేట్ కాలేజీల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసేవారు. లక్షల రూపాయలు చెల్లించి సీట్లు పొందేందుకు చాలా మంది సిద్ధమయ్యేవారు. ఈ కారణంగానే ఇతర విద్యార్థుల కంటే మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ ఫీజుల భారం వల్ల చాలా మంది సీటు తీసుకోలేక పోయారు. ఫీజులు లక్షల్లో ఉన్నప్పటికీ మేనేజ్మెంట్ కోటాలో సీట్లు కూడా త్వరగానే భర్తీ అవుతాయి. ఆ ఏడాది ఆశ్రమ్ వైద్య కళాశాలలో ఒక్క సీటు మినహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కళాశాలల్లో సీట్లు భర్తీ అయ్యాయి. సత్యసాయి తన విన్నపాన్ని విని కూతురు సుమ కోసం ఈ సీటును ఉంచారని శ్యామా ప్రసాద్ భావించారు. ఆశ్రమ్ వైద్య కళాశాలలో సీటు వచ్చిన వెంటనే సత్యసాయి తన రక్షకుడని శ్యామా ప్రసాద్ భావించారు. జీవితంలోని ప్రతి సంక్షోభాన్ని సత్యసాయి తొలగించగలరు.

ఆశ్రమ్ వైద్య కళాశాలను ప్రముఖ పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు స్థాపించారు. పశ్చిమగోదావరి జిల్లాలో వైద్య విద్యను ప్రోత్సహించేందుకు అధునాతన నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో గోకరాజు గంగరాజు 1998లో 'అకాడమి ఆఫ్ మెడికల్ సైన్సెస్'ని స్థాపించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు ఈ సంస్థకు పెట్టారు. మెడికల్ కాలేజీ, హాస్పిటల్ 1999లో నెలకొల్పారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 100 MBBS సీట్లను అనుమతించింది. 2003లో సుమ దరఖాస్తు చేయగా ఒక్క సీటు మాత్రమే ఖాళీగా ఉంది. డబ్బులు కట్టి సీట్లు సంపాదించేవారు కానీ, ఇన్నేళ్లలో అనుకోకుండా ఒక్క సీటు ఖాళీగా మిగిలిపోయింది. అది సుమకు లభించింది.

ఎంబిబిఎస్ కోర్సులో అడ్మిషన్ తీసుకున్న తర్వాత సుమ శ్రద్ధగా చదవడం ప్రారంభించింది. తనకు మెడికల్ కాలేజీలో సీటు రావడం ఓ అద్భుతమని ఆమెకు తెలుసు. ప్రతి పరీక్షకు బాగా ప్రిపేర్ కావాలని సుమ నిశ్చయించుకుంది. ప్రతి పరీక్షలో అద్భుతమైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని దృఢ సంకల్పం తీసుకున్నారు. తదుపరి చదువుల కోసం సొంతంగా సీటు తెచ్చుకోవాలని భావించింది.

కూతురు స్వావలంబన సాధించినా తండ్రి బాధ్యతలు తొలగిపోవు. వైద్యశాస్త్రంలో ప్రధాన డిగ్రీ పొందింది సుమ. చాలా గొప్ప డాక్టర్‌గా ఎదిగే మార్గంలో ఆమె ప్రయాణిస్తోంది. సుమకు తగిన వ్యక్తితో వివాహం చేయడం ద్వారా తండ్రిగా తన పెద్ద బాధ్యతను నెరవేర్చాలని శ్యామా ప్రసాద్ ఆలోచించడం ప్రారంభించారు. సుమ డాక్టర్, గౌరవప్రదమైన కుటుంబం కావడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి పెళ్లి ప్రస్తావనలు రాసాగాయి. కొన్ని ప్రస్తావనల్లో అబ్బాయికి సుమ నచ్చలేదు. మరికొందరి విషయంలో సదరు అబ్బాయి తమ కుమార్తె సుమకు తగిన జోడి కాదని శ్యామా ప్రసాద్, లక్ష్మికి అనిపించింది.

ఏదైనా అనుకున్నది సఫలం కాకపోయినట్టు అయితే సత్యసాయిని శ్యామా ప్రసాద్ స్మరించుకునేవారు. తన మనస్సులోని మాటను సత్యసాయికి తెలియజేసేవారు. సుమ వివాహం విషయంలోనూ శశ్యామా ప్రసాద్ అదే చేశారు.

ఈ క్రమంలో ఒకరోజు సంపన్నమైన, గౌరవప్రదమైన కుటుంబం నుంచి సుమకు సంబంధం వచ్చింది. అబ్బాయి కూడా డాక్టరే. మంచి డాక్టరయ్యేందుకు కావాల్సిన లక్షణాలు, అర్హతలు అన్ని కూడా ఆ అబ్బాయికి ఉన్నాయి. శ్యామా ప్రసాద్‌కు అబ్బాయి నచ్చాడు. కానీ మనస్సును ఒక సందేహం తొలిచివేయసాగింది. దానికి కారణం లేకపోలేదు. అబ్బాయి చదువు కోసం తల్లిదండ్రులు చాలా ఖర్చు చేయడంతో పెళ్లికి భారీ మొత్తంలో కట్నం, నగలు, కానుకలు డిమాండ్ చేస్తారని శ్యామా ప్రసాద్ భావించారు. కట్నం తీసుకోవడం సర్వసాధారణం. అయితే అబ్బాయి తల్లిదండ్రులు అడిగేంత మొత్తం తన దగ్గర లేదని శ్యామా ప్రసాద్ భావించారు. డాక్టరుగా సంపాదించిన

మొత్తాన్ని శ్యామా ప్రసాద్ తన కొడుకు, కూతురి చదువులకే ఖర్చు చేశారు. పిల్లల చదువులో విషయంలో శ్యామా ప్రసాద్ ఏనాడు రాజీపడలేదు. కొడుకు, కూతురు అనే తేడా ఆయన చూపలేదు. కొడుకును ఎలా చదివించారో, కూతురికి కూడా అదే స్థాయిలో చూశారు. కొడుకు, కూతురు ఇద్దరినీ వైద్యులను చేశారు. ఇద్దరికీ మంచి సంస్కారాన్ని అందించారు. ఇద్దరు సొంత కాళ్లపై నిలబడేలా చేశారు.

కూతురి వివాహం తనపై ఉన్న పెద్ద బాధ్యత అని శ్యామా ప్రసాద్‌కి తెలుసు. దాన్ని దృష్టిలో ఉంచుకొని శ్యామా ప్రసాద్ వేరుగా డబ్బు పొదుపు చేయసాగారు. కాని, తాను పొదుపు చేసిన మొత్తం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కట్నం ఇవ్వాల్సి వస్తుందనే విషయం తెలుసుకున్నారు. ఈ కారణంగా శ్యామా ప్రసాద్ ఈ పెళ్లి ప్రతిపాదనను అంగీకరించలేదు.

ఇదిలా ఉండగా ఒకరోజు సుమ తన తండ్రితో, "నాన్న నాకు అబ్బాయి అంటే ఇష్టం. మా ఇద్దరి అభిప్రాయాలు ఒకే విధంగా ఉన్నాయి, నేను ఆ అబ్బాయినే పెళ్లి చేసుకుంటాను" అని చెప్పింది.

అది విని శ్యామా ప్రసాద్ ఆశ్చర్యపోయారు. తన కూతురు ఆ అబ్బాయిని ఇష్టపడటం ప్రారంభించిందని అతనికి తెలియదు. ఇద్దరూ కూడా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నారు.

మొదటి సారిగా సుమ తన తండ్రితో ఆ అబ్బాయి గురించి మాట్లాడింది. కూతురు సరైన నిర్ణయం తీసుకుందని శ్యామా ప్రసాద్ భావించారు. ఆ అబ్బాయి సామర్థ్యంపై శ్యామా ప్రసాద్‌కు ఎటువంటి అనుమానం లేదు. ఆ అబ్బాయి తన కూతురికి తగిన జీవిత భాగస్వామి అవుతాడని భావించారు. కానీ శ్యామా ప్రసాద్ మనసులో వరకట్నం గురించి అనేక అనుమానాలు ఉన్నాయి. కాని, కూతురు చెప్పిన తర్వాత సుమకు ఆ అబ్బాయితోనే వివాహం జరిపించాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించుకున్నారు.

కూతురంటే శ్యామా ప్రసాద్‌కు చాలా ఇష్టం. ఎంతగానో సుమను ప్రేమిస్తారు ఆయన. ఎంతో ప్రేమగా ఆయన సుమను పెంచారు. అంతే కాదు సుమ సాధించిన విజయాలు చూసి ఆయన ఉప్పొంగిపోయారు. కూతురు

తండ్రికి ఎప్పుడూ ఆనందాన్నే ఇచ్చింది. ఎప్పుడూ ఆయనను బాధపెట్టలేదు. అసమంజసమైన కోరికలు ఎప్పుడూ కోరలేదు. ఈ కారణంగానే తన కూతురు సుమకు నచ్చిన వ్యక్తితోనే వివాహం జరిపించాలనుకున్నారు.

అబ్బాయి వాళ్ల హోదాకు తగినట్టుగా వివాహం చేయాలి కాబట్టి శ్యామా ప్రసాద్ తన దగ్గరున్న డబ్బంతా పోగు చేశారు. అబ్బాయి వాళ్ల తమ స్థోమత కంటే ఎక్కువ కట్నం అడిగితే పరిస్థితి ఏంటనే సందేహం ఆయన మనస్సు నుంచి పోలేదు. ఈ క్రమంలో సత్యసాయిని మరోసారి శ్యామా ప్రసాద్ శరణు కోరారు. సత్యసాయి చిత్రపటం ముందు ముకుళిత హస్తాలతో నిల్చొని, "ప్రభూ, ఈసారి కూడా నువ్వు నాకు సహాయం చెయ్యాలి. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ పెళ్లి జరిపించాలి. నువ్వు ఈ పెళ్లిని ఎలా జరిపిస్తావో నాకు తెలియదు, కానీ నువ్వు కన్యాదానాన్ని విజయవంతం చేస్తావని నేను నమ్ముతున్నాను. నువ్వు తప్ప నాకు సహాయం చేసేవారెవరు లేరు. నీవే నా రక్షకుడవు" అని ప్రార్థించి వివాహ బాధ్యతను సత్యసాయికి అప్పగించారు.

మరోసారి ఊహించని రీతిలో సంఘటనలు జరిగాయి. కట్నం ఏమి తీసుకోబోమని స్పష్టంగా చెప్పారు అబ్బాయి తల్లిదండ్రులు. అమ్మాయి తల్లిదండ్రులు వారి ఇష్టానుసారం వివాహం జరిపించవచ్చని అన్నారు. సత్యసాయి మరోసారి 'అద్భుతం' చేశారని శ్యామా ప్రసాద్ నమ్మారు.

కట్నంగా ఇచ్చేది ఏమి లేకపోవడంతో సుమ కోసం డిపాజిట్ చేసిన మొత్తాన్ని వివాహ వేడుకలకు ఖర్చు చేయాలని శ్యామా ప్రసాద్ నిర్ణయించుకున్నారు. ఆ డబ్బు తన దగ్గర ఉంచుకొని వేరే పనులకు దాన్ని ఖర్చు చేయాలని భావించలేదు.

పెళ్లి ఏర్పాట్లు జోరుగా సాగాయి. బంధువులు, స్నేహితులందరికీ ఆహ్వానాలు పంపించారు. సంప్రదాయబద్ధంగా వివాహం జరిగింది. వివాహ విందుకు ఆరు వేల మందికి పైగా హాజరయ్యారు. ఇంతకుముందు విశాఖపట్నంలో జరిగిన ఏ వివాహ వేడుకకు అంత మంది హాజరు కాలేదు. అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అతిథుల కోసం రకరకాల సంప్రదాయ వంటకాలు సిద్ధం చేశారు. 300లకు పైగా వంటకాలు వడ్డించారు.

చల్లటి నీరు, కూల్ డ్రింక్స్ కోసం కోకాకోలా సంస్థ ప్రత్యేకంగా ఆరు గంటలకు రిఫ్రిజిరేటర్లను పంపింది. ఈ వివాహానికి నగరంలోని ప్రముఖులందరూ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. చాలా రోజులు వరకు ఈ పెళ్లి గురించి విశాఖపట్నం వాసులు చర్చించుకున్నారు. శ్యామా ప్రసాద్ తన కూతురు పెళ్లిని అద్భుతంగా, గుర్తుండిపోయేలా చేశారని అందరూ కొనియాడారు. ఇన్నేళ్లలో ఇలాంటి అద్భుతమైన పెళ్లి చూడబోమని పలువురు అన్నారు.

సుమ తన భర్త డాక్టర్ అభిలాష్‌తో హైదరాబాద్‌లో స్థిరపడింది. డాక్టర్ అభిలాష్ పేరుగాంచిన ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్. సుమ ఓ మంచి ప్లాస్టిక్ సర్జన్‌గా పేరుగాంచారు. డాక్టర్ అభిలాష్, డాక్టర్ సుమలకు ఇద్దరు పిల్లలు. కూతురు ఐశ్వర్య, కొడుకు అక్షయ్ స్కూల్లో చదువుకుంటున్నారు. సుమ పెళ్ళి తరువాత శ్యామా ప్రసాద్ తన కొడుకు సిద్ధార్థ్ పెళ్ళి చేసారు. తన సమీప బంధువైన సుధాకర్ కుమార్తె హరితతో శ్యామా ప్రసాద్ తన కుమారుడి వివాహం జరిపించారు. హరిత కూడా ఎంబిబిఎస్ పట్టభద్రురాలు. పీజీ కోర్స్ పూర్తిచేసాక ఆమె గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో తన సేవలందించడం ప్రారంభించారు. తరువాత విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెన్‌లో నియమితులయ్యారు.

శ్యామా ప్రసాద్ తమ్ముడు గోపీకృష్ణ డిసెంబర్ 11న పుట్టారు. తిరుపతిలోని మున్సిపల్ స్కూల్లోనే చదువుకున్నారు. వీరి ఇంట్లోని నలుగురు పిల్లలూ వైద్య వృత్తిలో ఉన్నవారే. తండ్రికి ఉన్న ఆశ, ఆశయం ప్రకారం అందరినీ డాక్టర్ చదివించాలని ఉండేది. అందుకే, గోపీకృష్ణను కూడా మెడిసిన్ వైపు నడిపించారు. మెడిసిన్ సీటు కోసం ఎంట్రన్స్ టెస్టు రాసినప్పటికీ పాస్ కాలేదు. దీంతో పట్టుదలతో రెండోసారి ప్రయత్నించి సక్సెస్ అయ్యారు. చదువులోనే కాకుండా ఎక్స్‌ట్రా కరిక్యులమ్ యాక్టివిటీస్‌లోనూ గోపీకృష్ణ చురుగ్గా ఉండేవారు. స్కూటర్‌పై చుట్టుపక్కల పిల్లలను, ఆడపిల్లలను ఎక్కించుకుని తిప్పుతూ ఉండేవారు. ఒకరకంగా సకల కళా వల్లభుడు అనొచ్చు. చదువులోనూ చురుగ్గానే ఉండేవారు. అలాగని పుస్తకాల పురుగు అయితే కాదు. ఎప్పుడూ చదువుతూనే ఉండే రకం అయితే కాదు. క్లాస్‌కు వెళ్లడం, చెప్పింది వినడం, పరీక్షలప్పుడే చదవడం, ఎగ్జామ్స్ రాయడం చేసేవారు. పరీక్షలప్పుడు కూడా

పెద్దగా హడావుడి పడేవారు కాదు. గోపీకృష్ణలోని ఆ ధీమా చూసి అంతా ఆశ్చర్యపడేవాళ్లు. పరీక్ష 9 గంటలైతే.. అందరూ గంట ముందు చేరుకుని, అరగంట ముందే ఎగ్జామ్ హాల్ చేరుకునే వారు. కాని గోపీకృష్ణ మాత్రం రెండు మూడు నిమిషాల ముందు మాత్రమే పరీక్ష హాలులో అడుగుపెట్టేవారు. అయినా సరే మంచి మార్కులే వచ్చేవి. అలా అనాటమీ పరీక్ష కూడా పూర్తి చేశారు. మొత్తానికి ఆప్తమాలజీ పూర్తి చేశారు. అయితే, ఎంఎస్ చేసే అవకాశం ఉన్నా ఆ వైపు వెళ్లలేదు. కర్నూలులోనే డీఓ చేశారు. అదే సమయంలో ఈశ్వరితో గోపీకృష్ణకు పెళ్లి సంబంధం కుదిరింది. నిజానికి వీరి కుటుంబంలో అందరూ డాక్టర్లే. కాని, గోపీకృష్ణ భార్య ఒక్కరే నాన్-మెడికల్. ఈ విషయాన్ని కూడా ఎంతో ప్రత్యేకంగా చెప్పుకునే వారు. ఆ తరువాత ఉద్యోగంలో జాయిన్ అయి అనతికాలంలోనే కేజీహెచ్‌కు వచ్చారు. కేజీహెచ్‌లో డిపార్ట్ మెంట్లో చేరారు. నిజానికి డిపార్ట్ మెంట్లో అందరూ ఎంఎస్‌లే ఉంటారు. కాని, గోపీకృష్ణ మాత్రం డీఓ చేశారు కాబట్టి ఆర్ఎంఓగా చేశారు.

చెల్లెలు మైథిలి కూడా తిరుపతిలోని మున్సిపల్ స్కూల్‌లోనే చదువుకున్నారు. చదువులో చురుగ్గా, ఎప్పుడూ ముందుండే వారు. అందరికన్నా మిన్నగా ఉండాలనే తాపత్రయం ఉండేది. ఆ తపనే యూనివర్సిటీ ర్యాంకర్‌ని చేసింది. యూనివర్సిటీలోనే ఫస్ట్ రావడంతో చదువులో తాను అనుకున్న కల నెరవేరింది. దీంతో ఫైనల్ ఇయర్ తరువాత ఎంఎస్ సెలక్ట్ చేసుకున్నారు. ఆ రోజుల్లో జనరల్ సర్జన్లుగా కేవలం మగవాళ్లు మాత్రమే ఉండేవాళ్లు. ఆడవాళ్లు లేనే లేరు. బహుశా ఆ ప్రాంతంలో తొలి మహిళా సర్జన్ అన్నా ఆశ్చర్యపోవక్కర్లేదేమో. ప్రొఫెసర్ వసంతరావు దగ్గర సర్జరీలో సబ్జెక్ట్ నేర్చుకున్నారు. పెళ్ళి ఈడు వచ్చినా, ఎన్నో గొప్ప గొప్ప సంబంధాలు వచ్చినా వాటిని నిరాకరించారు. వృత్తికే తన జీవితాన్ని అంకితం చేసి, మంచి డాక్టరుగా పేరు తెచ్చుకున్నారు.

చిన్న చెల్లి బత్తిన శోభ కూడా తిరుపతి మున్సిపల్ స్కూల్‌లోనే చదువుకున్నారు. వీరి కుటుంబంలోని అందరూ ఎంబిబిఎస్ తిరుపతిలో చేస్తే, శోభ గూడూరులో చదివారు. హౌస్ సర్జన్ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచే అభ్యుదయ భావాలతో పెరిగారు. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావాలేం ఉండేవి కావు. మనిషిని మనిషిలా చూడ్డమే శోభకు తెలిసింది. పెద్దయ్యాక, డాక్టర్‌గా మారిన తరువాత

కూడా తనలోని భావాలు, ఆలోచనలేం మారలేదు. అందుకే, నచ్చిన వ్యక్తినే పెళ్లి చేసుకున్నారు. మొదట్లో ఆ పెళ్లిని అంగీకరించకపోయినా.. ఆ తరువాత ఇంట్లో వాళ్లే ఒప్పుకునేలా మార్చుకోగలిగారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ఇంటికి పెద్ద కొడుకు అవడంతో కుటుంబ బాధ్యతలన్నీ ఈయనే చూసుకునే వారు. గోపీకృష్ణ, మైథిలి, శోభారాణి కూడా డాక్టర్లుగా స్థిరపడ్డారంటే అందులో డాక్టర్ శ్యామా ప్రసాద్ పాత్రే ఎక్కువ. వీరికి కావాల్సిన పుస్తకాలన్నీ డాక్టర్ శ్యామా ప్రసాద్ కొనిచ్చే వారు. గోపీకృష్ణకు చదువులో సహాయం చేసేవారు. పరీక్షలప్పుడు దగ్గరుండి చూసుకుని, ఎగ్జామ్స్ రాయించారు. మైథిలి, శోభారాణి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. చివరికి ఆస్తి పంపకాల్లోనూ ఇంటికి పెద్దవాడిగా, పెద్దరికంగానే వ్యవహరించారు. తన ఆస్తి మొత్తం కూతుళ్లకే ఇస్తున్నానన్న తన తండ్రి మాటకు శిరసావహించారు. దశరథుడు రామున్ని అడవికి వెళ్లమనగానే ఎలా అయితే రాజ్యాన్ని త్యజించారో... అలా ఒక్క మాట కూడా ఎదురుచెప్పకుండా సంతోషంగా ఆస్తి ఆడపిల్లల పేరున రాయడానికి అంగీకరించారు. చివరికి తన కట్నంగా వచ్చిన డబ్బులు కూడా ఇల్లు కట్టడానికే ఖర్చు పెట్టారు. కాని, వేటిలోనూ వాటా అడగలేదు. డాక్టర్ శ్యామా ప్రసాద్ భార్య కూడా మారుమాట్లాడకుండా అంగీకరించారు. పైగా ఆ ఆస్తి మొత్తం తన తండ్రి కష్టార్జితమే. అది ఎవరికి ఇవ్వాలి, ఎవరెవరికి పంచాలన్న నిర్ణయం మొత్తం తండ్రిదే కాబట్టి.. ఆ విషయంలో జోక్యం చేసుకోవాలన్న ఆలోచన కూడా రానివ్వలేదు. పెద్ద కొడుకుగా ఆస్తిలో వాటా రావాల్సిందేనని పట్టుబడితే.. కుటుంబం ఆనాడే చిన్నాభిన్నం అవుతుందని తెలుసు. చాలా కుటుంబాల్లో ఆస్తి తగాదాలే ఫ్యామిలీను విచ్ఛిన్నం చేశాయి. అలాంటి పరిస్థితి రాకూడదన్న దూర దృష్టితో డాక్టర్ శ్యామా ప్రసాద్ అలా వ్యవహరించారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ఎప్పుడూ వెన్నంటి నిలిచిన మహానుభావుడు పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబాగారు. లక్ష ఆపరేషన్లు ఎలాంటి ఫెయిల్యూర్ లేకుండా చేయగలిగారంటే అంతా ఆయన చలవే అంటుండేవారు. క్లిష్టమైన సర్జరీలు చేయాల్సి వచ్చిన ప్రతిసారి.. స్వామిని తలచుకుని చేసే వారు. అంతే.. నిర్విఘ్నంగా పూర్తయ్యేవి. కొన్ని సంక్లిష్టమైన ఆపరేషన్లను కావాలని గురువారం

నాడే చేసేవారు. వినే వారికి, చూసేవారికి ఏదోలా అనిపించొచ్చు గాని.. బహుశా అలా చేయడం వల్లేనేమో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవాళ్లు, ఇక బతకరు అనుకున్నవాళ్లంతా ప్రాణాలతో బయటపడ్డారు. అంతేకాదు, కుటుంబ పరంగానూ ఎన్నోసార్లు, ఎన్నో ప్రమాదాల నుంచి బయటపడేశారు. పిల్లలు ఉన్నత స్థితికి చేరడానికి, మెడికల్ ప్రాక్టీస్ మరింత బాగా జరగడానికి.. అన్నీ బాబా ఆశీస్సుల వల్లే జరిగాయంటారు.

1992లో డాక్టర్ శ్యామా ప్రసాద్ జీవితంలో మరిచిపోలేని ఓ సంఘటన జరిగింది. కేజీహెచ్లో ప్రాక్టీస్ చేస్తుండగా ఓ రోజు అపెండెక్స్ నొప్పి అంటూ వచ్చారు. అప్పటికే చేయాల్సి ఆపరేషన్లు ఉండడంతో కుదరదని చెప్పారు. దీంతో డాక్టర్ చంద్రశేఖర్ని పిలిచారు. ఆయన కూడా బిజీగా ఉండడంతో రాలేనన్నారు. ఆ పేషెంటును వేరే హాస్పిటల్లో చూపించండని చెప్పినా వినలేదు. ఈలోపు సాయంత్రం అయిపోయింది. అప్పటికే డాక్టర్ శ్యామా ప్రసాద్ ఓ ఆపరేషన్ చేసి బయటకు వస్తుండగా పేషెంట్ తరుపు వాళ్లు వచ్చి, మీరే ఏదైనా చేయాలని బతిమిలాడారు. వెళ్లి చూస్తే.. ఆ పేషెంట్ పరిస్థితి చాలా సీరియస్గా ఉంది. పైగా వాళ్లు పేదవాళ్లు డబ్బు కట్టే పరిస్థితి లేకపోవడంతో ఉచితంగా ఆపరేషన్ చేయడానికి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముందుకొచ్చారు. ఆపరేషన్కి అంతా సిద్ధమైంది. సర్జరీకి ముందు మత్తు మందు ఇవ్వాలి కాబట్టి అనిస్తీషియాలజిస్ట్ వచ్చారు. కాని, పేషెంట్ పరిస్థితి చూసిన అనిస్తీషియన్కు ఆపరేషన్ మధ్యలోనే అతను చనిపోతాడేమోనన్న సందేహం వచ్చింది. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం చాలా ధైర్యంగా అడుగు ముందుకేశారు. అసలే ఆర్టీఐ యాక్ట్ మీద జనాల్లో అవగాహన పెరిగిన రోజులవి. డాక్టర్ కారణంగా ఏదైనా జరిగితే కేసు వేయొచ్చని జనాలకు ఒక అవగాహన వచ్చిన కాలం అది. అయినా సరే రోగిని బతికించాలన్న తాపత్రయంతో.. ఆపరేషన్ మొదలుపెట్టారు. అనెస్తీషియన్ మత్తు మందు ఇచ్చారు. ఆపరేషన్ చేసి చూస్తే అది అపెండిక్స్ కాదు. చిన్నపేగు కుళ్లిపోయి, బాగా ఇన్ఫెక్షన్ సోకింది. నిజానికి అలాంటి పరిస్థితుల్లో ఇంకా ఆలస్యం చేస్తే ఆ పేషెంట్ చనిపోయే అవకాశం ఉంటుంది. కాని, ఆ ఆపరేషన్ను విజయవంతంగా పూర్తిచేశారు. అంతా బాగానే ఉంది గాని.. పేషెంట్ మాట పడిపోయింది. అనెస్తీషియా కారణంగా అలా మాట పడిపోవడానికి ఆస్కారం

ఉంది. దీంతో పేషెంట్ బంధువులు గొడవ చేయడం మొదలు పెట్టారు. ఈ కారణంగా డబ్బు గుంజవచ్చని అనుకున్నారు. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం వాళ్లు పేద వాళ్లు అవడంతో ఆ సమయంలో కూడా మందులు కొని స్వయంగా ఇచ్చే వారు. ఆ రోజుల్లో పేషెంట్ కోసం చాలా ఖరీదైన మందులు కొన్నారు. టాక్సిమ్ అనే మెడిసిన్ అప్పుడే మార్కెట్లోకి వచ్చింది. దాని ఖరీదు కూడా చాలా ఎక్కువ. అయినా సరే.. ఆ మెడిసిన్ కొని ఇచ్చారు. పైగా ఖర్చులకు డబ్బులు కూడా ఇచ్చేవారు. పది రోజుల పాటు ఎదురుచూసినా పేషెంట్ కోలుకోలేదు. ఓ రోజు పేషెంట్‌తో సహా వారి బంధువులు అందరూ కలిసి చెప్పాపెట్టకుండా హాస్పిటల్ నుంచి వెళ్లిపోయారు. ఊర్లో క్రిమినల్ లాయర్ల దగ్గరకు వెళ్లి డాక్టర్ శ్యామా ప్రసాద్‌పై కేసు పెట్టాలని చూశారు. పెద్దమనుషుల ద్వారా పంచాయతీ పెట్టించాలని చూశారు. కాని, అక్కడి వారికి డాక్టర్ శ్యామా ప్రసాద్ అంటే ఎవరో తెలుసు. అంత పెద్దమనిషి అలాంటి పనులు చేయరని పేషెంట్ బంధువులకు చెప్పారు. అవసరమైతే డబ్బులు ఎదురు ఇచ్చే మనస్తత్వం ఉందని చెప్పారు. అయినా సరే అవేమీ వినకుండా 50వేలు డిమాండ్ చేశారు. ఈ ఎపిసోడ్‌లో డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు తెలియనిది ఏంటంటే.. ఆపరేషన్ కోసం ఆస్పత్రి వాళ్లు పేషెంట్ నుంచి 30వేలు కట్టించుకున్నారు. వాళ్లు పేదవాళ్లు, ఫీజు తీసుకోవద్దని చెప్పినప్పటికీ.. ఆస్పత్రి యాజమాన్యం డబ్బు కట్టించుకుంది. దీంతో తమకు జరిగిన నష్టానికి 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, ఆస్పత్రిలో కట్టిన 30వేల రూపాయల డబ్బును తిరిగి ఇప్పిస్తానని డాక్టర్ శ్యామా ప్రసాద్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాని, వాళ్లు అవేమీ పట్టించుకోకుండా.. సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి, అపెండిసైడిస్ ఆపరేషన్ వల్లే ఇలా జరిగిందని ఓ రిపోర్ట్ రాయించుకుని, ఆ రిపోర్టుతో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ స్టేట్ కమిషన్‌లో కేసు వేశారు. కేసు డెప్త్ చూసిన లాయర్ 5 లక్షలు డిమాండ్ చేయొచ్చని చెప్పడంతో పేషెంట్ బంధువులు పట్టుబట్టారు. ఐదు లక్షలు వస్తే చెరి సగం తీసుకుందామని లాయర్, పేషెంట్ బంధువులు ఓ ఒప్పందం కుదుర్చుకున్నారు. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం కేవలం లక్ష మాత్రమే ఇవ్వగలనని చెప్పుకొచ్చారు. నిజానికి ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ఈ బాధ్యత తీసుకోవాల్సింది డాక్టర్ శ్యామా ప్రసాద్ కానే కాదు. ఆ

తప్పు అనెస్తీషియన్ వల్ల జరిగింది. పైగా బాధ్యత వహించాల్సింది హాస్పిటల్ మేనేజ్మెంట్. వద్దని చెప్పినా ఫీజు వసూలు చేసింది కూడా వాళ్లే. కాని, కేసుల కారణంగా తిరగాల్సి వచ్చింది మాత్రం డాక్టర్ శ్యామా ప్రసాద్. ప్రతి శనివారం హైదరాబాద్ స్టేట్ కమిషన్‌లో విచారణ కోసం తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ తరపు వాదించిన లాయర్ ఫీజు తీసుకోకుండానే వాదించారు. మధ్యలో బ్రోకర్ వచ్చి ఎంతో కొంత ఇచ్చి కేసును తేల్చేద్దాం అని బేరం ఆడాడు. అవసరమైతే శిక్ష అనుభవిస్తాను గాని డబ్బులు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ఆ కేసు అలా 2001 వరకు దాదాపు పదేళ్ల పాటు నడిచింది. అయితే, 1992లో ఆపరేషన్ జరిగితే.. ఓ ఏడాది తరువాత కొన్ని అనారోగ్య సమస్యల కారణంగా అదే పేషెంట్‌ను తీసుకుని కేజీహెచ్లో జాయిన్ చేశారు. అప్పుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ కూడా అదే హాస్పిటల్లో ఉన్నారు. అప్పటికీ కేసు నడుస్తోంది కూడా. అయినా సరే.. అవేం మనసులో పెట్టుకోకుండా పేషెంట్‌ను పది రోజుల పాటు జాగ్రత్తగా చూసుకున్నారు. వైద్యంలో భాగంగా టోటల్ పేరెంటల్ న్యూట్రిషన్ ప్రొడక్టును కూడా స్వయంగా తన డబ్బులతో కొనిచ్చారు. ఆ రోజుల్లోనే అది వేయి రూపాయలకు పైగా ఉండేది. మధ్యలో అవసరం అయితే డాక్టర్ శ్యామా ప్రసాదే స్వయంగా రక్తదానం చేశారు. అప్పటికే డాక్టర్ శ్యామా ప్రసాద్ 83 సార్లు రక్తదానం చేసి ఉన్నారు. తాను రక్తం ఇస్తే ఆ పేషెంట్ చనిపోడన్నది డాక్టర్ శ్యామా ప్రసాద్ నమ్మకం. అదే నిజమైంది. అనారోగ్యం తగ్గి పేషెంట్ డిశ్చార్జ్ అయి వెళ్లిపోయాడు. అలా ఆ పేషెంట్ పదేళ్ల పాటు బతికాడు. మొత్తానికి కోర్టు తీర్పుతో కొంత డబ్బులు ఫైన్‌గా కట్టి బయటపడ్డారు. కాని, పదేళ్ల పాటు విశాఖ నుంచి హైదరాబాద్‌కు కేసు గురించి తిరిగి, పేషెంట్ బంధువుల స్వార్థం చూసి విసిగిపోయిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ఒక గుణపాఠం నేర్చుకున్నారు. కాదు కాదు.. అలాంటి వాళ్లే డాక్టర్ శ్యామా ప్రసాద్ ఓ గుణపాఠం నేర్పించారు. అప్పటి నుంచి సీరియస్ కేసులు తను ప్రాక్టీస్ చేస్తున్న హాస్పిటల్లో హ్యాండిల్ చేయడం మానేశారు. ఒకప్పుడు సీరియస్ కేసులను ఉచితంగా చేసిపెట్టిన డాక్టర్ శ్యామా ప్రసాద్.. ఒకేసారి ఇలా మారడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాని, కేజీహెచ్లో మాత్రం ఎంతటి సీరియస్ కేసునైనా టేకప్ చేసేవారు. ఈ కోర్టు కేసుల వల్ల

డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్– డీఎంఈ అవ్వాల్సిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ఆ స్థానానికి వెళ్లలేకపోయారు. కోర్టులో కేసులు వేయడం, డబ్బులతో పోటీ పడలేక అత్యున్నత స్థానానికి వెళ్లలేకపోయారు. తనకంటే కింద స్థాయిలో ఉన్న వాళ్లు ఏదోలా మానిప్యులేట్ చేసి, డబ్బులు ఎరవేసి ఉన్నత స్థానానికి వెళ్లారు. చివరికి 2008లో హైదరాబాద్‌లో పనిచేయడానికి ఆఫర్ వచ్చింది. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్ కేజీహెచ్‌లోనే ఉండేందుకు ప్రిఫర్ చేశారు. అలా మూడేళ్లు ఎదురుచూసిన తరువాత కేజీహెచ్‌లో పోస్టింగ్ వచ్చింది.

డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు రాజకీయాలపై అభిలాష ఎక్కువే. ఈ ఆశ తన తండ్రి నుంచి వచ్చింది. ఆయనకు రాజకీయాల్లో ఎదగాలని ఆశ ఉండేది. అందుకోసం బీజేపీ, బీఎస్పీ, ఎస్పీ పార్టీల్లో చేరారు. కష్టపడి పనిచేశారు. కాని, ప్రత్యర్థి పార్టీలు ఆయన్ను ఎదగనివ్వలేదు. లేదంటే, రాజకీయాల్లో ఆయనకున్న సీనియారిటీకి గవర్నర్ పదవే వచ్చి ఉండేదని వారి సర్కిల్లో మాట్లాడుకునే వారు. అందుకే, తన తండ్రి కోరికను, ఆశయాన్ని దృష్టిలో పెట్టుకుని తను కూడా రాజకీయాల్లోకి వెళ్లాలనుకున్నారు. రాజకీయాలంటే సంపాదించుకోవడం, జనాన్ని దోచుకోవడం అనుకుంటారు. కాని, ప్రజలకు తనవంతుగా ఏదైనా సాయం అందించాలనే గుణం డాక్టర్ శ్యామా ప్రసాద్‌ది. అలాగని, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన లేదు. ఎందుకంటే, ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థిపై ఆరోపణలు చేయాలి, లేదంటే డబ్బు పంచాలి. వీటికి డాక్టర్ శ్యామా ప్రసాద్ చాలా దూరం. అందుకే, రాజ్యసభ సీటు కోసం ప్రయత్నిస్తున్నారు. విశాఖలో వీరి సామాజికవర్గం బలంగా ఉంది. ఆ బలంతో వైసీపీ నుంచి రాజ్యసభ సీటు ఇస్తే బాగుంటుందని భావిస్తున్నారు. పైగా విశాఖలోనూ వైసీపీకి అంత బలమైన అభ్యర్థి లేడనేది డాక్టర్ శ్యామా ప్రసాద్ అభిప్రాయం. అందుకే తనవంతు ప్రయత్నం చేయాలనుకుంటున్నారు. పార్టీ అధిష్టానం అంగీకరిస్తే రాజ్యసభకు వెళ్లి ప్రజలకు సేవలు చేస్తారు. లేదంటే ఎప్పటి లాగే ప్రాక్టీస్ చేసుకుంటానని చెబుతున్నారు.

ఏం జరిగినా వైద్య వృత్తిని మాత్రం వదులుకోలేరు డాక్టర్ శ్యామా ప్రసాద్. సవాళ్లను ఇష్టపడే వ్యక్తిగా నిత్యం వైద్య వృత్తిలో కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటారు. సౌదీ అరేబియా నుంచి వచ్చాక రెండేళ్ల పాటు హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రిలో పనిచేశారు. ఆ సమయంలో చేసిన ప్రాక్టీస్.. తన వైద్య వృత్తికి చాలా పనికొచ్చింది. ఎన్నో సవాళ్లతో కూడిన ఆపరేషన్లు చేయాల్సి వచ్చేది. పుస్తకాలు చదివి, నేర్చుకోవడం, ఆపరేషన్లు చేయడం అంత ఈజీ కాదు. కాని, ఒక్కసారి చూశారంటే చాలు.. చాలా తొందరగా నేర్చుకునే వారు. అలా ఎన్నో సర్జరీలను విజయవంతంగా చేశారు. మొదట్లో ల్యాప్రోస్కోపీ మీద డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ఆసక్తి ఉండేది కాదు. తన బ్యాచ్‌లో అందరూ 1988 సమయంలోనే ల్యాప్రోస్కోపీ నేర్చుకుంటే.. డాక్టర్ శ్యామా ప్రసాద్ మాత్రం 1990లో నేర్చుకున్నారు. ఆ తరువాత పాతికేళ్ల పాటు తిరుగులేని అనుభవం సంపాదించారు. ఇప్పుడు అబ్డామిన్‌లో ఎలాంటి సమస్య వచ్చినా సర్జరీ చేసి సరిచేయగలరు. గాల్, అపెంబ్లాడర్ అపెండిక్స్, పేగుల్లో సమస్యలు, లివర్ ప్రాబ్లమ్స్.. ఇలా సమస్య ఏదైనా పరిష్కారం చూపే స్థాయికి ఎదిగారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ స్నేహితుడు సతీష్ దగ్గర తమ అబ్బాయిని చేర్పించారు. రెండేళ్లలోనే ఆయనకొచ్చే పేషెంట్లను ఈయనే చూస్తుండేవారు. ఆర్థోపెడిక్ అంటే పెద్దగా డబ్బులు వచ్చే విభాగమేమీ కాదు. కాని, డబ్బుల గురించి చూడకుండా పేదోళ్లకు సేవ చేయాలనే తలంపుతో అప్పుడప్పుడు ఉచితంగా కూడా సర్జరీలు చేసి పెట్టేవారు. అప్పుడప్పుడు చీఫ్‌కి సాయంగా వెళ్లేవారు. రోజుకు కనీసం 60 మంది పేషెంట్లను చూడడం, అందులో మూడు నాలుగు సర్జరీలు ఉండడం, అప్పుడప్పుడు విజయనగరం, శ్రీకాకుళం కూడా వెళ్లి చాలా కష్టమైన ఆపరేషన్లు కూడా చేసి వస్తుండేవారు. ఇంట్లో ఆడపిల్లకి పెళ్లి అయిన తరువాత డాక్టర్ శశ్యామా ప్రసాద్ కొడుకు పెళ్లి చేసుకున్నాడు. నిజానికి కాస్త ఎర్రగా బుర్రగా ఉండడంతో ఈడుజోడు ఉన్న అమ్మాయినే ఇచ్చి పెళ్లి చేయాలని చాలా సంబంధాలు చూశారు. అటు తిరిగి ఇటు తిరిగి మొదట్లో చూసిన సంబంధాన్నే మళ్లీ ఓకే చేశారు. కోడలు కూడా తన కుమారుడి కాలేజీలో జూనియర్‌గా ఉండడంతో వారిద్దరికి ర్యాపో కుదిరింది. రూపాయి కట్నం తీసుకోకుండా వారిద్దరి పెళ్లి చేశారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ప్రస్తుతం కోడలు గీతం హాస్పిటల్లో చేస్తున్నారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ స్నేహానికి చాలా విలువ ఇచ్చేవారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకునే స్నేహితుడు డాక్టర్ మాల కొండయ్య. ఎంబిబిఎస్ చదివే

సమయంలో వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడింది. ఒకే ప్రాంతం నుంచి రావడం, ఒకే రూమ్‌లో ఉండి చదువుకోవడంతో స్నేహం బలపడింది. పేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. కష్టపడి చదివి డాక్టర్ అయ్యారు మాలకొండయ్య. తనలోని కష్టపడే స్వభావం, మంచి మనసు కారణంగా ఇద్దరూ వేర్వేరు డిపార్టుమెంట్స్ అయినా స్నేహం కొనసాగింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎంఎస్ వైపు వెళ్తే.. డాక్టర్ మాలకొండయ్య ఎండీ చేశారు. అయినప్పటికీ, ఇద్దరి మధ్య స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది. డాక్టర్ మాలకొండయ్య కర్నూల్లో ప్రాక్టీస్ చేస్తూ అక్కడే సెటిల్ అయ్యారు. ఇక డాక్టర్ ఉమా మహేశ్వరరావు కూడా డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి మంచి స్నేహితులు. ఈయన అనస్తీషియన్‌గా చేసి బెంగళూరులో స్థిరపడ్డారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ఎప్పుడూ గుర్తుపెట్టుకునే మరో వ్యక్తి డాక్టర్ ఆర్ముగం. ఈయన పీడియాట్రిషన్. చదువుకునే రోజుల్లో చాలా మంది స్నేహితులు ఉన్నప్పటికీ.. కొందరితోనే ఆ బంధం ఏర్పడింది. డాక్టర్ శ్యామా ప్రసాద్ స్నేహితుల్లో అమ్మాయిలు కూడా ఉన్నారు. కాలేజీ రోజుల్లోనే గాని, ప్రాక్టీస్ చేసేప్పుడే గాని.. స్నేహాన్ని అదే బంధంతో, ఓ మంచి భావంతో చూశారు తప్ప వేరే భావనలు ఏర్పరచుకోలేదు. డాక్టర్ శ్యామా ప్రసాద్ దృష్టిలో స్నేహం చాలా పవిత్రం. ఆ రోజుల్లోనే తన స్నేహితులంతా కలిసి ఓ హాస్పిటల్ పెడదామనే ప్రొపోజల్ తీసుకొచ్చారు. కాని, డాక్టర్ శ్యామా ప్రసాద్‌కు మాత్రం ఎంతసేపూ వైద్యుడిగా సేవ చేయాలని ఉంటుంది తప్ప.. సంపాదన అనే ఆలోచన పెద్దగా ఉండేది కాదు. పేదవాళ్లు ఆస్పత్రికి వస్తే.. అంతో ఇంతో సాయం చేసి పంపించాలనే తపనే ఎక్కువగా కనిపించేది. ఆ రోజుల్లో ఒక అల్సర్ ఆపరేషన్ చేస్తే 250కి రూపాయలు ఇచ్చేవారు. అందులో అనస్తీషియన్‌కు 50, హాస్పిటల్‌కు 200 ఇచ్చి.. ఖాళీ చేతులతో వెళ్లిపోయే వారు. అలాంటి మనస్తత్వం డాక్టర్ శ్యామా ప్రసాద్‌ది. ప్రాక్టీస్‌లో భాగంగా సంపాదించినప్పటికీ.. ఎక్కువ భాగం తన స్నేహితులు, బంధువులను నమ్మి పెట్టుబడి పెట్టేవారు. తీరా వాళ్లంతా మోసం చేసి వెళ్లిపోయే వారు. అలాంటి సమయంలోనే సౌదీ వెళ్లాలనే ఆలోచన వచ్చింది. ఆ తరువాత కొద్ది కొద్దిగా పొదుపు చేయడం నేర్చుకున్నారు.

ఈ ప్రపంచంలోనే అత్యంత విశ్వాసం చూపించే జీవి కుక్క మాత్రమే. డాక్టర్ శ్యామా ప్రసాద్ జీవితంలో రెండు కుక్కలు అంతటి విశ్వాసాన్ని చూపించాయి. 2004 ప్రాంతంలో సింగపూర్ నుంచి రెండు బ్రీడ్స్ తెచ్చారు. వాటికి స్నిప్పీ, గన్నీ అని పేరు పెట్టుకున్నారు. వాటితో అనుబంధం ఎంతలా ముడిపడిందంటే.. దాదాపు 16 ఏళ్ల పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెలిగిపోయాయి. కొడుకు, కూతురు చదువులు, కెరీర్ పేరుతో దూరంగా ఉన్నప్పుడు.. డాక్టర్ శ్యామా ప్రసాద్ దంపతులకు తోడుగా ఉన్నది ఈ రెండే. డాక్టర్ శ్యామా ప్రసాద్ బయటకి వెళ్తే ఎప్పుడు వస్తారా అని ఎదురుచూసేవి. చదువుతుంటే పక్కనే కూర్చునేవి. పడుకున్నప్పుడు కూడా వదిలిపెట్టేవి కావు. ఒక్కోసారి పక్కనే వచ్చి పడుకోవడం, ఇద్దరి మధ్య పడుకోవడం చేసేవి. పూజ చేసేప్పుడు కూడా భక్తిగా పక్కనే వచ్చి కూర్చునేవి. పైగా పూజ గదిలోనో, మరెక్కడైనా ఆహారం కనపడింది కదా అని వెళ్లి తినేవి కావు. పేట్లలో పెట్టి తినమంటేనే తినేవి. ఎప్పుడైనా కేక్ కట్ చేసినా, ఇంట్లో నాన్ వెజ్, చేపలు, రొయ్యలు లాంటివి చేస్తున్నా.. పక్కనే వచ్చి కూర్చునేవి. అంటే, తినడానికి పెడతారా అని అడుగుతున్నట్టుగా ఉండేవి తప్ప.. ఏనాడు ఆహారంలో నోరు పెట్టిన దాఖలాల్లేవు. ఇంటికి వచ్చిన ఎవరైనా స్నిప్పీ, గన్నీని ఈసడించుకుంటే డాక్టర్ శ్యామా ప్రసాద్ దంపతులకు మహా కోపం వచ్చేది. వాటిని ఇంట్లో కుటుంబ సభ్యులుగా చూసుకోవడం వల్ల.. ఎవరైనా కసురుకున్నా, అది ఇది అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడినా నచ్చేది కాదు. అలా తీసేసి మాట్లాడొద్దని చెప్పేవాళ్లు. పైగా 2005లో, ఆ రోజుల్లోనే నెలకు 5వేలు ఖర్చు పెట్టి స్నిప్పీ, గన్నీకి పోలీస్ ట్రైనింగ్ ఇప్పించారు. దీంతో అవి ఏం చెప్పినా చేసేసేవి. విశాఖలో డాగ్స్ పోటీలు పెట్టినప్పుడు మొదటి రెండు బహుమతులు గెలుచుకునేవి. అలా ఐదేళ్ల పాటు ఫస్ట్, సెకండ్ వచ్చాయి. ఆ తరువాత లావు అవడంతో.. వాటిని ఇబ్బంది పెట్టడం మానేశారు. ఓరోజు స్నిప్పీ గొంతులో ఏదో అడ్డుపడడంతో.. ఒళ్లంతా నీలంగా మారింది. ఆరోజు కనీసం నలుగురు డాక్టర్లకి ఫోన్ చేసి రప్పించి, ఆపరేషన్‌కి సిద్ధమయ్యారు. చివరికి గొంతు వరకు చెయ్యి పెట్టి ఇరుక్కున్న పదార్థాన్ని తీసేశారు. వయసు మీద పడడంతో పెరాలసిస్ కూడా వచ్చింది. అయినా ఏడాది పాటు చక్కగా బతికింది. కళ్లు లేకపోయినా సరే.. ఫ్లోర్లు ఎక్కి దిగుతుండేవి. అలా 16 ఏళ్ల అనుబంధానికి ఈ

మధ్యే వీడ్కోలు చెప్పాయి. వయసు కారణంగా కొంత గ్యాప్‌తో స్నిప్పీ, గన్నీ చనిపోయాయి. వాటితో అనుబంధానికి గుర్తుగా ఇప్పటికీ.. వీరు భోజనం చేసేప్పుడు రెండు ప్లేట్లు అలా ఉంచేస్తారు. వెజ్ లేదా నాన్-వెజ్ ఏది వండుకున్నా.. స్నిప్పీ, గన్నీ ప్లేట్లలో పెట్టడం అలవాటుగా మారింది. ఇప్పటికీ ఆ పద్ధతి కొనసాగుతోంది. ఎక్కడికి వెళ్లినా వాటితో అనుబంధం మాత్రం మరిచిపోలేనిది అంటుంటారు డాక్టర్ శ్యామా ప్రసాద్. ఇప్పటికీ ఎక్కడైనా క్లాసులు చెప్పినా, స్పీచ్లు ఇచ్చినా.. తన జీవితంలో భాగం అయిన, తమతో జీవితం పంచుకున్న ఈ రెండు కుక్కల గురించి చెప్పకుండా ఉండలేరు. ఇక స్నిప్పీ, గన్నీలను పెంచడంలో పనిమనిషి లక్ష్మి ఎనలేని సేవలు చేసింది. నాలుగు దశాబ్దాలుగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ఇంట్లో లక్ష్మి పనిమనిషిగా చేస్తోంది. స్నిప్పీ, గన్నీల బాగోగులు ఎక్కువగా ఆమెనే చూసుకునేది. వ్యాక్సిన్లు, ఇమ్యునైజేషన్లు, స్నానాలు ఇలా క్రమం తప్పకుండా జరిగేవి. జీవితంలో ఒక భాగంగా కలిసిపోయి, కుటుంబ సభ్యులుగా మెలిగి, ఒక్కసారిగా అవి దూరం అవడంతో.. వాటిని ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు డాక్టర్ శ్యామా ప్రసాద్ దంపతులు.

డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి సంగీతం అంటే మహా ఇష్టం. ఎప్పుడూ పాటలు వింటూ ఉండేవారు. వైద్యునిగా బిజీగా ఉండడంతో సంగీతం నేర్చుకోలేకపోయారు. అలాగని ఆ యావను వదిలిపెట్టలేదు. 60 ఏళ్ల వయసులో తన 65 ఏళ్ల స్నేహితుడిని వెంటపెట్టుకుని వాడపల్లి సత్యనారాయణ దగ్గర సంగీతం నేర్చుకోడానికి వెళ్లారు. ఆ వయసులో సంగీతం నేర్చుకోవడం ఏంటి అని అనుకున్నా సరే.. పట్టుబట్టి ఏకంగా 52 పాటలు నేర్చుకున్నారు. అన్నమయ్య కీర్తనలు పాడేవారు. ఎప్పుడైనా జర్నీ చేయాల్సి వస్తే.. ఈ ఇద్దరూ కలిసి అన్నమయ్య కీర్తనలు పాడుకుంటూ ప్రయాణం కొనసాగించే వారు.

ఇక సినిమాలంటే కూడా మహా పిచ్చి. సినిమాలు విపరీతంగా చూసేవారు. కాలేజీ వయసుకు వచ్చే వరకు ఒంటరిగా చూశారు. పెళ్లైన తరువాత భార్యతో కలిసి ఎక్కువ సినిమాలు చూశారు. సినిమాలంటే పిచ్చి ఉన్నప్పటికీ, ఎన్నడూ స్కూల్, కాలేజీ ఎగ్గొట్టి.. ఇంట్లో వాళ్లకు చెప్పకుండా సినిమాలకు వెళ్లింది లేదు. పైగా అమ్మకి చెప్పకుండా ఎక్కడికీ కదిలేవారు కాదు. జీవితంలో మొదటిసారి

భార్యతో కలిసి అమ్మకు చెప్పకుండా సినిమా చూసొచ్చిన సందర్భాన్ని ప్రత్యేకంగా చెప్పుకుంటారు. మరీ ముఖ్యంగా బాపు సినిమాలంటే డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ప్రాణం. ఆయన తీసిన సినిమాలను వరుస పెట్టి చూసేవారు. ఆ సినిమాలన్నీ అయిపోయాక.. మళ్లీ రిపీట్ వేసుకుని చూసేవారు. కేవలం సినిమాలను చూడడం వరకే పరిమితం అయ్యేవారు కాదు. డాక్టర్ శ్యామా ప్రసాద్‌లో ఓ విశ్లేషకుడు కూడా ఉన్నారు. ఈ సినిమాను నేనే గనక తీస్తే ఎలా తీసేవాడిని అని అనుకునే వారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ జీవితంలో అత్యంత బాధాకరమైన విషయం అమ్మ చనిపోవడం. ఏదో చిన్న అనారోగ్య సమస్య వచ్చిందని విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. గుండె పనితీరు అంతా బాగానే ఉన్నా.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వచ్చింది. దీంతో అదే హాస్పిటల్లో 90 రోజుల పాటు వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అప్పటికి ఆమె వయసు 89 ఏళ్లు. హాస్పిటల్‌లో ఉదయం సోదరి మైథిలి అమ్మను చూసుకునే వారు. రాత్రిళ్లు డాక్టర్ శ్యామా ప్రసాద్ అమ్మ పక్కనే ఉండి హాస్పిటల్లోనే సపర్యలు చేసేవారు. డాక్టర్లు బతకదని తేల్చేసినా కూడా.. చూస్తూ చూస్తూ వెంటిలేటర్ తీసేయలేక అలా బతికించుకునే ప్రయత్నం చేశారు. అమ్మ బతకదని తెలిసినా దాదాపు 30 లక్షలు ఖర్చు పెట్టారు. అమ్మ కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఫర్వాలేదు.. ఇంకొంత కాలం బతికితే చాలు అనుకునే మనస్తత్వం ఆయనది. పైగా అంతే వయసు ఉన్న నాన్న.. ఓపిగ్గా తిరగగలుగుతున్నారు. కాని, అమ్మ చనిపోవడం చాలా బాధేసింది. 89 ఏళ్ల వయసులో కూడా అమ్మే అందరికీ వంట వండి పెట్టేవారు. పైగా మోస్ట్ హైజీనిక్ పర్సన్. ఇంట్లో ప్రతీదీ శుభ్రంగానే ఉండాలి. అలా ఇంటిని శుభ్రంగా ఉంచేవారు. పైగా నాన్నతో పాటు కాకినాడకు పని మీద వెళ్లాల్సి వచ్చినా.. పిల్లలను చూసుకోవాలనే వ్యాపకంతో ఇల్లు కదిలి వెళ్లేవారు కాదు. పిల్లలంటే అంత ఇష్టం. ఆ ఇష్టం కారణంగానే.. డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి అమ్మ అంటే ఎంతో ఇష్టం ఏర్పడింది. పెద్ద కొడుకుగా డాక్టర్ శ్యామా ప్రసాద్ అంటే అమ్మకు ప్రత్యేకమైన ఇష్టం ఉండేది. ఓ రోజు.. ఏంటి నాన్నా నీకు బట్టతల వస్తోంది అని అమ్మ అనే సరికి.. డాక్టర్ శ్యామా ప్రసాద్ ఏకంగా బట్టతల

రాకుండా మందులు వాడారు. బోలెడు ఆయిల్స్, ఆయింట్ మెంట్స్ రాసేవారు. అమ్మ మాటంటే అంత ఇష్టం. చిన్నప్పుడు నెయ్యి కలిపి గోరుముద్దలు తినిపించడం డాక్టర్ శ్యామా ప్రసాద్‌కి ఇంకా గుర్తుంది. ఎంబిబిఎస్‌లో సీటు వచ్చిందని తెలిసి అమ్మ ఎంతో సంతోషించారని, స్టేట్ ఫస్ట్ రావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవని.. ఆనాటి విషయాలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటుంటారు. పైగా డాక్టర్ శ్యామా ప్రసాద్‌పై మంచి గౌరవం ఉండేది. ఆడపిల్లలతో తిరగడు, చదువుకోమని చెప్పనవసరం లేదు, చాలా పద్ధతిగా ఉంటాడు, అందరితోనూ గౌరవంగా, మర్యాదగా మెలుగుతాడనే సదభిప్రాయం ఉండేది. అందుకే డాక్టర్ శ్యామా ప్రసాద్ అంటే అమ్మకి ఎంతో ఇష్టం ఉండేది. అలాంటి అమ్మ చనిపోవడం జీవితంలో అత్యంత బాధాకరమైన విషయంగా చెబుతారు ఆయన.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి వీసీ అయ్యాక చాలా ఆనందం కలిగిందని అంటుంటారు. తన జీవితంలో ఎదురైన అత్యంత సంతోషకరమైన సందర్భాల్లో మొదటిది వీసీ అయినప్పుడేనని చెబుతారు. పైగా వీసీ అయ్యాక ఓ రోజు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి నుంచి పిలుపు వచ్చింది. యాదవ కులం నుంచి డాక్టర్‌గా అత్యున్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి కావాలని అడిగినప్పుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ పేరును ఆయన ముందు ప్రస్తావించారు. పైగా డాక్టర్ శ్యామా ప్రసాద్ అంటే విశాఖలో మంచి పేరు ఉంది. పేద వాళ్లకు సాయం అందిస్తారని, డబ్బు తీసుకోకపోయినా వైద్యం చేస్తారని చెప్పుకునే వాళ్లు. అలాంటి పేరు ఉండడంతో అది కాస్తా విజయసాయిరెడ్డి చెవిలో పడింది. దీంతో ఓసారి మాట్లాడాలని ఢిల్లీకి పిలిపించారు. విశాఖకు మేయర్‌గా చేస్తారా అని అడిగే సరికి ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. తనను మేయర్ చేయాలని అనుకున్నట్టు ఆ క్షణం వరకు తెలీదు. రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ విషయంపై మాట్లాడారు. అయితే, తాను ఆర్థికంగా అంత సెటిల్ కాదని, అప్పులు కూడా ఉన్నాయని చెప్పడంతో.. అసలు ఫైనాన్షియల్ మ్యాటర్ అనేది మ్యాటరే కాదని విజయసాయిరెడ్డి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కావాలంటే, ఎకడమిస్టుగా పనిచేస్తానని చెప్పి, సున్నితంగా ఆ ఆఫర్‌ను తిరస్కరించారు. పైగా

ఒక డాక్టరుగా అన్ని డిగ్రీలు చేసిన వ్యక్తి మరొకరు లేరు. ప్రస్తుతం వీసీగా ఉన్నప్పటికీ.. మాస్ కమ్యూనికేషన్, పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇవి కూడా పూర్తైతే తన జీవితాశయం నెరవేరినట్టేనని చెబుతుంటారు. ఇక సంగీతంలో డిప్లొమా తీసుకోవాలనే ఆశయం కూడా ఉంది. ఇన్ని డిగ్రీలు చదువుతుండడం.. భార్యకి చిరు కోపాన్ని తెచ్చిపెట్టేది. ఇంకోసారి చదువుకుంటాను, డిగ్రీ చేస్తానని చెబితే మీకు విడాకులు ఇస్తానని ఎన్నోసార్లు స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చిందని చెప్పుకుంటుంటారు.

1999లో శ్యామా ప్రసాద్‌కు కాకినాడలోని రంగరాయమెడికల్ కాలేజ్‌కు బదిలీ అయ్యింది. ఒక సంవత్సరం పనిచేసిన తరువాత ఆయనకు మళ్ళీ విశాఖపట్నానికి బదిలీ అయింది. 2001లో శ్యామా ప్రసాద్ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీగా పదోన్నతి పొందారు. 2006లో ఆయనకు మరోసారి ప్రమోషన్ వచ్చింది. ఆయన ఆంధ్రా మెడికల్ కాలేజీ సర్జరీ విభాగానికి అధిపతి అయ్యారు. 2012లో ఆయనకు ప్రభుత్వం కింగ్ జార్జ్ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. 2015లో శ్యామా ప్రసాద్ లో ప్రభుత్వ సర్వీసు నుండి రిటైర్ అయ్యారు. రిటైర్ అయ్యాక ఆయన ఎన్నో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులకు తన సేవలు అందించారు. విశాఖపట్నంలోని మహరాజా ఇన్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మెడికల్ సూపరింటెండెంట్‌గా మూడు సంవత్సరాల కాలం పాటు విధులు నిర్వహించారు. దాని తరువాత ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇక్కడ కూడా 3 సంవత్సరాలు పనిచేసిన తరువాత గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసర్చ్‌లో మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 జనవరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీకి వైస్ చాన్స్‌లర్‌గా నియమించింది.

లక్ష్మీరాజ్యం శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజ్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తిచేసాక నెల్లూరులోని అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ ఆసుపత్రిలో చేరారు. ఈ ఆసుపత్రి డాక్టర్ బేరమ్మ వలన ఖ్యాతి పొందింది.

అనంతరం లక్ష్మీరాజ్యం భార్యగా, తల్లిగా, కోడలిగా తన బాధ్యతలు పూర్తి స్థాయిలో నిర్వర్తించేందుకు ఉద్యోగం అడ్డుకావడంతో ఉద్యోగానికి రాజీనామా చేసారు. అయితే విశాఖపట్నంలో స్థిరపడ్డ తరువాత ఆమె తిరిగి డాక్టర్‌గా పనిచేయాలని కోరుకున్నారు. ఆమె కేజిహెచ్ హెల్త్ క్లినిక్ మరియు కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లో సేవలందించారు. లక్ష్మీరాజ్యం కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ట్యూటర్‌గా పనిచేస్తున్న కాలంలో సూపర్ నేచురేషన్ పొంది రిటైర్ అయ్యారు. రిటైర్మెంట్ తరువాత కూడా ఆసుపత్రి మేనేజ్ మెంట్‌కి ఆమె సేవలు అందించడం కొనసాగించారు.